భగవద్గీత

# భగవద్గీత టీకా తాత్పర్య సహిత



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్
www.freegurukul.org



సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో భాగంగా ఈ పుస్తకాన్ని ద్వారకాదీష్ వాస్తు వెబ్ సైట్ నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో భాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) ద్వారకాదీష్ వాస్తు వారి వెబ్ సైట్: http://dwarkadheeshvastu.com
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్ధం ఉచితంగా eBook రూపంలో ద్వారకాదీష్ వాస్తు వారి వెబ్ సైట్ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Helpline/WhatsApp: 9042020123


" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## ద్వారకాదీష్ వాస్తు వారి వెబ్ సైట్:

## http://dwarkadheeshvastu.com



# అతి విశిష్టం ఈ దానం!

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, ఐవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి.

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

Visit **Dwarkadheeshvastu.com** For

**FREE** Vastu Consultancy, Music, Epics, Devotional Videos Educational Books, Educational Videos, Wallpapers

****

All Music is also available in **CD** format. **CD Cover** can also be print with your Firm Name

****

We also provide this whole Music and Data in **PENDRIVE** and **EXTERNAL HARD DISK.**

Contact : Ankit Mishra ( +91-8010381364, dwarkadheeshvastu@gmail.com )

## II SHRI HARI II

# SHRIMAD BHAGWAD GEETA (PADCHED)

॥ ఓం శ్రీపరమాత్మనే నమః ॥

# శ్రీమద్భగవద్గీతామహిమ

శ్రీమద్భగవద్గీత సాక్షాత్తు భగవంతుని దివ్యవాణి. దీని మహిమ అపారమైనది, అపరిమితమైనది. ఇట్టి భగవద్గీతా మాహాత్మ్యమును మాటలలో వర్ణించుటకెవ్వరికిని సాధ్యముగాదు. ఏలనన, ఇది ఒక పరమ రహస్య గ్రంథము. ఇది సకల వేద సారము. ఇందలి సంస్కృత భాష అతి సరళము, పరమ సుందరము. కొద్ది పాటి అభ్యాసము చేసినను ఇది సులభముగ అర్థమగును. దీని ఆశయము అతిగంభీరము. జీవితపర్యంతము ఇది అభ్యసింపదగినది. దీనిని నిత్యము పారాయణము చేయుచు పఠించిన పాఠకుని స్థాయినిబట్టి నిత్యనూతన భావములు ఉత్పన్నములగుచునే యుండును. కనుక గీత ఎల్లప్పుడును వినూత్నమైనదియే. ఏకాగ్రచిత్తులై, భక్తి శ్రద్ధలతో గమనించు వారికి ఇందలి ప్రతి పదమునందును ఏదేని ఒక రహస్యము నిక్షిప్తమై యున్నట్లు తోచును. ఇది నిగూఢార్థనిధి. గీతయందు భగవంతునిగుణప్రభావరహస్యములు సమగ్రముగ వివరింపబడినవి. అట్టి వివరణ ఇతర గ్రంథములయందు కానరాదు. ఇతర గ్రంథములలో ఏదో ఒక విధముగ కొంతకొంతగా సాంసారిక విషయములు మిళితములై యుండును. భగవద్గీత యథార్థముగా ఒక నిరుపమాన గ్రంథరాజము. కనుక ఏ విధముగను దీనికి వేఱొకటి సాటి కాజాలదు. ఇందలి ప్రతి పదము సదుపదేశభరితము. వ్యాసభగవానుడు మహాభారతమునందు భగవద్గీతను వర్ణించుచు చివరకు ఇట్లనెను-

**గీతా సుగీతా కర్తవ్యా కిమన్యైః శాస్త్రవిస్తరైః ।**
**యా స్వయం పద్మనాభస్య ముఖపద్మాత్ వినిఃసృతా ॥**

గీత సాక్షాత్తుగా శ్రీపద్మనాభుడైన విష్ణు భగవానుని ముఖారవిందమునుండియే వెల్వడినది. ఇక అన్యశాస్త్రములతో పనియేమి?.

"గీతా సుగీతా" - భగవద్గీతను చక్కగా చదివి భావార్థ జ్ఞాన సహితముగ అంతఃకరణమునందు ధారణ చేయుట ముఖ్య కర్తవ్యము.

శ్రీ భగవానుడే స్వయముగ దీని మాహాత్మ్యమును వర్ణించినాడు. (18వ అధ్యాయము 68వ, శ్లోకమునుండి 71 వఱకు).

వర్ణాశ్రమధర్మముల తారతమ్యములు లేకుండ ప్రతివ్యక్తియు భగవంతుని యందు భక్తిశ్రద్ధలుగలవాడై గీతాధ్యయనమును చేయవలెను. ఏలనన భక్తిశ్రద్ధలతో ప్రపత్తితో దీనిని ప్రచారము చేయవలెనని భగవానుడు తన భక్తులను ఆజ్ఞాపించెను. స్త్రీలు, వైశ్యులు, శూద్రులు మఱియు పాపయోనులయందు జన్మించిన వారును భగవంతునియందు

భక్తిశ్రద్ధలు గలవారై తత్పరాయణులై పరమగతిని (మోక్షమును) పొందుచున్నారు. (9/32). మానవుడు తనస్వాభావిక కర్మలద్వారా భగవంతుని పూజించినచో పరమసిద్ధిని పొందును (18/46) అని భగవానుడు నుడివెను. వీటినన్నింటిని విచారించి చూచినచో పరమాత్మప్రాప్తినందుటకు అందఱికిని అధికారము కలదని విశదమగును. కావున గీతాధ్యయనము చేయుటకు ప్రతివ్యక్తికిని అధికారము కలదు.

కాని గీతలో చెప్పబడిన విషయములను, రహస్యములను సరిగా అవగాహన చేసికొనక పెక్కుమంది దానిని (గీతను) నామమాత్రముగ ఎఱిగినవారై "భగవద్గీత కేవలము సన్న్యాసులకొఱకే' అని తలంచు (అపోహపడు)చుందురు. అందువలన వారు తమ పిల్లలచే గీతాధ్యయనము చేయించుటకు వెనుకాడుచుందురు. తమ పిల్లలు గీతాధ్యయనము చేసినచో వారు ఇల్లు విడిచి పెట్టి, సన్న్యాసులై పోవుదురని వారి భయము. కాని మోహకారణమున తన క్షాత్ర ధర్మమునకు విముఖుడై బిచ్చమెత్తుకొని జీవించుటకైనను సిద్ధపడిన అర్జునుడు పరమగోప్యమైన గీతోపదేశమును పొందిన తర్వాతగూడ జీవితాంతము గృహస్థుడుగా నుండియు తన కర్తవ్యమును నెరవేర్చెను. ఈ విషయమును వారు గ్రహింపవలెను. కనుక అర్జునుని కర్తవ్యోన్ముఖునిగావించిన గీతాశాస్త్రము ఎన్నటికిని, ఏ విధముగను విపరీత పరిణామములను ఏ మాత్రమును కల్గింపదు.

అందువలన శుభములను గోరెడివారు మోహమును త్యజించి, అపోహలను వీడి, అత్యంతభక్తిశ్రద్ధలతో తమ పిల్లలచే భావార్థసహితముగ గీతాధ్యయనమును చేయింపవలెను. అంతియేగాక, తాముకూడా స్వయముగ గీతాపఠనమును, మననమును గావించుచు భగవదాదేశానుసారము సాధనయందు తత్పరులు గావలెను.

మానవజన్మ అతిదుర్లభమైనది. అట్టి మానవజన్మనెత్తినందులకు తమ విలువైన సమయములను, తమజీవితములను తుచ్ఛభోగములకై వ్యర్థము చేయుట ఉచితము కాదు.

## భగవద్గీత - దాని ముఖ్యాంశములు

శ్రీమద్భగవద్గీతయందు భగవానుడు పరమసిద్ధిప్రాప్తికై రెండు ముఖ్య మార్గములను తెలిపెను. వానిలో ఒకటి సాంఖ్యయోగము, రెండవది కర్మయోగము.

1) పదార్థములన్నియును మృగతృష్ణలోని నీటివలెను, స్వప్న జగత్తులోని సృష్టివలెను మాయామయములని యెఱుంగవలెను. గుణములే గుణములయందు ప్రవర్తిల్లుచున్నవని గ్రహింపవలెను. శరీరేంద్రియ మనస్సులచే జరిగెడు సమస్త కర్మలయందును కర్తృత్వాభిమానములను వీడవలెను (5/8,9). సర్వవ్యాపియైన సచ్చిదానందఘనుడగు పరమాత్మని యొక్క స్వరూపమునందు ఏకీభావముతో నిత్య స్థితుడైయుండవలెను.

సచ్చిదానందఘనుడైన వాసుదేవుడుతప్ప అన్యమును ఎఱుంగకయుండవలెను. ఇట్టి అభ్యాసమే సాంఖ్యయోగ సాధనము.

**2)** జగత్తంతయు భగవానునిదే యనియు, తాను నిమిత్తమాత్రుడననియు ఎఱుంగవలెను. సిద్ధ్యసిద్ధులయెడ సమభావమునుంచి అనాసక్తుడై, ఫలేచ్ఛలను త్యజించి, భగవదాజ్ఞానుసారము ఈశ్వరార్పణబుద్ధితో సర్వకర్మలను ఆచరింపవలెను. **(2/48, 5/10)**. భక్తిశ్రద్ధలు కలిగి మనోవాక్కాయములచే భగవానుని శరణుజొచ్చి, నామ, రూప, గుణ, ప్రభావములచే భగవానుని స్వరూపమును నిరంతరము చింతన చేయుచుండవలెను. **(6/47)**. ఇట్లు చేయుటయే నిష్కామకర్మయోగసాధనము.

పైన పేర్కొనబడిన సాంఖ్య, కర్మయోగముల రెండింటి సాధనల పరిణామము ఒక్కటే. వాస్తవముగా ఇవి అభిన్నములే **(5/4,5)**. కాని వీటి సాధనకాలములయందు సాధకుల తారతమ్యము (యోగ్యత)లను అనుసరించి ఈ రెండు యోగములును వేర్వేఱుగా తెల్పబడినవి **(3/3)**. ఏలనన ఒకే వ్యక్తి రెండు మార్గములను ఒకే కాలమందు అనుసరింపలేడు. గంగానదిని దాటుటకు వేర్వేఱు మార్గములున్నను మానవుడు ఏకకాలమందు ఆ విభిన్న మార్గములద్వారా దాటుట సాధ్యముగాదు కదా! అనగా ఏదియో ఒక మార్గమును మాత్రమే అనుసరింపవలెను. సాంఖ్య, కర్మ యోగములలో కర్మయోగసాధన సన్న్యాసాశ్రమమునందు అవలంబింప సాధ్యముగాదు. ఏలనన, సన్న్యాసాశ్రమమునందు కర్మలను ఆచరణాత్మకముగ త్యజించుటయే ప్రధానముగ జెప్పబడినది. మఱియు సాంఖ్యయోగసాధన అన్ని ఆశ్రమములందును అవలంబింపవచ్చును. సాంఖ్యయోగమును భగవానుడు సన్న్యాసమని తెల్పినాడనియు అందువలన దానిని సన్న్యాసాశ్రమమువారే ఆచరించుటకు అధికారులనియు, గృహస్థులు కారనియు భావించుట సముచితముగాదు. ఏలనన రెండవ అధ్యాయమునందలి 11 నుండి 30వ శ్లోకము వఱకు భగవానుడు సాంఖ్యనిష్ఠను అనుసరించి యుద్ధమొనరింపుమని పలుచోట్ల అర్జునునితో నుడివియుండెను. గృహస్థులకు సాంఖ్య యోగాచరణమునకు అధికారము లేనిచో భగవానుడీవిధముగ తెలిపియుండెడివాడు కాడు. సాంఖ్యయోగసాధకుడు దేహాభిమాన రహితుడై యుండవలెను. ఏలనన, దేహాభిమానము ఉన్నంతవఱకు సాంఖ్యయోగసాధనయే కుదరదు. కనుక సాంఖ్యయోగసాధన కష్టసాధ్యమని భగవానుడు తెలిపెను. **(5/6)**. నిష్కామ కర్మయోగసాధన సులభమగుటచే నిరంతరము భగవచ్చింతన చేయుచు నిష్కామ కర్మయోగమును ఆచరింపుమని భగవానుడు పలుచోట్ల అర్జునుని ఆదేశించెను.

# అథ శ్రీమద్భగవద్గీతాకరన్యాసధ్యానాదయః

ఓం అస్య శ్రీమద్భగవద్గీతామాలామన్త్రస్య ॥ భగవాన్ వేదవ్యాస ఋషిః ॥ అనుష్టుప్ ఛన్దః ॥ శ్రీకృష్ణః పరమాత్మా దేవతా ॥ అశోచ్యానన్వశోచస్త్వం ప్రజ్ఞావాదాంశ్చ భాషసే ఇతి బీజమ్ ॥ సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ ఇతి శక్తిః ॥ అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచ ఇతి కీలకమ్ ॥

## ॥ అథ కరన్యాసః ॥

నైనం ఛిన్దన్తి శస్త్రాణి నైనం దహతి పావక ఇత్యంగుష్ఠాభ్యాం నమః ॥ న చైనం క్లేదయన్త్యాపో న శోషయతి మారుత ఇతి తర్జనీభ్యాం నమః ॥ అచ్ఛేద్యోఽయ మదాహ్యోఽయమక్లేద్యోఽశోష్య ఏవ చ ఇతి మధ్యమాభ్యాం నమః ॥ నిత్యః సర్వగతః స్థాణురచలోఽయం సనాతన ఇత్యనామికాభ్యాం నమః ॥ పశ్య మే పార్థ రూపాణి శతశోఽథ సహస్రశ ఇతి కనిష్ఠికాభ్యాం నమః ॥ నానావిధాని దివ్యాని నానావర్ణాకృతీని చ ఇతి కరతలకరపృష్ఠాభ్యాం నమః ॥

॥ ఇతి కరన్యాసః ॥

## ॥ అథ హృదయాదిన్యాసః ॥

నైనం ఛిన్దన్తి శస్త్రాణి నైనం దహతి పావక ఇతి హృదయాయ నమః ॥ న చైనం క్లేదయన్త్యాపో న శోషయతి మారుత ఇతి శిరసే స్వాహా ॥ అచ్ఛేద్యోఽయ మదాహ్యోఽయమక్లేద్యోఽశోష్య ఏవ చ ఇతి శిఖాయై వషట్ ॥ నిత్యః సర్వగతః స్థాణురచలోఽయం సనాతన ఇతి కవచాయహుమ్ ॥ పశ్య మే పార్థ రూపాణి శతశోఽథ సహస్రశ ఇతి నేత్రత్రయాయ వౌషట్ ॥ నానావిధాని దివ్యాని నానా వర్ణాకృతీని చ ఇతి అస్త్రాయ ఫట్ ॥ ఇతి హృదయాదిన్యాసః ॥

॥ శ్రీకృష్ణ ప్రీత్యర్థే గీతాపాఠే వినియోగః ॥

# అథ ధ్యానమ్

ఓం పార్థాయ ప్రతిబోధితాం భగవతా నారాయణేన స్వయం
వ్యాసేన గ్రథితాం పురాణమునినా మధ్యేమహాభారతమ్ ।
అద్వైతామృతవర్షిణీం భగవతీమ్ అష్టాదశాధ్యాయినీమ్
అంబ త్వామనుసందధామి భగవద్గీతే భవద్వేషిణీమ్ ॥ 1 ॥

నమోఽస్తు తే వ్యాస విశాలబుద్ధే పుల్లారవిందాయతపత్రనేత్ర ।
యేన త్వయా భారతతైలపూర్ణః ప్రజ్వాలితో జ్ఞానమయః ప్రదీపః ॥ 2 ॥

ప్రపన్నపారిజాతాయ తోత్రవేత్రైకపాణయే ।
జ్ఞానముద్రాయ కృష్ణాయ గీతామృతదుహే నమః ॥ 3 ॥

వసుదేవసుతం దేవం కంసచాణూరమర్దనమ్ ।
దేవకీపరమానందం కృష్ణం వందే జగద్గురుమ్ ॥ 4 ॥

భీష్మద్రోణతటా జయద్రథజలా గాంధారనీలోత్పలా
శల్యగ్రాహవతీ కృపేణ వహనీ కర్ణేన వేలాకులా! ।
అశ్వత్థామవికర్ణఘోరమకరా దుర్యోధనావర్తినీ
సోత్తీర్ణా ఖలు పాండవై రణనదీ కైవర్తకః కేశవః ॥ 5 ॥

పారాశర్యవచః సరోజమమలం గీతార్థగంధోత్కటం
నానాఖ్యానకకేసరం హరికథా సంబోధనాబోధితమ్ ।
లోకే సజ్జనషట్పదైరహరహః పేపీయమానం ముదా
భూయాద్భారతపంకజం కలిమల ప్రధ్వంసి నః శ్రేయసే ॥ 6 ॥

మూకం కరోతి వాచాలం పంగుం లంఘయతే గిరిమ్ ।
యత్కృపా తమహం వందే పరమానందమాధవమ్ ॥ 7 ॥

శాన్తాకారం భుజగశయనం పద్మనాభం సురేశం
విశ్వాధారం గగనసదృశం మేఘవర్ణం శుభాంగమ్ ।
లక్ష్మీకాంతం కమలనయనం యోగిహృద్ధ్యానగమ్యం
వందే విష్ణుం భవభయహరం సర్వలోకైకనాథమ్ ॥ 8 ॥

యం బ్రహ్మా వరుణేంద్రరుద్రమరుత: స్తున్వంతి దివ్యై: స్తవై:
వేదై: సాంగపదక్రమోపనిషదై: గాయంతి యం సామగా: ।
ధ్యానావస్థితతద్గతేన మనసా పశ్యంతి యం యోగినో
యస్యాంతం న విదు: సురాసురగణా దేవాయ తస్మై నమ: ॥ 9 ॥

# ప్రార్థన

కస్తూరీతిలకం లలాటఫలకే వక్షఃస్థలే కౌస్తుభం
నాసాగ్రేవరమౌక్తికం కరతలే వేణుం కరే కంకణమ్ ।
సర్వాంగే హరిచందనం చ కలయన్ కంఠే చ ముక్తావళీ
గోపస్త్రీపరివేష్టితో విజయతే గోపాలచూడామణి: ॥

ఎవ్వనిచే జనించు జగమెవ్వనిలోపలనుండు లీనమై
యెవ్వనియందుడిందు పరమేశ్వరుడెవ్వడు మూలకారణం
బెవ్వడనాదిమధ్యలయుడెవ్వడు సర్వము తానయైన వా
డెవ్వడు వాని నాత్మభవునీశ్వరునే శరణంబు వేడెదన్ ॥

## శంఖారావము

పూరించెన్ హరి పాంచజన్యము(గృపాంభోరాశి సౌజన్యమున్
భూరిధ్వానచలాచలీకృతమహాభూతప్రచైతన్యమున్ ।
సారోదారశితప్రభాచకితపర్జన్యాదిరాజన్యమున్
దూరీభూతవిపన్నదైన్యమును నిర్ధూతద్విషత్సైన్యమున్ ॥

## శ్రీమద్భగవద్గీతా మాహాత్మ్యమ్

గీతాశాస్త్రమిదం పుణ్యం యః పఠేత్ ప్రయతః పుమాన్ ।
విష్ణోః పదమవాప్నోతి భయశోకాదివర్జితః ॥ 1
గీతాధ్యయనశీలస్య ప్రాణాయామ పరస్య చ ।
నైవ సంతి హి పాపాని పూర్వజన్మకృతాని చ ॥ 2
మలనిర్మోచనం పుంసాం జలస్నానం దినే దినే ।
సకృద్గీతాంభసి స్నానం సంసారమలనాశనమ్ ॥ 3
గీతా సుగీతా కర్తవ్యా కిమన్యైః శాస్త్రవిస్తరైః ।
యా స్వయం పద్మనాభస్య ముఖపద్మాద్వినిఃసృతా ॥ 4
భారతామృతసర్వస్వం విష్ణోర్వక్త్రాద్వినిఃసృతమ్ ।
గీతాగంగోదకం పీత్వా పునర్జన్మ న విద్యతే ॥ 5
సర్వోపనిషదో గావో దోగ్ధా గోపాలనందనః ।
పార్థో వత్సః సుధీర్భోక్తా దుగ్ధం గీతామృతం మహత్ ॥ 6
ఏకం శాస్త్రం దేవకీపుత్రగీతమ్ ఏకోదేవో దేవకీపుత్ర ఏవ ।
ఏకో మంత్రస్తస్య నామాని యాని కర్మాప్యేకం తస్య దేవస్య సేవా ॥ 7

॥ ఓం శ్రీపరమాత్మనే నమః ॥

# శ్రీ గీతామాహాత్మ్యమ్

ధరోవాచ

భగవన్! పరమేశాన! భక్తిరవ్యభిచారిణీ! ।
ప్రారబ్ధం భుజ్యమానస్య కథం భవతి హే ప్రభో ॥ 1 ॥

శ్రీ విష్ణు రువాచ

ప్రారబ్ధం భుజ్యమానోఽపి గీతాభ్యాసరతస్సదా ।
సముక్త స్స సుఖీ లోకే కర్మణా నోపలిప్యతే ॥ 2 ॥

మహాపాపాదిపాపాని గీతాధ్యానం కరోతి చేత్ ।
క్వచిత్ స్పర్శం న కుర్వన్తి నలినీదళమంభసా ॥ 3 ॥

గీతాయాః పుస్తకం యత్ర యత్ర పాఠః ప్రవర్తతే ।
తత్ర సర్వాణి తీర్థాని ప్రయాగాదీని తత్ర వై ॥ 4 ॥

సర్వే దేవాశ్చ ఋషయో యోగినః పన్నగాశ్చ యే ।
గోపాలా గోపికా వాఽపి నారదోద్ధవ పార్షదైః ।
సహాయో జాయతే శీఘ్రం యత్ర గీతా ప్రవర్తతే ॥ 5 ॥

యత్ర గీతా విచారశ్చ పఠనం పాఠనం శ్రుతమ్ ।
తత్రాహం నిశ్చితం పృథ్వి నివసామి సదైవ హి ॥ 6 ॥

గీతాశ్రయోఽహం తిష్ఠామి గీతా మే చోత్తమం గృహమ్ ।
గీతాజ్ఞాన ముపాశ్రిత్య త్రీన్ లోకాన్ పాలయామ్యహమ్ ॥ 7 ॥

గీతా మే పరమా విద్యా బ్రహ్మరూపా న సంశయః ।
అర్ధమాత్రాక్షరా నిత్యా స్వనిర్వాచ్య పదాత్మికా ॥ 8 ॥

చిదానందేన కృష్ణేన ప్రోక్తా స్వముఖతోఽర్జునమ్ ।
వేదత్రయీ పరానందతత్త్వార్థజ్ఞానమంజసా । 9 ।

యోఽష్టాదశ జపేన్నిత్యం నరో నిశ్చలమానసః ।
జ్ఞానసిద్ధిం స లభతే తతో యాతి పరం పదమ్ । 10 ।

పాఠేఽసమర్థస్సంపూర్ణే తదర్ధం పాఠమాచరేత్ ।
తదా గోదానజం పుణ్యం లభతే నాత్ర సంశయః । 11 ।

త్రిభాగం పఠమానస్తు గంగాస్నానఫలం లభేత్ ।
షడంశం జపమానస్తు సోమయాగఫలం లభేత్ । 12 ।

ఏకాధ్యాయం తు యో నిత్యం పఠతే భక్తిసంయుతః ।
రుద్రలోక మవాప్నోతి గణోభూత్వా వసేచ్చిరమ్ । 13 ।

అధ్యాయశ్లోకపాదం వా నిత్యం యః పఠతే నరః ।
స యాతి నరతాం యావన్మనుకాలం వసుంధరే! । 14 ।

గీతాయాః శ్లోకదశకం సప్త పంచ చతుష్టయమ్ ।
ద్వౌత్రీనేకం తదర్ధం వా శ్లోకానాం యః పఠేన్నరః । 15 ।

చంద్రలోక మవాప్నోతి వర్షాణామయుతం ధ్రువమ్ ।
గీతాపాఠ సమాయుక్తో మృతో మానుషతాం వ్రజేత్ । 16 ।

గీతాభ్యాసం పునః కృత్వా లభతే ముక్తిముత్తమాం ।
గీతేత్యుచ్చారసంయుక్తో మ్రియమాణో గతిం లభేత్ । 17 ।

గీతార్థ శ్రవణాసక్తో మహాపాపయుతోఽపి వా ।
వైకుంఠం సమవాప్నోతి విష్ణునా సహ మోదతే । 18 ।

గీతార్థం ధ్యాయతే నిత్యం కృత్వా కర్మాణి భూరిశః ।
జీవన్ముక్త స్స విజ్ఞేయో దేహాంతే పరమం పదమ్ । 19 ।

గీతామాశ్రిత్య బహవో భూభుజో జనకాదయః ।
నిర్ధూతకల్మషా లోకే గీతా యాతాః పరం పదమ్ । 20 ।

గీతాయాః పఠనం కృత్వా మాహాత్మ్యం నైవ యః పఠేత్ ।
వృథాపాఠో భవేత్ తస్య శ్రమ ఏవ హ్యుదాహృతః । 21 ।

ఏతన్మాహాత్మ్యసంయుక్తం గీతాభ్యాసం కరోతి యః ।
స తత్ఫలమవాప్నోతి దుర్లభాం గతిమాప్నుయాత్ । 22 ।

సూత ఉవాచ

మాహాత్మ్యమేతద్గీతాయా మయా ప్రోక్తం సనాతనం ।
గీతాంతే చ పఠేద్యస్తు యదుక్తం తత్ఫలం లభేత్ । 23 ।

*॥ ఇతి శ్రీవరాహపురాణే గీతామాహాత్మ్యం సంపూర్ణమ్ ॥*

*(గీతా పారాయణమైన పిదప గీతా మాహాత్మ్యమును పఠింపవలెను.)*

# కృష్ణాష్టకమ్

వసుదేవసుతం దేవం కంసచాణూరమర్దనమ్ ।
దేవకీపరమానందం కృష్ణం వందే జగద్గురుమ్ ॥ 1 ॥

అతసీపుష్పసంకాశం, హారనూపురశోభితమ్ ।
రత్నకంకణకేయూరం, కృష్ణం వందే జగద్గురుమ్ ॥ 2 ॥

కుటిలాలకసంయుక్తం, పూర్ణచంద్రనిభాననమ్ ।
విలసత్కుండలధరం, కృష్ణం వందే జగద్గురుమ్ ॥ 3 ॥

మందారగంధసంయుక్తం, చారుహాసం చతుర్భుజమ్ ।
బర్హిపింఛావచూడాంగం, కృష్ణం వందే జగద్గురుమ్ ॥ 4 ॥

ఉత్ఫుల్లపద్మపత్రాక్షం, నీలజీమూతసన్నిభమ్ ।
యాదవానాం శిరోరత్నం, కృష్ణం వందే జగద్గురుమ్ ॥ 5 ॥

రుక్మిణీకేళిసంయుక్తం, పీతాంబరసుశోభితమ్ ।
అవాప్తతులసీగంధం, కృష్ణం వందే జగద్గురుమ్ ॥ 6 ॥

గోపికానాం కుచద్వంద్వకుంకుమాంకితవక్షసమ్ ।
శ్రీనికేతం మహేష్వాసం, కృష్ణం వందే జగద్గురుమ్ ॥ 7 ॥

శ్రీ వత్సాంకం మహోరస్కం వనమాలావిరాజితమ్ ।
శంఖచక్రధరం దేవం, కృష్ణం వందే జగద్గురుమ్ ॥ 8 ॥

కృష్ణాష్టకమిదం పుణ్యం ప్రాతరుత్థాయ యః పఠేత్ ।
కోటిజన్మకృతం పాపం, స్మరణేన వినశ్యతి ॥ 8 ॥

॥ ఇతి శ్రీ కృష్ణాష్టకం సంపూర్ణమ్ ॥

# సప్తశ్లోకీ గీతా

ఓమిత్యేకాక్షరం బ్రహ్మ వ్యాహరన్ మామనుస్మరన్ ।
యః ప్రయాతి త్యజన్ దేహం స యాతి పరమాం గతిమ్ ॥ 1 ॥

స్థానే హృషీకేశ! తవ ప్రకీర్త్యా, జగత్ప్రహృష్యత్యనురజ్యతే చ ।
రక్షాంసి భీతాని దిశో ద్రవంతి, సర్వే నమస్యంతి చ సిద్ధసంఘాః ॥ 2 ॥

సర్వతః పాణిపాదం తత్ సర్వతోఽక్షిశిరోముఖమ్ ।
సర్వతః శ్రుతిమల్లోకే సర్వమావృత్య తిష్ఠతి ॥ 3 ॥

కవిం పురాణమనుశాసితారమ్ అణోరణీయాంసమనుస్మరేద్యః ।
సర్వస్య ధాతారమచింత్యరూపమ్, ఆదిత్యవర్ణం తమసః పరస్తాత్ ॥ 4 ॥

ఊర్ధ్వమూలమధశ్శాఖమ్ అశ్వత్థం ప్రాహురవ్యయమ్ ।
ఛందాంసి యస్య పర్ణాని యస్తం వేద స వేదవిత్ ॥ 5 ॥

సర్వస్య చాహం హృది సన్నివిష్టో, మత్తః స్మృతిర్జ్ఞాన మపోహనం చ ।
వేదైశ్చ సర్వైరహమేవ వేద్యో, వేదాంతకృద్వేదవిదేవ చాహమ్ ॥ 6 ॥

మన్మనా భవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు ।
మామేవైష్యసి యుక్త్వైవమ్ ఆత్మానం మత్పరాయణః ॥ 7 ॥

*॥ ఇతి శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు, బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే*
*శ్రీకృష్ణార్జునసంవాదే సప్తశ్లోకీ గీతా ॥*

# శ్రీ విష్ణోఃఅష్టావింశతినామస్తోత్రమ్

**అర్జున ఉవాచ**

కింను నామ సహస్రాణి జపతే చ పునఃపునః ।
యాని నామాని దివ్యాని తాని చాచక్ష్వ కేశవ! ॥ 1 ॥

**శ్రీ భగవాన్ ఉవాచ**

మత్స్యం కూర్మం వరాహం చ వామనం చ జనార్దనమ్ ।
గోవిందం పుండరీకాక్షం మాధవం మధుసూదనమ్ ॥ 2 ॥

పద్మనాభం సహస్రాక్షం వనమాలిం హలాయుధమ్ ।
గోవర్ధనం హృషీకేశం వైకుంఠం పురుషోత్తమమ్ ॥ 3 ॥

విశ్వరూపం వాసుదేవం రామం నారాయణం హరిమ్ ।
దామోదరం శ్రీధరం చ వేదాంగం గరుడధ్వజమ్ ॥ 4 ॥

అనంతం కృష్ణగోపాలం జపతో నాస్తి పాతకమ్ ।
గవాం కోటిప్రదానస్య అశ్వమేధశతస్య చ ॥ 5 ॥


కన్యాదానసహస్రాణాం ఫలం ప్రాప్నోతి మానవః ।
అమాయాం వా పౌర్ణమాస్యాం ఏకాదశ్యాం తథైవ చ ॥ 6 ॥

సంధ్యాకాలే స్మరేన్నిత్యం ప్రాతఃకాలే తథైవ చ ।
మధ్యాహ్నే చ జపేన్నిత్యం సర్వపాపైః ప్రముచ్యతే ॥ 7 ॥

*॥ ఇతి శ్రీకృష్ణార్జున సంవాదే శ్రీవిష్ణోరష్టావింశతి నామస్తోత్రం సంపూర్ణమ్ ॥*



कृपासिन्धु भगवान् श्रीकृष्ण (Lord Kṛṣṇa, the ocean of mercy)



धृतराष्ट्र-संजय (Dhṛtarāṣṭra-Sañjaya)




अर्जुनको उपदेश (Prescript to Arjuna)




प्रजापतिकी शिक्षा (Teachings of Prajāpati)




सूर्यको उपदेश (Precept to Sun)



समदर्शिता (Impartiality)



अनन्यचिन्तनका फल (Undivided devotion fructified)



ध्रुवपर अनुग्रह (Shower of grace on Dhruva)

॥ ఓం శ్రీపరమాత్మనే నమః ॥

నారాయణం నమస్కృత్య నరం చైవ నరోత్తమమ్ ।
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయముదీరయేత్ ॥

# శ్రీమద్భగవద్గీత

## (పదచ్ఛేద, టీకా తాత్పర్య సహితము)

## అథ ప్రథమోఽధ్యాయః - అర్జున విషాదయోగః

## (మొదటి అధ్యాయము - అర్జునవిషాదయోగము)

ముఖ్యాంశములు : [(1 నుండి 11వ శ్లోకమువఱకు) ఉభయ సేనలయందలి ప్రధాన వీరుల పరిగణనము, వారి సామర్థ్యముల వర్ణనము - (12 నుండి 19వ శ్లోకమువఱకు) ఉభయపక్షవీరుల శంఖధ్వనుల వర్ణనము - (20 నుండి 27 వఱకు) రెండుసేనలను అర్జునుడు పరిశీలించుట - (28 నుండి 47 వఱకు) మోహవ్యాకులుడైన అర్జునుని విషాదవర్ణనము.]

**ధృతరాష్ట్ర ఉవాచ**

**ధర్మక్షేత్రే కురుక్షేత్రే సమవేతా యుయుత్సవః ।**
**మామకాః పాండవాశ్చైవ కిమకుర్వత సంజయ ॥ 1 ॥**

ధర్మక్షేత్రే, కురుక్షేత్రే, సమవేతాః, యుయుత్సవః,
మామకాః, పాండవాః, చ, ఏవ, కిమ్, అకుర్వత, సంజయ ॥ 1 ॥

| | | | |
|---|---|---|---|
| సంజయ | = ఓ సంజయా | మామకాః | = నా వారు |
| ధర్మక్షేత్రే | = ధర్మక్షేత్రమైన | చ | = మఱియు |
| కురుక్షేత్రే | = కురుక్షేత్రమునందు | పాండవాః | = పాండుకుమారులు |
| సమవేతాః | = చేరియున్నవారును | ఏవ[1] | = కలిసి |
| యుయుత్సవః | = యుద్ధకాంక్షగల వారును (యుద్ధసన్నద్ధులై యున్నవారును)అగు | కిమ్ | = ఏమి |
| | | అకుర్వత | = చేసిరి |

1. ఇచ్చట 'ఏవ' అను అవ్యయము సముచ్చయార్థకము

ధృతరాష్ట్రుడు పలికెను- ఓ సంజయా! యుద్ధసన్నద్ధులై ధర్మక్షేత్రమైన కురుక్షేత్రమునకు చేరియున్న నా కుమారులును పాండుపుత్రులును ఏమి చేసిరి? (1)

**సంజయ ఉవాచ**

**దృష్ట్వా తు పాండవానీకం వ్యూఢం దుర్యోధనస్తదా ।**
**ఆచార్యముపసంగమ్య రాజా వచనమబ్రవీత్ ॥ 2 ॥**

దృష్ట్వా, తు, పాండవానీకమ్, వ్యూఢమ్, దుర్యోధనః, తదా,
ఆచార్యమ్, ఉపసంగమ్య, రాజా, వచనమ్, అబ్రవీత్ ॥ 2 ॥

| | | |
|---|---|---|
| తదా | = | అప్పుడు |
| రాజా | = | రాజైన |
| దుర్యోధనః | = | దుర్యోధనుడు |
| వ్యూఢమ్ | = | మోహరించియున్న |
| పాండవానీకమ్ | = | పాండవసేనను |
| దృష్ట్వా | = | చూచి |
| తు | = | మరియు |
| ఆచార్యమ్ ఉపసంగమ్య | = | ద్రోణాచార్యుని సమీపమునకు చేరి |
| వచనమ్ | = | (ఈ) వచనమును |
| అబ్రవీత్ | = | పలికెను |

సంజయుడు పల్కెను- ఆ సమయమున రాజైన దుర్యోధనుడు వ్యూహరచనతో సమరమునకు మోహరించియున్న పాండవసైన్యమును చూచి, ద్రోణాచార్యుని కడకేగి యిట్లు పలికెను. (2)

**పశ్యైతాం పాండుపుత్రాణామ్ ఆచార్య మహతీం చమూమ్ ।**
**వ్యూఢాం ద్రుపదపుత్రేణ తవ శిష్యేణ ధీమతా ॥ 3 ॥**

పశ్య, ఏతామ్, పాండుపుత్రాణామ్, ఆచార్య, మహతీమ్, చమూమ్,
వ్యూఢామ్, ద్రుపదపుత్రేణ, తవ, శిష్యేణ, ధీమతా ॥ 3 ॥

| | | |
|---|---|---|
| ఆచార్య | = | ఓ గురువరా! |
| తవ | = | నీయొక్క |
| ధీమతా | = | బుద్ధిమంతుడును |
| శిష్యేణ | = | శిష్యుడునుఅగు |
| ద్రుపదపుత్రేణ | = | ద్రుపదపుత్రుని (ధృష్టద్యుమ్నుని)చే |
| వ్యూఢామ్ | = | వ్యూహాకృతిలో నిలుపబడిన |
| పాండు పుత్రాణామ్ | = | పాండవులయొక్క |
| ఏతామ్ | = | ఈ |
| మహతీమ్ | = | గొప్పదియైన |
| చమూమ్ | = | సైన్యమును |
| పశ్య | = | చూడుడు. |

ఓ ఆచార్యా! బుద్ధిమంతుడైన మీ శిష్యుడును, ద్రుపదపుత్రుడును అయిన ధృష్టద్యుమ్నునిచే వ్యూహాత్మకముగా నిల్పబడిన పాండవుల ఈ మహాసైన్యమును చూడుడు.(3)

**అత్ర శూరా మహేష్వాసా భీమార్జునసమా యుధి ।**
**యుయుధానో విరాటశ్చ ద్రుపదశ్చ మహారథః ॥ 4 ॥**
**ధృష్టకేతుశ్చేకితానః కాశిరాజశ్చ వీర్యవాన్ ।**
**పురుజిత్ కుంతిభోజశ్చ శైబ్యశ్చ నరపుంగవః ॥ 5 ॥**
**యుధామన్యుశ్చ విక్రాంత ఉత్తమౌజాశ్చ వీర్యవాన్ ।**
**సౌభద్రో ద్రౌపదేయాశ్చ సర్వ ఏవ మహారథాః ॥ 6 ॥**

అత్ర, శూరాః, మహేష్వాసాః, భీమార్జునసమాః, యుధి,
యుయుధానః, విరాటః, చ, ద్రుపదః, చ, మహారథః ॥ 4 ॥
ధృష్టకేతుః, చేకితానః, కాశిరాజః, చ, వీర్యవాన్,
పురుజిత్, కుంతిభోజః, చ, శైబ్యః, చ, నరపుంగవః ॥ 5 ॥
యుధామన్యుః, చ, విక్రాంతః, ఉత్తమౌజాః, చ, వీర్యవాన్,
సౌభద్రః, ద్రౌపదేయాః, చ, సర్వే, ఏవ, మహారథాః ॥ 6 ॥

అత్ర = ఈ సేనయందు
మహేష్వాసాః = గొప్పధనస్సులు గలవారును
చ = మరియు
యుధి = యుద్ధమునందు
భీమార్జునసమాః = భీమార్జునులతో సమానులును
శూరాః = శూరులును అగు
యుయుధానః, చ = సాత్యకియును
విరాటః, చ = విరాటుడును
మహారథః = మహారథుడగు
ద్రుపదః = ద్రుపదుడును
ధృష్టకేతుః, చ = ధృష్టకేతుడును
చేకితానః, చ = చేకితానుడును
వీర్యవాన్ = పరాక్రమశాలియగు
కాశిరాజః = కాశీరాజు
పురుజిత్ = పురుజిత్తు
కుంతిభోజః, చ = కుంతిభోజుడును
నరపుంగవః = మానవులలో శ్రేష్ఠుడైన
శైబ్యః = శైబ్యుడును
విక్రాంతః = పరాక్రమవంతుడగు
యుధామన్యుః, చ = యుధామన్యుడును
వీర్యవాన్ = వీరుడైన
ఉత్తమౌజాః = ఉత్తమౌజుడును
సౌభద్రః, చ = సుభద్రా కుమారుడైన అభిమన్యుడును
ద్రౌపదేయాః = ద్రౌపదీకుమారులు ఐదుగురును
సర్వే, ఏవ = అందఱును
మహారథాః = మహారథులు (కలరు)

ఈ సేనలో ధనుర్ధారులైన గొప్పయోధులు కలరు. వారిలో సాత్యకి, విరాటుడు, మహారథియైన ద్రుపదమహారాజు, ధృష్టకేతువు, చేకితానుడు, వీరుడైన కాశీరాజు, పురుజిత్తు, కుంతిభోజుడు, నరశ్రేష్ఠుడైన శైబ్యుడు, పరాక్రమవంతుడైన యుధామన్యుడు, వీరుడైన ఉత్తమౌజుడు, సుభద్రాపుత్రుడైన అభిమన్యుడు, ద్రౌపదియొక్క ఐదుగురు పుత్రులును కలరు. వీరందరును మహారథులు. శౌర్యమున భీమార్జునసమానులు. (4-6)

**అస్మాకం తు విశిష్టా యే తాన్నిబోధ ద్విజోత్తమ ।**
**నాయకా మమ సైన్యస్య సంజ్ఞార్థం తాన్ బ్రవీమి తే ॥ 7 ॥**

అస్మాకమ్, తు, విశిష్టాః, యే, తాన్, నిబోధ, ద్విజోత్తమ,
నాయకాః, మమ, సైన్యస్య, సంజ్ఞార్థమ్, తాన్, బ్రవీమి, తే ॥ 7 ॥

| | | | |
|---|---|---|---|
| ద్విజోత్తమ | = ఓ బ్రాహ్మణోత్తమా! | సంజ్ఞార్థమ్ | = ఎఱుకకొఱకు |
| అస్మాకమ్, తు | = మనపక్షమువారైతే | (యే) | = ఎవరయితే |
| యే | = ఎవరు | మమ | = నా (యొక్క) |
| విశిష్టాః (సంతి) | = ప్రముఖులై ఉన్నారో | సైన్యస్య | = సేనకు |
| తాన్ | = వారిని | నాయకాః | = నాయకులైయున్నారో |
| నిబోధ | = తెలిసికొనుడు | తాన్ | = వారినిగూర్చి |
| తే | = మీయొక్క | బ్రవీమి | = తెలిపెదను. |

ఓ బ్రాహ్మణోత్తమా! మన పక్షముననున్న ప్రధానయోధులను గూడ గమనింపుడు. మీ యెఱుకకై మన సేనానాయకులను గూర్చియు తెలుపుచున్నాను. (7)

**భవాన్ భీష్మశ్చ కర్ణశ్చ కృపశ్చ సమితింజయః ।**
**అశ్వత్థామా వికర్ణశ్చ సౌమదత్తిస్తథైవ చ ॥ 8 ॥**

భవాన్, భీష్మః, చ, కర్ణః, చ, కృపః, చ, సమితింజయః,
అశ్వత్థామా, వికర్ణః, చ, సౌమదత్తిః, తథా, ఏవ, చ ॥ 8 ॥

| | | | |
|---|---|---|---|
| భవాన్, చ | = పూజ్యులైన మీరును | తథా, ఏవ | = అట్లే |
| భీష్మః, చ | = భీష్మపితామహుడును | అశ్వత్థామా | = అశ్వత్థామయు |
| కర్ణః, చ | = కర్ణుడును | వికర్ణః, చ | = వికర్ణుడును |
| సమితింజయః | = సంగ్రామ విజయుడగు | సౌమదత్తిః | = సోమదత్తుని కుమారుడగు భూరిశ్రవుడును. |
| కృపః చ | = కృపాచార్యుడును | | |

మీరును, భీష్ముడు, కర్ణుడు, సంగ్రామ విజయుడగు కృపాచార్యుడు, అశ్వత్థామ, వికర్ణుడు, సోమదత్తుని కుమారుడైన భూరిశ్రవుడు ఇందు ముఖ్యులు. (8)

**అన్యే చ బహవః శూరా మదర్థే త్యక్తజీవితాః ।**
**నానాశస్త్రప్రహరణాః సర్వే యుద్ధవిశారదాః ॥ 9 ॥**

అన్యే, చ, బహవః, శూరాః, మదర్థే, త్యక్తజీవితాః,
నానాశస్త్రప్రహరణాః, సర్వే, యుద్ధవిశారదాః ॥ 9 ॥

| | | | |
|---|---|---|---|
| అన్యే, చ | = ఇతరులైనవారు | నానాశస్త్ర ప్రహరణాః | = వివిధములగు శస్త్రాస్త్రములను గలియున్నవారును |
| మదర్థే | = నాకొఱకై | | |
| త్యక్తజీవితాః | = (తమ)జీవితములను పణముగా ఒడ్డినవారును | సర్వే | = అందఱును |
| బహవః | = పెక్కుమంది | యుద్ధవిశారదాః | = యుద్ధమున |
| శూరాః | = శూరులు | (సంతి) | కుశలురైనవారు ఉన్నారు. |

ఇంకను పెక్కుమంది శూరులును, వీరులును మన సైన్యమునందు కలరు. వీరందరును యుద్ధవిశారదులు. నానాశస్త్రాస్త్రధారులు. నాకొరకు తమ ప్రాణముల నొడ్డియైనను యుద్ధయు చేయుటకు సిద్ధముగా నున్నవారు. (9)

**అపర్యాప్తం తదస్మాకం బలం భీష్మాభిరక్షితమ్ ।**
**పర్యాప్తం త్విదమేతేషాం బలం భీమాభిరక్షితమ్ ॥ 10 ॥**

అపర్యాప్తమ్, తత్, అస్మాకమ్, బలమ్, భీష్మాభిరక్షితమ్,
పర్యాప్తమ్, తు, ఇదమ్, ఏతేషామ్, బలమ్, భీమాభిరక్షితమ్ ॥ 10 ॥

| | | | |
|---|---|---|---|
| భీష్మాభిరక్షితమ్ | = భీష్మపితామహునిచే రక్షితమైన | తు,భీమాభిరక్షితమ్ | = అయితే భీమునిచే రక్షింపబడిన |
| అస్మాకమ్ | = మనయొక్క | ఏతేషామ్ | = వీరియొక్క |
| తత్, బలమ్ | = ఆ సేన | ఇదమ్, బలమ్ | = ఈ సైన్యము |
| అపర్యాప్తమ్ | = అపరిమితమైనది (అజేయమైనది) | పర్యాప్తమ్ | = పరిమితమైనది (జయించుటకు సులభమైనది) |

భీష్మపితామహునిచే సురక్షితమై, అపరిమితముగానున్న మన సైన్యము అజేయమైనది. భీమునిచే రక్షింపబడుచు పరిమితముగానున్న ఈ పాండవ సైన్యమును జయించుట సులభము. (10)

**అయనేషు చ సర్వేషు యథాభాగమవస్థితాః ।**
**భీష్మమేవాభిరక్షంతు భవంతః సర్వ ఏవ హి ॥ 11 ॥**

అయనేషు, చ, సర్వేషు, యథాభాగమ్, అవస్థితాః,
భీష్మమ్, ఏవ, అభిరక్షంతు, భవంతః, సర్వే, ఏవ, హి ॥ 11 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| చ | = | కావున | సర్వే, ఏవ | = | అందఱును |
| సర్వేషు అయనేషు | = | అన్ని వ్యూహ ద్వారములయందు | హి | = | నిస్సందేహముగా |
| | | | భీష్మమ్, ఏవ | = | భీష్మపితామహునే |
| యథాభాగమ్ | = | మీమీ స్థానములందు | అభిరక్షంతు | = | అన్నివైపులనుండి రక్షింతురుగాక. |
| అవస్థితాః | = | నిలిచియున్నవారై | | | |
| భవంతః | = | మీరు. | | | |

కనుక మీరందరును మీమీ స్థానములలో సుస్థిరముగా నిలిచి, అన్నివైపులనుండి నిశ్చయముగా భీష్ముని రక్షించుచుండుడు. (11)

**తస్య సంజనయన్ హర్షం కురువృద్ధః పితామహః ।**
**సింహనాదం వినద్యోచ్చైః శంఖం దధ్మౌ ప్రతాపవాన్ ॥ 12 ॥**

తస్య, సంజనయన్, హర్షమ్, కురువృద్ధః, పితామహః,
సింహనాదమ్, వినద్య, ఉచ్చైః, శంఖమ్, దధ్మౌ, ప్రతాపవాన్ ॥ 12 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| కురువృద్ధః | = | కురువంశమువారిలో వృద్ధుడును | సంజనయన్ | = | కలిగించుచు |
| | | | ఉచ్చైః | = | బిగ్గరగా |
| ప్రతాపవాన్ | = | పరాక్రమవంతుడును ఐన | సింహనాదమ్, వినద్య | = | సింహగర్జనమొనర్చి |
| పితామహః | = | భీష్మపితామహుడు | | | |
| తస్య | = | ఆతని (దుర్యోధనుని) యొక్క హృదయమునందు | శంఖమ్ | = | శంఖమును |
| | | | దధ్మౌ | = | మ్రోగించెను (పూరించెను). |
| హర్షమ్ | = | సంతోషమును | | | |

కురువృద్ధుడును, ప్రతాపశాలియును ఐన భీష్మ పితామహుడు (దుర్యోధనుని ఈ మాటలు విని) ఆతనిని సంతోషపఱచుటకై ఉచ్చస్స్వరముతో సింహనాదమొనర్చి, తన శంఖమును పూరించెను. (12)

**తతః శంఖాశ్చ భేర్యశ్చ పణవానకగోముఖాః ।**
**సహసైవాభ్యహన్యంత స శబ్దస్తుములోఽభవత్ ॥ 13 ॥**

తతః, శంఖాః, చ, భేర్యః, చ, పణవానకగోముఖాః,
సహసా, ఏవ, అభ్యహన్యంత, సః, శబ్దః, తుములః, అభవత్ ॥ 13 ॥

| | | | |
|---|---|---|---|
| తతః | = పిమ్మట | సహసా, ఏవ | = ఒక్కుమ్మడిగా |
| శంఖాః, చ | = శంఖములును | అభ్యహన్యంత | = మ్రోగినవి |
| భేర్యః, చ | = నగారాలును | సః, శబ్దః | = ఆ శబ్దము |
| పణవానక గోముఖాః | = డోళ్లు, మృదంగములు కొమ్ముువాద్యములు మొదలగునవి | తుములః | = మిక్కిలి భయంకరమైనదిగా |
| | | అభవత్ | = ఆయెను |

మరుక్షణమునందే శంఖములు, నగారాలు, తప్పెటలు, మృదంగములు, గోముఖవాద్యములు మొదలగునవి ఒక్కసారిగా మ్రోగినవి. దిక్కులను పిక్కటిల్లజేయు ఆ వాద్యనాదములు భయంకరములై ఒప్పినవి. (13)

**తతః శ్వేతైర్హయైర్యుక్తే మహతి స్యందనే స్థితౌ ।**
**మాధవః పాండవశ్చైవ దివ్యౌ శంఖౌ ప్రదధ్మతుః ॥ 14 ॥**

తతః, శ్వేతైః, హయైః, యుక్తే, మహతి, స్యందనే, స్థితౌ,
మాధవః, పాండవః, చ, ఏవ, దివ్యౌ, శంఖౌ, ప్రదధ్మతుః ॥ 14 ॥

| | | | |
|---|---|---|---|
| తతః | = పిదప | మాధవః, చ | = శ్రీకృష్ణపరమాత్ముడును |
| శ్వేతైః | = తెల్లని | పాండవః, ఏవ | = పాండుకుమారుడైన అర్జునుడును |
| హయైః | = గుఱ్ఱములతో | | |
| యుక్తే | = కూడియున్న | దివ్యౌ | = దివ్యము (అలౌకికము)లైన |
| మహతి | = ఉత్తమమైన | | |
| స్యందనే | = రథమునందు | శంఖౌ | = శంఖములను |
| స్థితౌ | = కూర్చొనియున్న | ప్రదధ్మతుః | = పూరించిరి |

తదనంతరము శ్వేతాశ్వములను పూన్చిన మహారథముపై ఆసీనులైయున్న శ్రీకృష్ణార్జునులు తమ దివ్యశంఖములను పూరించిరి. (14)

**పాంచజన్యం హృషీకేశో దేవదత్తం ధనంజయః ।**
**పౌండ్రం దధ్మౌ మహాశంఖం భీమకర్మా వృకోదరః ॥ 15 ॥**

పాంచజన్యమ్, హృషీకేశః, దేవదత్తమ్, ధనంజయః,
పౌండ్రమ్, దధ్మౌ, మహాశంఖమ్, భీమకర్మా, వృకోదరః ॥ 15 ॥

| | | | |
|---|---|---|---|
| హృషీకేశః | = శ్రీకృష్ణుడు | భీమకర్మా | = భయంకర కృత్యములను చేయునట్టి |
| పాంచజన్యమ్ | = పాంచజన్యమను పేరుగల శంఖమును (పూరించెను) | వృకోదరః | = భీమసేనుడు |
| ధనంజయః | = అర్జునుడు | పౌండ్రమ్ | = పౌండ్రమను పేరుగల |
| దేవదత్తమ్ | = దేవదత్తమను పేరుగల శంఖమును (పూరించెను) | మహాశంఖమ్ | = మహాశంఖమును |
| | | దధ్మౌ | = పూరించెను. |

శ్రీకృష్ణుడు పాంచజన్యమును, అర్జునుడు దేవదత్త(శంఖ)మును పూరించిరి. అరివీరభయంకరుడైన భీముడు "పౌండ్రము" అను మహాశంఖమును పూరించెను.(15)

**అనంతవిజయం రాజా కుంతీపుత్రో యుధిష్ఠిరః ।**
**నకులః సహదేవశ్చ సుఘోషమణిపుష్పకౌ ॥ 16 ॥**

అనంతవిజయమ్, రాజా, కుంతీపుత్రః, యుధిష్ఠిరః,
నకులః, సహదేవః, చ, సుఘోషమణిపుష్పకౌ ॥ 16 ॥

| | | | |
|---|---|---|---|
| కుంతీపుత్రః | = కుంతీదేవియొక్క కుమారుడును | నకులః | = నకులుడు |
| రాజా | = రాజైన | సహదేవః, చ | = సహదేవుడును |
| యుధిష్ఠిరః | = యుధిష్ఠిరుడు | సుఘోష మణిపుష్పకౌ | = సుఘోషము, మణిపుష్పకము అనుపేర్లుగల శంఖములను (పూరించిరి). |
| అనంత విజయమ్ | = అనంతవిజయమను పేరుగల శంఖమును | | |

కుంతీపుత్రుడును, రాజును ఐన యుధిష్ఠిరుడు 'అనంత విజయము' అను శంఖమును, నకులసహదేవులు 'సుఘోష' 'మణిపుష్పకము'లను శంఖములను పూరించిరి.(16)

**కాశ్యశ్చ పరమేష్వాసః శిఖండీ చ మహారథః ।**
**ధృష్టద్యుమ్నో విరాటశ్చ సాత్యకిశ్చాపరాజితః ॥ 17 ॥**
**ద్రుపదో ద్రౌపదేయాశ్చ సర్వశః పృథివీపతే ।**
**సౌభద్రశ్చ మహాబాహుః శంఖాన్ దధ్ముః పృథక్ పృథక్ ॥ 18 ॥**

కాశ్యః, చ, పరమేష్వాసః, శిఖండీ, చ, మహారథః,
ధృష్టద్యుమ్నః, విరాటః, చ, సాత్యకిః చ, అపరాజితః ॥ 17 ॥

ద్రుపదః, ద్రౌపదేయాః, చ, సర్వశః, పృథివీపతే,
సౌభద్రః, చ, మహాబాహుః, శంఖాన్, దధ్ముః, పృథక్, పృథక్ ॥ 18 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| పృథివీపతే | = | ఓ రాజా! | ద్రుపదః, చ | = | ద్రుపదమహారాజును |
| పరమేష్వాసః | = | శ్రేష్ఠమైన ధనుస్సుగల | ద్రౌపదేయాః, చ | = | ద్రౌపదియొక్క కుమారులు ఐదుగురును |
| కాశ్యః, చ | = | కాశీరాజును | మహాబాహుః | = | గొప్ప బాహువులు గలవాడైన |
| మహారథః | = | మహారథుడైన | | | |
| శిఖండీ, చ | = | శిఖండియును | సౌభద్రః | = | అభిమన్యుడును |
| ధృష్టద్యుమ్నః, చ | = | ధృష్టద్యుమ్నుడును | సర్వశః | = | అన్నివైపులనుండి |
| విరాటః, చ | = | విరాటరాజును | పృథక్-పృథక్ | = | వేర్వేఱుగా |
| అపరాజితః | = | అజేయుడైన | శంఖాన్ | = | శంఖములను |
| సాత్యకిః | = | సాత్యకియు | దధ్ముః | = | పూరించిరి |

ఓ రాజా! మహాధనుర్ధారియైన కాశీరాజు, మహారథుడైన "శిఖండి"యు, ధృష్టద్యుమ్నుడును, విరాటరాజు, అజేయుడైన 'సాత్యకి'యు, ద్రుపదమహారాజు, ద్రౌపదియొక్క ఐదుగురు పుత్రులును, భుజబలశాలియు సుభద్రాపుత్రుడును అగు అభిమన్యుడును తమ తమ శంఖములను వేర్వేరుగా పూరించిరి. (17-18)

**స ఘోషో ధార్తరాష్ట్రాణాం హృదయాని వ్యదారయత్ ।**
**నభశ్చ పృథివీం చైవ తుములో వ్యనునాదయన్ ॥ 19 ॥**

సః, ఘోషః, ధార్తరాష్ట్రాణామ్, హృదయాని, వ్యదారయత్,
నభః, చ, పృథివీమ్, చ, ఏవ, తుములః, వ్యనునాదయన్ ॥ 19 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| చ | = | మఱియు | వ్యనునాదయన్ | = | ప్రతిధ్వనింపజేయుచు |
| సః | = | ఆ (అట్టి) | ధార్తరాష్ట్రాణామ్ | = | ధార్తరాష్ట్రులయొక్క అనగా మీ వారి |
| తుములః | = | భయంకరమైన | | | |
| ఘోషః | = | నాదము | హృదయాని | = | హృదయములను |
| నభః, చ | = | ఆకాశమును | వ్యదారయత్ | = | కకావికలములుగా జేసెను. |
| పృథివీమ్, ఏవ | = | భూమిని గూడ | | | |

పాండవపక్షమహాయోధుల శంఖనినాదములకు భూమ్యాకాశములు దద్దరిల్లినవి. ఆ శంఖారావములకు ధార్తరాష్ట్రుల హృదయములు కకావికలములయ్యెను. (19)

**అథ వ్యవస్థితాన్ దృష్ట్వా ధార్తరాష్ట్రాన్ కపిధ్వజః ।**
**ప్రవృత్తే శస్త్రసంపాతే ధనురుద్యమ్య పాండవః ॥ 20 ॥**
**హృషీకేశం తదా వాక్యమ్ ఇదమాహ మహీపతే ।**

**అర్జున ఉవాచ**

**సేనయోరుభయోర్మధ్యే రథం స్థాపయ మేఽచ్యుత ॥ 21 ॥**

అథ, వ్యవస్థితాన్, దృష్ట్వా, ధార్తరాష్ట్రాన్, కపిధ్వజః,
ప్రవృత్తే, శస్త్రసంపాతే, ధనుః, ఉద్యమ్య, పాండవః ॥ 20 ॥
హృషీకేశమ్, తదా, వాక్యమ్, ఇదమ్, ఆహ, మహీపతే,
సేనయోః, ఉభయోః, మధ్యే, రథమ్, స్థాపయ, మే, అచ్యుత ॥ 21 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| మహీపతే | = | ఓ రాజా! | ప్రవృత్తే | = | సన్నద్ధులైన సమయమున |
| అథ | = | అనంతరము | ధనుః | = | ధనుస్సును |
| కపిధ్వజః | = | కపిధ్వజుడైన | ఉద్యమ్య | = | పైకెత్తి |
| పాండవః | = | అర్జునుడు | హృషీకేశమ్ | = | శ్రీకృష్ణుని (తో) |
| వ్యవస్థితాన్ | = | యుద్ధసన్నద్ధులై నిలిచియున్న | ఇదమ్, వాక్యమ్ | = | ఈ వాక్యమును |
| | | | ఆహ | = | పలికెను |
| ధార్తరాష్ట్రాన్ | = | ధృతరాష్ట్రునకు సంబంధించిన వారిని | అచ్యుత | = | ఓ కృష్ణా! |
| | | | మే, రథమ్ | = | నా రథమును |
| దృష్ట్వా | = | చూచి | ఉభయోః | = | ఉభయపక్షముల యొక్క |
| తదా | = | అప్పుడు | | | |
| శస్త్రసంపాతే | = | శస్త్రములను ప్రయోగించుటకు | సేనయోః, మధ్యే | = | సేనలమధ్య |
| | | | స్థాపయ | = | నిలిపియుంచుము |

ఓ ధృతరాష్ట్ర మహారాజా! పిమ్మట యుద్ధమునకై నడుము బిగించి సమర సన్నద్ధులైయున్న ధార్తరాష్ట్రులను చూచి, కపిధ్వజుడైన అర్జునుడు ధనుస్సును పైకెత్తి శ్రీకృష్ణునితో ఇట్లనెను- "ఓ అచ్యుత! నా రథమును ఉభయసేనలమధ్య నిలుపుము." (20-21)

**యావదేతాన్ నిరీక్షేఽహం యోద్ధుకామానవస్థితాన్ ।**
**కైర్మయా సహ యోద్ధవ్యమ్ అస్మిన్ రణసముద్యమే ॥ 22 ॥**

యావత్, ఏతాన్, నిరీక్షే, అహమ్, యోద్ధుకామాన్, అవస్థితాన్,
కైః, మయా, సహ, యోద్ధవ్యమ్, అస్మిన్, రణసముద్యమే ॥ 22 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| యావత్ | = | ఎంతవఱకైతే | అస్మిన్ | = | ఈ |
| అహమ్ | = | నేను | రణసముద్యమే | = | మహారణభూమి యందు |
| అవస్థితాన్ | = | రణరంగమున నిలిచి యున్నట్టి | మయా | = | నాతో (నాకు) |
| | | | కైః, సహ | = | ఎవరితో |
| యోద్ధుకామాన్ | = | యుద్ధాభిలాషులైన | యోద్ధవ్యమ్ | = | యుద్ధము చేయవలసి |
| ఏతాన్ | = | ఈ ప్రతియోధులను | యున్నదో (అంతవఱకును రథమును నిలిపియుంచుము) | | |
| నిరీక్షే | = | చక్కగాచూడగలనో | | | |

రణరంగమునందు యుద్ధాభిలాషులై నిలిచియున్న ప్రతిపక్షయోధులందరిని బాగుగా పరిశీలించునంతవరకును, వారిలోఎవరితో నేను యుద్ధము చేయవలసియున్నదో గమనించునంతవరకును రథమును నిలిపియుంచుము. (22)

**యోత్స్యమానానవేక్షేఽహం య ఏతేఽత్ర సమాగతాః ।**
**ధార్తరాష్ట్రస్య దుర్బుద్ధేః యుద్ధే ప్రియచికీర్షవః ॥ 23 ॥**

యోత్స్యమానాన్, అవేక్షే, అహమ్, యే, ఏతే, అత్ర, సమాగతాః,
ధార్తరాష్ట్రస్య, దుర్బుద్ధేః, యుద్ధే, ప్రియచికీర్షవః ॥ 23 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| దుర్బుద్ధేః | = | దుర్బుద్ధిగలవాడైన | అత్ర | = | ఇచ్చట (ఈ సమర భూమియందు) |
| ధార్తరాష్ట్రస్య | = | దుర్యోధనునకు | | | |
| యుద్ధే | = | యుద్ధమునందు | సమాగతాః | = | చేరియున్నారో |
| ప్రియచికీర్షవః | = | ప్రియమును గూర్పదలచినట్టివారు | యోత్స్యమానాన్ | = | యుద్ధసన్నద్ధులై యున్నట్టి వారిని |
| యే | = | ఎవరెవరు | అహమ్ | = | నేను |
| ఏతే | = | (రాజులుగలరో) వీరు | అవేక్షే | = | చూచెదనుగాక |

"దుర్బుద్ధియైన దుర్యోధనునకు ప్రియమునుగూర్చుటకై యుద్ధమున పాల్గొనదలచి వచ్చియున్న రాజులను అందరిని ఒకపరి పరికించెదను." (23)

*సంజయ ఉవాచ*

**ఏవముక్తో హృషీకేశో గుడాకేశేన భారత ।**
**సేనయోరుభయోర్మధ్యే స్థాపయిత్వా రథోత్తమమ్ ॥ 24 ॥**
**భీష్మద్రోణప్రముఖతః సర్వేషాం చ మహీక్షితామ్ ।**
**ఉవాచ పార్థ పశ్యైతాన్ సమవేతాన్ కురూనితి ॥ 25 ॥**

ఏవమ్, ఉక్తః, హృషీకేశః, గుడాకేశేన, భారత,
సేనయోః, ఉభయోః, మధ్యే, స్థాపయిత్వా, రథోత్తమమ్ ॥ 24 ॥
భీష్మద్రోణప్రముఖతః, సర్వేషామ్, చ, మహీక్షితామ్,
ఉవాచ, పార్థ, పశ్య, ఏతాన్, సమవేతాన్, కురూన్, ఇతి ॥ 25 ॥

| | | | |
|---|---|---|---|
| భారత! | = ఓ ధృతరాష్ట్రా! | సర్వేషామ్ | = సమస్త |
| గుడాకేశేన | = అర్జుననిచేత | మహీక్షితామ్ | = రాజుల యెదుట |
| ఏవమ్ | = ఈ విధముగా | రథోత్తమమ్ | = ఉత్తమమైన రథమును |
| ఉక్తః | = చెప్పబడిన | స్థాపయిత్వా | = నిలిపి |
| హృషీకేశః | = శ్రీకృష్ణుడు | ఇతి, ఉవాచ | = ఈ విధముగా పలికెను |
| ఉభయోః | = ఉభయ పక్షములవారి | పార్థ! | = ఓ అర్జునా! |
| సేనయోః | = సేనలయొక్క | సమవేతాన్ | = (యుద్ధమునకై) చేరియున్న |
| మధ్యే | = మధ్య | ఏతాన్ | = ఈ |
| భీష్మద్రోణ ప్రముఖతః | = భీష్మద్రోణాదుల సమక్షమున | కురూన్ | = కౌరవులను |
| చ | = మఱియు | పశ్య | = చూడుము |

సంజయుడు పలికెను- ఓ ధృతరాష్ట్రా! అర్జునుని కోరికమేరకు శ్రీకృష్ణుడు ఆ దివ్యరథమును భీష్మద్రోణులకును, ఆ పక్షమునందలి మహారాజులందరికిని ఎదురుగా ఉభయసేనల మధ్య నిలిపెను. పిదప అతడు అర్జునునితో "పార్థా! ఇక్కడ సమావేశమైన ఈ కౌరవ వీరులందరిని పరికింపుము" అని నుడివెను. (24-25)

**తత్రాపశ్యత్ స్థితాన్ పార్థః పితౄనథ పితామహాన్ ।**
**ఆచార్యాన్ మాతులాన్ భ్రాతౄన్ పుత్రాన్ పౌత్రాన్ సఖీంస్తథా ॥ 26 ॥**
**శ్వశురాన్ సుహృదశ్చైవ సేనయోరుభయోరపి ।**

తత్ర, అపశ్యత్, స్థితాన్, పార్థః, పితౄన్, అథ, పితామహాన్,
ఆచార్యాన్, మాతులాన్, భ్రాతౄన్, పుత్రాన్, పౌత్రాన్, సఖీన్, తథా ॥ 26 ॥
శ్వశురాన్, సుహృదః, చ, ఏవ, సేనయోః, ఉభయోః, అపి ।

| | | | | | |
|---|---|---|---|---|---|
| అథ | = | తరువాత | మాతులాన్ | = | మేనమామలను |
| పార్థః | = | అర్జునుడు | భ్రాతౄన్ | = | సోదరులను |
| తత్ర | = | అచట(ఆ) | పుత్రాన్ | = | పుత్రులను |
| ఉభయోః | = | ఉభయపక్షముల | పౌత్రాన్ | = | మనుమలను |
| సేనయోః, అపి | = | సేనలయందును | తథా | = | అట్లే |
| స్థితాన్ | = | నిలిచియున్న | సఖీన్ | = | మిత్రులను |
| పితౄన్ | = | పినతండ్రులను పెదతండ్రులను | శ్వశురాన్, చ | = | పిల్లనిచ్చిన మామలను |
| పితామహాన్ | = | తాతముత్తాతలను | సుహృదః, చ ఏవ | = | మొదలగు ఆత్మీయులను అందఱిని |
| ఆచార్యాన్ | = | గురువులను | అపశ్యత్ | = | చూచెను |

పిమ్మట పార్థుడు ఆ ఉభయసేనలయందును చేరియున్న పెదతండ్రులను, పినతండ్రులను, తాతముత్తాతలను, గురువులను, మేనమామలను, సోదరులను, పుత్రులను, పౌత్రులను, మిత్రులను, పిల్లనిచ్చిన మామలను మున్నగు ఆత్మీయులను చూచెను.
(26,27 పూర్వార్ధము)

**తాన్ సమీక్ష్య స కౌంతేయః సర్వాన్ బంధూనవస్థితాన్ ॥ 27 ॥**
**కృపయా పరయావిష్టో విషీదన్నిదమబ్రవీత్ ।**

(28 పూర్వార్ధము)

తాన్, సమీక్ష్య, సః, కౌంతేయః, సర్వాన్, బంధూన్, అవస్థితాన్ ॥ 27 ॥
కృపయా, పరయా, ఆవిష్టః, విషీదన్, ఇదమ్, అబ్రవీత్ ।

| | | | | | |
|---|---|---|---|---|---|
| అవస్థితాన్, తాన్ | = | చేరియున్నవారైన | పరయా, కృపయా ఆవిష్టః | = | మిక్కిలి కనికరముతో కూడినవాడై |
| సర్వాన్, బంధూన్ | = | బంధువులందఱిని | విషీదన్ | = | శోకించుచు |
| సమీక్ష్య | = | పరికించి | ఇదమ్ | = | ఈ వచనమును |
| సః, కౌంతేయః | = | కుంతీపుత్రుడైన అర్జునుడు | అబ్రవీత్ | = | పలికెను |

సమరభూమికి వచ్చియున్న బంధువులను అందరిని చూచి, కుంతీపుత్రుడైన అర్జునుడు అత్యంత కరుణాసమంచితుడై శోకసంతప్తుడై ఇట్లు పలికెను. (27)

**అర్జున ఉవాచ**

**దృష్ట్వేమం స్వజనం కృష్ణ యుయుత్సుం సముపస్థితమ్ ॥ 28 ॥**

**సీదంతి మమ గాత్రాణి ముఖం చ పరిశుష్యతి ।**
**వేపథుశ్చ శరీరే మే రోమహర్షశ్చ జాయతే ॥ 29 ॥**

దృష్ట్వా, ఇమమ్, స్వజనమ్, కృష్ణ, యుయుత్సుమ్, సముపస్థితమ్ ॥ 28 ॥
సీదంతి, మమ, గాత్రాణి, ముఖమ్, చ, పరిశుష్యతి,
వేపథుః చ, శరీరే, మే, రోమహర్షః, చ, జాయతే ॥ 29 ॥

| | | | |
|---|---|---|---|
| కృష్ణ | = ఓ కృష్ణా! | చ | = మఱియు |
| సముపస్థితమ్ | = (సమరభూమికి) చేరియున్న | ముఖమ్ | = నోరు |
| | | పరిశుష్యతి | = ఎండిపోవుచున్నది |
| యుయుత్సుమ్ | = యుద్ధాభిలాషతోనున్న | చ | = ఇంకను |
| ఇమమ్ స్వజనమ్ | = ఈ స్వజన సముదాయమును | మే | = నాయొక్క |
| దృష్ట్వా | = చూచి | శరీరే | = శరీరమునందు |
| మమ | = నాయొక్క | వేపథుః | = కంపము |
| గాత్రాణి | = అంగములు | రోమహర్షః, చ | = గగుర్పాటు గూడ |
| సీదంతి | = పట్టుతప్పుచున్నవి | జాయతే | = కలుగుచున్నది |

అర్జునుడు పలికెను– ఓ కృష్ణా! సమరోత్సాహముతో రణరంగమున నిలిచియున్న ఈ స్వజనసమూహమును జూచి, నా అవయవములు శిథిలములగుచున్నవి. నోరు ఎండిపోవుచున్నది. శరీరమునందు వణుకు, గగుర్పాటు కలుగుచున్నవి. ($28\frac{1}{2}$–29)

**గాండీవం స్రంసతే హస్తాత్ త్వక్చైవ పరిదహ్యతే ।**
**న చ శక్నోమ్యవస్థాతుం భ్రమతీవ చ మే మనః ॥ 30 ॥**

గాండీవమ్, స్రంసతే, హస్తాత్, త్వక్, చ, ఏవ, పరిదహ్యతే,
న, చ, శక్నోమి, అవస్థాతుమ్, భ్రమతి, ఇవ, చ, మే, మనః ॥ 30 ॥

| | | | |
|---|---|---|---|
| హస్తాత్ | = చేతినుండి | భ్రమతి, ఇవ | = భ్రమకులోనగు చున్నట్లున్నది |
| గాండీవమ్ | = గాండీవధనుస్సు | | |
| స్రంసతే | = జారిపోవుచున్నది | (అతః) | = అందువలన |
| చ, త్వక్ ఏవ | = మఱియు చర్మము గూడ | అవస్థాతుమ్, చ | = నిశ్చలముగా నిలిచి యుండుటకును |
| పరిదహ్యతే | = తాపమునొందుచున్నది | | |
| చ, మే | = అట్లే నాయొక్క | న, శక్నోమి | = సమర్థుడను కాకున్నాను |
| మనః | = మనస్సు | | |

గాండీవము చేతినుండి జారిపోవుచున్నది. చర్మము తపించిపోవుచున్నది. మనస్సు భ్రమకు గురియైనట్లు అనిపించుచున్నది. కనుక ఇక్కడ నిలబడలేకపోవుచున్నాను.(30)

**నిమిత్తాని చ పశ్యామి విపరీతాని కేశవ ।**
**న చ శ్రేయోఽనుపశ్యామి హత్వా స్వజనమాహవే ॥ 31 ॥**

నిమిత్తాని, చ, పశ్యామి, విపరీతాని, కేశవ,
న, చ, శ్రేయః, అనుపశ్యామి, హత్వా, స్వజనమ్, ఆహవే ॥ 31 ॥

| | | | |
|---|---|---|---|
| కేశవ! | = ఓ కృష్ణా! | స్వజనమ్ | = స్వజనసమూహమును (ఆత్మీయులను) |
| విపరీతాని | = విపరీతములైన (అశుభసూచకములైన) | హత్వా | = చంపి |
| నిమిత్తాని, చ | = శకునములను గూడ | శ్రేయః, చ | = (ఎట్టి) శ్రేయస్సును గూడ |
| పశ్యామి | = చూచుచున్నాను | | |
| ఆహవే | = యుద్ధమునందు | న, అనుపశ్యామి | = చూడజాలకున్నాను. |

ఓ కేశవా! పెక్కు అపశకునములు కనబడుచున్నవి. యుద్ధమున స్వజనసమూహమును చంపుటచే శ్రేయస్సు కలుగునని అనిపించుటలేదు. (31)

**న కాంక్షే విజయం కృష్ణ న చ రాజ్యం సుఖాని చ ।**
**కిం నో రాజ్యేన గోవింద కిం భోగైర్జీవితేన వా ॥ 32 ॥**

న, కాంక్షే, విజయమ్, కృష్ణ, న, చ, రాజ్యమ్, సుఖాని, చ,
కిమ్, నః, రాజ్యేన, గోవింద, కిమ్, భోగైః, జీవితేన, వా ॥ 32 ॥

| | | | |
|---|---|---|---|
| కృష్ణ | = ఓ కృష్ణా! | రాజ్యేన | = (అట్టి) రాజ్యముతో |
| విజయమ్ | = విజయమును | గోవింద! | = ఓ కృష్ణా! |
| న, కాంక్షే | = (నేను) కోరుటలేదు (కోరను) | కిమ్ | = ఏమి ప్రయోజనము |
| చ, రాజ్యమ్, న | = మఱియు రాజ్యమును సైతము కోరను | వా | = అథవా (లేక) |
| | | భోగైః | = భోగములతో (గాని) |
| సుఖాని, చ(న) | = సుఖములను గూడ కోరను | జీవితేన | = జీవితముతో (గాని) |
| నః | = మాకు | కిమ్ | = ఏమి లాభము ? |

ఓ కృష్ణా! నాకు విజయము గాని, రాజ్యము గాని, సుఖములు గాని అక్కరయే లేదు. గోవిందా! ఈ రాజ్యమువలనగాని, ఈ భోగములవలన గాని, ఈ జీవితమువలన గాని ప్రయోజనమేమి? (32)

**యేషామర్థే కాంక్షితం నో రాజ్యం భోగాః సుఖాని చ ।**
**త ఇమేఽవస్థితా యుద్ధే ప్రాణాంస్త్యక్త్వా ధనాని చ ॥ 33 ॥**

యేషామ్, అర్థే, కాంక్షితమ్, నః, రాజ్యమ్, భోగాః, సుఖాని, చ,
తే, ఇమే, అవస్థితాః, యుద్ధే, ప్రాణాన్, త్యక్త్వా, ధనాని, చ ॥ 33 ॥

| | | | |
|---|---|---|---|
| యేషామ్, అర్థే | = ఎవరికొఱకైతే | ధనాని | = సంపదలపైనను |
| రాజ్యమ్ | = రాజ్యము | చ | = మఱియు |
| భోగాః | = భోగములు | | |
| సుఖాని, చ | = సుఖములును | ప్రాణాన్ | = ప్రాణములపైనను |
| నః | = మాకు | త్యక్త్వా | = (ఆశలను) వదలుకొని |
| కాంక్షితమ్ | = అభీష్టమో, (అభీష్టములో) | యుద్ధే | = యుద్ధమునందు |
| తే | = వారును | అవస్థితాః | = నిలిచి (సన్నద్ధులై) యున్నారు. |
| ఇమే | = వీరును- అందఱును | | |

మనము ఎవరికై ఈ రాజ్యమును, భోగములను, సుఖములను కోరుకొనుచున్నామో, వారే ధనప్రాణములయెడ ఆశలు వదులుకొని యుద్ధమునకు వచ్చియున్నారు.(33)

**ఆచార్యాః పితరః పుత్రాస్తథైవ చ పితామహాః ।**
**మాతులాః శ్వశురాః పౌత్రాః శ్యాలాః సంబంధినస్తథా ॥ 34 ॥**

ఆచార్యాః, పితరః, పుత్రాః, తథా, ఏవ, చ, పితామహాః,
మాతులాః, శ్వశురాః, పౌత్రాః, శ్యాలాః, సంబంధినః, తథా ॥ 34 ॥

| | | | |
|---|---|---|---|
| ఆచార్యాః | = గురువులు | మాతులాః | = మేనమామలు |
| పితరః | = పినతండ్రులు పెదతండ్రులు | శ్వశురాః | = పిల్లనిచ్చిన మామలు |
| | | పౌత్రాః | = మనుమలు |
| పుత్రాః, చ | = కుమారులును | శ్యాలాః | = బావమఱదులు |
| తథా, ఏవ | = అట్లే | తథా, సంబంధినః | = అట్లే (ఇతర) బంధువులు (చేరియున్నారు) |
| పితామహాః | = తాతలు | | |

గురువులు, తండ్రులు, తాతలు, కొడుకులు, మనుమలు, మేనమామలు, మామలు, బావమఱదులు, ఇతర బంధువులు మొదలగువారు అందరును ఇచ్చటికి చేరియున్నారు.(34)

**ఏతాన్న హంతుమిచ్ఛామి ఘ్నతోఽపి మధుసూదన ।**
**అపి త్రైలోక్యరాజ్యస్య హేతోః కిం ను మహీకృతే ॥ 35 ॥**

ఏతాన్, న, హంతుమ్, ఇచ్ఛామి, ఘ్నతః, అపి, మధుసూదన,
అపి, త్రైలోక్యరాజ్యస్య, హేతోః, కిమ్, ను, మహీకృతే ॥ 35 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| మధుసూదన! | = | ఓ మధుసూదనా! | హంతుమ్ | = | చంపుటకు |
| ఘ్నతః, అపి | = | (నేను) చంపబడినను | న, ఇచ్ఛామి | = | ఇష్టపడను |
| త్రైలోక్యరాజ్యస్య | = | (లేక)మూడులోకముల రాజ్యాధిపత్యము | మహీకృతే | = | భూమండలము కొఱకైతే |
| హేతోః, అపి | = | నిమిత్తమైనను | | | |
| ఏతాన్ | = | వీరిని (ఈ స్వజనులను) | కిమ్, ను | = | చెప్పవలసినదేమి? |

ఓ మధుసూదనా! ముల్లోకాధిపత్యముకొరకైనను నేను ఎవ్వరినీ చంపను. ఇక ఈ భూమండలవిషయమై చెప్పనేల? అట్లే వీరిలో ఎవ్వరైనను నన్ను చంపబూనిననూ నేను మాత్రము వీరిని చంపనే చంపను. (35)

**నిహత్య ధార్తరాష్ట్రాన్నః కా ప్రీతిః స్యాజ్జనార్దన ।**
**పాపమేవాశ్రయేదస్మాన్ హత్వైతానాతతాయినః ॥ 36 ॥**

నిహత్య, ధార్తరాష్ట్రాన్, నః, కా, ప్రీతిః, స్యాత్, జనార్దన,
పాపమ్, ఏవ, ఆశ్రయేత్, అస్మాన్, హత్వా, ఏతాన్, ఆతతాయినః ॥ 36 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| జనార్దన! | = | ఓ జనార్దనా! | ఏతాన్ | = | ఇట్టి (ఈ) |
| ధార్తరాష్ట్రాన్ | = | ధృతరాష్ట్ర కుమారులను | ఆతతాయినః | = | ఆతతాయులను (దుష్టులను) |
| నిహత్య | = | చంపినచో | హత్వా | = | చంపుటవలన |
| నః | = | మనకు | అస్మాన్ | = | మనలను |
| కా, ప్రీతిః స్యాత్? | = | ఎట్టి సంతోషము కలుగును? | పాపమ్, ఏవ ఆశ్రయేత్ | = | పాపమే చుట్టుముట్టును |

ఓ జనార్దనా! ఈ ధార్తరాష్ట్రులను చంపి, మనము బావుకొనునది ఏమి? (మనము మూట కట్టుకొనునది యేమి?) ఈ ఆతతాయులను చంపుటవలన మనకు పాపమే కలుగును. (36)

**తస్మాన్నార్హా వయం హంతుం ధార్తరాష్ట్రాన్ స్వబాంధవాన్ ।**
**స్వజనం హి కథం హత్వా సుఖినః స్యామ మాధవ ॥ 37 ॥**

తస్మాత్, న, అర్హాః, వయమ్, హంతుమ్, ధార్తరాష్ట్రాన్, స్వబాంధవాన్,
స్వజనమ్, హి, కథమ్, హత్వా, సుఖినః, స్యామ, మాధవ ॥ 37 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| తస్మాత్ | = | అందువలన | న, అర్హాః | = | అర్హులముకాము (మనమువారిని చంపదగదు) |
| మాధవ! | = | ఓ మాధవా! | హి | = | ఏలనన |
| స్వబాంధవాన్ | = | మన బంధువులైన | స్వజనమ్ | = | స్వజనులను |
| ధార్తరాష్ట్రాన్ | = | ధార్తరాష్ట్రులను | హత్వా | = | చంపి |
| హంతుమ్ | = | హతమార్చుటకు | కథం,సుఖినః | = | ఎట్లు సుఖులము |
| వయమ్ | = | మనము | స్యామ | = | కాగలము |

కనుక, ఓ మాధవా! మనబంధువులైన ఈ ధార్తరాష్ట్రులను చంపుట మనకు తగదు. స్వజనులను చంపిన మనకు సుఖము ఎట్లు అబ్బును? (37)

**యద్యప్యేతే న పశ్యంతి లోభోపహతచేతసః ।**
**కులక్షయకృతం దోషం మిత్రద్రోహే చ పాతకమ్ ॥ 38 ॥**
**కథం న జ్ఞేయమస్మాభిః పాపాదస్మాన్నివర్తితుమ్ ।**
**కులక్షయకృతం దోషం ప్రపశ్యద్భిర్జనార్దన ॥ 39 ॥**

యద్యపి, ఏతే, న, పశ్యంతి, లోభోపహతచేతసః,
కులక్షయకృతమ్, దోషమ్, మిత్రద్రోహే, చ, పాతకమ్ ॥ 38 ॥
కథమ్, న, జ్ఞేయమ్, అస్మాభిః, పాపాత్, అస్మాత్, నివర్తితుమ్,
కులక్షయకృతమ్, దోషమ్, ప్రపశ్యద్భిః, జనార్దన ॥ 39 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| యద్యపి | = | ఒకవేళ | మిత్రద్రోహే | = | మిత్రద్రోహకారణముగా |
| లోభోపహత చేతసః | = | లోభముచే భ్రష్టచిత్తులై | పాతకమ్, చ | = | (కలుగు) పాపమును |
| ఏతే | = | వీరు | న, పశ్యంతి | = | చూడకున్నవారైనను |
| కులక్షయ కృతమ్ | = | కులనాశము వలనకలుగు | జనార్దన! | = | ఓ జనార్దనా! |
| దోషమ్, చ | = | దోషమును | కులక్షయ కృతమ్ | = | కులక్షయమువలన కలుగు |
| | | | దోషమ్ | = | దోషమును |

| | | | |
|---|---|---|---|
| ప్రపశ్యద్భిః | = చక్కగా ఎఱింగినవారమైన | పాపాత్ | = పాపమునుండి |
| అస్మాభిః | = మనచే | నివర్తితుమ్ | = మఱలుటకు |
| అస్మాత్ | = ఇట్టి | కథమ్ | = ఏల |
| | | న, జ్ఞేయమ్ | = ఆలోచింపరాదు? |

లోభకారణముగ భ్రష్టచిత్తులైన వీరు కులక్షయమువలన కలుగు దోషములను, మిత్రద్రోహమువలన సంభవించు పాపములను చూడకున్నచో, ఓ జనార్దనా! కులనాశనమువలన కలుగు నష్టములను ఎఱింగిన మనము ఈ పాపములకు దూరముగా ఉండుటకు ఏల ఆలోచింపరాదు? (38-39)

**కులక్షయే ప్రణశ్యంతి కులధర్మాః సనాతనాః ।**
**ధర్మే నష్టే కులం కృత్స్నమ్ అధర్మోఽభిభవత్యుత ॥ 40 ॥**

కులక్షయే, ప్రణశ్యంతి, కులధర్మాః, సనాతనాః,
ధర్మే, నష్టే, కులమ్, కృత్స్నమ్, అధర్మః, అభిభవతి, ఉత ॥ 40 ॥

| | | | |
|---|---|---|---|
| కులక్షయే | = కులక్షయకారణముగ | ధర్మే, నష్టే | = ధర్మము అంతరించి పోవుచుండగా |
| సనాతనాః | = సనాతనములైన (పరంపరాగతములైన) | కృత్స్నమ్ | = సమస్తమైన (పూర్తిగా) |
| | | కులమ్ | = వంశము (నందు) |
| కులధర్మాః | = కులధర్మములు | అధర్మః, ఉత | = అధర్మమే |
| ప్రణశ్యంతి | = నశించిపోవును | అభిభవతి | = వ్యాపించును. |

కులక్షయమువలన సనాతనములైన కులధర్మములన్నియును నశించును. ధర్మము అంతరించి పోయినప్పుడు కులమునందు అంతటను పాపమేవ్యాపించును. (40)

**అధర్మాభిభవాత్ కృష్ణ ప్రదుష్యంతి కులస్త్రియః ।**
**స్త్రీషు దుష్టాసు వార్ష్ణేయ జాయతే వర్ణసంకరః ॥ 41 ॥**

అధర్మాభిభవాత్, కృష్ణ, ప్రదుష్యంతి, కులస్త్రియః,
స్త్రీషు, దుష్టాసు, వార్ష్ణేయ, జాయతే, వర్ణసంకరః ॥ 41 ॥

| | | | |
|---|---|---|---|
| కృష్ణ! | = ఓ కృష్ణా! | కులస్త్రియః | = కులస్త్రీలు |
| అధర్మాభిభవాత్ | = అధర్మము (పాపము) అధికమగుటవలన | ప్రదుష్యంతి | = మిక్కిలిదూషితలగుదురు |
| | | వార్ష్ణేయ | = కృష్ణా! |

| | | | |
|---|---|---|---|
| స్త్రీషు | = స్త్రీలు | వర్ణసంకరః | = వర్ణసాంకర్యము |
| దుష్టాసు | = దూషితలైనపుడు | జాయతే | = ఉత్పన్నమగును |

ఓ కృష్ణా! అధర్మము (పాపము) పెచ్చుపెరిగిపోయినప్పుడు కులస్త్రీలు మిక్కిలి దూషితలగుదురు. ఓ వార్ష్ణేయా! స్త్రీలు దూషితలు ఐనచో వర్ణసాంకర్యము ఏర్పడును.(41)

**సంకరో నరకాయైవ కులఘ్నానాం కులస్య చ ।**
**పతంతి పితరో హ్యేషాం లుప్తపిండోదకక్రియాః ॥ 42 ॥**

సంకరః, నరకాయ, ఏవ, కులఘ్నానామ్, కులస్య, చ,
పతంతి, పితరః, హి ఏషామ్, లుప్తపిండోదకక్రియాః ॥ 42 ॥

| | | | |
|---|---|---|---|
| సంకరః | = వర్ణసాంకర్యము | లుప్తపిండోదకక్రియాః | = పిండోదకక్రియలు లుప్తమైనవారు(ను) |
| కులఘ్నానామ్, చ | = కులఘాతకులకును | ఏషామ్ | = వీరియొక్క |
| కులస్య | = కులమునకును | పితరః, హి | = పితరులు కూడ |
| నరకాయ, ఏవ | = నరకము కొఱకే (నరకప్రాప్తియే) అగును | పతంతి | = అధోగతి పాలయ్యెదరు. |

వర్ణసాంకర్యము కులఘాతకులను, కులమును నరకమునందు పడవేయును. పిండోదకములు (శ్రాద్ధతర్పణములు) లోపించినందువలన వారి పితరులును అధోగతి పాలయ్యెదరు. (42)

**దోషైరేతైః కులఘ్నానాం వర్ణసంకరకారకైః ।**
**ఉత్సాద్యంతే జాతిధర్మాః కులధర్మాశ్చ శాశ్వతాః ॥ 43 ॥**

దోషైః, ఏతైః, కులఘ్నానామ్, వర్ణసంకరకారకైః,
ఉత్సాద్యంతే, జాతిధర్మాః, కులధర్మాః, చ, శాశ్వతాః ॥ 43 ॥

| | | | |
|---|---|---|---|
| ఏతైః | = ఇట్టి | శాశ్వతాః | = సనాతనములైన |
| వర్ణసంకరకారకైః | = వర్ణసాంకర్యములకు హేతువులైన | కులధర్మాః, చ | = కులధర్మములును |
| దోషైః | = దోషములచే | జాతిధర్మాః | = జాతిధర్మములును |
| కులఘ్నానామ్ | = కులఘాతకులయొక్క | ఉత్సాద్యంతే | = నష్టములగును. |

వర్ణసాంకర్యమునకు మూలములైన ఈ దోషములవలన కులఘాతకులయొక్క సనాతన కులధర్మములు, జాతిధర్మములు నష్టమగును. (43)

**ఉత్పన్నకులధర్మాణాం మనుష్యాణాం జనార్దన ।**
**నరకేఽనియతం వాసో భవతీత్యనుశుశ్రుమ ॥ 44 ॥**

ఉత్పన్నకులధర్మాణామ్, మనుష్యాణామ్, జనార్దన,
నరకే, అనియతమ్, వాసః, భవతి, ఇతి, అనుశుశ్రుమ ॥ 44 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| జనార్దన! | = | ఓ జనార్దనా! | నరకే | = | నరకమునందు |
| ఉత్పన్నకుల-ధర్మాణామ్ | = | కులధర్మములు నశించినవారైన | వాసః | = | నివాసము |
| | | | భవతి | = | అగును |
| మనుష్యాణామ్ | = | మనుష్యులకు | ఇతి | = | అని |
| అనియతమ్ | = | నిరవధికముగా | అనుశుశ్రుమ | = | వినుచున్నాము. |

ఓ జనార్దనా! కులధర్మములు నశించినవారికి నిరవధికముగా (కలకాలము) నరకప్రాప్తి తప్పదని ప్రతీతి. (44)

**అహో బత మహత్పాపం కర్తుం వ్యవసితా వయమ్ ।**
**యద్రాజ్యసుఖలోభేన హంతుం స్వజనముద్యతాః ॥ 45 ॥**

అహో, బత, మహత్, పాపమ్, కర్తుమ్, వ్యవసితాః, వయమ్,
యత్, రాజ్యసుఖలోభేన, హంతుమ్, స్వజనమ్, ఉద్యతాః ॥ 45 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| అహో | = | అయ్యో! | యత్ | = | ఏదయితే (ఏమహాపాపమునకైతే) |
| బత | = | ఎంత దారుణము!! | | | |
| వయమ్ | = | మనము (బుద్ధిమంతులమై గూడ) | రాజ్యసుఖ లోభేన | = | రాజ్యసుఖ లోభములచే |
| | | | స్వజనమ్ | = | స్వజనులను |
| మహత్ పాపమ్ | = | మహాపాపమును | హంతుమ్ | = | చంపుటకు |
| కర్తుమ్ | = | చేయుటకు | ఉద్యతాః | = | ఉద్యుక్తులమైతిమో (అట్టి మహాపాతకమునకు ఒడిగట్టితిమి) |
| వ్యవసితాః | = | సిద్ధమైతిమి | | | |

అయ్యో! మనము బుద్ధిమంతులమైయుండియు రాజ్యసుఖలోభముచే స్వజనులనే సంహరించుటకు ఉద్యుక్తులమై ఈ ఘోరపాపకృత్యములకు ఒడిగట్టుచున్నాము- ఇది యెంత దారుణము? (45)

**యది మామప్రతీకారమశస్త్రం శస్త్రపాణయః ।**
**ధార్తరాష్ట్రా రణే హన్యుః తన్మే క్షేమతరం భవేత్ ॥ 46 ॥**

యది, మామ్, అప్రతీకారమ్, అశస్త్రమ్, శస్త్రపాణయః,
ధార్తరాష్ట్రాః, రణే, హన్యుః, తత్, మే, క్షేమతరమ్, భవేత్ ॥ 46 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| యది | = | ఒకవేళ | ధార్తరాష్ట్రాః | = | ధార్తరాష్ట్రులు |
| అశస్త్రమ్ | = | శస్త్రములను త్యజించినట్టి | రణే | = | సమరమునందు |
| | | | హన్యుః | = | చంపినవారైనను (చంపినను) |
| అప్రతీకారమ్ | = | ప్రతీకారమును చేయనట్టి | తత్, మే | = | అది నాకు |
| మామ్ | = | నన్ను | క్షేమతరమ్ | = | శ్రేయస్కరమే |
| శస్త్రపాణయః | = | శస్త్రములను చేబూనిన | భవేత్ | = | అగును |

శస్త్రరహితుడనై, ఎదిరింపని నన్ను శస్త్రములను చేబూని ధార్తరాష్ట్రులు యుద్ధమున వధించినను, అది నాకు మిక్కిలి క్షేమకరమే యగును. (46)

### *సంజయ ఉవాచ*

**ఏవముక్త్వార్జునః సంఖ్యే రథోపస్థ ఉపావిశత్ ।**
**విసృజ్య సశరం చాపం శోకసంవిగ్నమానసః ॥ 47 ॥**

ఏవమ్, ఉక్త్వా, అర్జునః, సంఖ్యే, రథోపస్థే, ఉపావిశత్,
విసృజ్య, సశరమ్, చాపమ్, శోకసంవిగ్నమానసః ॥ 47 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| సంఖ్యే | = | రణభూమియందు | చాపమ్ | = | ధనుస్సును |
| శోకసంవిగ్నమానసః | = | శోకాకులమనస్కుడైన | విసృజ్య | = | విసర్జించి |
| అర్జునః | = | అర్జునుడు | రథోపస్థే | = | రథముయొక్క వెనుకభాగమున |
| ఏవమ్ | = | ఇట్లు | | | |
| ఉక్త్వా | = | పలికి | | | |
| సశరమ్ | = | బాణములతో గూడిన | ఉపావిశత్ | = | చతికిలబడెను. |

సంజయుడు పలికెను - అర్జునుడు ఈ విధముగా పలికి శోకసంవిగ్నమానసుడై, యుద్ధభూమి యందు ధనుర్బాణములను త్యజించి, రథము వెనుకభాగమున చతికిలబడెను. (47)

*ఓం తత్సదితి శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే*
*శ్రీకృష్ణార్జునసంవాదే అర్జునవిషాదయోగోనామ ప్రథమోఽధ్యాయః ॥ ౧ ॥*

॥ ఓం శ్రీపరమాత్మనే నమః ॥

# అథ ద్వితీయోఽధ్యాయః - సాంఖ్యయోగః

## (రెండవ అధ్యాయము - సాంఖ్యయోగము)

ముఖ్యాంశములు : [(1 నుండి 10వ శ్లోకమువఱకు) అర్జునుని యుద్ధవైముఖ్య విషయమున శ్రీకృష్ణార్జున సంవాదము - (11 నుండి 30 వఱకు) సాంఖ్యయోగ వివరణము - (31 నుండి 38 వఱకు) క్షాత్రధర్మమును అనుసరించి యుద్ధాచరణముయొక్క ఆవశ్యకస్థితి నిరూపణము - (39 నుండి 53 వఱకు) నిష్కామ కర్మయోగ వివరణము, (54 నుండి 72 వఱకు) స్థితప్రజ్ఞుని లక్షణములు, మహత్త్వము.]

**సంజయ ఉవాచ**

**తం తథా కృపయావిష్టమ్ అశ్రుపూర్ణాకులేక్షణమ్ ।**
**విషీదంతమిదం వాక్యమ్ ఉవాచ మధుసూదనః ॥ 1 ॥**

తమ్, తథా, కృపయా, ఆవిష్టమ్, అశ్రుపూర్ణాకులేక్షణమ్,
విషీదంతమ్, ఇదమ్, వాక్యమ్, ఉవాచ, మధుసూదనః ॥ 1 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| తథా | = | ఆ విధముగా | విషీదంతమ్ | = | శోకించుచున్నవాడును - అగు |
| కృపయా, ఆవిష్టమ్ | = | కరుణతో నిండినవాడును | తమ్ | = | ఆ అర్జునుని గూర్చి |
| అశ్రుపూర్ణాకులేక్షణమ్ | = | అశ్రుపూర్ణములై, వ్యాకులపాటుతో గూడిన నేత్రములుగలవాడును | మధుసూదనః | = | శ్రీకృష్ణుడు |
| | | | ఇదమ్ వాక్యమ్ | = | ఈ వాక్యమును |
| | | | ఉవాచ | = | పలికెను. |

సంజయుడు పలికెను- ఈ విధముగా కరుణాపూరితహృదయుడైన అర్జునుని కనులలో అశ్రువులు నిండియుండెను. అవి అతని వ్యాకులపాటును, శోకమును తెలుపుచుండెను. అట్టి అర్జునునితో శ్రీకృష్ణభగవానుడు ఇట్లనెను. (1)

**శ్రీభగవాన్ ఉవాచ**

**కుతస్త్వా కశ్మలమిదం విషమే సముపస్థితమ్ ।**
**అనార్యజుష్టమస్వర్గ్యమ్ అకీర్తికరమర్జున ॥ 2 ॥**

కుతః, త్వా, కశ్మలమ్, ఇదమ్, విషమే, సముపస్థితమ్,
అనార్యజుష్టమ్, అస్వర్గ్యమ్, అకీర్తికరమ్, అర్జున ॥ 2 ॥

| | | | |
|---|---|---|---|
| అర్జున | = ఓ అర్జునా! | అనార్యజుష్టమ్ | = శ్రేష్ఠులచే ఆచరింప బడునదియుకాదు |
| విషమే | = తగనిసమయమున | అస్వర్గ్యమ్ | = స్వర్గమును ఇచ్చునదియు కాదు |
| ఇదమ్ కశ్మలమ్ | = ఇట్టి మోహము | అకీర్తికరమ్ | = కీర్తిని కలిగించు నదియు కాదు. |
| త్వా, కుతః | = నీకు ఎట్లు | | |
| సముపస్థితమ్ | = దాపురించినది? | | |
| (యతః) | = ఏలనన, ఇది | | |

శ్రీభగవానుడు ఇట్లనెను - ఓ అర్జునా! తగనిసమయములో ఈ మోహము నీకు ఎట్లు దాపురించినది? ఇది శ్రేష్ఠులచే ఆచరింపబడునదియు కాదు, స్వర్గమును ఇచ్చునదియు కాదు, కీర్తిని కలిగించునదియు కాదు. (2)

**క్లైబ్యం మా స్మ గమః పార్థ నైతత్త్వయ్యుపపద్యతే ।**
**క్షుద్రం హృదయదౌర్బల్యం త్యక్త్వోత్తిష్ఠ పరంతప ॥ 3 ॥**

క్లైబ్యమ్, మా, స్మ, గమః, పార్థ, న, ఏతత్, త్వయి, ఉపపద్యతే,
క్షుద్రమ్, హృదయదౌర్బల్యమ్, త్యక్త్వా, ఉత్తిష్ఠ, పరంతప ॥ 3 ॥

| | | | |
|---|---|---|---|
| పార్థ! | = ఓ అర్జునా! | పరంతప | = ఓ పరంతపా! |
| క్లైబ్యమ్ | = నపుంసకత్వమును (పిరికితనమును) | క్షుద్రమ్ | = తుచ్ఛమైన |
| మా, స్మ, గమః | = పొందవద్దు | హృదయ దౌర్బల్యమ్ | = హృదయ దౌర్బల్యమును |
| త్వయి | = నీ యందు (నీకు) | త్యక్త్వా | = త్యజించి |
| ఏతత్ | = ఇది (ఈపిరికితనము) | ఉత్తిష్ఠ | = లెమ్ము (యుద్ధమునకై నడుము బిగింపుము). |
| న, ఉపపద్యతే | = కలుగరాదు (తగదు) | | |

కావున, ఓ అర్జునా! పిరికితనమునకు లోనుకావద్దు. నీకిది ఉచితము కాదు. ఓ పరంతపా! తుచ్ఛమైన ఈ హృదయదౌర్బల్యమును వీడి, యుద్ధమునకై నడుము బిగింపుము. (3)

### అర్జున ఉవాచ

**కథం భీష్మమహం సంఖ్యే ద్రోణం చ మధుసూదన ।**
**ఇషుభిః ప్రతియోత్స్యామి పూజార్హావరిసూదన ॥ 4 ॥**

కథమ్, భీష్మమ్, అహమ్, సంఖ్యే, ద్రోణమ్, చ, మధుసూదన,
ఇషుభిః, ప్రతియోత్స్యామి, పూజార్హౌ, అరిసూదన ॥ 4 ॥

| | | | |
|---|---|---|---|
| మధుసూదన | = ఓ మధుసూదనా! | ద్రోణమ్ | = ద్రోణాచార్యుని |
| అహమ్ | = నేను | ప్రతియోత్స్యామి | = ఎదుర్కొని పోరాడగలను? |
| సంఖ్యే | = రణమునందు | (యతః) | = ఏలననగా |
| కథమ్ | = ఏ విధముగా | అరిసూదన | = ఓ అరిసూదనా! |
| ఇషుభిః | = బాణములతో | (తౌ) | = ఆ ఇద్దఱును |
| భీష్మమ్ | = భీష్మపితామహుని | పూజార్హౌ | = (నాకు) పూజింప దగినవారు |
| చ | = మఱియు | | |

అర్జునుడు పలికెను- ఓ మధుసూదనా! పూజ్యులైన భీష్మపితామహుని, ద్రోణాచార్యులను యుద్ధమున ఎదిరించి బాణములతో ఎట్లు పోరాడగలను? ఏలనన ఓ అరిసూదనా! ఆ ఇరువురును నాకు పూజ్యులు. (4)

**గురూనహత్వా హి మహానుభావాన్**
**శ్రేయో భోక్తుం భైక్ష్యమపీహ లోకే ।**
**హత్వార్థకామాంస్తు గురూనిహైవ**
**భుంజీయ భోగాన్ రుధిరప్రదిగ్ధాన్ ॥ 5 ॥**

గురూన్, అహత్వా, హి, మహానుభావాన్, శ్రేయః, భోక్తుమ్,
భైక్ష్యమ్, అపి, ఇహ, లోకే హత్వా, అర్థకామాన్, తు, గురూన్,
ఇహ, ఏవ, భుంజీయ, భోగాన్, రుధిరప్రదిగ్ధాన్ ॥ 5 ॥

| | | | |
|---|---|---|---|
| మహానుభావాన్ | = మహానుభావులైన | హి | = ఎందులకనగా |
| గురూన్ | = గురువులను | గురూన్ | = గురుజనులను |
| అహత్వా | = చంపక | హత్వా (అపి) | = చంపి ఐనను |
| ఇహ లోకే | = (నేను) ఈలోకమున | ఇహ | = ఈ లోకమున |
| భైక్ష్యమ్ అపి | = భిక్షాన్నమును ఐనను | రుధిరప్రదిగ్ధాన్ | = రక్తసిక్తమైన |
| | | అర్థకామాన్ | = అర్థకామరూపములైన |
| భోక్తుమ్ | = తినుటకు (తినుట) | భోగాన్, ఏవ, తు, | = భోగములనే |
| శ్రేయః | = శ్రేయస్కరము (అని భావింతును) | భుంజీయ | = అనుభవింపవలసి యుండును గదా! |

మహానుభావులైన ఈ గురుజనులను చంపకుండా బిచ్చమెత్తుకొనియైనను ఈ లోకమున జీవించుట నాకు శ్రేయస్కరమే. ఏలనన ఈ గురుజనులను

చంపినను, రక్తసిక్తములైన రాజ్యసంపదలను, భోగములను మాత్రమే నేను అనుభవింపవలసి యుండునుగదా! (5)

**న చైతద్విద్మః కతరన్నో గరీయో**
**యద్వా జయేమ యది వా నో జయేయుః ।**
**యానేవ హత్వా న జిజీవిషామః**
**తేఽవస్థితాః ప్రముఖే ధార్తరాష్ట్రాః ॥ 6 ॥**

న, చ, ఏతత్, విద్మః, కతరత్, నః, గరీయః, యత్, వా, జయేమ, యది, వా, నః, జయేయుః,
యాన్, ఏవ, హత్వా, న, జిజీవిషామః, తే, అవస్థితాః, ప్రముఖే, ధార్తరాష్ట్రాః ॥ 6 ॥

ఏతత్ చ = ఇదియును
న, విద్మః = ఎఱుగము
నః = మనకు (యుద్ధము) చేయుట, చేయకుండుట అను)
కతరత్ = రెండింటిలో ఏది
గరీయః = శ్రేష్ఠము
యత్, వా = మఱియు (దీనినిగూడ ఎఱుగము)
జయేమ = వారిని మనము జయించెదమా ?
యది, వా = లేక
నః = మనలను
జయేయుః = వారు జయింతురా?
యాన్ హత్వా = ఎవరిని చంపి (మేము)
న, జిజీవిషామః = జీవించుటకును ఇష్టపడము
తే ఏవ = వారే (ఆ ఆత్మీయులే)
ధార్తరాష్ట్రాః = ధార్తరాష్ట్రులు
ప్రముఖే = (మన) ఎట్టయెదుట
అవస్థితాః = నిలిచియున్నారు.

ఈ యుద్ధముచేయుట శ్రేష్ఠమా? లేక చేయకుండుట శ్రేష్ఠమా? అనునది ఎఱుగము. యుద్ధమున వారిని మనము జయింతుమా? లేక మనలను వారు జయింతురా? అను విషయమునుగూడ ఎఱుగము. మనకు ఆత్మీయులైన ధార్తరాష్ట్రులే ఇచట మనలను ఎదిరించి (పోరాడుటకు) నిలిచియున్నారు. వారిని చంపి, జీవించుటకును మనము ఇష్టపడము. (6)

**కార్పణ్యదోషోపహతస్వభావః**
**పృచ్ఛామి త్వాం ధర్మసమ్మూఢచేతాః ।**
**యచ్ఛ్రేయః స్యాన్నిశ్చితం బ్రూహి తన్మే**
**శిష్యస్తేఽహం శాధి మాం త్వాం ప్రపన్నమ్ ॥ 7 ॥**

కార్పణ్యదోషోపహతస్వభావః, పృచ్ఛామి, త్వామ్, ధర్మసమ్మూఢచేతాః,
యత్, శ్రేయః, స్యాత్, నిశ్చితమ్, బ్రూహి, తత్, మే,
శిష్యః, తే, అహమ్, శాధి, మామ్, త్వామ్, ప్రపన్నమ్ ॥ 7 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| కార్పణ్యదోషోపహతస్వభావః | = | పిరికితనమనెడి దోషమునకులోనైన స్వభావముకలిగినవాడనై | తత్ | = | దానిని |
| | | | మే | = | నాకు |
| | | | బ్రూహి | = | తెలుపుము |
| ధర్మ సమ్మూఢచేతాః | = | ధర్మవిషయమున మూఢచిత్తుడనై | అహమ్ | = | (ఏలనన) నేను |
| | | | తే | = | నీకు |
| త్వామ్ | = | నిన్ను | శిష్యః | = | శిష్యుడను |
| పృచ్ఛామి | = | అడుగుచున్నాను | త్వామ్ | = | నిన్ను |
| యత్ | = | ఏ (ఏసాధన) | ప్రపన్నమ్ | = | శరణుపొందినవాడను |
| నిశ్చితమ్ | = | నిశ్చయముగా | మామ్ | = | (కనుక) నన్ను (నాకు) |
| శ్రేయః, స్యాత్ | = | మేలు అగునో? | శాధి | = | ఉపదేశింపుము. |

కార్పణ్యదోషము (పిరికితనము)నకు లోనై నా స్వభావమును కోల్పోయి గిలగిలలాడుచున్నాను. ధర్మాధర్మముల విచక్షణకు దూరమై నా కర్తవ్యమును నిర్ణయించుకొనలేకున్నాను. నాకు నిజముగా శ్రేయస్కరమైన దానిని తెలుపుము. నేను నీకు శిష్యుడను. శరణాగతుడను, ఉపదేశింపుము.

**న హి ప్రపశ్యామి మమాపనుద్యాత్**
**యచ్ఛోకముచ్ఛోషణమింద్రియాణామ్ ।**
**అవాప్య భూమావసపత్నమృద్ధం**
**రాజ్యం సురాణామపి చాధిపత్యమ్ ॥ 8 ॥**

న, హి, ప్రపశ్యామి, మమ, అపనుద్యాత్
యత్, శోకమ్, ఉచ్ఛోషణమ్, ఇంద్రియాణామ్,
అవాప్య, భూమౌ, అసపత్నమ్, ఋద్ధమ్
రాజ్యమ్, సురాణామ్, అపి, చ, ఆధిపత్యమ్ ॥ 8 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| హి | = | ఏలనన | ఋద్ధమ్ | = | ధనధాన్యసంపన్నమైన |
| భూమౌ | = | భూమియందు | రాజ్యమ్ చ | = | రాజ్యమును |
| అసపత్నమ్ | = | నిష్కంటకమైన | సురాణామ్ | = | దేవతలయొక్క |

| | | |
|---|---|---|
| ఆధిపత్యమ్ | = | ఆధిపత్యమును |
| అవాప్య, అపి | = | పొందియు |
| యత్ | = | ఏదైతే |
| మమ | = | నాయొక్క |
| ఇంద్రియాణామ్ | = | ఇంద్రియములయొక్క (ఇంద్రియములను) |
| ఉచ్ఛోషణమ్ | = | శుష్కింపజేయునట్టి |
| శోకమ్ | = | శోకమును |
| అపనుద్యాత్ | = | దూరము చేయగలదో |
| (తత్), | = | దానిని (ఆ ఉపాయమును) |
| న, ప్రపశ్యామి | = | చూడకున్నాను. |

ఈ శోకము నా ఇంద్రియములను దహించివేయుచున్నది. సిరిసంపదలతో గూడిన తిరుగులేని రాజ్యాధికారము లభించినను, కడకు సురాధిపత్యము ప్రాప్తించినను ఈ శోకదాహము చల్లారునుపాయమును గాంచలేకున్నాను. (8)

**సంజయ ఉవాచ**

**ఏవముక్త్వా హృషీకేశం గుడాకేశః పరంతప ।**
**న యోత్స్య ఇతి గోవిందముక్త్వా తూష్ణీం బభూవ హ ॥ 9 ॥**

ఏవమ్, ఉక్త్వా, హృషీకేశమ్, గుడాకేశః, పరంతప,
న, యోత్స్యే, ఇతి, గోవిందమ్, ఉక్త్వా, తూష్ణీమ్, బభూవ, హ ॥ 9 ॥

| | | |
|---|---|---|
| పరంతప | = | ఓ రాజా! (ఓ ధృతరాష్ట్రా!) |
| గుడాకేశః | = | అర్జునుడు |
| హృషీకేశమ్ | = | అంతర్యామియైన శ్రీ కృష్ణుని (తో) |
| ఏవమ్, ఉక్త్వా | = | ఈ విధముగా పలికి |
| గోవిందమ్ | = | గోవిందుని ఉద్దేశించి |
| న,యోత్స్యే | = | "యుద్ధము చేయను" |
| ఇతి | = | అని |
| హ | = | స్పష్టముగా |
| ఉక్త్వా | = | పలికి |
| తూష్ణీమ్ బభూవ | = | మౌనము వహించెను. |

సంజయుడు పలికెను- ఓ రాజా! ఈ విధముగా పలికిన పిమ్మట అంతర్యామియైన శ్రీకృష్ణునితో గుడాకేశుడైన అర్జునుడు, "నేను యుద్ధము చేయనే చేయను" అని స్పష్టముగా నుడివి మౌనము వహించెను. (9)

**తమువాచ హృషీకేశః ప్రహసన్నివ భారత ।**
**సేనయోరుభయోర్మధ్యే విషీదంతమిదం వచః ॥ 10 ॥**

తమ్, ఉవాచ, హృషీకేశః, ప్రహసన్, ఇవ, భారత,
సేనయోః, ఉభయోః, మధ్యే, విషీదంతమ్, ఇదమ్, వచః ॥ 10 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| భారత | = | ఓ ధృతరాష్ట్రా! | తమ్ | = | ఆతనిని (ఆ అర్జునునితో) |
| హృషీకేశః | = | అంతర్యామియైన శ్రీకృష్ణ భగవానుడు | ప్రహసన్, ఇవ | = | మందహాసముతో |
| ఉభయోః సేనయోః మధ్యే | = | ఉభయసేనల మధ్యభాగమున | ఇదమ్ | = | ఈ |
| | | | వచః | = | వచనమును (మాటలను) |
| విషీదంతమ్ | = | శోకముతో పరితపించుచున్న | ఉవాచ | = | పలికెను. |

ఓ ధృతరాష్ట్రా! ఉభయసేనల మధ్య శోకసంతప్తుడైన అర్జునుని జూచి, శ్రీకృష్ణుడు మందహాసముతో ఇట్లు పలికెను. (10)

**శ్రీభగవాన్ ఉవాచ**

**అశోచ్యానన్వశోచస్త్వం ప్రజ్ఞావాదాంశ్చ భాషసే ।**
**గతాసూనగతాసూంశ్చ నానుశోచంతి పండితాః ॥ 11 ॥**

అశోచ్యాన్, అన్వశోచః, త్వమ్, ప్రజ్ఞావాదాన్, చ, భాషసే,
గతాసూన్, అగతాసూన్, చ, న, అనుశోచంతి, పండితాః ॥ 11 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| త్వమ్ | = | నీవు | గతాసూన్ | = | ప్రాణములుపోయిన వారిని గూర్చియు |
| అశోచ్యాన్ | = | శోకింపదగనివారిని గూర్చి | చ | = | మఱియు |
| అన్వశోచః | = | శోకించుచున్నావు | అగతాసూన్ | = | ప్రాణములు పోనివారిని గూర్చియు |
| చ | = | మఱియు | | | |
| ప్రజ్ఞావాదాన్ | = | ప్రజ్ఞావంతులవలె | పండితాః | = | పండితులు |
| భాషసే | = | పలుకుచున్నావు (కాని) | న, అనుశోచంతి | = | శోకింపరు. |

శ్రీభగవానుడు పలికెను-

ఓ అర్జునా! శోకింపదగని వారికొఱకై నీవు శోకించుచున్నావు. పైగా పండితుని (జ్ఞాని)వలె మాట్లాడుచున్నావు. పండితులైనవారు ప్రాణములుపోయిన వారిని గూర్చిగాని, ప్రాణములుపోని వారిని గుఱించిగాని శోకింపరు. (11)

**న త్వేవాహం జాతు నాసం న త్వం నేమే జనాధిపాః ।**
**న చైవ న భవిష్యామః సర్వే వయమతః పరమ్ ॥ 12 ॥**

న, తు, ఏవ, అహమ్, జాతు, న, ఆసమ్, న, త్వమ్, న, ఇమే, జనాధిపాః,
న, చ, ఏవ, న, భవిష్యామః, సర్వే, వయమ్, అతః, పరమ్ ॥ 12 ॥

| | | | |
|---|---|---|---|
| అహమ్ | = నేను | జనాధిపాః | = రాజులు |
| జాతు | = ఒకప్పుడును | న (ఆసన్) | = 'లేరనునది'యును లేదు |
| న, ఆసమ్ | = లేను-అనునది | చ | = మరియు |
| న, తు, ఏవ | = లేనేలేదు | అతః, పరమ్ | = ఇకమీదట |
| త్వమ్ | = నీవు | వయమ్, సర్వే | = మనము అందఱము |
| న (ఆసీః) | = "లేవు-అనునది"లేదు | న, భవిష్యామః | = "లేకపోవుట" యనునది |
| ఇమే | = ఈ | న, ఏవ | = లేనే లేదు |

నీవుగాని, నేనుగాని, ఈ రాజులుగాని ఉండని కాలమే లేదు. ఇక ముందు కూడ మనము ఉండము అనుమాటయే లేదు. (అన్ని కాలములలోను మనము ఉన్నాము. ఆత్మ శాశ్వతము. అది అన్ని కాలములయందును ఉండును. శరీరపతనముతో అది నశించునది కాదు.) (12)

**దేహినోఽస్మిన్ యథా దేహే కౌమారం యౌవనం జరా ।**
**తథా దేహాంతరప్రాప్తిః ధీరస్తత్ర న ముహ్యతి ॥ 13 ॥**

దేహినః, అస్మిన్, యథా, దేహే, కౌమారమ్, యౌవనమ్, జరా,
తథా, దేహాంతరప్రాప్తిః, ధీరః, తత్ర, న, ముహ్యతి ॥ 13 ॥

| | | | |
|---|---|---|---|
| యథా | = ఎట్లయితే | తథా | = అట్లే |
| దేహినః | = జీవాత్మకు | దేహాంతరప్రాప్తిః | = మఱియొక దేహము ప్రాప్తించుటయు (కల్గును) |
| అస్మిన్, దేహే | = ఈ దేహమునందు | | |
| కౌమారమ్ | = కౌమారము (బాల్యము) | తత్ర | = ఆ విషయమున |
| యౌవనమ్ | = యౌవనము | ధీరః | = ధీరుడైనవాడు |
| జరా | = ముసలితనము (కలవో) | న, ముహ్యతి | = మోహమునకు గురికాడు. |

జీవాత్మకు ఈ దేహమునందు కౌమారము, యౌవనము, వార్ధక్యము ఉన్నట్లే మఱియొక దేహప్రాప్తియు కలుగును. ధీరుడైనవాడు ఈ విషయమున మోహితుడు కాడు. (13)

**మాత్రాస్పర్శాస్తు కౌంతేయ శీతోష్ణసుఖదుఃఖదాః ।**
**ఆగమాపాయినోఽనిత్యాః తాంస్తితిక్షస్వ భారత ॥ 14 ॥**

మాత్రాస్పర్శాః, తు, కౌంతేయ, శీతోష్ణసుఖదుఃఖదాః,
ఆగమాపాయినః అనిత్యాః, తాన్, తితిక్షస్వ, భారత ॥ 14 ॥

| | | | |
|---|---|---|---|
| కౌంతేయ | = ఓ కుంతీపుత్రా! | | (మఱియు) |
| శీతోష్ణసుఖ దుఃఖదాః | = శీతోష్ణములను, సుఖదుఃఖములను కల్గించునవియైన | అనిత్యాః | = అనిత్యములు |
| | | భారత | = (కావున) భారతా! (అర్జునా!) |
| మాత్రాస్పర్శాః, తు | = విషయేంద్రియ సంయోగములయితే | తాన్ | = వాటిని (ఆ ద్వంద్వములను) |
| ఆగమాపాయినః | = ఉత్పత్తి వినాశశీలములు | తితిక్షస్వ | = సహింపుము. |

ఓ కౌంతేయా! విషయేంద్రియసంయోగమువలన శీతోష్ణములు, సుఖదుఃఖములు కలుగుచున్నవి. అవి ఉత్పత్తి వినాశశీలములు. అనిత్యములు. కనుక భారతా! వాటిని సహింపుము. (పట్టించుకొనకుము) (14)

**యం హి న వ్యథయంత్యేతే పురుషం పురుషర్షభ ।**
**సమదుఃఖసుఖం ధీరం సోఽమృతత్వాయ కల్పతే ॥ 15 ॥**

యమ్, హి, న, వ్యథయంతి, ఏతే, పురుషమ్, పురుషర్షభ,
సమదుఃఖసుఖమ్, ధీరమ్, సః, అమృతత్వాయ, కల్పతే ॥ 15 ॥

| | | | |
|---|---|---|---|
| హి | = ఏలనన | ఏతే | = ఇవి (విషయేంద్రియ సంయోగములు) |
| పురుషర్షభ | = ఓ పురుషశ్రేష్ఠా! | | |
| సమదుఃఖసుఖమ్ | = సుఖదుఃఖములను సమానముగా చూచునట్టి | న, వ్యథయంతి | = వ్యాకులపఱచవో |
| | | సః | = అతడు |
| యమ్, ధీరమ్ పురుషమ్ | = ఏ ధీరుడైన పురుషుని | అమృతత్వాయ | = మోక్షముకొఱకు |
| | | కల్పతే | = యోగ్యుడగును. |

ఏలనన, ఓ పురుషశ్రేష్ఠా! ధీరుడైనవాడు సుఖదుఃఖములను సమానముగా చూచును. అట్టి పురుషుని విషయేంద్రియసంయోగములు చలింపజేయజాలవు. అతడే మోక్షమును పొందుటకు అర్హుడు. (15)

**నాసతో విద్యతే భావో నాభావో విద్యతే సతః ।**
**ఉభయోరపి దృష్టోఽంతః త్వనయోస్తత్త్వదర్శిభిః ॥ 16 ॥**

న, అసతః, విద్యతే, భావః, న, అభావః, విద్యతే, సతః,
ఉభయోః, అపి, దృష్టః, అంతః, తు, అనయోః, తత్త్వదర్శిభిః ॥ 16 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| అసతః | = | అసద్వస్తువునకు (లేనిదానికి) | న, విద్యతే | = | లేదు |
| భావః | = | ఉనికి | అనయోః<br>ఉభయోః, అపి | = | ఈ రెండింటి యొక్కయు |
| న విద్యతే | = | లేదు | అంతః | = | తత్త్వము |
| తు | = | అయితే | తత్త్వదర్శిభిః | = | తత్త్వజ్ఞానులచేత |
| సతః | = | సద్వస్తువునకు (ఉన్నదానికి) | దృష్టః | = | చూడబడినది (తెలిసికొనబడినది). |
| అభావః | = | లేమి (లేకుండుట) | | | |

అసత్తు అనుదానికి (అనిత్యమైనదానికి) ఉనికియే లేదు. సత్తు అనుదానికి లేమి లేదు. ఈ విధముగ ఈ రెండింటియొక్క వాస్తవస్వరూపములను తత్త్వజ్ఞానియైనవాడే ఎఱుంగును. (16)

**అవినాశి తు తద్విద్ధి యేన సర్వమిదం తతమ్ ।**
**వినాశమవ్యయస్యాస్య న కశ్చిత్ కర్తుమర్హతి ॥ 17 ॥**

అవినాశి, తు, తత్, విద్ధి, యేన, సర్వమ్, ఇదమ్, తతమ్,
వినాశమ్, అవ్యయస్య, అస్య, న, కశ్చిత్, కర్తుమ్, అర్హతి ॥ 17 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| అవినాశి | = | నాశరహితమైన | అస్య<br>అవ్యయస్య | = | శాశ్వతమైన దానియొక్క (ఆత్మయొక్క) |
| తత్, విద్ధి | = | దానిని తెలిసికొనుము | | | |
| యేన, తు | = | దేనిచేనైతే | వినాశమ్ | = | వినాశమును |
| ఇదమ్, సర్వమ్ | = | ఈ జగత్తంతయు (దృశ్యవర్గము) | కర్తుమ్ | = | చేయుటకు |
| | | | కశ్చిత్ | = | ఎవ్వడును |
| తతమ్ | = | వ్యాప్తమైయున్నదో | న, అర్హతి | = | సమర్థుడు కాడు. |

నాశరహితమైన ఆ సత్యము (పరమాత్మ తత్త్వము) జగత్తునందు అంతటను వ్యాపించియున్నదని యెరుంగుము. శాశ్వతమైన దానినెవ్వరును నశింపజేయజాలరు. (17)

**అంతవంత ఇమే దేహా నిత్యస్యోక్తాః శరీరిణః ।**
**అనాశినోఽప్రమేయస్య తస్మాద్యుధ్యస్వ భారత ॥ 18 ॥**

అంతవంతః, ఇమే, దేహాః, నిత్యస్య, ఉక్తాః, శరీరిణః,
అనాశినః, అప్రమేయస్య, తస్మాత్, యుధ్యస్వ, భారత ॥ 18 ॥

| | | | |
|---|---|---|---|
| భారత | = ఓ అర్జునా! | ఇమే, దేహాః | = ఈ దేహములన్నియును |
| అనాశినః | = నాశరహితమైనదియు | అంతవంతః | = నశించునవి అని |
| అప్రమేయస్య | = అప్రమేయ (అనిర్వచనీయ) మైనదియు | ఉక్తాః | = చెప్పబడినవి |
| నిత్యస్య | = శాశ్వతమైనదియు అగు | తస్మాత్ | = అందువలన |
| శరీరిణః | = జీవాత్మయొక్క | యుధ్యస్వ | = యుద్ధమొనరింపుము. |

ఈ శరీరములు అన్నియును నశించునవియే. కాని జీవాత్మ నాశరహితము, అప్రమేయము (అనిర్వచనీయము). నిత్యము. కనుక (ఈ విషయమును ఎఱింగి) ఓ భరతవంశీ! అర్జునా! నీవు యుద్ధము చేయుము. (18)

**య ఏనం వేత్తి హంతారం యశ్చైనం మన్యతే హతమ్ ।**
**ఉభౌ తౌ న విజానీతో నాయం హంతి న హన్యతే ॥ 19 ॥**

యః, ఏనమ్, వేత్తి, హంతారమ్, యః, చ, ఏనమ్, మన్యతే, హతమ్,
ఉభౌ, తౌ, న, విజానీతః, న, అయమ్, హంతి, న, హన్యతే ॥ 19 ॥

| | | | |
|---|---|---|---|
| యః | = ఎవడైతే | తౌ, ఉభౌ | = ఆ, ఉభయులును |
| ఏనమ్ | = దీనిని (ఈ ఆత్మను) | న, విజానీతః | = తెలిసికొనినవారు (జ్ఞానులు) కారు (ఏలనన) |
| హంతారమ్ | = చంపునట్టి దానినిగా | | |
| వేత్తి | = భావించునో | | |
| చ | = అట్లే | అయమ్ | = ఇది (ఈ ఆత్మ) వాస్తవముగా |
| యః | = ఎవడయితే | | |
| ఏనమ్ | = దీనిని (ఈ ఆత్మను) | న, హంతి | = (ఎవ్వరినీ) చంపదు |
| హతమ్ | = చంపబడుదానినిగా | న, హన్యతే | = (ఎవ్వరిచేతను) చంపబడదు |
| మన్యతే | = భావించునో | | |

ఆత్మ ఇతరులను చంపునని భావించువాడును, అది (ఆత్మ) ఇతరులచే చంపబడునని భావించువాడును, ఆ ఇద్దఱును అజ్ఞానులే. ఏలనన వాస్తవముగా ఆత్మ ఎవ్వరినీ చంపదు, ఎవ్వరిచేతను చంపబడదు. (19)

**న జాయతే మ్రియతే వా కదాచిత్**
**నాయం భూత్వా భవితా వా న భూయః ।**
**అజో నిత్యః శాశ్వతోఽయం పురాణో**
**న హన్యతే హన్యమానే శరీరే ॥ 20 ॥**

న, జాయతే, మ్రియతే, వా, కదాచిత్, న, అయమ్, భూత్వా, భవితా, వా, న, భూయః,
అజః, నిత్యః, శాశ్వతః, అయమ్, పురాణః, న, హన్యతే, హన్యమానే, శరీరే ॥ 20 ॥

| | | | |
|---|---|---|---|
| అయమ్ | = ఇది (ఈ ఆత్మ) | అయమ్ | = ఇది (ఈ ఆత్మ) |
| కదాచిత్ | = ఏ కాలమునందైనను | అజః | = జన్మలేనిది |
| న, జాయతే | = జన్మింపదు | నిత్యః | = నిత్యమైనది |
| వా | = మఱియు | శాశ్వతః | = శాశ్వతమైనది |
| న, మ్రియతే | = మరణింపదు | పురాణః | = సనాతనమైనది |
| వా | = అట్లే | శరీరే | = శరీరము |
| భూత్వా, భూయః, భవితా, న | = ఉత్పన్నమై, అస్తిత్వమును పొందునదియుకాదు (ఏలనన) | హన్యమానే | = చంపబడుచున్నను |
| | | న, హన్యతే | = (ఇది) చంపబడదు. |

ఈ ఆత్మ ఏ కాలమునందును పుట్టదు, గిట్టదు. పుట్టి ఉండునది కాదు. ఇది భావ వికారములు లేనిది (ఉత్పత్తి, అస్తిత్వము, వృద్ధి, విపరిణామము, అపక్షయము, వినాశము అను ఆఱును భావవికారములు) ఇది జన్మ లేనిది. నిత్యము, శాశ్వతము, పురాతనము. శరీరము చంపబడినను ఇది చావదు. (20)

**వేదావినాశినం నిత్యం య ఏనమజమవ్యయమ్ ।**
**కథం స పురుషః పార్థ కం ఘాతయతి హంతి కమ్ ॥ 21 ॥**

వేద, అవినాశినమ్, నిత్యమ్, యః, ఏనమ్, అజమ్, అవ్యయమ్,
కథమ్, సః, పురుషః, పార్థ, కమ్, ఘాతయతి, హంతి, కమ్ ॥ 21 ॥

| | | | |
|---|---|---|---|
| పార్థ | = ఓ అర్జునా! | నిత్యమ్ | = నిత్యమైనదానినిగా |
| యః, పురుషః | = ఏ పురుషుడు | అజమ్ | = జన్మలేనిదానినిగా |
| ఏనమ్ | = దీనిని (ఈ ఆత్మను) | అవ్యయమ్ | = మార్పులేనిదానినిగా |
| అవినాశినమ్ | = నాశరహితమైన దానినిగా | వేద | = తెలిసికొనునో |

| | | | |
|---|---|---|---|
| సః | = అతడు (ఆ పురుషుడు) | ఘాతయతి | = చంపించును |
| | | (కథమ్) | = ఎట్లు (ఏవిధముగా) |
| కథమ్ | = ఎట్లు (ఏవిధముగా) | కమ్ | = ఎవనిని |
| కమ్ | = ఎవనిని | హంతి | = చంపును? |

ఓ పార్థా! ఈ ఆత్మ నాశరహితము, నిత్యము అనియు, జననమరణములు లేనిదనియు, మార్పులేనిదనియు తెలిసికొనిన పురుషుడు ఎవరిని ఎట్లు చంపించును? ఎవరిని ఎట్లు చంపును? (21)

**వాసాంసి జీర్ణాని యథా విహాయ**
**నవాని గృహ్ణాతి నరోఽపరాణి ।**
**తథా శరీరాణి విహాయ జీర్ణా-**
**న్యన్యాని సంయాతి నవాని దేహీ ॥ 22 ॥**

వాసాంసి, జీర్ణాని, యథా, విహాయ, నవాని, గృహ్ణాతి, నరః, అపరాణి,
తథా, శరీరాణి, విహాయ, జీర్ణాని, అన్యాని, సంయాతి, నవాని, దేహీ ॥ 22 ॥

| | | | |
|---|---|---|---|
| యథా | = ఏ విధముగా | తథా | = అట్లే |
| నరః | = మానవుడు | దేహీ | = జీవాత్మ |
| జీర్ణాని | = జీర్ణమైనట్టి (ప్రాత) | జీర్ణాని | = ప్రాత |
| వాసాంసి | = వస్త్రములను | శరీరాణి | = శరీరములను |
| విహాయ | = త్యజించి | విహాయ | = వీడి |
| అపరాణి | = ఇతరములైన | | |
| నవాని | = నూతనములైనవానిని | అన్యాని | = ఇతరములైన |
| | (క్రొత్త వస్త్రములను) | నవాని | = క్రొత్తశరీరములను |
| గృహ్ణాతి | = గ్రహించునో | సంయాతి | = పొందును |

మానవుడు జీర్ణవస్త్రములను త్యజించి, నూతన వస్త్రములను ధరించినట్లు జీవాత్మ ప్రాతశరీరములను వీడి నూతనశరీరములను పొందును. (22)

**నైనం ఛిందంతి శస్త్రాణి నైనం దహతి పావకః ।**
**న చైనం క్లేదయంత్యాపో న శోషయతి మారుతః ॥ 23 ॥**

న, ఏనమ్, ఛిందంతి, శస్త్రాణి, న, ఏనమ్, దహతి, పావకః,
న, చ, ఏనమ్, క్లేదయంతి, ఆపః, న, శోషయతి, మారుతః ॥ 23 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| ఏనమ్ | = | దీనిని (ఈ ఆత్మను) | ఆపః | = | నీరు |
| శస్త్రాణి | = | శస్త్రములు | న, క్లేదయంతి | = | తడుపజాలదు |
| న, ఛిందంతి | = | ఛేదింపజాలవు | | | |
| ఏనమ్ | = | దీనిని | చ | = | మఱియు |
| పావకః | = | అగ్ని | మారుతః | = | గాలి |
| న, దహతి | = | దహింపజాలదు | న, శోషయతి | = | అరిపోవునట్లు చేయజాలదు. |
| ఏనమ్ | = | దీనిని | | | |

ఈ ఆత్మను శస్త్రములు ఛేదింపజాలవు. అగ్ని దహింపజాలదు. నీరు తడుపజాలదు. వాయువు ఆరిపోవునట్లు చేయజాలదు. (23)

**అచ్ఛేద్యోఽయమదాహ్యోఽయమ్ అక్లేద్యోఽశోష్య ఏవ చ ।**
**నిత్యః సర్వగతః స్థాణుః అచలోఽయం సనాతనః ॥ 24 ॥**

అచ్ఛేద్యః, అయమ్, అదాహ్యః, అయమ్, అక్లేద్యః, అశోష్యః, ఏవ, చ,
నిత్యః, సర్వగతః, స్థాణుః, అచలః, అయమ్, సనాతనః ॥ 24 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| అయమ్ | = | ఇది (ఈ ఆత్మ) | అశోష్యః | = | శోషింపజేయుటకు సాధ్యపడనిది |
| అచ్ఛేద్యః | = | ఛేదించుటకు సాధ్యముకానిది | అయమ్ | = | ఇది |
| అయమ్ | = | ఇది | నిత్యః | = | నిత్యమైనది |
| అదాహ్యః | = | దహింపవీలుకానిది | సర్వగతః | = | సర్వవ్యాపి |
| అక్లేద్యః | = | తడుపుటకు శక్యము కానిది | అచలః | = | చలింపనిది |
| | | | స్థాణుః | = | స్థిరముగా ఉండునది |
| చ | = | మఱియు | | | |
| ఏవ | = | నిస్సందేహముగా | సనాతనః | = | సనాతనమైనది. |

ఈ ఆత్మ ఛేదించుటకును, దహించుటకును, తడుపుటకును, శోషింపజేయుటకును సాధ్యము కానిది. ఇది నిత్యము. సర్వవ్యాపి, చలింపనిది. (అచలము). స్థాణువు (స్థిరమైనది). సనాతనము. (శాశ్వతము) (24)

**అవ్యక్తోఽయమచింత్యోఽయమ్ అవికార్యోఽయముచ్యతే ।**
**తస్మాదేవం విదిత్వైనం నానుశోచితుమర్హసి ॥ 25 ॥**

అవ్యక్తః, అయమ్, అచింత్యః, అయమ్, అవికార్యః, అయమ్, ఉచ్యతే,
తస్మాత్, ఏవమ్, విదిత్వా, ఏనమ్, న, అనుశోచితుమ్, అర్హసి ॥ 25 ॥

| | | | |
|---|---|---|---|
| అయమ్ | = ఇది(ఈ ఆత్మ) | తస్మాత్ | = అందువలన ఓ అర్జునా! |
| అవ్యక్తః | = వ్యక్తముకానిది (ఇంద్రియ గోచరము కానిది) | ఏనమ్ | = దీనిని (ఈ ఆత్మను) |
| అయమ్ | = ఇది | ఏవమ్ | = ఈ రీతిగా (ఇంత వఱకును తెల్పబడినట్లుగా) |
| అచింత్యః | = మనస్సునకును అందనిది | విదిత్వా | = ఎఱింగి |
| అయమ్ | = ఇది | అనుశోచితుమ్ | = శోకించుటకు |
| అవికార్యః | = వికారములులేనిది | న, అర్హసి | = అర్హుడవు కావు (అనగా శోకించుట ఉచితము కాదు) |
| ఉచ్యతే | = (అని) చెప్పబడుచున్నది | | |

ఈ ఆత్మ అవ్యక్తమైనది. (ఇంద్రియగోచరముగానిది) అచింత్యము (మనస్సునకును అందనిది.) వికారములు లేనిది. దీనిని గూర్చి ఇట్లు తెలిసికొనుము. కనుక ఓ అర్జునా! నీవు దీనికై శోకింపదగదు. (25)

**అథ చైనం నిత్యజాతం నిత్యం వా మన్యసే మృతమ్ ।**
**తథాపి త్వం మహాబాహో నైవం శోచితుమర్హసి ॥ 26 ॥**

అథ, చ, ఏనమ్, నిత్యజాతమ్, నిత్యమ్, వా, మన్యసే, మృతమ్,
తథాపి, త్వమ్, మహాబాహో, న, ఏవమ్, శోచితుమ్, అర్హసి ॥ 26 ॥

| | | | |
|---|---|---|---|
| మహాబాహో | = ఓ మహాబాహూ! | మృతమ్ | = మరణించునట్టిది |
| అథ, చ | = కాని ఒకవేళ | మన్యసే | = (అని) భావించినచో |
| త్వమ్ | = నీవు | తథాపి | = అట్లైనను |
| ఏనమ్ | = దీనిని (ఈ ఆత్మను) | ఏవమ్ | = ఈ విధముగా |
| నిత్యజాతమ్ | = సర్వదా జన్మించునట్టిది | శోచితుమ్ | = శోకించుటకు |
| వా | = అట్లే | న, అర్హసి | = అర్హుడవుకావు (శోకించుట తగదు). |
| నిత్యమ్ | = సతతము | | |

ఓ అర్జునా! ఈ ఆత్మకు జననమరణములు కలవని ఒకవేళ నీవు భావించినప్పటికిని దీనికై నీవు శోకింపదగదు. (26)

**జాతస్య హి ధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృతస్య చ ।**
**తస్మాదపరిహార్యేఽర్థే న త్వం శోచితుమర్హసి ॥ 27 ॥**

జాతస్య, హి, ధ్రువః, మృత్యుః, ధ్రువమ్, జన్మ, మృతస్య, చ,
తస్మాత్, అపరిహార్యే, అర్థే, న, త్వమ్, శోచితుమ్, అర్హసి ॥ 27 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| హి | = | ఏలనన (ఇట్లు భావించినచో) | తస్మాత్ | = | అందువలన |
| జాతస్య | = | పుట్టినవానికి | అపరిహార్యే | = | పరిహరించుటకు సాధ్యముకాని |
| మృత్యుః | = | మరణము | | | |
| ధ్రువః | = | నిశ్చయము (తప్పదు) | అర్థే | = | విషయమున |
| చ | = | మఱియు | త్వమ్ | = | నీవు |
| మృతస్య | = | మరణించినవానికి | శోచితుమ్ | = | శోకించుటకు |
| జన్మ | = | పుట్టుక | న, అర్హసి | = | అర్హుడవుకావు (శోకింపరాదు). |
| ధ్రువమ్ | = | నిశ్చితము(తప్పదు) | | | |

ఏలనన, పుట్టినవానికి మరణము తప్పదు. మరణించినవానికి పునర్జన్మ తప్పదు. కనుక అపరిహార్యములైన ఈ విషయములయందు నీవు శోకింపదగదు. (27)

**అవ్యక్తాదీని భూతాని వ్యక్తమధ్యాని భారత ।**
**అవ్యక్తనిధనాన్యేవ తత్ర కా పరిదేవనా ॥ 28 ॥**

అవ్యక్తాదీని, భూతాని, వ్యక్తమధ్యాని, భారత,
అవ్యక్తనిధనాని, ఏవ, తత్ర, కా, పరిదేవనా ॥ 28 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| భారత | = | ఓ భారతా! (ఓ అర్జునా!) | వ్యక్తమధ్యాని | = | (కేవలము)జనన మరణముల మధ్యకాలమున మాత్రమే ప్రకటితములు (ఇంద్రియ గోచరములు) |
| భూతాని | = | ప్రాణులన్నియును | | | |
| అవ్యక్తాదీని | = | పుట్టుటకుముందు అవ్యక్త (అప్రకటిత)ములు | తత్ర | = | ఇట్టి స్థితియందు |
| అవ్యక్తనిధనాని, ఏవ | = | మరణించిన పిమ్మట గూడ అవ్యక్తములే | కా, పరిదేవనా | = | శోకించుట ఎందులకు? (శోకించుట వ్యర్థము) |

ఓ అర్జునా! ప్రాణులన్నియును పుట్టుకకుముందు ఇంద్రియగోచరములు గావు- (అవ్యక్తములు) మరణానంతరముగూడ అవి అవ్యక్తములే- ఈ జననమరణముల మధ్యకాలమునందు మాత్రమే అవి ప్రకటితములు (ఇంద్రియ గోచరములు) అగుచుండును. ఇట్టి స్థితిలో వాటికై పరితపించుట నిష్ప్రయోజనము. (28)

**ఆశ్చర్యవత్పశ్యతి కశ్చిదేనమ్**
**ఆశ్చర్యవద్వదతి తథైవ చాన్యః ।**
**ఆశ్చర్య వచ్చైనమన్యః శృణోతి**
**శ్రుత్వాప్యేవం వేద న చైవ కశ్చిత్ ॥ 29 ॥**

ఆశ్చర్యవత్, పశ్యతి, కశ్చిత్, ఏనమ్, ఆశ్చర్యవత్, వదతి, తథా, ఏవ, చ, అన్యః,
ఆశ్చర్యవత్, చ, ఏనమ్, అన్యః, శృణోతి, శ్రుత్వా, అపి, ఏనమ్, వేద, న, చ, ఏవ, కశ్చిత్ ॥ 29 ॥

| | | | |
|---|---|---|---|
| కశ్చిత్ | = ఎవరో ఒకమహా పురుషుడే | చ | = అట్లే |
| ఏనమ్ | = దీనిని (ఈ ఆత్మను) | అన్యః | = మఱియొకడు (యోగ్యుడైనవాడే) |
| ఆశ్చర్యవత్ | = ఆశ్చర్యమైనదానినిగా | ఏనమ్ | = దీనిని (ఈ ఆత్మను) |
| పశ్యతి | = చూచును | ఆశ్చర్యవత్ | = ఆశ్చర్యముగా |
| చ | = మఱియు | శృణోతి | = వినును |
| తథా, ఏవ | = అట్లే | చ | = మఱియు |
| అన్యః | = మఱియొక మహాపురుషుడు | కశ్చిత్ | = ఒక్కొక్కడు |
| ఆశ్చర్యవత్ | = (దీని తత్త్వమును) ఆశ్చర్యకరముగా | శ్రుత్వా, అపి | = విన్నప్పటికిని |
| | | ఏనమ్ | = దీనిని |
| వదతి | = చెప్పును (వర్ణించును) | న, ఏవ, వేద | = తెలిసికొనజాలడు. |

ఎవరో ఒక మహాపురుషుడు మాత్రమే దీనిని (ఈ ఆత్మను) ఆశ్చర్యకరమైన దానినిగా చూచును. మరియొక మహాత్ముడు దీని తత్త్వమును ఆశ్చర్యకరముగా వర్ణించును. వేఱొక పురుషుడు దీనిని ఆశ్చర్యకరమైన దానినిగా వినును. ఆ విన్నవారిలోకూడ కొందరు దీనినిగూర్చి ఏమియు ఎఱుగరు. (29)

**దేహీ నిత్యమవధ్యోఽయం దేహే సర్వస్య భారత ।**
**తస్మాత్ సర్వాణి భూతాని న త్వం శోచితుమర్హసి ॥ 30 ॥**

దేహీ, నిత్యమ్, అవధ్యః, అయమ్, దేహే, సర్వస్య, భారత,
తస్మాత్, సర్వాణి, భూతాని, న, త్వమ్ శోచితుమ్, అర్హసి ॥ 30 ॥

| | | | |
|---|---|---|---|
| భారత | = ఓ అర్జునా! | సర్వస్య | = ప్రతిప్రాణియొక్క |
| అయమ్, దేహీ | = ఈ ఆత్మ | దేహే | = దేహమునందు |

నిత్యమ్ = ఎల్లప్పుడును
అవధ్యః = వధింపవీలుకానిదియై యుండును
తస్మాత్ = అందువలన
సర్వాణి = సమస్తములైన
భూతాని = ప్రాణులను గూర్చి (ఏ ప్రాణికొఱకు) ఐనను
త్వమ్ = నీవు
శోచితుమ్ = శోకించుటకు
న, అర్హసి = అర్హుడవుకావు (శోకింపదగదు).

ఓ అర్జునా! ప్రతిదేహమునందును ఉండెడి ఈ ఆత్మ వధించుటకు వీలుకానిది. కనుక ఏ ప్రాణిని గూర్చియైనను నీవు శోకింపదగదు. (30)

**స్వధర్మమపి చావేక్ష్య న వికంపితుమర్హసి ।**
**ధర్మ్యాద్ధి యుద్ధాచ్ఛ్రేయోఽన్యత్ క్షత్రియస్య న విద్యతే ॥ 31 ॥**

స్వధర్మమ్, అపి, చ, అవేక్ష్య, న, వికంపితుమ్, అర్హసి, ధర్మ్యాత్, హి, యుద్ధాత్, శ్రేయః, అన్యత్, క్షత్రియస్య, న, విద్యతే ॥ 31 ॥

చ = ఇంకను
స్వధర్మం = (నీ) స్వధర్మమును
అవేక్ష్య = చూచి
అపి = ఐనను
వికంపితుమ్ = చలించుటకు (భయపడుటకు)
న,అర్హసి = అర్హుడవుకావు (భయపడదగదు)
హి = ఏలనన
క్షత్రియస్య = క్షత్రియునకు
ధర్మ్యాత్ = ధర్మయుక్తమైన
యుద్ధాత్ = యుద్ధముకంటె
అన్యత్ = మఱియొకటి
శ్రేయః = శ్రేయస్కరమైన కర్తవ్యము
న, విద్యతే = ఉండదు.

అంతేగాక, స్వధర్మమునుబట్టియు నీవు భయపడనక్కరలేదు. ఏలనన క్షత్రియునకు ధర్మయుద్ధమునకు మించినట్టి శ్రేయస్కరమైన కర్తవ్యము మఱియొకటి ఏదియును లేదు. (31)

**యదృచ్ఛయా చోపపన్నం స్వర్గద్వారమపావృతమ్ ।**
**సుఖినః క్షత్రియాః పార్థ లభంతే యుద్ధమీదృశమ్ ॥ 32 ॥**

యదృచ్ఛయా, చ, ఉపపన్నమ్, స్వర్గద్వారమ్, అపావృతమ్, సుఖినః, క్షత్రియాః, పార్థ, లభంతే, యుద్ధమ్, ఈదృశమ్ ॥ 32 ॥

| | | | |
|---|---|---|---|
| పార్థ | = ఓ పార్థా! | ఈదృశమ్ యుద్ధమ్ | = ఇట్టి యుద్ధమును |
| యదృచ్ఛయా | = అనుకోకుండ (సంకల్పములేకుండ) | | |
| ఉపపన్నమ్ | = ప్రాప్తించినట్టిదియును | సుఖినః | = అదృష్టవంతులైన |
| చ | = మఱియు | | |
| అపావృతమ్ | = తెఱవబడిన | క్షత్రియాః | = క్షత్రియులు మాత్రమే |
| స్వర్గద్వారమ్ | = స్వర్గద్వార(రూప)మై నట్టిదియు | లభంతే | = పొందుదురు. |

ఓ పార్థా! యాదృచ్ఛికముగా అనగా అనుకోకుండా తటస్థించిన ఇట్టి యుద్ధము అదృష్టవంతులైన క్షత్రియులకే లభించును. ఇది స్వర్గమునకు తెఱచిన ద్వారము వంటిది. (32)

**అథ చేత్త్వమిమం ధర్మ్యం సంగ్రామం న కరిష్యసి ।**
**తతస్స్వధర్మం కీర్తిం చ హిత్వా పాపమవాప్స్యసి ॥ 33 ॥**

అథ, చేత్, త్వమ్, ఇమమ్, ధర్మ్యమ్, సంగ్రామమ్, న, కరిష్యసి,
తతః, స్వధర్మమ్, కీర్తిమ్, చ, హిత్వా, పాపమ్, అవాప్స్యసి ॥ 33 ॥

| | | | |
|---|---|---|---|
| అథ, చేత్ | = ఐనను, ఒకవేళ | తతః | = పిమ్మట |
| త్వమ్ | = నీవు | స్వధర్మమ్, చ | = స్వధర్మమునూ |
| ఇమమ్ | = ఈ (ఇట్టి) | కీర్తిమ్ | = కీర్తినీ |
| ధర్మ్యమ్ | = ధర్మయుక్తమైన | హిత్వా | = పోగొట్టుకొని |
| సంగ్రామమ్ | = యుద్ధమును | పాపమ్ | = పాపమునే |
| న, కరిష్యసి | = చేయనిచో | అవాప్స్యసి | = పొందెదవు |

ఈ యుద్ధము నీకు ధర్మబద్ధము. ఒకవేళ నీవు దీనిని ఆచరింపకున్నచో నీ స్వధర్మమునుండి పాఱిపోయినవాడవు అగుదువు. దానివలన కీర్తిని కోల్పోవుదువు. పైగా నీవు పాపము చేసినవాడవగుదువు. (33)

**అకీర్తిం చాపి భూతాని కథయిష్యంతి తేఽవ్యయామ్ ।**
**సంభావితస్య చాకీర్తిః మరణాదతిరిచ్యతే ॥ 34 ॥**

అకీర్తిమ్, చ, అపి, భూతాని, కథయిష్యంతి, తే, అవ్యయామ్,
సంభావితస్య, చ, అకీర్తిః, మరణాత్, అతిరిచ్యతే ॥ 34 ॥

చ = మఱియు
భూతాని = సమస్తజనులు
తే = నీయొక్క
అవ్యయామ్ = కలకాలము నిలిచియుండు
అకీర్తిమ్, అపి = అపకీర్తిని గూర్చియు
కథయిష్యంతి = చెప్పికొందురు

చ = మఱియు
సంభావితస్య = మాన్యుడైనవానికి
అకీర్తిః = అపకీర్తి
మరణాత్ = మృత్యువుకంటెను
అతిరిచ్యతే = అధిక (బాధాకర) మైనది.

లోకులెల్లరును బహుకాలమువఱకును నీ అపకీర్తినిగూర్చి చిలువలు పలువలుగా చెప్పికొందురు. మాన్యుడైన పురుషునకు అపకీర్తి మరణముకంటెను బాధాకరమైనది.(34)

**భయాద్రణాదుపరతం మంస్యంతే త్వాం మహారథాః ।**
**యేషాం చ త్వం బహుమతో భూత్వా యాస్యసి లాఘవమ్ ॥ 35 ॥**

భయాత్, రణాత్, ఉపరతమ్, మంస్యంతే, త్వామ్, మహారథాః,
యేషామ్, చ, త్వమ్, బహుమతః, భూత్వా, యాస్యసి, లాఘవమ్ ॥ 35 ॥

చ = మఱియు
యేషామ్ = ఎవరిదృష్టిలో
త్వమ్ = నీవు
బహుమతః = మిక్కిలిమాన్యుడవు
భూత్వా = అయి (ఉంటివో)
లాఘవమ్ = (ఇప్పుడు) చులకన
యాస్యసి = అయ్యెదవు

మహారథాః = ఆ మహారథులు
త్వామ్ = నిన్ను
భయాత్ = భయమువలన (భయకారణముగా)
రణాత్ = యుద్ధమునుండి
ఉపరతమ్ = పాఱిపోయినవానినిగా
మంస్యంతే = తలంతురు.

ఈ మహారథులదృష్టిలో ఇప్పుడు నీవు మిక్కిలి మాన్యుడవు. యుద్ధవిముఖుడవైనచో వీరి దృష్టిలో నీవు ఎంతో చులకన అయ్యెదవు. అంతేగాక, నీవు పిరికివాడవై యుద్ధమునుండి పాఱిపోయినట్లు వీరు భావింతురు. (35)

**అవాచ్యవాదాంశ్చ బహూన్ వదిష్యంతి తవాహితాః ।**
**నిందంతస్తవ సామర్థ్యం తతో దుఃఖతరం ను కిమ్ ॥ 36 ॥**

అవాచ్యవాదాన్, చ, బహూన్, వదిష్యంతి, తవ, అహితాః,
నిందంతః, తవ, సామర్థ్యమ్, తతః, దుఃఖతరమ్, ను, కిమ్ ॥ 36 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| తవ | = | నీయొక్క | అవాచ్యవాదాన్ చ | = | అనరానిమాటలను గూడ |
| అహితాః | = | శత్రువులు | వదిష్యంతి | = | పలికెదరు |
| తవ | = | నీ | తతః | = | అంతకంటెను |
| సామర్థ్యమ్ | = | సామర్థ్యమును | దుఃఖతరమ్ | = | అధికమైన దుఃఖము |
| నిందంతః | = | నిందించుచు | కిమ్, ను | = | ఇంక ఏముండును? |
| బహూన్ | = | అనేకములైన | | | |

నీ శత్రువులు నీ సామర్థ్యమును నిందించుచు నిన్ను గూర్చి పెక్కు అనరాని మాటలను అందురు. అంతకంటె విచారకరమైన విషయమేముండును? (36)

**హతో వా ప్రాప్స్యసి స్వర్గం జిత్వా వా భోక్ష్యసే మహీమ్ ।**
**తస్మాదుత్తిష్ఠ కౌంతేయ యుద్ధాయ కృతనిశ్చయః ॥ 37 ॥**

హతః, వా, ప్రాప్స్యసి, స్వర్గమ్, జిత్వా, వా, భోక్ష్యసే, మహీమ్,
తస్మాత్, ఉత్తిష్ఠ, కౌంతేయ, యుద్ధాయ, కృతనిశ్చయః ॥ 37 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| వా | = | ఒకవేళ | భోక్ష్యసే | = | అనుభవించెదవు |
| హతః | = | (నీవు) చంపబడినచో | తస్మాత్ | = | అందువలన |
| స్వర్గమ్ | = | స్వర్గమును | కౌంతేయ | = | కుంతీకుమారా!(అర్జునా!) |
| ప్రాప్స్యసి | = | పొందగలవు | యుద్ధాయ | = | యుద్ధము చేయుటకొఱకు |
| వా | = | లేక (అట్లుగాక) | | | |
| జిత్వా | = | (నీవు యుద్ధమున) జయించినచో | కృతనిశ్చయః | = | తిరుగులేని నిశ్చయము గలవాడవై |
| మహీమ్ | = | భూమండల రాజ్యమును | ఉత్తిష్ఠ | = | లెమ్ము (కటిబద్ధుడవు కమ్ము) |

ఓ అర్జునా! రణరంగమున మరణించినచో నీకు వీరస్వర్గము ప్రాప్తించును. యుద్ధమున జయించినచో రాజ్యభోగములను అనుభవింపగలవు. కనుక, కృతనిశ్చయుడవై యుద్ధమునకు లెమ్ము. (37)

**సుఖదుఃఖే సమే కృత్వా లాభాలాభౌ జయాజయౌ ।**
**తతో యుద్ధాయ యుజ్యస్వ నైవం పాపమవాప్స్యసి ॥ 38 ॥**

సుఖదుఃఖే, సమే, కృత్వా, లాభాలాభౌ, జయాజయౌ,
తతః, యుద్ధాయ, యుజ్యస్వ, న, ఏవమ్, పాపమ్, అవాప్స్యసి ॥ 38 ॥

| | | | |
|---|---|---|---|
| జయాజయౌ | = జయాపజయములను | యుజ్యస్వ | = సన్నద్ధుడవుకమ్ము |
| లాభాలాభౌ | = లాభనష్టములను | ఏవమ్ | = ఈ విధముగా (యుద్ధము చేయుటవలన) |
| సుఖదుఃఖే | = సుఖదుఃఖములను | | |
| సమే | = సమానమైనవానినిగా | | |
| కృత్వా | = భావించి | | |
| తతః | = అనంతరము | పాపమ్ | = పాపమును |
| యుద్ధాయ | = యుద్ధము (చేయుట)కొఱకై | న, అవాప్స్యసి | = (నీవు) పొందనే పొందవు. |

జయాపజయములను, లాభనష్టములను, సుఖదుఃఖములను సమానముగా భావించి, యుద్ధసన్నద్ధుడవు కమ్ము. అప్పుడు నీకు పాపములు అంటనే అంటవు. (38)

**ఏషా తేఽభిహితా సాంఖ్యే బుద్ధిర్యోగే త్విమాం శృణు ।**
**బుద్ధ్యా యుక్తో యయా పార్థ కర్మబంధం ప్రహాస్యసి ॥ 39 ॥**

ఏషా, తే, అభిహితా, సాంఖ్యే, బుద్ధిః, యోగే, తు, ఇమామ్, శృణు,
బుద్ధ్యా, యుక్తః, యయా, పార్థ, కర్మబంధమ్, ప్రహాస్యసి ॥ 39 ॥

| | | | |
|---|---|---|---|
| పార్థ | = ఓ పార్థా! | యోగే | = కర్మయోగ విషయమునను |
| ఏషా, బుద్ధిః | = ఈ సమత్వబుద్ధి | శృణు | = వినుము |
| తే | = నీకు | యయా | = ఏ (అ) |
| సాంఖ్యే | = జ్ఞానయోగ [1] విషయమునందు | బుద్ధ్యా | = బుద్ధితో |
| | | యుక్తః | = కూడినవాడవై |
| అభిహితా | = తెల్పబడినది | కర్మబంధమ్ | = కర్మబంధమును |
| తు, ఇమామ్ | = అయితే దీనిని | ప్రహాస్యసి | = పారద్రోలగలవు. |

ఓ పార్థా! ఈ (సమత్వ) బుద్ధిని ఇంతవఱకును జ్ఞానయోగదృష్టితో తెల్పితిని. ఇప్పుడు దానినే కర్మయోగదృక్పథముతో వివరించెదను, వినుము. దానిని ఆకళింపుచేసికొని, ఆచరించినచో కర్మబంధములనుండి నీవుముక్తుడవయ్యెదవు. (39)

**నేహాభిక్రమనాశోఽస్తి ప్రత్యవాయో న విద్యతే ।**
**స్వల్పమప్యస్య ధర్మస్య త్రాయతే మహతో భయాత్ ॥ 40 ॥**

*1. 3వ అధ్యాయమునందలి 3వ శ్లోకముయొక్క టిప్పణి యందు దీని వివరణ గలదు.*

న, ఇహ, అభిక్రమనాశః, అస్తి, ప్రత్యవాయః, న, విద్యతే,
స్వల్పమ్, అపి, అస్య, ధర్మస్య, త్రాయతే, మహతః, భయాత్ ॥ 40 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| ఇహ | = | ఈ కర్మయోగము నందు | అస్య | = | ఈ (కర్మయోగ రూపమైన) |
| అభిక్రమనాశః | = | ఆరంభ (బీజ) నాశము | ధర్మస్య | = | ధర్మముయొక్క |
| న, అస్తి | = | ఉండదు | స్వల్పమ్, అపి | = | ఏ కొంచెము సాధనయైనను |
| ప్రత్యవాయః | = | (మఱియు దీనికి) విపరీత ఫలరూప దోషముగూడ | మహతః భయాత్ | = | జన్మమృత్యు రూపమైన గొప్ప భయమునుండి |
| న, విద్యతే | = | (ఏ మాత్రము) ఉండదు | త్రాయతే | = | కాపాడును |

ఈ (నిష్కామ) కర్మయోగమును ప్రారంభించినచో దీనికి ఎన్నటికిని బీజనాశము లేదు. దీనికి విపరీత ఫలితములే యుండవు. పైగా ఈ (నిష్కామ) కర్మయోగమును ఏ కొంచెము సాధనచేసినను అది జన్మమృత్యురూప మహాభయమునుండి కాపాడును. (40)

**వ్యవసాయాత్మికా బుద్ధిః ఏకేహ కురునందన ।**
**బహుశాఖా హ్యనంతాశ్చ బుద్ధయోఽవ్యవసాయినామ్ ॥ 41 ॥**

వ్యవసాయాత్మికా, బుద్ధిః, ఏకా, ఇహ, కురునందన,
బహుశాఖాః, హి, అనంతాః, చ, బుద్ధయః, అవ్యవసాయినామ్ ॥ 41 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| కురునందన | = | ఓ అర్జునా! | బుద్ధయః | = | బుద్ధులు |
| ఇహ | = | ఈ (నిష్కామ) కర్మ యోగమునందు | హి | = | నిశ్చయముగా |
| వ్యవసాయాత్మికా | = | నిశ్చయాత్మకమైన | బహుశాఖాః | = | అనేక భేదములు గలిగినవై (చంచలములై) |
| బుద్ధిః | = | బుద్ధి | | | |
| ఏకా(భవతి) | = | ఒకటిగా ఉండును | చ | = | మఱియు |
| అవ్యవసాయినామ్ | = | (కాని) స్థిరబుద్ధిలేని వివేకహీనులైన సకామ మనుష్యులయొక్క | అనంతాః | = | అంతులేని (కోరికలుగల) వై (ఉండును). |

ఓ అర్జునా! ఈ (నిష్కామ) కర్మయోగమునందు నిశ్చయాత్మకబుద్ధి ఒకటియే యుండును. కాని, భోగాసక్తులైన వివేకహీనుల బుద్ధులు చంచలములై, ఒకదారీ తెన్నూ లేక కోరికలవెంట నలువైపులా పరుగులు తీయుచూ అనంతములుగానుండును.(41)

**యామిమాం పుష్పితాం వాచం ప్రవదంత్యవిపశ్చితః ।**
**వేదవాదరతాః పార్థ నాన్యదస్తీతి వాదినః ॥ 42 ॥**
**కామాత్మానః స్వర్గపరా జన్మకర్మఫలప్రదామ్ ।**
**క్రియావిశేషబహులాం భోగైశ్వర్యగతిం ప్రతి ॥ 43 ॥**
**భోగైశ్వర్యప్రసక్తానాం తయాపహృతచేతసామ్ ।**
**వ్యవసాయాత్మికా బుద్ధిః సమాధౌ న విధీయతే ॥ 44 ॥**

యామ్, ఇమామ్, పుష్పితామ్, వాచమ్, ప్రవదంతి, అవిపశ్చితః,
వేదవాదరతాః, పార్థ, న, అన్యత్, అస్తి, ఇతి, వాదినః ॥ 42 ॥
కామాత్మానః, స్వర్గపరాః, జన్మకర్మఫలప్రదామ్,
క్రియావిశేషబహులామ్, భోగైశ్వర్యగతిమ్, ప్రతి ॥ 43 ॥
భోగైశ్వర్యప్రసక్తానామ్, తయా, అపహృతచేతసామ్ ।
వ్యవసాయాత్మికాబుద్ధిః, సమాధౌ, న, విధీయతే ॥ 44 ॥

**పార్థ** = ఓ పార్థా!
**వేదవాదరతాః** = వేదములలోని ఫలశ్రుతి యందు ప్రీతిగలవారు
**అన్యత్** = అందు చెప్పబడిన స్వర్గాదుల కంటెను అధికమైన ఫలము వేఱొకటి
**న, అస్తి ఇతి వాదినః** = లేదని వాదించు వారును
**కామాత్మానః** = కోరికలతోనిండిన మనస్సులు గలవారును
**స్వర్గపరాః** = స్వర్గమే పరమ ప్రాప్యమనువారును అగు
**అవిపశ్చితః** = అవివేకులు
**జన్మకర్మ ఫలప్రదామ్** = జన్మరూపకర్మఫలమును ఇచ్చునట్టిదియు
**భోగైశ్వర్యగతిం ప్రతి** = భోగైశ్వర్యములను సంపాదించుటకు
**క్రియావిశేష బహులామ్** = వివిధ కార్య కలాపములతో కూడినదియు
**పుష్పితామ్** = ఫలప్రదముగాని కేవలముచూచుటకు మాత్రము రమ్యముగా నుండునదియు అగు
**యామ్, ఇమామ్** = ఏ ఈ
**వాచమ్** = వాక్యమును

| | | | | | |
|---|---|---|---|---|---|
| ప్రవదంతి | = | విశేషముగా చెప్పుచున్నారో | భోగైశ్వర్య ప్రసక్తానామ్ | = | భోగైశ్వర్యములయందు మిక్కిలి ఆశగలవారికి |
| తయా | = | దానిచేత | వ్యవసాయాత్మికా బుద్ధిః | = | నిశ్చయమైన బుద్ధి (ఏకాగ్రబుద్ధి) |
| అపహృత చేతసామ్ | = | అపహరింపబడిన మనస్సులు గలవారును | సమాధౌ | = | దైవధ్యానమునందు |
| | | | న విధీయతే | = | కలుగదు (నిలువదు) |

ఓ అర్జునా! వివేకహీనులైన జనులు ప్రాపంచికభోగములయందే తలమున్కలై యుందురు. వారు కర్మఫలములను ప్రశంసించు వేదవాక్యములయొక్క బాహ్యార్థములయందే ప్రీతివహింతురు. వాటి అంతరార్థములజోలికేపోరు. స్వర్గమునకు మించినదేదియును లేదనియు, అదియే పరమప్రాప్యమనియు వారు భావింతురు. క్షణికములైన ప్రాపంచిక భోగైశ్వర్యములయందలి ఆసక్తితో వివిధ సకామ కర్మలను ప్రోత్సహించుచు ప్రీతిని గూర్చు ఇచ్చకపుపల్కులు పలికెదరు. ఆ ఇచ్చకపుమాటలఉచ్చులలోబడిన భోగైశ్వర్యాసక్తులైన అజ్ఞానులబుద్ధులు భగవంతుడు లక్ష్యముగాగల సమాధియందు స్థిరముగా ఉండవు. (42-44)

**త్రైగుణ్యవిషయా వేదా నిస్త్రైగుణ్యో భవార్జున ।**
**నిర్ద్వంద్వో నిత్యసత్త్వస్థో నిర్యోగక్షేమ ఆత్మవాన్ ॥ 45 ॥**

త్రైగుణ్యవిషయాః, వేదాః, నిస్త్రైగుణ్యః, భవ, అర్జున,
నిర్ద్వంద్వః, నిత్యసత్త్వస్థః, నిర్యోగక్షేమః, ఆత్మవాన్ ॥ 45 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| అర్జున | = | ఓ అర్జునా! | నిర్ద్వంద్వః | = | హర్షశోకాది ద్వంద్వములు లేనివాడవై |
| వేదాః | = | వేదములు | నిత్యసత్త్వస్థః | = | నిత్యుడైన పరమాత్మ యందే స్థితుడవై |
| త్రైగుణ్యవిషయాః | = | (పైన తెలుపబడినట్లు) త్రిగుణకార్య రూపములైన భోగములను, వాటి సాధనలను ప్రతిపాదించును | నిర్యోగక్షేమః | = | యోగక్షేమములను ఆసింపక |
| | | | ఆత్మవాన్ | = | అంతఃకరణమును స్వాధీనమొనర్చు కొనినవాడవు |
| నిస్త్రైగుణ్యః | = | (కావున నీవు) ఆ భోగముల యందును, వాటి సాధనల యందును ఆసక్తిలేనివాడవై | భవ | = | అగుము |

ఓ అర్జునా! వేదములు సత్త్వరజస్తమోగుణములకార్యరూపములైన సమస్త భోగములను గూర్చియు, వాటిని పొందుటకై చేయవలసిన సాధనలను గూర్చియు ప్రతిపాదించును. నీవు ఆ భోగములయెడలను, వాటి సాధనలయందును ఆసక్తిని త్యజింపుము. హర్షశోకాదిద్వంద్వములకు అతీతుడవు కమ్ము. నిత్యుడైన పరమాత్మయందే స్థితుడవు కమ్ము. నీ యోగక్షేమములకొఱకై ఆరాటపడవద్దు. అంతఃకరణమును వశమునందుంచుకొనుము. (45)

**యావానర్థ ఉదపానే సర్వతః సంప్లుతోదకే ।**
**తావాన్ సర్వేషు వేదేషు బ్రాహ్మణస్య విజానతః ॥ 46 ॥**

యావాన్, అర్థః, ఉదపానే, సర్వతః, సంప్లుతోదకే,
తావాన్, సర్వేషు, వేదేషు, బ్రాహ్మణస్య, విజానతః ॥ 46 ॥

సర్వతః = అంతటను
సంప్లుతోదకే = పరిపూర్ణమైన జలాశయము
(ప్రాప్తే సతి) = ప్రాప్తించుచుండగా (అందుబాటులో ఉండగా)
ఉదపానే = చిన్న జలాశయమునందు(మనుష్యునకు)
యావాన్, అర్థః= ఎట్టి ప్రయోజనము
(అస్తి) = ఉండునో
విజానతః = బ్రహ్మతత్త్వమును ఎఱింగిన
బ్రాహ్మణస్య = బ్రహ్మజ్ఞానికి
సర్వేషు, వేదేషు = సమస్తవేదములయందు
తావాన్ = అంతప్రయోజనమే (ఉండును).

అన్నివైపులా జలములతో నిండియున్న మహాజలాశయము అందుబాటులోనున్నవానికి చిన్న చిన్న జలాశయములవలన ఎంత ప్రయోజనమో, పరమాత్మప్రాప్తినందిపరమానందమును అనుభవించు బ్రహ్మజ్ఞానికి వేదములవలన అంతియే ప్రయోజనము. (46)

**కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన ।**
**మా కర్మఫలహేతుర్భూః మా తే సంగోఽస్త్వకర్మణి ॥ 47 ॥**

కర్మణి, ఏవ, అధికారః, తే, మా, ఫలేషు, కదాచన,
మా, కర్మఫలహేతుః, భూః, మా, తే, సంగః, అస్తు, అకర్మణి ॥ 47 ॥

తే = నీకు
కర్మణి, ఏవ = కర్మయందే (కర్మాచరణమునందే)
అధికారః = అధికారము కలదు
ఫలేషు = దాని ఫలములయందు
కదాచన, మా = ఎన్నడును లేదు

| | | | | | |
|---|---|---|---|---|---|
| కర్మఫలహేతుః మా, భూః | = | (నీవు) కర్మఫలమునకు హేతువు కావలదు | అకర్మణి | = | కర్మను మానుటయందును |
| | | | సంగః | = | ఆసక్తి |
| తే | = | (అట్లే) నీకు | మా, అస్తు | = | ఉండరాదు. |

కర్తవ్యకర్మమునాచరించుటయందే నీకు అధికారముగలదు. ఎన్నటికినీ దాని ఫలములయందులేదు. కర్మఫలములకు నీవు హేతువు కారాదు. కర్మలను మానుటయందు నీవు ఆసక్తుడవు కావలదు. అనగా ఫలాపేక్షరహితుడవై కర్తవ్యబుద్ధితో కర్మలనాచరింపుము. (47)

**యోగస్థః కురు కర్మాణి సంగం త్యక్త్వా ధనంజయ ।**
**సిద్ధ్యసిద్ధ్యోః సమో భూత్వా సమత్వం యోగ ఉచ్యతే ॥ 48 ॥**

యోగస్థః, కురు, కర్మాణి, సంగం, త్యక్త్వా, ధనంజయ,
సిద్ధ్యసిద్ధ్యోః, సమః, భూత్వా, సమత్వమ్, యోగః, ఉచ్యతే ॥ 48 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| ధనంజయ | = | ఓ ధనంజయా! | యోగస్థః | = | యోగమునందు స్థితుడవై |
| సంగమ్ | = | ఆసక్తిని | కర్మాణి | = | కర్మలను |
| త్యక్త్వా | = | త్యజించి | కురు | = | చేయుము |
| సిద్ధ్యసిద్ధ్యోః | = | సిద్ధి-అసిద్ధులయందు | సమత్వమ్ | = | సమత్వమే (సమత్వ బుద్ధియే) |
| సమః | = | సమబుద్ధి | | | |
| భూత్వా | = | కలిగి | యోగః ఉచ్యతే | = | యోగమని చెప్పబడును. |

ఓ ధనంజయా! యోగస్థితుడవై ఆసక్తిని వీడి, సిద్ధి-అసిద్ధుల యెడ సమత్వ భావమును కలిగియుండి, కర్తవ్యకర్మలను ఆచరింపుము. ఈ సమత్వభావమునే యోగమందురు. (48)

**దూరేణ హ్యవరం కర్మ బుద్ధియోగాద్ధనంజయ ।**
**బుద్ధౌ శరణమన్విచ్ఛ కృపణాః ఫలహేతవః ॥ 49 ॥**

దూరేణ, హి, అవరమ్, కర్మ, బుద్ధియోగాత్, ధనంజయ,
బుద్ధౌ, శరణమ్, అన్విచ్ఛ, కృపణాః, ఫలహేతవః ॥ 49 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| బుద్ధియోగాత్ | = | (సమత్వ) బుద్ధి యోగముకంటెను | దూరేణ, అవరమ్ (అతః) | = | మిక్కిలి నిమ్నశ్రేణికి చెందినది కావున |
| కర్మ | = | సకామకర్మ | ధనంజయ | = | ఓ ధనంజయా! |

| | | | |
|---|---|---|---|
| బుద్ధౌ | = సమత్వబుద్ధియందే | హి | = ఏలనన |
| శరణమ్ | = తరణోపాయమును | ఫలహేతవః | = ఫలములను ఆశించువారు (ఫలాసక్తితో కర్మలను ఆచరించువారు) |
| అన్విచ్ఛ | = వెదకుము (సమత్వయోగమును ఆశ్రయింపుము) | కృపణాః | = అత్యంతదీనులు |

ఈ సమత్వబుద్ధియోగముకంటెను సకామకర్మ మిక్కిలి నిమ్నశ్రేణికి చెందినది. కావున, ఓ ధనంజయా! నీవు సమత్వబుద్ధియోగమునే ఆశ్రయింపుము. ఏలనన, ఫలాసక్తితో కర్మలు చేయువారు అత్యంతదీనులు, కృపణులు. (49)

**బుద్ధియుక్తో జహాతీహ ఉభే సుకృతదుష్కృతే ।**
**తస్మాద్యోగాయ యుజ్యస్వ యోగః కర్మసు కౌశలమ్ ॥ 50 ॥**

బుద్ధియుక్తః, జహాతి, ఇహ, ఉభే, సుకృతదుష్కృతే,
తస్మాత్, యోగాయ, యుజ్యస్వ, యోగః, కర్మసు, కౌశలమ్ ॥ 50 ॥

| | | | |
|---|---|---|---|
| బుద్ధియుక్తః | = సమత్వబుద్ధిగల పురుషుడు | యోగాయ | = సమత్వబుద్ధి యోగము కొఱకు |
| సుకృతదుష్కృతే | = పుణ్యపాపములను | యుజ్యస్వ | = (నీవు) ప్రయత్నింపుము (సాధన చేయుము) |
| ఉభే | = రెండింటిని | | |
| ఇహ | = ఈ లోకమునందే | యోగః | = సమత్వరూపయోగమే |
| జహాతి | = త్యజించును (వాటి నుండి విముక్తుడగును) | కర్మసు | = కర్మలయందు |
| | | కౌశలమ్ | = నేర్పును కలిగించును (కర్మబంధముల నుండి విడిపించును) |
| తస్మాత్ | = అందువలన | | |

సమత్వ బుద్ధియుక్తుడైనవాడు పుణ్యపాపములను రెండింటిని ఈ లోకమునందే త్యజించును. అనగా కర్మఫలములు వానికి అంటవు. కనుక నీవు సమత్వబుద్ధి రూపయోగమును ఆశ్రయింపుము. ఇదియే కర్మాచరణమునందు కౌశలము. అనగా కర్మబంధములనుండి ముక్తుడగుటకు ఇదియే మార్గము. (50)

**కర్మజం బుద్ధియుక్తా హి ఫలం త్యక్త్వా మనీషిణః ।**
**జన్మబంధవినిర్ముక్తాః పదం గచ్ఛంత్యనామయమ్ ॥ 51 ॥**

కర్మజమ్, బుద్ధియుక్తాః, హి, ఫలమ్, త్యక్త్వా, మనీషిణః,
జన్మబంధవినిర్ముక్తాః, పదమ్, గచ్ఛంతి, అనామయమ్ ॥ 51 ॥

| | | | |
|---|---|---|---|
| హి | = ఏలనన | జన్మబంధ వినిర్ముక్తాః | = జన్మరూపబంధముల నుండి ముక్తులై |
| బుద్ధియుక్తాః | = సమత్వబుద్ధిగలవారైన | | |
| మనీషిణః | = జ్ఞానులు | | |
| కర్మజమ్ | = కర్మలవలన ఉత్పన్నమగు | అనామయమ్ | = వికారరహితమైన |
| ఫలమ్ | = ఫలమును | పదమ్ | = పరమపదమును |
| త్యక్త్వా | = త్యజించి | గచ్ఛంతి | = పొందుదురు. |

ఏలనన, సమబుద్ధియుక్తులైన జ్ఞానులు కర్మఫలములను త్యజించి, జనన మరణబంధములనుండి ముక్తులయ్యెదరు. అంతేగాక, వారు నిర్వికారమైన పరమపదమును పొందుదురు. (51)

**యదా తే మోహకలిలం బుద్ధిర్వ్యతితరిష్యతి ।**
**తదా గంతాసి నిర్వేదం శ్రోతవ్యస్య శ్రుతస్య చ ॥ 52 ॥**

యదా, తే, మోహకలిలమ్, బుద్ధిః, వ్యతితరిష్యతి,
తదా, గంతాసి, నిర్వేదమ్, శ్రోతవ్యస్య, శ్రుతస్య, చ ॥ 52 ॥

| | | | |
|---|---|---|---|
| యదా | = ఎప్పుడైతే | చ | = మఱియు |
| తే బుద్ధిః | = నీ బుద్ధి | శ్రోతవ్యస్య | = వినబోవునట్టి (ఇహపర లోకములకు సంబంధించిన సమస్తభోగముల నుండి) |
| మోహకలిలమ్ | = మోహమనెడి ఊబిని (ఊబినుండి) | | |
| వ్యతితరిష్యతి | = పూర్తిగాబయటపడునో | | |
| తదా | = అప్పుడే | నిర్వేదమ్ | = వైరాగ్యమును |
| శ్రుతస్య | = వినినట్టి | గంతాసి | = పొందెదవు. |

మోహమనెడి ఊబినుండి పూర్తిగా బయటబడినప్పుడే నీవు వినిన, వినబోవు ఇహపరలోకసంబంధమైన సమస్తభోగములనుండి వైరాగ్యమును పొందగలవు. (52)

**శ్రుతివిప్రతిపన్నా తే యదా స్థాస్యతి నిశ్చలా ।**
**సమాధావచలా బుద్ధిస్తదా యోగమవాప్స్యసి ॥ 53 ॥**

శ్రుతివిప్రతిపన్నా, తే, యదా, స్థాస్యతి, నిశ్చలా,
సమాధౌ, అచలా, బుద్ధిః, తదా, యోగమ్, అవాప్స్యసి ॥ 53 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| శ్రుతివిప్రతిపన్నా | = | నానావిధవచనములను వినుటవలన విచలితమైన | నిశ్చలా | = | నిశ్చలముగా |
| | | | అచలా | = | స్థిరముగా |
| | | | స్థాస్యతి | = | నిలుచునో |
| తే | = | నీ యొక్క | తదా | = | అప్పుడే |
| బుద్ధిః | = | బుద్ధి | యోగమ్ | = | యోగమును (భగవత్సాక్షాత్కారమును) |
| యదా | = | ఎప్పుడయితే | | | |
| సమాధౌ | = | పరమాత్మయందు | అవాప్స్యసి | = | (నీవు) పొందగలవు. |

నానా విధములైన మాటలను వినుట వలన విచలితమైన (అయోమయమునకు గురియైన) నీ బుద్ధి పరమాత్మయందు నిశ్చలముగా స్థిరముగా ఉన్నప్పుడే నీవు ఈ యోగమును పొందగలవు. అనగా నీకు పరమాత్మతో నిత్య(శాశ్వత)సంయోగము ఏర్పడును. (53)

**అర్జున ఉవాచ**

**స్థితప్రజ్ఞస్య కా భాషా సమాధిస్థస్య కేశవ ।**
**స్థితధీః కిం ప్రభాషేత కిమాసీత వ్రజేత కిమ్ ॥ 54 ॥**

స్థితప్రజ్ఞస్య, కా, భాషా, సమాధిస్థస్య, కేశవ,
స్థితధీః, కిమ్, ప్రభాషేత, కిమ్, ఆసీత, వ్రజేత, కిమ్ ॥ 54 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| కేశవ | = | ఓ కేశవా! | స్థితధీః | = | స్థిరబుద్ధిగలవాడు |
| సమాధిస్థస్య, స్థితప్రజ్ఞస్య | = | సమాధియందుస్థితుడై పరమాత్మ ప్రాప్తినందిన స్థిరబుద్ధిగల పురుషునియొక్క | కిమ్ ప్రభాషేత | = | ఎట్లు మాట్లాడును? |
| | | | కిమ్ ఆసీత | = | ఎట్లు కూర్చుండును |
| | | | కిమ్ వ్రజేత | = | ఎట్లు సంచరించును |
| భాషా, కా | = | లక్షణమేమి? | | | |

అర్జునుడు పలికెను- ఓ కేశవా! సమాధిస్థితుడై పరమాత్మప్రాప్తినందిన స్థితప్రజ్ఞుని యొక్క లక్షణములెవ్వి? అతడు ఎట్లు భాషించును? ఎట్లు కూర్చొనును? ఎట్లు నడుచును? (54)

**శ్రీభగవాన్ ఉవాచ**

**ప్రజహాతి యదా కామాన్ సర్వాన్ పార్థ మనోగతాన్ ।**
**ఆత్మన్యేవాత్మనా తుష్టః స్థితప్రజ్ఞస్తదోచ్యతే ॥ 55 ॥**

ప్రజహాతి, యదా, కామాన్, సర్వాన్, పార్థ, మనోగతాన్,
ఆత్మని, ఏవ, ఆత్మనా, తుష్టః, స్థితప్రజ్ఞః, తదా, ఉచ్యతే ॥ 55 ॥

| | | | |
|---|---|---|---|
| పార్థ | = ఓ పార్థా! | ఆత్మనా | = ఆత్మద్వారా |
| యదా | = ఎప్పుడైతే | ఆత్మని ఏవ | = ఆత్మయందే |
| మనోగతాన్ | = మనస్సునందున్న | తుష్టః | = సంతుష్టుడగునో |
| సర్వాన్ | = సమస్తములైన | తదా | = అప్పుడే |
| కామాన్ | = కోరికలను | స్థితప్రజ్ఞః | = (అతడు) స్థితప్రజ్ఞుడు |
| ప్రజహాతి | = (మనుజుడు) పూర్తిగా త్యజించునో. (మఱియు) | ఉచ్యతే | = అనబడును |

శ్రీ భగవానుడు పలికెను- ఓ అర్జునా! మనస్సునందలి కోరికలన్నియును పూర్తిగా తొలగిపోయి, ఆత్మద్వారా ఆత్మయందుసంతుష్టుడైనవానిని, అనగా పరమాత్మ సంయోగమువలన ఆత్మానందమును పొందినవానిని స్థితప్రజ్ఞుడని యందురు. (55)

**దుఃఖేష్వనుద్విగ్నమనాః సుఖేషు విగతస్పృహః ।**
**వీతరాగభయక్రోధః స్థితధీర్మునిరుచ్యతే ॥ 56 ॥**

దుఃఖేషు, అనుద్విగ్నమనాః, సుఖేషు, విగతస్పృహః,
వీతరాగభయక్రోధః, స్థితధీః, మునిః, ఉచ్యతే ॥ 56 ॥

| | | | |
|---|---|---|---|
| దుఃఖేషు | = దుఃఖములు ప్రాప్తించినప్పుడు | విగతస్పృహః | = ఆసక్తిరహితుడును (పొంగిపోనివాడును) |
| అనుద్విగ్నమనాః | = మనస్సునందు ఉద్వేగమునకులోను కానివాడును (క్రుంగిపోనివాడును) | వీతరాగభయక్రోధః | = (అట్లే) రాగభయ క్రోధములను త్యజించినవాడును అగు |
| | | మునిః | = ముని (మననశీలుడు) |
| సుఖేషు | = సుఖములు కలిగినప్పుడు | స్థితధీః | = స్థితప్రజ్ఞుడు |
| | | ఉచ్యతే | = అనబడును |

దుఃఖములకు క్రుంగిపోనివాడును, సుఖములకు పొంగిపోనివాడును, ఆసక్తిని, భయక్రోధములను వీడినవాడును ఐనట్టి మననశీలుడు (ముని) స్థితప్రజ్ఞుడన బడును. (56)

**యః సర్వత్రానభిస్నేహః తత్తత్ ప్రాప్య శుభాశుభమ్ ।**
**నాభినందతి న ద్వేష్టి తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥ 57 ॥**

యః, సర్వత్ర, అనభిస్నేహః, తత్, తత్, ప్రాప్య, శుభాశుభమ్,
న, అభినందతి, న, ద్వేష్టి, తస్య, ప్రజ్ఞా, ప్రతిష్ఠితా ॥ 57 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| యః | = | ఏ మనుష్యుడైతే | ప్రాప్య | = | పొంది |
| సర్వత్ర | = | అంతట | న, అభినందతి | = | ప్రసన్నుడుకాడో |
| అనభిస్నేహః | = | మమతాసక్తులు లేనివాడై | న, ద్వేష్టి | = | ద్వేషించడో |
| | | | తస్య | = | అతనియొక్క |
| తత్, తత్ | = | ఆయా | ప్రజ్ఞా | = | బుద్ధి |
| శుభాశుభమ్ | = | శుభాశుభములను | ప్రతిష్ఠితా | = | స్థిరమైయుండును |

దేనియందును మమతాసక్తులు లేనివాడును, అనుకూల పరిస్థితులయందు హర్షము, ప్రతికూల పరిస్థితులయందు ద్వేషము మొదలగు వికారములకు లోనుగానివాడును అగు పురుషుడు స్థితప్రజ్ఞుడు అనబడును. (57)

**యదా సంహరతే చాయం కూర్మోఽంగానీవ సర్వశః ।**
**ఇంద్రియాణీంద్రియార్థేభ్యః తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥ 58 ॥**

యదా, సంహరతే, చ, అయమ్, కూర్మః, అంగాని, ఇవ, సర్వశః,
ఇంద్రియాణి, ఇంద్రియార్థేభ్యః, తస్య, ప్రజ్ఞా, ప్రతిష్ఠితా ॥ 58 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| చ | = | మఱియు | ఇంద్రియాణి | = | ఇంద్రియములను |
| కూర్మః | = | తాబేలు | (సంహరతే) | = | అన్ని విధముల ఉపసంహరించుకొనునో |
| సర్వశః | = | అన్నివైపులనుండి | | | |
| అంగాని | = | (తన) అంగములను | తస్య | = | (అప్పుడు) అతనియొక్క |
| సంహరతే, ఇవ | = | ముడుచుకొనునట్లు | | | |
| యదా | = | ఎప్పుడైతే | ప్రజ్ఞా | = | బుద్ధి |
| అయమ్ | = | ఇతడు (ఈ పురుషుడు) | ప్రతిష్ఠితా | = | స్థిరమైనది (అని భావింపవలెను). |
| ఇంద్రియార్థేభ్యః | = | ఇంద్రియార్థముల నుండి | | | |

తాబేలు తనఅంగములను అన్నివైపులనుండి లోనికి ముడుచుకొనునట్లుగా, ఇంద్రియములను ఇంద్రియార్థముల (విషయాదుల) నుండి అన్నివిధముల ఉపసంహరించుకొనిన పురుషుని యొక్క బుద్ధి స్థిరముగా ఉన్నట్లు భావింపవలెను.(58)

**విషయా వినివర్తంతే నిరాహారస్య దేహినః ।**
**రసవర్జం రసోఽప్యస్య పరం దృష్ట్వా నివర్తతే ॥ 59 ॥**

విషయాః, వినివర్తంతే, నిరాహారస్య, దేహినః,
రసవర్జమ్, రసః, అపి, అస్య, పరమ్, దృష్ట్వా, నివర్తతే ॥ 59 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| నిరాహారస్య | = | ఇంద్రియములద్వారా విషయములను గ్రహింపని | అస్య | = | ఈ స్థితప్రజ్ఞుని యొక్క |
| దేహినః | = | పురుషునియొక్క (పురుషునినుండి) | రసః అపి | = | ఆసక్తి కూడ |
| | | | పరమ్ | = | పరమాత్మను |
| విషయాః | = | శబ్దాదివిషయములు | | | |
| వినివర్తంతే | = | నివృత్తములగును | దృష్ట్వా | = | చూచి (సాక్షాత్కారము పొంది) |
| రసవర్జమ్ | = | (కాని) వాటియందలి ఆసక్తి మాత్రము పోదు | నివర్తతే | = | నివృత్తమగును. |

ఇంద్రియముల ద్వారా విషయములను గ్రహింపనివానినుండి ఇంద్రియార్థములు మాత్రము వైదొలగును. కాని వాటిపై ఆసక్తి మిగిలియుండును. స్థితప్రజ్ఞునకు పరమాత్మ సాక్షాత్కారమైనందువలన వానినుండి ఆ ఆసక్తిగూడ తొలగిపోవును. (59)

**యతతో హ్యపి కౌంతేయ పురుషస్య విపశ్చితః ।**
**ఇంద్రియాణి ప్రమాథీని హరంతి ప్రసభం మనః ॥ 60 ॥**

యతతః, హి, అపి, కౌంతేయ, పురుషస్య, విపశ్చితః,
ఇంద్రియాణి, ప్రమాథీని, హరంతి, ప్రసభమ్, మనః ॥ 60 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| కౌంతేయ | = | ఓ అర్జునా! | విపశ్చితః | = | బుద్ధిమంతుడైన |
| హి | = | ఆసక్తినశింపని కారణమున | పురుషస్య | = | పురుషుని యొక్క |
| ప్రమాథీని | = | ప్రమథనశీలములైన | మనః అపి | = | మనస్సును గూడ |
| ఇంద్రియాణి | = | ఇంద్రియములు | ప్రసభమ్ | = | బలవంతముగా |
| యతతః | = | ప్రయత్నించునట్టి | హరంతి | = | లాగికొనిపోవును. |

ఓ అర్జునా! ఇంద్రియములు ప్రమథనశీలములు. మనుష్యుడు వాటిని నిగ్రహించుటకు ఎంతగా ప్రయత్నించినను, ఆసక్తి తొలగి పోనంతవఱకును అవి అతని మనస్సును ఇంద్రియార్థములవైపు బలవంతముగా లాగికొనిపోవుచునే యుండును. (60)

**తాని సర్వాణి సంయమ్య యుక్త ఆసీత మత్పరః ।**
**వశే హి యస్యేంద్రియాణి తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥ 61 ॥**

తాని, సర్వాణి, సంయమ్య, యుక్తః, ఆసీత, మత్పరః,
వశే, హి, యస్య, ఇంద్రియాణి, తస్య, ప్రజ్ఞా, ప్రతిష్ఠితా ॥ 61 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| తాని, సర్వాణి | = | ఆ సమస్తములైన ఇంద్రియములను | యస్య | = | ఎవనియొక్క |
| | | | ఇంద్రియాణి | = | ఇంద్రియములు |
| సంయమ్య | = | వశమునందుంచుకొని | వశే | = | వశమునందు (ఉండునో) |
| యుక్తః | = | సమాహితచిత్తుడైనవాడు | | | |
| మత్పరః | = | మత్పరాయణుడై | | | |
| ఆసీత | = | ధ్యానమునందు కూర్చొనవలెను | తస్య | = | అతనియొక్క |
| | | | ప్రజ్ఞా | = | బుద్ధియే |
| హి | = | ఏలనన | ప్రతిష్ఠితా | = | స్థిరమైయుండును. |

కనుక, సాధకుడు ఆ ఇంద్రియములను అన్నింటిని వశమునందుంచుకొని, సమాహితచిత్తుడై (చిత్తమును పరమాత్మయందు లగ్నముచేసినవాడై) మత్పరాయణుడై, ధ్యానమునందు కూర్చొనవలెను. ఏలనన, ఇంద్రియములను వశమునందుంచుకొనువాని బుద్ధి స్థిరముగానుండును. (61)

**ధ్యాయతో విషయాన్ పుంసః సంగస్తేషూపజాయతే ।**
**సంగాత్ సంజాయతే కామః కామాత్ క్రోధోఽభిజాయతే ॥ 62 ॥**

ధ్యాయతః, విషయాన్, పుంసః, సంగః, తేషు, ఉపజాయతే,
సంగాత్, సంజాయతే, కామః, కామాత్, క్రోధః, అభిజాయతే ॥ 62 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| విషయాన్ | = | శబ్దాదివిషయములను | సంగాత్ | = | ఆసక్తివలన |
| ధ్యాయతః | = | చింతనచేయుచుండునట్టి | కామః | = | కామము (విషయ వాంఛ) |
| పుంసః | = | పురుషునకు | సంజాయతే | = | ఉత్పన్నమగును |
| తేషు | = | ఆ (శబ్దాది) విషయములయందు | కామాత్ | = | కోరికవలన (ఆ కోరిక తీరనప్పుడు) |
| సంగః | = | ఆసక్తి | క్రోధః | = | కోపము |
| ఉపజాయతే | = | ఏర్పడును | అభిజాయతే | = | కలుగును |

విషయచింతన చేయు పురుషునకు ఆ విషయములయందు ఆసక్తి ఏర్పడును. ఆసక్తివలన ఆ విషయములను పొందుటకై కోరికలు కలుగును. ఆ కోరికలు తీరనప్పుడు క్రోధము ఏర్పడును. (62)

**క్రోధాద్భవతి సమ్మోహః సమ్మోహాత్ స్మృతివిభ్రమః ।**
**స్మృతిభ్రంశాద్బుద్ధినాశో బుద్ధినాశాత్ ప్రణశ్యతి ॥ 63 ॥**

క్రోధాత్, భవతి, సమ్మోహః, సమ్మోహాత్, స్మృతివిభ్రమః,
స్మృతిభ్రంశాత్, బుద్ధినాశః, బుద్ధినాశాత్, ప్రణశ్యతి ॥ 63 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| క్రోధాత్ | = | క్రోధమువలన | బుద్ధినాశః | = | బుద్ధి (జ్ఞానశక్తి) నశించును |
| సమ్మోహః | = | అత్యంతమైన మోహము | బుద్ధినాశాత్ | = | బుద్ధిబలము నశించుటవలన |
| భవతి | = | ఉత్పన్నమగును | ప్రణశ్యతి | = | (ఆ పురుషుడు తన స్థితినుండి) పతనమగును. |
| సమ్మోహాత్ | = | ఆ వ్యామోహమువలన | | | |
| స్మృతివిభ్రమః | = | స్మృతి (జ్ఞాపక శక్తి) భ్రమ ఏర్పడును | | | |
| స్మృతిభ్రంశాత్ | = | స్మృతిభ్రమవలన | | | |

అట్టి క్రోధమువలన వ్యామోహము కలుగును. దాని ప్రభావమున స్మృతి ఛిన్నాభిన్నమగును. స్మృతిభ్రష్టమైనందున బుద్ధి అనగా జ్ఞానశక్తి నశించును. బుద్ధినాశమువలన మనుష్యుడు తన స్థితినుండి పతనమగును. (63)

**రాగద్వేషవియుక్తైస్తు విషయానింద్రియైశ్చరన్ ।**
**ఆత్మవశ్యైర్విధేయాత్మా ప్రసాదమధిగచ్ఛతి ॥ 64 ॥**

రాగద్వేషవియుక్తైః, తు, విషయాన్, ఇంద్రియైః, చరన్,
ఆత్మవశ్యైః, విధేయాత్మా, ప్రసాదమ్, అధిగచ్ఛతి ॥ 64 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| తు | = | కాని | ఇంద్రియైః | = | ఇంద్రియములద్వారా |
| విధేయాత్మా | = | అంతఃకరణము అదుపులోగల సాధకుడు | విషయాన్ | = | విషయములను |
| ఆత్మవశ్యైః | = | తన వశములోనున్న | చరన్ | = | సేవించుచున్ననూ |
| రాగద్వేషవియుక్తైః | = | రాగద్వేషరహితములైన | ప్రసాదమ్ | = | అంతఃకరణ ప్రసన్నతను |
| | | | అధిగచ్ఛతి | = | పొందును. |

అంతఃకరణమును వశమునందుంచుకొనిన సాధకుడు రాగద్వేషరహితుడై, ఇంద్రియముల ద్వారా విషయములను గ్రహించుచున్నను మనశ్శాంతిని పొందును. (64)

**ప్రసాదే సర్వదుఃఖానాం హానిరస్యోపజాయతే ।**
**ప్రసన్నచేతసో హ్యాశు బుద్ధిః పర్యవతిష్ఠతే ॥ 65 ॥**

ప్రసాదే, సర్వదుఃఖానామ్, హానిః, అస్య, ఉపజాయతే,
ప్రసన్నచేతసః, హి, ఆశు, బుద్ధిః, పర్యవతిష్ఠతే ॥ 65 ॥

| | | | |
|---|---|---|---|
| ప్రసాదే | = అంతఃకరణ ప్రసన్నత ప్రాప్తించినంతనే | ప్రసన్నచేతసః | = ప్రసన్న మనస్కుడైన కర్మయోగియొక్క |
| అస్య | = ఇతనియొక్క | బుద్ధిః | = బుద్ధి |
| సర్వదుఃఖానామ్ | = సమస్త దుఃఖములకును | ఆశు, హి | = శీఘ్రముగానే (వెంటనే) |
| హానిః, ఉపజాయతే | = అభావము కలుగును. సమస్త దుఃఖములును తొలగిపోవును | పర్యవతిష్ఠతే | = పరమాత్మయందే పూర్తిగా స్థిరమగును. |

మనఃప్రసన్నతను పొందిన వెంటనే అతనిదుఃఖములన్నియును నశించును. ప్రసన్నచిత్తుడైన కర్మయోగియొక్క బుద్ధి అన్నివిషయములనుండి వైదొలగి, పరమాత్మయందు మాత్రమే పూర్తిగా స్థిరమగును. (65)

**నాస్తి బుద్ధిరయుక్తస్య న చాయుక్తస్య భావనా ।**
**న చాభావయతః శాంతిః అశాంతస్య కుతః సుఖమ్ ॥ 66 ॥**

న, అస్తి, బుద్ధిః, అయుక్తస్య, న, చ, అయుక్తస్య భావనా,
న, చ, అభావయతః, శాంతిః, అశాంతస్య, కుతః, సుఖమ్ ॥ 66 ॥

| | | | |
|---|---|---|---|
| అయుక్తస్య | = ఇంద్రియములను, మనస్సును వశమునందుంచుకొననివానియందు | న | = కలుగదు |
| | | చ | = మఱియు |
| | | అభావయతః | = పరమాత్మభావన లేనివానికి |
| బుద్ధిః | = నిశ్చయాత్మకబుద్ధి | | |
| న, అస్తి | = ఉండదు | శాంతిః | = శాంతి |
| చ | = మఱియు | న | = లభింపదు |
| అయుక్తస్య | = అయుక్తుడైన వానియొక్క (అంతఃకరణమునందు) | అశాంతస్య | = శాంతిలేనివానికి |
| | | సుఖమ్ | = సుఖము |
| భావనా | = పరమాత్మభావనయును | కుతః | = ఎట్లు లభించును? |

ఇంద్రియములు, మనస్సు వశమునందు ఉండని వానియందు నిశ్చయాత్మకబుద్ధి ఉండదు. అట్టి అయుక్తమనుష్యుని అంతఃకరణమునందు ఆస్తికభావమే కలుగదు. తద్భావనాహీనుడైన వానికి శాంతి లభింపదు. మనశ్శాంతి లేనివానికి సుఖము ఎట్లు లభించును? (66)

**ఇంద్రియాణాం హి చరతాం యన్మనోఽను విధీయతే ।**
**తదస్య హరతి ప్రజ్ఞాం వాయుర్నావమివాంభసి ॥ 67 ॥**

ఇంద్రియాణామ్, హి, చరతామ్, యత్, మనః, అను, విధీయతే,
తత్, అస్య, హరతి, ప్రజ్ఞామ్, వాయుః, నావమ్, ఇవ, అంభసి ॥ 67 ॥

| | | | |
|---|---|---|---|
| హి | = ఏలనన | ఇంద్రియాణామ్ | = ఇంద్రియములలో |
| అంభసి | = నీటియందు (సంచరించు) | మనః | = మనస్సు |
| నావమ్ | = నావను | యత్, అను విధీయతే | = ఏ ఇంద్రియముతో కూడియుండునో |
| వాయుః హరతి, ఇవ | = వాయువు ఎట్లు హరించునో (నెట్టివేయునో) | తత్ | = ఆ ఒక్క ఇంద్రియమే |
| చరతామ్ | = (అట్లే) శబ్దాది విషయముల యందు చరించుచున్నట్టి | అస్య | = ఈ అయుక్తుడైన పురుషునియొక్క |
| | | ప్రజ్ఞామ్ (హరతి) | = బుద్ధిని హరించును |

నీటిపై తేలుచున్న నావను గాలినెట్టివేయును. అట్లే ఇంద్రియార్థములయందు సంచరించు ఇంద్రియములలో మనస్సు ఏ ఒక్క ఇంద్రియముతో కూడియున్నను ఆ ఒక్క ఇంద్రియమే మనోనిగ్రహములేని మనుజునిబుద్ధిని అనగా విచక్షణా శక్తిని హరించివేయును. (67)

**తస్మాద్యస్య మహాబాహో! నిగృహీతాని సర్వశః ।**
**ఇంద్రియాణీంద్రియార్థేభ్యః తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥ 68 ॥**

తస్మాత్, యస్య, మహాబాహో, నిగృహీతాని, సర్వశః,
ఇంద్రియాణి, ఇంద్రియార్థేభ్యః, తస్య, ప్రజ్ఞా, ప్రతిష్ఠితా ॥ 68 ॥

| | | | |
|---|---|---|---|
| తస్మాత్ | = అందువలన | సర్వశః | = అన్నివిధముల |
| మహాబాహో | = ఓ అర్జునా! | నిగృహీతాని | = నిగ్రహింపబడునో |
| యస్య | = ఎవనియొక్క | తస్య | = అతనియొక్క |
| ఇంద్రియాణి | = ఇంద్రియములు | ప్రజ్ఞా | = బుద్ధి |
| ఇంద్రియార్థేభ్యః | = ఇంద్రియవిషయములనుండి | ప్రతిష్ఠితా | = స్థిరమగును. |

కనుక, ఓ అర్జునా! ఇంద్రియములను ఇంద్రియార్థములనుండి అన్ని విధములుగ పూర్తిగా నిగ్రహించిన పురుషునియొక్క బుద్ధి స్థిరముగానుండును. (68)

**యా నిశా సర్వభూతానాం తస్యాం జాగర్తి సంయమీ ।**
**యస్యాం జాగ్రతి భూతాని సా నిశా పశ్యతో మునేః ॥ 69 ॥**

యా, నిశా, సర్వభూతానామ్, తస్యామ్, జాగర్తి, సంయమీ,
యస్యామ్, జాగ్రతి, భూతాని, సా, నిశా, పశ్యతః, మునేః ॥ 69 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| సర్వభూతానామ్ | = | సమస్తప్రాణులకును | యస్యామ్ | = | నశ్వరమైన ఏ సాంసారిక సుఖప్రాప్తియందు |
| యా | = | ఏదైతే | | | |
| నిశా | = | రాత్రియో (రాత్రితో సమానమో) | భూతాని | = | సకలప్రాణులును |
| | | | జాగ్రతి | = | మేల్కొనియుండునో |
| తస్యామ్ | = | దానియందు (ఆ నిత్య జ్ఞానస్వరూప పరమానంద ప్రాప్తియందు) | పశ్యతః | = | పరమాత్మతత్త్వము నెఱింగిన |
| | | | మునేః | = | మునికి |
| సంయమీ | = | స్థిత ప్రజ్ఞుడైన యోగి | సా | = | అది |
| జాగర్తి | = | మేల్కొనియుండును | నిశా | = | రాత్రి (రాత్రితో సమానము) |

నిత్యజ్ఞానస్వరూపపరమానందప్రాప్తియందు స్థితప్రజ్ఞుడైన యోగి మేల్కొని యుండును. అది ఇతరప్రాణులన్నింటికిని రాత్రితో సమానము. నశ్వరమైన ప్రాపంచిక సుఖప్రాప్తికై ప్రాకులాడుచు ప్రాణులన్నియు మేల్కొని యుండును. అది పరమాత్మతత్త్వమునెఱిగిన మునికి (మననశీలునకు) రాత్రితో సమానము. (69)

**ఆపూర్యమాణమచలప్రతిష్ఠం**
**సముద్రమాపః ప్రవిశంతి యద్వత్ ।**
**తద్వత్ కామా యం ప్రవిశంతి సర్వే**
**స శాంతిమాప్నోతి న కామకామీ ॥ 70 ॥**

ఆపూర్యమాణమ్, అచలప్రతిష్ఠమ్, సముద్రమ్, ఆపః,
ప్రవిశంతి, యద్వత్, తద్వత్, కామాః, యమ్, ప్రవిశంతి, సర్వే,
సః, శాంతిమ్, ఆప్నోతి, న, కామకామీ ॥ 70 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| యద్వత్ | = | ఎట్లయితే | యమ్ | = | ఏ స్థితప్రజ్ఞునియందు |
| ఆపః | = | (నానావిధనదులయొక్క) జలములు | ప్రవిశంతి | = | (ఎట్టి వికారములు కల్గింపకయే) లీనమగునో |
| ఆపూర్యమాణమ్ = | | అన్నివైపుల పరిపూర్ణమైన | సః | = | ఆ పురుషుడు |
| అచలప్రతిష్ఠమ్ = | | నిశ్చలముగానున్న | శాంతిమ్ | = | పరమశాంతిని |
| సముద్రమ్ | = | సముద్రమును | ఆప్నోతి | = | పొందును |
| ప్రవిశంతి | = | (ఏ మాత్రము చలింపజేయ కుండగనే) ప్రవేశించునో | కామకామీ | = | భోగేచ్ఛగలవాడు |
| తద్వత్ | = | అట్లే | న | = | శాంతిని పొందజాలడు |
| సర్వే, కామాః | = | సకల భోగములు | | | |

సమస్తదిశలనుండి పొంగి ప్రవహించుచు వచ్చిచేరిన నదులన్నియును పరిపూర్ణమై నిశ్చలముగానున్న సముద్రమును ఏమాత్రము చలింపజేయకుండగనే అందులో లీనమగును. అట్లే సమస్తభోగములును స్థితప్రజ్ఞునియందు ఎట్టి వికారములను కల్గింపకయే వానిలో లీనమగును. అట్టి పురుషుడే పరమశాంతిని పొందును. భోగాసక్తుడు శాంతిని పొందజాలడు. (70)

**విహాయ కామాన్ యః సర్వాన్ పుమాంశ్చరతి నిఃస్పృహః ।**
**నిర్మమో నిరహంకారః స శాంతిమధిగచ్ఛతి ॥ 71 ॥**

విహాయ, కామాన్, యః, సర్వాన్, పుమాన్, చరతి, నిఃస్పృహః,
నిర్మమః, నిరహంకారః, సః, శాంతిమ్, అధిగచ్ఛతి ॥ 71 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| యః,పుమాన్ | = | ఏ పురుషుడు | నిఃస్పృహః | = | స్పృహారహితుడై |
| సర్వాన్,కామాన్= | | సమస్తమైన కోరికలను | చరతి | = | చరించునో |
| విహాయ | = | త్యజించి | సః | = | అతడే |
| నిర్మమః | = | మమతారహితుడై | శాంతిమ్ | = | శాంతిని |
| నిరహంకారః | = | అహంకారరహితుడై | అధిగచ్ఛతి | = | పొందును. |

కోరికలన్నింటిని త్యజించి, మమతా- అహంకార, స్పృహారహితుడై చరించునట్టి పురుషుడే శాంతిని పొందును. (71)

**ఏషా బ్రాహ్మీ స్థితిః పార్థ నైనాం ప్రాప్య విముహ్యతి ।**
**స్థిత్వాస్యామంతకాలేఽపి బ్రహ్మనిర్వాణమృచ్ఛతి ॥ 72 ॥**

ఏషా, బ్రాహ్మీ, స్థితిః, పార్థ, న, ఏనామ్, ప్రాప్య, విముహ్యతి,
స్థిత్వా, అస్యామ్, అంతకాలే, అపి, బ్రహ్మనిర్వాణమ్, ఋచ్ఛతి ॥ 72 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| పార్థ | = | ఓ పార్థా! | న, విముహ్యతి | = | (యోగి ఎన్నడును) మోహితుడుకాడు |
| ఏషా | = | ఇదియే | అంతకాలే, అపి | = | అంత్యకాలమునందును |
| బ్రాహ్మీ | | బ్రహ్మప్రాప్తినందిన | అస్యామ్ | = | ఈ బ్రాహ్మీస్థితియందు |
| స్థితిః | | పురుషునియొక్క స్థితి | స్థిత్వా | = | స్థితమైయుండినవాడు |
| ఏనామ్ | = | దీనిని | బ్రహ్మనిర్వాణమ్ | = | బ్రహ్మానందమును |
| ప్రాప్య | = | పొంది (పొందినపిదప) | ఋచ్ఛతి | = | పొందును |

ఓ అర్జునా! బ్రాహ్మీస్థితి యనగా ఇదియే. (ఇదియే బ్రహ్మప్రాప్తి కలిగిన పురుషుని స్థితి.) ఈ బ్రాహ్మీస్థితిని పొందిన యోగి ఎన్నడుమ మోహితుడు కాడు. అంత్యకాలమునందుమ ఈ బ్రాహ్మీస్థితియందు స్థిరముగానున్నవాడు బ్రహ్మానందమును పొందును. (72)

ఓం తత్సదితి శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే సాంఖ్యయోగోనామ ద్వితీయోఽధ్యాయః ॥ ౨ ॥

|| ఓం శ్రీపరమాత్మనే నమః ||

# అథ తృతీయోఽధ్యాయః- కర్మయోగః

## (మూడవ అధ్యాయము - కర్మయోగము)

ముఖ్యాంశములు : [(1 నుండి 8వ శ్లోకమువఱకు) జ్ఞానయోగనిష్కామ కర్మయోగములననుసరించి, ఆసక్తిరహితముగా నియతకర్మాచరణముల శ్రేష్ఠత్వ నిరూపణము (9 నుండి 16 వఱకు) యజ్ఞాది కర్మాచరణముల ఆవశ్యకస్థితి నిరూపణము (17 నుండి 24 వఱకు) జ్ఞానియు భగవానుడును లోకసంగ్రహార్థమై కర్మలను ఆచరించుచుండుట. (25 నుండి 35 వఱకు) అజ్ఞానుల-జ్ఞానుల లక్షణములు, రాగద్వేషరహితులై కర్మలనాచరించుటకు ప్రేరణ. (36 నుండి 43 వఱకు) కామరూప శత్రువును జయించుటకు ఉపాయములు.]

**అర్జున ఉవాచ**

**జ్యాయసీ చేత్ కర్మణస్తే మతా బుద్ధిర్జనార్దన ।**
**తత్కిం కర్మణి ఘోరే మాం నియోజయసి కేశవ ॥ 1 ॥**

జ్యాయసీ, చేత్, కర్మణః, తే, మతా, బుద్ధిః, జనార్దన,
తత్, కిమ్, కర్మణి, ఘోరే, మామ్, నియోజయసి, కేశవ ॥ 1 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| జనార్దన! | = | ఓ జనార్దనా! | కేశవ! | = | ఓ కేశవా! |
| కర్మణః | = | కర్మకంటెను | మామ్ | = | నన్ను |
| బుద్ధిః | = | జ్ఞానము | ఘోరే | = | భయంకరమైన |
| జ్యాయసీ తే | = | శ్రేష్ఠమైనదని నీ | కర్మణి | = | (ఈ) యుద్ధ కార్యమునందు |
| మతా, చేత్ | = | అభిప్రాయమైనచో | కిమ్ | = | ఎందులకు |
| తత్ | = | అట్టిస్థితిలో | నియోజయసి | = | నియోగించుచున్నావు? |

అర్జునుడు పలికెను- ఓ జనార్దనా! కేశవా! నీ అభిప్రాయమును బట్టి కర్మ కంటెను జ్ఞానమే శ్రేష్ఠమైనచో, భయంకరమైన ఈ యుద్ధకార్యమునందు నన్నేల నియోగించుచున్నావు? (1)

**వ్యామిశ్రేణేవ వాక్యేన బుద్ధిం మోహయసీవ మే ।**
**తదేకం వద నిశ్చిత్య యేన శ్రేయోఽహమాప్నుయామ్ ॥ 2 ॥**

వ్యామిశ్రేణ, ఇవ, వాక్యేన, బుద్ధిమ్, మోహయసి, ఇవ, మే,
తత్, ఏకమ్, వద, నిశ్చిత్య, యేన, శ్రేయః, అహమ్, ఆప్నుయామ్ ॥ 2 ॥

వ్యామిశ్రేణ, ఇవ = కలగాపులగమువలె ఉన్న
వాక్యేన = (నీ)మాటలతో
మే = నా
బుద్ధిమ్ = బుద్ధిని
మోహయసి, ఇవ = భ్రమింపజేయు చున్నట్లు ఉన్నావు
యేన = దేనిచేత

అహమ్ = నేను
శ్రేయః = శ్రేయస్సును
ఆప్నుయామ్ = పొందుదునో
తత్, ఏకమ్ = అట్టి ఒక మార్గము (కర్మమునో, జ్ఞానమునో)
నిశ్చిత్య = నిశ్చయముగా
వద = చెప్పుము.

కలగాపులగమువంటి నీ మాటలతో నా బుద్ధి భ్రమకు లోనగునట్లు చేయుచున్నావు. కనుక నాకు శ్రేయస్కరమైన ఒక మార్గమును నిశ్చయముగా తెల్పుము. (2)

**శ్రీభగవాన్ ఉవాచ**

**లోకేఽస్మిన్ ద్వివిధా నిష్ఠా పురా ప్రోక్తా మయానఘ ।**
**జ్ఞానయోగేన సాంఖ్యానాం కర్మయోగేన యోగినామ్ ॥ 3 ॥**

లోకే, అస్మిన్, ద్వివిధా, నిష్ఠా, పురా, ప్రోక్తా, మయా, అనఘ,
జ్ఞానయోగేన, సాంఖ్యానామ్, కర్మయోగేన, యోగినామ్ ॥ 3 ॥

అనఘ! = పాపరహితుడా!
అస్మిన్, లోకే = ఈలోకమునందు
ద్వివిధా, నిష్ఠా = రెండు విధములగు నిష్ఠలు
మయా = నాచేత
పురా, ప్రోక్తా = ఇంతకుముందే చెప్పబడినవి

సాంఖ్యానామ్ = సాంఖ్యయోగులకు
జ్ఞానయోగేన(1) = జ్ఞానయోగము ద్వారా (మరియు)
యోగినామ్ = యోగులకు
కర్మయోగేన(2) = కర్మయోగముద్వారా (నిష్ఠ కలుగును)

1) మాయాజనితములైన గుణములే గుణములయందు ప్రవర్తిల్లుచున్నవని భావించి, శరీరేంద్రియ మనస్సులద్వారా జరుగు క్రియలన్నింటియందును కర్తృత్వాభిమానము లేనివాడై, సర్వవ్యాపియైన సచ్చిదానంద ఘనపరమాత్మయందు ఏకీభావముతో స్థితుడై యుండుటయే జ్ఞానయోగము. దీనినే సన్న్యాసము, సాంఖ్యయోగము అనియు అందురు.

2) ఫలమును, ఆసక్తినివీడి, భగవదాజ్ఞానుసారము కేవలము భగవదర్థ సమత్వ బుద్ధితో కర్మలను ఆచరించుటను 'నిష్కామ కర్మయోగము'అని యందురు. దీనినే 'సమత్వయోగము' 'బుద్ధియోగము' 'కర్మయోగము' 'తదర్థకర్మ' 'మదర్థకర్మ' 'మత్కర్మ' మొదలగు పేర్లతో వ్యవహరింతురు.

శ్రీభగవానుడు పలికెను - ఓ అనఘా! అర్జునా! ఈ లోకమున రెండు నిష్ఠలు గలవని ఇంతకుముందే చెప్పియుంటిని. వానిలో సాంఖ్యయోగులకు జ్ఞానయోగముద్వారా, యోగులకు కర్మయోగముద్వారా నిష్ఠ కలుగును. (3)

**న కర్మణామనారంభాత్ నైష్కర్మ్యం పురుషోఽశ్నుతే ।**
**న చ సన్న్యసనాదేవ సిద్ధిం సమధిగచ్ఛతి ॥ 4 ॥**

న, కర్మణామ్, అనారంభాత్, నైష్కర్మ్యమ్, పురుషః, అశ్నుతే,
న, చ, సన్న్యసనాత్, ఏవ, సిద్ధిమ్, సమధిగచ్ఛతి ॥ 4 ॥

| | | | |
|---|---|---|---|
| పురుషః | = మానవుడు | చ | = మరియు |
| కర్మణామ్ | = కర్మలను | సన్న్యసనాత్, ఏవ | = కర్మలను త్యజించి నంతమాత్రమున |
| అనారంభాత్ | = ఆచరింపకుండుటవలన | సిద్ధిమ్ | = సిద్ధిని (సాంఖ్య యోగనిష్ఠను) |
| నైష్కర్మ్యమ్[1] | = నైష్కర్మ్యమును అనగా యోగనిష్ఠాస్థితిని | | |
| న, అశ్నుతే | = పొందడు | న సమధిగచ్ఛతి | = పొందజాలడు. |

మనుష్యుడు కర్మలను ఆచరింపకయే నైష్కర్మ్యము అనగా యోగనిష్ఠాసిద్ధి ఆతనికి లభింపదు. అట్లే కేవలము కర్మలను త్యజించినంత మాత్రమున సిద్ధిని అనగా సాంఖ్యనిష్ఠను అతడు పొందజాలడు. (4)

**న హి కశ్చిత్ క్షణమపి జాతు తిష్ఠత్యకర్మకృత్ ।**
**కార్యతే హ్యవశః కర్మ సర్వః ప్రకృతిజైర్గుణైః ॥ 5 ॥**

న, హి, కశ్చిత్, క్షణమ్, అపి, జాతు, తిష్ఠతి, అకర్మకృత్,
కార్యతే, హి, అవశః, కర్మ, సర్వః, ప్రకృతిజైః, గుణైః ॥ 5 ॥

| | | | |
|---|---|---|---|
| హి | = నిస్పందేహముగా | సర్వః | = ప్రతిమనుష్యుడును (మనుష్యులందరునూ) |
| కశ్చిత్ | = ఏమనుష్యుడైనను | | |
| జాతు | = ఒకానొకప్పుడును | ప్రకృతిజైః,గుణైః | = ప్రకృతిజనితము లైన గుణములచేత |
| క్షణమ్, అపి | = క్షణకాలముగూడ | | |
| అకర్మకృత్ | = కర్మను చేయనివాడై | అవశః | = అవశుడై(అవశముగనే) |
| న, తిష్ఠతి | = ఉండజాలడు | కర్మ | = కర్మను (చేయుటకు) |
| హి | = ఏలననగా | కార్యతే | = బాధ్యుడగుచున్నాడు. |

1) ఏ స్థితిలో పురుషునికర్మలు అకర్మలగునో అనగా ఫలమును ఉత్పన్నముచేయలేవో ఆస్థితిని నైష్కర్మ్యమందురు.

ఏ మనుష్యుడైనను ఏ కాలమునందైనను క్షణమాత్రముగూడ కర్మను ఆచరింపకుండ ఉండలేడు. ఇందు ఎట్టి సందేహమునకును తావులేదు. ఏలనన మనుష్యులందఱును ప్రకృతిజనితములైన గుణములకు లోబడి కర్మలను చేయుటకు బాధ్యులగుదురు. ప్రతి వ్యక్తియు కర్మను ఆచరింపవలసియే యుండును. (5)

**కర్మేంద్రియాణి సంయమ్య య ఆస్తే మనసా స్మరన్ ।**
**ఇంద్రియార్థాన్ విమూఢాత్మా మిథ్యాచారః స ఉచ్యతే ॥ 6 ॥**

కర్మేంద్రియాణి, సంయమ్య, యః, ఆస్తే, మనసా, స్మరన్,
ఇంద్రియార్థాన్, విమూఢాత్మా, మిథ్యాచారః, సః, ఉచ్యతే ॥ 6 ॥

| | | | |
|---|---|---|---|
| యః | = ఎవడైతే | స్మరన్ | = చింతించుచు |
| కర్మేంద్రియాణి | = సమస్తేంద్రియములను | ఆస్తే | = ఉండునో |
| సంయమ్య | = (బాహ్యముగా) ఆదుపుచేసి | సః, విమూఢాత్మా | = ఆ మూఢుడు |
| మనసా | = మనస్సుద్వారా | మిథ్యాచారః | = దంభా(కపటా) చారముగలవాడు-అని |
| ఇంద్రియార్థాన్ | = శబ్దాది విషయములను | ఉచ్యతే | = చెప్పబడుచున్నాడు. |

బలవంతముగా, బాహ్యముగా ఇంద్రియవ్యాపారములను నిగ్రహించి, మానసికముగా ఇంద్రియవిషయములను చింతించునట్టి మూఢుని మిథ్యాచారి అనగా దంభి అనియందురు. (6)

**యస్త్వింద్రియాణి మనసా నియమ్యారభతేఽర్జున ।**
**కర్మేంద్రియైః కర్మయోగమ్ అసక్తః స విశిష్యతే ॥ 7 ॥**

యః, తు, ఇంద్రియాణి, మనసా, నియమ్య, ఆరభతే, అర్జున,
కర్మేంద్రియైః, కర్మయోగమ్, అసక్తః, సః, విశిష్యతే ॥ 7 ॥

| | | | |
|---|---|---|---|
| తు | = కాని | అసక్తః | = అనాసక్తుడై |
| అర్జున! | = ఓ అర్జునా! | కర్మేంద్రియైః | = సమస్త-ఇంద్రియములచేత |
| యః | = ఎవడైతే | కర్మయోగమ్ | = కర్మయోగమును |
| మనసా | = మనస్సుద్వారా | ఆరభతే | = ఆచరించునో |
| ఇంద్రియాణి | = ఇంద్రియములను | సః | = అతడు |
| నియమ్య | = వశపరచుకొని | విశిష్యతే | = శ్రేష్ఠుడగును. |

కాని, అర్జునా! మనస్సుతో ఇంద్రియములను వశపఱచుకొని, అనాసక్తుడై ఇంద్రియములద్వారా కర్మయోగాచరణమును కావించు పురుషుడు శ్రేష్ఠుడు. (7)

**నియతం కురు కర్మ త్వం కర్మ జ్యాయో హ్యకర్మణః ।**
**శరీరయాత్రాఽపి చ తే న ప్రసిద్ధ్యేదకర్మణః ॥ 8 ॥**

నియతమ్, కురు, కర్మ, త్వమ్, కర్మ, జ్యాయః, హి, అకర్మణః,
శరీరయాత్రా, అపి, చ, తే, న, ప్రసిద్ధ్యేత్,అకర్మణః ॥ 8 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| త్వమ్ | = | నీవు | కర్మ | = | కర్మలను చేయుటయే |
| నియతమ్ | = | విధ్యుక్తమైన | జ్యాయః | = | శ్రేష్ఠము |
| కర్మ | = | కర్తవ్యకర్మను | చ | = | మఱియు |
| కురు | = | చేయుము | అకర్మణః | = | కర్మలనాచరించకపోవుటచే |
| హి | = | ఏలననగా | తే, శరీరయాత్రా | = | నీ శరీరనిర్వహణ |
| అకర్మణః | = | కర్మలనాచరింప | అపి | = | కూడా |
| | | కుండుటకంటె | న, ప్రసిద్ధ్యేత్ | = | కొనసాగదు |

నీవు శాస్త్రవిహితకర్తవ్యకర్మలను ఆచరింపుము. ఏలనన కర్మలను చేయకుండుటకంటెను చేయుటయే ఉత్తమము. కర్మలను ఆచరింపనిచో నీ శరీర నిర్వహణముగూడ సాధ్యము గాదు. (8)

**యజ్ఞార్థాత్ కర్మణోఽన్యత్ర లోకోఽయం కర్మబంధనః ।**
**తదర్థం కర్మ కౌంతేయ ముక్తసంగః సమాచర ॥ 9 ॥**

యజ్ఞార్థాత్, కర్మణః, అన్యత్ర, లోకః, అయమ్, కర్మబంధనః,
తదర్థమ్, కర్మ, కౌంతేయ, ముక్తసంగః, సమాచర ॥ 9 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| కౌంతేయ | = | ఓ కౌంతేయా! (అర్జునా) | కర్మబంధనః | = | కర్మబంధములలో |
| యజ్ఞార్థాత్ | = | యజ్ఞార్థముచేయబడు | | | చిక్కుకొనును |
| కర్మణః | = | కర్మలుగాక | ముక్తసంగః | = | (కనుక)ఆసక్తి |
| అన్యత్ర | = | ఇతరకర్మలలో | | | రహితుడవై |
| | | నిమగ్నులగుటవలన | తదర్థమ్ | = | యజ్ఞార్థము |
| అయమ్, లోకః | = | ఈలోకము (మనుష్య | కర్మ | = | కర్తవ్యకర్మను |
| | | సముదాయము) | సమాచర | = | చక్కగా ఆచరింపుము. |

ఓ అర్జునా! యజ్ఞార్థము చేయబడు కర్మలలో గాక ఇతర కర్మలయందు నిమగ్నులగుటవలన మనుష్యులు కర్మబంధములలో చిక్కుపడుదురు. కనుక నీవు ఆసక్తిరహితుడవై యజ్ఞార్థమే కర్తవ్యకర్మలను చక్కగా ఆచరింపుము. (9)

**సహయజ్ఞాః ప్రజాః సృష్ట్వా పురోవాచ ప్రజాపతిః ।**
**అనేన ప్రసవిష్యధ్వమ్ ఏష వోఽస్త్విష్టకామధుక్ ॥ 10 ॥**

సహయజ్ఞాః, ప్రజాః, సృష్ట్వా, పురా, ఉవాచ, ప్రజాపతిః,
అనేన, ప్రసవిష్యధ్వమ్, ఏషః, వః, అస్తు, ఇష్టకామధుక్ ॥ 10 ॥

**ప్రజాపతిః** = ప్రజాపతియైన బ్రహ్మ
**పురా** = కల్పాదియందు
**సహయజ్ఞాః** = యజ్ఞసహితముగా
**ప్రజాః** = ప్రజలను
**సృష్ట్వా** = సృజించి
**ఉవాచ** = పలికెను
**(యూయమ్)** = మీరు
**అనేన** = ఈ యజ్ఞముద్వారా
**ప్రసవిష్యధ్వమ్** = వృద్ధి చెందుడు
**ఏషః** = ఈ యజ్ఞము
**వః** = మీకు
**ఇష్టకామధుక్** = ఇష్టభోగములను ఇచ్చునది
**అస్తు** = అగుగాక !

కల్పాదియందు బ్రహ్మదేవుడు యజ్ఞసహితముగ ప్రజలను సృష్టించి, "మీరు ఈ యజ్ఞములద్వారా వృద్ధిచెందుడు. ఈ యజ్ఞములు మీకు కామధేనువు వలె కోరిన కోర్కెలనెల్ల తీర్చును" అని పల్కెను. (10)

**దేవాన్ భావయతానేన తే దేవా భావయంతు వః ।**
**పరస్పరం భావయంతః శ్రేయః పరమవాప్స్యథ ॥ 11 ॥**

దేవాన్, భావయత, అనేన, తే, దేవాః, భావయంతు, వః,
పరస్పరమ్, భావయంతః, శ్రేయః, పరమ్, అవాప్స్యథ ॥ 11 ॥

**అనేన** = ఈయజ్ఞముద్వారా(మీరు)
**దేవాన్** = దేవతలను
**భావయత** = తృప్తిపరచుడు
**తే, దేవాః** = ఆ దేవతలు
**వః** = మిమ్ములను
**భావయంతు** = వృద్ధిపరచుదురుగాక!
**(ఏవమ్)** = ఈ విధముగా
**పరస్పరమ్** = పరస్పరము
**భావయంతః** = సంతృప్తిపఱచు కొనుచు
**(యూయమ్)** = మీరు
**పరమ్, శ్రేయః** = పరమ శ్రేయస్సును
**అవాప్స్యథ** = పొందగలరు.

"ఈ యజ్ఞముల ద్వారా మీరు దేవతలను తృప్తిపఱచుడు. మఱియు ఆ దేవతలు మిమ్ములను అనుగ్రహింతురు. నిస్స్వార్థభావముతో మీరు పరస్పరము సంతృప్తిపఱచుకొనుచు పరమశ్రేయస్సును పొందగలరు." అని పల్కెను. (11)

**ఇష్టాన్ భోగాన్ హి వో దేవా దాస్యంతే యజ్ఞభావితాః ।**
**తైర్దత్తానప్రదాయైభ్యో యో భుంక్తే స్తేన ఏవ సః ॥ 12 ॥**

ఇష్టాన్, భోగాన్, హి, వః, దేవాః, దాస్యంతే, యజ్ఞభావితాః,
తైః, దత్తాన్, అప్రదాయ, ఏభ్యః, యః, భుంక్తే, స్తేన, ఏవ, సః ॥ 12 ॥

| | | | |
|---|---|---|---|
| యజ్ఞభావితాః | = యజ్ఞములద్వారా సంతృప్తిచెందిన | తైః | = ఆ దేవతలచే |
| | | దత్తాన్ | = ఇయ్యబడిన భోగములను |
| దేవాః | = దేవతలు | యః | = ఎవడైతే |
| వః | = మీకు | ఏభ్యః | = వీరికి |
| ఇష్టాన్ | = ఇష్టములైన | అప్రదాయ | = ఇయ్యకయే |
| భోగాన్ | = భోగములను | భుంక్తే | = అనుభవించునో |
| హి | = నిశ్చయముగా | సః | = అతడు |
| దాస్యంతే | = ప్రసాదించెదరు | స్తేనః, ఏవ | = దొంగయే |

యజ్ఞములద్వారా సంతృప్తిని పొందిన దేవతలు మీకు(మానవులకు) అయాచితముగనే ఇష్టములైన భోగములను ప్రసాదించెదరు. ఈ విధముగ దేవతలచే అనుగ్రహింపబడిన ఈ భోగములను ఆదేవతలకు నివేదనచేయక తానే అనుభవించువాడు నిజముగా దొంగయే. (12)

**యజ్ఞశిష్టాశినః సంతో ముచ్యంతే సర్వకిల్బిషైః ।**
**భుంజతే తే త్వఘం పాపా యే పచంత్యాత్మకారణాత్ ॥ 13 ॥**

యజ్ఞశిష్టాశినః, సంతః, ముచ్యంతే, సర్వకిల్బిషైః,
భుంజతే, తే, తు, అఘమ్, పాపాః, యే, పచంతి, ఆత్మకారణాత్ ॥ 10 ॥

| | | | |
|---|---|---|---|
| యజ్ఞశిష్టాశినః | = యజ్ఞశిష్టాన్నమును భుజించునట్టి | ఆత్మకారణాత్ | = తమశరీరపోషణకొరకే |
| | | పచంతి | = (అన్నమును) వండుకొందురో |
| సంతః | = సత్పురుషులు | | |
| సర్వకిల్బిషైః | = సర్వపాపములనుండి | తే, తు | = వారైతే |
| ముచ్యంతే | = ముక్తులగుదురు | అఘమ్ | = పాపమునే |
| యే, పాపాః,(తు) | = ఏపాపాత్ములైతే | భుంజతే | = భుజింతురు |

యజ్ఞశిష్టాన్నమును తిను శ్రేష్ఠపురుషులు అన్ని పాపములనుండి ముక్తులయ్యెదరు. తమ శరీరపోషణకొఱకే ఆహారమును సిద్ధపఱచు (వండు)కొను పాపులు పాపమునే భుజింతురు.(13)

**అన్నాద్భవంతి భూతాని పర్జన్యాదన్నసంభవః ।**
**యజ్ఞాద్భవతి పర్జన్యో యజ్ఞః కర్మసముద్భవః ॥ 14 ॥**
**కర్మ బ్రహ్మోద్భవం విద్ధి బ్రహ్మాక్షరసముద్భవమ్ ।**
**తస్మాత్ సర్వగతం బ్రహ్మ నిత్యం యజ్ఞే ప్రతిష్ఠితమ్ ॥ 15 ॥**

అన్నాత్, భవంతి, భూతాని, పర్జన్యాత్, అన్నసంభవః,
యజ్ఞాత్, భవతి, పర్జన్యః, యజ్ఞః, కర్మసముద్భవః ॥ 14 ॥
కర్మ, బ్రహ్మోద్భవమ్, విద్ధి, బ్రహ్మ, అక్షరసముద్భవమ్,
తస్మాత్, సర్వగతమ్, బ్రహ్మ, నిత్యమ్, యజ్ఞే, ప్రతిష్ఠితమ్ ॥ 15 ॥

భూతాని = ప్రాణులన్నియును
అన్నాత్ = అన్నమునుండి
భవంతి = ఉత్పన్నములగును
పర్జన్యాత్ = వర్షమువలన
అన్నసంభవః = అన్నోత్పత్తి యగును
పర్జన్యః = వర్షము
యజ్ఞాత్, భవతి = యజ్ఞమువలన కలుగును
యజ్ఞః = యజ్ఞము
కర్మసముద్భవః = విహితకర్మలవలన ఏర్పడును
కర్మ = కర్మ (సముదాయము)
బ్రహ్మోద్భవమ్ = వేదములనుండి ఉత్పన్నములైనవనియు
బ్రహ్మ = వేదము(లు)
అక్షర సముద్భవమ్ = నాశరహితుడైన పరమాత్మ నుండి ప్రకటితము లైనవనియు
విద్ధి = ఎఱుంగుము
తస్మాత్ = అందువలన
సర్వగతమ్ = సర్వవ్యాపియైన
బ్రహ్మ = పరమాత్మ
నిత్యమ్ = సర్వదా
యజ్ఞే = యజ్ఞమునందు
ప్రతిష్ఠితమ్ = ప్రతిష్ఠితుడైనవానినిగా (ఎఱుంగుము).

ప్రాణులన్నియు అన్నము (ఆహారము) నుండి జన్మించును. అన్నోత్పత్తి వర్షములవలన ఏర్పడును. యజ్ఞములవలన వర్షములు కురియును. విహితకర్మలు యజ్ఞములకు మూలములు. వేదములు విహిత కర్మలకు మూలములు. వేదములు నిత్యుడైన పరమాత్మనుండి ఉద్భవించినవని తెలిసికొనుము. అందువలన సర్వవ్యాపియు, అవ్యయుడును ఐన పరమాత్మ సర్వదా యజ్ఞములయందే ప్రతిష్ఠితుడై యున్నాడు. (14-15)

**ఏవం ప్రవర్తితం చక్రం నానువర్తయతీహ యః ।**
**అఘాయురింద్రియారామో మోఘం పార్థ స జీవతి ॥ 16 ॥**

ఏవమ్, ప్రవర్తితమ్, చక్రమ్, న, అనువర్తయతి, ఇహ, యః,
అఘాయుః, ఇంద్రియారామః, మోఘమ్, పార్థ, సః, జీవతి ॥ 16 ॥

| | | | |
|---|---|---|---|
| పార్థ! | = ఓ పార్థా! | న, అనువర్తయతి | = అనుసరింపడో (తన కర్తవ్యమును పాటింపడో) |
| యః | = ఎవడైతే | సః | = అతడు (అట్టి) |
| ఇహ | = ఈలోకమున | ఇంద్రియారామః | = ఇంద్రియసుఖ లోలుడైనవాడు |
| ఏవమ్ | = ఈ విధముగా (పరంపరగా) | అఘాయుః | = పాపాత్ముడు |
| ప్రవర్తితమ్ | = ప్రచలితమైన | మోఘమ్, జీవతి | = వ్యర్థముగా జీవించును. |
| చక్రమ్ | = సృష్టిచక్రమును | | |

ఓ అర్జునా! ఇట్లు పరంపరాగతముగా కొనసాగుచున్న సృష్టిచక్రమునకు అనుకూలముగా ప్రవర్తింపనివాడు అనగా తన కర్తవ్యములను పాటింపక ఇంద్రియ సుఖలోలుడైన వాడు పాపి. అట్టివానియొక్క జీవితము వ్యర్థము (16)

**యస్త్వాత్మరతిరేవ స్యాత్ ఆత్మతృప్తశ్చ మానవః ।**
**ఆత్మన్యేవ చ సంతుష్టః తస్య కార్యం న విద్యతే ॥ 17 ॥**

యః, తు, ఆత్మరతిః, ఏవ, స్యాత్, ఆత్మతృప్తః, చ, మానవః,
ఆత్మని, ఏవ, చ, సంతుష్టః, తస్య, కార్యమ్, న, విద్యతే ॥ 17 ॥

| | | | |
|---|---|---|---|
| తు | = కాని | చ | = అట్లే |
| యః, మానవః | = ఏ మనుజుడు | ఆత్మని, ఏవ, సంతుష్టః | = ఆత్మయందే సంతుష్టుడై |
| ఆత్మరతిః, ఏవ | = ఆత్మయందే రమించునో | స్యాత్ | = ఉండునో |
| చ | = మరియు | తస్య | = అతనికి |
| ఆత్మతృప్తః | = ఆత్మయందే తృప్తిచెందునో | కార్యమ్ | = ఎట్టి కర్తవ్యమూ |
| | | న, విద్యతే | = (మిగిలి) ఉండదు. |

సచ్చిదానందఘనపరమాత్మప్రాప్తినందిన జ్ఞానియైన మహాత్ముడు నిత్యమైన ఆత్మయందే రమించును. అతడు పూర్ణకాముడు. కనుక ఆత్మయందే తృప్తినొందును. అతడు ఆత్మయందే నిత్యసంతుష్టుడు. అట్టివానికి ఎట్టి కర్తవ్యమును ఉండదు. (17)

**నైవ తస్య కృతేనార్థో నాకృతేనేహ కశ్చన ।**
**న చాస్య సర్వభూతేషు కశ్చిదర్థవ్యపాశ్రయః ॥ 18 ॥**

న, ఏవ, తస్య, కృతేన, అర్థః, న, అకృతేన, ఇహ, కశ్చన,
న, చ, అస్య, సర్వభూతేషు, కశ్చిత్, అర్థవ్యపాశ్రయః ॥ 18 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| తస్య | = | అట్టిమహాపురుషునకు | ఏవ, న(అస్తి) | = | (ప్రయోజనమూ) ఉండదు |
| ఇహ | = | ఈలోకమున | చ | = | అట్లే |
| కృతేన | = | కర్మాచరణము వలన | సర్వభూతేషు | = | సమస్త ప్రాణుల యందును |
| కశ్చన, అర్థః | = | ఎట్టి ప్రయోజనమూ | అస్య | = | ఇతనికి |
| న(అస్తి) | = | ఉండదు | కశ్చిత్ | = | ఎట్టి |
| అకృతేన | = | కర్మచేయకుండుట వలననూ | అర్థ వ్యపాశ్రయః | = | స్వార్థ సంబంధమూ |
| | | | న(అస్తి) | = | ఉండదు |

అట్టి మహాత్ముడు ఈ జగత్తునందు కర్మలు చేయుటవలనను, చేయకుండుట వలనను అతనికి ఎట్టి ప్రయోజనమూ ఉండదు. అతనికి సర్వప్రాణులతోడను స్వార్థపరమైన సంబంధము ఏవిధముగను ఏమాత్రము ఉండదు. (18)

**తస్మాదసక్తః సతతం కార్యం కర్మ సమాచర ।**
**అసక్తో హ్యాచరన్ కర్మ పరమాప్నోతి పూరుషః ॥ 19 ॥**

తస్మాత్, అసక్తః, సతతమ్, కార్యమ్, కర్మ, సమాచర,
అసక్తః, హి, ఆచరన్, కర్మ, పరమ్, ఆప్నోతి, పూరుషః ॥ 19 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| తస్మాత్ | = | అందువలన | పూరుషః | = | మనుష్యుడు |
| సతతమ్ | = | ఎల్లప్పుడును | అసక్తః | = | ఆసక్తిరహితుడై |
| అసక్తః | = | ఆసక్తిరహితుడవై | కర్మ | = | కర్మ(ల)ను |
| కార్యమ్, కర్మ | = | కర్తవ్యకర్మను | ఆచరన్ | = | ఆచరించుచు |
| సమాచర | = | చక్కగా ఆచరింపుము | పరమ్ | = | పరమాత్మను |
| హి | = | ఏలనన | ఆప్నోతి | = | పొందును. |

అందువలన నీవు నిరంతరము ఆసక్తిరహితుడవై కర్తవ్య కర్మలను చక్కగా ఆచరింపుము. ఏలనన ఆసక్తిని వీడి కర్మలను సదా ఆచరించు మనుష్యునకు పరమాత్మ ప్రాప్తి కలుగును. (19)

**కర్మణైవ హి సంసిద్ధిమ్ ఆస్థితా జనకాదయః ।**
**లోకసంగ్రహమేవాపి సంపశ్యన్ కర్తుమర్హసి ॥ 20 ॥**

కర్మణా, ఏవ, హి, సంసిద్ధిమ్, ఆస్థితాః, జనకాదయః,
లోకసంగ్రహమ్, ఏవ, అపి, సంపశ్యన్, కర్తుమ్, అర్హసి ॥ 20 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| జనకాదయః | = | జనకుడు మొదలగు జ్ఞానులు గూడ | హి | = | కావున |
| కర్మణా,ఏవ | = | (ఆసక్తిరహిత) కర్మాచరణముద్వారానే | లోకసంగ్రహమ్ | = | లోకహితమును |
| సంసిద్ధిమ్ | = | పరమసిద్ధిని | సంపశ్యన్, అపి | = | దృష్టియందుంచుకొనుచూ |
| ఆస్థితాః | = | పొందియుండిరి | కర్తుమ్, ఏవ | = | (కర్మ)చేయుటకే |
| | | | అర్హసి | = | (నీవు)తగియున్నావు |

జనకుడు మొదలగు జ్ఞానులుగూడ ఆసక్తి రహితముగా కర్మలను ఆచరించుట వలననే పరమసిద్ధిని పొందిరి. కావున నీవును లోకహితార్థమై కర్మలను ఆచరించుటయే సముచితము. (20)

**యద్యదాచరతి శ్రేష్ఠః తత్తదేవేతరో జనః ।**
**స యత్ప్రమాణం కురుతే లోకస్తదనువర్తతే ॥ 21 ॥**

యత్, యత్, ఆచరతి, శ్రేష్ఠః, తత్, తత్, ఏవ, ఇతరః, జనః,
సః, యత్, ప్రమాణమ్, కురుతే, లోకః, తత్, అనువర్తతే ॥ 21 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| శ్రేష్ఠః | = | శ్రేష్ఠపురుషుడు | సః | = | ఆతడు |
| యత్, యత్ | = | ఏమేమి | యత్, ప్రమాణమ్ | = | దేనిని ప్రమాణముగా |
| ఆచరతి | = | ఆచరించునో | కురుతే | = | చేయునో,(స్వీకరించునో) |
| ఇతరః, జనః | = | ఇతర జనసముదాయము | లోకః | = | లోకము |
| తత్, తత్, ఏవ | = | అట్టిదానినే | తత్, అనువర్తతే | = | దానిననుసరించి ప్రవర్తించును |
| (ఆచరతి) | = | ఆచరించును | | | |

శ్రేష్ఠుడైన పురుషుని ఆచరణమునే (ప్రవర్తననే) ఇతరులును అనుసరింతురు. అతడు నిల్పిన (ప్రతిష్ఠించిన) ప్రమాణములనే లోకులందఱును పాటించెదరు. (21)

**న మే పార్థాస్తి కర్తవ్యం త్రిషు లోకేషు కించన ।**
**నానవాప్తమవాప్తవ్యం వర్త ఏవ చ కర్మణి ॥ 22 ॥**

న, మే, పార్థ, అస్తి, కర్తవ్యమ్, త్రిషు, లోకేషు, కించన,
న, అనవాప్తమ్, అవాప్తవ్యమ్, వర్తే, ఏవ, చ, కర్మణి ॥ 22 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| పార్థ! | = | ఓ పార్థా! | కించన, కర్తవ్యమ్ న, అస్తి | = | ఎట్టి కర్తవ్యమూలేదు |
| మే | = | నాకు | | | |
| త్రిషు, లోకేషు | = | ముల్లోకములయందును | చ | = | మరియు |

| | | | |
|---|---|---|---|
| అవాప్తవ్యమ్ | = పొందదగినవస్తు వేదియునూ | కర్మణి, ఏవ | = (ఐననునేను) కర్మయందే |
| అనవాప్తమ్, న | = పొందబడకుండా లేదు | వర్తే | = ప్రవర్తిల్లుచున్నాను. |

ఓ అర్జునా! ఈ ముల్లోకములయందును నాకు కర్తవ్యము అనునదియే లేదు. అట్లే పొందదగిన వస్తువులలో ఏదియును నేను పొందనిదియును లేదు. ఐనను నేను కర్మలయందే ప్రవర్తిల్లుచున్నాను. (22)

**యది హ్యహం న వర్తేయం జాతు కర్మణ్యతంద్రితః ।**
**మమ వర్త్మానువర్తంతే మనుష్యాః పార్థ సర్వశః ॥ 23 ॥**

యది, హి, అహమ్, న, వర్తేయమ్, జాతు, కర్మణి, అతంద్రితః,
మమ, వర్త్మ, అనువర్తంతే, మనుష్యాః, పార్థ, సర్వశః ॥ 23 ॥

| | | | |
|---|---|---|---|
| హి | = ఏలనన | న, వర్తేయమ్ | = ప్రవర్తింపకున్నచో (గొప్ప హాని కలుగును, ఏలనన) |
| పార్థ | = ఓపార్థా! | మనుష్యాః | = మనుజులు |
| యది | = ఒకవేళ | సర్వశః | = అన్నివిధములా |
| జాతు | = ఎప్పుడైనను | మమ | = నా యొక్క |
| అహమ్ | = నేను | వర్త్మ | = మార్గమునే |
| అతంద్రితః | = సావధానుడనై | అనువర్తంతే | = అనుసరించెదరు. |
| కర్మణి | = కర్మయందు | | |

(ఏలనన) ఓ పార్థా! ఎప్పుడైనను నేను సావధానుడనై కర్మలయందు ప్రవర్తింపకున్నచో లోకమునకు గొప్పహాని సంభవించును. ఎందుకనగా మనుష్యులందఱును అన్ని విధముల నా మార్గమునే అనుసరింతురు. (23)

**ఉత్సీదేయురిమే లోకా న కుర్యాం కర్మ చేదహమ్ ।**
**సంకరస్య చ కర్తా స్యామ్ ఉపహన్యామిమాః ప్రజాః ॥ 24 ॥**

ఉత్సీదేయుః, ఇమే, లోకాః, న, కుర్యామ్, కర్మ, చేత్, అహమ్,
సంకరస్య, చ, కర్తా, స్యామ్, ఉపహన్యామ్, ఇమాః, ప్రజాః ॥ 24 ॥

| | | | |
|---|---|---|---|
| చేత్,అహమ్ | = ఒకవేళ నేను | ఉత్సీదేయుః | = కష్టనష్టములపాలగును |
| కర్మ | = కర్మను | చ | = మరియు(నేను) |
| న, కుర్యామ్ | = చేయనిచో | సంకరస్య | = సాంకర్యమునకు |
| ఇమే, లోకాః | = ఈ లోకములు | కర్తా | = కర్తను |

| | | | | | |
|---|---|---|---|---|---|
| స్యామ్ | = | అగుదును | ఉపహన్యామ్ | = | కష్టముల పాలు చేసిన వాడనగుదును. |
| ఇమాః, ప్రజాః | = | ఈ ప్రజలందరినీ | | | |

నేను కర్మలను ఆచరించుట మానినచో ఈ లోకములన్నియును నశించును. అంతేగాదు, లోకములందు అల్లకల్లోలములు (సాంకర్యములు) చెలరేగును. ప్రజానష్టము వాటిల్లును. అప్పుడు అందులకు నేనే కారకుడనయ్యెదను. (24)

**సక్తాః కర్మణ్యవిద్వాంసో యథా కుర్వంతి భారత ।**
**కుర్యాద్విద్వాంస్తథాసక్తః చికీర్షుర్లోకసంగ్రహమ్ ॥ 25 ॥**

సక్తాః, కర్మణి, అవిద్వాంసః, యథా, కుర్వంతి, భారత,
కుర్యాత్, విద్వాన్, తథా, అసక్తః, చికీర్షుః, లోకసంగ్రహమ్ ॥ 25 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| భారత! | = | ఓ అర్జునా! | విద్వాన్ | = | విద్వాంసుడుకూడ |
| కర్మణి, సక్తాః | = | కర్మయందు ఆసక్తులైన | లోకసంగ్రహమ్ | = | లోకహితమును |
| అవిద్వాంసః | = | అజ్ఞానులు | చికీర్షుః | = | చేయగోరువాడై |
| యథా | = | ఎట్లు | తథా | = | అట్లే |
| కుర్వంతి | = | (కర్మలను) ఆచరింతురో | కుర్యాత్ | = | (కర్మలను ఆచరింపవలెను). |
| అసక్తః | = | ఆసక్తిరహితుడైన | | | |

ఓ భారతా! (అర్జునా!) అజ్ఞానులు కర్మలయందు ఆసక్తులై వాటిని ఆచరించినట్లుగా విద్వాంసుడు (జ్ఞాని) కూడా లోకహితార్థమై ఆసక్తిరహితుడై కర్మలను ఆచరింపవలెను.(25)

**న బుద్ధిభేదం జనయేదజ్ఞానాం కర్మసంగినామ్ ।**
**జోషయేత్ సర్వకర్మాణి విద్వాన్ యుక్తః సమాచరన్ ॥ 26 ॥**

న, బుద్ధిభేదమ్, జనయేత్, అజ్ఞానామ్, కర్మసంగినామ్,
జోషయేత్, సర్వకర్మాణి, విద్వాన్, యుక్తః, సమాచరన్ ॥ 26 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| యుక్తః | = | పరమాత్మ స్వరూపమునందు నిశ్చలముగా ఉండునట్టి | బుద్ధిభేదమ్ | = | బుద్ధియందు భ్రమను (కర్మలయందు అశ్రద్ధను) |
| విద్వాన్ | = | జ్ఞాని | న, జనయేత్ | = | కల్గింపరాదు |
| కర్మసంగినామ్ | = | శాస్త్రోక్త కర్మలయందు ఆసక్తులైన | సర్వకర్మాణి | = | (స్వయముగా) విధ్యుక్త కర్మలను అన్నింటిని |
| అజ్ఞానామ్ | = | అజ్ఞానులకు | సమాచరన్ | = | చక్కగా ఆచరించుచు |
| | | | జోషయేత్ | = | ఆచరింపజేయవలెను |

పరమాత్మస్వరూపమునందు నిశ్చలస్థితిని పొందిన జ్ఞాని శాస్త్రవిహిత కర్మలను ఆసక్తితో (ఫలాసక్తితో) ఆచరించు అజ్ఞానులబుద్ధులను భ్రమకు లోనుచేయరాదు. అనగా కర్మలయందు వారికి అశ్రద్ధను కలిగింపరాదు. పైగా తానుకూడ శాస్త్రవిహితములైన సమస్తకర్మలను చక్కగా చేయుచు వారితోగూడ అట్లే చేయింపవలెను. (26)

**ప్రకృతేః క్రియమాణాని గుణైః కర్మాణి సర్వశః ।**
**అహంకారవిమూఢాత్మా కర్తాఽహమితి మన్యతే ॥ 27 ॥**

ప్రకృతేః, క్రియమాణాని, గుణైః, కర్మాణి, సర్వశః,
అహంకారవిమూఢాత్మా, కర్తా, అహమ్, ఇతి, మన్యతే ॥ 27 ॥

| | | | |
|---|---|---|---|
| కర్మాణి | = కర్మలన్నియును | అహంకార విమూఢాత్మా | = అంతఃకరణమునందు-అహంకారమోహితుడైన అజ్ఞాని |
| సర్వశః | = అన్నివిధముల | | |
| ప్రకృతేః, గుణైః | = ప్రకృతిగుణములద్వారా | అహం, కర్తా, ఇతి | = 'నేనే కర్తను' అని |
| క్రియమాణాని | = చేయబడుచుండును | మన్యతే | = తలంచును. |

వాస్తవముగా కర్మలన్నియును అన్నివిధముల ప్రకృతిగుణములద్వారానే చేయబడుచుండును. అహంకార విమూఢాత్ముడు (అహంకారముచే మోహితమైన అంతఃకరణముగల అజ్ఞాని) 'ఈ కర్మలకు నేనే కర్తను' అని భావించును. (27)

**తత్త్వవిత్తు మహాబాహో గుణకర్మవిభాగయోః ।**
**గుణా గుణేషు వర్తంత ఇతి మత్వా న సజ్జతే ॥ 28 ॥**

తత్త్వవిత్, తు, మహాబాహో, గుణకర్మవిభాగయోః,
గుణాః, గుణేషు, వర్తంతే, ఇతి మత్వా, న, సజ్జతే ॥ 28 ॥

| | | | |
|---|---|---|---|
| తు | = అయితే | గుణాః | = గుణములన్నియును |
| మహాబాహో! | = ఓ మహాబాహూ! | గుణేషు | = గుణములయందే |
| గుణకర్మ విభాగయోః[1] | = గుణవిభాగ, కర్మ విభాగములయొక్క | వర్తంతే | = ప్రవర్తిల్లును |
| తత్త్వవిత్[2] | = తత్త్వమునెఱింగిన జ్ఞానయోగి | ఇతి, మత్వా | = అనితలంచి |
| | | న, సజ్జతే | = ఆసక్తుడుకాడు. |

1) త్రిగుణాత్మకమైన మాయయొక్క కార్యరూపములగు పంచమహాభూతములును, మనస్సు, బుద్ధి, అహంకారము, ఐదు జ్ఞానేంద్రియములు, ఐదు కర్మేంద్రియములు, శబ్దాదివిషయములు- వీటి సముదాయమునే 'గుణవిభాగము' అని యందురు. వీటి పరస్పర చేష్టలనే 'కర్మవిభాగము' అనియందురు.

2) పైన పేర్కొనబడిన గుణ, కర్మ విభాగములకంటె 'ఆత్మ' వేఱనియు, నిర్లిప్తమనియు తెలిసికొనుటయే దాని తత్త్వమును తెలిసికొనుటయగును.

కాని, ఓ మహాబాహూ! (అర్జునా!) గుణవిభాగతత్త్వమును, కర్మవిభాగ తత్త్వమును తెలిసికొన్న జ్ఞానయోగి గుణములే గుణములయందు ప్రవర్తిల్లుచున్నవని భావించి, వాటియందు ఆసక్తుడు కాడు. (28)

**ప్రకృతేర్గుణసమ్మూఢాః సజ్జంతే గుణకర్మసు ।**
**తానకృత్స్నవిదో మందాన్ కృత్స్నవిన్న విచాలయేత్ ॥ 29 ॥**

ప్రకృతేః, గుణసమ్మూఢాః, సజ్జంతే, గుణకర్మసు,
తాన్, అకృత్స్నవిదః, మందాన్, కృత్స్నవిత్, న, విచాలయేత్ ॥ 29 ॥

| | | | |
|---|---|---|---|
| ప్రకృతేః | = ప్రకృతియొక్క | తాన్ | = అట్టి |
| గుణసమ్మూఢాః | = గుణములచే మోహితులైన వారు | అకృత్స్నవిదః | = మిడిమిడి జ్ఞానముగల |
| | | మందాన్ | = మందబుద్ధులను |
| గుణకర్మసు | = గుణములయందును, కర్మలయందును | కృత్స్నవిత్ | = సంపూర్ణజ్ఞాని |
| | | న, విచాలయేత్ | = భ్రమకు గురి చేయరాదు. |
| సజ్జంతే | = ఆసక్తులైయుందురు | | |

ప్రకృతిగుణములచే పూర్తిగా మోహితులైన మనుష్యులు ఆ గుణముల యందును, కర్మలయందును మిక్కిలి ఆసక్తులగుదురు. అట్టి మిడిమిడిజ్ఞానముగల మందబుద్ధులైన అజ్ఞానులను పూర్తిగా తెలిసిన జ్ఞానియైనవాడు భ్రమకు (ఊగిసలాటకు) గురిచేయరాదు. (29)

**మయి సర్వాణి కర్మాణి సన్న్యస్యాధ్యాత్మచేతసా ।**
**నిరాశీర్నిర్మమో భూత్వా యుధ్యస్వ విగతజ్వరః ॥ 30 ॥**

మయి, సర్వాణి, కర్మాణి, సన్న్యస్య, అధ్యాత్మచేతసా,
నిరాశీః, నిర్మమః, భూత్వా, యుధ్యస్వ, విగతజ్వరః ॥ 30 ॥

| | | | |
|---|---|---|---|
| అధ్యాత్మచేతసా | = అంతర్యామినైన నాయందులగ్నమైన మనస్సుద్వారా | నిరాశీః | = ఆశారహితుడవు |
| | | నిర్మమః | = మమతారహితుడవు |
| సర్వాణి, కర్మాణి | = సమస్తకర్మలను | విగతజ్వరః | = సంతాపరహితుడవు |
| మయి | = నాయందు | భూత్వా | = అయి |
| సన్న్యస్య | = సమర్పించి | యుధ్యస్వ | = యుద్ధమొనర్పుము. |

అంతర్యామిని, పరమాత్మను ఐన నాయందే నీ చిత్తమును ఉంచి, కర్మలన్నింటినీ నాకే అర్పించి, ఆశా మమతా సంతాపములను వీడి, యుద్ధము చేయుము. (30)

**యే మే మతమిదం నిత్యమనుతిష్ఠంతి మానవాః ।**
**శ్రద్ధావంతోఽనసూయంతో ముచ్యంతే తేఽపి కర్మభిః ॥ 31 ॥**

యే, మే, మతమ్, ఇదమ్, నిత్యమ్, అనుతిష్ఠంతి, మానవాః,
శ్రద్ధావంతః, అనసూయంతః, ముచ్యంతే, తే, అపి, కర్మభిః ॥ 31 ॥

| | | | |
|---|---|---|---|
| యే, మానవాః | = ఏ మనుష్యులు | అనుతిష్ఠంతి | = అనుసరింతురో |
| అనసూయంతః | = దోషదృష్టిలేనివారై | తే, అపి | = వారును |
| శ్రద్ధావంతః | = శ్రద్ధగలవారై | | |
| మే, ఇదమ్, మతమ్ | = నా, ఈమతమును | కర్మభిః | = కర్మలనుండి |
| నిత్యమ్ | = సర్వదా | ముచ్యంతే | = ముక్తులయ్యెదరు. |

దోషదృష్టి లేకుండ శ్రద్ధాయుక్తులై నా ఈ మతమును అనుసరించు మానవులు గూడ సమస్త కర్మబంధములనుండి ముక్తులయ్యెదరు. (31)

**యే త్వేతదభ్యసూయంతో నానుతిష్ఠంతి మే మతమ్ ।**
**సర్వజ్ఞానవిమూఢాంస్తాన్ విద్ధి నష్టానచేతసః ॥ 32 ॥**

యే, తు, ఏతత్, అభ్యసూయంతః, న, అనుతిష్ఠంతి, మే, మతమ్,
సర్వజ్ఞానవిమూఢాన్, తాన్, విద్ధి, నష్టాన్, అచేతసః ॥ 32 ॥

| | | | |
|---|---|---|---|
| తు | = కాని | తాన్, అచేతసః | = అట్టి మూర్ఖులను |
| యే | = ఎవరైతే | సర్వజ్ఞాన, విమూఢాన్ | = విపరీత జ్ఞానోపహతులైన వారినిగా |
| అభ్యసూయంతః | = దోషారోపణచేయువారై | | |
| మే, ఏతత్, మతమ్ | = నా, ఈమతమును (ఉపదేశమును) | నష్టాన్ | = భ్రష్టులైనవారినిగా |
| న, అనుతిష్ఠంతి | = ఆచరింపరో | విద్ధి | = తెలిసికొనుము. |

కాని నాయందు దోషారోపణ చేయుచు, నా ఈ ఉపదేశమును అనుసరింపని మూర్ఖులు సమస్తజ్ఞానవిషయములయందును మోహితులై (విపరీత జ్ఞానోపహతులై) భ్రష్టులై, కష్టనష్టముల పాలయ్యెదరని ఎఱుంగుము. (32)

**సదృశం చేష్టతే స్వస్యాః ప్రకృతేః జ్ఞానవానపి ।**
**ప్రకృతిం యాంతి భూతాని నిగ్రహః కిం కరిష్యతి ॥ 33 ॥**

సదృశమ్, చేష్టతే, స్వస్యాః, ప్రకృతేః, జ్ఞానవాన్, అపి,
ప్రకృతిమ్, యాంతి, భూతాని, నిగ్రహః, కిమ్, కరిష్యతి ॥ 33 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| భూతాని | = | ప్రాణులన్నియును | చేష్టతే | = | క్రియలను ఆచరించును |
| ప్రకృతిమ్, యాంతి | = | నిజస్వభావములకు లోబడి కర్మలను చేయుచుండును | | | |
| జ్ఞానవాన్, అపి | = | జ్ఞానియును | నిగ్రహః | = | (అర్థములేని) పట్టుదల |
| స్వస్యాః, ప్రకృతేః, సదృశమ్ | = | తన ప్రకృతికి తగినట్లుగా | కిమ్, కరిష్యతి | = | ఏమిచేయును? |

సమస్త ప్రాణులును తమ తమ ప్రకృతులను అనుసరించి (స్వభావములకు లోబడి) కర్మలు చేయుచుండును. జ్ఞానియు తన ప్రకృతిని (స్వభావమును) అనుసరించియే క్రియలను ఆచరించును. ఎవ్వరైనను పట్టుబట్టి కర్మలను ఎట్లు త్యజింపగలరు?(33)

**ఇంద్రియస్యేంద్రియస్యార్థే రాగద్వేషౌ వ్యవస్థితౌ ।**
**తయోర్న వశమాగచ్ఛేత్ తౌ హ్యస్య పరిపన్థినౌ ॥ 34 ॥**

ఇంద్రియస్య, ఇంద్రియస్య, అర్థే, రాగద్వేషౌ, వ్యవస్థితౌ,
తయోః, న, వశమ్, ఆగచ్ఛేత్, తౌ, హి, అస్య, పరిపన్థినౌ ॥ 34 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| ఇంద్రియస్య, ఇంద్రియస్య, అర్థే | = | ప్రతి-ఇంద్రియార్థము నందు | న, ఆగచ్ఛేత్ | = | లోనుకారాదు |
| రాగద్వేషౌ | = | రాగద్వేషములు | హి, తౌ | = | ఏలనన ఆ రెండును |
| వ్యవస్థితౌ | = | దాగియుండును (మనుష్యుడు) | అస్య | = | ఇతనియొక్క (హితమునకు) |
| తయోః వశమ్ | = | వాటివశమునకు | పరిపన్థినౌ | = | విఘ్నములను కల్గించు శత్రువులు. |

ప్రతిఇంద్రియార్థమునందును (ప్రతిఇంద్రియ విషయమునందును) రాగద్వేషములు దాగియున్నవి. మనుష్యుడు ఈ రెండింటికిని వశము కాకూడదు. ఏలనన ఈ రెండే మానవుని శ్రేయస్సునకు విఘ్నకారకములు, మహాశత్రువులు. (34)

**శ్రేయాన్ స్వధర్మో విగుణః పరధర్మాత్ స్వనుష్ఠితాత్ ।**
**స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయావహః ॥ 35 ॥**

శ్రేయాన్, స్వధర్మః, విగుణః, పరధర్మాత్, స్వనుష్ఠితాత్,
స్వధర్మే, నిధనమ్, శ్రేయః, పరధర్మః, భయావహః ॥ 35 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| స్వనుష్ఠితాత్ | = | బాగుగా ఆచరింపబడిన | స్వధర్మే | = | స్వధర్మమునందు |
| పరధర్మాత్ | = | ఇతరుల ధర్మము కంటెను | నిధనమ్ | = | మరణము (ఐనను) |
| | | | శ్రేయః | = | శ్రేయస్కరము |
| విగుణః | = | గుణరహితమే ఐనను | పరధర్మః | = | ఇతరుల ధర్మము |
| స్వధర్మః | = | స్వధర్మము | భయావహః | = | భయమును |
| శ్రేయాన్ | = | అత్యుత్తమమైనది | | | గొలుపునది |

పరధర్మమునందు ఎన్నో సుగుణములు ఉన్నను స్వధర్మమునందు అంతగా సుగుణములు లేకున్నను చక్కగా అనుష్ఠింపబడు ఆ పరధర్మముకంటెను స్వధర్మాచరణమే ఉత్తమము. స్వధర్మాచరణమునందు మరణించుటయు శ్రేయస్కరమే. పరధర్మాచరణము భయావహము. (35)

**అర్జున ఉవాచ**

**అథ కేన ప్రయుక్తోఽయం పాపం చరతి పూరుషః ।**
**అనిచ్ఛన్నపి వార్ష్ణేయ బలాదివ నియోజితః ॥ 36 ॥**

అథ, కేన, ప్రయుక్తః, అయమ్, పాపమ్, చరతి, పూరుషః,
అనిచ్ఛన్, అపి, వార్ష్ణేయ, బలాత్, ఇవ, నియోజితః ॥ 36 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| వార్ష్ణేయ! | = | ఓ కృష్ణా! | బలాత్ | } = | బలవంతము |
| అథ | = | మరి | నియోజితః, ఇవ | | చేయబడినట్లుగా |
| అయమ్, పూరుషః | } = | ఈ పురుషుడు | కేన, ప్రయుక్తః | = | ఎవరిచే ప్రేరితుడై |
| | | | పాపమ్ | = | పాపము(ల)ను |
| అనిచ్ఛన్, అపి | = | ఇష్టపడకున్నను | చరతి | = | ఆచరించును |

అర్జునుడు పలికెను– ఓ కృష్ణా! మానవుడు తనకు ఇష్టము లేకున్నను ఇతరులు బలవంతము చేసినట్లుగా దేని ప్రభావముచే ప్రేరితుడై పాపములను చేయుచుండును?(36)

**శ్రీభగవాన్ ఉవాచ**

**కామ ఏష క్రోధ ఏష రజోగుణసముద్భవః ।**
**మహాశనో మహాపాప్మా విద్ధ్యేనమిహ వైరిణమ్ ॥ 37 ॥**

కామః, ఏషః, క్రోధః, ఏషః, రజోగుణసముద్భవః ,
మహాశనః, మహాపాప్మా, విద్ధి, ఏనమ్, ఇహ, వైరిణమ్ ॥ 37 ॥

| | | | |
|---|---|---|---|
| రజోగుణసముద్భవః | = రజోగుణమునుండి ఉత్పన్నమైన | | తృప్తిలేనిది. (తిండిపోతు) |
| ఏషః, కామః | = ఈ కామమే | మహాపాప్మా | = మిక్కిలి పాపిష్ఠిది |
| క్రోధః | = క్రోధము | ఇహ | = ఈవిషయమున |
| ఏషః | = ఇది | ఏనమ్ | = దీనిని |
| మహాశనః | = ఎంత తిన్నను | వైరిణమ్ | = శత్రువుగా |
| | | విద్ధి | = ఎఱుంగుము |

శ్రీభగవానుడు పలికెను- రజోగుణమునుండి ఉత్పన్నమగునదే కామము. ఇదియే క్రోధరూపమును దాల్చును. ఇది మహాశనము. భోగానుభవములతో ఇది చల్లారునది గాదు. పైగా అంతులేని పాపకర్మాచరణములకు ఇదియే ప్రేరకము. కనుక ఈ విషయమున దీనిని పరమశత్రువుగా ఎఱుంగుము. (37)

**ధూమేనావ్రియతే వహ్నిః యథాదర్శో మలేన చ ।**
**యథోల్బేనావృతో గర్భః తథా తేనేదమావృతమ్ ॥ 38 ॥**

ధూమేన, ఆవ్రియతే, వహ్నిః, యథా, ఆదర్శః, మలేన, చ,
యథా, ఉల్బేన, ఆవృతః, గర్భః, తథా, తేన, ఇదమ్, ఆవృతమ్ ॥ 38 ॥

| | | | |
|---|---|---|---|
| యథా | = ఏవిధముగా | ఉల్బేన | = మావి (మాయ)చే |
| ధూమేన | = పొగతో | గర్భః | = గర్భము |
| వహ్నిః, చ | = అగ్నియు | ఆవృతః | = కప్పబడియుండునో |
| మలేన | = దుమ్ముతో | తథా | = అట్లే |
| ఆదర్శః | = అద్దము | తేన | = ఆ కామముచే |
| ఆవ్రియతే | = కప్పబడియుండునో | ఇదమ్ | = ఈ జ్ఞానము |
| యథా | = ఎట్లు | ఆవృతమ్ | = కప్పబడి యుండును. |

పొగచే అగ్నియు, ధూళిచే అద్దము, మావిచే గర్భము కప్పివేయబడునట్లు, జ్ఞానము కామముచే ఆవృతమై యుండును. (38)

**ఆవృతం జ్ఞానమేతేన జ్ఞానినో నిత్యవైరిణా ।**
**కామరూపేణ కౌంతేయ దుష్పూరేణానలేన చ ॥ 39 ॥**

ఆవృతమ్, జ్ఞానమ్, ఏతేన, జ్ఞానినః, నిత్యవైరిణా,
కామరూపేణ, కౌంతేయ, దుష్పూరేణ, అనలేన, చ ॥ 39 ॥

| | | | |
|---|---|---|---|
| చ | = మఱియు | జ్ఞానినః | = జ్ఞానికి |
| కౌంతేయ! | = ఓ అర్జునా! | నిత్యవైరిణా | = నిత్యవైరియుఐన |
| అనలేన | = అగ్నివంటిదియు | ఏతేన | = ఈకామముచే |
| దుష్పూరేణ | = పూరింపసాధ్యము కానిదియు | జ్ఞానమ్ | = జ్ఞానము |
| కామరూపేణ | = కామరూపాత్మకమైనదియు | ఆవృతమ్ | = కప్పబడి యుండును. |

ఓ అర్జునా! కామము అగ్నితో సమానమైనది. (అగ్నివంటిది) అది ఎన్నటికిని చల్లారదు. జ్ఞానులకు అది నిత్యవైరి. అది మనుష్యుని జ్ఞానమును కప్పివేయుచుండును.(39)

**ఇంద్రియాణి మనో బుద్ధిరస్యాధిష్ఠానముచ్యతే ।**
**ఏతైర్విమోహయత్యేష జ్ఞానమావృత్య దేహినమ్ ॥ 40 ॥**

ఇంద్రియాణి, మనః, బుద్ధిః, అస్య, అధిష్ఠానమ్, ఉచ్యతే,
ఏతైః, విమోహయతి, ఏషః, జ్ఞానమ్, ఆవృత్య, దేహినమ్ ॥ 40 ॥

| | | | |
|---|---|---|---|
| ఇంద్రియాణి | = ఇంద్రియములు | ఏషః | = ఇది (ఈ కామము) |
| మనః | = మనస్సు | ఏతైః | = వీటిద్వారా |
| బుద్ధిః | = బుద్ధి | జ్ఞానమ్ | = జ్ఞానమును |
| అస్య | = దీనికి | ఆవృత్య | = కప్పివేసి |
| అధిష్ఠానమ్ | = వాసస్థానము అని | దేహినమ్ | = జీవాత్మను |
| ఉచ్యతే | = చెప్పబడును | విమోహయతి | = మోహితముగా జేయును |

ఇంద్రియములు, మనస్సు, బుద్ధి ఈ కామమునకు నివాసస్థానములు. ఇది (ఈకామము) మనోబుద్ధీంద్రియముల ద్వారా జ్ఞానమును కప్పివేసి, జీవాత్మను మోహితునిగా చేయును. (40)

**తస్మాత్ త్వమింద్రియాణ్యాదౌ నియమ్య భరతర్షభ ।**
**పాప్మానం ప్రజహి హ్యేనం జ్ఞానవిజ్ఞాననాశనమ్ ॥ 41 ॥**

తస్మాత్, త్వమ్, ఇంద్రియాణి, ఆదౌ, నియమ్య, భరతర్షభ,
పాప్మానమ్, ప్రజహి, హి, ఏనమ్, జ్ఞానవిజ్ఞాననాశనమ్ ॥ 41 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| తస్మాత్ | = | అందువలన | జ్ఞానవిజ్ఞాన-నాశనమ్ | = | జ్ఞానవిజ్ఞానములను నశింపజేయునట్టి |
| భరతర్షభ! | = | ఓ అర్జునా! | ఏనమ్, పాప్మానమ్ | = | మహాపాపియైన ఈకామమును |
| త్వమ్ | = | నీవు | హి | = | అవశ్యముగా |
| ఆదౌ | = | మొదట | ప్రజహి | = | సంహరింపుము. |
| ఇంద్రియాణి | = | ఇంద్రియములను | | | |
| నియమ్య | = | అదుపుచేసి | | | |

కావున ఓ అర్జునా! మొదట ఇంద్రియములను వశపఱచుకొనుము. పిదప జ్ఞానవిజ్ఞానములను నశింపజేయునట్టి మహాపాపియైన ఈ కామమును అవశ్యముగా సర్వశక్తులనొడ్డి రూపుమాపుము. (41)

**ఇంద్రియాణి పరాణ్యాహుః ఇంద్రియేభ్యః పరం మనః ।**
**మనసస్తు పరా బుద్ధిః యో బుద్ధేః పరతస్తు సః ॥ 42 ॥**

ఇంద్రియాణి, పరాణి, ఆహుః, ఇంద్రియేభ్యః, పరమ్, మనః,
మనసః, తు, పరా, బుద్ధిః, యః, బుద్ధేః, పరతః, తు, సః ॥ 42 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| ఇంద్రియాణి | = | ఇంద్రియములు | పరమ్ | = | శ్రేష్ఠమైనది, సూక్ష్మమైనది |
| పరాణి | = | (స్థూలశరీరము కంటెను) శ్రేష్ఠములు, బలీయములు, సూక్ష్మములు | మనసః, తు | = | మనస్సుకంటెను |
| | | | బుద్ధిః, పరా | = | బుద్ధి శ్రేష్ఠమైనది |
| | | | తు | = | మఱియు |
| ఆహుః | = | (అని) అందురు | యః | = | ఏదైతే |
| ఇంద్రియేభ్యః | = | ఇంద్రియములకంటెను | బుద్ధేః, పరతః | = | బుద్ధికంటెను శ్రేష్ఠమైనదో |
| మనః | = | మనస్సు | సః | = | అది (ఆత్మ) |

స్థూలశరీరముకంటెను ఇంద్రియములు బలీయములు, సూక్ష్మములు, శ్రేష్ఠములు అని పేర్కొందురు. ఇంద్రియములకంటెను మనస్సు, దానికంటెను బుద్ధి శ్రేష్ఠమైనవి. ఆ బుద్ధికంటెను అత్యంతశ్రేష్ఠమైనది, సూక్ష్మమైనది ఆత్మ. (42)

**ఏవం బుద్ధేః పరం బుద్ధ్వా సంస్తభ్యాత్మానమాత్మనా ।**
**జహి శత్రుం మహాబాహో కామరూపం దురాసదమ్ ॥ 43 ॥**

ఏవమ్, బుద్ధేః, పరమ్, బుద్ధ్వా, సంస్తభ్య, ఆత్మానమ్, ఆత్మనా,
జహి, శత్రుమ్, మహాబాహో, కామరూపమ్, దురాసదమ్ ॥ 43 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| ఏవమ్ | = | ఈవిధముగా | ఆత్మానమ్ | = | మనస్సును |
| బుద్ధేః | = | బుద్ధికంటెను | సంస్తభ్య | = | వశపఱచుకొని |
| పరమ్ | = | సూక్ష్మము, బలీయము శ్రేష్ఠమైనది ఆత్మయని | మహాబాహో! | = | ఓ మహాబాహూ! |
| | | | దురాసదమ్ | = | దుర్జయమైన |
| | | | కామరూపమ్ | = | కామమనెడి |
| బుద్ధ్వా | = | తెలిసికొని | శత్రుమ్ | = | శత్రువును |
| ఆత్మనా | = | బుద్ధిద్వారా | జహి | = | నిర్మూలింపుము |

ఈ విధముగా బుద్ధికంటెను ఆత్మపరమైనదని అనగా సూక్ష్మము, బలీయము, మిక్కిలి శ్రేష్ఠము ఐనదని తెలిసికొని, ఓ మహాబాహూ! బుద్ధిద్వారా మనస్సును వశపఱచుకొని, దుర్జయశత్రువైన కామమును నిర్మూలింపుము. (43)

*ఓం తత్సదితి శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే కర్మయోగో నామ తృతీయోఽధ్యాయః ॥ 3 ॥*

॥ ఓం శ్రీపరమాత్మనే నమః ॥

# అథ చతుర్థోఽధ్యాయః - జ్ఞాన, కర్మ, సన్న్యాసయోగః

## (నాల్గవ అధ్యాయము-జ్ఞాన, కర్మ, సన్న్యాసయోగము)

ముఖ్యాంశములు : [(1 నుండి 18వ శ్లోకమువఱకు) సగుణ పరమేశ్వరుని ప్రభావము, నిష్కామ కర్మయోగ విషయము. (19 నుండి 23 వఱకు) యోగులైన మహాత్ముల ఆచరణము, వారి మహిమలు. (24 నుండి 32 వఱకు) వేర్వేఱు యజ్ఞ ఫలముల వివరణము. (33 నుండి 42 వఱకు) జ్ఞాన ప్రభావము.]

**శ్రీభగవాన్ ఉవాచ**

**ఇమం వివస్వతే యోగం ప్రోక్తవానహమవ్యయమ్ ।**
**వివస్వాన్ మనవే ప్రాహ మనురిక్ష్వాకవేఽబ్రవీత్ ॥ 1 ॥**

ఇమమ్, వివస్వతే, యోగమ్, ప్రోక్తవాన్, అహమ్, అవ్యయమ్,
వివస్వాన్, మనవే, ప్రాహ, మనుః, ఇక్ష్వాకవే, అబ్రవీత్ ॥ 1 ॥

| | | | |
|---|---|---|---|
| అహమ్ | = నేను | మనవే | = (తనకుమారుడైన వైవస్వత) మనువునకు |
| ఇమమ్, అవ్యయమ్, యోగమ్ | = శాశ్వతమైన ఈ యోగమును | ప్రాహ | = చెప్పెను |
| | | మనుః | = (ఆ) మనువు |
| వివస్వతే | = సూర్యునకు | ఇక్ష్వాకవే | = (తన కుమారుడైన) ఇక్ష్వాకునకు |
| ప్రోక్తవాన్ | = చెప్పియుంటిని | | |
| వివస్వాన్ | = సూర్యుడు | అబ్రవీత్ | = చెప్పెను. |

శ్రీ భగవానుడు ఇట్లు పలికెను- నేను నిత్యసత్యమైన ఈ యోగమును సూర్యునకు తెలిపితిని. సూర్యుడు తనపుత్రుడైన వైవస్వతమనువునకు దీనిని బోధించెను. ఆ మనువు తన కుమారుడైన ఇక్ష్వాకునకు ఉపదేశించెను. (1)

**ఏవం పరంపరాప్రాప్తమిమం రాజర్షయో విదుః ।**
**స కాలేనేహ మహతా యోగో నష్టః పరంతప ॥ 2 ॥**

ఏవమ్, పరంపరాప్రాప్తమ్, ఇమమ్, రాజర్షయః, విదుః,
సః, కాలేన, ఇహ, మహతా, యోగః, నష్టః, పరంతప ॥ 2 ॥

| | | | |
|---|---|---|---|
| పరంతప! | = ఓ పరంతపా! (అర్జునా!) | విదుః | = ఎఱింగిరి |
| ఏవమ్ | = ఈ విధముగా | సః, యోగః | = ఆయోగము |
| పరంపరాప్రాప్తమ్ | = పరంపరగా ప్రాప్తించిన | మహతా, కాలేన | = చాలాకాలము క్రిందటనే |
| ఇమమ్ | = ఈ యోగమును | ఇహ | = ఈభూలోకమునందు |
| రాజర్షయః | = రాజర్షులు | నష్టః | = లుప్త ప్రాయమాయెను. |

ఓ పరంతపా! (అర్జునా!) ఈ విధముగ పరంపరాప్రాప్తమైన ఈ యోగమును రాజర్షులు ఎఱింగిరి. కాని, అనంతరము ఈ యోగము కాలక్రమమున భూలోకమునందు లుప్తప్రాయమయ్యెను. (2)

**స ఏవాయం మయా తేఽద్య యోగః ప్రోక్తః పురాతనః ।**
**భక్తోఽసి మే సఖా చేతి రహస్యం హ్యేతదుత్తమమ్ ॥ 3 ॥**

సః, ఏవ, అయమ్, మయా, తే, అద్య, యోగః, ప్రోక్తః, పురాతనః,
భక్తః, అపి, మే, సఖా, చ, ఇతి, రహస్యమ్, హి, ఏతత్, ఉత్తమమ్ ॥ 3 ॥

| | | | |
|---|---|---|---|
| (త్వమ్) | = నీవు | మయా | = నా చేత |
| మే, భక్తః | = నా భక్తుడవు | తే | = నీకు |
| చ | = మఱియు | ప్రోక్తః | = చెప్పబడుచున్నది |
| సఖా, అపి, ఇతి | = ప్రియసఖుడవు, కనుక | హి | = ఎందువలననగా |
| సః, పురాతనః, యోగః, ఏవ | = ఆ ప్రాచీనమైన యోగమే | ఏతత్ | = ఇది |
| అయమ్ | = ఇది (ఈ యోగము) | ఉత్తమమ్ | = మిక్కిలి ఉత్తమమైనది |
| అద్య | = నేడు | రహస్యమ్ | = గోప్యమైనది. |

ఈ యోగము ఉత్తమమైనది. రహస్యముగా ఉంచదగినది. నీవు నాకు భక్తుడవు. ప్రియసఖుడవు. కనుక, మిక్కిలి పురాతనమైన ఈ యోగమును నేడు నీకు తెలుపుచుంటిని. (3)

### అర్జున ఉవాచ

**అపరం భవతో జన్మ పరం జన్మ వివస్వతః ।**
**కథమేతద్విజానీయాం త్వమాదౌ ప్రోక్తవానితి ॥ 4 ॥**

అపరమ్, భవతః, జన్మ, పరమ్, జన్మ, వివస్వతః,
కథమ్, ఏతత్, విజానీయామ్, త్వమ్, ఆదౌ, ప్రోక్తవాన్, ఇతి ॥ 4 ॥

| | | | |
|---|---|---|---|
| భవతః, జన్మ | = మీజన్మ | ఆదౌ | = కల్పాదియందు (సూర్యునకు) |
| అపరమ్ | = ఇటీవలిది | ఏతత్ | = ఈయోగమును |
| వివస్వతః, జన్మ | = సూర్యుని జన్మ | ప్రోక్తవాన్ | = చెప్పియుంటివి |
| పరమ్ | = అతి ప్రాచీనమైనది (కల్పాదియందు జరిగినది) | ఇతి | = అని |
| | | కథమ్ | = (నేను) ఎట్లు |
| త్వమ్ | = నీవు | విజానీయామ్ | = తెలిసికొనగలను. |

అర్జునుడు పలికెను - కృష్ణా! నీ జన్మ ఇటీవలిదే. సూర్యునిజన్మ కల్పాదియందు జరిగినది. అనగా అతి ప్రాచీనమైనది. కనుక, నీవు సూర్యునకు దీనిని ఉపదేశించుట ఎట్లు సాధ్యపడును? దీనిని నేను విశ్వసించుట యెట్లు? (4)

**శ్రీభగవాన్ ఉవాచ**

**బహూని మే వ్యతీతాని జన్మాని తవ చార్జున ।**
**తాన్యహం వేద సర్వాణి న త్వం వేత్థ పరంతప ॥ 5 ॥**

బహూని, మే, వ్యతీతాని, జన్మాని, తవ, చ, అర్జున,
తాని, అహమ్, వేద, సర్వాణి, న, త్వమ్, వేత్థ, పరంతప ॥ 5 ॥

| | | | |
|---|---|---|---|
| పరంతప! | = ఓపరంతపా! | వ్యతీతాని | = గతించినవి |
| అర్జున! | = ఓఅర్జునా! | తాని, సర్వాణి | = వాటినన్నింటిని |
| మే, చ, తవ | = నావియు, నీవియు | త్వం, న, వేత్థ | = నీవెఱుంగవు |
| బహూని, జన్మాని | = పెక్కుజన్మలు | అహమ్, వేద | = నేను ఎఱుగుదును. |

శ్రీ భగవానుడు తెలిపెను - ఓ పరంతపా! అర్జునా! నాకును నీకును పెక్కు జన్మలు గతించినవి. కాని, వాటిని అన్నింటిని నేను ఎఱుంగుదును. నీ వెఱుగవు.(5)

**అజోఽపి సన్నవ్యయాత్మా భూతానామీశ్వరోఽపి సన్ ।**
**ప్రకృతిం స్వామధిష్ఠాయ సంభవామ్యాత్మమాయయా ॥ 6 ॥**

అజః, అపి, సన్, అవ్యయాత్మా, భూతానామ్, ఈశ్వరః, అపి, సన్,
ప్రకృతిమ్, స్వామ్, అధిష్ఠాయ, సంభవామి, ఆత్మమాయయా ॥ 6 ॥

| | | | |
|---|---|---|---|
| (అహమ్) | = నేను | సన్, అపి | = ఐనప్పటికిని |
| అజః | = జన్మరహితుడను | భూతానామ్ | = సమస్తప్రాణులకు |
| అవ్యయాత్మా | = శాశ్వతుడను | ఈశ్వరః, సన్, అపి | = ఈశ్వరుడను అయినప్పటికిని |

| | | | |
|---|---|---|---|
| స్వామ్, ప్రకృతిమ్ | = నా ప్రకృతిని | ఆత్మమాయయా | = నాయోగమాయచే |
| అధిష్ఠాయ | = అధీనములో ఉంచుకొని | సంభవామి | = అవతరించుచుందును. |

నేను జన్మరహితుడను, నిత్యుడను, సమస్త ప్రాణులకు ఈశ్వరుడను. అయినను నా ప్రకృతిని ఆధీనములోనుంచుకొని, నా యోగ మాయచే అవతరించుచుందును. (6)

**యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత ।**
**అభ్యుత్థానమధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్ ॥ 7 ॥**

యదా, యదా, హి, ధర్మస్య, గ్లానిః, భవతి, భారత,
అభ్యుత్థానమ్, అధర్మస్య, తదా, ఆత్మానమ్, సృజామి, అహమ్ ॥ 7 ॥

| | | | |
|---|---|---|---|
| భారత! | = ఓ అర్జునా! | భవతి | = అగునో |
| యదా, యదా | = ఎప్పుడెప్పుడు | తదా, హి | = అప్పటికి అప్పుడే |
| ధర్మస్య | = ధర్మమునకు | అహమ్ | = నేను |
| గ్లానిః | = హానియు | ఆత్మానమ్ | = నారూపమును |
| అధర్మస్య | = అధర్మమునకు | సృజామి | = ప్రకటించుచుందును. |
| అభ్యుత్థానమ్ | = వృద్ధియు | | |

ఓ భారతా! (అర్జునా) ధర్మమునకు హాని కలిగినప్పుడును, అధర్మము పెచ్చుపెరిగిపోవుచున్నప్పుడును నన్ను నేను సృజించుకొందును. అనగా సాకారరూపముతో ఈ లోకమున అవతరింతును. (7)

**పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్ ।**
**ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే ॥ 8 ॥**

పరిత్రాణాయ, సాధూనామ్, వినాశాయ, చ, దుష్కృతామ్,
ధర్మసంస్థాపనార్థాయ, సంభవామి, యుగే, యుగే ॥ 8 ॥

| | | | |
|---|---|---|---|
| సాధూనామ్ | = సత్పురుషులయొక్క | ధర్మసంస్థాపనార్థాయ | = ధర్మమును సుస్థిరమొనర్చుటకు |
| పరిత్రాణాయ | = పరిరక్షణముకొరకు | యుగే, యుగే | = ప్రతియుగమునందును |
| దుష్కృతామ్ | = దుష్టులయొక్క | | |
| వినాశాయ | = వినాశముకొఱకు | | |
| చ | = మఱియు | సంభవామి | = (నేను) అవతరింతును |

సత్పురుషులను పరిరక్షించుటకును, దుష్టులను రూపుమాపుటకును, ధర్మమును సుస్థిరమొనర్చుటకును నేను ప్రతియుగమునందును అవతరించుచుందును. (8)

**జన్మ కర్మ చ మే దివ్యమ్ ఏవం యో వేత్తి తత్త్వతః ।**

**త్యక్త్వా దేహం పునర్జన్మ నైతి మామేతి సోఽర్జున ॥ 9 ॥**

జన్మ, కర్మ, చ, మే, దివ్యమ్, ఏవమ్, యః, వేత్తి, తత్త్వతః,

త్యక్త్వా, దేహమ్, పునః, జన్మ, న, ఏతి, మామ్, ఏతి, సః, అర్జున ॥ 9 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| అర్జున! | = | ఓ అర్జునా! | సః | = | అతడు |
| మే, జన్మ | = | నాయొక్క జన్మయును | దేహమ్, త్యక్త్వా | = | తనువును వీడిన పిమ్మట |
| కర్మ, చ | = | కర్మయును | | | |
| దివ్యమ్ | = | దివ్యము(లు) | పునః, జన్మ, న, ఏతి | = | మఱల జన్మను పొందడు |
| ఏవమ్, యః | = | ఇట్లు ఎవడైతే | | | |
| తత్త్వతః (1) | = | తాత్త్వికముగా | | | |
| వేత్తి | = | ఎఱుంగునో | మామ్, ఏతి | = | నన్నేపొందును |

ఓ అర్జునా! నా జన్మ (అవతారము)లు, కర్మములు దివ్యములు. అనగా నిర్మలములు. అలౌకికములు. ఈ తత్త్వరహస్యమును తెలిసికొనినవాడు తనువును చాలించిన పిమ్మట మఱల జన్మింపడు సరికదా! నన్నే చేరును. (9)

**వీతరాగభయక్రోధా మన్మయా మాముపాశ్రితాః ।**

**బహవో జ్ఞానతపసా పూతా మద్భావమాగతాః ॥ 10 ॥**

వీతరాగభయక్రోధాః, మన్మయాః, మామ్, ఉపాశ్రితాః,

బహవః, జ్ఞానతపసా, పూతాః, మద్భావమ్, ఆగతాః ॥ 10 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| వీతరాగ, భయక్రోధాః | = | రాగభయ క్రోధరహితులు | మన్మయాః | = | నాయందే అనన్యభక్తితో స్థితమైనవారు |

1. సర్వశక్తిమంతుడైన సచ్చిదానంద ఘనపరమాత్మ అజుడు, శాశ్వతుడు, సకల ప్రాణులకును పరమగతి, పరమాశ్రయుడు. అతడు కేవలము ధర్మమును స్థాపించుటకును, లోకములనుద్ధరించుటకును తనయోగమాయవలన సగుణరూపములో ప్రకటితుడగు చుండును. కనుక పరమేశ్వరునితో సమానుడైన సుహృదుడు, ప్రేమాస్పదుడు, పతితపావనుడు, మఱియొకడు లేడు–ఈ విషయమును తెలిసికొని, అనన్యభక్తితో పరమేశ్వరునే చింతన చేయుచు ఆసక్తిరహితముగా ప్రపంచమున ప్రవర్తించువాడే, పరమేశ్వరుని తత్త్వమును ఎఱిగినవాడు.

| | | | |
|---|---|---|---|
| మామ్, ఉపాశ్రితాః | = నన్ను ఆశ్రయించిన వారు (అగు) | జ్ఞానతపసా | = జ్ఞానరూప తపస్సుచే |
| బహవః | = పెక్కుమంది భక్తులు | పూతాః | = పవిత్రులై |
| | | మద్భావమ్, ఆగతాః | = నా స్వరూపమును పొందియుండిరి |

ఇదివరలోగూడ సర్వదా రాగభయక్రోధరహితులైనవారు, దృఢమైన భక్తి తాత్పర్యములతో స్థిరబుద్ధి గలిగి, నన్ను ఆశ్రయించిన భక్తులు పెక్కుమంది జ్ఞాన తపస్సంపన్నులై పవిత్రులై నాస్వరూపమును పొందియుండిరి. (10)

**యే యథా మాం ప్రపద్యంతే తాంస్తథైవ భజామ్యహమ్ ।**
**మమ వర్త్మానువర్తంతే మనుష్యాః పార్థ సర్వశః ॥ 11 ॥**

యే, యథా, మామ్, ప్రపద్యంతే, తాన్, తథా, ఏవ, భజామి, అహమ్,
మమ, వర్త్మ, అనువర్తంతే, మనుష్యాః, పార్థ, సర్వశః ॥ 11 ॥

| | | | |
|---|---|---|---|
| పార్థ! | = ఓపార్థా! | భజామి | = అనుగ్రహింతును |
| యే | = ఎవరు | మనుష్యాః | = మనుష్యులు |
| మామ్ | = నన్ను | సర్వశః | = అన్నివిధముల |
| యథా, ప్రపద్యంతే | = ఎట్లు సేవింతురో? | మమ | = నాయొక్క |
| అహమ్ | = నేను | వర్త్మ | = మార్గమును |
| తాన్ | = వారిని | అనువర్తంతే | = అనుసరించుచుందురు. |
| తథా, ఏవ | = అట్లే | | |

పార్థా! భక్తులు నన్ను సేవించిన రీతికి అనుగుణముగ నేను వారిని అనుగ్రహింతును. మనుష్యులందరును వివిధరీతులలో నా మార్గమునే అనుసరింతురు. (11)

**కాంక్షంతః కర్మణాం సిద్ధిం యజంత ఇహ దేవతాః ।**
**క్షిప్రం హి మానుషే లోకే సిద్ధిర్భవతి కర్మజా ॥ 12 ॥**

కాంక్షంతః, కర్మణామ్, సిద్ధిమ్, యజంతే, ఇహ, దేవతాః,
క్షిప్రమ్, హి, మానుషే, లోకే, సిద్ధిః, భవతి, కర్మజా ॥ 12 ॥

| | | | |
|---|---|---|---|
| ఇహ, మానుషే లోకే | = ఈ మనుష్య లోకమునందు | కాంక్షంతః | = కోరుకొనువారు |
| కర్మణామ్ | = కర్మలయొక్క | దేవతాః | = (ఇతర) దేవతలను |
| సిద్ధిమ్ | = ఫలమును | యజంతే | = పూజింతురు |
| | | హి | = ఏలనన |

| | | | |
|---|---|---|---|
| కర్మజా, సిద్ధిః = | కర్మలను ఆచరించుట వలన కలుగు ఫలము | క్షిప్రమ్, భవతి = | (వారికి) శీఘ్రముగా లభించును. |

ఈ లోకమున కర్మఫలములను ఆశించువారు ఇతర దేవతలను పూజింతురు. ఏలనన, అట్లు చేయుటచే కర్మలవలన కలుగు సిద్ధి వారికి శీఘ్రముగా లభించును. (12)

**చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణకర్మవిభాగశః ।**
**తస్య కర్తారమపి మాం విద్ధ్యకర్తారమవ్యయమ్ ॥ 13 ॥**

చాతుర్వర్ణ్యమ్, మయా, సృష్టమ్, గుణకర్మవిభాగశః,
తస్య, కర్తారమ్, అపి, మామ్, విద్ధి, అకర్తారమ్, అవ్యయమ్ ॥ 13 ॥

| | | | |
|---|---|---|---|
| గుణకర్మవిభాగశః = | గుణ, కర్మల విభజనను అనుసరించి | తస్య = | ఆ సృష్టికి |
| | | కర్తారమ్, అపి = | కర్తను ఐనప్పటికిని |
| చాతుర్వర్ణ్యమ్ = | బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర రూప (నాలుగు) వర్ణముల సమూహము | అవ్యయమ్ = | శాశ్వతుడ (పరమేశ్వరుడ)నైన |
| | | మామ్ = | నన్ను |
| మయా = | నాచేత | అకర్తారమ్ = | అకర్తనుగా |
| సృష్టమ్ = | సృష్టింపబడినది | విద్ధి = | ఎఱుంగుము. |

బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర వర్ణముల వారిని వారి గుణకర్మల ననుసరించి వేర్వేరుగా సృష్టించితిని. ఈ సృష్టి కార్యక్రమమునకు నేనే కర్తనైనను, శాశ్వతుడను పరమేశ్వరుడను ఐన నన్ను వాస్తవముగ 'అకర్తను'గా తెలిసికొనుము. (13)

**న మాం కర్మాణి లింపంతి న మే కర్మఫలే స్పృహా ।**
**ఇతి మాం యోఽభిజానాతి కర్మభిర్న స బధ్యతే ॥ 14 ॥**

న, మామ్, కర్మాణి, లింపంతి, న, మే, కర్మఫలే, స్పృహా,
ఇతి, మామ్, యః, అభిజానాతి, కర్మభిః, న, సః, బధ్యతే ॥ 14 ॥

| | | | |
|---|---|---|---|
| కర్మఫలే = | కర్మఫలమునందు | యః = | ఎవడైతే |
| మే, స్పృహా,న = | నాకు ఆసక్తి లేదనియు | మామ్ = | నన్ను |
| మామ్ = | నన్ను | అభిజానాతి = | తెలిసికొనునో |
| కర్మాణి = | కర్మలు | సః, కర్మభిః = | అతడు కర్మలచేత |
| న, లింపంతి, ఇతి = | అంటవు అనియు | న, బధ్యతే = | బంధింపబడడు. |

నాకు కర్మఫలాసక్తి లేదు. కావున, కర్మలు నన్నంటవు. ఈవిధముగా నాతత్త్వమును తెలిసినవారు కర్మబద్ధులు కారు. (14)

**ఏవం జ్ఞాత్వా కృతం కర్మ పూర్వైరపి ముముక్షుభిః ।**
**కురు కర్మైవ తస్మాత్ త్వం పూర్వైః పూర్వతరం కృతమ్ ॥ 15 ॥**

ఏవమ్, జ్ఞాత్వా, కృతమ్, కర్మ, పూర్వైః, అపి, ముముక్షుభిః,
కురు, కర్మ, ఏవ, తస్మాత్, త్వమ్, పూర్వైః, పూర్వతరమ్, కృతమ్ ॥ 15 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| పూర్వైః | = | ప్రాచీనులైన | త్వమ్ | = | నీవును |
| ముముక్షుభిః అపి | = | ముముక్షువులచేతగూడ | పూర్వైః | = | ప్రాచీనులచేత |
| ఏవమ్ | = | ఈ విధముగా | పూర్వతరమ్, కృతమ్ | = | నిరంతరము చేయ బడుచువచ్చిన |
| జ్ఞాత్వా | = | తెలిసికొనబడి | | | |
| కర్మ, కృతమ్ | = | కర్మలు చేయబడినవి | కర్మ, ఏవ | = | కర్మలనే |
| తస్మాత్ | = | అందువలన | కురు | = | చేయుము. |

ఓ అర్జునా! ప్రాచీనులైన ముముక్షువులు ఈ విధముగ (నా తత్త్వ రహస్యమును) దెలిసికొని కర్మల నాచరించిరి. కావున, నీవును ఆ పూర్వులవలెనే నిష్కామ భావముతో కర్మల నాచరింపుము. (15)

**కిం కర్మ కిమకర్మేతి కవయోఽప్యత్ర మోహితాః ।**
**తత్తే కర్మ ప్రవక్ష్యామి యద్ జ్ఞాత్వా మోక్ష్యసేఽశుభాత్ ॥ 16 ॥**

కిమ్, కర్మ, కిమ్, అకర్మ, ఇతి, కవయః, అపి, అత్ర, మోహితాః,
తత్, తే, కర్మ, ప్రవక్ష్యామి, యత్, జ్ఞాత్వా, మోక్ష్యసే, అశుభాత్ ॥ 16 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| కర్మ, కిమ్ | = | కర్మ అనగానేమి? | అశుభాత్ | = | కర్మబంధమునుండి |
| అకర్మ, కిమ్ | = | అకర్మయనగానేమి? | మోక్ష్యసే | = | విముక్తి పొందుదువో? |
| ఇతి, అత్ర | = | (అను) ఈ విషయమును నిర్ణయించుటలో | తత్, కర్మ | = | అకర్మతత్త్వమును |
| కవయః, అపి | = | బుద్ధిమంతులును | తే | = | నీకు |
| మోహితాః | = | మోహితులగుచున్నారు | ప్రవక్ష్యామి | = | విశద పరచుచున్నాను |
| యత్, జ్ఞాత్వా | = | (కావున) దేనిని తెలిసికొని, (నీవు) | | | |

కర్మ అనగా నేమి? అకర్మ యనగానేమి? ఈ విషయమును నిర్ణయించుటలో విద్వాంసులు సైతము భ్రాంతికి లోనగుచున్నారు. (తికమకపడుచున్నారు) కావున, కర్మతత్త్వమును నీకు చక్కగా విశదపరచెదను. దానిని తెలిసికొని నీవు అశుభముల నుండి అనగా  కర్మబంధములనుండి ముక్తుడవయ్యెదవు. (16)

**కర్మణో హ్యపి బోద్ధవ్యం బోద్ధవ్యం చ వికర్మణః ।**
**అకర్మణశ్చ బోద్ధవ్యం గహనా కర్మణో గతిః ॥ 17 ॥**

కర్మణః, హి, అపి, బోద్ధవ్యమ్, బోద్ధవ్యమ్, చ, వికర్మణః,
అకర్మణః, చ, బోద్ధవ్యమ్, గహనా, కర్మణః, గతిః ॥ 17 ॥

| | | | |
|---|---|---|---|
| కర్మణః, అపి | = కర్మ యొక్క తత్త్వముగూడ | వికర్మణః, చ | = వికర్మలక్షణముగూడ |
| బోద్ధవ్యమ్ | = తెలిసికొనదగినది | బోద్ధవ్యమ్ | = తెలిసికొనదగినది |
| చ, అకర్మణః, అపి | = అట్లే అకర్మయొక్క స్వరూపముగూడ | హి | = ఏలనన |
| బోద్ధవ్యమ్ | = ఎఱుంగదగినది | కర్మణః, గతిః | = కర్మయొక్క గతి (తత్త్వము) |
| | | గహనా | = అతినిగూఢమైనది. |

'కర్మ' తత్త్వమును తెలిసికొనవలెను, అట్లే 'అకర్మ' స్వరూపమును గూడ ఎరుగవలెను, 'వికర్మ' లక్షణములనుకూడా తెలిసికొనుట చాల అవసరము. ఏలనన, కర్మ తత్త్వము అతినిగూఢమైనది. (17)

**కర్మణ్యకర్మ యః పశ్యేత్ అకర్మణి చ కర్మ యః ।**
**స బుద్ధిమాన్ మనుష్యేషు స యుక్తః కృత్స్నకర్మకృత్ ॥ 18 ॥**

కర్మణి, అకర్మ, యః, పశ్యేత్, అకర్మణి, చ, కర్మ, యః,
సః, బుద్ధిమాన్, మనుష్యేషు, సః, యుక్తః, కృత్స్నకర్మకృత్ ॥ 18 ॥

| | | | |
|---|---|---|---|
| యః | = ఎవరయితే | సః | = అతడు |
| కర్మణి | = కర్మయందు | మనుష్యేషు | = మనుష్యులలో |
| అకర్మ, పశ్యేత్ | = అకర్మను దర్శించునో | బుద్ధిమాన్ | = బుద్ధిశాలి |
| యః, చ | = ఎవరైతే | సః, యుక్తః | = అట్టియోగి |
| అకర్మణి | = అకర్మయందు | కృత్స్నకర్మకృత్ | = సమస్త కర్మలను చేయువాడు. |
| కర్మ | = కర్మను (దర్శించునో) | | |

కర్మయందు 'అకర్మ'ను, అకర్మయందు 'కర్మ'ను దర్శించువాడు మానవులలో బుద్ధిశాలి. అతడు యోగి మఱియు సమస్త కర్మలు చేయువాడు. (18)

**యస్య సర్వే సమారంభాః కామసంకల్పవర్జితాః ।**
**జ్ఞానాగ్నిదగ్ధకర్మాణం తమాహుః పండితం బుధాః ॥ 19 ॥**

యస్య, సర్వే, సమారంభాః, కామసంకల్పవర్జితాః,
జ్ఞానాగ్నిదగ్ధకర్మాణమ్, తమ్, ఆహుః, పండితమ్, బుధాః ॥ 19 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| యస్య, సర్వే, సమారంభాః | = | ఎవనియొక్క శాస్త్రసమ్మతములైన కర్మలన్నియును | తమ్ | = | ఆ మహాపురుషుని |
| | | | బుధాః | = | జ్ఞానులు |
| కామసంకల్ప-వర్జితాః | = | కామసంకల్ప రహితములై (జరుగునో) | పండితమ్, (ఇతి) | = | పండితుడని |
| జ్ఞానాగ్నిదగ్ధ-కర్మాణమ్ | = | ఎవనియొక్క కర్మలన్నియును జ్ఞానాగ్నిచే భస్మమగునో | ఆహుః | = | అందురు. |

ఎవని కర్మలన్నియును, శాస్త్రసమ్మతములై, కామసంకల్ప వర్జితములై జరుగునో, అట్లే ఎవని కర్మలన్నియును జ్ఞానాగ్నిచే భస్మమగునో, అట్టి మహాపురుషుని జ్ఞానులు పండితుడని అందురు. (19)

**త్యక్త్వా కర్మఫలాసంగం నిత్యతృప్తో నిరాశ్రయః ।**
**కర్మణ్యభిప్రవృత్తోఽపి నైవ కించిత్ కరోతి సః ॥ 20 ॥**

త్యక్త్వా, కర్మఫలాసంగమ్, నిత్యతృప్తః, నిరాశ్రయః,
కర్మణి, అభిప్రవృత్తః, అపి, న, ఏవ, కించిత్, కరోతి, సః ॥ 20 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| కర్మఫలాసంగమ్ | = | సమస్తకర్మలయందును, వాటి ఫలములయందును ఆసక్తిని | సః | = | అట్టి పురుషుడు |
| | | | కర్మణి | = | కర్మలయందు |
| త్యక్త్వా | = | (సర్వథా)వీడి | అభిప్రవృత్తః, అపి | = | పూర్తిగా ప్రవృత్తుడు అయినప్పటికిని |
| నిరాశ్రయః | = | ప్రాపంచిక-ఆశ్రయరహితుడై | కించిత్, ఏవ | = | ఏ కొంచెముగూడ |
| నిత్యతృప్తః | = | (పరమాత్మయందే) నిత్య తృప్తిని పొందిన | న, కరోతి | = | (వాస్తవముగా) చేయువాడు కాడు |

సమస్తకర్మలయందును వాటిఫలితములయందును సర్వథా ఆసక్తిని వీడి, సంసార-ఆశ్రయరహితుడై, పరమాత్మయందే నిత్యతృప్తుడైన పురుషుడు, కర్మల యందు చక్కగా ప్రవృత్తుడైనప్పటికిని వాస్తవముగా వాటికి (కర్మలకు) కర్త కాడు. (20)

**నిరాశీర్యతచిత్తాత్మా త్యక్తసర్వపరిగ్రహః ।**
**శారీరం కేవలం కర్మ కుర్వన్ నాప్నోతి కిల్బిషమ్ ॥ 21 ॥**

నిరాశీః, యతచిత్తాత్మా, త్యక్తసర్వపరిగ్రహః,
శారీరమ్, కేవలమ్, కర్మ, కుర్వన్, న, ఆప్నోతి, కిల్బిషమ్ ॥ 21 ॥

| | | | |
|---|---|---|---|
| యతచిత్తాత్మా | = అంతఃకరణమును, శరీరేంద్రియములను జయించినవాడును | కేవలమ్ | = కేవలము |
| త్యక్తసర్వపరిగ్రహః | = సమస్త భోగసామగ్రిని పరిత్యజించినవాడును | శారీరమ్, కర్మ | = శారీరిక కర్మలను |
| నిరాశీః | = ఆశారహితుడైనవాడును- (అగు సాంఖ్యయోగి) | కుర్వన్ | = ఆచరించుచును |
| | | కిల్బిషమ్ | = పాపము(ల)ను |
| | | న, ఆప్నోతి | = పొందడు. |

అంతఃకరణమును, శరీరేంద్రియములను జయించినవాడు, సమస్త భోగసామగ్రిని పరిత్యజించినవాడు, ఆశారహితుడునైన సాంఖ్యయోగి కేవలము శారీరికకర్మలను ఆచరించుచును పాపములను పొందడు. (21)

**యదృచ్ఛాలాభసంతుష్టో ద్వంద్వాతీతో విమత్సరః ।**
**సమః సిద్ధావసిద్ధౌ చ కృత్వాపి న నిబధ్యతే ॥ 22 ॥**

యదృచ్ఛాలాభసంతుష్టః, ద్వంద్వాతీతః, విమత్సరః,
సమః, సిద్ధౌ, అసిద్ధౌ, చ, కృత్వా, అపి, న, నిబధ్యతే ॥ 22 ॥

| | | | |
|---|---|---|---|
| యదృచ్ఛాలాభ-సంతుష్టః | = అప్రయత్నముగా అమరిన లాభములతో సంతుష్టుడైన వాడు | సిద్ధౌ, అసిద్ధౌ, చ | = సిద్ధి, అసిద్ధులయందును |
| | | సమః | = సమదృష్టి కలిగియుండు వాడు- అగు కర్మయోగి |
| విమత్సరః | = అసూయలేనివాడు | కృత్వా, అపి | = కర్మలను చేయుచును |
| ద్వంద్వాతీతః | = హర్షశోకాది ద్వంద్వములకు అతీతుడు | న, నిబధ్యతే | = బంధింపబడడు. |

తాను కోరకుండగనే లభించిన పదార్థములతో (అప్రయత్నముగా అమరిన లాభములతో) సంతుష్టుడైనవాడు, అసూయలేనివాడు, హర్షశోకాదిద్వంద్వములకు అతీతుడు అయినవాడు సిద్ధియందును, అసిద్ధియందును సమదృష్టి కలిగియుండును. అట్టి కర్మయోగి కర్మలనాచరించుచున్నను వాటి బంధములలో చిక్కుపడడు. (22)

**గతసంగస్య ముక్తస్య జ్ఞానావస్థితచేతసః ।**
**యజ్ఞాయాచరతః కర్మ సమగ్రం ప్రవిలీయతే ॥ 23 ॥**

గతసంగస్య, ముక్తస్య, జ్ఞానావస్థితచేతసః,
యజ్ఞాయ, ఆచరతః, కర్మ, సమగ్రమ్, ప్రవిలీయతే ॥ 23 ॥

| | | | |
|---|---|---|---|
| గతసంగస్య | = సర్వథా ఆసక్తిరహితుడును | యజ్ఞాయ | = కేవలము యజ్ఞార్థమే |
| ముక్తస్య | = దేహాభిమానము, మమకారము ఏమాత్రమూ లేనివాడును | ఆచరతః | = కర్మలను ఆచరించువాడును అగు పురుషునియొక్క |
| జ్ఞానావస్థితచేతసః | = పరమాత్మ జ్ఞానమునందే నిరంతరము మనస్సును లగ్నమొనర్చినవాడును | సమగ్రమ్, కర్మ | = కర్మలన్నియును |
| | | ప్రవిలీయతే | = విలీనములగును |

ఏలనన, ఆసక్తి, దేహాభిమానము, మమకారము ఏ మాత్రమూ లేనివాడును, పరమాత్మజ్ఞానమునందే నిరంతరము మనస్సును లగ్నమొనర్చినవాడును, కేవలము యజ్ఞార్థమే కర్మలను ఆచరించువాడును అగు మనుష్యుని యొక్క కర్మలన్నియును పూర్తిగా విలీనములగును అనగా మిగిలియుండవు. (23)

**బ్రహ్మార్పణం బ్రహ్మ హవిర్బ్రహ్మాగ్నౌ బ్రహ్మణా హుతమ్ ।**
**బ్రహ్మైవ తేన గంతవ్యం బ్రహ్మకర్మసమాధినా ॥ 24 ॥**

బ్రహ్మ, అర్పణమ్, బ్రహ్మ, హవిః, బ్రహ్మాగ్నౌ, బ్రహ్మణా, హుతమ్,
బ్రహ్మ, ఏవ, తేన, గంతవ్యమ్, బ్రహ్మకర్మసమాధినా ॥ 24 ॥

| | | | |
|---|---|---|---|
| అర్పణమ్, బ్రహ్మ | = యజ్ఞకర్మలయందు ఉపయుక్తములగు స్రువాది సాధనములు బ్రహ్మము | బ్రహ్మణా | = బ్రహ్మరూపకర్తద్వారా |
| | | బ్రహ్మాగ్నౌ | = బ్రహ్మరూపాగ్ని యందు |
| | | హుతమ్ | = హోమముచేయబడినదియు బ్రహ్మము |
| హవిః, బ్రహ్మ | = హోమద్రవ్యము | తేన, బ్రహ్మకర్మ- | = అట్టి బ్రహ్మరూపకర్మయందు స్థితుడైన |

| | | | | | |
|---|---|---|---|---|---|
| సమాధినా | | యోగి ద్వారా | బ్రహ్మ, ఏవ | = | బ్రహ్మమే |
| గంతవ్యమ్ | = | పొందదగినది (ఫలము) కూడ | | | |

యజ్ఞకార్యములయందు ఉపయుక్తమగు స్రువాదిసాధనములు బ్రహ్మము. హోమము చేయబడు ద్రవ్యము బ్రహ్మము. అగ్నియు బ్రహ్మము. యజ్ఞము నాచరించు కర్తయు బ్రహ్మము. హవనక్రియయు బ్రహ్మము. ఈ బ్రహ్మకర్మయందు స్థితుడై యుండు యోగి ద్వారా పొందదగిన యజ్ఞఫలముగూడ బ్రహ్మమే. (24)

**దైవమేవాపరే యజ్ఞం యోగినః పర్యుపాసతే ।**
**బ్రహ్మాగ్నావపరే యజ్ఞం యజ్ఞేనైవోపజుహ్వతి ॥ 25 ॥**

దైవమ్, ఏవ, అపరే, యజ్ఞమ్, యోగినః, పర్యుపాసతే,
బ్రహ్మాగ్నౌ, అపరే, యజ్ఞమ్, యజ్ఞేన, ఏవ, ఉపజుహ్వతి ॥ 25 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| అపరే | = | ఇతరులు (కొందఱు) | బ్రహ్మాగ్నౌ | = | పరబ్రహ్మ పరమాత్మ రూప-అగ్నియందు |
| యోగినః | = | యోగులు | | | |
| దైవమ్, యజ్ఞమ్, ఏవ | = | దైవపూజారూప యజ్ఞమునే | యజ్ఞేన, ఏవ | = | (అభేద దర్శనరూప) యజ్ఞముద్వారా మాత్రమే |
| పర్యుపాసతే | = | చక్కగా అనుష్ఠింతురు | యజ్ఞమ్, | = | ఆత్మరూపయజ్ఞమును |
| అపరే | = | మఱికొందరు | ఉపజుహ్వతి[1] | | ఆచరింతురు. |

కొందఱు యోగులు దైవపూజారూపయజ్ఞమును చక్కగా అనుష్ఠింతురు. మఱికొందఱు యోగులు బ్రహ్మాగ్నియందు అనగా పరబ్రహ్మపరమాత్మ రూపాగ్నియందు అభేదదర్శనరూపయజ్ఞముద్వారా ఆత్మరూపయజ్ఞమును ఆచరింతురు. (25)

**శ్రోత్రాదీనీంద్రియాణ్యన్యే సంయమాగ్నిషు జుహ్వతి ।**
**శబ్దాదీన్ విషయానన్య ఇంద్రియాగ్నిషు జుహ్వతి ॥ 26 ॥**

శ్రోత్రాదీని, ఇంద్రియాణి, అన్యే, సంయమాగ్నిషు, జుహ్వతి,
శబ్దాదీన్, విషయాన్, అన్యే, ఇంద్రియాగ్నిషు, జుహ్వతి ॥ 26 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| అన్యే | = | కొందరు యోగులు | ఇంద్రియాణి | = | ఇంద్రియములను |
| శ్రోత్రాదీని, | = | శ్రోత్రాది సమస్త- | సంయమాగ్నిషు | = | సంయమనరూపాగ్నులయందు |

*1.* జ్ఞానముద్వారా పరబ్రహ్మపరమాత్మయందు ఏకీభావస్థితుడైయుండుటనే బ్రహ్మరూపాగ్నియందు యజ్ఞముద్వారా యజ్ఞమును నడుపుటయందురు.

| | | | | | |
|---|---|---|---|---|---|
| జుహ్వతి | = | హోమము చేయుదురు | ఇంద్రియాగ్నిషు | = | ఇంద్రియ రూపాగ్నుల యందు |
| అన్యే | = | మఱికొందరు యోగులు | జుహ్వతి | = | హవనము చేయుదురు |
| శబ్దాదీన్, విషయాన్ | = | శబ్దాది సమస్త విషయములను | | | |

కొందరు యోగులు శ్రోత్రాది-ఇంద్రియములను సంయమన రూపాగ్నులయందు హోమము చేయుదురు. మఱికొందరు యోగులు శబ్దాది సమస్తవిషయములను ఇంద్రియరూపాగ్నులయందు హవనము చేయుదురు. అనగా- యోగులు మనో నిగ్రహము ద్వారా ఇంద్రియములను అదుపు చేయుదురు. తత్ఫలితముగా శబ్దాది విషయములు ఎదురుగా ఉన్నను లేకున్నను వాటి ప్రభావము వారి ఇంద్రియములపై ఏ మాత్రమూ ఉండదు. (26)

**సర్వాణీంద్రియకర్మాణి ప్రాణకర్మాణి చాపరే ।**
**ఆత్మసంయమయోగాగ్నౌ జుహ్వతి జ్ఞానదీపితే ॥ 27 ॥**

సర్వాణి, ఇంద్రియకర్మాణి, ప్రాణకర్మాణి, చ, అపరే,
ఆత్మసంయమయోగాగ్నౌ, జుహ్వతి, జ్ఞానదీపితే ॥ 27 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| అపరే | = | మఱికొందరు యోగులు | జ్ఞానదీపితే | = | జ్ఞానముచే ప్రకాశితమైన |
| సర్వాణి, ఇంద్రియకర్మాణి | = | ఇంద్రియ కర్మలను అన్నింటిని | ఆత్మసంయమ-యోగాగ్నౌ | = | ఆత్మసంయమ యోగ రూపాగ్ని యందు |
| చ | = | మఱియు | | | |
| ప్రాణకర్మాణి | = | ప్రాణక్రియలను అన్నింటిని | జుహ్వతి[1] | = | హవనము చేయుచుందురు |

మఱికొందఱు యోగులు ఇంద్రియముల క్రియలను, ప్రాణములక్రియలను అన్నింటిని జ్ఞానముచే ప్రకాశితమైన ఆత్మసంయమయోగరూపాగ్నిలో హవనము చేయుచుందురు. అట్టివారు పూర్తిగా పరమాత్మయందే స్థితులై యుందురు. అప్పుడు ప్రాణ-ఇంద్రియక్రియల ప్రభావము వారిపై ఏ మాత్రమూ ఉండదు. ఏలనన, వారి బుద్ధియందు పరమాత్మమాత్రమే నిలిచియుండును. (27)

**ద్రవ్యయజ్ఞాస్తపోయజ్ఞా యోగయజ్ఞాస్తథాపరే ।**
**స్వాధ్యాయజ్ఞానయజ్ఞాశ్చ యతయః సంశితవ్రతాః ॥ 28 ॥**

*1. సచ్చిదానంద ఘనపరమాత్మను తప్ప ఇతరమైనదానిని దేనినీ చింతన చేయకుండుటయే వాటిని (ప్రాణేంద్రియక్రియలను) హవనము చేయుట యగును.*

ద్రవ్యయజ్ఞాః, తపోయజ్ఞాః, యోగయజ్ఞాః, తథా, అపరే,
స్వాధ్యాయజ్ఞానయజ్ఞాః, చ, యతయః, సంశితవ్రతాః ॥ 28 ॥

| | | | |
|---|---|---|---|
| అపరే | = కొందఱు | చ | = మఱియు |
| ద్రవ్యయజ్ఞాః | = ద్రవ్యసంబంధ యజ్ఞములను | సంశితవ్రతాః | = అహింసాది తీక్ష్ణ వ్రతములను చేపట్టిన |
| తపోయజ్ఞాః | = (కొందరు) తపోరూప యజ్ఞములను | యతయః | = యత్నశీలురైన వారు |
| తథా | = అట్లే | స్వాధ్యాయజ్ఞాన-యజ్ఞాః | = స్వాధ్యాయరూప జ్ఞానయజ్ఞములను ఆచరింతురు |
| యోగయజ్ఞాః | = (కొందరు) యోగరూప యజ్ఞములను | | |

కొందఱు ద్రవ్యసంబంధయజ్ఞములను, మఱికొందఱు తపో-రూప యజ్ఞములను, కొందఱు యోగరూపయజ్ఞములను చేయుదురు. మఱికొందఱు అహింసాదితీక్ష్ణవ్రతములను చేపట్టి, యత్నశీలురై స్వాధ్యాయరూపజ్ఞానయజ్ఞములను ఆచరింతురు. (28)

**అపానే జుహ్వతి ప్రాణం ప్రాణేఽపానం తథాపరే ।**
**ప్రాణాపానగతీ రుద్ధ్వా ప్రాణాయామపరాయణాః ॥ 29 ॥**
**అపరే నియతాహారాః ప్రాణాన్ ప్రాణేషు జుహ్వతి ।**
**సర్వేఽప్యేతే యజ్ఞవిదో యజ్ఞక్షపితకల్మషాః ॥ 30 ॥**

అపానే, జుహ్వతి, ప్రాణమ్, ప్రాణే, అపానమ్, తథా, అపరే,
ప్రాణాపానగతీ, రుద్ధ్వా, ప్రాణాయామపరాయణాః ॥ 29 ॥
అపరే, నియతాహారాః, ప్రాణాన్, ప్రాణేషు, జుహ్వతి,
సర్వే, అపి, ఏతే, యజ్ఞవిదః, యజ్ఞక్షపితకల్మషాః ॥ 30 ॥

| | | | |
|---|---|---|---|
| అపరే | = కొందఱుయోగులు | అపానమ్ | = అపానవాయువును (హవనము చేయుదురు) |
| అపానే | = అపానవాయువునందు | | |
| ప్రాణమ్ | = ప్రాణవాయువును | అపరే | = మఱికొందరు |
| జుహ్వతి | = హోమము చేయుదురు | నియతాహారాః | = నియమితాహారనిష్ఠితులై |
| తథా | = అట్లే మరికొందరు యోగులు | ప్రాణాయామ పరాయణాః | = ప్రాణాయామ పరాయణులైనవారు |
| ప్రాణే | = ప్రాణవాయువునందు | ప్రాణాపానగతీ | = ప్రాణాపానగమనములను |

| | | | | | |
|---|---|---|---|---|---|
| రుద్ధ్వా | = | నిలిపి | | | ఈ సాధకులు |
| ప్రాణాన్ | = | ప్రాణములను | సర్వే, అపి | = | అందఱును |
| ప్రాణేషు | = | ప్రాణములయందు | యజ్ఞక్షపిత-కల్మషాః | = | యజ్ఞముల ద్వారాపాపములను రూపుమాపినవారు |
| జుహ్వతి | = | హోమము చేయుదురు | | | |
| ఏతే, యజ్ఞవిదః | = | యజ్ఞవిదులైన- | | | |

కొందరు యోగులు అపాన వాయువునందుప్రాణవాయువును, మఱికొందరు ప్రాణవాయువునందు అపానవాయువును హవనము చేయుదురు. ఇంకను కొందఱు నియమితాహార నిష్ఠితులై, ప్రాణయామ పరాయణులైనవారు ప్రాణాపానగమనములను నిలిపి, ప్రాణములను ప్రాణములయందే హవనము చేయుదురు. యజ్ఞవిదులైన ఈ సాధకులందఱును యజ్ఞముల ద్వారా పాపములను రూపుమాపుదురు. (29,30)

**యజ్ఞశిష్టామృతభుజో యాంతి బ్రహ్మ సనాతనమ్ ।**
**నాయం లోకోఽస్త్యయజ్ఞస్య కుతోఽన్యః కురుసత్తమ ॥ 31 ॥**

యజ్ఞశిష్టామృతభుజః, యాంతి, బ్రహ్మ, సనాతనమ్,
న, అయమ్, లోకః, అస్తి, అయజ్ఞస్య, కుతః, అన్యః, కురుసత్తమ ॥ 31 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| కురుసత్తమ! | = | కురుశ్రేష్ఠుడవైన ఓ అర్జునా! | యాంతి | = | పొందుచున్నారు |
| | | | అయజ్ఞస్య | = | యజ్ఞము చేయనివానికి |
| యజ్ఞశిష్టామృత భుజః | = | యజ్ఞపూత శేషమైన అమృతమును అనుభవించు యోగులు | అయమ్,లోకః, న, అస్తి | = | ఈ లోకమే సుఖప్రదము కాదు |
| | | | అన్యః | = | (ఇంక) పరలోక (విషయ)ము |
| సనాతనమ్ | = | సనాతనుడైన | | | |
| బ్రహ్మ | = | పరబ్రహ్మమును | కుతః | = | ఎట్లు? (ఎక్కడిది?) |

ఓ కురుసత్తమా! (అర్జునా!) యజ్ఞపూతశేషమైన అమృతమును అనుభవించు యోగులకు సనాతనుడును, పరబ్రహ్మమును అగు పరమాత్మయొక్క లాభము కలుగును. యజ్ఞము చేయనివారికి ఈమర్త్యలోకమే సుఖప్రదము కాదు. ఇంక పరలోక విషయము చెప్పనేల? (31)

**ఏవం బహువిధా యజ్ఞా వితతా బ్రహ్మణో ముఖే ।**
**కర్మజాన్ విద్ధి తాన్ సర్వాన్ ఏవం జ్ఞాత్వా విమోక్ష్యసే ॥ 32 ॥**

ఏవమ్, బహువిధాః, యజ్ఞాః, వితతాః, బ్రహ్మణః, ముఖే,
కర్మజాన్, విద్ధి, తాన్, సర్వాన్, ఏవమ్, జ్ఞాత్వా విమోక్ష్యసే ॥ 32 ॥

| | | | |
|---|---|---|---|
| ఏవమ్ | = ఇట్లు | కర్మజాన్ | = మనోవాక్కాయ కర్మల ద్వారా సుసంపన్నమగునని |
| బహువిధాః, | = బహువిధములైన | విద్ధి | = తెలిసికొనుము |
| యజ్ఞాః | = యజ్ఞములు | ఏవమ్, జ్ఞాత్వా | = ఇట్లు తెలిసికొని |
| బ్రహ్మణః, ముఖే | = వేదము(ల) ద్వారా | విమోక్ష్యసే | = విముక్తుడవయ్యెదవు |
| వితతాః | = విశదపఱచబడినవి | | |
| తాన్, సర్వాన్ | = వాటినన్నింటిని | | |

ఈ ప్రకారముగనే ఇంకను బహువిధములైన యజ్ఞములు వేదములలో విస్తృతముగా వివరింపబడినవి. ఈ యజ్ఞములనన్నింటిని త్రికరణశుద్ధిగా (మనోవాక్కాయములచే) ఆచరించినప్పుడే అవి సుసంపన్నములగునని తెలిసికొనుము. ఇట్లు ఈ కర్మతత్త్వమును తెలిసికొని, అనుష్ఠించుటవలన నీవు ప్రాపంచిక(కర్మ) బంధములనుండి సర్వథా విముక్తుడవయ్యెదవు. (32)

**శ్రేయాన్ ద్రవ్యమయాద్యజ్ఞాత్ జ్ఞానయజ్ఞః పరంతప ।**
**సర్వం కర్మాఖిలం పార్థ జ్ఞానే పరిసమాప్యతే ॥ 33 ॥**

శ్రేయాన్, ద్రవ్యమయాత్, యజ్ఞాత్, జ్ఞానయజ్ఞః, పరంతప,
సర్వం, కర్మ, అఖిలమ్, పార్థ, జ్ఞానే, పరిసమాప్యతే ॥ 33 ॥

| | | | |
|---|---|---|---|
| పరంతప! పార్థ! | = ఓ పరంతపా! ఓ పార్థా! | శ్రేయాన్ | = మిక్కిలి శ్రేష్ఠమైనది |
| ద్రవ్యమయాత్ | = ద్రవ్యములతో ఆచరింపబడు | అఖిలమ్, సర్వమ్, కర్మ | = కర్మలన్నియును |
| యజ్ఞాత్ | = యజ్ఞము కంటెను | జ్ఞానే | = జ్ఞానమునందు |
| జ్ఞానయజ్ఞః, | = జ్ఞానయజ్ఞము | పరిసమాప్యతే | = పరిసమాప్తమగును |

ఓ పరంతపా! అర్జునా! ద్రవ్యమయయజ్ఞముకంటెను జ్ఞానయజ్ఞము మిక్కిలి శ్రేష్ఠమైనది. కర్మలన్నియును జ్ఞానమునందే పరిసమాప్తమగును. (33)

**తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా ।**
**ఉపదేక్ష్యంతి తే జ్ఞానం జ్ఞానినస్తత్త్వదర్శినః ॥ 34 ॥**

తత్, విద్ధి, ప్రణిపాతేన, పరిప్రశ్నేన, సేవయా,
ఉపదేక్ష్యంతి, తే, జ్ఞానమ్, జ్ఞానినః, తత్త్వదర్శినః ॥ 34 ॥

| | | | |
|---|---|---|---|
| తత్త్వదర్శినః | = పరమాత్మతత్త్వమును ఎఱింగిన | ప్రణిపాతేన | = (వారికి) దండప్రణామములను ఆచరించుటద్వారా |
| జ్ఞానినః | = జ్ఞానులు | సేవయా | = సేవలొనర్చుటద్వారా |
| జ్ఞానమ్ | = తత్త్వజ్ఞానమును | పరిప్రశ్నేన | = వినయముతో ప్రశ్నించుటవలన |
| తే | = నీకు | తత్ | = ఆ తత్త్వజ్ఞానమును |
| ఉపదేక్ష్యంతి | = ఉపదేశించెదరు | విద్ధి | = (నీవు) తెలిసికొనుము |

నీవు తత్త్వమును దర్శించిన జ్ఞానుల కడకేగి, ఆ జ్ఞానమును గ్రహింపుము. వారికి దండప్రణామములాచరించుటవలనను, సేవలొనర్చుటవలనను, కపటము లేకుండ భక్తిశ్రద్ధలతో సముచితరీతిలో ప్రశ్నించుటవలనను పరమాత్మతత్త్వమును చక్కగానెఱింగిన జ్ఞానులు సంప్రీతులై, నీకు ఆ పరమాత్మతత్త్వజ్ఞానమును ఉపదేశించెదరు. (34)

**యద్ జ్ఞాత్వా న పునర్మోహమ్ ఏవం యాస్యసి పాండవ ।**
**యేన భూతాన్యశేషేణ ద్రక్ష్యస్యాత్మన్యథో మయి ॥ 35 ॥**

యత్, జ్ఞాత్వా, న, పునః, మోహమ్, ఏవమ్, యాస్యసి, పాండవ,
యేన, భూతాని, అశేషేణ, ద్రక్ష్యసి, ఆత్మని, అథో, మయి ॥ 35 ॥

| | | | |
|---|---|---|---|
| పాండవ! | = ఓ అర్జునా! | అశేషేణ | = నిశ్శేషముగా |
| యత్, జ్ఞాత్వా | = దేనిని తెలిసికొని | ఆత్మని[1] | = (మొదట) నీయాత్మయందును |
| పునః | = మఱల | అథో | = పిమ్మట |
| ఏవమ్, మోహమ్ | = ఇట్టి మోహమును | మయి | = పరమాత్మనైన నాయందును |
| న, యాస్యసి | = పొందవో | ద్రక్ష్యసి[2] | = చూడగలవో (దానిని ఎఱుంగుము) |
| యేన | = ఎట్టి జ్ఞానప్రభావముచేత | | |
| భూతాని | = సమస్త భూతములను | | |

ఓ అర్జునా! ఈ తత్త్వజ్ఞానమునెఱింగినచో మఱల ఇట్టి వ్యామోహములో చిక్కుకొనవు. ఈ జ్ఞాన ప్రభావముతో సమస్తప్రాణులను నీలో సంపూర్ణముగా చూడగలవు. పిమ్మట సచ్చిదానందఘనపరమాత్ముడనైననాలో చూడగలవు. (35)

**అపి చేదసి పాపేభ్యః సర్వేభ్యః పాపకృత్తమః ।**
**సర్వం జ్ఞానప్లవేనైవ వృజినం సంతరిష్యసి ॥ 36 ॥**

1. *గీత, 6వ అధ్యాయమునందలి 29వ శ్లోకము చూడుడు.*
2. *గీత, 6వ అధ్యాయమునందలి 30వ శ్లోకము చూడుడు.*

అపి, చేత్, అసి, పాపేభ్యః, సర్వేభ్యః, పాపకృత్తమః,
సర్వమ్, జ్ఞానప్లవేన, ఏవ, వృజినమ్, సంతరిష్యసి ॥ 36 ॥

| | | | |
|---|---|---|---|
| (త్వమ్) | = నీవు | జ్ఞానప్లవేన, ఏవ | = జ్ఞానమనెడి నౌక ద్వారా |
| సర్వేభ్యః, పాపేభ్యః, అపి | = పాపులందరికంటెను | సర్వమ్, వృజినమ్ | = సమస్త పాప సముద్రమును |
| పాపకృత్తమః, అసి, చేత్ | = అధికముగా పాపములను చేసినవాడవైనచో | సంతరిష్యసి | = పూర్తిగా దాటగలవు. |

ఒకవేళ పాపాత్ములందరికంటెను నీవు ఒక మహాపాపివి అయినచో, జ్ఞాననౌక సహాయముతో పాపసముద్రమునుండి నిస్సందేహముగా పూర్తిగా బయట పడగలవు. (36)

**యథైధాంసి సమిద్ధోఽగ్నిః భస్మసాత్కురుతేఽర్జున ।**
**జ్ఞానాగ్నిః సర్వకర్మాణి భస్మసాత్కురుతే తథా ॥ 37 ॥**

యథా, ఏధాంసి, సమిద్ధః, అగ్నిః, భస్మసాత్, కురుతే, అర్జున,
జ్ఞానాగ్నిః, సర్వకర్మాణి, భస్మసాత్, కురుతే, తథా ॥ 37 ॥

| | | | |
|---|---|---|---|
| అర్జున! | = ఓ అర్జునా! | తథా | = అట్లే |
| యథా | = ఎట్లైతే, | జ్ఞానాగ్నిః | = జ్ఞానమనెడి అగ్ని |
| సమిద్ధః, అగ్నిః | = ప్రజ్వలించుచున్న అగ్ని | సర్వకర్మాణి | = కర్మలను అన్నింటిని |
| ఏధాంసి | = ఇంధనములను | భస్మసాత్, కురుతే | = భస్మమొనరించును |
| భస్మసాత్, కురుతే | = భస్మమొనర్చునో | | |

ఓ అర్జునా! ప్రజ్వలించుచున్న అగ్ని సమిధలను భస్మముచేసినట్లు జ్ఞానమను అగ్ని కర్మల నన్నింటిని భస్మమొనరించును. (37)

**న హి జ్ఞానేన సదృశం పవిత్రమిహ విద్యతే ।**
**తత్స్వయం యోగసంసిద్ధః కాలేనాత్మని విందతి ॥ 38 ॥**

న, హి, జ్ఞానేన, సదృశమ్, పవిత్రమ్, ఇహ, విద్యతే,
తత్, స్వయమ్, యోగసంసిద్ధః, కాలేన, ఆత్మని, విందతి ॥ 38 ॥

| | | | |
|---|---|---|---|
| ఇహ | = ఈ జగత్తునందు | హి | = నిస్సందేహముగా |
| జ్ఞానేన, సదృశమ్ | = జ్ఞానముతో సమానముగా | న, విద్యతే | = (ఏదియును) లేదు |
| పవిత్రమ్ | = పవిత్రమైనది | తత్ | = ఆ జ్ఞానమును |

| | | | | | |
|---|---|---|---|---|---|
| కాలేన | = | దీర్ఘకాలమువఱకును | స్వయమ్ | = | స్వయముగనే |
| యోగసంసిద్ధః | = | కర్మయోగముద్వారా శుద్ధాంతఃకరణము గలవాడు | ఆత్మని | = | ఆత్మయందు |
| | | | విందతి | = | పొందును |

ప్రపంచమున జ్ఞానముతో సమానముగ పవిత్రమైనది మరియొకటిలేనేలేదు. శుద్ధాంతఃకరణముగల సాధకుడు బహుకాలమువరకు కర్మయోగాచరణము చేసి, ఆత్మయందు అదే జ్ఞానమును తనంతటతానే పొందగలడు. (38)

**శ్రద్ధావాన్ లభతే జ్ఞానం తత్పరః సంయతేంద్రియః ।**
**జ్ఞానం లబ్ధ్వా పరామ్ శాంతిమచిరేణాధిగచ్ఛతి ॥ 39 ॥**

శ్రద్ధావాన్, లభతే, జ్ఞానమ్ తత్పరః, సంయతేంద్రియః,
జ్ఞానమ్, లబ్ధ్వా, పరామ్, శాంతిమ్, అచిరేణ, అధిగచ్ఛతి ॥ 39 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| సంయతేంద్రియః | = | జితేంద్రియుడు | జ్ఞానమ్, లబ్ధ్వా | = | (ఈ) జ్ఞానమును పొంది |
| తత్పరః | = | సాధనపరాయణుడు | | | |
| శ్రద్ధావాన్ | = | శ్రద్ధగలవాడు | అచిరేణ | = | తత్క్షణముననే |
| జ్ఞానమ్ | = | ఈ తత్త్వజ్ఞానమును | పరామ్, శాంతిమ్ | = | పరమశాంతిని |
| లభతే | = | పొందును | అధిగచ్ఛతి | = | పొందును |

జితేంద్రియుడు, సాధనపరాయణుడు శ్రద్ధాళువైన మనుజునకు ఈ భగవత్తత్త్వ జ్ఞానము లభించును. ఆ జ్ఞానము కలిగిన వెంటనే (ఏ మాత్రము విలంబము లేకుండ) అతడు భగవత్తత్త్వ రూపమైన పరమశాంతిని పొందును. (39)

**అజ్ఞశ్చాశ్రద్దధానశ్చ సంశయాత్మా వినశ్యతి ।**
**నాయం లోకోఽస్తి న పరో న సుఖం సంశయాత్మనః ॥ 40 ॥**

అజ్ఞః, చ, అశ్రద్దధానః, చ, సంశయాత్మా, వినశ్యతి,
న, అయమ్, లోకః, అస్తి, న, పరః, న, సుఖమ్, సంశయాత్మనః ॥ 40 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| అజ్ఞః | = | వివేకహీనుడును | సంశయాత్మనః | = | సంశయాత్మునకు |
| చ | = | మఱియు | అయమ్, లోకః | = | ఈ లోకము |
| అశ్రద్దధానః | = | శ్రద్ధారహితుడు | న, అస్తి | = | ఉండదు |
| సంశయాత్మా | = | సంశయగ్రస్తుడైనవాడు | న, పరః, చ | = | పరలోకమూ ఉండదు |
| వినశ్యతి | = | భ్రష్టుడై నశించును | న, సుఖమ్ | = | సుఖమూ ఉండదు |

అవివేకియు, శ్రద్ధారహితుడును అయిన సంశయాత్ముడు పరమార్థ విషయమున అవశ్యము భ్రష్టుడేయగును. అట్టి సంశయాత్మునకు ఈ లోకమునందుగాని, పరలోకమునందుగాని ఎట్టి సుఖమూ ఉండదు. (40)

**యోగసన్న్యస్తకర్మాణం జ్ఞానసంఛిన్నసంశయమ్ ।**
**ఆత్మవంతం న కర్మాణి నిబధ్నంతి ధనంజయ ॥ 41 ॥**

యోగసన్న్యస్తకర్మాణమ్, జ్ఞానసంఛిన్నసంశయమ్,
ఆత్మవంతమ్, న, కర్మాణి, నిబధ్నంతి, ధనంజయ ॥ 41 ॥

| | | | |
|---|---|---|---|
| **ధనంజయ!** | = ఓ ధనంజయా! అర్జునా! | **ఆత్మవంతమ్** | = అంతఃకరణమును వశమునందు ఉంచుకొనిన వాడును అగువానిని |
| **యోగసన్న్యస్త-కర్మాణమ్** | = విధ్యుక్త కర్మలను ఆచరించుచు వాటిని భగవదర్పణము చేయువాడును | | |
| **జ్ఞానసంఛిన్న-సంశయమ్** | = వివేకముద్వారా సంశయములను అన్నింటిని తొలగించుకొనినవాడును | **కర్మాణి** | = కర్మలు |
| | | **న, నిబధ్నంతి** | = ఏమాత్రము బంధింపవు |

ఓ ధనంజయా! (ఓ అర్జునా!) విధిపూర్వకముగ కర్మలను ఆచరించుచు కర్మ ఫలములను అన్నింటిని భగవదర్పణము చేయుచు, వివేకముద్వారా సంశయములనన్నింటిని తొలగించుకొనుచు, అంతఃకరణమును వశమునందుంచుకొనిన వానిని కర్మలు బంధింపజాలవు. (41)

**తస్మాదజ్ఞానసంభూతం హృత్స్థం జ్ఞానాసినాత్మనః ।**
**ఛిత్త్వైనం సంశయం యోగమ్ ఆతిష్ఠోత్తిష్ఠ భారత ॥ 42 ॥**

తస్మాత్, అజ్ఞానసంభూతమ్, హృత్స్థమ్, జ్ఞానాసినా, ఆత్మనః,
ఛిత్త్వా, ఏనమ్, సంశయమ్, యోగమ్, ఆతిష్ఠ, ఉత్తిష్ఠ, భారత ॥ 42 ॥

| | | | |
|---|---|---|---|
| **తస్మాత్** | = అందువలన | **ఏనమ్, అజ్ఞాన-సంభూతమ్** | = ఈ అజ్ఞానజనితమైన |
| **భారత!** | = ఓ అర్జునా! | | |
| **హృత్స్థమ్** | = (నీ) హృదయమునందున్న | | |

ఆత్మనః, సంశయమ్ = నీ సంశయమును

జ్ఞానాసినా = వివేకమనెడి ఖడ్గముచే

ఛిత్వా = ఛేదించి

యోగమ్ = సమత్వ రూపకర్మ యోగమునందు

ఆతిష్ఠ = స్థితుడవుకమ్ము

ఉత్తిష్ఠ = యుద్ధమునకై లెమ్ము

కావున, ఓ భారతా! (అర్జునా!) నీ హృదయమునందు గల అజ్ఞానజనితమైన ఈ సంశయమును వివేకజ్ఞానమను ఖడ్గముతో రూపుమాపి, సమత్వరూప కర్మయోగమునందు స్థితుడవై యుద్ధమునకు సన్నద్ధుడవగుము. (42)

*ఓం తత్సదితి శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే జ్ఞానకర్మసన్న్యాసయోగో నామ చతుర్థోఽధ్యాయః ॥ ౪ ॥*

॥ ఓం శ్రీపరమాత్మనే నమః ॥

# అథ పంచమోఽధ్యాయః - కర్మసన్న్యాసయోగః

## (ఐదవ అధ్యాయము-కర్మసన్న్యాసయోగము)

ముఖ్యాంశములు : [(1 నుండి 6వ శ్లోకమువఱకు) సాంఖ్యయోగ నిష్కామ కర్మయోగములనిర్వచనము. (7 నుండి 12 వఱకు) సాంఖ్యయోగి నిష్కామ కర్మయోగుల లక్షణములు. వారి మహత్త్వము. (13 నుండి 26 వఱకు) జ్ఞానయోగ చర్చ. (27 నుండి 29 వఱకు) భక్తి సహిత ధ్యానయోగ వర్ణనము.]

**అర్జున ఉవాచ**

**సన్న్యాసం కర్మణాం కృష్ణ పునర్యోగం చ శంససి ।**
**యచ్ఛ్రేయ ఏతయోరేకం తన్మే బ్రూహి సునిశ్చితమ్ ॥ 1 ॥**

సన్న్యాసమ్, కర్మణామ్, కృష్ణ, పునః, యోగమ్, చ, శంససి,
యత్, శ్రేయః, ఏతయోః, ఏకమ్, తత్, మే, బ్రూహి, సునిశ్చితమ్ ॥ 1 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| కృష్ణ | = | కృష్ణా! | ఏతయోః | = | ఈ రెండింటిలో |
| కర్మణామ్, సన్న్యాసమ్ | = | (ఒకసారి) కర్మసన్న్యాసమును | యత్ | = | ఏది |
| | | | సునిశ్చితమ్ | = | నిశ్చయముగా |
| | | | మే, శ్రేయః | = | నాకు శ్రేయస్కరమో |
| పునః | = | మఱియొకసారి | | | |
| యోగమ్ చ, | = | కర్మయోగమునూ | తత్, ఏకమ్ | = | ఆ ఒక్కదానిని |
| శంససి | = | ప్రశంసించుచున్నావు | బ్రూహి | = | తెలుపుము |

అర్జునుడుపలికెను - ఓ కృష్ణా! ఒక్కసారి కర్మసన్న్యాసమును, మరియొకసారి కర్మయోగమును ప్రశంసించుచున్నావు. నిశ్చయముగా ఈ రెండింటిలో నాకు ఏది శ్రేయస్కరమో చెప్పుము. (1)

**శ్రీభగవాన్ ఉవాచ**

**సన్న్యాసః కర్మయోగశ్చ నిఃశ్రేయసకరావుభౌ ।**
**తయోస్తు కర్మసన్న్యాసాత్ కర్మయోగో విశిష్యతే ॥ 2 ॥**

సన్న్యాసః, కర్మయోగః, చ, నిఃశ్రేయసకరౌ, ఉభౌ,
తయోః, తు, కర్మసన్న్యాసాత్, కర్మయోగః, విశిష్యతే ॥ 2 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| సన్న్యాసః[1] | = | సన్న్యాసము | తు | = | అయితే |
| చ | = | మఱియు | తయోః | = | ఆ రెండింటిలో |
| కర్మయోగః | = | కర్మయోగము | కర్మసన్న్యా-సాత్ | = | కర్మసన్న్యాసము కంటెను |
| ఉభౌ | = | (అను) ఈ రెండును | కర్మయోగః[2] | = | (సాధనసులభమైన) కర్మయోగము |
| నిఃశ్రేయసకరౌ | = | పరమశ్రేయస్సును గూర్చునవియే | విశిష్యతే | = | శ్రేష్ఠమైనది |

శ్రీకృష్ణ భగవానుడు పలికెను - కర్మసన్న్యాసము, కర్మయోగము అను ఈ రెండును పరమకల్యాణదాయకములే. కాని, ఈ రెండింటిలోను కర్మసన్న్యాసముకంటెను కర్మయోగము సాధనయందు సుగమమగుటవలన శ్రేష్ఠమైనది. (2)

**జ్ఞేయః స నిత్యసన్న్యాసీ యో న ద్వేష్టి న కాంక్షతి ।**
**నిర్ద్వంద్వో హి మహాబాహో సుఖం బంధాత్ ప్రముచ్యతే ॥ 3 ॥**

జ్ఞేయః, సః, నిత్యసన్న్యాసీ, యః, న, ద్వేష్టి న, కాంక్షతి,
నిర్ద్వంద్వః, హి, మహాబాహో, సుఖమ్, బంధాత్, ప్రముచ్యతే ॥ 3 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| మహాబాహో | = | ఓ అర్జునా! | హి | = | ఏలనన |
| యః | = | ఎవడైతే | నిర్ద్వంద్వః | = | రాగద్వేషాది ద్వంద్వరహితుడు |
| న, ద్వేష్టి | = | (ఎవరినీ) ద్వేషింపడో | | | |
| న, కాంక్షతి | = | (దేనినీ) ఆసింపడో | సుఖమ్ | = | సుఖముగా |
| సః | = | అట్టి కర్మయోగి | బంధాత్ | = | సంసార బంధముల నుండి |
| నిత్యసన్న్యాసీ | = | సదా సన్న్యాసిగా | | | |
| జ్ఞేయః | = | తెలిసికొనదగినవాడు | ప్రముచ్యతే | = | ముక్తుడగును |

మహాబాహూ! ఎవ్వరినీ ద్వేషింపని, దేనినీ కాంక్షింపని కర్మయోగిని నిత్యసన్న్యాసిగా ఎఱుంగవలెను. ఏలనన, రాగద్వేషాది ద్వంద్వములను అధిగమించినవాడు అవలీలగా సంసారబంధములనుండి ముక్తుడగును. (3)

**సాంఖ్యయోగౌ పృథగ్బాలాః ప్రవదంతి న పండితాః ।**
**ఏకమప్యాస్థితః సమ్యగుభయోర్విందతే ఫలమ్ ॥ 4 ॥**

1. శరీరేంద్రియమనస్సులద్వారా జరుగు సమస్తకర్మలయందును కర్తృత్వభావము లేకుండుట
2. సమత్వబుద్ధితో భగవదర్థకర్మలను ఆచరించుట.

సాంఖ్యయోగౌ, పృథక్, బాలాః, ప్రవదంతి, న, పండితాః,
ఏకమ్, అపి, ఆస్థితః, సమ్యక్, ఉభయోః, విందతే, ఫలమ్ ॥ 4 ॥

| | | | |
|---|---|---|---|
| బాలాః | = మూర్ఖులు | (హి) | = ఎందుకనగా |
| సాంఖ్యయోగౌ | = సన్న్యాసయోగము, కర్మయోగము | ఏకమ్, అపి | = ఆ రెండింటిలో ఏ ఒక్క దానియందైనను |
| పృథక్ | = వేర్వేఱు ఫలములను ఇచ్చునవిగా | సమ్యక్, ఆస్థితః | = బాగుగా స్థితుడైనవాడు |
| ప్రవదంతి | = చెప్పుచుందురు | ఉభయోః, ఫలమ్ | = రెండింటి ఫలమగు పరమాత్మను |
| న, పండితాః | = పండితులు అట్లు చెప్పరు | విందతే | = పొందును. |

సాంఖ్య, కర్మయోగములు వేర్వేఱుఫలములను ఇచ్చునని మూర్ఖులు పలికెదరు. పండితులట్లు పలుకరు. ఆ రెండింటిలో ఏ ఒక్కదానినైనను బాగుగా (విధివిధానముగ) ఆచరించినవాడు, ఈ రెండింటి ఫలస్వరూపమైన పరమాత్మను పొందును. (4)

**యత్సాంఖ్యైః ప్రాప్యతే స్థానం తద్యోగైరపి గమ్యతే ।**
**ఏకం సాంఖ్యం చ యోగం చ యః పశ్యతి స పశ్యతి ॥ 5 ॥**

యత్, సాంఖ్యైః, ప్రాప్యతే, స్థానమ్, తత్, యోగైః, అపి, గమ్యతే,
ఏకమ్, సాంఖ్యమ్, చ, యోగమ్, చ, యః, పశ్యతి, సః, పశ్యతి ॥ 5 ॥

| | | | |
|---|---|---|---|
| యత్, స్థానమ్ | = ఏ పరంధామము | చ | = మఱియు |
| సాంఖ్యైః | = జ్ఞానయోగులచేత | యోగమ్ | = కర్మయోగమును |
| ప్రాప్యతే | = పొందబడునో | ఏకమ్ | = ఫలవిషయమున ఒక్కదానినిగా |
| తత్ | = ఆస్థానము | | |
| యోగైః, అపి | = కర్మయోగులచేతనూ | పశ్యతి | = చూచునో |
| గమ్యతే | = పొందబడును | సః, చ | = అతడే |
| యః | = ఏ పురుషుడు | పశ్యతి | = నిజముగా చూచువాడు (నిజమైన ద్రష్ట). |
| సాంఖ్యమ్ | = జ్ఞానయోగమును | | |

జ్ఞానయోగులు పొందు పరంధామమునే కర్మయోగులును పొందుదురు. జ్ఞానయోగఫలమును, కర్మయోగఫలమును ఒక్కటిగా చూచువాడే యథార్థమును గ్రహించును. (5)

**సన్న్యాసస్తు మహాబాహో దుఃఖమాప్తుమయోగతః ।**
**యోగయుక్తో మునిర్బ్రహ్మ నచిరేణాధిగచ్ఛతి ॥ 6 ॥**

సన్న్యాసః, తు, మహాబాహో, దుఃఖమ్, ఆప్తుమ్, అయోగతః,
యోగయుక్తః, మునిః, బ్రహ్మ, నచిరేణ, అధిగచ్ఛతి ॥ 6 ॥

| | | |
|---|---|---|
| తు | = | అయితే |
| మహాబాహో! | = | ఓ మహాబాహూ! |
| అయోగతః | = | కర్మయోగమును అనుష్ఠింపక |
| సన్న్యాసః | = | సన్న్యాసము (శరీరేంద్రియ మనస్సులద్వారా జరుగు కర్మలన్నింటి యందును కర్తృత్వమును త్యజించుట) |
| ఆప్తుమ్ | = | పొందుట |
| దుఃఖమ్ | = | కష్టము |
| మునిః | = | భగవత్స్వరూపమును మననము చేయు |
| యోగయుక్తః | = | కర్మయోగి |
| బ్రహ్మ | = | పరబ్రహ్మ పరమాత్మను |
| నచిరేణ | = | శీఘ్రముగా |
| అధిగచ్ఛతి | = | పొందును. |

కాని, ఓ అర్జునా! కర్మయోగమును అనుష్ఠింపక సన్న్యాసము అనగా మనస్సు, ఇంద్రియములు, శరీరములద్వారా జరుగు కర్మలన్నింటియందును కర్తృత్వమును త్యజించుట - కష్టము. భగవత్స్వరూపమును మననముచేయు కర్మయోగి పరబ్రహ్మపరమాత్మను శీఘ్రముగ పొందగలడు. (6)

**యోగయుక్తో విశుద్ధాత్మా విజితాత్మా జితేంద్రియః ।**
**సర్వభూతాత్మభూతాత్మా కుర్వన్నపి న లిప్యతే ॥ 7 ॥**

యోగయుక్తః, విశుద్ధాత్మా, విజితాత్మా, జితేంద్రియః,
సర్వభూతాత్మభూతాత్మా, కుర్వన్, అపి, న, లిప్యతే ॥ 7 ॥

| | | |
|---|---|---|
| విజితాత్మా | = | మనస్సును వశము నందుంచుకొనిన వాడును |
| జితేంద్రియః | = | జితేంద్రియుడును |
| విశుద్ధాత్మా | = | అంతఃకరణశుద్ధి కలవాడును |
| సర్వభూతాత్మభూతాత్మా | = | సర్వప్రాణులలో ఆత్మ స్వరూపుడైన పరమాత్మను తన ఆత్మగా కలవాడునగు |
| యోగయుక్తః | = | కర్మయోగి |
| కుర్వన్, అపి | = | కర్మలను ఆచరించుచున్నను |
| న, లిప్యతే | = | ఆ కర్మలు వానిని అంటవు |

మనస్సును వశమునందుంచుకొనినవాడు, జితేంద్రియుడు, అంతఃకరణశుద్ధి కలవాడు, సర్వప్రాణులలో ఆత్మస్వరూపుడైన పరమాత్మను తన ఆత్మగా కలవాడు అగు కర్మయోగి కర్మలను ఆచరించుచున్నను ఆ కర్మలు వానిని అంటవు. (7)

**నైవ కించిత్ కరోమీతి యుక్తో మన్యేత తత్త్వవిత్ ।**
**పశ్యన్ శృణ్వన్ స్పృశన్ జిఘ్రన్నశ్నన్ గచ్ఛన్ స్వపన్ శ్వసన్ ॥ 8 ॥**
**ప్రలపన్ విసృజన్ గృహ్ణన్నున్మిషన్ నిమిషన్నపి ।**
**ఇంద్రియాణీంద్రియార్థేషు వర్తంత ఇతి ధారయన్ ॥ 9 ॥**

న, ఏవ, కించిత్, కరోమి, ఇతి యుక్తః, మన్యేత, తత్త్వవిత్,
పశ్యన్, శృణ్వన్, స్పృశన్, జిఘ్రన్, అశ్నన్, గచ్ఛన్, స్వపన్, శ్వసన్ ॥ 8 ॥
ప్రలపన్, విసృజన్, గృహ్ణన్, ఉన్మిషన్, నిమిషన్, అపి,
ఇంద్రియాణి, ఇంద్రియార్థేషు, వర్తంతే, ఇతి, ధారయన్ ॥ 9 ॥

| | | | |
|---|---|---|---|
| తత్త్వవిత్, యుక్తః | = తత్త్వజ్ఞుడైన సాంఖ్యయోగి | గృహ్ణన్ | = గ్రహించుచు |
| పశ్యన్ | = చూచుచు | ఉన్మిషన్ | = కనులను తెరచుచు |
| శృణ్వన్ | = వినుచు | నిమిషన్, అపి | = మూయుచును |
| స్పృశన్ | = స్పృశించుచు | ఇంద్రియాణి | = ఇంద్రియములు |
| జిఘ్రన్ | = ఆఘ్రాణించుచు | ఇంద్రియార్థేషు | = తమ తమ శబ్దాది విషయములయందు |
| అశ్నన్ | = తినుచు | వర్తంతే, ఇతి | = ప్రవర్తించుచున్నవని |
| గచ్ఛన్ | = నడుచుచు | ధారయన్ | = తలంచుచు |
| స్వపన్ | = నిద్రించుచు | కించిత్, న, ఏవ, కరోమి | = నేను ఏ కొంచెమూ (ఏమియు)చేయుట లేదు |
| శ్వసన్ | = శ్వాసక్రియలను నడుపుచు | | |
| ప్రలపన్ | = భాషించుచు | | |
| విసృజన్ | = త్యజించుచు | ఇతి, మన్యేత | = అని భావించును |

తత్త్వజ్ఞుడైన సాంఖ్యయోగి చూచుచు , వినుచు,స్పృశించుచు , ఆఘ్రాణించుచు , భుజించుచు, నడుచుచు , నిద్రించుచు, శ్వాసక్రియలను నడపుచు, భాషించుచు, త్యజించుచు, గ్రహించుచు, కనులను తెరచుచు, మూయుచు ఉన్నను ఇంద్రియములు తమతమ విషయములయందు వర్తించుచున్నవనియు, తానేమియు చేయుటలేదనియు భావించును. (8,9)

**బ్రహ్మణ్యాధాయ కర్మాణి సంగం త్యక్త్వా కరోతి యః ।**
**లిప్యతే న స పాపేన పద్మపత్రమివాంభసా ॥ 10 ॥**

బ్రహ్మణి, ఆధాయ, కర్మాణి, సంగమ్, త్యక్త్వా, కరోతి, యః,
లిప్యతే, న, సః, పాపేన, పద్మపత్రమ్, ఇవ, అంభసా ॥ 10 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| యః | = | ఎవడైతే | అంభసా, | = | జలబిందువులచే |
| కర్మాణి | = | కర్మలనన్నింటిని | పద్మపత్రమ్, ఇవ | = | పద్మపత్రమువలె (తాకబడకుండునట్లు) |
| బ్రహ్మణి, ఆధాయ | = | భగవదర్పణము గావించి | పాపేన | = | పాపము(ల)చే |
| సంగమ్, త్యక్త్వా | = | ఆసక్తిని త్యజించి | న, లిప్యతే | = | తాకబడడు (పాపములు ఆపురుషుని ఏ మాత్రముఅంటవు) |
| కరోతి | = | (కర్మలను) ఆచరించుచున్నాడో | | | |
| సః | = | ఆ పురుషుడు | | | |

కర్మలనన్నింటిని భగవదర్పణము గావించి, ఆసక్తిరహితముగ కర్మలనాచరించువానిని తామరాకుపై నీటిబిందువులవలె పాపములు అంటవు. (10)

**కాయేన మనసా బుద్ధ్యా కేవలైరింద్రియైరపి ।**
**యోగినః కర్మ కుర్వంతి సంగం త్యక్త్వాత్మశుద్ధయే ॥ 11 ॥**

కాయేన, మనసా, బుద్ధ్యా, కేవలైః ఇంద్రియైః, అపి,
యోగినః, కర్మ, కుర్వంతి, సంగమ్, త్యక్త్వా, ఆత్మశుద్ధయే ॥ 11 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| యోగినః | = | కర్మయోగులు | బుద్ధ్యా | = | బుద్ధిచేతను |
| సంగమ్, | = | మమతాసక్తులను | కాయేన, అపి | = | శరీరముచేతను |
| త్యక్త్వా | = | వీడి | ఆత్మశుద్ధయే | = | ఆత్మశుద్ధికొఱకు మాత్రమే |
| కేవలైః | = | కేవలము | | | |
| ఇంద్రియైః | = | ఇంద్రియములచేతను | కర్మ, కుర్వంతి | = | కర్మలను ఆచరించుచుందురు. |
| మనసా | = | మనస్సుచేతను | | | |

కర్మయోగులు మమతాసక్తిరహితులై కేవలము ఇంద్రియములు, మనస్సు, బుద్ధి, శరీరముల ద్వారా అంతఃకరణశుద్ధికై కర్మలను ఆచరింతురు. (11)

**యుక్తః కర్మఫలం త్యక్త్వా శాంతిమాప్నోతి నైష్ఠికీమ్ ।**
**అయుక్తః కామకారేణ ఫలే సక్తో నిబధ్యతే ॥ 12 ॥**

యుక్తః, కర్మఫలమ్, త్యక్త్వా, శాంతిమ్, ఆప్నోతి, నైష్ఠికీమ్,
అయుక్తః, కామకారేణ, ఫలే, సక్తః, నిబధ్యతే ॥ 12 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| యుక్తః | = | నిష్కామకర్మయోగి | అయుక్తః | = | సకామపురుషుడు |
| కర్మఫలమ్ | = | కర్మఫలము(ల)ను | కామకారేణ | = | వాంఛల ప్రేరణలచే |
| త్యక్త్వా | = | త్యజించి | ఫలే, సక్తః | = | ఫలాసక్తితో |
| నైష్ఠికీమ్, శాంతిమ్ | = | భగవత్ప్రాప్తిరూపమైన శాంతిని | | | (కర్మలనుఆచరించి) |
| | | | నిబధ్యతే | = | బంధింపబడును |
| ఆప్నోతి | = | పొందును | | | (బద్ధుడగును) |

నిష్కామకర్మయోగి కర్మఫలములను త్యజించి, భగవత్ప్రాప్తిరూపమైన శాంతినిపొందును. కర్మఫలాసక్తుడైనవాడు ఫలేచ్ఛతో కర్మలనాచరించి బద్ధుడగును. (12)

**సర్వకర్మాణి మనసా సన్న్యస్యాస్తే సుఖం వశీ ।**
**నవద్వారే పురే దేహీ నైవ కుర్వన్ న కారయన్ ॥ 13 ॥**

సర్వకర్మాణి, మనసా, సన్న్యస్య, ఆస్తే, సుఖమ్, వశీ,
నవద్వారే, పురే, దేహీ, న, ఏవ, కుర్వన్, న, కారయన్ ॥ 13 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| వశీ, దేహీ | = | అంతఃకరణమును వశమునందుంచుకొని, సాంఖ్యయోగమును ఆచరించు పురుషుడు | సర్వకర్మాణి | = | సమస్తకర్మలను |
| | | | మనసా | = | మానసికముగా |
| | | | సన్న్యస్య | = | త్యజించి |
| | | | సుఖమ్ | = | సుఖముగా |
| న, కుర్వన్ | = | కర్మలను ఆచరింపక | ఆస్తే | = | (సచ్చిదానంద ఘనపరమాత్మ స్వరూపమున) స్థితుడైయుండును. |
| న, కారయన్, ఏవ | = | ఆచరింపజేయకయే | | | |
| నవద్వారే, పురే | = | నవద్వారములుగల శరీరమను పురమునందు | | | |

అంతఃకరణమును అదుపులోనుంచుకొని, సాంఖ్యయోగమును ఆచరించు పురుషుడు కర్మలను ఆచరింపకయే, ఆచరింపజేయకయే, నవద్వారములుగల శరీరమునందు సమస్తకర్మలను మానసికముగా త్యజించి, సచ్చిదానంద ఘనపరమాత్మ స్వరూపమున స్థితుడై, ఆనందమును అనుభవించును. (13)

**న కర్తృత్వం న కర్మాణి లోకస్య సృజతి ప్రభుః ।**
**న కర్మఫలసంయోగం స్వభావస్తు ప్రవర్తతే ॥ 14 ॥**

న, కర్తృత్వమ్, న, కర్మాణి, లోకస్య, సృజతి, ప్రభుః,
న, కర్మఫలసంయోగమ్, స్వభావః, తు, ప్రవర్తతే ॥ 14 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| ప్రభుః | = | పరమేశ్వరుడు | న (సృజతి) | = | సృజింపడు |
| లోకస్య, కర్తృత్వమ్ | = | మానవుల కర్తృత్వమును | తు | = | అయితే |
| న, సృజతి | = | సృజింపడు | | | |
| కర్మాణి | = | (వారి) కర్మలను | స్వభావః | = | (ఈయన్నింటియందును) ప్రకృతియే |
| న (సృజతి) | = | సృజింపడు | | | |
| కర్మఫలసంయోగమ్ | = | కర్మఫలసంయోగమును | ప్రవర్తతే | = | ప్రవర్తిల్లును |

పరమేశ్వరుడు మానవుల యొక్క కర్తృత్వమునుగాని, వారి కర్మలనుగాని, కర్మఫల సంయోగమును గాని సృజింపడు. ఈ యన్నింటిలో ప్రకృతియే ప్రవర్తిల్లును. అనగా గుణములే గుణములయందు ప్రవర్తిల్లుచుండును. (14)

**నాదత్తే కస్యచిత్పాపం న చైవ సుకృతం విభుః ।**
**అజ్ఞానేనావృతం జ్ఞానం తేన ముహ్యంతి జంతవః ॥ 15 ॥**

న, ఆదత్తే, కస్యచిత్, పాపమ్, న, చ, ఏవ, సుకృతమ్, విభుః,
అజ్ఞానేన, ఆవృతమ్, జ్ఞానమ్, తేన, ముహ్యంతి, జంతవః ॥ 15 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| విభుః | = | సర్వవ్యాపియైన భగవంతుడు | అజ్ఞానేన | = | అజ్ఞానముచేత |
| కస్యచిత్ | = | ఏ ఒక్కనియొక్క | జ్ఞానమ్ | = | జ్ఞానము |
| పాపమ్, న, ఆదత్తే | = | పాపకర్మమును గ్రహింపడు | ఆవృతమ్ | = | ఆవరింపబడును |
| | | | తేన | = | ఆకారణముచేత |
| చ | = | మఱియు | జంతవః | = | ప్రాణులు(మానవులు) |
| సుకృతమ్, ఏవ, న, (ఆదత్తే) | = | పుణ్యకర్మలను గ్రహింపడు (కాని) | ముహ్యంతి | = | మోహితులగు చున్నారు |

సర్వవ్యాపియైన భగవంతుడు ప్రాణుల పుణ్యపాప కర్మలలో దేనికిని భాగస్వామి కాడు. అజ్ఞానముచే జ్ఞానము కప్పబడియుండుటవలన ప్రాణులు మోహితులగుచుందురు. (15)

**జ్ఞానేన తు తదజ్ఞానం యేషాం నాశితమాత్మనః ।**
**తేషామాదిత్యవత్ జ్ఞానం ప్రకాశయతి తత్పరమ్ ॥ 16 ॥**

జ్ఞానేన, తు, తత్, అజ్ఞానమ్, యేషామ్, నాశితమ్, ఆత్మనః,
తేషామ్, ఆదిత్యవత్, జ్ఞానమ్, ప్రకాశయతి, తత్పరమ్ ॥ 16 ॥

| | | | |
|---|---|---|---|
| తు | = అయితే | జ్ఞానమ్ | = ఆ జ్ఞానము |
| యేషామ్, | = ఎవరియొక్క | తత్పరమ్ | = సచ్చిదానంద ఘనపరమాత్మను |
| తత్, అజ్ఞానమ్ | = ఆ అజ్ఞానము | | |
| ఆత్మనః, జ్ఞానేన | = పరమాత్మ తత్త్వజ్ఞానముచేత | ఆదిత్యవత్ | = సూర్యునివలె (సూర్యప్రభవలె) |
| నాశితమ్ | = నశింపజేయబడునో | ప్రకాశయతి[1] | = ప్రకాశింప (దర్శింప)జేయును. |
| తేషామ్ | = వారికి | | |

కాని, వారి(ప్రాణుల) అజ్ఞానము పరమాత్మతత్త్వజ్ఞానప్రాప్తిద్వారా తొలగిపోవును. అప్పుడు ఆ జ్ఞానము వారికి సచ్చిదానందఘనపరమాత్మను సూర్యునివలె (సూర్యప్రభవలె) దర్శింపజేయును. (16)

**తద్బుద్ధయస్తదాత్మానః తన్నిష్ఠాస్తత్పరాయణాః ।**
**గచ్ఛంత్యపునరావృత్తిం జ్ఞాననిర్ధూతకల్మషాః ॥ 17 ॥**

తద్బుద్ధయః, తదాత్మానః, తన్నిష్ఠాః, తత్పరాయణాః,
గచ్ఛంతి, అపునరావృత్తిమ్, జ్ఞాననిర్ధూతకల్మషాః ॥ 17 ॥

| | | | |
|---|---|---|---|
| తదాత్మానః, తద్బుద్ధయః | = తద్రూపమును పొందిన, మనోబుద్ధులు గలవారును | తత్పరాయణాః | = తత్పరాయణులును అగు పురుషులు |
| తన్నిష్ఠాః | = ఆ సచ్చిదానందఘన పరమాత్మయందే నిరంతరము ఏకీభావముతో స్థితులైనవారును | జ్ఞాననిర్ధూత-కల్మషాః | = జ్ఞానసాధనతో పాపరహితులై |
| | | అపునరావృత్తిమ్ | = పునరావృత్తిరహితమైన పరమగతిని |
| | | గచ్ఛంతి | = పొందుదురు |

తద్రూపమును పొందిన మనోబుద్ధులుగలవారై, సచ్చిదానందఘనపరమాత్మ యందే నిరంతరము ఏకీభావములో స్థితులై, తత్పరాయణులైన పురుషులు జ్ఞానసాధనతో పాపరహితులై, పునరావృత్తిరహితమైన పరమగతిని పొందుదురు. (17)

1. పరమాత్మస్వరూపమును ప్రత్యక్షమొనర్చును

**విద్యావినయసంపన్నే బ్రాహ్మణే గవి హస్తిని ।**
**శుని చైవ శ్వపాకే చ పండితాః సమదర్శినః ॥ 18 ॥**

విద్యావినయసంపన్నే, బ్రాహ్మణే, గవి, హస్తిని,
శుని, చ, ఏవ, శ్వపాకే, చ, పండితాః, సమదర్శినః ॥ 18 ॥

| | | | |
|---|---|---|---|
| పండితాః | = జ్ఞానులు | హస్తిని | = ఏనుగునందును |
| విద్యావినయ-సంపన్నే | = విద్యతో, వినమ్రతతో ఒప్పుచున్న | శుని | = కుక్కయందును |
| | | శ్వపాకేచ | = చండాలునియందును |
| బ్రాహ్మణే, చ | = బ్రాహ్మణునియందును | సమదర్శినః ఏవ | = సమదృష్టినే కలిగియుందురు[1] |
| గవి | = గోవునందును | | |

జ్ఞానులు విద్యావినయ సంపన్నుడైన బ్రాహ్మణునియందును, గోవు, ఏనుగు, కుక్క మొదలగు వానియందును, చండాలునియందును సమదృష్టినే కలిగి యుందురు. (18)

**ఇహైవ తైర్జితః సర్గో యేషాం సామ్యే స్థితం మనః ।**
**నిర్దోషం హి సమం బ్రహ్మ తస్మాద్ బ్రహ్మణి తే స్థితాః ॥ 19 ॥**

ఇహ, ఏవ, తైః, జితః, సర్గః, యేషామ్, సామ్యే, స్థితమ్, మనః,
నిర్దోషమ్, హి, సమమ్, బ్రహ్మ, తస్మాత్, బ్రహ్మణి, తే, స్థితాః ॥ 19 ॥

| | | | |
|---|---|---|---|
| యేషాం, మనః | = ఎవరి మనస్సు | నిర్దోషమ్, సమమ్ | = దోషరహితుడు, సముడు |
| సామ్యే, స్థితమ్ | = సమభావమునందు స్థితమై యుండునో | తస్మాత్ | = అందువలన |
| తైః | = వారిచే | తే | = వారు (అట్టిజ్ఞానులు) |
| ఇహ, ఏవ | = ఈ జన్మయందే | బ్రహ్మణి, స్థితాః | = సచ్చిదానందఘన పరమాత్మయందు స్థితులు అనగా వారు త్రిగుణాతీతులు, జీవన్ముక్తులు |
| సర్గః | = జగత్తంతయు | | |
| జితః[2] | = జయింపబడినది యగును | | |
| హి | = ఏలనన | | |
| బ్రహ్మ | = సచ్చిదానంద ఘనపరమాత్మ | | |

*1. 6వ అధ్యాయము - 32వ శ్లోక - టిప్పణియందు దీని వివరణగలదు.*
*2. ప్రాపంచిక బంధములనుండి ముక్తులయ్యెదరు.*

సర్వత్ర సమభావస్థితమనస్కులు ఈ జన్మయందే సంపూర్ణజగత్తును జయించిన వారగుదురు. అనగా- ప్రాపంచిక విషయాతీతస్థితికి చేరుదురు. సచ్చిదానందఘనపరమాత్మ దోషరహితుడు, సముడు. సమభావస్థితమనస్కులైన జ్ఞానులు సచ్చిదానంద ఘనపరమాత్మయందుస్థితులు. కనుక, వారు త్రిగుణాతీతులు. జీవన్ముక్తులు. (19)

**న ప్రహృష్యేత్ ప్రియం ప్రాప్య నోద్విజేత్ ప్రాప్య చాప్రియమ్ ।**
**స్థిరబుద్ధిరసమ్మూఢో బ్రహ్మవిద్బ్రహ్మణి స్థితః ॥ 20 ॥**

న, ప్రహృష్యేత్, ప్రియమ్, ప్రాప్య, న, ఉద్విజేత్, ప్రాప్య, చ, అప్రియమ్,
స్థిరబుద్ధిః, అసమ్మూఢః, బ్రహ్మవిత్, బ్రహ్మణి, స్థితః ॥ 20 ॥

| | | | |
|---|---|---|---|
| ప్రియమ్, ప్రాప్య | = ప్రియమును పొంది | అసమ్మూఢః | = మోహవివశుడు కానివాడును అగు |
| న, ప్రహృష్యేత్ | = పొంగిపోనివాడును | | |
| చ | = అట్లే | బ్రహ్మవిత్ | = బ్రహ్మవేత్త |
| అప్రియమ్, ప్రాప్య | = అప్రియమును పొంది | | |
| న, ఉద్విజేత్ | = ఉద్వేగమునకులోను కానివాడును | బ్రహ్మణి | = సచ్చిదానంద ఘన పరబ్రహ్మమునందు |
| స్థిరబుద్ధిః | = నిశ్చలమైన బుద్ధి గలవాడును | స్థితః | = ఏకీభావస్థితుడై యుండును. |

ప్రియలాభములకు పొంగిపోనివాడును, అప్రియములు ఎదురైనప్పుడు క్రుంగి పోనివాడును, స్థిరమైన బుద్ధిగలవాడును, మోహవివశుడు కానివాడును అయిన బ్రహ్మవేత్త సచ్చిదానందఘనపరబ్రహ్మపరమాత్మయందు సదా ఏకీభావస్థితి యందుండును (20)

**బాహ్యస్పర్శేష్వసక్తాత్మా విందత్యాత్మని యత్సుఖమ్ ।**
**స బ్రహ్మయోగయుక్తాత్మా సుఖమక్షయమశ్నుతే ॥ 21 ॥**

బాహ్యస్పర్శేషు, అసక్తాత్మా, విందతి, ఆత్మని, యత్, సుఖమ్,
సః, బ్రహ్మయోగయుక్తాత్మా, సుఖమ్, అక్షయమ్, అశ్నుతే ॥ 21 ॥

| | | | |
|---|---|---|---|
| బాహ్యస్పర్శేషు | = ప్రాపంచిక విషయములయందు | ఆత్మని యత్, సుఖమ్ | = ఆత్మయందు(స్థితమైన) ధ్యాన జనితమైన ఏ సాత్త్వికానందము కలదో |
| అసక్తాత్మా | = అనాసక్తమైన అంతః కరణముగల సాధకుడు | (తత్) | = దానిని |

| | | | | | |
|---|---|---|---|---|---|
| విందతి | = | పొందును | | | అభిన్న భావస్థితుడై |
| సః | = | (పిదప) అతడు | అక్షయమ్, సుఖమ్ | = | అక్షయానందమును |
| బ్రహ్మయోగ-యుక్తాత్మా | = | సచ్చిదానందఘన పరబ్రహ్మ పరమాత్మ ధ్యానయోగమునందు | అశ్నుతే | = | పొందును (అనుభవించును). |

ప్రాపంచిక విషయములయందు అనాసక్తమైన అంతఃకరణముగల సాధకుడు ఆత్మస్థితధ్యానజనితమైన సాత్త్వికాత్మానందమును పొందును. పిదప, అతడు సచ్చిదానంద ఘనపరబ్రహ్మపరమాత్మధ్యానయోగమునందు అభిన్నభావస్థితుడై అక్షయానందమును అనుభవించును. (21)

**యే హి సంస్పర్శజా భోగా దుఃఖయోనయ ఏవ తే ।**
**ఆద్యంతవంతః కౌంతేయ న తేషు రమతే బుధః ॥ 22 ॥**

యే, హి, సంస్పర్శజాః, భోగాః, దుఃఖయోనయః, ఏవ, తే,
ఆద్యంతవంతః, కౌంతేయ, న, తేషు, రమతే, బుధః ॥ 22 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| కౌంతేయ! | = | ఓ అర్జునా! | దుఃఖయోనయః, ఏవ | = | దుఃఖహేతువులే |
| యే, సంస్పర్శజాః, భోగాః | = | విషయేంద్రియ సంయోగము వలన ఉత్పన్నములగు భోగములు ఏవి గలవో | ఆద్యంతవంతః | = | (అవి) ఆదియు, అంతము గలవి (అనిత్యములు) |
| తే | = | (భోగలాలసులకు సుఖములుగ భాసించు) ఆ భోగములు అన్నియును | బుధః | = | వివేకి |
| | | | తేషు | = | వాటియందు |
| హి | = | నిస్సందేహముగా | న, రమతే | = | రమింపడు |

విషయేంద్రియసంయోగమువలన ఉత్పన్నములగు భోగములన్నియును భోగలాలసులకు సుఖములుగా భాసించినను అవి నిస్సందేహముగా దుఃఖహేతువులే. ఆద్యంతములు గలవి. అనగా అనిత్యములు. కావున, ఓ అర్జునా! వివేకి వాటియందు ఆసక్తుడు కాడు.(22)

**శక్నోతీహైవ యః సోఢుం ప్రాక్శరీరవిమోక్షణాత్ ।**
**కామక్రోధోద్భవం వేగం స యుక్తః స సుఖీ నరః ॥ 23 ॥**

శక్నోతి, ఇహ, ఏవ, యః, సోఢుమ్, ప్రాక్, శరీరవిమోక్షణాత్,
కామక్రోధోద్భవమ్, వేగమ్, సః, యుక్తః, సః, సుఖీ, నరః ॥ 23 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| యః | = | ఏ సాధకుడు | సోఢుమ్ | = | సహించుటకు |
| ఇహ | = | ఈజన్మయందు | శక్నోతి | = | సమర్థుడగుచున్నాడో |
| శరీరవిమోక్షణాత్, ప్రాక్, ఏవ | = | శరీరమును విడువకముందే | సః, నరః | = | ఆ సాధకుడు |
| | | | యుక్తః | = | నిజమైన యోగి |
| కామక్రోధో-ద్భవమ్, వేగమ్ | = | కామక్రోధాదులవలన కలిగిన ఉద్వేగమును | సః | = | అతడే |
| | | | సుఖీ | = | నిజమైన సుఖి |

ఈ శరీరమును విడువకముందే అనగా జీవించియుండగానే కామక్రోధాదుల ఉద్వేగములను అదుపులోనుంచుకొనగల సాధకుడే నిజమైన సుఖి, యోగి (23)

**యోఽన్తఃసుఖోఽన్తరారామః తథాన్తర్జ్యోతిరేవ యః ।**
**స యోగీ బ్రహ్మనిర్వాణం బ్రహ్మభూతోఽధిగచ్ఛతి ॥ 24 ॥**

యః, అంతస్సుఖః, అంతరారామః, తథా, అంతర్జ్యోతిః, ఏవ, యః,
సః, యోగీ, బ్రహ్మనిర్వాణమ్, బ్రహ్మభూతః, అధిగచ్ఛతి ॥ 24 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| యః | = | ఏ పురుషుడు | అంతర్జ్యోతిః | = | ఆత్మజ్ఞానముకలవాడు అగునో |
| ఏవ | = | నిశ్చయముగా | | | |
| అంతఃసుఖః | = | సమష్టి అంతరాత్మయందు సుఖించువాడును | సః | = | ఆ (అట్టి) |
| | | | బ్రహ్మభూతః | = | సచ్చిదానందఘన పరబ్రహ్మ పరమాత్మయందు ఏకీభావస్థితుడైన |
| అంతరారామః | = | ఆత్మయందు రమించువాడును | యోగీ | = | సాంఖ్యయోగి |
| తథా | = | అట్లే | బ్రహ్మ-నిర్వాణమ్ | = | బ్రహ్మనిర్వాణ (పరమపద)మును |
| యః | = | ఎవడు | | | |
| | | | అధిగచ్ఛతి | = | పొందును |

(సమష్టి) అంతరాత్మయందే సుఖించువాడును, ఆత్మయందే రమించువాడును, ఆత్మజ్ఞానియైనవాడును అగు సాంఖ్యయోగి, సచ్చిదానందఘనపరబ్రహ్మ పరమాత్మయందు ఏకీభావస్థితుడై, బ్రహ్మనిర్వాణమును పొందును. (24)

**లభంతే బ్రహ్మనిర్వాణమ్ ఋషయః క్షీణకల్మషాః ।**
**ఛిన్నద్వైధా యతాత్మానః సర్వభూతహితే రతాః ॥ 25 ॥**

లభంతే, బ్రహ్మనిర్వాణమ్, ఋషయః, క్షీణకల్మషాః,
ఛిన్నద్వైధాః, యతాత్మానః, సర్వభూతహితే, రతాః ॥ 25 ॥

| | | | |
|---|---|---|---|
| క్షీణకల్మషాః | = పాపరహితులును | | మనస్సును పరమాత్మ యందు లగ్నము చేసినవారును అగు |
| ఛిన్నద్వైధాః | = జ్ఞాన ప్రభావమునసమస్త సంశయముల నివృత్తిని సాధించిన వారును | ఋషయః | = బ్రహ్మవేత్తలు |
| సర్వభూతహితే, రతాః | = సర్వప్రాణుల హితమును గోరువారును | బ్రహ్మ నిర్వాణమ్ | = బ్రహ్మనిర్వాణమును (శాంతబ్రహ్మను) |
| యతాత్మానః | = నిశ్చల స్థితితో | లభంతే | = పొందుదురు. |

పాపరహితులును, జ్ఞానప్రభావమున సమస్తసంశయములనివృత్తిని సాధించినవారును, సర్వప్రాణులహితమును గోరువారును, నిశ్చలస్థితితో మనస్సును పరమాత్మయందు లగ్నముచేసినవారును అగు బ్రహ్మవేత్తలు బ్రహ్మనిర్వాణమును పొందుదురు. (25)

**కామక్రోధవియుక్తానాం యతీనాం యతచేతసామ్ ।**
**అభితో బ్రహ్మనిర్వాణం వర్తతే విదితాత్మనామ్ ॥ 26 ॥**

కామక్రోధవియుక్తానామ్, యతీనామ్, యతచేతసామ్,
అభితః, బ్రహ్మనిర్వాణమ్, వర్తతే, విదితాత్మనామ్ ॥ 26 ॥

| | | | |
|---|---|---|---|
| కామక్రోధ-వియుక్తానామ్ | = కామక్రోధ రహితులును | యతీనామ్ | = జ్ఞానులకు |
| | | అభితః | = అంతట |
| యతచేతసామ్ | = చిత్తమును జయించినవారును | బ్రహ్మ-నిర్వాణమ్ | = శాంత పరబ్రహ్మ పరమాత్మయే |
| విదితాత్మనామ్ | = పరబ్రహ్మపరమాత్మ సాక్షాత్కారమును పొందినవారును అగు | వర్తతే | = పరిపూర్ణుడై యుండును (గోచరించును). |

కామక్రోధరహితులును, చిత్తవృత్తులనుజయించినవారును అయి, పరబ్రహ్మ పరమాత్మసాక్షాత్కారమునుపొందిన జ్ఞానులకు అంతటను శాంతపరబ్రహ్మపరమాత్మయే గోచరించును. (26)

**స్పర్శాన్కృత్వా బహిర్బాహ్యాన్ చక్షుశ్చైవాంతరే భ్రువోః ।**
**ప్రాణాపానౌ సమౌ కృత్వా నాసాభ్యంతరచారిణౌ ॥ 27 ॥**
**యతేంద్రియమనోబుద్ధిః మునిర్మోక్షపరాయణః ।**
**విగతేచ్ఛాభయక్రోధో యః సదా ముక్త ఏవ సః ॥ 28 ॥**

స్పర్శాన్, కృత్వా, బహిః, బాహ్యాన్, చక్షుః, చ, ఏవ, అంతరే, భ్రువోః,
ప్రాణాపానౌ, సమౌ, కృత్వా, నాసాభ్యంతరచారిణౌ ॥ 27 ॥
యతేంద్రియమనోబుద్ధిః, మునిః, మోక్షపరాయణః,
విగతేచ్ఛాభయక్రోధః, యః, సదా, ముక్తః, ఏవ, సః ॥ 28 ॥

| | | | |
|---|---|---|---|
| బాహ్యాన్, స్పర్శాన్ | = బాహ్యవిషయ భోగములను | యతేంద్రియ-మనోబుద్ధిః | = మనోబుద్ధీంద్రియములను జయించినట్టి |
| బహిః ఏవ, కృత్వా | = బయటికి పారద్రోలి | యః | = ఎవడైతే |
| చ | = మఱియు | మోక్షపరాయణః | = మోక్షపరాయణుడై |
| చక్షుః | = దృష్టిని | మునిః | = మననశీలుడై |
| భ్రువోః,అంతరే | = భ్రూమధ్యమున (నిలిపి) | విగతేచ్ఛా భయక్రోధః | = ఇచ్ఛాభయక్రోధరహితుడైనవాడును అగునో |
| నాసాభ్యంతర-చారిణౌ | = నాసికా రంధ్రముల యందు చరించుచున్న | సః | = అతడు |
| ప్రాణాపానౌ | = ప్రాణాపానవాయువులను | సదా | = సర్వదా |
| సమౌ, కృత్వా | = సమముగాచేసి | ముక్తః, ఏవ | = ముక్తుడే యగును |

బాహ్యవిషయభోగములను చింతనచేయక వాటిని పారద్రోలవలెను. దృష్టిని భ్రూమధ్యమునందు స్థిరముగా ఉంచవలెను. నాసికయందు ప్రసరించుచున్న ప్రాణాపానవాయువులను సమస్థితిలో నడుపవలెను. ఈ ప్రక్రియల ప్రభావమున మనస్సు, బుద్ధి, ఇంద్రియములు సాధకుని వశములోనికి వచ్చును. ఇట్టి సాధనవలన మోక్షపరాయణుడైన ముని ఇచ్ఛాభయక్రోధరహితుడై సదా ముక్తుడగును. (27-28)

**భోక్తారం యజ్ఞతపసాం సర్వలోకమహేశ్వరమ్ ।**
**సుహృదం సర్వభూతానాం జ్ఞాత్వా మాం శాంతిమృచ్ఛతి ॥ 29 ॥**

భోక్తారమ్, యజ్ఞతపసామ్, సర్వలోకమహేశ్వరమ్,
సుహృదమ్, సర్వభూతానామ్, జ్ఞాత్వా, మామ్, శాంతిమ్, ఋచ్ఛతి ॥ 29 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| మామ్ | = | నన్ను | సర్వభూతానామ్ | = | సకలప్రాణులకును |
| యజ్ఞతపసామ్ | = | యజ్ఞములకును, తపస్సులకును | సుహృదమ్ | = | ఆత్మీయునిగాను |
| భోక్తారమ్ | = | భోక్తనుగాను | జ్ఞాత్వా | = | తెలిసికొని (తత్త్వ జ్ఞానముతో గ్రహించి) |
| సర్వలోక-మహేశ్వరమ్ | = | సమస్త లోకములకును, లోకేశ్వరులకును అధిపతిగాను | శాంతిమ్ | = | (భక్తుడు) పరమశాంతిని |
| | | | ఋచ్ఛతి | = | పొందును. |

భగవంతుడు యజ్ఞములకును, తపస్సులకును భోక్త. సమస్తలోకములకును లోకేశ్వరులకును అధిపతి. సమస్తప్రాణులకును ఆత్మీయుడు. అనగా అవ్యాజదయాళువు. పరమప్రేమస్వరూపుడు. ఈ భగవత్తత్త్వమును ఎఱిగిన భక్తునకు పరమ శాంతి లభించును. (29)

ఓం తత్సదితి శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే కర్మసన్న్యాసయోగో నామ పంచమోఽధ్యాయః ॥ ౫ ॥

॥ ఓం శ్రీపరమాత్మనే నమః ॥

# అథ షష్ఠోఽధ్యాయః - ఆత్మసంయమయోగః

## (ఆఱవ అధ్యాయము-ఆత్మసంయమయోగము)

ముఖ్యాంశములు : [(1 నుండి 4వ శ్లోకమువఱకు) నిష్కామ కర్మయోగవిషయము-యోగారూఢుని లక్షణములు. (5 నుండి 10 వఱకు) ఆత్మోద్ధరణమునకై ప్రేరణ-భగవత్ప్రాప్తి నొందినవారి లక్షణములు. (11 నుండి 32 వఱకు) ధ్యాన యోగమును గూర్చి విపుల వివరణము (33 నుండి 36 వఱకు) మనోనిగ్రహవిషయము (37 నుండి 47 వఱకు) యోగభ్రష్టుని గతి-ధ్యానయోగియొక్క మహిమ.]

**శ్రీభగవాన్ ఉవాచ**

**అనాశ్రితః కర్మఫలం కార్యం కర్మ కరోతి యః ।**
**స సన్న్యాసీ చ యోగీ చ న నిరగ్నిర్నచాక్రియః ॥ 1 ॥**

అనాశ్రితః, కర్మఫలమ్, కార్యమ్, కర్మ, కరోతి, యః
సః, సన్న్యాసీ, చ, యోగీ, చ, న, నిరగ్నిః, న, చ, అక్రియః ॥ 1 ॥

| | | | |
|---|---|---|---|
| యః | = ఏ పురుషుడు | చ | = కాని |
| కర్మఫలమ్ | = కర్మఫలమును | నిరగ్నిః | = కేవలము అగ్నికార్యములను త్యజించినవాడు |
| అనాశ్రితః | = ఆశ్రయింపక (ఆశింపక)నివాడై | | |
| కార్యమ్, కర్మ | = కర్తవ్యకర్మను | న | = సన్న్యాసికాడు |
| కరోతి | = ఆచరించునో | | |
| సః | = అతడే | చ | = అట్లే |
| సన్న్యాసీ | = నిజమైన సన్న్యాసి | అక్రియః | = కేవలము క్రియలను త్యజించినవాడు |
| చ | = మఱియు | | |
| యోగీ | = నిజమైన యోగి | న | = (యోగియు)కాడు. |

శ్రీభగవానుడు పలికెను - కర్మఫలమును ఆశ్రయింపక కర్తవ్యకర్మలను ఆచరించువాడే నిజమైన సన్న్యాసి, నిజమైన యోగి . కాని, కేవలము అగ్ని కార్యములను త్యజించినంతమాత్రమున సన్న్యాసియుకాడు. అట్లే కేవలము క్రియలను త్యజించినంతమాత్రమున యోగియుకాడు. (1)

**యం సన్న్యాసమితి ప్రాహుః యోగం తం విద్ధి పాండవ ।**
**న హ్యసన్న్యస్తసంకల్పో యోగీ భవతి కశ్చన ॥ 2 ॥**

యమ్, సన్న్యాసమ్, ఇతి, ప్రాహుః, యోగమ్, తమ్, విద్ధి, పాండవ,
న, హి, అసన్న్యస్తసంకల్పః, యోగీ, భవతి, కశ్చన ॥ 2 ॥

| | | | |
|---|---|---|---|
| పాండవ! | = ఓ అర్జునా! | హి | = ఏలనన |
| యమ్ | = దేనిని | అసన్న్యస్త-సంకల్పః | = సంకల్పత్యాగము చేయనివాడు |
| సన్న్యాసమ్, ఇతి[1] | = సన్న్యాసము-అని | కశ్చన | = ఎవ్వడును |
| ప్రాహుః | = చెప్పుదురో | యోగీ, న, భవతి | = యోగి కాలేడు. |
| తమ్, యోగమ్,[1] విద్ధి | = దానిని యోగమని యెఱుంగుము | | |

ఓ అర్జునా! సన్న్యాసము అని పిలువబడునదియే యోగము అని తెలిసికొనుము. ఏలనన, సంకల్పత్యాగము చేయనివాడెవ్వడును యోగి కాలేడు. (2)

**ఆరురుక్షోర్మునేర్యోగం కర్మ కారణముచ్యతే ।**
**యోగారూఢస్య తస్యైవ శమః కారణముచ్యతే ॥ 3 ॥**

ఆరురుక్షోః, మునేః, యోగమ్, కర్మ, కారణమ్, ఉచ్యతే,
యోగారూఢస్య, తస్య, ఏవ, శమః, కారణమ్, ఉచ్యతే ॥ 3 ॥

| | | | |
|---|---|---|---|
| యోగమ్, ఆరురుక్షోః | = యోగారూఢస్థితిని పొందగోరు | యోగారూఢస్య తస్య | = యోగారూఢుడైన ఆ పురుషునకు |
| మునేః | = మననశీలుడైన పురుషునకు | శమః, ఏవ | = సర్వసంకల్పరాహిత్యమే |
| కర్మ | = నిష్కామ కర్మాచరణమే | కారణమ్ | = (మోక్షప్రాప్తికి) మూలము (సాధన)గా |
| కారణమ్ ఉచ్యతే | = కారణమని చెప్పబడుచున్నది | ఉచ్యతే | = చెప్పబడు చున్నది. |

యోగారూఢస్థితినిపొందగోరు మననశీలుడైన పురుషునకు నిష్కామకర్మాచరణము వలననే యోగప్రాప్తికలుగును. యోగారూఢుడైన పురుషునకు సర్వసంకల్పరాహిత్యమే మోక్షప్రాప్తికి మూలము. (3)

*1. గీత 3వ అధ్యాయము, 3వ శ్లోకవ్యాఖ్యానమునందు వీటి విపులార్థము వివరింపబడినది.*

**యదా హి నేంద్రియార్థేషు న కర్మస్వనుషజ్జతే ।**
**సర్వసంకల్పసన్న్యాసీ యోగారూఢస్తదోచ్యతే ॥ 4 ॥**

యదా, హి, న, ఇంద్రియార్థేషు, న, కర్మసు, అనుషజ్జతే,
సర్వసంకల్పసన్న్యాసీ, యోగారూఢః, తదా, ఉచ్యతే ॥ 4 ॥

| | | | |
|---|---|---|---|
| యదా | = ఎప్పుడయితే | తదా | = అప్పుడు |
| ఇంద్రియార్థేషు | = శబ్దాది విషయములయందు | సర్వసంకల్ప సన్న్యాసీ | = సమస్త సంకల్పములను త్యజించిన పురుషుడు |
| న, అనుషజ్జతే | = ఆసక్తుడుకాడో | | |
| కర్మసు, హి | = కర్మలయందును | యోగారూఢః, | = యోగారూఢుడు |
| న, (అనుషజ్జతే) | = ఆసక్తుడుకాడో | ఉచ్యతే | = అనబడును. |

ఇంద్రియభోగములయందును, కర్మలయందును ఆసక్తుడుగాక, సర్వసంకల్పములను త్యజించిన పురుషుడు యోగారూఢుడని చెప్పబడును. (4)

**ఉద్ధరేదాత్మనాత్మానం నాత్మానమవసాదయేత్ ।**
**ఆత్మైవ హ్యాత్మనో బంధుః ఆత్మైవ రిపురాత్మనః ॥ 5 ॥**

ఉద్ధరేత్, ఆత్మనా, ఆత్మానమ్, న, ఆత్మానమ్, అవసాదయేత్,
ఆత్మా, ఏవ, హి, ఆత్మనః, బంధుః, ఆత్మా, ఏవ, రిపుః, ఆత్మనః ॥ 5 ॥

| | | | |
|---|---|---|---|
| ఆత్మనా | = (ప్రతివ్యక్తియు) తనచేత | హి | = ఏలనన |
| ఆత్మానమ్ | = తనను | ఆత్మా, ఏవ | = (మనుష్యుడు) తానే |
| ఉద్ధరేత్ | = (సంసార సముద్రము నుండి) ఉద్ధరించు కొనవలెను | ఆత్మనః | = తనకు |
| | | బంధుః | = బంధువు |
| | | ఆత్మా, ఏవ | = తానే |
| ఆత్మానమ్ | = తనను | ఆత్మనః | = తనకు |
| న, అవసాదయేత్ | = (తాను) అధోగతిలో పడవేయరాదు | రిపుః | = శత్రువు. |

మనుజులు ఈ సంసారసాగరమునుండి తమను తామే ఉద్ధరించుకొనవలెను. తమకుతామే అధోగతిపాలు కారాదు. ఏలనన, లోకములో వాస్తవముగ తమకు తామే మిత్రులు, తమకు తామే శత్రువులు. (5)

**యదా హి నేంద్రియార్థేషు న కర్మస్వనుషజ్జతే ।**
**సర్వసంకల్పసన్న్యాసీ యోగారూఢస్తదోచ్యతే ॥ 4 ॥**

యదా, హి, న, ఇంద్రియార్థేషు, న, కర్మసు, అనుషజ్జతే,
సర్వసంకల్పసన్న్యాసీ, యోగారూఢః, తదా, ఉచ్యతే ॥ 4 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| యదా | = | ఎప్పుడయితే | తదా | = | అప్పుడు |
| ఇంద్రియార్థేషు | = | శబ్దాది విషయములయందు | సర్వసంకల్ప సన్న్యాసీ | = | సమస్త సంకల్పములను త్యజించిన పురుషుడు |
| న, అనుషజ్జతే | = | ఆసక్తుడుకాడో | | | |
| కర్మసు, హి | = | కర్మలయందును | యోగారూఢః, | = | యోగారూఢుడు |
| న, (అనుషజ్జతే) | = | ఆసక్తుడుకాడో | ఉచ్యతే | = | అనబడును. |

ఇంద్రియభోగములయందును, కర్మలయందును ఆసక్తుడుగాక, సర్వసంకల్పములను త్యజించిన పురుషుడు యోగారూఢుడని చెప్పబడును. (4)

**ఉద్ధరేదాత్మనాత్మానం నాత్మానమవసాదయేత్ ।**
**ఆత్మైవ హ్యాత్మనో బంధుః ఆత్మైవ రిపురాత్మనః ॥ 5 ॥**

ఉద్ధరేత్, ఆత్మనా, ఆత్మానమ్, న, ఆత్మానమ్, అవసాదయేత్,
ఆత్మా, ఏవ, హి, ఆత్మనః, బంధుః, ఆత్మా, ఏవ, రిపుః, ఆత్మనః ॥ 5 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| ఆత్మనా | = | (ప్రతివ్యక్తియు) తనచేత | హి | = | ఏలనన |
| | | | ఆత్మా, ఏవ | = | (మనుష్యుడు) తానే |
| ఆత్మానమ్ | = | తనను | | | |
| ఉద్ధరేత్ | = | (సంసార సముద్రము నుండి) ఉద్ధరించు కొనవలెను | ఆత్మనః | = | తనకు |
| | | | బంధుః | = | బంధువు |
| | | | ఆత్మా, ఏవ | = | తానే |
| ఆత్మానమ్ | = | తనను | ఆత్మనః | = | తనకు |
| న, అవసాదయేత్ | = | (తాను) అధోగతిలో పడవేయరాదు | రిపుః | = | శత్రువు. |

మనుజులు ఈ సంసారసాగరమునుండి తమను తామే ఉద్ధరించుకొనవలెను. తమకుతామే అధోగతిపాలు కారాదు. ఏలనన, లోకములో వాస్తవముగ తమకు తామే మిత్రులు, తమకు తామే శత్రువులు. (5)

**బంధురాత్మాత్మనస్తస్య యేనాత్మైవాత్మనా జితః ।**
**అనాత్మనస్తు శత్రుత్వే వర్తేతాత్మైవ శత్రువత్ ॥ 6 ॥**

బంధుః, ఆత్మా, ఆత్మనః, తస్య, యేన, ఆత్మా, ఏవ, ఆత్మనా, జితః,
అనాత్మనః, తు, శత్రుత్వే, వర్తేత, ఆత్మా, ఏవ, శత్రువత్ ॥ 6 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| యేన, ఆత్మనా, | = | ఏ జీవాత్మద్వారా | అనాత్మనః | = | మనస్సుతో, ఇంద్రియములతో గూడిన శరీరమును జయింపనివానికి |
| ఆత్మా | = | మనస్సుతో, ఇంద్రియములతో గూడిన శరీరము | | | |
| జితః | = | జయింపబడినది యగునో | ఆత్మా, ఏవ | = | తానే |
| | | | శత్రువత్ | = | శత్రువువలె |
| తస్య, ఆత్మనః | = | అట్టి జీవాత్మకు | శత్రుత్వే | = | శత్రుత్వమునందు (లక్ష్యసాధనకు అవరోధముగా) |
| ఆత్మా, ఏవ | = | తానే | | | |
| బంధుః | = | మిత్రుడు | | | |
| తు | = | మఱియు | వర్తేత | = | వర్తించును. |

మనస్సును, ఇంద్రియములను, శరీరమును జయించిన జీవుడు తనకుతానే మిత్రుడు. అట్లు జయింపనివాడు తనకుతానే శత్రువు. అనగా- జితేంద్రియునకు మనస్సు, ఇంద్రియములు, శరీరము భగవత్ప్రాప్తిసిద్ధికై మిత్రునివలె సహకరించును. అట్లుగాక, జితేంద్రియుడు కానివానికి మనస్సు, ఇంద్రియములు, శరీరము శత్రువులవలె ప్రవర్తించి లక్ష్యసాధనకు అవరోధకములుగా నిలుచును. (6)

**జితాత్మనః ప్రశాంతస్య పరమాత్మా సమాహితః ।**
**శీతోష్ణసుఖదుఃఖేషు తథా మానాపమానయోః ॥ 7 ॥**

జితాత్మనః, ప్రశాంతస్య, పరమాత్మా, సమాహితః,
శీతోష్ణసుఖదుఃఖేషు, తథా, మానాపమానయోః ॥ 7 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| శీతోష్ణసుఖ-దుఃఖేషు | = | శీతోష్ణసుఖదుఃఖముల యందును | ప్రశాంతస్య | = | అంతఃకరణవృత్తులు నిశ్చలముగా ఉన్నట్టి |
| తథా | = | అట్లే | జితాత్మనః | = | స్వాధీనమైన ఆత్మ గలవానియొక్క |
| మానాప-మానయోః | = | మానావమానముల యందును | | | (జ్ఞానమునందు) |

| | | | | | |
|---|---|---|---|---|---|
| పరమాత్మా | = | సచ్చిదానందఘన పరమాత్మ | సమాహిత: | = | చక్కగా స్థితుడై యుండును. |

శీతోష్ణములు, సుఖదు:ఖములు, మానావమానములు మున్నగు ద్వంద్వములయందు అంత:కరణవృత్తులు నిశ్చలముగా(చలింపక) ఉండి, స్వాధీనమైన ఆత్మగల పురుషునిజ్ఞానమునందు సచ్చిదానందఘనపరమాత్మ చక్కగా స్థితుడైయుండును. అనగా, పరమాత్మతప్ప అతని జ్ఞానమునందు అన్యమేదియును ఉండదు. (7)

**జ్ఞానవిజ్ఞానతృప్తాత్మా కూటస్థో విజితేంద్రియ: ।**
**యుక్త ఇత్యుచ్యతే యోగీ సమలోష్టాశ్మకాంచన: ॥ 8 ॥**

జ్ఞానవిజ్ఞానతృప్తాత్మా, కూటస్థ:, విజితేంద్రియ:,
యుక్త:, ఇతి, ఉచ్యతే, యోగీ, సమలోష్టాశ్మకాంచన: ॥ 8 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| జ్ఞానవిజ్ఞాన-తృప్తాత్మా | = | అంత:కరణము నందు జ్ఞాన విజ్ఞానములు నిండి యున్నట్టి | సమలోష్టాశ్మ-కాంచన: | = | మట్టిని, రాతిని, బంగారమును సమానముగా చూచువాడును, అగు |
| కూటస్థ: | = | వికారరహితుడును | యోగీ | = | యోగి |
| విజితేంద్రియ: | = | ఇంద్రియములను జయించినవాడును | యుక్త:, ఇతి | = | పరమాత్మ ప్రాప్తినందినవాడు అని |
| | | | ఉచ్యతే | = | చెప్పబడును. |

పరమాత్మ ప్రాప్తినందిన యోగియొక్క అంత:కరణమునందు జ్ఞానవిజ్ఞానములు నిండియుండును. అతడు వికారరహితుడు, ఇంద్రియాదులను పూర్తిగా వశపఱచుకొనినవాడు. ఆతడు మట్టిని, రాతిని, బంగారమును సమానముగా చూచును. (8)

**సుహృన్మిత్రార్యుదాసీనమధ్యస్థద్వేష్యబంధుషు ।**
**సాధుష్వపి చ పాపేషు సమబుద్ధిర్విశిష్యతే ॥ 9 ॥**

సుహృన్మిత్రార్యుదాసీనమధ్యస్థద్వేష్యబంధుషు,
సాధుషు, అపి, చ, పాపేషు, సమబుద్ధి:, విశిష్యతే ॥ 9 ॥

| | | | |
|---|---|---|---|
| సుహృన్మిత్రార్యుదాసీన-మధ్యస్థద్వేష్య-బంధుషు = | సుహృదులు,[1] మిత్రులు,శత్రువులు, ఉదాసీనులు[2] మధ్యస్థులు,[3] ద్వేషింపదగినవారు, బంధువులు మొదలగు వారియందును | సాధుషు, చ = | సత్పురుషుల యందును |
| | | పాపేషు, అపి = | పాపులయందును |
| | | సమబుద్ధిః = | సమానభావముగలవాడు |
| | | విశిష్యతే = | మిక్కిలిశ్రేష్ఠుడు |

సుహృదులయందును, మిత్రులయందును, శత్రువులయందును, ఉదాసీనులయందును, మధ్యస్థులయందును, ద్వేషింపదగినవారియందును, బంధువులయందును, ధర్మాత్ములయందును, పాపులయందును సమబుద్ధి కలిగియుండువాడు మిక్కిలి శ్రేష్ఠుడు. (9)

**యోగీ యుంజీత సతతమ్ ఆత్మానం రహసి స్థితః ।**
**ఏకాకీ యతచిత్తాత్మా నిరాశీరపరిగ్రహః ॥ 10 ॥**

యోగీ, యుంజీత, సతతమ్, ఆత్మానమ్, రహసి, స్థితః,
ఏకాకీ, యతచిత్తాత్మా, నిరాశీః, అపరిగ్రహః ॥ 10 ॥

| | | | |
|---|---|---|---|
| యతచిత్తాత్మా = | శరీరేంద్రియ మనస్సులను వశమునందుంచు కొనినవాడును | ఏకాకీ = | ఒంటరిగా |
| | | రహసి = | నిర్జన ప్రదేశమున |
| | | స్థితః = | ఉన్నవాడై |
| నిరాశీః = | ఆశారహితుడును | ఆత్మానమ్ = | ఆత్మను |
| అపరిగ్రహః = | భోగసామగ్రిని ప్రోగు చేయనివాడును అగు | సతతమ్ = | నిరంతరము |
| | | యుంజీత = | పరమాత్మయందు లగ్నము చేయవలెను. |
| యోగీ = | యోగి | | |

శరీరేంద్రియమనస్సులను స్వాధీనపఱచుకొనినవాడు, ఆశారహితుడు, భోగసామగ్రిని ప్రోగుచేయనివాడు అయిన యోగి ఒంటరిగా నిర్జన (ఏకాంత) ప్రదేశమున కూర్చొని, ఆత్మను నిరంతరము పరమాత్మయందు లగ్నము చేయవలెను. (10)

1. స్వార్థరహితులై అందఱికిని హితమును గూర్చువారు
2. పక్షపాతరహితులు
3. ఇరుపక్షములకును మేలుగోరువారు

**శుచౌ దేశే ప్రతిష్ఠాప్య స్థిరమాసనమాత్మనః ।**
**నాత్యుచ్ఛ్రితం నాతినీచం చైలాజినకుశోత్తరమ్ ॥ 11 ॥**

శుచౌ, దేశే, ప్రతిష్ఠాప్య, స్థిరమ్, ఆసనమ్, ఆత్మనః,
న, అత్యుచ్ఛ్రితమ్, న, అతినీచమ్, చైలాజినకుశోత్తరమ్ ॥ 11 ॥

| | | | |
|---|---|---|---|
| శుచౌ, దేశే | = పరిశుభ్రమైన ప్రదేశమున | న, అత్యుచ్ఛ్రితమ్ | = మిక్కిలి ఎత్తుగా లేనట్టిదియు |
| చైలాజిన-కుశోత్తరమ్ | = క్రమముగా దర్భాసనమును, జింకచర్మమును వస్త్రమును (ఒకదానిపై నొకటి) పఱచబడి నట్టిదియు | న, అతినీచమ్ | = మిక్కిలి నిమ్నముగా లేనట్టిదియు ఐన |
| | | ఆత్మనః, ఆసనమ్ | = తన ఆసనమును |
| | | స్థిరమ్ | = స్థిరముగా |
| | | ప్రతిష్ఠాప్య | = ఏర్పఱచుకొని |

పరిశుభ్రమైన ప్రదేశమున క్రమముగా దర్భాసనమును, జింకచర్మమును,[1] వస్త్రమును ఒకదానిపై ఒకటి పఱచి, అంత ఎక్కువగాకాని, తక్కువగాకాని కాకుండ సమానమైన ఎత్తులో స్థిరమైన స్థానమును ఏర్పఱచుకొనవలెను. (11)

**తత్రైకాగ్రం మనః కృత్వా యతచిత్తేంద్రియక్రియః ।**
**ఉపవిశ్యాసనే యుంజ్యాత్ యోగమాత్మవిశుద్ధయే ॥ 12 ॥**

తత్ర, ఏకాగ్రమ్, మనః, కృత్వా, యతచిత్తేంద్రియక్రియః,
ఉపవిశ్య, ఆసనే, యుంజ్యాత్, యోగమ్, ఆత్మవిశుద్ధయే ॥ 12 ॥

| | | | |
|---|---|---|---|
| తత్ర, ఆసనే | = ఆ ఆసనముపై | ఏకాగ్రమ్, కృత్వా | = ఏకాగ్రమొనర్చి |
| ఉపవిశ్య | = కూర్చుండి | ఆత్మవిశుద్ధయే | = అంతఃకరణశుద్ధి కొఱకు |
| యతచిత్తేంద్రియ-క్రియః | = చిత్తేంద్రియక్రియలను వశమునందుంచుకొని | యోగమ్ | = యోగమును |
| మనః | = మనస్సును | యుంజ్యాత్ | = అభ్యసింపవలెను. |

ఆ ఆసనముపైకూర్చొని, చిత్తేంద్రియవ్యాపారములను వశమునందుంచుకొని, ఏకాగ్రతగల మనస్సుతో అంతఃకరణశుద్ధికై ధ్యానయోగమును సాధనచేయవలెను. (12)

1. సహజముగా మరణించిన జింక యొక్క చర్మమునే వాడవలెను. జింక చర్మము లభింపనిచో కంబళిని ఉపయోగింపవచ్చును.

**సమం కాయశిరోగ్రీవం ధారయన్నచలం స్థిరః ।**
**సంప్రేక్ష్య నాసికాగ్రం స్వం దిశశ్చానవలోకయన్ ॥ 13 ॥**

సమమ్, కాయశిరోగ్రీవమ్, ధారయన్, అచలమ్, స్థిరః,
సంప్రేక్ష్య, నాసికాగ్రమ్, స్వమ్, దిశః, చ, అనవలోకయన్ ॥ 13 ॥

| | | | |
|---|---|---|---|
| కాయ-శిరోగ్రీవమ్ | = శరీరమును, శిరస్సును, మెడను | స్వమ్, నాసికాగ్రమ్ | = తన నాసికాగ్రముపై |
| సమమ్ | = నిటారుగా | | |
| అచలమ్ | = నిశ్చలముగా | సంప్రేక్ష్య | = దృష్టిని ఉంచి |
| ధారయన్ | = ఉంచుచు(ఉంచి) | దిశః, అనవ-లోకయన్ | = చూపులను దిక్కుల వైపునకు పోనీయక ఉంచవలెను. |
| చ | = మఱియు | | |
| స్థిరః | = స్థిరముగానున్నవాడై | | |

శరీరమును, మెడను, శిరస్సును, నిటారుగ నిశ్చలముగా స్థిరముగానుంచి[1] చూపులను ఏ దిక్కునకును పోనీయక తననాసికాగ్రభాగమునందే దృష్టిని నిలుపవలెను. (13)

**ప్రశాంతాత్మా విగతభీః బ్రహ్మచారివ్రతే స్థితః ।**
**మనః సంయమ్య మచ్చిత్తో యుక్త ఆసీత మత్పరః ॥ 14 ॥**

ప్రశాంతాత్మా, విగతభీః, బ్రహ్మచారివ్రతే, స్థితః,
మనః, సంయమ్య, మచ్చిత్తః, యుక్తః, ఆసీత, మత్పరః ॥ 14 ॥

| | | | |
|---|---|---|---|
| యుక్తః | = ధ్యానయోగి | మనః | = మనస్సును |
| బ్రహ్మచారివ్రతే | = బ్రహ్మచర్యవ్రతము నందు | సంయమ్య | = వశము నందుంచుకొని |
| స్థితః | = ఉన్నవాడై | మచ్చిత్తః | = నాయందే చిత్తము గలవాడును |
| విగతభీః | = భయములేనివాడై | | |
| ప్రశాంతాత్మా | = ప్రశాంతమైన అంతః కరణము గలవాడై | మత్పరః | = మత్పరాయణుడును ఐ |
| | | ఆసీత | = ఉండవలెను. |

ధ్యానయోగి ప్రశాంతాత్ముడై, భయరహితుడై బ్రహ్మచర్యవ్రతమును పాటించుచు, మనోనిగ్రహముతో మత్పరాయణుడై నిశ్చలుడై యుండవలెను. (14)

1. *స్థిరసుఖమాసనమ్ (యోగ 2/46) ఎక్కువ కాలము సుఖముగా స్థిరముగా కూర్చొని యుండుటను ఆసనము అనియందురు.*

**యుంజన్నేవం సదాత్మానం యోగీ నియతమానసః ।**
**శాంతిం నిర్వాణపరమాం మత్సంస్థామధిగచ్ఛతి ॥ 15 ॥**

యుంజన్, ఏవమ్, సదా, ఆత్మానమ్, యోగీ, నియతమానసః,
శాంతిమ్, నిర్వాణపరమామ్, మత్‌సంస్థామ్, అధిగచ్ఛతి ॥ 15 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| నియతమానసః యోగీ | = | మనోనిగ్రహముగల వాడగు యోగి | మత్సంస్థామ్ | = | నాయందు స్థితమై యున్న |
| ఏవమ్ | = | ఈ ప్రకారముగా | నిర్వాణ పరమామ్, శాంతిమ్ | = | పరమానందమునకు పరాకాష్ఠ రూపమైన శాంతిని |
| ఆత్మానమ్ | = | ఆత్మను | | | |
| సదా | = | నిరంతరము | | | |
| యుంజన్ | = | (పరమేశ్వరుడనైన నాస్వరూపమునందే) లగ్నమొనర్చుచు | అధిగచ్ఛతి | = | పొందును. |

మనోనిగ్రహశాలియైన యోగి నిరంతరము పరమేశ్వరుడనైన నా స్వరూపమునందే ఆత్మను ఈ విధముగా లగ్నమొనర్చి, నాయందున్న పరమానందమునకు పరాకాష్ఠరూపమైన శాంతిని పొందును. (15)

**నాత్యశ్నతస్తు యోగోఽస్తి న చైకాంతమనశ్నతః ।**
**న చాతిస్వప్నశీలస్య జాగ్రతో నైవ చార్జున ॥ 16 ॥**

న, అతి, అశ్నతః, తు, యోగః, అస్తి, న, చ, ఏకాంతమ్, అనశ్నతః,
న, చ, అతిస్వప్నశీలస్య, జాగ్రతః, న, ఏవ, చ, అర్జున ॥ 16 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| అర్జున! | = | ఓ అర్జునా! | న | = | కలుగనేరదు |
| యోగః | = | ధ్యానయోగము | అతి, స్వప్న శీలస్య, చ | = | మిక్కిలి నిద్రించు వానికిని |
| అతి, అశ్నతః, తు | = | అతిగా భుజించు వానికిని | జాగ్రతః, చ | = | పూర్తిగా మేల్కొని యుండువానికిని |
| న, అస్తి | = | కలుగనేరదు | | | |
| ఏకాంతమ్, అనశ్నతః, చ | = | ఏ మాత్రము భుజింపని వానికిని | న, ఏవ | = | కలుగనే కలుగదు. |

అర్జునా! అతిగా భుజించువానికిని, ఏ మాత్రము భుజింపనివానికిని, అతిగా నిద్రించువానికిని, ఎల్లప్పుడు (ఏమాత్రము నిద్రింపక) మేల్కొనియుండువానికిని ఈ యోగసిద్ధికలుగదు. (16)

**యుక్తాహారవిహారస్య యుక్తచేష్టస్య కర్మసు ।**
**యుక్తస్వప్నావబోధస్య యోగో భవతి దుఃఖహా ॥ 17 ॥**

యుక్తాహారవిహారస్య, యుక్తచేష్టస్య, కర్మసు,
యుక్తస్వప్నావబోధస్య, యోగః, భవతి, దుఃఖహా ॥ 17 ॥

| | | |
|---|---|---|
| యుక్తాహార-విహారస్య | = | యుక్తమైన (తగిన) ఆహారవిహారములు గలవాడును |
| కర్మసు | = | కర్మాచరణముల యందు |
| యుక్తచేష్టస్య | = | యోగ్యముగ ప్రవర్తించువాడును |
| యుక్తస్వప్నావ-బోధస్య | = | నిద్రయందును, మేల్కొనియుండుట యందును యథాయోగ్యముగ ఉండువాడును-అగు మనుష్యునకు |
| దుఃఖహా | = | దుఃఖనాశకమగు |
| యోగః | = | ధ్యానయోగము |
| భవతి | = | అగును (సిద్ధించును) |

ఆహారవిహారాదులయందును, కర్మాచరణములయందును, జాగ్రత్స్వప్నాదుల యందును యథాయోగ్యముగ ప్రవర్తించు వానికి దుఃఖనాశకమగు ధ్యానయోగము సిద్ధించును. (17)

**యదా వినియతం చిత్తమాత్మన్యేవావతిష్ఠతే ।**
**నిఃస్పృహః సర్వకామేభ్యో యుక్త ఇత్యుచ్యతే తదా ॥ 18 ॥**

యదా, వినియతమ్, చిత్తమ్, ఆత్మని, ఏవ, అవతిష్ఠతే,
నిఃస్పృహః, సర్వకామేభ్యః, యుక్తః, ఇతి, ఉచ్యతే, తదా ॥ 18 ॥

| | | |
|---|---|---|
| వినియతమ్ | = | బాగుగా నిగ్రహింపబడిన |
| చిత్తమ్ | = | చిత్తము |
| యదా | = | ఎప్పుడు |
| ఆత్మని, ఏవ | = | పరమాత్మయందే |
| అవతిష్ఠతే | = | స్థిరముగనుండునో |
| తదా | = | అప్పుడు |
| సర్వకామేభ్యః | = | సమస్త భోగములనుండి |
| నిఃస్పృహః | = | స్పృహా (వాంఛా) రహితుడైన |
| (పురుషః) | = | పురుషుడు |
| యుక్తః, ఇతి | = | యోగయుక్తుడు అని |
| ఉచ్యతే | = | చెప్పబడును. |

చిత్తమును పూర్తిగా వశమునందుంచుకొని, దానిని పరమాత్మయందే స్థిరముగా నిల్పినప్పుడు పురుషుడు సర్వభోగములయందును స్పృహారహితుడగును. అప్పుడతడు యోగయుక్తుడనబడును. (18)

**యథా దీపో నివాతస్థో నేంగతే సోపమా స్మృతా ।**
**యోగినో యతచిత్తస్య యుంజతో యోగమాత్మనః ॥ 19 ॥**

యథా, దీపః, నివాతస్థః, న, ఇంగతే, సా, ఉపమా, స్మృతా,
యోగినః, యతచిత్తస్య, యుంజతః, యోగమ్, ఆత్మనః ॥ 19 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| నివాతస్థః | = | వాయుప్రసారములేని చోట ఉన్న | ఆత్మనః | = | పరమేశ్వరునియొక్క |
| | | | యోగమ్ | = | ధ్యానయోగమును |
| దీపః | = | దీపము | యుంజతః | = | అనుష్ఠించుచున్న |
| యథా | = | ఎట్లు | యోగినః | = | యోగియొక్క |
| న, ఇంగతే | = | చలింపక యుండునో | యతచిత్తస్య | = | నిగ్రహింపబడిన చిత్తమునకు |
| సా | = | అట్టి | | | |
| ఉపమా | = | పోలిక (దృష్టాంతము) | స్మృతా | = | భావింపబడినది. |

వాయుప్రసారములేనిచోట నిశ్చలముగానుండు దీపమువలె యోగికి వశమైయున్న చిత్తము పరమాత్మధ్యానమున నిమగ్నమైయున్నప్పుడు నిర్వికారముగా నిశ్చలముగా నుండును. (19)

**యత్రోపరమతే చిత్తం నిరుద్ధం యోగసేవయా ।**
**యత్ర చైవాత్మనాత్మానం పశ్యన్నాత్మని తుష్యతి ॥ 20 ॥**

యత్ర, ఉపరమతే, చిత్తమ్, నిరుద్ధమ్, యోగసేవయా,
యత్ర, చ, ఏవ, ఆత్మనా, ఆత్మానమ్, పశ్యన్, ఆత్మని, తుష్యతి ॥ 20 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| యోగసేవయా | = | ధ్యానయోగసాధనచే | ఆత్మనా | = | సూక్ష్మబుద్ధి ద్వారా |
| నిరుద్ధమ్ | = | నిగ్రహింపబడిన | | | |
| చిత్తమ్ | = | చిత్తము | ఆత్మానమ్ | = | పరమాత్మను |
| యత్ర | = | ఏ స్థితియందు | పశ్యన్ | = | (యోగి) చూచుచు (సాక్షాత్కరింప జేసికొనుచు) |
| ఉపరమతే | = | ఉపరతిని పొందునో | | | |
| చ | = | మఱియు | | | |
| యత్ర | = | ఏ స్థితియందు (పరమాత్మను ధ్యానించుట వలన పవిత్రమైన) | ఆత్మని, ఏవ | = | ఆ సచ్చిదానంద ఘనపరమాత్మయందే |
| | | | తుష్యతి | = | సంతుష్టుడగునో. |

ధ్యానయోగసాధనచే నిగ్రహింపబడిన చిత్తము ఉపరతిని పొంది, పరమాత్మను ధ్యానించుట ద్వారా పవిత్రమైన సూక్ష్మబుద్ధితో, ఆ భగవానుని సాక్షాత్కరింపజేసికొని, యోగి ఆ సచ్చిదానందఘనపరమాత్మయందే సంతుష్టుడగుచున్నాడు. (20)

**సుఖమాత్యంతికం యత్తత్ బుద్ధిగ్రాహ్యమతీంద్రియమ్ ।**
**వేత్తి యత్ర న చైవాయం స్థితశ్చలతి తత్త్వతః ॥ 21 ॥**

సుఖమ్, ఆత్యంతికమ్, యత్, తత్, బుద్ధిగ్రాహ్యమ్, అతీంద్రియమ్,
వేత్తి, యత్ర, న, చ, ఏవ, అయమ్, స్థితః, చలతి, తత్త్వతః ॥ 21 ॥

| | | | |
|---|---|---|---|
| అతీంద్రియమ్ | = ఇంద్రియగోచరము కానిదియు | యత్ర | = ఏ స్థితియందు |
| బుద్ధిగ్రాహ్యమ్ | = పవిత్రమైన సూక్ష్మ బుద్ధి ద్వారా మాత్రమే గ్రహింపదగినదియు | వేత్తి | = అనుభవించునో |
| ఆత్యంతికమ్ | = నిరవధికమైన | చ | = మఱియు |
| యత్, సుఖమ్ | = ఏ బ్రహ్మానందము కలదో | (యత్ర) స్థితః | = దేనియందు స్థితుడైన |
| తత్ | = దానిని (ఆ బ్రహ్మానందమును) | అయమ్ | = ఈయోగి |
| | | తత్త్వతః | = పరమాత్మ స్వరూపము నుండి |
| | | న, ఏవ, చలతి | = ఎన్నడునూ విచలితుడుకాడో |

బ్రహ్మానందానుభవము ఇంద్రియాతీతమైనది. పవిత్రమైన సూక్ష్మబుద్ధిద్వారా మాత్రమే గ్రాహ్యమైనది. ఆ బ్రహ్మానందమును అనుభవించుచు దానియందే స్థితుడైయున్న యోగి పరమాత్మస్వరూపమునుండి ఏమాత్రమూ విచలితుడు కానేకాడు. (21)

**యం లబ్ధ్వా చాపరం లాభం మన్యతే నాధికం తతః ।**
**యస్మిన్ స్థితో న దుఃఖేన గురుణాపి విచాల్యతే ॥ 22 ॥**

యమ్, లబ్ధ్వా, చ, అపరమ్, లాభమ్, మన్యతే, న, అధికమ్,తతః,
యస్మిన్, స్థితః, న, దుఃఖేన, గురుణా, అపి, విచాల్యతే ॥ 22 ॥

| | | | |
|---|---|---|---|
| యమ్, లాభమ్ | = ఏ ప్రయోజనమును | యస్మిన్ | = పరమాత్మప్రాప్తి రూపమైన ఏ అవస్థయందు |
| లబ్ధ్వా | = పొంది | స్థితః | = స్థితుడైయుండు యోగి |
| తతః, అధికమ్ | = దానికంటె అధికముగా | గురుణా, దుఃఖేన, అపి | = తీవ్రమైన దుఃఖము వలనకూడ |
| అపరమ్ | = మఱియొకదానిని | న, విచాల్యతే | = చలింపబడడో. |
| న, మన్యతే | = విశ్వసింపడో | | |
| చ | = మఱియు | | |

పరమాత్మప్రాప్తిరూపలాభమును పొందినవాడు(అనగా భగవత్సాక్షాత్కారమును పొందినవాడు) మఱేయితర లాభమునుగూడ దానికంటె అధికమైన దానినిగా తలంపడు. బ్రహ్మానందానుభవస్థితిలోనున్న యోగిని ఎట్టి బలవద్దుఃఖములును చలింపజేయజాలవు. (22)

**తం విద్యాద్దుఃఖసంయోగవియోగం యోగసంజ్ఞితమ్ ।**
**స నిశ్చయేన యోక్తవ్యో యోగోఽనిర్విణ్ణచేతసా ॥ 23 ॥**

తమ్, విద్యాత్, దుఃఖసంయోగవియోగమ్, యోగసంజ్ఞితమ్,
సః, నిశ్చయేన, యోక్తవ్యః, యోగః, అనిర్విణ్ణచేతసా ॥ 23 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| దుఃఖసంయోగ-వియోగమ్ | = | దుఃఖరూప సంసార బంధములనుండి విముక్తిని కలిగించు | సః, యోగః | = | ఆ యోగము |
| | | | అనిర్విణ్ణచేతసా | = | విసుగులేని చిత్తముతో (ధైర్యోత్సాహములతో) |
| తమ్ | = | అట్టి స్థితిని | నిశ్చయేన | = | నిశ్చయముగా |
| యోగసంజ్ఞితమ్ | = | యోగమను పేరుతో | యోక్తవ్యః | = | సాధన చేయదగినది. |
| విద్యాత్ | = | ఎఱుంగవలెను | | | |

దుఃఖరూపసంసారబంధములనుండి విముక్తిని కలిగించు ఈ స్థితిని (భగవత్సాక్షాత్కారరూపస్థితిని) యోగము అని తెలియవలెను. అట్టి యోగమును దృఢమైన, ఉత్సాహపూరితమైన అనిర్విణ్ణ (విసుగులేని) చిత్తముతో నిశ్చయముగా సాధన చేయవలెను. (23)

**సంకల్పప్రభవాన్ కామాన్ త్యక్త్వా సర్వానశేషతః ।**
**మనసైవేంద్రియగ్రామం వినియమ్య సమంతతః ॥ 24 ॥**

సంకల్పప్రభవాన్, కామాన్, త్యక్త్వా, సర్వాన్, అశేషతః,
మనసా, ఏవ, ఇంద్రియగ్రామమ్, వినియమ్య, సమంతతః ॥ 24 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| సంకల్ప ప్రభవాన్ | = | సంకల్పములనుండి ఉత్పన్నములగు | ఇంద్రియ-గ్రామమ్ | = | ఇంద్రియ సముదాయమును |
| సర్వాన్, కామాన్ | = | కోరికలనన్నింటిని | సమంతతః, ఏవ | = | అన్నివైపుల నుండియు |
| అశేషతః | = | నిశ్శేషముగా | | | |
| త్యక్త్వా | = | త్యజించి | వినియమ్య | = | చక్కగా (పూర్తిగా) నిగ్రహించి |
| మనసా | = | మనస్సుద్వారా | | | |

సంకల్పములవలనకలిగిన కోరికలనన్నింటిని నిశ్శేషముగా త్యజించి, ఇంద్రియ సముదాయములను అన్నివిధములుగ మనస్సుతో పూర్తిగా నిగ్రహింపవలెను. (24)

**శనైః శనైరుపరమేత్ బుద్ధ్యా ధృతిగృహీతయా ।**
**ఆత్మసంస్థం మనః కృత్వా న కించిదపి చింతయేత్ ॥ 25 ॥**

శనైః, శనైః, ఉపరమేత్, బుద్ధ్యా, ధృతిగృహీతయా,
ఆత్మసంస్థమ్, మనః, కృత్వా, న, కించిత్, అపి, చింతయేత్ ॥ 25 ॥

| | | |
|---|---|---|
| శనైః, శనైః = క్రమక్రమముగా (అభ్యసించుచు) | | ఆత్మసంస్థమ్, కృత్వా = పరమాత్మయందు స్థిరమొనర్చి |
| ఉపరమేత్ = ఉపరతిని పొందవలెను | | |
| ధృతిగృహీతయా = ధైర్యయుక్తమైన | | కించిత్, అపి = పరమాత్మను తప్ప మఱిదేనిని కూడ |
| బుద్ధ్యా = బుద్ధిద్వారా | | |
| మనః = మనస్సును | | న, చింతయేత్ = స్మరింపరాదు. |

క్రమక్రమముగా సాధనచేయుచు ఉపరతిని పొందవలెను. ధైర్యముతో బుద్ధిబలముతో మనస్సును పరమాత్మయందు స్థిరమొనర్చి, పరమాత్మనుతప్ప మఱి ఏ ఇతర విషయమును ఏ మాత్రమూ చింతనచేయరాదు. (25)

**యతో యతో నిశ్చరతి మనశ్చంచలమస్థిరమ్ ।**
**తతస్తతో నియమ్యైతత్ ఆత్మన్యేవ వశం నయేత్ ॥ 26 ॥**

యతః, యతః, నిశ్చరతి, మనః, చంచలమ్, అస్థిరమ్,
తతః, తతః, నియమ్య, ఏతత్, ఆత్మని, ఏవ, వశమ్, నయేత్ ॥ 26 ॥

| | |
|---|---|
| అస్థిరమ్ = స్థిరముగా నిలువనట్టి | తతః, తతః = ఆయా విషయముల నుండి (దానిని) |
| చంచలమ్ = చలించునట్టి | |
| ఏతత్, మనః = ఈ మనస్సు | నియమ్య = నియమించి (మఱల్చి) |
| యతః, యతః = ఏయే శబ్దాది విషయముల కారణముగా | ఆత్మని, ఏవ = పరమాత్మయందే |
| నిశ్చరతి = (విశృంఖలముగా) సంచరించునో | వశమ్, నయేత్ = (పదేపదే) స్థిరపఱచ వలెను. |

సహజముగా నిలుకడలేని చంచలమైన మనస్సు ప్రాపంచిక విషయములయందు విశృంఖలముగా పరిభ్రమించుచుండును. అట్టి మనస్సును ఆయా విషయములనుండి పదేపదే మఱల్చి, దానిని పరమాత్మయందే స్థిరముగా నిల్పవలెను. (26)

**ప్రశాంతమనసం హ్యేనం యోగినం సుఖముత్తమమ్ ।**
**ఉపైతి శాంతరజసం బ్రహ్మభూతమకల్మషమ్ ॥ 27 ॥**

ప్రశాంతమనసమ్, హి, ఏనమ్, యోగినమ్, సుఖమ్, ఉత్తమమ్,
ఉపైతి, శాంతరజసమ్, బ్రహ్మభూతమ్, అకల్మషమ్ ॥ 27 ॥

హి = ఏలనన
ప్రశాంతమనసమ్ = ప్రశాంతమైన మనస్సు కలవాడును
అకల్మషమ్ = పాపరహితుడును
శాంతరజసమ్ = ప్రాపంచిక విషయముల యందు ఆసక్తి తొలిగిన వాడును
బ్రహ్మభూతమ్ = సచ్చిదానందఘన పరమాత్మయందు ఏకీభావము పొందిన వాడును అగు
ఏనమ్, యోగినమ్ = ఈ, యోగి
ఉత్తమమ్ = సర్వశ్రేష్ఠమైన
సుఖమ్ = బ్రహ్మానందము.
ఉపైతి = పొందును

ప్రశాంతమైనమనస్సు కలవాడును, పాపరహితుడును, రజోగుణము శాంతమైనవాడును, అనగా ప్రాపంచిక కార్యములయందు ఆసక్తి తొలగినవాడును, సచ్చిదానందఘనపరమాత్మయందు ఏకీభావమును పొందినవాడును అగు యోగి బ్రహ్మానందమును పొందును. (27)

**యుంజన్నేవం సదాత్మానం యోగీ విగతకల్మషః ।**
**సుఖేన బ్రహ్మసంస్పర్శమ్ అత్యంతం సుఖమశ్నుతే ॥ 28 ॥**

యుంజన్, ఏవమ్, సదా, ఆత్మానమ్, యోగీ, విగతకల్మషః,
సుఖేన, బ్రహ్మసంస్పర్శమ్, అత్యంతమ్, సుఖమ్, అశ్నుతే ॥ 28 ॥

విగతకల్మషః = పాపరహితుడగు
యోగీ = (ఆ) యోగి
ఏవమ్ = ఇట్లు
సదా = సంతతము
ఆత్మానమ్ = ఆత్మను
యుంజన్ = (పరమాత్మయందే) లగ్నమొనర్చుచు
సుఖేన = సుఖముగా (హాయిగా)
బ్రహ్మ-సంస్పర్శమ్ = పరబ్రహ్మ పరమాత్మ ప్రాప్తి రూపమైనదియు
అత్యంతమ్ = అనంతమైనది యునగు
సుఖమ్ = ఆనందమును
అశ్నుతే = అనుభవించును.

పాపరహితుడైన ఆ యోగి పూర్వోక్తరీతిగా నిరంతరము ఆత్మను పరమాత్మయందే లగ్నమొనర్చుచు, పరబ్రహ్మపరమాత్మప్రాప్తిరూపమైన అపరిమితానందమును హాయిగా అనుభవించును. (28)

**సర్వభూతస్థమాత్మానం సర్వభూతాని చాత్మని ।**
**ఈక్షతే యోగయుక్తాత్మా సర్వత్ర సమదర్శనః ॥ 29 ॥**

సర్వభూతస్థమ్, ఆత్మానమ్, సర్వభూతాని, చ, ఆత్మని,
ఈక్షతే, యోగయుక్తాత్మా, సర్వత్ర, సమదర్శనః ॥ 29 ॥

| | | | |
|---|---|---|---|
| యోగ-యుక్తాత్మా | = సర్వవ్యాప్తమైన అనంత చైతన్యమునందు ఏకీభావ స్థితి రూపయోగ యుక్తమైన ఆత్మగలవాడును | ఆత్మానమ్ | = తన ఆత్మను |
| | | సర్వభూతస్థమ్ | = సర్వప్రాణులయందును స్థితమైయున్నట్లుగను |
| | | చ | = మఱియు |
| | | సర్వభూతాని | = ప్రాణులను అన్నింటిని |
| సర్వత్ర | = అంతటను (అన్నింటిని) | ఆత్మని, ఈక్షతే | = తన ఆత్మయందు (కల్పితములుగను) చూచును |
| సమదర్శనః | = సమభావముతో చూచువాడును అగు యోగి | | |

సర్వవ్యాప్తమైన అనంతచైతన్యమునందు ఏకీభావస్థితిరూపయోగయుక్తమైన ఆత్మగలవాడును, అంతటను అన్నింటిని సమభావముతో చూచువాడును అగు యోగి తనయాత్మను సర్వప్రాణులయందు స్థితమైయున్నట్లుగను, ప్రాణులన్నింటిని తన ఆత్మయందు కల్పితములుగను భావించును (చూచును). (29)

**యో మాం పశ్యతి సర్వత్ర సర్వం చ మయి పశ్యతి ।**
**తస్యాహం న ప్రణశ్యామి స చ మే న ప్రణశ్యతి ॥ 30 ॥**

యః, మామ్, పశ్యతి, సర్వత్ర, సర్వమ్, చ, మయి, పశ్యతి,
తస్య, అహమ్, న, ప్రణశ్యామి, సః, చ, మే, న, ప్రణశ్యతి ॥ 30 ॥

| | | | |
|---|---|---|---|
| యః | = ఏ పురుషుడైతే | పశ్యతి | = చూచునో |
| సర్వత్ర | = సకలప్రాణుల యందును | చ, సర్వమ్ | = అట్లే సమస్తప్రాణులను |
| మామ్ | = ఆత్మ రూపమున వ్యాపించియున్న నన్ను (వాసుదేవుని) | మయి | = నాయందు (అంతర్గతములైయున్నట్లు) |
| | | పశ్యతి | = చూచునో |

| | | | | | |
|---|---|---|---|---|---|
| తస్య | = | ఆ పురుషునకు | సః, చ | = | అతడును |
| అహమ్ | = | నేను | మే | = | నాకు |
| న, ప్రణశ్యామి | = | అదృశ్యుడను కాను | న, ప్రణశ్యతి | = | అదృశ్యుడుకాడు. |

సకల ప్రాణులయందును ఆత్మరూపముననున్న నన్ను (వాసుదేవుని) చూచు పురుషునకు, అట్లే ప్రాణులన్నింటిని నాయందు అంతర్గతములుగానున్నట్లు చూచువానికి నేను అదృశ్యుడను కాను. అతడును నాకు అదృశ్యుడు కాడు. (30)

**సర్వభూతస్థితం యో మాం భజత్యేకత్వమాస్థితః ।**
**సర్వథా వర్తమానోఽపి స యోగీ మయి వర్తతే ॥ 31 ॥**

సర్వభూతస్థితమ్, యః, మామ్, భజతి, ఏకత్వమ్, ఆస్థితః,
సర్వథా, వర్తమానః, అపి, సః, యోగీ, మయి, వర్తతే ॥ 31 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| యః | = | ఏ పురుషుడు (యోగి) | భజతి | = | భజించునో |
| ఏకత్వమ్, ఆస్థితః | = | భగవంతునియందు ఏకీభావస్థితుడై | సః, యోగీ | = | అట్టి యోగి |
| సర్వభూత-స్థితమ్ | = | సమస్తభూతముల యందును ఆత్మరూపమున స్థితుడనైయున్న | సర్వథా, వర్తమానః, అపి | = | సర్వవ్యవహారముల యందు ప్రవర్తించు చున్నను |
| మామ్ | = | సచ్చిదానంద ఘన వాసుదేవుడనైన నన్ను | మయి | = | (వాసుదేవుడనైన) నాయందే |
| | | | వర్తతే | = | ప్రవర్తించును. |

భగవంతునియందు ఏకీభావస్థితుడైన పురుషుడు సర్వభూతములయందును ఆత్మరూపముననున్న సచ్చిదానందఘనవాసుదేవుడనైయున్న నన్ను భజించును. అట్టి యోగి సర్వథా సర్వవ్యవహారములయందు ప్రవర్తించుచున్నను నాయందే ప్రవర్తించుచుండును. (31)

**ఆత్మౌపమ్యేన సర్వత్ర సమం పశ్యతి యోఽర్జున ।**
**సుఖం వా యది వా దుఃఖం స యోగీ పరమో మతః ॥ 32 ॥**

ఆత్మౌపమ్యేన, సర్వత్ర, సమమ్, పశ్యతి, యః అర్జున,
సుఖమ్, వా, యది, వా, దుఃఖమ్, సః, యోగీ, పరమః, మతః ॥ 32 ॥

| | | |
|---|---|---|
| అర్జున! | = | ఓ అర్జునా! |
| యః | = | ఏ యోగి |
| సర్వత్ర | = | అంతట (సమస్త ప్రాణులను) |
| ఆత్మౌపమ్యేన[1] | = | తనవలె (తనతో) |
| సమమ్ | = | సమానముగా |
| పశ్యతి | = | చూచునో |
| సుఖమ్, వా, యది, వా, దుఃఖమ్ | = | సుఖమునుగాని, దుఃఖమునుగాని (సమానముగా భావించునో) |
| సః, యోగీ | = | అట్టి యోగి |
| పరమః, మతః | = | పరమశ్రేష్ఠుడు అని భావింపబడును. |

ఓ అర్జునా! సర్వప్రాణులను తనవలె (తనతో) సమానముగా చూచువాడును, సుఖమునుగాని, దుఃఖమునుగాని సమముగా (సమానముగ) చూచువాడును (ఇతరుల సుఖదుఃఖములను తన సుఖదుఃఖములుగా భావించువాడును) అయిన యోగి పరమశ్రేష్ఠుడు. (32)

### అర్జున ఉవాచ

**యోఽయం యోగస్త్వయా ప్రోక్తః సామ్యేన మధుసూదన ।**
**ఏతస్యాహం న పశ్యామి చంచలత్వాత్ స్థితిం స్థిరామ్ ॥ 33 ॥**

యః, అయమ్, యోగః, త్వయా, ప్రోక్తః, సామ్యేన, మధుసూదన, ఏతస్య, అహమ్, న, పశ్యామి, చంచలత్వాత్, స్థితిమ్, స్థిరామ్ ॥ 33 ॥

| | | |
|---|---|---|
| మధుసూదన! | = | ఓ మధుసూదనా! |
| సామ్యేన | = | సమభావముతో (సమభావమును గూర్చి) |
| యః | = | ఏదైతే |
| అయమ్, యోగః | = | ఈ యోగము |
| త్వయా | = | నీచేత |
| ప్రోక్తః | = | చెప్పబడినదో |
| చంచలత్వాత్ | = | మనశ్చాంచల్య కారణమున |
| అహమ్ | = | నేను |
| ఏతస్య | = | ఈ యోగము యొక్క |
| స్థిరామ్, స్థితిమ్ | = | శాశ్వతస్థితిని |
| న, పశ్యామి | = | తెలిసికొన (దర్శింప) లేకున్నాను. |

అర్జునుడు పలికెను - ఓ మధుసూదనా! సమభావమును గూర్చి నీవు చెప్పిన ఈ యోగముయొక్క స్థిరస్థితిని మనశ్చాంచల్యకారణమున తెలిసికొనలేకున్నాను. (33)

1. మానవుడు తన శరీరమునందలి అవయవముల సుఖదుఃఖములను తనవిగా భావించును- అట్లే యోగి సకల ప్రాణులను సమభావముతో జూచుచు వాటి సుఖదుఃఖములను తనవిగా తలంచును.

**చంచలం హి మనః కృష్ణ ప్రమాథి బలవద్దృఢమ్ ।**
**తస్యాహం నిగ్రహం మన్యే వాయోరివ సుదుష్కరమ్ ॥ 34 ॥**

చంచలమ్, హి, మనః, కృష్ణ, ప్రమాథి, బలవత్, దృఢమ్,
తస్య, అహమ్, నిగ్రహమ్, మన్యే, వాయోః, ఇవ, సుదుష్కరమ్ ॥ 34 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| హి | = | ఏలనన | (అతః) | = | ఇందువలన |
| కృష్ణ! | = | ఓ కృష్ణా! | తస్య, నిగ్రహమ్ | = | దానిని నిగ్రహించుట |
| మనః | = | మనస్సు | వాయోః, ఇవ | = | వాయువును నిగ్రహించుటను వలె |
| చంచలమ్ | = | మిక్కిలి చంచలమైనది | | | |
| ప్రమాథి | = | ప్రమథనశీలమైనది | | | |
| దృఢమ్ | = | దృఢమైనది | సుదుష్కరమ్ | = | అతిదుష్కరము అని, |
| బలవత్ | = | మిక్కిలి బలీయమైనది | అహమ్, మన్యే | = | నేను తలంతును |

ఓ కృష్ణా! ఈ మనస్సు మిక్కిలి చంచలమైనది. ప్రమథనశీలమైనది (బాగుగా మథించు స్వభావము గలది). దృఢమైనది. మిక్కిలి బలీయమైనది. కనుక, దానిని నిగ్రహించుట గాలిని ఆపుటవలె మిక్కిలి దుష్కరమని భావింతును. (34)

**శ్రీభగవాన్ ఉవాచ**

**అసంశయం మహాబాహో మనో దుర్నిగ్రహం చలమ్ ।**
**అభ్యాసేన తు కౌంతేయ వైరాగ్యేణ చ గృహ్యతే ॥ 35 ॥**

అసంశయమ్, మహాబాహో, మనః, దుర్నిగ్రహమ్, చలమ్,
అభ్యాసేన, తు, కౌంతేయ, వైరాగ్యేణ, చ, గృహ్యతే ॥ 35 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| మహాబాహో! | = | ఓ అర్జునా! | తు | = | అయితే |
| అసంశయమ్ | = | నిస్సందేహముగా | కౌంతేయ! | = | ఓ కుంతీసుతా! |
| మనః | = | మనస్సు | అభ్యాసేన, చ | = | అభ్యాసముచేతను |
| చలమ్ | = | చంచలమైనదే | వైరాగ్యేణ | = | వైరాగ్యమువలనను |
| దుర్నిగ్రహమ్ | = | నిగ్రహింపశక్యము కానిదే | గృహ్యతే | = | నిగ్రహింపబడును (నిగ్రహించుట సాధ్యమే) |

శ్రీ భగవానుడు పలికెను - హే మహాబాహో! నిస్సందేహముగా మనస్సు చంచలమైనదే. దానిని వశపఱచుకొనుట మిక్కిలి కష్టము. కాని, కౌంతేయా! అభ్యాస వైరాగ్యములద్వారా దానిని వశపఱచుకొనుట సాధ్యమే. (35)

**అసంయతాత్మనా యోగో దుష్ప్రాప ఇతి మే మతిః ।**
**వశ్యాత్మనా తు యతతా శక్యోఽవాప్తుముపాయతః ॥ 36 ॥**

అసంయతాత్మనా, యోగః, దుష్ప్రాపః, ఇతి, మే, మతిః,
వశ్యాత్మనా, తు, యతతా, శక్యః, అవాప్తుమ్, ఉపాయతః ॥ 36 ॥

| | | | |
|---|---|---|---|
| అసంయ-తాత్మనా | = మనస్సును వశపఱచుకొనని వానికి | వశ్యాత్మనా, యతతా | = మనస్సువశమైన ప్రయత్నశీలునకు |
| యోగః | = యోగము (యోగసిద్ధి) | ఉపాయతః | = సాధనద్వారా |
| దుష్ప్రాపః | = దుష్ప్రాప్యము (పొందుట అశక్యము) | అవాప్తుమ్, శక్యః | = (దానిని) పొందుట శక్యమే |
| | | ఇతి | = అని |
| తు | = అయితే | మే, మతిః | = నా అభిప్రాయము |

మనస్సును వశపఱచుకొనని పురుషునకు యోగసిద్ధి కలుగుట కష్టము. కాని, మనస్సు వశమునందున్న ప్రయత్నశీలుడైన పురుషుడు సాధనద్వారా సహజముగా యోగసిద్ధిని పొందుట సాధ్యమే అని నా అభిప్రాయము. (36)

**అర్జున ఉవాచ**

**అయతిః శ్రద్ధయోపేతో యోగాచ్చలితమానసః ।**
**అప్రాప్య యోగసంసిద్ధిం కాం గతిం కృష్ణ గచ్ఛతి ॥ 37 ॥**

అయతిః, శ్రద్ధయా, ఉపేతః, యోగాత్, చలితమానసః,
అప్రాప్య, యోగసంసిద్ధిమ్, కామ్, గతిమ్, కృష్ణ, గచ్ఛతి ॥ 37 ॥

| | | | |
|---|---|---|---|
| కృష్ణ | = ఓ కృష్ణా! | యోగసంసిద్ధిమ్ | = యోగసిద్ధిని |
| శ్రద్ధయా, ఉపేతః | = (యోగమునందు) శ్రద్ధాదరములు గలవాడైనను | అప్రాప్య | = పొందక |
| అయతిః | = సంయమికానివాడై | | |
| యోగాత్, చలితమానసః | = అవసాన దశయందు యోగమునుండి చలించిన మనస్సుకలవాడైన (సాధకుడు) | కామ్, గతిమ్ | = ఎట్టిగతిని |
| | | గచ్ఛతి | = పొందును? |

అర్జునుడు పలికెను - ఓ కృష్ణా! యోగమునందు శ్రద్ధాదరములతో యోగసాధన చేయుచు మనస్సు వశమునందుండని కారణమున అవసానదశలో మనస్సు చలించి, యోగసిద్ధిని(భగవత్సాక్షాత్కారమును) పొందకయే మరణించిన సాధకుని గతియేమగును? (37)

**కచ్చిన్నోభయవిభ్రష్టః ఛిన్నాభ్రమివ నశ్యతి ।**
**అప్రతిష్ఠో మహాబాహో విమూఢో బ్రహ్మణః పథి ॥ 38 ॥**

కచ్చిత్, న, ఉభయవిభ్రష్టః, ఛిన్నాభ్రమ్, ఇవ, నశ్యతి,
అప్రతిష్ఠః, మహాబాహో, విమూఢః, బ్రహ్మణః, పథి ॥ 38 ॥

| | | | |
|---|---|---|---|
| మహాబాహో! | = ఓ కృష్ణా! | ఛిన్నాభ్రమ్, ఇవ | = ఛిన్నాభిన్నమైన మేఘమువలె |
| బ్రహ్మణః, పథి | = భగవత్ప్రాప్తి రూప మార్గమునందు | ఉభయవిభ్రష్టః | = ఉభయభ్రష్టుడై |
| విమూఢః | = మోహితుడై | కచ్చిత్, న, నశ్యతి | = అధోగతిపాలుకాడు గదా? |
| అప్రతిష్ఠః | = ఆశ్రయరహితుడై | | |

హే మహాబాహో! అతడు (యోగభ్రష్టుడు) భగవత్ప్రాప్తిమార్గమునుండి జారినవాడై, ఆశ్రయరహితుడై (ఆలంబనము లేనివాడై), ఉభయభ్రష్టుడై, ఛిన్నాభిన్నమైన మేఘమువలె అధోగతి పాలు కాడు గదా! (38)

**ఏతన్మే సంశయం కృష్ణ ఛేత్తుమర్హస్యశేషతః ।**
**త్వదన్యః సంశయస్యాస్య ఛేత్తా న హ్యుపపద్యతే ॥ 39 ॥**

ఏతత్, మే, సంశయమ్, కృష్ణ, ఛేత్తుమ్, అర్హసి, అశేషతః,
త్వదన్యః, సంశయస్య, అస్య, ఛేత్తా, న, హి, ఉపపద్యతే ॥ 39 ॥

| | | | |
|---|---|---|---|
| కృష్ణ | = ఓ కృష్ణా! | అర్హసి | = (నీవే) అర్హుడవు |
| మే | = నా యొక్క | హి | = ఏలనన |
| ఏతత్, సంశయమ్ | = ఈ సందేహమును | త్వదన్యః | = నీవు తప్ప మఱి యెవ్వడును |
| అశేషతః | = పూర్తిగా | అస్య, సంశయస్య, ఛేత్తా | = ఈ సంశయమును తొలగింప గలవాడు |
| ఛేత్తుమ్ | = ఛేదించుటకు (తొలగించుటకు) | న, ఉపపద్యతే | = లభింపడు |

ఓ కృష్ణా! ఈ నా సందేహమును పూర్తిగా నివృత్తిచేయుట నీకే చెల్లును. ఏలనన, ఈ సందేహమును తొలగించుట నీకు తప్ప మఱెవ్వరికిని శక్యము కాదు. (39)

**శ్రీభగవాన్ ఉవాచ**

**పార్థ నైవేహ నాముత్ర వినాశస్తస్య విద్యతే ।**
**న హి కల్యాణకృత్ కశ్చిత్ దుర్గతిం తాత గచ్ఛతి ॥ 40 ॥**

పార్థ, న, ఏవ, ఇహ, న, అముత్ర, వినాశః, తస్య, విద్యతే,
న, హి, కల్యాణకృత్, కశ్చిత్, దుర్గతిమ్, తాత, గచ్ఛతి ॥ 40 ॥

| | | | |
|---|---|---|---|
| పార్థ! | = ఓ పార్థా! | హి | = ఏలనన |
| తస్య | = అట్టి పురుషునకు | తాత! | = ఓ నాయనా! |
| ఇహ | = ఈ లోకమున | కల్యాణకృత్ | = భగవత్ప్రాప్తికై కర్తవ్య కర్మలను ఆచరించువాడు |
| వినాశః | = వినాశము | | |
| న, విద్యతే | = ఉండదు | కశ్చిత్ | = ఎవ్వడును |
| అముత్ర, ఏవ | = పరలోకమునందును | దుర్గతిమ్, న గచ్ఛతి | = దుర్గతిపాలుగాడు |
| న(విద్యతే) | = (వినాశము) ఉండదు | | |

శ్రీభగవానుడు పలికెను - ఓ పార్థా! అట్టి (అ) పురుషుడు ఈ లోకమున గాని, పరలోకమున గాని అధోగతిపాలుగాడు. ఏలనన, నాయనా! ఆత్మోద్ధరణమునకు అనగా భగవత్ప్రాప్తికై కర్తవ్యకర్మలను ఆచరించువాడెవ్వడును దుర్గతి పాలుగాడు. (40)

**ప్రాప్య పుణ్యకృతాం లోకానుషిత్వా శాశ్వతీః సమాః ।**
**శుచీనాం శ్రీమతాం గేహే యోగభ్రష్టోఽభిజాయతే ॥ 41 ॥**

ప్రాప్య, పుణ్యకృతామ్, లోకాన్, ఉషిత్వా, శాశ్వతీః, సమాః,
శుచీనామ్, శ్రీమతామ్, గేహే, యోగభ్రష్టః, అభిజాయతే ॥ 41 ॥

| | | | |
|---|---|---|---|
| యోగభ్రష్టః | = యోగభ్రష్టుడైన పురుషుడు | శాశ్వతీః,సమాః ఉషిత్వా | = పెక్కు సంవత్సరములు గడిపి |
| పుణ్యకృతామ్, లోకాన్ | = పుణ్యాత్ములు పొందు లోకములను అనగా స్వర్గాది-ఉత్తమ లోకములను | శుచీనామ్, శ్రీమతామ్ | = పవిత్రులైన సంపన్నుల యొక్క |
| | | గేహే | = గృహమునందు |
| ప్రాప్య | = పొంది (అచట) | అభిజాయతే | = జన్మించును |

యోగభ్రష్టుడు పుణ్యాత్ములు పొందు లోకములను అనగా-స్వర్గాది- ఉత్తమ లోకములను పొంది, ఆయా లోకములలో పెక్కు సంవత్సరములు గడిపి, పిదప పవిత్రులైన సంపన్నుల గృహమున జన్మించును. (41)

**అథవా యోగినామేవ కులే భవతి ధీమతామ్ ।**
**ఏతద్ధి దుర్లభతరం లోకే జన్మ యదీదృశమ్ ॥ 42 ॥**

అథవా, యోగినామ్, ఏవ, కులే, భవతి, ధీమతామ్,
ఏతత్, హి, దుర్లభతరమ్, లోకే, జన్మ, యత్, ఈదృశమ్ ॥ 42 ॥

| | | | |
|---|---|---|---|
| అథవా | = అథవా (విరాగియైన పురుషుడు ఆ పుణ్య లోకములకు పోకుండగనే) | ఈదృశమ్, జన్మ | = ఈ విధమైన జన్మ |
| | | యత్ | = ఏది కలదో |
| | | ఏతత్ | = ఇది |
| ధీమతామ్ | = జ్ఞానులైన | లోకే | = లోకమునందు (లభించుట) |
| యోగినామ్ కులే, ఏవ | = యోగుల కుటుంబములోనే | హి | = నిస్సందేహముగా |
| భవతి | = జన్మించును | దుర్లభతరమ్ | = మిక్కిలి దుర్లభము. |

అథవా, విరాగియైన పురుషుడు ఆపుణ్య (ఊర్ధ్వ) లోకములకు పోకుండగనే జ్ఞానులైన యోగులకుటుంబములోనే జన్మించును. కాని, లోకమునందు ఇట్టి జన్మ ప్రాప్తించుట మిక్కిలి దుర్లభము. (42)

**తత్ర తం బుద్ధిసంయోగం లభతే పౌర్వదేహికమ్ ।**
**యతతే చ తతో భూయః సంసిద్ధౌ కురునందన ॥ 43 ॥**

తత్ర, తమ్, బుద్ధిసంయోగమ్, లభతే, పౌర్వదేహికమ్,
యతతే, చ, తతః, భూయః, సంసిద్ధౌ, కురునందన ॥ 43 ॥

| | | | |
|---|---|---|---|
| కురునందన! | = ఓ అర్జునా! | లభతే | = (అనాయాసముగా) పొందును |
| తత్ర | = అచ్చట | | |
| పౌర్వదేహికమ్ | = పూర్వదేహమున సాధించిన | చ | = మఱియు |
| | | తతః | = దానిప్రభావమున |
| తమ్, బుద్ధి-సంయోగమ్ | = ఆ బుద్ధి యోగమును (అనగా సమత్వబుద్ధి రూపయోగ సంస్కారములను). | సంసిద్ధౌ | = పరమాత్మ ప్రాప్తికై |
| | | భూయః యతతే | = మునుపటికంటె ఎక్కువగా మఱల ప్రయత్నించును |

అచట (యోగి కుటుంబమున పుట్టిన పిదప) పూర్వదేహమున సాధించిన బుద్ధి సంయోగమును అనగా సమబుద్ధిరూపయోగసంస్కారములను, అతడు సులభముగనే పొందును. ఓ కురునందనా! ఆబుద్ధిసంయోగప్రభావమున, అతడు మఱల పరమాత్మప్రాప్తి సిద్ధించుటకై మునుపటికంటెను అధికముగా సాధన చేయును. (43)

**పూర్వాభ్యాసేన తేనైవ హ్రియతే హ్యవశోఽపి సః ।**
**జిజ్ఞాసురపి యోగస్య శబ్దబ్రహ్మాతివర్తతే ॥ 44 ॥**

పూర్వాభ్యాసేన, తేన, ఏవ, హ్రియతే, హి, అవశః, అపి, సః,
జిజ్ఞాసుః, అపి, యోగస్య, శబ్దబ్రహ్మ, అతివర్తతే ॥ 44 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| సః | = | అతడు | యోగస్య, జిజ్ఞాసుః, | = | అట్లే సమబుద్ధిరూప యోగ జిజ్ఞాసువు |
| అవశః, అపి | = | పరాధీనుడైనను | అపి | = | గూడ |
| తేన, పూర్వాభ్యాసేన, ఏవ | = | ఆ పూర్వాభ్యాస ప్రభావముననే | శబ్దబ్రహ్మ | = | వేదములలో తెల్పబడిన సకామ కర్మఫలములను |
| హి | = | నిస్సందేహముగా | | | |
| హ్రియతే | = | (భగవంతునివైపు) ఆకర్షితుడగును | అతివర్తతే | = | అధిగమించును. |

శ్రీమంతుల ఇంటిలో జన్మించిన యోగభ్రష్టుడు పరాధీనుడైనను పూర్వసాధన ప్రభావమున నిస్సందేహముగ భగవంతునివైపు ఆకర్షితుడగును. అట్లే సమబుద్ధిరూపయోగజిజ్ఞాసువుగూడ వేదములలో తెల్పబడిన సకామకర్మల ఫలమును అధిగమించును. (44)

**ప్రయత్నాద్యతమానస్తు యోగీ సంశుద్ధకిల్బిషః ।**
**అనేకజన్మసంసిద్ధః తతో యాతి పరాం గతిమ్ ॥ 45 ॥**

ప్రయత్నాత్, యతమానః, తు, యోగీ, సంశుద్ధకిల్బిషః,
అనేకజన్మసంసిద్ధః, తతః, యాతి, పరామ్, గతిమ్ ॥ 45 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| తు | = | అయితే | అనేకజన్మ-సంసిద్ధః | = | అనేక జన్మల సంస్కారముల ప్రభావమున ఈజన్మ యందే సిద్ధిని పొంది |
| ప్రయత్నాత్ | = | ప్రయత్నపూర్వకముగా | | | |
| యతమానః, యోగీ | = | అభ్యాసము చేయు యోగి | | | |

| | | | | | |
|---|---|---|---|---|---|
| సంశుద్ధ-కిల్బిషః | = | సంపూర్ణముగా పాపరహితుడై | పరామ్, గతిమ్ | = | పరమగతిని |
| తతః | = | తత్ క్షణమే | యాతి | = | పొందును |

కాని, ప్రయత్నపూర్వకముగ యోగసాధనచేయు యోగి అనేకజన్మలసంస్కారముల ప్రభావమున ఈ జన్మయందే సిద్ధిని పొంది, సంపూర్ణముగా పాపరహితుడై, తత్క్షణమే పరమ పదమును పొందును. (45)

**తపస్విభ్యోఽధికో యోగీ జ్ఞానిభ్యోఽపి మతోఽధికః ।**
**కర్మిభ్యశ్చాధికో యోగీ తస్మాద్యోగీ భవార్జున ॥ 46 ॥**

తపస్విభ్యః, అధికః, యోగీ, జ్ఞానిభ్యః, అపి, మతః, అధికః,
కర్మిభ్యః, చ, అధికః, యోగీ, తస్మాత్, యోగీ, భవ, అర్జున ॥ 46 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| యోగీ | = | యోగి | యోగీ | = | యోగి |
| తపస్విభ్యః, అధికః | = | తాపసులకంటెను శ్రేష్ఠుడు | కర్మిభ్యః, అధికః | = | సకామ కర్మలనుఆచరించు వారి కంటెను శ్రేష్ఠుడు |
| జ్ఞానిభ్యః,అపి అధికః | = | శాస్త్రజ్ఞానులకంటెను శ్రేష్ఠుడు అని | | | |
| మతః | = | భావింపబడును | తస్మాత్ | = | అందువలన |
| చ | = | మఱియు | అర్జున! | = | ఓ అర్జునా! |
| | | | యోగీ, భవ | = | యోగివి కమ్ము |

యోగి తాపసులకంటెను శ్రేష్ఠుడు. శాస్త్రజ్ఞానులకంటెను శ్రేష్ఠుడు. సకామకర్మలను ఆచరించువారికంటెను శ్రేష్ఠుడని భావింపబడును. కావున, ఓ అర్జునా! నీవు యోగివి కమ్ము. (46)

**యోగినామపి సర్వేషాం మద్గతేనాంతరాత్మనా ।**
**శ్రద్ధావాన్ భజతే యో మాం స మే యుక్తతమో మతః ॥ 47 ॥**

యోగినామ్, అపి, సర్వేషామ్, మద్గతేన, అంతరాత్మనా,
శ్రద్ధావాన్, భజతే, యః, మామ్, సః, మే, యుక్తతమః, మతః ॥ 47 ॥

| | | | |
|---|---|---|---|
| సర్వేషామ్, యోగినామ్, అపి | = యోగులందఱిలోను | మామ్ | = నన్ను |
| యః | = ఎవడయితే | భజతే | = నిరంతరము భజించునో |
| శ్రద్ధావాన్ | = శ్రద్ధగలవాడై | సః | = అట్టియోగి |
| | | మే | = నాకు |
| మద్గతేన, అంతరాత్మనా | = నాయందు లగ్నమైన అంతరాత్మతో | యుక్తతమః | = పరమశ్రేష్ఠుడు అని |
| | | మతః | = భావింపబడుమ |

యోగులందఱిలోను శ్రద్ధాళువై, అంతరాత్మను నాయందే లగ్నమొనర్చి, అనగా, భక్తివిశ్వాసములతో నిశ్చలమైన, దృఢమైన అనన్య భావముతో నాయందే స్థిరమైయున్న మనోబుద్ధిరూప - అంతఃకరణమును గలిగి, నిరంతరము నన్నే భజించువాడు పరమశ్రేష్ఠుడు- అని నానిశ్చితాభిప్రాయము. (47)

*ఓం తత్సదితి శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే ఆత్మసంయమయోగోనామ షష్ఠోఽధ్యాయః ॥ ౬ ॥*

॥ ఓం శ్రీపరమాత్మనే నమః ॥

# అథ సప్తమోఽధ్యాయః - జ్ఞాన, విజ్ఞానయోగః

## (ఏడవ అధ్యాయము-జ్ఞాన, విజ్ఞానయోగము)

ముఖ్యాంశములు : [(1 నుండి 7వ శ్లోకమువఱకు) విజ్ఞానసహిత జ్ఞానవిషయము, (8 నుండి 12 వఱకు) సమస్తపదార్థములయందును కారణరూపుడైన భగవంతునివ్యాపకత్వ వివరణము, (13 నుండి 19 వఱకు) ఆసురీ స్వభావముగలవారిని నిందించుట - భగవద్భక్తులను ప్రశంసించుట, (20 నుండి 23 వఱకు) అన్యదేవతోపాసనను గూర్చిన విషయము. (24 నుండి 30 వఱకు) భగవంతుని ప్రభావ స్వరూపములను ఎఱుంగనివారిని నిందించుట - ఎఱింగినవారిమహిమాప్రస్తావనము.]

**శ్రీ భగవాన్ ఉవాచ**

**మయ్యాసక్తమనాః పార్థ యోగం యుంజన్ మదాశ్రయః ।**
**అసంశయం సమగ్రం మాం యథా జ్ఞాస్యసి తచ్ఛృణు ॥ 1 ॥**

మయి, ఆసక్తమనాః, పార్థ, యోగమ్, యుంజన్, మదాశ్రయః,
అసంశయమ్, సమగ్రమ్, మామ్, యథా, జ్ఞాస్యసి, తత్, శృణు ॥ 1 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| పార్థ! | = | ఓ పార్థా! | మామ్ | = | నన్ను |
| మయి, ఆసక్తమనాః | = | అనన్యభక్తితో నాయందే ఆసక్తమైన మనస్సు కలవాడవై | యథా | = | ఎట్లు (నీవు) |
| మదాశ్రయః | = | మత్పరాయణుడవై | అసంశయమ్ | = | నిస్సందేహముగా |
| యోగమ్, యుంజన్ | = | యోగమునందు నిమగ్నుడవగుచు | జ్ఞాస్యసి | = | తెలిసికొనగలవో |
| సమగ్రమ్ | = | సంపూర్ణ విభూతి, బలము, ఐశ్వర్యాది గుణయుక్తుడను, సర్వప్రాణులకు, ఆత్మస్వరూపుడను ఐన | తత్ | = | దానిని (ఆవిధమును) |
| | | | శృణు | = | వినుము |

శ్రీ భగవానుడు పలికెను - ఓ పార్థా! అనన్యభక్తితో నాయందే ఆసక్తమైన మనస్సు కలిగినవాడవై యుండుము. అనన్య భావముతో మత్పరాయణుడవై, యోగమునందు

నిమగ్నుడవగుము. అట్టి నీవు సంపూర్ణవిభూతిబల - ఐశ్వర్యాదిగుణయుక్తుడను, సర్వప్రాణులకును ఆత్మస్వరూపుడను ఐన నన్ను సమగ్రముగా తెలిసికొను విధమును వినుము. (1)

**జ్ఞానం తేఽహం సవిజ్ఞానమ్ ఇదం వక్ష్యామ్యశేషతః ।**
**యద్జ్ఞాత్వా నేహ భూయోఽన్యత్ జ్ఞాతవ్యమవశిష్యతే ॥ 2 ॥**

జ్ఞానమ్, తే, అహమ్, సవిజ్ఞానమ్, ఇదమ్, వక్ష్యామి, అశేషతః,
యత్, జ్ఞాత్వా, న, ఇహ, భూయః, అన్యత్, జ్ఞాతవ్యమ్, అవశిష్యతే ॥ 2 ॥

| | | | |
|---|---|---|---|
| యత్ | = దేనిని | సవిజ్ఞానమ్, ఇదమ్, జ్ఞానమ్ | = విజ్ఞానసహితమైన ఈ తత్త్వ జ్ఞానమును |
| జ్ఞాత్వా | = ఎఱింగినచో | అహమ్ | = నేను |
| ఇహ | = ఈ లోకమున | తే | = నీకు |
| భూయః | = మఱల | అశేషతః | = సంపూర్ణముగా |
| అన్యత్ | = మఱియొకటి | వక్ష్యామి | = తెలిపెదను |
| జ్ఞాతవ్యమ్ | = తెలిసికొనదగినది | | |
| న, అవశిష్యతే | = మిగిలియుండదో అట్టి | | |

నేను నీకు విజ్ఞానసహితముగా తత్త్వజ్ఞానమును సంపూర్ణముగా తెలిపెదను. దీనిని ఎఱిగిన పిమ్మట ఈ జగత్తులో తెలిసికొనవలసినది ఏదియు మిగులదు. (2)

**మనుష్యాణాం సహస్రేషు కశ్చిద్యతతి సిద్ధయే ।**
**యతతామపి సిద్ధానాం కశ్చిన్మాం వేత్తి తత్త్వతః ॥ 3 ॥**

మనుష్యాణామ్, సహస్రేషు, కశ్చిత్, యతతి, సిద్ధయే,
యతతామ్, అపి, సిద్ధానామ్, కశ్చిత్, మామ్, వేత్తి, తత్త్వతః ॥ 3 ॥

| | | | |
|---|---|---|---|
| మనుష్యాణామ్, సహస్రేషు | = వేలకొలది మనుష్యులలో | యతతామ్ సిద్ధానామ్, అపి | = (అట్లు) ప్రయత్నించినట్టి యోగులలో గూడ |
| కశ్చిత్ | = ఒకానొకడు మాత్రమే | కశ్చిత్ | = ఒకానొకడు మాత్రమే (మత్పరాయణుడై) |
| సిద్ధయే | = భగవత్ప్రాప్తి సిద్ధించుటకై | మామ్ | = నన్ను |
| | | తత్త్వతః | = నా యథార్థ స్వరూపమును |
| యతతి | = ప్రయత్నించును | వేత్తి | = ఎఱుంగును |

వేలకొలది మనుష్యులలో ఎవడో ఒకడు మాత్రమే నన్నుగూర్చి తెలిసికొనుటకు ప్రయత్నించును. అట్లు ప్రయత్నించినవారిలోగూడ ఒకానొకడు మాత్రమే మత్పరాయణుడై నా తత్త్వమును అనగా నా యథార్థస్వరూపమును ఎఱుంగును. (3)

**భూమిరాపోఽనలో వాయుః ఖం మనో బుద్ధిరేవ చ ।**
**అహంకార ఇతీయం మే భిన్నా ప్రకృతిరష్టధా ॥ 4 ॥**
**అపరేయమితస్త్వన్యాం ప్రకృతిం విద్ధి మే పరామ్ ।**
**జీవభూతాం మహాబాహో యయేదం ధార్యతే జగత్ ॥ 5 ॥**

భూమిః, ఆపః, అనలః, వాయుః, ఖమ్, మనః, బుద్ధిః, ఏవ, చ,
అహంకారః, ఇతి, ఇయమ్, మే, భిన్నా, ప్రకృతిః, అష్టధా ॥ 5 ॥
అపరా, ఇయమ్, ఇతః, తు, అన్యామ్, ప్రకృతిమ్, విద్ధి, మే, పరామ్,
జీవభూతామ్, మహాబాహో, యయా, ఇదమ్, ధార్యతే, జగత్ ॥ 5 ॥

భూమిః = భూమి
ఆపః = నీరు
అనలః = అగ్ని
వాయుః = వాయువు
ఖమ్ = ఆకాశము
మనః = మనస్సు
బుద్ధిః = బుద్ధి
చ = మఱియు
అహంకారః,ఏవ= అహంకారమూ
ఇతి = అని
మే = నాయొక్క
ఇయమ్ = ఇట్టి (ఈ)
ప్రకృతిః = ప్రకృతి
అష్టధా, భిన్నా = ఎనిమిది విధములుగా (కలదు)
మహాబాహో = ఓ అర్జునా!

ఇయమ్, తు = ఈ అష్టవిధప్రకృతి అయితే
అపరా = అపరాప్రకృతి అనియు లేక జడప్రకృతి అనియు (చెప్పబడుచున్నది)
యయా = దేనిచేత
ఇదమ్, జగత్ = ఈ జగత్తు
ధార్యతే = ధరింపబడుచున్నదో
మే = నాయొక్క
జీవభూతామ్ = జీవరూపమైన
పరామ్, ప్రకృతిమ్= పరా ప్రకృతిని
ఇతః, అన్యామ్ = ఈ అష్టవిధ ప్రకృతి కంటెను వేఱైన దానినిగా
విద్ధి = ఎఱుంగుము

ఓ మహాబాహూ! భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశము, మనస్సు, బుద్ధి, అహంకారము, అని నా ప్రకృతి ఎనిమిది విధములుగా కలదు. ఎనిమిది భేదములు గల ఈ ప్రకృతిని 'అపరా' లేక 'జడ' ప్రకృతి అనియందురు. ఇదిగాక ఈ సంపూర్ణజగత్తును ధరించునట్టి మఱియొక 'ప్రకృతి' కలదు. అదియే నా జీవరూప 'పరాప్రకృతి' లేక చేతనప్రకృతి అని తెలిసికొనుము. (4,5)

**ఏతద్యోనీని భూతాని సర్వాణీత్యుపధారయ ।**
**అహం కృత్స్నస్య జగతః ప్రభవః ప్రలయస్తథా ॥ 6 ॥**

ఏతద్యోనీని, భూతాని, సర్వాణి, ఇతి, ఉపధారయ,
అహమ్, కృత్స్నస్య, జగతః, ప్రభవః, ప్రలయః, తథా ॥ 6 ॥

| | | | |
|---|---|---|---|
| సర్వాణి, భూతాని = | సమస్తప్రాణులును | ప్రభవః = | పుట్టుకస్థానము |
| ఏతద్యోనీని = | ఈ రెండు ప్రకృతుల నుండియే ఉత్పన్నములు అగుచున్నవి | తథా = | అట్లే |
| అహమ్ = | (మఱియు) నేను | ప్రలయః = | విలీనస్థానము (అనగా సమస్త జగత్తునకు నేనే మూలకారణము) |
| కృత్స్నస్య, జగతః = | సమస్త జగత్తునకు | ఇతి, ఉపధారయ = | అని, ఎఱుంగుము |

ఓ అర్జునా! సమస్తప్రాణులును ఈ రెండువిధములైన ప్రకృతులనుండియే ఉత్పన్నములగుచున్నవి. ఈ జగత్తుయొక్క ప్రభవమూ (పుట్టుకయూ) ప్రలయమూ (లీనమగుటయూ) నావలననే జరుగుచున్నవి. అనగా ఈ సంపూర్ణ జగత్తునకు నేనే మూలకారణము. (6)

**మత్తః పరతరం నాన్యత్ కించిదస్తి ధనంజయ ।**
**మయి సర్వమిదం ప్రోతం సూత్రే మణిగణా ఇవ ॥ 7 ॥**

మత్తః, పరతరమ్, న, అన్యత్, కించిత్, అస్తి, ధనంజయ,
మయి, సర్వమ్, ఇదమ్, ప్రోతమ్, సూత్రే, మణిగణాః, ఇవ ॥ 7 ॥

| | | | |
|---|---|---|---|
| ధనంజయ! = | ఓ ధనంజయా! | ఇదమ్, సర్వమ్ = | ఈ సంపూర్ణ జగత్తు |
| మత్తః = | నాకంటెను | సూత్రే = | సూత్రమునందు |
| అన్యత్, కించిత్ = | వేఱైనదేదియును | మణిగణాః, ఇవ = | మణులవలె |
| పరతరమ్ = | పరమకారణమైనది | మయి = | నాయందు |
| న, అస్తి = | లేదు | ప్రోతమ్ = | కూర్చబడినది |

ఓ ధనంజయా! నాకంటెను పరమకారణమైనది ఏదియును లేదు. ఈ జగత్తునందలి వస్తువులన్నియును సూత్రమున సూత్రమణులవలె నాయందే కూర్చబడియున్నవి.(7)

**రసోఽహమప్సు కౌంతేయ ప్రభాస్మి శశిసూర్యయోః ।**
**ప్రణవః సర్వవేదేషు శబ్దః ఖే పౌరుషం నృషు ॥ 8 ॥**

రసః, అహమ్, అప్సు, కౌంతేయ, ప్రభా, అస్మి, శశిసూర్యయోః,
ప్రణవః, సర్వవేదేషు, శబ్దః, ఖే, పౌరుషమ్, నృషు ॥ 8 ॥

| | | | |
|---|---|---|---|
| కౌంతేయ! | = ఓ అర్జునా! | ప్రణవః | = ఓంకారమును |
| అహమ్ | = నేను | ఖే | = ఆకాశమునందు |
| అప్సు | = నీటియందు | శబ్దః | = శబ్దమును |
| రసః | = రసతన్మాత్రను | | |
| శశిసూర్యయోః | = సూర్యచంద్రులయందు | నృషు | = మానవులయందు |
| ప్రభా | = ప్రకాశమును | పౌరుషమ్ | = పౌరుషమును |
| సర్వవేదేషు | = వేదములన్నింటియందును | అస్మి | = ఐ యున్నాను |

ఓ అర్జునా! జలములో రసతన్మాత్రను నేనే. సూర్యచంద్రులలో కాంతిని నేనే. వేదములన్నింటిలోను ఓంకారమును, ఆకాశమునందు శబ్దమును, పురుషులయందు పౌరుషమును నేనే. (8)

**పుణ్యో గంధః పృథివ్యాం చ తేజశ్చాస్మి విభావసౌ ।**
**జీవనం సర్వభూతేషు తపశ్చాస్మి తపస్విషు ॥ 9 ॥**

పుణ్యః, గంధః, పృథివ్యామ్, చ, తేజః, చ, అస్మి, విభావసౌ,
జీవనమ్, సర్వభూతేషు, తపః, చ, అస్మి, తపస్విషు ॥ 9 ॥

| | | | |
|---|---|---|---|
| పృథివ్యామ్ | = పృథ్వియందు | చ | = మఱియు |
| పుణ్యః, గంధః | = పవిత్రమైన గంధతన్మాత్రను | సర్వభూతేషు | = సమస్తప్రాణులయందు |
| | | జీవనమ్ | = జీవశక్తిని (చైతన్యమును) |
| చ | = మఱియు | చ | = మఱియు |
| విభావసౌ | = అగ్నియందు | తపస్విషు | = తాపసులయందు |
| తేజః | = తేజస్సును | తపః | = తపస్సును |
| అస్మి | = ఐ యున్నాను | అస్మి | = ఐ యున్నాను |

పృథ్వియందు పవిత్రగంధతన్మాత్రను, అగ్నియందు తేజస్సును, సమస్త ప్రాణులలో జీవశక్తిని (చైతన్యమును), తాపసులలో తపస్సును నేనే. (9)

**బీజం మాం సర్వభూతానాం విద్ధి పార్థ సనాతనమ్ ।**
**బుద్ధిర్బుద్ధిమతామస్మి తేజస్తేజస్వినామహమ్ ॥ 10 ॥**

బీజమ్, మామ్, సర్వభూతానామ్, విద్ధి, పార్థ, సనాతనమ్,
బుద్ధిః, బుద్ధిమతామ్, అస్మి, తేజః, తేజస్వినామ్, అహమ్ ॥ 10 ॥

| | | | |
|---|---|---|---|
| పార్థ! | = ఓ పార్థా! | అహమ్ | = నేను |
| సర్వభూతానామ్ | = సమస్తభూతములకును | బుద్ధిమతామ్ | = ప్రజ్ఞావంతులలో |
| సనాతనమ్ | = శాశ్వతమైన | బుద్ధిః | = ప్రజ్ఞను |
| బీజమ్ | = బీజముగా | తేజస్వినామ్ | = తేజోవంతులలో |
| మామ్ | = నన్ను | తేజః | = తేజస్సును |
| విద్ధి | = ఎఱుంగుము | అస్మి | = ఐ యున్నాను |

ఓ పార్థా! సమస్త భూతములకును నన్ను సనాతన (శాశ్వత) మైన బీజముగా ఎఱుంగుము. ప్రజ్ఞావంతులలో ప్రజ్ఞను, తేజోవంతులలో తేజస్సును నేనే. (10)

**బలం బలవతాం చాహం కామరాగవివర్జితమ్ ।**
**ధర్మావిరుద్ధో భూతేషు కామోఽస్మి భరతర్షభ ॥ 11 ॥**

బలమ్, బలవతామ్, చ, అహమ్, కామరాగవివర్జితమ్,
ధర్మావిరుద్ధః, భూతేషు, కామః, అస్మి, భరతర్షభ ॥ 11 ॥

| | | | |
|---|---|---|---|
| భరతర్షభ! | = ఓ అర్జునా! | భూతేషు | = సమస్తప్రాణులయందును |
| అహమ్ | = నేను | ధర్మావిరుద్ధః | = ధర్మమునకు విరుద్ధముకాని (శాస్త్రానుకూలమైన) |
| బలవతామ్ | = బలవంతులలో | | |
| కామరాగవివర్జితమ్ | = కామరాగ రహితమైన | | |
| బలమ్ | = బలమును | కామః | = కామమును |
| చ | = మఱియు | అస్మి | = ఐ యున్నాను. |

ఓ భరతశ్రేష్ఠా! బలవంతులలో కామరాగరహితమైన బలమును నేను, భూతములన్నింటియందును (సమస్తప్రాణులయందును) ధర్మమునకు విరుద్ధముగాని (శాస్త్రసమ్మతమైన) కామమును నేనే. (11)

ఈ జగత్తు అనగా ప్రాణిసముదాయము అంతయును గుణములయొక్క కార్యరూపములైన సాత్త్విక, రాజస, తామసములు అను త్రివిధ భావములచే మోహితమగుచున్నది. కనుక, త్రిగుణములకు అతీతుడను శాశ్వతుడను ఐన నన్ను ఆప్రాణులు తెలిసికొనలేకున్నవి. (13)

**దైవీ హ్యేషా గుణమయీ మమ మాయా దురత్యయా ।**
**మామేవ యే ప్రపద్యంతే మాయామేతాం తరంతి తే ॥ 14 ॥**

దైవీ, హి, ఏషా, గుణమయీ, మమ, మాయా, దురత్యయా,
మామ్, ఏవ, యే, ప్రపద్యంతే, మాయామ్, ఏతామ్, తరంతి, తే ॥ 14 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| హి | = | ఏలననగా | మామ్, ఏవ | = | కేవలము, నిరంతరము నన్నే |
| ఏషా | = | ఈ | ప్రపద్యంతే | = | భజించుచున్నారో |
| మమ, మాయా | = | నా మాయ | తే | = | వారు |
| దైవీ | = | అలౌకికమైనది | ఏతామ్, మాయామ్ | = | ఈ, మాయను |
| గుణమయీ | = | త్రిగుణాత్మకమైనది | తరంతి | = | ఉల్లంఘించి, సంసార సముద్రమునుండి బయటపడుదురు |
| దురత్యయా | = | అధిగమింప సాధ్యముకానిది | | | |
| యే | = | ఎవరైతే | | | |

నా మాయ త్రిగుణాత్మకమైనది. అలౌకికమైనది. ఇది అధిగమించుటకు సాధ్యము కానిది. కాని, కేవలము నిరంతరము నన్నే భజించువారు ఈ మాయను అధిగమించి, సంసారసముద్రము నుండి బయటపడగలరు. (14)

**న మాం దుష్కృతినో మూఢాః ప్రపద్యంతే నరాధమాః ।**
**మాయయాపహృతజ్ఞానా ఆసురం భావమాశ్రితాః ॥ 15 ॥**

న, మామ్, దుష్కృతినః, మూఢాః, ప్రపద్యంతే, నరాధమాః,
మాయయా, అపహృతజ్ఞానాః, ఆసురమ్, భావమ్, ఆశ్రితాః ॥ 15 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| మాయయా | = | మాయచేత | దుష్కృతినః | = | దుష్కర్మలను ఆచరించువారును అగు |
| అపహృతజ్ఞానాః | = | అపహృతమైన జ్ఞానముగల వారును | మూఢాః | = | మూర్ఖులు |
| ఆసురమ్, భావమ్ | = | ఆసుర స్వభావమును | మామ్ | = | నన్ను |
| ఆశ్రితాః | = | ఆశ్రయించిన వారును | న, ప్రపద్యంతే | = | భజింపరు |
| నరాధమాః | = | నరులలో అధములును | | | |

మాయలో చిక్కుపడుటవలన విపరీత జ్ఞానమునకు లోనైనవారును, ఆసుర ప్రవృత్తిగలవారును, నరాధములును, మూఢులును, దుష్కర్మలను ఆచరించువారును నన్ను భజింపరు. (15)

**చతుర్విధా భజంతే మాం జనాః సుకృతినోఽర్జున ।**
**ఆర్తో జిజ్ఞాసురర్థార్థీ జ్ఞానీ చ భరతర్షభ ॥ 16 ॥**

చతుర్విధాః, భజంతే, మామ్, జనాః, సుకృతినః, అర్జున,
ఆర్తః, జిజ్ఞాసుః, అర్థార్థీ, జ్ఞానీ, చ, భరతర్షభ ॥ 16 ॥

| | | | |
|---|---|---|---|
| భరతర్షభ! | = ఓ భరతశ్రేష్ఠా! | జిజ్ఞాసుః | = ఐహిక విషయములపై ఆసక్తిని వీడి, పరమాత్మతత్త్వ జ్ఞానమును పొందుటకు ఇచ్ఛగలవారును |
| అర్జున! | = అర్జునా! | చ | = మఱియు |
| సుకృతినః | = శుభకర్మలను ఆచరించువారై | జ్ఞానీ | = పరమాత్మ ప్రాప్తినందిన జ్ఞానులును ఐన |
| అర్థార్థీ | = సంపదలను కోరువారును | చతుర్విధాః | = నాలుగువిధములైన |
| ఆర్తః | = (శారీరిక, మానసిక సంతాపములకు గురియైన) ఆర్తులును | జనాః | = భక్తులు |
| | | మామ్ | = నన్ను |
| | | భజంతే | = భజింతురు |

ఓ భరతశ్రేష్ఠా! అర్జునా! శుభకర్మలను ఆచరించుచు సుఖసంపదలను కోరుకొనువారు (అర్థార్థులు), శారీరిక మానసిక సంతాపములకు గురియైన ఆర్తులు, ఐహికవిషయములపై ఆసక్తిని వీడి పరమాత్మతత్త్వజ్ఞానమును పొందుటకు ఇచ్ఛగలవారు (జిజ్ఞాసువులు), పరమాత్మప్రాప్తినందిన జ్ఞానులు అను చతుర్విధ భక్తులు నన్ను భజింతురు. (16)

**తేషాం జ్ఞానీ నిత్యయుక్త ఏకభక్తిర్విశిష్యతే ।**
**ప్రియో హి జ్ఞానినోఽత్యర్థమ్ అహం స చ మమ ప్రియః ॥ 17 ॥**

తేషామ్, జ్ఞానీ, నిత్యయుక్తః, ఏకభక్తిః, విశిష్యతే,
ప్రియః, హి, జ్ఞానినః, అత్యర్థమ్, అహమ్, సః, చ, మమ, ప్రియః ॥ 17 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| తేషామ్ | = | వారిలో | జ్ఞానిన: | = | యథార్థముగ నాతత్త్వమును ఎఱింగిన జ్ఞానికి |
| నిత్యయుక్త: | = | నిరంతరమునాయందే ఏకీభావస్థితుడును | అహమ్ | = | నేను |
| ఏకభక్తి: | = | అనన్యమైనభక్తిగల | అత్యర్థమ్ | = | అత్యంతము |
| | | | ప్రియ: | = | ఇష్టుడను |
| జ్ఞానీ | = | జ్ఞానియైనవాడు | చ | = | మఱియు |
| విశిష్యతే | = | శ్రేష్ఠుడు | స:, మమ | = | అతడును నాకు |
| హి | = | ఏలనన | ప్రియ: | = | ఇష్టుడు |

ఈ చతుర్విధభక్తులలో నిరంతరము నాయందే ఏకీభావస్థితుడై, అనన్య భక్తియుతుడైన జ్ఞాని అత్యుత్తముడు. ఏలనన, వాస్తవముగ నన్ను (నాతత్త్వమును) తెలిసికొనిన జ్ఞానికి నేను మిక్కిలి ఇష్టుడను. అతడును నాకు మిక్కిలి ఇష్టుడు. (17)

**ఉదారా: సర్వ ఏవైతే జ్ఞానీ త్వాత్మైవ మే మతమ్ ।**
**ఆస్థిత: స హి యుక్తాత్మా మామేవానుత్తమాం గతిమ్ ॥ 18 ॥**

ఉదారా:, సర్వే, ఏవ, ఏతే, జ్ఞానీ, తు, ఆత్మా, ఏవ, మే, మతమ్,
ఆస్థిత:, స:, హి, యుక్తాత్మా, మామ్, ఏవ, అనుత్తమామ్, గతిమ్ ॥ 18 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| ఏతే | = | ఈ చతుర్విధభక్తులు | స: | = | అట్టిభక్తుడు |
| సర్వే, ఏవ | = | అందఱును | యుక్తాత్మా | = | తన మనస్సును, బుద్ధిని నాయందే స్థిరముగా నిల్పినవాడై |
| ఉదారా: | = | ఉదారులే | | | |
| తు | = | కాని | | | |
| జ్ఞానీ | = | జ్ఞానియైనవాడు మాత్రము | | | |
| ఆత్మా, ఏవ | = | (సాక్షాత్తుగా) నా స్వరూపమే, అని | అనుత్తమామ్, గతిమ్ | = | అత్యుత్తమ గతి స్వరూపమైన |
| | | | మామ్, ఏవ | = | నాయందే |
| మే, మతమ్ | = | నా అభిప్రాయము | ఆస్థిత: | = | స్థితుడై ఉన్నవాడు |
| హి | = | ఏలనన | | | |

ఈ చతుర్విధభక్తులందఱును ఉదారులే. (అనగా భగవంతునియందు విశ్వాసమునుంచి, ఎల్లప్పుడును అతనినే సేవించుచు ఉండువారు.) కాని, జ్ఞానియైన వాడు నా స్వరూపమే. ఇది నా అభిప్రాయము. ఏలనన అట్టి భక్తుడు తనమనస్సును బుద్ధిని నాయందే స్థిరముగా ఉంచి, నన్నే పరమప్రాప్యునిగా భావించును. ఈవిధముగా అతడు నాయందే స్థితుడు. (18)

**బహూనాం జన్మనామంతే జ్ఞానవాన్ మాం ప్రపద్యతే ।**
**వాసుదేవః సర్వమితి స మహాత్మా సుదుర్లభః ॥ 19 ॥**

బహూనామ్, జన్మనామ్, అంతే, జ్ఞానవాన్, మామ్, ప్రపద్యతే,
వాసుదేవః, సర్వమ్, ఇతి, సః, మహాత్మా, సుదుర్లభః ॥ 19 ॥

| | | | |
|---|---|---|---|
| బహూనామ్ | = అనేకములైన | వాసుదేవః<br>ఇతి | = వాసుదేవమయమే<br>అని భావించి |
| జన్మనామ్ | = జన్మములయొక్క | మామ్ | = నన్ను |
| అంతే | = అంతమున (పిదప) | ప్రపద్యతే | = భజించును |
| జ్ఞానవాన్ | = భగవత్తత్త్వమును ఎఱింగిన జ్ఞాని | సః, మహాత్మా | = అట్టి మహాత్ముడు |
| సర్వమ్ | = సమస్తము | సుదుర్లభః | = లభించుట అరుదు |

అనేకజన్మలపిదప జ్ఞానియైనవాడు(భగవత్తత్త్వమును ఎఱిగినవాడు) సర్వమూ వాసుదేవమయమే యని భావించి, నన్ను శరణుపొందును. అట్టి మహాత్ముడు లభించుట అరుదు. (19)

**కామైస్తైస్తైర్హృతజ్ఞానాః ప్రపద్యంతేఽన్యదేవతాః ।**
**తం తం నియమమాస్థాయ ప్రకృత్యా నియతాః స్వయా ॥ 20 ॥**

కామైః, తైః, తైః, హృతజ్ఞానాః, ప్రపద్యంతే, అన్యదేవతాః,
తమ్, తమ్, నియమమ్, ఆస్థాయ, ప్రకృత్యా, నియతాః, స్వయా ॥ 20 ॥

| | | | |
|---|---|---|---|
| తైః, తైః, కామైః | = నానావిధములైన ఆయా భోగవాంఛలచే | తమ్, తమ్,<br>నియమమ్ | = వారి వారి (ఆయా)<br>నియమములను |
| హృతజ్ఞానాః | = అపహృతమైన జ్ఞానముగలవారు | ఆస్థాయ | = పాటించి |
| స్వయా, ప్రకృత్యా | = తమస్వభావములచే | అన్యదేవతాః | = ఇతరదేవతలను |
| నియతాః | = ప్రేరితులై | ప్రపద్యంతే | = ఆరాధింతురు |

నానావిధములైన భోగవాంఛలలో కూరుకొనిపోయినవారి జ్ఞానము హరింప బడును. వారు తమతమస్వభావములకు అనుగుణముగా వారివారి (ఆయా) నియమములను బట్టి ఇతర దేవతలను ఆరాధించుచుందురు. (20)

**యో యో యాం యాం తనుం భక్తః శ్రద్ధయార్చితుమిచ్ఛతి ।**
**తస్య తస్యాచలాం శ్రద్ధాం తామేవ విదధామ్యహమ్ ॥ 21 ॥**

యః, యః, యామ్, యామ్, తనుమ్, భక్తః, శ్రద్ధయా, అర్చితుమ్, ఇచ్ఛతి,
తస్య, తస్య, అచలామ్, శ్రద్ధామ్, తామ్, ఏవ, విదధామి, అహమ్ ॥ 21 ॥

| | | | |
|---|---|---|---|
| యః,యః,భక్తః | = ఏయే సకామభక్తుడు | శ్రద్ధామ్ | = శ్రద్ధను |
| యామ్, యామ్, తనుమ్ | = ఏయే దేవతా స్వరూపమును | తామ్, ఏవ | = ఆ దేవతను గూర్చియే (ఆ దేవతలయందే) |
| శ్రద్ధయా | = శ్రద్ధతో | | |
| అర్చితుమ్ | = పూజించుటకు | అచలామ్ | = స్థిరమైనదానినిగా |
| ఇచ్ఛతి | = కోరుకొనునో | అహమ్ | = నేను |
| తస్య తస్య | = ఆయా భక్తుని | విదధామి | = చేయుదును |

సకామభక్తుడు ఏయేదేవతాస్వరూపములను భక్తిశ్రద్ధలతో పూజింప నిశ్చయించుకొనునో, ఆ భక్తునకు ఆయాదేవతలయందే భక్తిశ్రద్ధలను స్థిరముగా కుదురుకొనునట్లు చేయుదును. (21)

**స తయా శ్రద్ధయా యుక్తః తస్యారాధనమీహతే ।**
**లభతే చ తతః కామాన్ మయైవ విహితాన్ హి తాన్ ॥ 22 ॥**

సః, తయా, శ్రద్ధయా, యుక్తః, తస్య, ఆరాధనమ్, ఈహతే,
లభతే, చ, తతః, కామాన్, మయా, ఏవ, విహితాన్, హి, తాన్ ॥ 22 ॥

| | | | |
|---|---|---|---|
| సః | = ఆ భక్తుడు | తతః | = ఆ దేవతనుండి |
| తయా, శ్రద్ధయా | = ఆట్టిశ్రద్ధతో | మయా,ఏవ | = నా అనుగ్రహము వలననే |
| యుక్తః | = కూడినవాడై | విహితాన్ | = విహితములైన |
| తస్య, ఆరాధనమ్ | = ఆ దేవతారాధనమునే | తాన్, కామాన్ | = ఆ భోగములను |
| ఈహతే | = ఇష్టముతో చేయును | హి | = నిస్సందేహముగా |
| చ | = మఱియు | లభతే | = పొందును |

అట్టి సకామభక్తుడు తగిన భక్తిశ్రద్ధలతో ఆ దేవతనే ఆరాధించును. తత్ఫలితముగ నా అనుగ్రహమువలననే ఆ దేవతద్వారా ఆ భోగములను అతడు తప్పక పొందగలడు. (22)

**అంతవత్తు ఫలం తేషాం తద్భవత్యల్పమేధసామ్ ।**
**దేవాన్ దేవయజో యాంతి మద్భక్తా యాంతి మామపి ॥ 23 ॥**

అంతవత్, తు, ఫలమ్, తేషామ్, తత్, భవతి అల్పమేధసామ్,
దేవాన్, దేవయజః, యాంతి, మద్భక్తాః, యాంతి, మామ్, అపి ॥ 23 ॥

| | | | |
|---|---|---|---|
| తు | = అయితే | దేవయజః | = దేవతలను పూజించువారు |
| తేషామ్, అల్పమేధసామ్ | = ఆ అల్పబుద్ధుల యొక్క | దేవాన్ | = ఆ దేవతలనే |
| | | యాంతి | = పొందుదురు |
| తత్, ఫలమ్ | = ఆ ఫలము | మద్భక్తాః | = నా భక్తులు |
| అంతవత్ | = నశ్వరము | మామ్, అపి | = (కడకు) నన్నే |
| భవతి | = అగును | యాంతి | = పొందుదురు |

కాని ఈ సకామభక్తులు (అల్పబుద్ధులు) పొందెడి ఫలములు గూడ నశ్వరములు. అన్యదేవతలను పూజించువారు ఆ దేవతలనే చేరుదురు. కాని, నా భక్తులు ఏ విధముగా ఆరాధించినను (వారి వాంఛలనేగాక) చివరకు నన్నే పొందుదురు. (23)

**అవ్యక్తం వ్యక్తిమాపన్నం మన్యంతే మామబుద్ధయః ।**
**పరం భావమజానంతో మమావ్యయమనుత్తమమ్ ॥ 24 ॥**

అవ్యక్తమ్, వ్యక్తిమ్, ఆపన్నమ్, మన్యంతే, మామ్, అబుద్ధయః,
పరమ్, భావమ్, అజానంతః, మమ, అవ్యయమ్, అనుత్తమమ్ ॥ 24 ॥

| | | | |
|---|---|---|---|
| మమ | = నాయొక్క | అవ్యక్తమ్ | = ఇంద్రియములకును, మనస్సునకును గోచరింపనివాడనైన |
| అనుత్తమమ్ | = అత్యుత్తమము | | |
| అవ్యయమ్ | = శాశ్వతము ఐన | | |
| | | మామ్ | = సచ్చిదానందఘన పరమాత్ముడనైన నన్ను |
| పరమ్, భావమ్ | = పరమభావమును | | |
| అబుద్ధయః | = బుద్ధిహీనులు | వ్యక్తిమ్, ఆపన్నమ్ | = సామాన్యవ్యక్తినిగా |
| అజానంతః | = ఎఱుంగనివారై | మన్యంతే | = తలంచెదరు |

నేను శాశ్వతుడను. సర్వోత్తముడను, ఇంద్రియములకును, మనస్సునకును గోచరింపనివాడను. నా పరమభావమును బుద్ధిహీనులు గ్రహింపక, ఇట్టి సచ్చిదానందఘనపరమాత్ముడనైన నన్ను సాధారణమనుష్యునిగా అనగా - జననమరణచక్రములోబడి పరిభ్రమించు వానినిగా తలంచెదరు. (24)

**నాహం ప్రకాశః సర్వస్య యోగమాయాసమావృతః ।**
**మూఢోఽయం నాభిజానాతి లోకో మామజమవ్యయమ్ ॥ 25 ॥**

న, అహమ్, ప్రకాశః, సర్వస్య, యోగమాయాసమావృతః,
మూఢః, అయమ్, న, అభిజానాతి, లోకః, మామ్, అజమ్, అవ్యయమ్ ॥ 25 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| యోగమాయా-సమావృతః | = | నా యోగమాయచే కప్పబడినవాడనై | మూఢః, లోకః | = | మూఢలోకము (అజ్ఞానులు) |
| అహమ్ | = | నేను | మామ్ | = | నన్ను |
| సర్వస్య | = | ప్రతివ్యక్తికిని | అజమ్ | = | జన్మరహితునిగా |
| ప్రకాశః, న | = | ప్రత్యక్షముగా గోచరించువాడను కాను | అవ్యయమ్ | = | శాశ్వతునిగా |
| | | | న, అభిజానాతి | = | తెలిసికొనలేదు (తెలిసికొనలేరు) |
| అయమ్ | = | ఈ | | | |

నా యోగమాయచేకప్పబడిన నేను అందరికిని గోచరింపను. కనుక, అజ్ఞానులు నన్ను జన్మరహితునిగా, శాశ్వతునిగా, పరమేశ్వరునిగా తెలిసికొనలేరు. (అనగా నన్ను జనన మరణములకు లోనగువానినిగా తలంతురు) (25)

**వేదాహం సమతీతాని వర్తమానాని చార్జున ।**
**భవిష్యాణి చ భూతాని మాం తు వేద న కశ్చన ॥ 26 ॥**

వేద, అహమ్, సమతీతాని, వర్తమానాని, చ, అర్జున,
భవిష్యాణి, చ, భూతాని, మామ్, తు, వేద, న, కశ్చన ॥ 26 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| అర్జున! | = | ఓ అర్జునా! | భూతాని | = | ప్రాణులనన్నింటిని గూర్చి |
| సమతీతాని | = | గతించిపోయినట్టివియు | అహమ్ | = | నేను |
| చ | = | మఱియు | వేద | = | ఎఱుంగుదును |
| వర్తమానాని | = | ప్రస్తుత కాలమునందు ఉన్నట్టివియు | తు | = | అయితే |
| | | | మామ్ | = | నన్ను |
| చ | = | మఱియు | కశ్చన | = | నాయందు శ్రద్ధలేనివాడు ఎవ్వడును |
| భవిష్యాణి | = | రాబోవుకాలమున జన్మించునట్టివియు ఐన | న వేద | = | ఎఱుంగడు |

ఓ అర్జునా! గతకాలమునకు చెందినట్టివియు, వర్తమాన (ప్రస్తుత) కాలము నందున్నట్టివియు, ఐన చరాచర ప్రాణులన్నింటిని నేను ఎఱుగుదును. అంతేకాదు, రాబోవుకాలమున ప్రభవించు (జన్మించు) ప్రాణులనుగూర్చియు నేను ఎఱుగుదును. కాని, నాయందు భక్తిశ్రద్ధలుగలవారుతప్ప వేరెవ్వరును నన్ను ఎఱుగజాలరు. (26)

**ఇచ్ఛాద్వేషసముత్థేన ద్వంద్వమోహేన భారత ।**
**సర్వభూతాని సమ్మోహం సర్గే యాంతి పరంతప ॥ 27 ॥**

ఇచ్ఛాద్వేషసముత్థేన, ద్వంద్వమోహేన, భారత,
సర్వభూతాని, సమ్మోహమ్, సర్గే, యాంతి, పరంతప ॥ 27 ॥

| | | | |
|---|---|---|---|
| భారత! | = ఓ భరతవంశీ! | సర్వభూతాని | = సమస్తప్రాణులును |
| పరంతప! | = ఓ అర్జునా! | | |
| సర్గే | = (ఈ) జగత్తునందు | సమ్మోహమ్ | = అంతులేని వ్యామోహమును |
| ఇచ్ఛాద్వేషసముత్థేన | = రాగద్వేషములవలన కలిగిన | | |
| ద్వంద్వ-మోహేన | = సుఖదుఃఖాదిద్వంద్వముల ప్రభావమున మోహ కారణముగ | యాంతి | = పొందుచున్నవి |

భరతవంశీ! ఓ అర్జునా! జగత్తునందు ప్రాణులన్నియును రాగద్వేషముల వలన కలిగిన సుఖదుఃఖాదిద్వంద్వముల ప్రభావమున అంతులేని మోహములో పడిపోవుచున్నవి. (27)

**యేషాం త్వంతగతం పాపం జనానాం పుణ్యకర్మణామ్ ।**
**తే ద్వంద్వమోహనిర్ముక్తా భజంతే మాం దృఢవ్రతాః ॥ 28 ॥**

యేషామ్, తు, అంతగతమ్, పాపమ్, జనానామ్, పుణ్యకర్మణామ్,
తే, ద్వంద్వమోహనిర్ముక్తాః, భజంతే, మామ్, దృఢవ్రతాః ॥ 28 ॥

| | | | |
|---|---|---|---|
| తు | = కాని | ద్వంద్వ మోహ నిర్ముక్తాః | = రాగద్వేషజనితములైన సుఖదుఃఖాదిద్వంద్వ రూపమోహముల నుండి విముక్తులై |
| పుణ్య-కర్మణామ్ | = నిష్కామభావముతో పుణ్యకర్మలను ఆచరించు | | |
| యేషామ్, జనానామ్ | = ఏ పురుషులయొక్క | దృఢవ్రతాః | = దృఢనిశ్చయము గలవారై |
| పాపమ్ | = పాపము(లు) | | |
| అంతగతమ్ | = నశించిపోవునో | మామ్ | = నన్ను |
| తే | = అట్టివారు (అట్టిభక్తులు) | భజంతే | = భజింతురు |

కాని, నిష్కామభావముతో పుణ్యకర్మలను ఆచరించు పురుషులపాపములు రూపుమాసిపోవును(నశించును). అట్టివారు రాగద్వేషజనితములైన సుఖదుఃఖాది ద్వంద్వ రూపమోహములనుండి విముక్తులయ్యెదరు. దృఢనిశ్చయముగల్గిన అట్టి భక్తులు అన్నివిధముల నన్నే భజింతురు. (28)

**జరామరణమోక్షాయ మామాశ్రిత్య యతంతి యే ।**
**తే బ్రహ్మ తద్విదుః కృత్స్నమ్ అధ్యాత్మం కర్మ చాఖిలమ్ ॥ 29 ॥**

జరామరణమోక్షాయ, మామ్, ఆశ్రిత్య, యతంతి, యే,
తే, బ్రహ్మ, తత్, విదుః, కృత్స్నమ్, అధ్యాత్మమ్, కర్మ, చ, అఖిలమ్ ॥ 29 ॥

| | | | |
|---|---|---|---|
| యే | = ఏ పురుషులు | తే | = వారు (ఆపురుషులు) |
| మామ్ | = నన్ను | తత్, బ్రహ్మ | = ఆ పరబ్రహ్మను |
| ఆశ్రిత్య | = ఆశ్రయించి (శరణుపొంది) | కృత్స్నమ్, అధ్యాత్మమ్ | = సంపూర్ణమైన అధ్యాత్మమును |
| జరామరణ-మోక్షాయ | = జరామరణములనుండి విముక్తికై | చ | = మఱియు |
| యతంతి | = ప్రయత్నింతురో | అఖిలమ్, కర్మ | = సంపూర్ణ కర్మమును |
| | | విదుః | = తెలిసికొందురు |

నన్ను శరణుపొంది జరామరణవిముక్తికై ప్రయత్నించు పురుషులు ఆ పరబ్రహ్మను, సమస్త - అధ్యాత్మమును, సంపూర్ణ కర్మను తెలిసికొందురు. (29)

**సాధిభూతాధిదైవం మాం సాధియజ్ఞం చ యే విదుః ।**
**ప్రయాణకాలేఽపి చ మాం తే విదుర్యుక్తచేతసః ॥ 30 ॥**

సాధిభూతాధిదైవమ్, మామ్, సాధియజ్ఞమ్, చ, యే, విదుః,
ప్రయాణకాలే, అపి, చ, మామ్, తే, విదుః, యుక్తచేతసః ॥ 30 ॥

| | | | |
|---|---|---|---|
| యే | = ఏ పురుషులు | మామ్ | = నన్ను |
| సాధిభూతాధి-దైవమ్ | = అధిభూత - అధిదైవములతో | ప్రయాణకాలే, అపి | = ప్రయాణకాలము నందైనను (అవసానసమయమున నైనను) |
| చ | = మఱియు | | |
| సాధియజ్ఞమ్ | = అధియజ్ఞముతో గూడిన (అందఱికినీ ఆత్మరూపుడనైయున్న) | | |

| | | | | | |
|---|---|---|---|---|---|
| విదుః[1] | = | ఎఱుంగుదురో | మామ్, చ | = | నన్నే |
| తే | = | వారు (ఆ పురుషులు) | విదుః | = | ఎఱుంగుదురు (పొందుదురు) |
| యుక్తచేతసః | = | నిశ్చలబుద్ధిగలవారై | | | |

అధిభూత, అధిదైవ, అధియజ్ఞములతోపాటు అందరికినీ ఆత్మరూపుడనైన నన్ను అంత్యకాలమునందైనను తెలిసికొనువారు నిశ్చలబుద్ధితో నన్నే చేరుదురు. (30)

*ఓం తత్సదితి శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే జ్ఞాన విజ్ఞాన యోగో నామ సప్తమోఽధ్యాయః ॥ ౭ ॥*

---

1. ఆవిరి, మేఘము, ఎండ, నీరు, మంచు - ఇవి అన్నియును జలస్వరూపములు అట్లే అధిభూత, అధిదైవ, అధియజ్ఞాదులు అన్నియును వాసుదేవ స్వరూపములు అను ఈ విషయములను ఎఱిగినవారు.

॥ ఓం శ్రీపరమాత్మనే నమః ॥

# అథ అష్టమోఽధ్యాయః - అక్షరబ్రహ్మయోగః

## (ఎనిమిదవ అధ్యాయము-అక్షరబ్రహ్మయోగము)

ముఖ్యాంశములు : [(1 నుండి 7వ శ్లోకమువఱకు) బ్రహ్మ, అధ్యాత్మము, కర్మ మొదలగు విషయములనుగూర్చి అర్జునుని 7 ప్రశ్నలు-వాటికి సమాధానములు- (8 నుండి 22 వఱకు) భక్తియోగవిషయము - (23 నుండి 28 వఱకు) శుక్లకృష్ణమార్గములవివరణము.]

**అర్జున ఉవాచ**

**కిం తద్బ్రహ్మ కిమధ్యాత్మం కిం కర్మ పురుషోత్తమ ।**
**అధిభూతం చ కిం ప్రోక్తమ్ అధిదైవం కిముచ్యతే ॥ 1 ॥**

కిమ్, తత్, బ్రహ్మ, కిమ్, అధ్యాత్మమ్, కిమ్, కర్మ, పురుషోత్తమ,
అధిభూతమ్, చ, కిమ్, ప్రోక్తమ్, అధిదైవమ్, కిమ్, ఉచ్యతే ॥ 1 ॥

| | | | |
|---|---|---|---|
| పురుషోత్తమ! | = ఓ పురుషోత్తమా! | కిమ్ | = ఏమి |
| తత్ | = ఆ | అధిభూతమ్ | = అధిభూతము-అని |
| బ్రహ్మ | = బ్రహ్మము అనగా | కిమ్, ప్రోక్తమ్ | = ఏది చెప్పబడినది |
| కిమ్ | = ఏమి? | | |
| అధ్యాత్మమ్ | = అధ్యాత్మము-అనగా | చ | = మఱియు |
| కిమ్ | = ఏమి? | అధిదైవమ్ | = అధిదైవము-అని |
| కర్మ | = కర్మ అనగా | కిమ్, ఉచ్యతే | = ఏది చెప్పబడును? |

అర్జునుడు పలికెను- ఓపురుషోత్తమా! బ్రహ్మ-అనగానేమి? అధ్యాత్మము అనగానేమి? కర్మఅనగా నేమి? అధిభూతము అని దేనికి పేరు? అధిదైవము అని దేనిని అందురు. (1)

**అధియజ్ఞః కథం కోఽత్ర దేహేఽస్మిన్ మధుసూదన ।**
**ప్రయాణకాలే చ కథం జ్ఞేయోఽసి నియతాత్మభిః ॥ 2 ॥**

అధియజ్ఞః, కథమ్, కః, అత్ర, దేహే, అస్మిన్, మధుసూదన,
ప్రయాణకాలే, చ, కథమ్, జ్ఞేయః, అసి, నియతాత్మభిః ॥ 2 ॥

| | | | |
|---|---|---|---|
| మధుసూదన! | = ఓ మధుసూదనా! | అధియజ్ఞః | = అధియజ్ఞము అనగా |
| అత్ర | = ఇచట | కః | = ఏమి? |

| | | | | | |
|---|---|---|---|---|---|
| అస్మిన్ | = | ఈ | నియతాత్మభిః | = | మనస్సును పరమాత్మని యందు లగ్నము చేసిన యోగులచే |
| దేహే | = | దేహమునందు | కథమ్ | = | ఎట్లు |
| కథమ్ | = | (అది) ఎట్లుండును? | జ్ఞేయః, అసి | = | (నీవు) తెలిసికొన బడుదువు. |
| చ | = | మఱియు | | | |
| ప్రయాణకాలే | = | అంత్యకాలమున | | | |

ఓ మధుసూదనా! 'అధియజ్ఞము' అనగానేమి? ఆ అధియజ్ఞము ఈ శరీరమునందు ఎట్లుండును? అంత్యకాలమున మనస్సును పరమాత్మయందు లగ్నముచేసిన యోగులు నిన్నెట్లుతెలిసికొనగలరు? (2)

**శ్రీభగవాన్ ఉవాచ**

**అక్షరం బ్రహ్మ పరమం స్వభావోఽధ్యాత్మముచ్యతే ।**
**భూతభావోద్భవకరో విసర్గః కర్మసంజ్ఞితః ॥ 3 ॥**

అక్షరమ్, బ్రహ్మ, పరమమ్, స్వభావః, అధ్యాత్మమ్, ఉచ్యతే,
భూతభావోద్భవకరః, విసర్గః, కర్మసంజ్ఞితః ॥ 3 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| పరమమ్ | = | సర్వశ్రేష్ఠుడైన | ఉచ్యతే | = | చెప్పబడును |
| అక్షరమ్ | = | శాశ్వతుడైన, పురుషోత్తముని | భూత-భావోద్భవకరః | = | సకల ప్రాణుల ఉత్పత్తి అభ్యుదయములకు కారణమైన |
| బ్రహ్మ | = | బ్రహ్మము అని అందురు | | | |
| స్వభావః | = | స్వస్వరూపము అనగా జీవాత్మ | విసర్గః | = | త్యాగ (సృష్టించు) క్రియయే |
| అధ్యాత్మమ్ | = | అధ్యాత్మము-అని | 'కర్మ' సంజ్ఞితః | = | 'కర్మ'యనబడును |

శ్రీ భగవానుడు పలికెను - బ్రహ్మమనగా సర్వశ్రేష్ఠుడు, శాశ్వతుడు. అధ్యాత్మము అనగా స్వస్వరూపము అనగా జీవాత్మ. పరమాత్మయందు లీనమైన సకల భూతములను బహిర్గతమొనర్చి, వాటి ఉత్పత్తి- అభ్యుదయములకు కారణమైన చేష్టను అనగా- సృష్ట్యాదికర్మలను కర్మయందురు. (3)

**అధిభూతం క్షరో భావః పురుషశ్చాధిదైవతమ్ ।**
**అధియజ్ఞోఽహమేవాత్ర దేహే దేహభృతాం వర ॥ 4 ॥**

అధిభూతమ్, క్షరః, భావః, పురుషః, చ, అధిదైవతమ్,
అధియజ్ఞః, అహమ్, ఏవ, అత్ర, దేహే, దేహభృతామ్, వర ॥ 4 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| దేహభృతామ్ వర! | = | దేహధారులలో శ్రేష్ఠుడవైన ఓ అర్జునా! | అధిదైవతమ్ | = | అధిదైవము |
| | | | చ | = | మఱియు |
| భావః, క్షరః | = | ఉత్పత్తి, వినాశశీలములైన పదార్థములన్నియును | అత్ర, దేహే | = | ఈ దేహము(ల)లో అంతర్యామిగానున్న |
| అధిభూతమ్ | = | అధిభూతములు అనబడును | అహమ్, ఏవ | = | నేనే (వాసుదేవుడనే) |
| పురుషః[1] | = | హిరణ్మయుడైన పురుషుడు | అధియజ్ఞః | = | అధియజ్ఞమును |

ఉత్పత్తి వినాశశీలములైన పదార్థములు అన్నియును అధిభూతములు అనబడును. హిరణ్మయుడైన పురుషుడు అధిదైవము - దేహధారులలో శ్రేష్ఠుడవైన ఓ అర్జునా! ఈ శరీరములలో అంతర్యామిగా ఉన్న నేనే - వాసుదేవుడనే అధియజ్ఞమును. (4)

**అంతకాలే చ మామేవ స్మరన్ ముక్త్వా కలేవరమ్ ।**
**యః ప్రయాతి స మద్భావం యాతి నాస్త్యత్ర సంశయః ॥ 5 ॥**

అంతకాలే, చ, మామ్, ఏవ, స్మరన్, ముక్త్వా, కలేవరమ్,
యః, ప్రయాతి, సః, మద్భావమ్, యాతి, న, అస్తి, అత్ర, సంశయః ॥ 5 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| యః | = | ఎవడు | సః | = | ఆపురుషుడు |
| అంతకాలే, చ | = | అంత్యకాలమునందును | మద్భావమ్ | = | నాస్వరూపమునే (నన్నే) |
| మామ్, ఏవ | = | నన్నే | | | |
| స్మరన్ | = | స్మరించుచు | యాతి | = | పొందును |
| కలేవరమ్ | = | శరీరమును | అత్ర | = | ఈ విషయమున |
| ముక్త్వా | = | వీడి | సంశయః | = | సందేహము |
| ప్రయాతి | = | పోవునో | న, అస్తి | = | లేదు |

అంత్యకాలమునందైనను నన్నే స్మరించుచు దేహత్యాగమును చేసినవాడు నన్నే (నాస్వరూపమునే) పొందును. ఇందేమాత్రముగూడ సందేహము లేదు. (5)

1. శాస్త్రములయందు ఇతడు సూత్రాత్మ, హిరణ్యగర్భుడు,ప్రజాపతి, బ్రహ్మ, మొదలగు పేర్లతో పేర్కొనబడెను.

**యం యం వాపి స్మరన్ భావం త్యజత్యంతే కలేవరమ్ ।**
**తం తమేవైతి కౌంతేయ సదా తద్భావభావితః ॥ 6 ॥**

యమ్, యమ్, వా, అపి, స్మరన్, భావమ్, త్యజతి, అంతే, కలేవరమ్,
తమ్, తమ్, ఏవ, ఏతి, కౌంతేయ, సదా, తద్భావభావితః ॥ 6 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| కౌంతేయ! | = | ఓ కుంతీసుతా! | త్యజతి | = | త్యజించునో |
| అంతే | = | (ఏమనుష్యుడు) అంత్యకాలమునందు | తమ్, తమ్, ఏవ | = | ఆయా స్వరూపములనే |
| యమ్, యమ్ | = | ఏయే | ఏతి | = | పొందును |
| భావమ్, వా, అపి | = | భావము(ల)ను | సదా | = | (ఏలనన) నిరంతరము |
| స్మరన్ | = | స్మరించుచు | తద్భావభావితః | = | (అతడు) ఆభావములచే ప్రభావితుడు అగును |
| కలేవరమ్ | = | శరీరమును | | | |

కౌంతేయా! మనుష్యుడు అవసానదశయందు ఏఏభావములను స్మరించుచు దేహత్యాగము చేయునో, అతడు మఱుజన్మలో ఆయాస్వరూపములనే పొందును. ఏలనన, సర్వదా అతడు దానినే స్మరించుచుండెను. (6)

**తస్మాత్ సర్వేషు కాలేషు మామనుస్మర యుధ్య చ ।**
**మయ్యర్పితమనోబుద్ధిః మామేవైష్యస్యసంశయమ్ ॥ 7 ॥**

తస్మాత్, సర్వేషు, కాలేషు, మామ్, అనుస్మర, యుధ్య, చ,
మయి, అర్పితమనోబుద్ధిః, మామ్, ఏవ, ఏష్యసి, అసంశయమ్ ॥ 7 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| తస్మాత్ | = | అందువలన (ఓ అర్జునా!) | మయి | = | నాయందే |
| సర్వేషు | = | సమస్తమైన | అర్పిత-మనోబుద్ధిః | = | మనస్సును, బుద్ధిని నిమగ్నమొనర్చిన వాడవై |
| కాలేషు | = | కాలములయందును | | | |
| మామ్ | = | నన్ను | | | |
| అనుస్మర | = | స్మరించుచుండుము | అసంశయమ్ | = | నిస్సందేహముగా |
| చ | = | మఱియు | మామ్,ఏవ | = | నన్నే |
| యుధ్య | = | యుద్ధమును చేయుము | ఏష్యసి | = | పొందగలవు |

కావున, ఓ అర్జునా! నీవు సర్వదా నన్నే స్మరించుచుండుము. యుద్ధమును(కర్తవ్యకర్మను) కూడ చేయుము. ఈవిధముగా నీ మనోబుద్ధులను నాయందే నిల్పియున్నచో నిజముగా (నిస్సందేహముగా) నన్నే పొందెదవు. (7)

**అభ్యాసయోగయుక్తేన చేతసా నాన్యగామినా ।**
**పరమం పురుషం దివ్యం యాతి పార్థానుచింతయన్ ॥ 8 ॥**

అభ్యాసయోగయుక్తేన, చేతసా, న, అన్యగామినా,
పరమమ్, పురుషమ్, దివ్యమ్, యాతి, పార్థ, అనుచింతయన్ ॥ 8 ॥

పార్థ! = ఓ పార్థా!
అభ్యాసయోగ-యుక్తేన = పరమేశ్వరుని ధ్యానయోగసాధనయందే నిమగ్నమైన
న, అన్యగామినా = మఱియొక విషయమునే చింతింపనట్టి
చేతసా = మనస్సుతో
(పురుషః = మనుష్యుడు)
అనుచింతయన్ = అనుక్షణము స్మరించుచు
పరమమ్ = సర్వశ్రేష్ఠుడైన
దివ్యమ్, పురుషమ్ = ఆపురుషోత్తముని
యాతి = పొందును

మనస్సును ఎటూ పోనీయక (వేరే ధ్యాస ఏ మాత్రమూ లేకుండ) నిరంతరము పరమేశ్వరునిధ్యానరూపయోగమునే సాధనచేయు మనుష్యుడు దివ్యపురుషుడైన పరమాత్మనే చేరును. (8)

**కవిం పురాణమనుశాసితారమ్**
**అణోరణీయాంసమనుస్మరేద్యః ।**
**సర్వస్య ధాతారమచింత్యరూపమ్**
**ఆదిత్యవర్ణం తమసః పరస్తాత్ ॥ 9 ॥**

కవిమ్, పురాణమ్, అనుశాసితారమ్, అణోః, అణీయాంసమ్,అనుస్మరేత్, యః,
సర్వస్య, ధాతారమ్, అచింత్యరూపమ్, ఆదిత్యవర్ణమ్, తమసః, పరస్తాత్ ॥ 9 ॥

యః = ఏ పురుషుడు
కవిమ్ = సర్వజ్ఞుడును
పురాణమ్ = అనాదియు
అనుశాసితారమ్[1] = అందఱిని శాసించువాడును
అణోః = అణువుకంటెను
అణీయాంసమ్ = సూక్ష్మమైనవాడును
సర్వస్య, ధాతారమ్ = సకలప్రాణులను ధరించి, పోషించువాడును
అచింత్యరూపమ్ = అచింత్యరూపుడును
ఆదిత్యవర్ణమ్ = సూర్యుని వలె నిత్యచేతన ప్రకాశరూపుడును
తమసః, పరస్తాత్ = అజ్ఞానమును పారద్రోలువాడును ఐన సచ్చిదానంద ఘనపరమాత్మను
అనుస్మరేత్ = అనుక్షణము స్మరించునో.....

1. అంతర్యామి రూపముతో సర్వప్రాణుల శుభాశుభకర్మలను అనుసరించి శాసించువాడు

సర్వజ్ఞుడును, సనాతనుడును, అందరిని శాసించువాడును, అణువుకంటెను సూక్ష్మమైనవాడును, అందరిని పోషించువాడును, అచింత్య రూపుడును, సూర్యుని వలె నిత్యచేతన ప్రకాశరూపుడును, అజ్ఞానాంధకారమును పారద్రోలువాడును ఐన సచ్చిదానంద ఘనపరమేశ్వరుని స్మరించువాడగు.... (9)

**ప్రయాణకాలే మనసాచలేన**
**భక్త్యా యుక్తో యోగబలేన చైవ ।**
**భ్రువోర్మధ్యే ప్రాణమావేశ్య సమ్యక్**
**స తం పరం పురుషముపైతి దివ్యమ్ ॥ 10 ॥**

ప్రయాణకాలే, మనసా, అచలేన, భక్త్యా, యుక్తః, యోగబలేన, చ, ఏవ,
భ్రువోః, మధ్యే, ప్రాణమ్, ఆవేశ్య, సమ్యక్, సః, తమ్, పరమ్, పురుషమ్, ఉపైతి, దివ్యమ్ ॥ 10 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| సః | = | అట్టి | చ | = | మఱియు |
| భక్త్యా, యుక్తః | = | భక్తిగలపురుషుడు | అచలేన | = | నిశ్చలమైన |
| ప్రయాణకాలే | = | అంత్యకాలమున | మనసా | = | మనస్సుతో |
| యోగబలేన | = | యోగబలముచే | (స్మరన్) | = | (స్మరించుచు) |
| భ్రువోః, మధ్యే | = | భ్రూమధ్య ప్రదేశమున | తమ్ | = | ఆ |
| | | | దివ్యమ్ | = | దివ్యుడును |
| ప్రాణమ్ | = | ప్రాణమును | పరమ్, పురుషమ్, ఏవ | = | పరమపురుషుడును ఐన పరమాత్మనే |
| సమ్యక్ | = | చక్కగా | | | |
| ఆవేశ్య | = | నిలిపి | ఉపైతి | = | పొందు(చేరు)ను |

అట్టి పరమభక్తుడు అంత్యకాలమునందు యోగబలము చేత భ్రుకుటీ మధ్యమున ప్రాణములను స్థిరముగా నిల్పి, నిశ్చలమైన మనస్సుతో స్మరించుచు దివ్యస్వరూపుడును, పరమపురుషుడును ఐన పరమాత్మనే చేరును. (10)

**యదక్షరం వేదవిదో వదంతి**
**విశంతి యద్యతయో వీతరాగాః ।**
**యదిచ్ఛంతో బ్రహ్మచర్యం చరంతి**
**తత్తే పదం సంగ్రహేణ ప్రవక్ష్యే ॥ 11 ॥**

యత్, అక్షరమ్, వేదవిదః, వదంతి, విశంతి, యత్, యతయః వీతరాగాః,
యత్, ఇచ్ఛంతః, బ్రహ్మచర్యమ్, చరంతి, తత్, తే, పదమ్, సంగ్రహేణ, ప్రవక్ష్యే ॥ 11 ॥

| | | |
|---|---|---|
| వేదవిదః | = | వేదవిదులైన విద్వాంసులు |
| యత్ | = | ఏ సచ్చిదానందఘన పరమాత్మను |
| అక్షరమ్ | = | శాశ్వతునిగా |
| వదంతి | = | చెప్పుదురో |
| వీతరాగాః | = | ఆసక్తిరహితులైన |
| యతయః | = | యత్నశీలురైన సన్న్యాసులు |
| యత్ | = | ఏపరమపదమును |
| విశంతి | = | ప్రవేశించుచున్నారో |
| యత్ | = | ఏ పరమపదమును |
| ఇచ్ఛంతః | = | కోరుకొనువారై బ్రహ్మచారులు |
| బ్రహ్మచర్యమ్ | = | బ్రహ్మచర్య వ్రతమును |
| చరంతి | = | ఆచరించుచున్నారో |
| తత్ | = | అట్టి |
| పదమ్ | = | పరమపదమును గూర్చి |
| తే | = | నీకు |
| సంగ్రహేణ | = | సంక్షిప్తముగా |
| ప్రవక్ష్యే | = | చెప్పెదను |

వేదవిదులైన విద్వాంసులు ఆ సచ్చిదానందఘనపరమాత్మను శాశ్వతుడు (అక్షరుడు) అని ప్రస్తుతింతురు. ఆసక్తిరహితులై యత్నశీలురైన సన్న్యాసులు ఆ పరమపదమునందే ప్రవేశింతురు. ఆ పరమపదమును కోరియే బ్రహ్మచారులు బ్రహ్మచర్య వ్రతమును ఆచరింతురు. అట్టి పరమపదమునుగూర్చి సంక్షిప్తముగా నేను నీకు వివరింతును. (11)

**సర్వద్వారాణి సంయమ్య మనో హృది నిరుధ్య చ ।**
**మూర్ధ్న్యాధాయాత్మనః ప్రాణమ్ ఆస్థితో యోగధారణామ్ ॥ 12 ॥**
**ఓమిత్యేకాక్షరం బ్రహ్మ వ్యాహరన్ మామనుస్మరన్ ।**
**యః ప్రయాతి త్యజన్ దేహం స యాతి పరమాం గతిమ్ ॥ 13 ॥**

సర్వద్వారాణి, సంయమ్య, మనః, హృది, నిరుధ్య, చ,
మూర్ధ్ని, ఆధాయ, ఆత్మనః, ప్రాణమ్, ఆస్థితః, యోగధారణామ్ ॥ 12 ॥
ఓమ్, ఇతి, ఏకాక్షరమ్, బ్రహ్మ, వ్యాహరన్, మామ్, అనుస్మరన్,
యః, ప్రయాతి, త్యజన్, దేహమ్, సః, యాతి, పరమామ్, గతిమ్ ॥ 13 ॥

| | | |
|---|---|---|
| సర్వద్వారాణి | = | సర్వేంద్రియములను |
| సంయమ్య | = | నిగ్రహించి |
| చ | = | అట్లే |
| మనః | = | మనస్సును |
| హృది | = | హృదయమునందు |
| నిరుధ్య | = | స్థిరమొనర్చి |
| ప్రాణమ్ | = | (అట్లు వశమైనమనస్సు ద్వారా) ప్రాణమును |
| మూర్ధ్ని | = | మూర్ధస్థానము (సహస్రారము) నందు |

| | | | | | |
|---|---|---|---|---|---|
| ఆధాయ | = | స్థిరముగా ఉంచి | మామ్ | = | నిర్గుణ పరబ్రహ్మనైన నన్ను |
| ఆత్మనః | = | పరమాత్మ యొక్క | అనుస్మరన్ | = | చింతనచేయుచు |
| యోగధారణామ్ | = | ధ్యానమునందే | దేహమ్ | = | శరీరమును |
| ఆస్థితః | = | నిమగ్నుడై | త్యజన్ | = | త్యజించుచు |
| యః | = | ఏపురుషుడు | ప్రయాతి | = | వెళ్ళిపోవుచున్నాడో |
| ఓమ్, ఇతి | = | 'ఓమ్' అను | సః | = | ఆపురుషుడు |
| ఏకాక్షరమ్ బ్రహ్మ | = | ఏకాక్షరరూప బ్రహ్మమును | పరమామ్,గతిమ్ | = | పరమగతిని |
| వ్యాహరన్ | = | ఉచ్చరించుచు | యాతి | = | పొందును |

సర్వేంద్రియములను నిగ్రహించి, మనస్సును హృదయమునందే స్థిరముగా నిలిపి, అట్లు వశమైన మనస్సుద్వారా ప్రాణములను మూర్ధస్థానమునందు (సహస్రారమునందు) స్థిరమొనర్చి, పరమాత్మధ్యానమునందే నిమగ్నుడై, అక్షర బ్రహ్మస్వరూపమైన ఓంకారమును ఉచ్చరించుచు, ఆ ఓంకారమునకు అర్థస్వరూపుడను, నిర్గుణబ్రహ్మను ఐన నన్ను చింతించుచు దేహత్యాగ మొనర్చువాడు పరమగతిని (మోక్షమును) పొందును. (12,13)

**అనన్యచేతాః సతతం యో మాం స్మరతి నిత్యశః ।**
**తస్యాహం సులభః పార్థ నిత్యయుక్తస్య యోగినః ॥ 14 ॥**

అనన్యచేతాః, సతతమ్, యః, మామ్, స్మరతి, నిత్యశః,
తస్య, అహమ్, సులభః, పార్థ, నిత్యయుక్తస్య, యోగినః ॥ 14 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| పార్థ! | = | ఓపార్థా! | స్మరతి | = | స్మరించునో |
| యః | = | ఏయోగి | తస్య | = | ఆ |
| (మయి) | = | (నాయందు) | నిత్యయుక్తస్య | = | సంతతము మత్పరాయణుడైన |
| అనన్యచేతాః | = | అనన్యచిత్తుడై | యోగినః | = | యోగికి |
| నిత్యశః | = | సర్వదా | అహమ్ | = | నేను |
| సతతమ్ | = | నిరంతరము | సులభః | = | సులభుడను (సులభముగా లభింతును) |
| మామ్ | = | పురుషోత్తముడనైననన్ను | | | |

పార్థా! నిత్యము నిరంతరము అనన్యభావముతో చిత్తమును నాయందే నిలిపి, పురుషోత్తముడనైన నన్నే స్మరించుచు, సంతతము మత్పరాయణుడైన యోగికి నేను సులభుడను. అనగా అతనికి సహజముగనే నేను లభింతును. (14)

**మాముపేత్య పునర్జన్మ దుఃఖాలయమశాశ్వతమ్ ।**
**నాప్నువంతి మహాత్మానః సంసిద్ధిం పరమాం గతాః ॥ 15 ॥**

మామ్, ఉపేత్య, పునర్జన్మ, దుఃఖాలయమ్, అశాశ్వతమ్,
న, ఆప్నువంతి, మహాత్మానః, సంసిద్ధిమ్, పరమామ్, గతాః ॥ 15 ॥

| | | | |
|---|---|---|---|
| పరమామ్ | = అత్యుత్తమమైన | ఉపేత్య | = పొంది (పొందిన పిమ్మట) |
| సంసిద్ధిమ్ | = సిద్ధిని | దుఃఖాలయమ్ | = దుఃఖములకు నిలయమైన |
| గతాః | = పొందినట్టి | అశాశ్వతమ్ | = క్షణభంగురమైన |
| మహాత్మానః | = మహాత్ములు | పునర్జన్మ | = పునర్జన్మను |
| మామ్ | = నన్ను | న, ఆప్నువంతి | = పొందనే పొందరు |

పరమసిద్ధిని పొందిన మహాత్ములు నన్ను చేరిన పిదప, దుఃఖములకు నిలయమైన, క్షణభంగురమైన పునర్జన్మను పొందరు. (15)

**ఆబ్రహ్మభువనాల్లోకాః పునరావర్తినోఽర్జున ।**
**మాముపేత్య తు కౌంతేయ పునర్జన్మ న విద్యతే ॥ 16 ॥**

ఆబ్రహ్మభువనాత్, లోకాః, పునరావర్తినః, అర్జున,
మామ్, ఉపేత్య, తు, కౌంతేయ, పునర్జన్మ, న, విద్యతే ॥ 16 ॥

| | | | |
|---|---|---|---|
| అర్జున! | = ఓ అర్జునా! | తు, కౌంతేయ! | = అయితే ఓ అర్జునా! |
| ఆబ్రహ్మ-భువనాత్ | = బ్రహ్మలోక పర్యంతముగల | మామ్ | = నన్ను |
| | | ఉపేత్య | = పొందుట వలన |
| లోకాః | = సమస్తలోకములును | పునర్జన్మ | = పునర్జన్మ |
| పునరావర్తినః[1] | = పునరావృత్తములు | న, విద్యతే | = ఉండదు |

అర్జునా! బ్రహ్మలోకపర్యంతము ఉన్న సమస్తలోకములును పునరావృత్తములు. కౌంతేయా! (ఈలోకములన్నియును కాలమునకు పరిమితమైనవి. కాని నేను కాలాతీతుడను) కనుక, నన్ను చేరినవానికి పునర్జన్మ యుండదు. (16)

1. *వీనిని పొంది, మరల ఈ లోకమునకు తిరిగి రావలసియే యుండును*

**సహస్రయుగపర్యంతమ్ అహర్యద్బ్రహ్మణో విదుః ।**
**రాత్రిం యుగసహస్రాంతాం తేఽహోరాత్రవిదో జనాః ॥ 17 ॥**

సహస్రయుగపర్యంతమ్, అహః, యత్, బ్రహ్మణః, విదుః,
రాత్రిమ్, యుగసహస్రాంతామ్, తే, అహోరాత్రవిదః, జనాః ॥ 17 ॥

| | | |
|---|---|---|
| యత్ | = | ఏది |
| సహస్రయుగ పర్యంతమ్ | = | వేయిచతుర్యుగముల కాలము |
| బ్రహ్మణః | = | బ్రహ్మకు |
| అహః | = | పగలు-అనియు |
| (యామ్) | = | ఏది |
| యుగసహస్రాంతామ్ | = | అట్టి వేయి చతుర్యుగముల కాలమును |
| రాత్రిమ్ | = | 'రాత్రి' నిగాను |
| (యే) | = | ఏ పురుషులు |
| విదుః[1] | = | ఎఱుంగుదురో |
| తే, జనాః | = | అట్టి యోగులు |
| అహోరాత్రవిదః | = | కాలతత్త్వమును నిజముగా నెఱిగినవారు |

వేయి చతుర్యుగముల కాలము బ్రహ్మకు ఒక 'పగలు' అనియు, అంతేకాలము ఆ బ్రహ్మకు ఒక 'రాత్రి' యనియు తెలిసిన యోగులు కాలతత్త్వమును నిజముగా నెఱిగినవారు. (17)

**అవ్యక్తాద్వ్యక్తయః సర్వాః ప్రభవంత్యహరాగమే ।**
**రాత్ర్యాగమే ప్రలీయంతే తత్రైవావ్యక్తసంజ్ఞకే ॥ 18 ॥**

అవ్యక్తాత్, వ్యక్తయః, సర్వాః, ప్రభవంతి, అహరాగమే,
రాత్ర్యాగమే ప్రలీయంతే, తత్ర, ఏవ, అవ్యక్తసంజ్ఞకే ॥ 18 ॥

| | | |
|---|---|---|
| సర్వాః, వ్యక్తయః | = | చరాచర ప్రాణులన్నియును |
| అహరాగమే | = | బ్రహ్మయొక్క పగటికాలము ప్రారంభముకాగానే |
| అవ్యక్తాత్ | = | అవ్యక్తమునుండి |
| ప్రభవంతి | = | ఉత్పన్నములు (ప్రకటితములు) అగును మఱియు |
| రాత్ర్యాగమే | = | బ్రహ్మయొక్క రాత్రి కాలము ప్రారంభము కాగానే |
| తత్ర, అవ్యక్తసంజ్ఞకే, ఏవ | = | అవ్యక్తమను పేరుగల బ్రహ్మము యొక్క సూక్ష్మ శరీరమునందే |
| ప్రలీయంతే | = | లీనమగును |

1. కాలావధియుండుటవలన బ్రహ్మలోకముగూడా అనిత్యమనియే తెలియదగును.

చరాచరప్రాణులన్నియును బ్రహ్మయొక్క పగటి కాలము ప్రారంభము కాగానే అవ్యక్తమునుండి అనగా, బ్రహ్మయొక్క సూక్ష్మశరీరమునుండి ఉత్పన్నములగును. (ప్రకటితములగును). మఱల బ్రహ్మయొక్క రాత్రికాలము ప్రారంభసమయమున అవి అదే అవ్యక్తమునందు లీనమగును. (18)

**భూతగ్రామః స ఏవాయం భూత్వా భూత్వా ప్రలీయతే ।**
**రాత్ర్యాగమేఽవశః పార్థ ప్రభవత్యహరాగమే ॥ 19 ॥**

భూతగ్రామః, సః, ఏవ, అయమ్, భూత్వా, భూత్వా, ప్రలీయతే,
రాత్ర్యాగమే, అవశః, పార్థ, ప్రభవతి, అహరాగమే ॥ 19 ॥

| | | | |
|---|---|---|---|
| **పార్థ!** | = అర్జునా! | **అవశః** | = ప్రకృతివశమున |
| **సః, ఏవ** | = అట్టి (ఉపర్యుక్తమైన) | **రాత్ర్యాగమే** | = రాత్రి ప్రవేశకాలమునందు |
| **అయమ్** | = ఈ | **ప్రలీయతే** | = లీనమగును మరియు |
| **భూతగ్రామః** | = భూతసముదాయము | **అహరాగమే** | = దినప్రవేశ కాలమునందు |
| **భూత్వా, భూత్వా** | = మఱల మఱల ఉత్పన్నమగుచు | **ప్రభవతి** | = (మరల) ఉత్పన్నమగును |

పార్థా! ఈభూత(ప్రాణి) సముదాయము ప్రకృతివశమున మాటిమాటికిని ఉత్పన్నమగుచుండును-రాత్రి ప్రారంభకాలమున లీనమగుచుండును. పగటి ప్రారంభ కాలమున ఉత్పన్నమగుచుండును. (19)

**పరస్తస్మాత్తు భావోఽన్యోఽవ్యక్తోఽవ్యక్తాత్ సనాతనః ।**
**యః స సర్వేషు భూతేషు నశ్యత్సు న వినశ్యతి ॥ 20 ॥**

పరః, తస్మాత్, తు, భావః, అన్యః, అవ్యక్తః, అవ్యక్తాత్, సనాతనః,
యః, సః, సర్వేషు, భూతేషు, నశ్యత్సు, న, వినశ్యతి ॥ 20 ॥

| | | | |
|---|---|---|---|
| **తు** | = అయితే | **అవ్యక్తః** | = అవ్యక్తమైన |
| **తస్మాత్, అవ్యక్తాత్** | = ఆ అవ్యక్తముకంటెను | **భావః** | = భావముగలదో |
| **పరః** | = అత్యంత పరమైనది | **సః** | = ఆ పరమ దివ్యపురుషుడు |
| **అన్యః** | = విలక్షణమైన మఱియొకటి | **సర్వేషు** | = సమస్తమైన |
| | | **భూతేషు** | = భూతములు |
| **యః** | = ఏ | **నశ్యత్సు** | = నశించిపోవుచున్నను |
| **సనాతనః** | = సనాతనమైన | **న, వినశ్యతి** | = నశించిపోడు |

ఆ అవ్యక్తముకంటెను పరమైన విలక్షణమైన సనాతన (శాశ్వత) మైన అవ్యక్తభావమే ఆ పరమపదము. ప్రాణులన్నియు నశించినను, ఆ పరమ పురుషుడు మాత్రము నశింపడు(నిత్యుడే). (20)

**అవ్యక్తోఽక్షర ఇత్యుక్తః తమాహుః పరమాం గతిమ్ ।**
**యం ప్రాప్య న నివర్తంతే తద్ధామ పరమం మమ ॥ 21 ॥**

అవ్యక్తః, అక్షరః, ఇతి, ఉక్తః, తమ్, ఆహుః, పరమామ్, గతిమ్,
యమ్, ప్రాప్య, న, నివర్తంతే, తత్, ధామ, పరమమ్, మమ ॥ 21 ॥

| | | | |
|---|---|---|---|
| అవ్యక్తః | = ఈ అవ్యక్తమే | ఆహుః | = పలుకుదురు (వ్యవహరింతురు) |
| అక్షరః, ఇతి | = అక్షరమనియు | యమ్ | = ఏ పరమగతిని |
| ఉక్తః | = చెప్పబడును | ప్రాప్య | = పొంది |
| తమ్ | = 'అక్షరము' అని వ్యవహరింపబడు ఆ అవ్యక్తభావమునే | న, నివర్తంతే | = (మఱల) తిరిగిరారో |
| | | తత్ | = అది |
| పరమామ్, గతిమ్ | = పరమగతి అనియు | మమ | = నాయొక్క |
| | | పరమమ్, ధామ | = పరంధామము |

ఈ అవ్యక్తమునే అక్షరము అనియు అందురు. ఇదియే పరమగతి మరియు నా పరమధామము. ఈ సనాతన - అవ్యక్తమును అనగా, నా పరంధామమును చేరినవారు మఱల తిరిగిరారు. (21)

**పురుషః స పరః పార్థ భక్త్యా లభ్యస్త్వనన్యయా ।**
**యస్యాంతఃస్థాని భూతాని యేన సర్వమిదం తతమ్ ॥ 22 ॥**

పురుషః, సః, పరః, పార్థ, భక్త్యా, లభ్యః, తు, అనన్యయా,
యస్య, అంతఃస్థాని, భూతాని, యేన, సర్వమ్, ఇదమ్, తతమ్ ॥ 22 ॥

| | | | |
|---|---|---|---|
| పార్థ! | = ఓ అర్జునా! | యస్య, అంతఃస్థాని | = ఏ సచ్చిదానంద ఘన పరమాత్మయందు అంతర్గతములైయున్నవో |
| భూతాని | = సమస్త భూతములును | | |

| | | |
|---|---|---|
| యేన | = | ఏ సచ్చిదానంద ఘనపరమాత్మచేత |
| ఇదమ్ | = | ఈ |
| సర్వమ్ | = | సమస్తమైన జగత్తు |
| తతమ్[1] | = | పరిపూర్ణమైయున్నదో |
| సః | = | ఆ |
| పరః | = | సర్వశ్రేష్ఠుడైన |
| పురుషః, తు | = | పురుషోత్తముడు (అనగా సనాతన - అవ్యక్త పరమాత్మ) అయితే |
| అనన్యయా, భక్త్యా[2] | = | అనన్యమైన భక్తితో మాత్రమే |
| లభ్యః | = | లభ్యుడు (అగును) |

ఓ పార్థా! సమస్త భూతములు(ప్రాణులు) ఆపరమాత్మయందే అంతర్గతములై యున్నవి. ఆ సచ్చిదానంద ఘనపరమాత్మచేతనే ఈ జగత్తంతయు వ్యాప్తమై (పూర్ణమై) ఉన్నది. అట్టి - సనాతన- అవ్యక్త పరమ పురుషుడు అనన్యభక్తి ద్వారా మాత్రమే లభ్యుడగును. (22)

**యత్ర కాలే త్వనావృత్తిమ్ ఆవృత్తిం చైవ యోగినః ।**
**ప్రయాతా యాంతి తం కాలం వక్ష్యామి భరతర్షభ ॥ 23 ॥**

యత్ర, కాలే, తు, అనావృత్తిమ్, ఆవృత్తిమ్, చ, ఏవ, యోగినః,
ప్రయాతాః, యాంతి, తమ్, కాలమ్, వక్ష్యామి, భరతర్షభ ॥ 23 ॥

| | | |
|---|---|---|
| భరతర్షభ! | = | ఓ అర్జునా! |
| యత్ర, కాలే | = | ఏ కాలమునందు[3] |
| ప్రయాతాః | = | శరీరత్యాగముచేసి, వెళ్ళిపోవునట్టి |
| యోగినః | = | యోగులు |
| తు | = | అయితే |
| అనావృత్తిమ్ | = | తిరిగిరానిగతిని (చేరుదురో) |
| చ | = | మఱియు |
| ఆవృత్తిమ్, ఏవ | = | తిరిగి వచ్చుగతినే |
| యాంతి | = | పొందుదురో |
| తమ్, కాలమ్ | = | ఆ కాలమును అనగా రెండు మార్గములను గూర్చి |
| వక్ష్యామి | = | చెప్పెదను |

ఓ భరతశ్రేష్ఠా! ఏ కాలమునందు దేహత్యాగమును చేసిన యోగులు తిరిగిరాని గతిని చేరుదురో, మఱియు ఏకాలమునందు దేహత్యాగము చేసినవారు తిరిగివచ్చు గతిని పొందుదురో అట్టి కాలములను, అనగా రెండు మార్గములను తెలిపెదను. (23)

1. *గీత, 9వ అధ్యాయమునందలి 4వ శ్లోకము చూడుడు.*
2. *గీత, 11వ అధ్యాయమునందలి 55వ శ్లోకములో దీని వివరణము గలదు.*
3. *ఇచట కాలశబ్దమునకు మార్గము అని అర్థము. ఏలనన రాబోవు శ్లోకములలో భగవంతుడు, సృతీ, గతీ అని పేర్కొనెను.*

**అగ్నిర్జ్యోతిరహః శుక్లః షణ్మాసా ఉత్తరాయణమ్ ।**
**తత్ర ప్రయాతా గచ్ఛంతి బ్రహ్మ బ్రహ్మవిదో జనాః ॥ 24 ॥**

అగ్నిః, జ్యోతిః, అహః, శుక్లః, షణ్మాసాః, ఉత్తరాయణమ్,
తత్ర, ప్రయాతాః, గచ్ఛంతి, బ్రహ్మ, బ్రహ్మవిదః, జనాః ॥ 24 ॥

| | | | |
|---|---|---|---|
| జ్యోతిః | = జ్యోతిర్మయమగు మార్గమునకు | షణ్మాసాః | = ఆఱు నెలలుగల |
| అగ్నిః | = అగ్ని-అభిమానదేవత | ఉత్తరాయణమ్ | = ఉత్తరాయణము (వీటియొక్క అభిమానదేవతలుగల) |
| బ్రహ్మవిదః[1] | = బ్రహ్మవేత్తలైన | | |
| జనాః | = యోగులు | తత్ర | = ఆ మార్గముద్వారా |
| ప్రయాతాః | = మృతి చెందినవారై | బ్రహ్మ | = పరబ్రహ్మ (పరమపద)మును |
| అహః | = పగలు | | |
| శుక్లః | = 'శుక్లపక్ష'ము | గచ్ఛంతి | = పొందుచున్నారు |

బ్రహ్మవేత్తలైన యోగులు జ్యోతిర్మయమార్గముద్వారా బ్రహ్మపదప్రాప్తినందుదురు. ఈ జ్యోతిర్మయ మార్గమునకు అధిదేవత అగ్ని. దేహత్యాగము చేసిన ఆ యోగులను క్రమముగా దిన(పగలు)శుక్లపక్ష ఉత్తరాయణ - అభిమాన దేవతలు కొనిపోయి , పరమపదమును చేర్చుదురు. (24)

**ధూమో రాత్రిస్తథా కృష్ణః షణ్మాసా దక్షిణాయనమ్ ।**
**తత్ర చాంద్రమసం జ్యోతిః యోగీ ప్రాప్య నివర్తతే ॥ 25 ॥**

ధూమః, రాత్రిః, తథా, కృష్ణః, షణ్మాసాః, దక్షిణాయనమ్,
తత్ర, చాంద్రమసమ్, జ్యోతిః, యోగీ, ప్రాప్య, నివర్తతే ॥ 25 ॥

| | | | |
|---|---|---|---|
| ధూమః | = ధూమాభిమాన దేవత | దక్షిణాయనమ్ | = దక్షిణాయనము యొక్క |
| రాత్రిః | = రాత్రి అభిమానదేవత | | |
| తథా | = అట్లే | షణ్మాసాః | = ఆఱుమాసముల అభిమానదేవత |
| కృష్ణః | = కృష్ణపక్ష-అభిమానదేవత | | ఈ దేవతల ద్వారా |

1. ఉపాసించుట ద్వారా పరమాత్మను పరోక్షభావముతో ఎఱింగెడివారు.

| | | | | | |
|---|---|---|---|---|---|
| తత్ర | = | ఆ మార్గమున (ధూమమార్గమున) | చాంద్రమసమ్, జ్యోతిః | = | చాంద్రమసజ్యోతిని |
| యోగీ | = | సకామకర్మలను ఆచరించుయోగి (పైన పేర్కొనబడిన అభిమాన దేవతలద్వారా కొనిపోబడినవాడై) | ప్రాప్య | = | పొంది (స్వర్గలోకాది ఫలములను అనుభవించి) |
| | | | నివర్తతే | = | తిరిగి భూలోకమునకు చేరును |

అట్లే సకామకర్మయోగులు ధూమ్రమార్గముద్వారా స్వర్గాదిలోకములను చేరుదురు. దేహత్యాగము చేసిన ఈ సకామకర్మయోగులను క్రమముగా రాత్రి, కృష్ణపక్ష, దక్షిణాయన - అభిమానదేవతలు కొనిపోయి, స్వర్గాదిలోకములను చేర్చుదురు. వారు అచట చాంద్రమసజ్యోతిని పొంది, అనగా తమశుభకర్మ ఫలములను అనుభవించి, తిరిగి భూలోకమును చేరుదురు. (25)

**శుక్లకృష్ణే గతీ హ్యేతే జగతః శాశ్వతే మతే ।**
**ఏకయా యాత్యనావృత్తిమ్ అన్యయావర్తతే పునః ॥ 26 ॥**

శుక్లకృష్ణే, గతీ, హి, ఏతే, జగతః, శాశ్వతే, మతే,
ఏకయా, యాతి, అనావృత్తిమ్, అన్యయా, ఆవర్తతే, పునః ॥ 26 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| హి | = | ఏలనన | అనావృత్తిమ్ | = | తిరిగి రాని స్థితిని (పరమగతిని) |
| జగతః | = | జగత్తులోని | | | |
| ఏతే | = | ఈరెండు విధములైన | యాతి | = | పొందును |
| శుక్లకృష్ణే, గతీ | = | శుక్లకృష్ణమార్గములు, లేక దేవయాన పితృయాన మార్గములు | అన్యయా[2] | = | మఱియొకదాని (పితృయానమార్గము) ద్వారా వెళ్ళువాడు అయితే |
| శాశ్వతే | = | సనాతనములైనవిగా | | | |
| మతే | = | భావింపబడుచున్నవి | పునః,ఆవర్తతే | = | తిరిగి వచ్చును (జనన మరణ చక్రములో పడును) |
| ఏకయా[1] | = | ఒకదాని (దేవయాన మార్గము) ద్వారా వెళ్ళువాడు | | | |

*1. ఈ అధ్యాయమునందలి 24వ శ్లోకమును అనుసరించి, అర్చిర్మార్గమున వెళ్లెడి యోగి*
*2. ఈ అధ్యాయమునందు 25 శ్లోకమును అనుసరించి, ధూమమార్గమున వెళ్ళు సకామకర్మి*

ఈ రెండు మార్గములకును శుక్ల, కృష్ణమార్గములనియు లేక దేవయాన పితృయాన మార్గములనియు వ్యవహారప్రసిద్ధి గలదు. ఇవి సనాతనములు. దేవయాన మార్గమున వెళ్లువారు పరమగతిని పొంది తిరిగిరారు. పితృయానమార్గమున వెళ్ళువారు తిరిగివచ్చి జననమరణచక్రములో పడుదురు. (26)

**నైతే సృతీ పార్థ జానన్ యోగీ ముహ్యతి కశ్చన ।**
**తస్మాత్ సర్వేషు కాలేషు యోగయుక్తో భవార్జున ॥ 27 ॥**

న, ఏతే, సృతీ, పార్థ, జానన్, యోగీ, ముహ్యతి, కశ్చన,
తస్మాత్, సర్వేషు, కాలేషు, యోగయుక్తః, భవ, అర్జున ॥ 27 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| పార్థ! | = | అర్జునా! | అర్జున! | = | ఓ అర్జునా! |
| ఏతే | = | ఈ రెండు | సర్వేషు,కాలేషు | = | సర్వకాలములయందును |
| సృతీ | = | మార్గములను | యోగయుక్తః | = | (నీవు) సమబుద్ధి రూపయోగయుక్తుడవు |
| జానన్ | = | తెలిసికొనిన | | | |
| కశ్చన, యోగీ | = | ఏ యోగియు | భవ | = | కమ్ము (నిరంతరము నన్నే పొందుటకు యత్నింపుము) |
| న, ముహ్యతి[1] | = | మోహితుడుకాడు | | | |
| తస్మాత్ | = | అందువలన | | | |

పార్థా! ఈ విధముగా ఈ రెండు మార్గములతత్త్వములను తెలిసికొన్నయోగి మోహితుడు కాడు. కావున, అన్నికాలములయందును సమత్వబుద్ధిరూపయోగ యుక్తుడవు కమ్ము. అనగా- నిరంతరము నన్నే పొందుటకు ప్రయత్నింపుము. (27)

**వేదేషు యజ్ఞేషు తపస్సు చైవ**
**దానేషు యత్పుణ్యఫలం ప్రదిష్టమ్ ।**
**అత్యేతి తత్సర్వమిదం విదిత్వా**
**యోగీ పరం స్థానముపైతి చాద్యమ్ ॥ 28 ॥**

వేదేషు, యజ్ఞేషు, తపస్సు, చ, ఏవ, దానేషు, యత్, పుణ్యఫలమ్, ప్రదిష్టమ్,
అత్యేతి, తత్, సర్వమ్, ఇదమ్, విదిత్వా, యోగీ, పరమ్, స్థానమ్, ఉపైతి, చ, ఆద్యమ్ ॥ 28 ॥

1. అతడు నిష్కామ భావముతోసాధన చేయును. కనుక కోరికలలో చిక్కుకొనడు

| | | |
|---|---|---|
| యోగీ | = | యోగియైన పురుషుడు |
| ఇదమ్ | = | ఈ తత్త్వరహస్యమును |
| విదిత్వా | = | తెలిసికొని |
| వేదేషు | = | వేద(పఠన)ముల యందును |
| చ | = | మఱియు |
| యజ్ఞేషు | = | యజ్ఞముల (చేయుట) యందును |
| తపస్సు | = | తపస్సుల (ఆచరించుట) యందును |
| దానేషు | = | దానముల (చేయుట) యందును |
| యత్ | = | ఏ |
| పుణ్యఫలమ్ ప్రదిష్టమ్ | = | పుణ్యఫలము చెప్పబడినదో |
| తత్, సర్వమ్ | = | ఆ సమస్త ఫలమును |
| ఏవ | = | నిస్సందేహముగా |
| అత్యేతి | = | అధిగమించును |
| చ | = | మఱియు |
| ఆద్యమ్ | = | సనాతనమైన |
| పరమ్, స్థానమ్ | = | పరమపదమును |
| ఉపైతి | = | పొందును |

ఈ తత్త్వరహస్యమును ఎఱిగిన యోగి వేదపఠనమువలనను, యజ్ఞదాన తపశ్చర్యాదులవలనను, కలుగు పుణ్యఫలమును త్రోసిరాజని నిస్సందేహముగా సనాతనపరమపదమును చేరును. (28)

*ఓం తత్సదితి శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే అక్షరబ్రహ్మయోగో నామ అష్టమోఽధ్యాయః ॥ ౮ ॥*

॥ ఓం శ్రీపరమాత్మనే నమః ॥

# అథ నవమోఽధ్యాయః - రాజవిద్యారాజగుహ్యయోగః

## (తొమ్మిదవ అధ్యాయము - రాజవిద్యారాజగుహ్యయోగము)

ముఖ్యాంశములు : [(1 నుండి 6వ శ్లోకమువఱకు) ప్రభావసహిత జ్ఞానవిషయము. (7 నుండి 10 వఱకు) జగదుత్పత్తి వర్ణనము. (11 నుండి 15 వఱకు) భగవంతుని తిరస్కరించు ఆసురీప్రకృతిగలవారిని నిందించుట-దైవీ ప్రకృతిగలవారి భగవద్భజనవిధానము, (16 నుండి 19 వఱకు) సర్వాత్మస్వరూపుడైన భగవత్స్వరూపప్రభావవర్ణనము- (20 నుండి 25 వఱకు) సకామనిష్కామ-ఉపాసనల ఫలము. (26-34 వఱకు) నిష్కామ భక్తి మహిమ.]

**శ్రీభగవాన్ ఉవాచ**

**ఇదం తు తే గుహ్యతమం ప్రవక్ష్యామ్యనసూయవే ।**
**జ్ఞానం విజ్ఞానసహితం యద్జ్ఞాత్వా మోక్ష్యసేఽశుభాత్ ॥ 1 ॥**

ఇదమ్, తు, తే, గుహ్యతమమ్, ప్రవక్ష్యామి, అనసూయవే,
జ్ఞానమ్, విజ్ఞానసహితమ్, యత్, జ్ఞాత్వా, మోక్ష్యసే, అశుభాత్ ॥ 1 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| యత్, తు | = | దేనినయితే | గుహ్యతమమ్ | = | పరమగోప్యమైన |
| జ్ఞాత్వా | = | తెలిసికొనుటవలన | విజ్ఞానసహితమ్ | = | విజ్ఞానసహితమైన |
| అశుభాత్ | = | దుఃఖరూపసంసారము నుండి | జ్ఞానమ్ | = | జ్ఞానమును |
| | | | అనసూయవే | = | దోషదృష్టిలేనివాడవైన |
| మోక్ష్యసే | = | ముక్తుడవయ్యెదవో | తే | = | నీకు |
| (తత్) | = | అట్టి | ప్రవక్ష్యామి | = | (మఱల) సమగ్రముగా వివరించెదను. |
| ఇదమ్ | = | ఈ | | | |

శ్రీ భగవానుడు పలికెను - ఓ అర్జునా! నీవు దోషదృష్టిలేని భక్తుడవు. కనుక నీకు పరమగోప్యమైన విజ్ఞాన సహిత జ్ఞానమును మఱల విశదముగ చెప్పుచున్నాను. దీనిని తెలిసికొని నీవు ఈ దుఃఖరూపసంసారమునుండి ముక్తుడవు కాగలవు (1)

**రాజవిద్యా రాజగుహ్యం పవిత్రమిదముత్తమమ్ ।**
**ప్రత్యక్షావగమం ధర్మ్యం సుసుఖం కర్తుమవ్యయమ్ ॥ 2 ॥**

రాజవిద్యా, రాజగుహ్యమ్, పవిత్రమ్, ఇదమ్, ఉత్తమమ్,
ప్రత్యక్షావగమమ్, ధర్మ్యమ్, సుసుఖమ్, కర్తుమ్, అవ్యయమ్ ॥ 2 ॥

| | | | |
|---|---|---|---|
| ఇదమ్ | = ఈ విజ్ఞానసహిత జ్ఞానము | ప్రత్యక్షావగమమ్ | = ప్రత్యక్షముగా ఫలములను ఇచ్చునది |
| రాజవిద్యా, రాజగుహ్యమ్ | = అన్ని విద్యలకును తలమానికము, సమస్త గోప్యవిషయములకును శిరోభూషణము | ధర్మ్యమ్ | = ధర్మయుక్తము |
| | | కర్తుమ్ | = సాధన చేయుటకు |
| పవిత్రమ్ | = మిక్కిలి పవిత్రమైనది | సుసుఖమ్ | = మిక్కిలి సుగమమైనది |
| ఉత్తమమ్ | = అత్యుత్తమము | అవ్యయమ్ | = శాశ్వతమైనది. |

ఈ విజ్ఞానసహితజ్ఞానము(నిర్గుణసగుణపరమాత్మతత్త్వజ్ఞానము) అన్ని విద్యలకును తలమానికము. సమస్తగోప్యవిషయములకును శిరోభూషణము. అతి పవిత్రము. ఉత్తమోత్తమము. ప్రత్యక్షఫలదాయకము. ధర్మయుక్తము, సాధన చేయుటకు మిక్కిలి సుగమము, శాశ్వతము. (2)

**అశ్రద్దధానాః పురుషా ధర్మస్యాస్య పరంతప ।**
**అప్రాప్య మాం నివర్తంతే మృత్యుసంసారవర్త్మని ॥ 3 ॥**

అశ్రద్దధానాః, పురుషాః, ధర్మస్య, అస్య, పరంతప,
అప్రాప్య, మామ్, నివర్తంతే, మృత్యుసంసారవర్త్మని ॥ 3 ॥

| | | | |
|---|---|---|---|
| పరంతప! | = ఓ పరంతపా! | మామ్ | = నన్ను |
| అస్య | = (పైన పేర్కొనబడిన) ఈ | అప్రాప్య | = పొందక |
| ధర్మస్య | = ధర్మమార్గమునందు | మృత్యుసంసార వర్త్మని | = మృత్యురూప సంసార చక్రమున |
| అశ్రద్దధానాః | = శ్రద్ధారహితులైన | | |
| పురుషాః | = పురుషులు | నివర్తంతే | = పరిభ్రమించుచుందురు. |

ఓ పరంతపా! ఈ ధర్మమార్గమునందు విశ్వాసములేని పురుషులు నన్ను పొందజాలరు. కనుక, వారు మృత్యురూపసంసారచక్రమున పరిభ్రమించుచుందురు. (3)

**మయా తతమిదం సర్వం జగదవ్యక్తమూర్తినా ।**
**మత్స్థాని సర్వభూతాని న చాహం తేష్వవస్థితః ॥ 4 ॥**

మయా, తతమ్, ఇదమ్, సర్వమ్, జగత్, అవ్యక్తమూర్తినా,
మత్స్థాని, సర్వభూతాని, న, చ, అహమ్, తేషు, అవస్థితః ॥ 4 ॥

అవ్యక్తమూర్తినా = నిరాకారపరబ్రహ్మమైన
మయా = నాచేత
ఇదమ్ = ఈ
సర్వమ్ = సమస్తమైన
జగత్ = జగత్తు
తతమ్ = (నీటితో మంచువలె) పరిపూర్ణమైయున్నది
చ = మఱియు
సర్వభూతాని = ప్రాణులన్నియును
మత్స్థాని = (నా సంకల్పమును ఆధారముగాగొని) నా యందే అంతర్గతములై యున్నవి (కాని)
అహమ్ = నేను
తేషు = వాటియందు
న, అవస్థితః = (వాస్తవముగా) స్థితుడనుకాను.

నిరాకారపరబ్రహ్మమైన నాచేతనే ఈ జగత్తంతయును జలముతో మంచువలె పరిపూర్ణమైయున్నది. ప్రాణులన్నియును నా సంకల్పమును ఆధారముగా కలిగి నాయందే అంతర్గతములైయున్నవి. కాని, వాస్తవముగా నేను వాటియందు స్థితుడనుకాను. (4)

**న చ మత్స్థాని భూతాని పశ్య మే యోగమైశ్వరమ్ ।**
**భూతభృన్న చ భూతస్థో మమాత్మా భూతభావనః ॥ 5 ॥**

న, చ, మత్స్థాని, భూతాని, పశ్య, మే, యోగమ్, ఐశ్వరమ్,
భూతభృత్, న, చ, భూతస్థః, మమ, ఆత్మా, భూతభావనః ॥ 5 ॥

భూతాని = ఆ ప్రాణులన్నియును
మత్స్థాని, న = నాయందు స్థిరముగా లేవు, కాని
మే = నాయొక్క
ఐశ్వరమ్ = ఈశ్వరీయమైన
యోగమ్ = యోగశక్తిని
పశ్య = చూడుము
భూతభావనః = భూతములను సృష్టించువాడను
చ = మఱియు
భూతభృత్, చ = భూతములను ధరించువాడను, భరించువాడను నేనేయైనను
మమ, ఆత్మా = నా ఆత్మ (వాస్తవముగా)
భూతస్థః, న = ఆ భూతముల యందు స్థితమైయుండదు.

ఈ ప్రాణులన్నియును నాలో స్థిరముగా లేవు. ఈశ్వరీయమైన నా యోగశక్తిని చూడుము. ఈ భూతములనన్నింటిని సృష్టించునదియు, పోషించునదియు నేనేయైనను యథార్థముగా నా ఆత్మ వాటియందు స్థితమై యుండదు. (5)

**యథాకాశస్థితో నిత్యం వాయుః సర్వత్రగో మహాన్ ।**
**తథా సర్వాణి భూతాని మత్స్థానీత్యుపధారయ ॥ 6 ॥**

యథా, ఆకాశస్థితః, నిత్యమ్ వాయుః, సర్వత్రగః, మహాన్,
తథా, సర్వాణి, భూతాని, మత్స్థాని, ఇతి, ఉపధారయ ॥ 6 ॥

| | | | |
|---|---|---|---|
| సర్వత్రగః | = అంతటను సంచరించునట్టి | తథా | = అట్లే |
| మహాన్ | = మిక్కిలి విస్తృతమైన | భూతాని | = నా సంకల్పమువలననే ఉత్పన్నములైన భూతములు (ప్రాణులు) |
| వాయుః | = (ఆకాశమునుండియే ఉత్పన్నమైన) వాయువు | సర్వాణి | = అన్నియును |
| యథా | = ఎట్లు | మత్స్థాని | = నా యందే స్థితమై యున్నవి |
| నిత్యమ్ | = నిరంతరము | | |
| ఆకాశస్థితః | = ఆకాశమునందే స్థితమైయుండునో | ఇతి | = అని |
| | | ఉపధారయ | = ఎఱుంగుము. |

'ఆకాశమునుండి ఉత్పన్నమై, సర్వత్ర సంచరించుచున్న విస్తృతమైన వాయువు సర్వదా ఆకాశమునందే స్థితమై యుండును. అట్లే నా సంకల్పముద్వారా ఉత్పన్నమైన భూతములు(ప్రాణులు) అన్నియును, నాయందే స్థితమై యుండును. (6)

**సర్వభూతాని కౌంతేయ ప్రకృతిం యాంతి మామికామ్ ।**
**కల్పక్షయే పునస్తాని కల్పాదౌ విసృజామ్యహమ్ ॥ 7 ॥**

సర్వభూతాని, కౌంతేయ, ప్రకృతిమ్, యాంతి, మామికామ్,
కల్పక్షయే, పునః, తాని, కల్పాదౌ, విసృజామి, అహమ్ ॥ 7 ॥

| | | | |
|---|---|---|---|
| కౌంతేయ! | = ఓ కౌంతేయా! | కల్పాదౌ | = (మఱియు) కల్పాదియందు |
| కల్పక్షయే | = కల్పాంతమునందు | | |
| సర్వభూతాని | = భూతములన్నియును | తాని | = వాటిని |
| మామికామ్, ప్రకృతిమ్ | = నా ప్రకృతినే | పునః | = మఱల |
| యాంతి | = చేరును (ప్రకృతిలో లీనమగును) | అహమ్ | = నేను |
| | | విసృజామి | = సృష్టించుచుందును. |

ఓ కౌంతేయా! కల్పాంతమునందు భూతములన్నియును నా ప్రకృతినే చేరును. అనగా ప్రకృతిలో లీనమగును. కల్పాదియందు నేను మఱల వాటిని సృజించుచుందును. (7)

**ప్రకృతిం స్వామవష్టభ్య విసృజామి పునః పునః ।**
**భూతగ్రామమిమం కృత్స్నమ్ అవశం ప్రకృతేర్వశాత్ ॥ 8 ॥**

ప్రకృతిమ్, స్వామ్, అవష్టభ్య, విసృజామి, పునః, పునః,
భూతగ్రామమ్, ఇమమ్, కృత్స్నమ్, అవశమ్, ప్రకృతేః, వశాత్ ॥ 8 ॥

| | |
|---|---|
| (అహమ్) = నేను | ఇమమ్ = ఈ |
| స్వామ్, ప్రకృతిమ్ = స్వీయప్రకృతిని (నామూలప్రకృతిని) | కృత్స్నమ్ = సమస్తమైన |
| అవష్టభ్య = స్వీకరించి | భూతగ్రామమ్ = భూత సముదాయమును |
| ప్రకృతేః, వశాత్ = తమతమ స్వభావ వశమున | పునః, పునః = మాటిమాటికిని |
| అవశమ్ = పరతంత్రమైయున్న | విసృజామి = (వాటి కర్మాను సారము) సృష్టించు చుందును |

తమతమ స్వభావవశమున పరతంత్రమైయున్న భూతసముదాయమును, నాప్రకృతినాశ్రయించి మాటిమాటికి వాటి కర్మానుసారము సృజించుచున్నాను. (8)

**న చ మాం తాని కర్మాణి నిబధ్నంతి ధనంజయ ।**
**ఉదాసీనవదాసీనమ్ అసక్తం తేషు కర్మసు ॥ 9 ॥**

న, చ, మామ్, తాని, కర్మాణి, నిబధ్నంతి, ధనంజయ,
ఉదాసీనవత్, ఆసీనమ్, అసక్తమ్, తేషు, కర్మసు ॥ 9 ॥

| | |
|---|---|
| ధనంజయ! = ఓ అర్జునా! | ఉదాసీనవత్ = ఉదాసీనునివలె |
| తేషు, కర్మసు = ఆ కర్మలయందు | ఆసీనమ్, మామ్= ఉన్నట్టి నన్ను |
| అసక్తమ్ = ఆసక్తిరహితుడనైన | తాని, కర్మాణి = ఆ కర్మలు |
| చ = మఱియు | న, నిబధ్నంతి = బంధింపవు. |

ఓ అర్జునా! ఆ సృష్ట్యాది కర్మలయందు ఆసక్తిరహితుడనై, ఉదాసీనునివలెనున్న నన్ను ఆ కర్మలు బంధింపవు. (9)

**మయాధ్యక్షేణ ప్రకృతిః సూయతే సచరాచరమ్ ।**
**హేతునానేన కౌంతేయ జగద్విపరివర్తతే ॥ 10 ॥**

మయా, అధ్యక్షేణ, ప్రకృతిః, సూయతే, సచరాచరమ్,
హేతునా, అనేన, కౌంతేయ, జగత్, విపరివర్తతే ॥ 10 ॥

| | | | |
|---|---|---|---|
| కౌంతేయ! | = ఓ కుంతీసుతా! | సూయతే | = సృష్టించుచున్నది |
| అధ్యక్షేణ | = అధ్యక్షుడనైయున్న | అనేన | = ఈ |
| మయా | = నా చేత (నాద్వారా) | హేతునా | = కారణమున |
| ప్రకృతిః | = ప్రకృతి | జగత్ | = సంసారచక్రము |
| సచరాచరమ్ | = ఈ చరాచరజగత్తును | విపరివర్తతే | = పరిభ్రమించుచున్నది. |

ఓ అర్జునా! అధిష్ఠాతనైన నా అధ్యక్షతన ప్రకృతి ఈ చరాచరజగత్తును సృష్టించుచున్నది. ఈ కారణమువలననే సంసారచక్రము పరిభ్రమించుచున్నది. (10)

**అవజానంతి మాం మూఢా మానుషీం తనుమాశ్రితమ్ ।**
**పరం భావమజానంతో మమ భూతమహేశ్వరమ్ ॥ 11 ॥**

అవజానంతి, మామ్, మూఢాః, మానుషీమ్, తనుమ్, ఆశ్రితమ్,
పరమ్, భావమ్, అజానంతః, మమ, భూతమహేశ్వరమ్ ॥ 11 ॥

| | | | |
|---|---|---|---|
| మమ | = నాయొక్క | మానుషీమ్, తనుమ్, ఆశ్రితమ్ | = (లోక కల్యాణార్థము) మానుష శరీరమును ఆశ్రయించిన (స్వీకరించిన)వాడను ఐన |
| పరమ్, భావమ్[1] | = పరమభావమును | | |
| అజానంతః | = ఎఱుగనివారై | | |
| మూఢాః | = అజ్ఞానులు | | |
| భూత మహేశ్వరమ్ | = సకలప్రాణులకును మహేశ్వరుడను | మామ్ | = నన్ను |
| | | అవజానంతి | = తక్కువగా ఊహింతురు |

నా పరమభావమును ఎఱుగని మూఢులు సర్వప్రాణులకును మహేశ్వరుడను (ప్రభువును) ఐన నన్ను లోకకల్యాణమునకై అవతారములను ఎత్తిన కారణమున సామాన్య మానవునిగా భావించి, తక్కువగా ఊహింతురు. (11)

**మోఘాశా మోఘకర్మాణో మోఘజ్ఞానా విచేతసః ।**
**రాక్షసీమాసురీం చైవ ప్రకృతిం మోహినీం శ్రితాః ॥ 12 ॥**

మోఘాశాః, మోఘకర్మాణః, మోఘజ్ఞానాః, విచేతసః,
రాక్షసీమ్, ఆసురీమ్, చ, ఏవ, ప్రకృతిమ్, మోహినీమ్, శ్రితాః ॥ 12 ॥

*1) గీత-7వ అధ్యాయము- 24 శ్లోకము చూడదగును*

| | | |
|---|---|---|
| మోఘాశాః | = | వ్యర్థములైన ఆశలు గలవారును |
| మోఘకర్మాణః | = | వ్యర్థములైన కర్మలను ఆచరించువారును |
| మోఘజ్ఞానాః | = | విపరీతజ్ఞానముగల వారును |
| విచేతసః | = | విక్షిప్తములైన మనస్సులు గలవారును |
| | | అగు అజ్ఞానులు |
| రాక్షసీమ్ | = | రాక్షసీ |
| ఆసురీమ్ | = | ఆసురీ |
| చ | = | మఱియు |
| మోహినీమ్ ప్రకృతిమ్,[1] ఏవ | = | మోహినీ స్వభావములనే |
| శ్రితాః | = | ఆశ్రయింతురు (కల్గియుందురు) |

వ్యర్థములైన ఆశలచే, కర్మలచే, విపరీత జ్ఞానముచే విక్షిప్తములైన మనస్సులుగల అజ్ఞానులు రాక్షసీ-ఆసురీ - మోహినీ స్వభావములను ఆశ్రయింతురు. (12)

**మహాత్మానస్తు మాం పార్థ దైవీం ప్రకృతిమాశ్రితాః ।**
**భజంత్యనన్యమనసో జ్ఞాత్వా భూతాదిమవ్యయమ్ ॥ 13 ॥**

మహాత్మానః, తు, మామ్, పార్థ, దైవీమ్, ప్రకృతిమ్, ఆశ్రితాః,
భజంతి, అనన్యమనసః, జ్ఞాత్వా, భూతాదిమ్, అవ్యయమ్ ॥ 13 ॥

| | | |
|---|---|---|
| తు | = | కాని |
| పార్థ! | = | ఓ పార్థా! |
| దైవీమ్ ప్రకృతిమ్[2] | = | దైవీ ప్రకృతిని |
| ఆశ్రితాః | = | ఆశ్రయించిన |
| మహాత్మానః | = | మహాత్ములు |
| మామ్ | = | నన్ను |
| భూతాదిమ్ | = | సకలప్రాణులకును మూలముగను |
| అవ్యయమ్ | = | అక్షరస్వరూపునిగను |
| జ్ఞాత్వా | = | గ్రహించి |
| అనన్యమనసః | = | నిశ్చల(ఏకాగ్రతగల) మనస్సులుగలవారై |
| భజంతి | = | నిరంతరము భజింతురు |

కాని, ఓ పార్థా! దైవీప్రకృతిని ఆశ్రయించిన మహాత్ములైతే నన్ను సకల ప్రాణులకు మూలకారణముగను, అవ్యయునిగను (అక్షరస్వరూపునిగను) తెలిసికొని, నిశ్చలమనస్కులై నిరంతరము నన్నే భజింతురు. (13)

1) గీత-16 అధ్యాయము- 4వ శ్లోకము మఱియు 7 నుండి 21వ శ్లోకము వఱకు ఆసురీ సంపద అను పేరుతో విస్తృతముగా తెల్పబడెను.

2) గీత- 16వ అధ్యాయము- 1 నుండి 3వ శ్లోకమువఱకుగల విస్తృతవివరణమును చూడవలెను.

**సతతం కీర్తయంతో మాం యతంతశ్చ దృఢవ్రతాః ।**
**నమస్యంతశ్చ మాం భక్త్యా నిత్యయుక్తా ఉపాసతే ॥ 14 ॥**

సతతమ్, కీర్తయంతః, మామ్, యతంతః, చ, దృఢవ్రతాః,
నమస్యంతః, చ, మామ్, భక్త్యా, నిత్యయుక్తాః, ఉపాసతే ॥ 14 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| దృఢవ్రతాః | = | అట్టి దృఢనిశ్చయము గల భక్తులు | మామ్ | = | నన్నుగూర్చి |
| సతతమ్ | = | నిరంతరము (వాద్యబృందముతో) | నమస్యంతః | = | నమస్కరించుచుందురు |
| కీర్తయంతః, చ | = | (నా నామ గుణములను) కీర్తించుచుందురు | నిత్యయుక్తాః | = | నా ధ్యానమునందే నిమగ్నులగు చుందురు |
| యతంతః, చ | = | (నన్ను చేరుటకు) యత్నించుచుందురు | భక్త్యా | = | అనన్యభక్తితో |
| | | | మామ్ | = | నన్ను |
| | | | ఉపాసతే | = | ఉపాసించుచుందురు |

ఆ దృఢవ్రతులైన భక్తులు నా నామగుణములను నిరంతరము వాద్యబృందముతో కీర్తింతురు. నన్ను చేరుటకు యత్నింతురు. పదేపదే నాకు ప్రణమిల్లుదురు. సర్వదా నా ధ్యానమునందే నిమగ్నులయ్యెదరు. అనన్య భక్తితో నన్ను ఉపాసింతురు. (14)

**జ్ఞానయజ్ఞేన చాప్యన్యే యజంతో మాముపాసతే ।**
**ఏకత్వేన పృథక్త్వేన బహుధా విశ్వతోముఖమ్ ॥ 15 ॥**

జ్ఞానయజ్ఞేన, చ, అపి, అన్యే, యజంతః, మామ్, ఉపాసతే,
ఏకత్వేన, పృథక్త్వేన, బహుధా, విశ్వతోముఖమ్ ॥ 15 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| అన్యే | = | మఱికొందఱు జ్ఞాన యోగులు | యజంతః | = | పూజింతురు |
| మామ్ | = | నిర్గుణ నిరాకార బ్రహ్మమైన నన్ను | అపి, చ | = | మఱికొందఱు |
| జ్ఞానయజ్ఞేన | = | జ్ఞానయజ్ఞము ద్వారా | బహుధా | = | అనేకవిధములుగానున్న |
| ఏకత్వేన | = | అభేదభావముతో | విశ్వతోముఖమ్ | = | నా విరాట్ స్వరూపమును |
| | | | పృథక్త్వేన | = | పృథగ్భావముతో |
| | | | ఉపాసతే | = | ఉపాసింతురు |

మఱికొందరు జ్ఞానులు నిర్గుణనిరాకారబ్రహ్మనైన నన్ను జ్ఞానయజ్ఞముద్వారా అభేదభావముతో ఉపాసించుచుందురు. మఱికొందరు అనంతరూపములతో ఒప్పెడి నా విరాట్స్వరూపమును పృథక్ భావముతో ఆరాధించుచుందురు. (15)

**అహం క్రతురహం యజ్ఞః స్వధాహమహమౌషధమ్ ।**
**మంత్రోఽహమహమేవాజ్యమ్ అహమగ్నిరహం హుతమ్ ॥ 16 ॥**

అహమ్, క్రతుః, అహమ్, యజ్ఞః, స్వధా, అహమ్, అహమ్, ఔషధమ్,
మంత్రః, అహమ్, అహమ్, ఏవ, ఆజ్యమ్, అహమ్, అగ్నిః, అహమ్, హుతమ్ ॥ 16 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| అహమ్, ఏవ | = | నేనే | అహమ్ | = | నేనే |
| క్రతుః | = | క్రతువును | మంత్రః | = | మంత్రమును |
| అహమ్ | = | నేనే | అహమ్, ఏవ | = | నేనే |
| యజ్ఞః | = | యజ్ఞమును | ఆజ్యమ్ | = | ఘృతమును |
| అహమ్ | = | నేనే | అహమ్ | = | నేనే |
| స్వధా | = | స్వధయును | అగ్నిః | = | అగ్ని(ని) |
| అహమ్ | = | నేనే | అహమ్ | = | నేనే |
| ఔషధమ్ | = | ఔషధమును | హుతమ్ | = | హోమక్రియయును |

నేనే క్రతువును. నేనే యజ్ఞమును, స్వధయును నేనే, ఓషధులును నేనే. నేనే మంత్రమును, నేనేఘృతమును.నేనే అగ్నిని. హోమరూపక్రియయును నేనే. (16)

**పితాహమస్య జగతో మాతా ధాతా పితామహః ।**
**వేద్యం పవిత్రమోంకార ఋక్సామ యజురేవ చ ॥ 17 ॥**

పితా, అహమ్, అస్య, జగతః, మాతా, ధాతా, పితామహః,
వేద్యమ్, పవిత్రమ్, ఓంకారః, ఋక్, సామ, యజుః, ఏవ, చ ॥ 17 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| అస్య | = | ఈ | పితా | = | తండ్రియు |
| జగతః | = | జగత్తునకు | మాతా | = | తల్లియు |
| ధాతా | = | ధాతయు (ధరించువాడను, కర్మఫలముల నిచ్చువాడను) | పితామహః | = | తాతయు |
| | | | వేద్యమ్[1] | = | తెలిసికొనదగిన వాడనూ |
| | | | పవిత్రమ్ | = | పవిత్రమైనవాడనూ |

1) *గీత- 13వ అధ్యాయము 12 నుండి 17వ శ్లోకమువఱకును చూడవలెను.*

| | | | |
|---|---|---|---|
| ఓంకారః | = ఓంకారమును | చ | = మఱియు |
| ఋక్ | = ఋగ్వేదమును | యజుః | = యజుర్వేదమును |
| సామ | = సామవేదమును | అహమ్, ఏవ | = నేనే |

ఈ సమస్త జగత్తునకు ధాతను అనగా ధరించువాడను, అట్లే కర్మలఫలములను ఇచ్చువాడను నేనే. తల్లియును, తండ్రియును, తాతయును నేనే. తెలిసికొనదగిన వాడనూ నేనే. పవిత్రుడను, ఓంకారమును నేనే. ఋక్సామయజుర్వేదములును నేనే. (17)

**గతిర్భర్తా ప్రభుః సాక్షీ నివాసః శరణం సుహృత్ ।**
**ప్రభవః ప్రలయః స్థానం నిధానం బీజమవ్యయమ్ ॥ 18 ॥**

గతిః, భర్తా, ప్రభుః, సాక్షీ, నివాసః, శరణమ్, సుహృత్,
ప్రభవః, ప్రలయః, స్థానమ్, నిధానమ్, బీజమ్, అవ్యయమ్ ॥ 18 ॥

| | | | |
|---|---|---|---|
| గతిః | = పరమగతియైన పరంధామమును | సుహృత్ | = సుహృత్తును |
| భర్తా | = భరించి, పోషించు వాడను | ప్రభవః, ప్రలయః | = అందఱి ఉత్పత్తి, ప్రలయములకు హేతువును |
| ప్రభుః | = అందఱికిని స్వామిని | స్థానమ్ | = వారి స్థితికి ఆధారమును |
| సాక్షీ | = అందఱి మంచి చెడ్డలను చూచువాడను | నిధానమ్ | = నిధానమును (పెన్నిధిని) |
| (అహమ్, ఏవ) | = నేనే | అవ్యయమ్ | = శాశ్వతమైన |
| నివాసః | = నివాసస్థానమును | బీజమ్ | = కారణమును |
| శరణమ్ | = శరణుపొందదగినవాడను | (అహమ్, ఏవ) | = నేనే |

పరమగతియైన పరమధామమును, జగత్తును భరించి, పోషించువాడను నేనే. అందరికిని స్వామిని, అందరిశుభాశుభములను చూచువాడను నేనే, అందఱికిని నివాసస్థానమును, శరణుపొందదగినవాడను నేనే, ప్రత్యుపకారమును ఆసింపక హితమొనర్చువాడను. అందఱి ఉత్పత్తిప్రళయములకు హేతువును, వారి స్థితికి ఆధారమును, నిధానమును, శాశ్వతకారణమును నేనే. (18)

**తపామ్యహమహం వర్షం నిగృహ్ణామ్యుత్సృజామి చ ।**
**అమృతం చైవ మృత్యుశ్చ సదసచ్చాహమర్జున ॥ 19 ॥**

తపామి, అహమ్, అహమ్, వర్షమ్, నిగృహ్ణామి, ఉత్సృజామి, చ,
అమృతమ్, చ, ఏవ, మృత్యుః, చ, సత్, అసత్, చ, అహమ్, అర్జున ॥ 19 ॥

| | | | |
|---|---|---|---|
| అర్జున! | = ఓ అర్జునా! | ఉత్సృజామి | = వర్షించుచున్నాను |
| అహమ్ | = నేను | అహమ్, ఏవ | = నేనే |
| తపామి | = సూర్యరూపమున తపించుచున్నాను | అమృతమ్ | = అమృతమును |
| | | చ | = మఱియు |
| వర్షమ్ | = (సముద్రములనుండి) వర్షజలములను | మృత్యుః, చ | = మృత్యువును |
| | | సత్, అసత్, చ | = సత్తును, అసత్తును గూడ |
| నిగృహ్ణామి | = ఆకర్షించుచున్నాను | | |
| చ | = మఱియు | అహమ్, (ఏవ) | = నేనే. |

ఓ అర్జునా! సూర్యరూపమున నేనే తపించుచున్నాను. సముద్రములనుండి నీటిని గ్రహించి , వర్షరూపమున మఱల వదలెదను. అమృతమును, మృత్యువును గూడ నేనే. సత్తును(శాశ్వతమైన ఆత్మను), అసత్తును (నశ్వరమైన సమస్త వస్తుజాలమును) గూడ నేనే. (19)

**త్రైవిద్యా మాం సోమపాః పూతపాపా**
**యజ్ఞైరిష్ట్వా స్వర్గతిం ప్రార్థయంతే ।**
**తే పుణ్యమాసాద్య సురేంద్రలోకమ్**
**అశ్నంతి దివ్యాన్ దివి దేవభోగాన్ ॥ 20 ॥**

త్రైవిద్యాః, మామ్, సోమపాః, పూతపాపాః, యజ్ఞైః, ఇష్ట్వా, స్వర్గతిమ్, ప్రార్థయంతే,
తే, పుణ్యమ్, ఆసాద్య, సురేంద్రలోకమ్, అశ్నంతి, దివ్యాన్, దివి, దేవభోగాన్ ॥ 20 ॥

| | | | |
|---|---|---|---|
| త్రైవిద్యాః | = ఋగ్యజుస్సామవేదములచే ప్రోక్తములైన సకామకర్మలను ఆచరించువారును | యజ్ఞైః | = యజ్ఞములద్వారా |
| | | మామ్ | = నన్ను |
| | | ఇష్ట్వా | = పూజించి |
| | | స్వర్గతిమ్ | = స్వర్గప్రాప్తిని |
| సోమపాః | = సోమరసపానము చేయువారును | ప్రార్థయంతే | = అర్థించుచుందురు |
| | | తే | = ఆ పురుషులు |
| పూతపాపాః[1] | = పాపరహితులును అగు పురుషులు | పుణ్యమ్ | = పుణ్యఫలరూపమైన |
| | | సురేంద్రలోకమ్ | = స్వర్గలోకమును |

1) స్వర్గప్రాప్తికి ప్రతిబంధకములైన దేవాది-ఋణ రూప పాపములనుండి పవిత్రులైనవారు

| | | | |
|---|---|---|---|
| ఆసాద్య | = పొంది | దేవభోగాన్ | = దేవభోగములను |
| దివి | = స్వర్గమునందు | అశ్నంతి | = అనుభవింతురు. |
| దివ్యాన్ | = దివ్యములైన | | |

ఋగ్యజుస్సామవేదములచే ప్రోక్తములైన సకామకర్మలను చేయువారును, సోమరసపానముచేయువారును, పాపరహితులై యజ్ఞములద్వారా నన్ను సేవించి, స్వర్గప్రాప్తిని కోరుచుందురు. అట్టి పురుషులు తమ పుణ్యఫలరూపమైన స్వర్గలోకమును పొందుదురు. అచ్చటి దేవతలదివ్యభోగములను అనుభవింతురు. (20)

**తే తం భుక్త్వా స్వర్గలోకం విశాలం**
**క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి ।**
**ఏవం త్రయీధర్మమనుప్రపన్నా**
**గతాగతం కామకామా లభంతే ॥ 21 ॥**

తే, తమ్, భుక్త్వా, స్వర్గలోకమ్, విశాలమ్, క్షీణే, పుణ్యే, మర్త్యలోకమ్, విశంతి,
ఏవమ్, త్రయీధర్మమ్, అనుప్రపన్నాః గతాగతమ్, కామకామాః, లభంతే ॥ 21 ॥

| | | | |
|---|---|---|---|
| తే | = ఆ పురుషులు | త్రయీధర్మమ్ | = (స్వర్గప్రాప్తి సాధనములైన) వేద త్రయ విహిత సకామ కర్మఫలము(ల)ను |
| తమ్ | = ఆ | అనుప్రపన్నాః | = ఆశ్రయించువారును |
| విశాలమ్ | = విశాలములైన | కామకామాః | = భోగములను ఆసించువారై |
| స్వర్గలోకమ్ | = స్వర్గలోకభోగములను | గతాగతమ్ | = స్వర్గమర్త్యలోకముల మధ్య రాకపోకలను, |
| భుక్త్వా | = అనుభవించి | లభంతే | = పొందుదురు (సాగింతురు), (పుణ్యప్రభావముచే స్వర్గమునకు పోవుదురు. పుణ్యము క్షీణింపగానే మర్త్యలోకమునకు వచ్చెదరు). |
| పుణ్యే | = పుణ్యములు | | |
| క్షీణే | = క్షీణింపగనే | | |
| మర్త్యలోకమ్ | = మనుష్యలోకమును | | |
| విశంతి | = ప్రవేశింతురు | | |
| ఏవమ్ | = ఈ ప్రకారముగా | | |

ఆ విశాలస్వర్గమునందు భోగములను అనుభవించి, పుణ్యములు అయిపోగానే (క్షీణింపగానే) మఱల మర్త్యలోకమున ప్రవేశింతురు. ఈ విధముగ స్వర్గప్రాప్తి సాధనములైన వేదత్రయవిహితసకామకర్మలను ఆశ్రయించువారు, భోగములను ఆసించుచూ

స్వర్గమర్త్యలోకములమధ్య రాకపోకలు సాగించుచుందురు. అనగా పుణ్యప్రభావముచే స్వర్గమునకు పోవుదురు. పుణ్యము క్షీణింపగనే మర్త్య లోకమునకు వచ్చెదరు. (21)

**అనన్యాశ్చింతయంతో మాం యే జనాః పర్యుపాసతే ।**
**తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్ ॥ 22 ॥**

అనన్యాః, చింతయంతః, మామ్, యే, జనాః, పర్యుపాసతే,
తేషామ్, నిత్యాభియుక్తానామ్, యోగక్షేమమ్, వహామి, అహమ్ ॥ 22 ॥

| | | | |
|---|---|---|---|
| యే, అనన్యాః, జనాః | = అనన్యభక్తులైన ఏ పురుషులు | నిత్యాభి యుక్తానామ్ | = నిరంతరము నన్నే చింతించునట్టి |
| మామ్ | = పరమేశ్వరుడనైన నన్ను | తేషామ్ | = ఆ పురుషుల యొక్క |
| చింతయంతః | = నిరంతరము చింతించుచు (ఉన్నవారై) | యోగక్షేమమ్[1] | = యోగక్షేమములను |
| పర్యుపాసతే | = (నిష్కామభావముతో) సేవింతురో | అహమ్ | = నేనే (స్వయముగా) |
| | | వహామి | = వహింతును. |

పరమేశ్వరుడనైన నన్నే నిరంతరము అనన్య భక్తితో చింతనచేయుచు, నిష్కామ భావముతో సేవించువారియోగక్షేమములను నేనే వహించుచుందును. (అప్రాప్త వస్తుప్రాప్తిని 'యోగము' అనియందురు. ప్రాప్తించిన వస్తురక్షణమును 'క్షేమము' అని యందురు.) (22)

**యేఽప్యన్యదేవతా భక్తా యజంతే శ్రద్ధయాన్వితాః ।**
**తేఽపి మామేవ కౌంతేయ యజంత్యవిధిపూర్వకమ్ ॥ 23 ॥**

యే, అపి, అన్యదేవతాః, భక్తాః, యజంతే, శ్రద్ధయా, అన్వితాః,
తే, అపి, మామ్, ఏవ, కౌంతేయ, యజంతి, అవిధిపూర్వకమ్ ॥ 23 ॥

| | | | |
|---|---|---|---|
| కౌంతేయ! | = ఓ కుంతీసుతా! | యజంతే | = పూజింతురో |
| అపి | = అయినప్పటికిని | తే, అపి | = వారుకూడ |
| యే | = ఏ | మామ్, ఏవ | = నన్నే |
| భక్తాః | = సకామ భక్తులు | యజంతి | = పూజించుచున్నారు కాని, వారి పూజలు |
| శ్రద్ధయాన్వితాః | = శ్రద్ధాదరములుగలవారై | | |
| అన్యదేవతాః | = ఇతర దేవతలను | అవిధిపూర్వకమ్ | = విధ్యుక్తములు కానివి |

1) భగవత్స్వరూపప్రాప్తిని 'యోగము' అందురు. భగవత్ప్రాప్తినిమిత్తము చేయబడు సాధనలను రక్షించుటను 'క్షేమము' అని యందురు.

ఓ అర్జునా! శ్రద్ధాన్వితులైన సకామ భక్తులు ఇతరదేవతలను పూజించినప్పటికిని, వారు నన్ను పూజించినట్లే. కాని, వారిపూజలు అవిధిపూర్వకములైనవి. అనగా అజ్ఞానముతో కూడినవి. (23)

**అహం హి సర్వయజ్ఞానాం భోక్తా చ ప్రభురేవ చ ।**
**న తు మామభిజానంతి తత్త్వేనాతశ్చ్యవంతి తే ॥ 24 ॥**

అహమ్, హి, సర్వయజ్ఞానామ్, భోక్తా, చ, ప్రభుః, ఏవ, చ,
న, తు, మామ్, అభిజానంతి, తత్త్వేన, అతః, చ్యవంతి, తే ॥ 24 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| హి | = | ఏలనన | మామ్ | = | పరమేశ్వరుడనైన నన్ను |
| సర్వయజ్ఞానామ్ | = | సకలయజ్ఞములకును | తత్త్వేన | = | తత్త్వపూర్వకముగా (నాపరమేశ్వర తత్త్వమును) |
| భోక్తా | = | భోక్తయును | | | |
| చ | = | మఱియు | | | |
| ప్రభుః, చ | = | స్వామియును | న, అభిజానంతి | = | ఎఱుంగరు |
| అహమ్, ఏవ | = | నేనే | అతః | = | ఇందువలన |
| తు | = | కాని | చ్యవంతి | = | పతనమగుదురు (పునర్జన్మను పొందుదురు) |
| తే | = | వారు | | | |

ఏలనన, సకల యజ్ఞములకును భోక్తను, స్వామిని గూడ నేనే. వారు నా పరమేశ్వర తత్త్వమును ఎఱుంగరు. కావున, పతనమగుదురు అనగా పునర్జన్మను పొందుదురు. (24)

**యాంతి దేవవ్రతా దేవాన్ పితౄన్ యాంతి పితృవ్రతాః ।**
**భూతాని యాంతి భూతేజ్యా యాంతి మద్యాజినోఽపి మామ్ ॥ 25 ॥**

యాంతి, దేవవ్రతాః, దేవాన్, పితౄన్, యాంతి, పితృవ్రతాః,
భూతాని, యాంతి, భూతేజ్యాః, యాంతి, మద్యాజినః, అపి, మామ్ ॥ 25 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| దేవవ్రతాః | = | దేవతలను పూజించువారు | పితౄన్ | = | పితృలోకములను |
| | | | యాంతి | = | పొందుదురు |
| దేవాన్ | = | దేవతలను | భూతేజ్యాః | = | భూతప్రేతములను అర్చించువారు |
| యాంతి | = | పొందుదురు | | | |
| పితృవ్రతాః | = | పితరులను సేవించువారు | భూతాని | = | భూతప్రేతరూపములను |
| | | | యాంతి | = | పొందుదురు |

| | | | |
|---|---|---|---|
| మద్యాజినః | = నన్ను ఆరాధించు భక్తులు | మామ్, అపి | = నన్నే |
| | | యాంతి | = పొందుదురు.[1] |

దేవతలను పూజించువారు దేవలోకములను చేరుదురు. పితరులను సేవించువారు పితృలోకములకు వెళ్ళుదురు. భూతప్రేతములను అర్చించువారు భూతప్రేత రూపములను పొందుదురు. నన్ను ఆరాధించు భక్తులు నన్నే పొందుదురు. అట్టి నా భక్తులకు పునర్జన్మ ఉండదు. (25)

**పత్రం పుష్పం ఫలం తోయం యో మే భక్త్యా ప్రయచ్ఛతి ।**
**తదహం భక్త్యుపహృతమ్ అశ్నామి ప్రయతాత్మనః ॥ 26 ॥**

పత్రమ్, పుష్పమ్, ఫలమ్, తోయమ్, యః, మే, భక్త్యా, ప్రయచ్ఛతి,
తత్, అహమ్, భక్త్యుపహృతమ్, అశ్నామి, ప్రయతాత్మనః ॥ 26 ॥

| | | | |
|---|---|---|---|
| యః | = ఏ పురుషుడు | ప్రయతాత్మనః | = నిర్మలబుద్ధి, నిష్కామ భావముగల భక్తునిచే |
| మే | = నాకు | | |
| భక్త్యా | = భక్తితో | భక్త్యుపహృతమ్ | = భక్తి పూర్వకముగా సమర్పితమైన |
| పత్రమ్ | = పత్రమునుగాని | | |
| పుష్పమ్ | = పుష్పమునుగాని | తత్ | = ఆ పత్ర, పుష్పాదులను |
| ఫలమ్ | = ఫలమునుగాని | అహమ్ | = నేను (సగుణరూపమున) |
| తోయమ్ | = జలమునుగాని | అశ్నామి | = స్వయముగా, ప్రీతితో ఆరగింతును. |
| ప్రయచ్ఛతి | = సమర్పించుచున్నాడో | | |

నిర్మలబుద్ధితో, నిష్కామభావముతో పరమభక్తునిచే సమర్పింపబడిన పత్రమునుగాని, పుష్పమునుగాని, ఫలమునుగాని, జలమును గాని, నేను ప్రత్యక్షముగా (స్వయముగా) ప్రీతితో ఆరగింతును. (26)

**యత్కరోషి యదశ్నాసి యజ్జుహోషి దదాసి యత్ ।**
**యత్తపస్యసి కౌంతేయ తత్కురుష్వ మదర్పణమ్ ॥ 27 ॥**

యత్, కరోషి, యత్, అశ్నాసి, యత్, జుహోషి, దదాసి, యత్,
యత్, తపస్యసి, కౌంతేయ, తత్, కురుష్వ, మదర్పణమ్ ॥ 27 ॥

| | | | |
|---|---|---|---|
| కౌంతేయ! | = ఓ కుంతీసుతా! | యత్ | = ఏ పదార్థమును |
| యత్ | = ఏ కర్మను | అశ్నాసి | = తినెదవో |
| కరోషి | = ఆచరించుదువో | యత్ | = ఏ హవ్యమును |

1) 8వ అధ్యాయము 16వ శ్లోకము చూడవలెను.

| | | | | | |
|---|---|---|---|---|---|
| జుహోషి | = | హోమముచేయుదువో | తపస్యసి | = | తపమొనరించుదువో |
| యత్ | = | దేనిని | తత్ | = | ఆ కర్మలన్నింటినీ |
| దదాసి | = | దానము చేయుదువో | మదర్పణమ్, కురుష్వ | = | నాకే అర్పింపుము. |
| యత్ | = | దేనినిగూర్చి | | | |

ఓ కౌంతేయా! నీవు ఆచరించు కర్మను, భుజించెడి ఆహారమును, హోమముచేయు హవ్యమును, అర్పించు దానమును, ఆచరించు తపస్సును నాకే సమర్పింపుము. (27)

**శుభాశుభఫలైరేవం మోక్ష్యసే కర్మబంధనైః ।**
**సన్న్యాసయోగయుక్తాత్మా విముక్తో మాముపైష్యసి ॥ 28 ॥**

శుభాశుభఫలైః, ఏవమ్, మోక్ష్యసే, కర్మబంధనైః,
సన్న్యాసయోగయుక్తాత్మా, విముక్తః, మామ్, ఉపైష్యసి ॥ 28 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| ఏవమ్ | = | ఈ ప్రకారముగా | శుభాశుభఫలైః | = | శుభాశుభఫల రూపములైన |
| సన్న్యాసయోగ యుక్తాత్మా | = | సన్న్యాసయోగముతో యుక్తమైన ఆత్మకల వాడవై అనగా సమస్త కర్మలను భగవంతుడ నైన నాకు అర్పించి | కర్మబంధనైః | = | కర్మబంధముల నుండి |
| | | | మోక్ష్యసే | = | ముక్తుడవయ్యెదవు |
| | | | విముక్తః | = | విముక్తుడవైన పిదప-నీవు |
| | | | మామ్ (ఏవ) | = | నన్నే |
| | | | ఉపైష్యసి | = | చేరగలవు. |

ఈ విధముగా సన్న్యాసయోగమునందు స్థిరచిత్తుడవై, అనగా సమస్తకర్మలను భగవంతుడనైన నాకే సమర్పించి, శుభాశుభఫలరూపకర్మబంధముల నుండి ముక్తుడవయ్యెదవు. పిదప నన్నే చేరగలవు. (28)

**సమోఽహం సర్వభూతేషు న మే ద్వేష్యోఽస్తి న ప్రియః ।**
**యే భజంతి తు మాం భక్త్యా మయి తే తేషు చాప్యహమ్ ॥ 29 ॥**

సమః, అహమ్, సర్వభూతేషు, న, మే, ద్వేష్యః, అస్తి, న, ప్రియః,
యే, భజంతి, తు, మామ్, భక్త్యా, మయి, తే, తేషు, చ, అపి, అహమ్ ॥ 29 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| అహమ్ | = | నేను | సమః | = | సమభావముతో వ్యాపించియుందును |
| సర్వభూతేషు | = | సమస్తప్రాణుల యందును | మే | = | నాకు |

| | | | | | |
|---|---|---|---|---|---|
| ద్వేష్యః | = | అప్రియమైనవాడును | తే | = | వారు |
| న, అస్తి | = | లేడు | మయి | = | నాయందు (స్థితులై యుందురు) |
| ప్రియః | = | ప్రియమైనవాడును | | | |
| న, అస్తి | = | లేడు | | | |
| తు | = | కాని | చ | = | మఱియు |
| యే | = | ఏ భక్తులు | అహమ్, అపి | = | నేనును |
| మామ్ | = | నన్ను | తేషు[1] | = | వారియందు (ప్రత్యక్షముగా ఉందును). |
| భక్త్యా | = | భక్తితో | | | |
| భజంతి | = | భజింతురో | | | |

నేను సకలభూతముల (ప్రాణుల) యందును సమభావముతో వ్యాపించియుందును. నాకు అప్రియుడు గాని, ప్రియుడు గాని ఎవ్వడును లేడు. కాని, నన్ను భక్తితో భజించువారు నాయందేయుందురు. నేనును వారియందు ప్రత్యక్షముగా ఉందును. (29)

**అపి చేత్ సుదురాచారో భజతే మామనన్యభాక్ ।**
**సాధురేవ స మంతవ్యః సమ్యగ్వ్యవసితో హి సః ॥ 30 ॥**

అపి, చేత్, సుదురాచారః, భజతే, మామ్, అనన్యభాక్,
సాధుః, ఏవ, సః, మంతవ్యః, సమ్యక్, వ్యవసితః, హి, సః ॥ 30 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| సుదురాచారః, అపి | = | మిక్కిలి దురాచారుడైన వాడును | సాధుః, ఏవ | = | సత్పురుషుడుగానే |
| | | | మంతవ్యః | = | భావింపదగినవాడు |
| అనన్యభాక్ | = | అనన్య భావముతో నాభక్తుడై | హి | = | ఏలనన |
| | | | సః | = | అతడు |
| మామ్ | = | నన్ను | సమ్యక్ | = | యథార్థముగా |
| భజతే, చేత్ | = | భజించినట్లయితే | వ్యవసితః | = | నిశ్చయబుద్ధిగల వాడు. |
| సః | = | అతడు | | | |

మిక్కిలి దురాచారుడైనను అనన్యభక్తితో నన్ను భజించినచో, అతనిని సత్పురుషునిగానే భావింపదగును. ఏలనన, యథార్థముగా అతడు నిశ్చయబుద్ధి

1. అగ్ని సూక్ష్మరూపమున అంతటను వ్యాపించియున్నను సాధనలద్వారా ప్రత్యక్షముగా ప్రకటితుడైనట్లు పరమేశ్వరుడు సర్వత్ర స్థితుడైయున్నను, భక్తితో భజించువారి అంతః కరణములయందే ప్రత్యక్షముగా ప్రకటితుడగును.

గలవాడు. అనగా- పరమాత్మని సేవించుటతో సమానమైనది మఱియొకటి ఏదియును లేదని గట్టిగా నిశ్చయించుకొనినవాడు. (30)

**క్షిప్రం భవతి ధర్మాత్మా శశ్వచ్ఛాంతిం నిగచ్ఛతి ।**
**కౌంతేయ ప్రతిజానీహి న మే భక్తః ప్రణశ్యతి ॥ 31 ॥**

క్షిప్రమ్, భవతి, ధర్మాత్మా, శశ్వత్, శాంతిమ్, నిగచ్ఛతి,
కౌంతేయ, ప్రతిజానీహి, న, మే, భక్తః, ప్రణశ్యతి ॥ 31 ॥

కౌంతేయ! = ఓ కుంతీసుతా!
(సః) = (అతడు)
క్షిప్రమ్ = శీఘ్రముగా
ధర్మాత్మా = ధర్మాత్ముడు
భవతి = అగును
శశ్వత్ = శాశ్వతమైన
శాంతిమ్ = పరమశాంతిని
నిగచ్ఛతి = పొందును
మే, భక్తః = నా భక్తుడు
న, ప్రణశ్యతి = ఎన్నడును నష్టము పాలుగాడు-అని
ప్రతిజానీహి = నిశ్చయముగా ఎఱుంగుము.

ఓ కౌంతేయా! అతడు శీఘ్రముగా ధర్మాత్ముడగును. శాశ్వతమైన పరమశాంతిని పొందును.'నా భక్తుడెన్నడును నష్టమునకు గురికాడు' అను విషయమును నిశ్చయముగా ఎఱుంగుము. (31)

**మాం హి పార్థ వ్యపాశ్రిత్య యేఽపి స్యుః పాపయోనయః ।**
**స్త్రియో వైశ్యాస్తథా శూద్రాః తేఽపి యాంతి పరాం గతిమ్ ॥ 32 ॥**

మామ్, హి, పార్థ, వ్యపాశ్రిత్య, యే, అపి, స్యుః, పాపయోనయః,
స్త్రియః, వైశ్యాః, తథా, శూద్రాః, తే, అపి, యాంతి, పరామ్, గతిమ్ ॥ 32 ॥

హి = ఏలనన
పార్థ! = ఓ పార్థా!
స్త్రియః = స్త్రీలు
వైశ్యాః = వైశ్యులు
శూద్రాః, తథా = శూద్రులు అట్లే
పాపయోనయః = చండాలాది పాప యోనిజులు
యే, అపి, స్యుః = ఎవ్వరైననూ
తే, అపి = వారందఱును
మామ్ = నన్ను
వ్యపాశ్రిత్య = శరణుపొంది
పరామ్, గతిమ్ = పరమగతినే
యాంతి = పొందుదురు.

ఓ అర్జునా! స్త్రీ, వైశ్య , శూద్రులును, అట్లే చండాలాదిపాపయోనిజాలును నన్నే శరణుపొంది పరమగతినే పొందుదురు. (32)

**కిం పునర్బ్రాహ్మణాః పుణ్యా భక్తా రాజర్షయస్తథా ।**
**అనిత్యమసుఖం లోకమ్ ఇమం ప్రాప్య భజస్వ మామ్ ॥ 33 ॥**

కిమ్, పునః, బ్రాహ్మణాః, పుణ్యాః, భక్తాః, రాజర్షయః, తథా,
అనిత్యమ్, అసుఖమ్, లోకమ్, ఇమమ్, ప్రాప్య, భజస్వ, మామ్ ॥ 33 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| పుణ్యాః | = | పుణ్యాత్ములైన | అసుఖమ్ | = | సుఖరహితమైన |
| బ్రాహ్మణాః | = | బ్రాహ్మణులును | అనిత్యమ్ | = | క్షణభంగురమైన (ఐనను దుర్లభమైన) |
| తథా | = | అట్లే | | | |
| రాజర్షయః | = | రాజర్షులును, ఐన | ఇమమ్ | = | ఈ |
| భక్తాః | = | భక్తులు - (వీరు భగవంతుని శరణు పొందినచో) పరమపదమును పొందుదురను విషయమున | లోకమ్ | = | మనుష్యలోకమును (మనుష్య శరీరమును) |
| | | | ప్రాప్య | = | పొంది (నిరంతరము) |
| కిమ్, పునః | = | చెప్పవలసినది ఏమున్నది? | మామ్ | = | నన్ను |
| | | | భజస్వ | = | భజింపుము. |

ఇక, పుణ్యాత్ములైన బ్రాహ్మణులును, రాజర్షులును, భక్తులును నన్ను శరణుపొందినచో, వారు పరమపదమునుచేరుదురని చెప్పవలసిన పనియేలేదు. ఈ మానవశరీరము క్షణభంగురము. సుఖరహితము. ఐనను దుర్లభము. కనుక, దీనిని పొంది- నిరంతరము నన్నే భజింపుము. (33)

**మన్మనా భవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు ।**
**మామేవైష్యసి యుక్త్వైవమ్ ఆత్మానం మత్పరాయణః ॥ 34 ॥**

మన్మనాః, భవ, మద్భక్తః, మద్యాజీ, మామ్, నమస్కురు,
మామ్, ఏవ, ఏష్యసి, యుక్త్వా, ఏవమ్, ఆత్మానమ్, మత్పరాయణః ॥ 34 ॥

| | | | |
|---|---|---|---|
| మన్మనాః | = నాయందు మనస్సు కలవాడవు | నమస్కురు | = నమస్కరింపుము |
| భవ | = కమ్ము(అగుము) | ఏవమ్ | = ఈ విధముగా |
| మద్భక్తః | = నా భక్తుడవు | ఆత్మానమ్ | = ఆత్మను |
| (భవ) | = కమ్ము (అగుము) | యుక్త్వా | = (నాయందే) నిలిపి |
| మద్యాజీ | = నన్ను పూజించు వాడవు | మత్పరాయణః | = మత్పరాయణుడవై |
| (భవ) | = కమ్ము(అగుము) | మామ్, ఏవ | = నన్నే |
| మామ్ | = నన్ను (నాకు) | ఏష్యసి | = పొందగలవు. |

నా యందే నీ మనస్సును లగ్నము చేయుము. నా భక్తుడవు కమ్ము. నన్నే పూజింపుము. నాకు నమస్కరింపుము. ఈ విధముగా ఆత్మను నాయందే నిలిపి, మత్పరాయణుడవైనచో నీవు నన్నే పొందగలవు. (34)

ఓం తత్సదితి శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే రాజవిద్యారాజగుహ్యయోగోనామ నవమోఽధ్యాయః ॥ ౯ ॥

॥ ఓం శ్రీపరమాత్మనే నమః ॥

# అథ దశమోఽధ్యాయః - విభూతియోగః

## (పదియవ అధ్యాయము-విభూతియోగము)

ముఖ్యాంశములు : [(1 నుండి 7వ శ్లోకమువఱకు) భగవంతుని విభూతి-యోగశక్తుల కథనము, వానిని తెలిసికొనుటవలన కలుగు ఫలము. (8 నుండి 11 వఱకు) ఫలప్రభావసహితభక్తియోగప్రస్తావనము. (12 నుండి 18 వఱకు) అర్జునుడు భగవంతుని స్తుతించుట, అతని విభూతులను యోగశక్తులను గూర్చి తెల్పుమని ప్రార్థించుట. (19 నుండి 42 వఱకు) భగవంతుడు తన విభూతులను గూర్చియు, యోగశక్తులను గూర్చియు వర్ణించుట.]

**శ్రీభగవాన్ ఉవాచ**

**భూయ ఏవ మహాబాహో శృణు మే పరమం వచః ।**
**యత్తేఽహం ప్రీయమాణాయ వక్ష్యామి హితకామ్యయా ॥ 1 ॥**

భూయః, ఏవ, మహాబాహో, శృణు, మే, పరమమ్, వచః,
యత్, తే, అహమ్, ప్రీయమాణాయ, వక్ష్యామి, హితకామ్యయా ॥ 1 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| మహాబాహో | = | ఓ అర్జునా! | భూయః | = | మఱల |
| యత్, వచః | = | ఏమాట(ల)ను | అహమ్, వక్ష్యామి | = | నేను చెప్పబోవు చున్నానో |
| ప్రీయమాణాయ | = | నాపై ప్రేమాదరములు (భక్తివిశ్వాసములు) గలవాడవైన | మే | = | నాయొక్క |
| తే | = | నీకు | తత్, పరమమ్, వచః, ఏవ | = | ఆ సర్వశ్రేష్ఠములైన మాటలనే |
| హితకామ్యయా | = | హితమును చేయు కోరికతో | శృణు | = | వినుము. |

శ్రీ భగవానుడు పలికెను- హే మహాబాహో! నీవు నా మీద ప్రేమ గలవాడవు. కావున, నీమేలుగోరి నేను మఱల చెప్పుచున్న వచనములను వినుము. అవి మిక్కిలి గోప్యములు . మహిమాన్వితములు. (1)

**న మే విదుః సురగణాః ప్రభవం న మహర్షయః ।**
**అహమాదిర్హి దేవానాం మహర్షీణాం చ సర్వశః ॥ 2 ॥**

న, మే, విదుః, సురగణాః, ప్రభవమ్, న, మహర్షయః,
అహమ్, ఆదిః, హి, దేవానామ్, మహర్షీణామ్, చ, సర్వశః ॥ 2 ॥

| | | |
|---|---|---|
| మే | = | నాయొక్క |
| ప్రభవమ్ | = | పుట్టుక(ల)ను (లీలావతారము(ల)ను గూర్చి) |
| సురగణాః | = | దేవతలు |
| న, (విదుః) | = | ఎఱుంగరు |
| మహర్షయః | = | మహర్షులును |
| న, విదుః | = | ఎఱుంగరు |
| హి | = | ఏలనన |
| అహమ్ | = | నేను |
| సర్వశః | = | అన్నివిధములుగను |
| దేవానామ్, చ | = | దేవతలకును |
| మహర్షీణామ్, చ | = | మహర్షులకును |
| ఆదిః | = | ఆది (మూల)కారణమైన వాడను. |

నా ఉత్పత్తిని అనగా నా లీలావతారవిశేషములను దేవతలుగాని, మహర్షులుగాని తెలిసికొనజాలరు. ఏలనన, నేను అన్నివిధములుగా ఆ దేవతలకును, ఈ మహర్షులకును మూలకారణమైనవాడను. (2)

**యో మామజమనాదిం చ వేత్తి లోకమహేశ్వరమ్ ।**
**అసమ్మూఢః స మర్త్యేషు సర్వపాపైః ప్రముచ్యతే ॥ 3 ॥**

యః, మామ్, అజమ్, అనాదిమ్, చ, వేత్తి, లోకమహేశ్వరమ్,
అసమ్మూఢః, సః, మర్త్యేషు, సర్వపాపైః, ప్రముచ్యతే ॥ 3 ॥

| | | |
|---|---|---|
| యః | = | ఏ పురుషుడు |
| మామ్ | = | నన్ను |
| అజమ్ | = | జన్మరహితునిగను |
| అనాదిమ్[1] | = | అనాదియైనవానినిగను |
| చ | = | మరియు |
| లోకమహేశ్వరమ్ | = | సకలలోక మహేశ్వరునిగను |
| వేత్తి | = | ఎఱుంగునో |
| మర్త్యేషు | = | మానవులలో |
| అసమ్మూఢః | = | జ్ఞానియైన |
| సః | = | అతడు |
| సర్వపాపైః | = | సర్వపాపముల నుండియు |
| ప్రముచ్యతే | = | విముక్తుడగును. |

నన్ను యథార్థముగా జన్మరహితునిగను, అనాదియైన వానినిగను, సకలలోక మహేశ్వరునిగను తెలిసికొనువాడు మానవులలో జ్ఞాని. అట్టివాడు సర్వపాపముల నుండియు విముక్తుడగును. (3)

1) ఆదిరహితుడైనను అన్నింటికిని కారణమైనవానిని 'అనాది' యందురు.

**బుద్ధిర్ జ్ఞానమసమ్మోహః క్షమా సత్యం దమః శమః ।**
**సుఖం దుఃఖం భవోఽభావో భయం చాభయమేవ చ ॥ 4 ॥**
**అహింసా సమతా తుష్టిః తపో దానం యశోఽయశః ।**
**భవంతి భావా భూతానాం మత్త ఏవ పృథగ్విధాః ॥ 5 ॥**

బుద్ధిః, జ్ఞానమ్, అసమ్మోహః, క్షమా, సత్యమ్, దమః, శమః,
సుఖమ్, దుఃఖమ్, భవః, అభావః, భయమ్, చ, అభయమ్, ఏవ, చ ॥ 4 ॥
అహింసా, సమతా, తుష్టిః, తపః, దానమ్, యశః, అయశః,
భవంతి, భావాః, భూతానామ్, మత్తః, ఏవ, పృథగ్విధాః ॥ 5 ॥

| | | | |
|---|---|---|---|
| బుద్ధిః | = బుద్ధి (నిశ్చయాత్మక శక్తి) | అహింసా | = అహింస |
| జ్ఞానమ్ | = యథార్థజ్ఞానము | సమతా | = సమత్వము |
| అసమ్మోహః | = మోహరాహిత్యము | తుష్టిః | = సంతోషము |
| క్షమా | = క్షమ | తపః[1] | = తపస్సు |
| సత్యమ్ | = సత్యము | దానమ్ | = దానము |
| దమః | = ఇంద్రియనిగ్రహము | యశః | = కీర్తి |
| శమః, ఏవ | = మనోనిగ్రహము, అట్లే | అయశః | = అపకీర్తి |
| సుఖమ్, దుఃఖమ్ | = సుఖదుఃఖములు | ఏవమ్ | = ఈ మొదలగునవి |
| | | భూతానామ్ | = ప్రాణులయొక్క |
| భవః, అభావః | = ఉత్పత్తి ప్రళయములు | పృథగ్విధాః | = వివిధములగు |
| భయమ్, | = భయము | భావాః | = భావములన్నియును |
| అభయమ్ | = అభయము | మత్తః, ఏవ | = నానుండియే |
| చ | = మఱియు | భవంతి | = కలుగుచున్నవి. |

నిశ్చయాత్మకశక్తి, యథార్థజ్ఞానము, మోహరాహిత్యము, క్షమ, సత్యము, దమము (ఇంద్రియనిగ్రహము), శమము (మనోనిగ్రహము), సుఖదుఃఖములు, ఉత్పత్తి ప్రళయములు, భయము, అభయము, అహింస, సమత, సంతోషము, తపస్సు, దానము, కీర్తి, అపకీర్తి అనునవి ప్రాణులవివిధభావములు. ఇవి యన్నియును నావలననే కలుగును. (4.5)

1) స్వధర్మాచరణముద్వారా ఇంద్రియాదులను తప్తమొనర్చి, శుద్ధిచేయుటను 'తపము' అని యందురు.

**మహర్షయః సప్త పూర్వే చత్వారో మనవస్తథా ।**
**మద్భావా మానసా జాతా యేషాం లోక ఇమాః ప్రజాః ॥ 6 ॥**

మహర్షయః, సప్త, పూర్వే, చత్వారః, మనవః, తథా,
మద్భావాః, మానసాః, జాతాః, యేషామ్, లోకే, ఇమాః, ప్రజాః ॥ 6 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| లోకే | = | లోకమునందుగల | మనవః | = | చతుర్దశమనువులు (మొదలగువారు అందఱు)ను |
| ఇమాః, ప్రజాః | = | ఈప్రజలు | | | |
| యేషామ్ | = | ఎవరి యొక్క సంతానమో | | | |
| పూర్వే | = | (అట్టి) ప్రాచీనులైన | మద్భావాః | = | నాయందు భక్తి భావములు గల్గినవారై |
| సప్తమహర్షయః | = | సప్తమహర్షులును | | | |
| తథా | = | అట్లే వారికంటెను పూర్వులైన | | | |
| చత్వారః | = | సనకాది మహామునులు నలుగురును | మానసాః, జాతాః | = | నాసంకల్పము వలననే జన్మించిరి. |

సప్తమహర్షులును, వారికంటెను పూర్వులైన సనకాదిమహామునులు నలుగురును, స్వాయంభువాది చతుర్దశ మనువులును మొదలగు వీరందఱును నా భక్తులే. అందరూ నాయెడ సద్భావముగలవారే. వీరు నా సంకల్పమువలననే జన్మించిరి. ఈ జగత్తునందలి సమస్త ప్రాణులును వీరిసంతానమే. (6)

**ఏతాం విభూతిం యోగం చ మమ యో వేత్తి తత్త్వతః ।**
**సోఽవికంపేన యోగేన యుజ్యతే నాత్ర సంశయః ॥ 7 ॥**

ఏతామ్, విభూతిమ్, యోగమ్, చ, మమ, యః, వేత్తి, తత్త్వతః,
సః, అవికంపేన, యోగేన, యుజ్యతే, న, అత్ర, సంశయః ॥ 7 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| యః | = | ఏ పురుషుడు | యోగమ్ | = | యోగశక్తిని |
| మమ | = | నాయొక్క | తత్త్వతః | = | యథార్థముగా |
| ఏతామ్ | = | ఈ | వేత్తి[1] | = | ఎఱుంగునో |
| విభూతిమ్ | = | పరమైశ్వర్యరూపవిభూతిని | సః | = | ఆపురుషుడు |
| చ | = | మఱియు | అవికంపేన | = | నిశ్చలమైన |

1) దృశ్యమాత్రజగత్తు భగవంతునిమాయ యనియు, వాసుదేవుడే సర్వత్ర పరిపూర్ణుడై యుండుననియు తెలిసికొనుటయే తత్త్వముద్వారా తెలిసికొనుట యగును.

| | | | | | |
|---|---|---|---|---|---|
| యోగేన | = | భక్తియోగము చేత | అత్ర | = | ఈవిషయమున |
| యుజ్యతే | = | యుక్తుడగును | న, సంశయః | = | సంశయములేదు. |

ఈ నా పరమైశ్వర్యరూపవిభూతిని, యోగశక్తియొక్క తత్త్వమును తెలిసికొన్నవాడు, నిశ్చలభక్తియుక్తుడగును. ఇందు ఏమాత్రమూ సందేహమే లేదు. (7)

**అహం సర్వస్య ప్రభవో మత్తః సర్వం ప్రవర్తతే।**
**ఇతి మత్వా భజంతే మాం బుధా భావసమన్వితాః ॥ 8 ॥**

అహమ్, సర్వస్య, ప్రభవః, మత్తః, సర్వమ్, ప్రవర్తతే,
ఇతి, మత్వా, భజంతే, మామ్, బుధాః, భావసమన్వితాః ॥ 8 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| అహమ్ | = | నేనే | ప్రవర్తతే | = | నడచుచున్నది |
| సర్వస్య | = | సమస్త జగత్తుయొక్క | ఇతి, మత్వా | = | అని, తెలిసికొని |
| ప్రభవః | = | ఉత్పత్తికి మూల కారణమును | భావసమన్వితాః | = | భక్తిశ్రద్ధలు గల్గిన |
| | | | బుధాః | = | బుద్ధిమంతులైన భక్తులు |
| మత్తః | = | నావలననే | మామ్ | = | నన్నే |
| సర్వమ్ | = | జగత్తంతయు | భజంతే | = | నిరంతరము సేవింతురు. |

వాసుదేవుడనైన నేనే ఈ సమస్తజగత్తుయొక్క ఉత్పత్తికి మూలకారణము. నావలననే ఈ జగత్తంతయు నడుచుచున్నది . ఈ విషయమును బాగుగా ఎఱింగిన జ్ఞానులైన భక్తులు భక్తిశ్రద్ధలతో నిరంతరము నన్నే సేవింతురు. (8)

**మచ్చిత్తా మద్గతప్రాణా బోధయంతః పరస్పరమ్।**
**కథయంతశ్చ మాం నిత్యం తుష్యంతి చ రమంతి చ ॥ 9 ॥**

మచ్చిత్తాః, మద్గతప్రాణాః, బోధయంతః, పరస్పరమ్,
కథయంతః, చ, మామ్, నిత్యమ్, తుష్యంతి, చ, రమంతి, చ ॥ 9 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| మచ్చిత్తాః | = | నిరంతరము నాయందే చిత్తములను నిల్పిన వారును | పరస్పరమ్, బోధయంతః | = | నామహత్త్వమును గూర్చి పరస్పరము తెలుపుకొనుచు |
| మద్గత ప్రాణాః[1] | = | తమజీవితములను నాకే అంకితమొనర్చిన వారును, అగు భక్తులు | చ | = | అట్లే, (నాగుణ ప్రభావములను గూర్చి) |

1) వాసుదేవుడనైన నా కొఱకే తమ జీవితములను అర్పణ చేసినవారిని 'మద్గతప్రాణాః' అనియందురు.

| | | | |
|---|---|---|---|
| కథయంతః, చ | = కథలు కథలుగా చెప్పి కొనువారై | చ | = మఱియు |
| నిత్యమ్ | = సంతతము | మామ్, రమంతి | = నాయందే ఆనందించు చుందురు. |
| తుష్యంతి | = సంతుష్టులగుదురు. | | |

నా భక్తులు నాయందే తమ మనస్సులను లగ్నమొనర్తురు. తమ ప్రాణములను, తమ కర్మలన్నింటిని, తమ సర్వస్వమును నాకే అంకితమొనర్తురు. వారు పరస్పరచర్చల ద్వారా నా మహత్త్వమును గూర్చి ఒకరికొకరు తెలుపుకొనుచు, కథలు కథలుగా చెప్పికొనుచు, నిరంతరము సంతుష్టులగుచుందురు. మఱియు వారు సంతతము నాయందే రమించుచుందురు. (9)

**తేషాం సతతయుక్తానాం భజతాం ప్రీతిపూర్వకమ్ ।**
**దదామి బుద్ధియోగం తం యేన మాముపయాంతి తే ॥ 10 ॥**

తేషామ్, సతతయుక్తానామ్, భజతామ్, ప్రీతిపూర్వకమ్,
దదామి, బుద్ధియోగమ్, తమ్, యేన, మామ్ ఉపయాంతి, తే ॥ 10 ॥

| | | | |
|---|---|---|---|
| సతత యుక్తానామ్ | = నిరంతరము నా ధ్యానమునందే నిమగ్నులైనవారును | యేన | = ఏబుద్ధియోగము ద్వారా |
| | | తే | = వారు |
| | | మామ్ | = నన్ను |
| ప్రీతిపూర్వకమ్ భజతామ్ | = ప్రీతితో నన్నే భజించు వారును-అగు | ఉపయాంతి | = చేరుదురో |
| | | తమ్, బుద్ధి యోగమ్ | = అట్టి తత్త్వజ్ఞాన రూపయోగమును |
| తేషామ్ | = అట్టి నా భక్తులకు | దదామి | = ప్రసాదింతును |

అట్లు నిరంతరము ధ్యానాదులద్వారా నాయందే లగ్నమనస్కులై భక్తిశ్రద్ధలతో నన్నే భజించువారికి నేను బుద్ధియోగమును అనగా తత్త్వజ్ఞానరూపయోగమును ప్రసాదించెదను. దానిద్వారా వారు నన్నే పొందుదురు. (10)

**తేషామేవానుకంపార్థమ్ అహమజ్ఞానజం తమః ।**
**నాశయామ్యాత్మభావస్థో జ్ఞానదీపేన భాస్వతా ॥ 11 ॥**

తేషామ్, ఏవ, అనుకంపార్థమ్, అహమ్, అజ్ఞానజమ్, తమః,
నాశయామి, ఆత్మభావస్థః, జ్ఞానదీపేన, భాస్వతా ॥ 11 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| తేషామ్,- అనుకంపార్థమ్ | = | వారిని అనుగ్రహించుట కొఱకై | భాస్వతా | = | ప్రకాశించుచున్న |
| ఆత్మభావస్థః | = | వారి అంతఃకరణముల యందు స్థితుడనైయున్న | జ్ఞానదీపేన | = | తత్త్వజ్ఞానరూప దీపము ద్వారా |
| అహమ్, ఏవ | = | నేనే | నాశయామి | = | నశింప జేయుదును |
| అజ్ఞానజమ్, తమః | = | (వారి) అజ్ఞానజనిత మైన అంధకారమును | | | |

ఓ అర్జునా! వారి యంతఃకరణములయందు స్థితుడనైయున్న నేను వారిని అనుగ్రహించుటకై తేజోమయమైన తత్త్వజ్ఞానరూప దీపమును(జ్యోతిని) వెలిగించి, వారి అజ్ఞానాంధకారమును పారద్రోలెదను. (11)

**అర్జున ఉవాచ**

**పరం బ్రహ్మ పరం ధామ పవిత్రం పరమం భవాన్ ।**
**పురుషం శాశ్వతం దివ్యమ్ ఆదిదేవమజం విభుమ్ ॥ 12 ॥**
**ఆహుస్త్వామ్ ఋషయః సర్వే దేవర్షిర్నారదస్తథా ।**
**అసితో దేవలో వ్యాసః స్వయం చైవ బ్రవీషి మే ॥ 13 ॥**

పరమ్, బ్రహ్మ, పరమ్, ధామ, పవిత్రమ్, పరమమ్, భవాన్,
పురుషమ్, శాశ్వతమ్, దివ్యమ్, ఆదిదేవమ్, అజమ్, విభుమ్ ॥ 12 ॥
ఆహుః, త్వామ్, ఋషయః, సర్వే, దేవర్షిః, నారదః, తథా,
అసితః, దేవలః, వ్యాసః, స్వయమ్, చ, ఏవ, బ్రవీషి, మే ॥ 13 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| భవాన్ | = | పూజ్యుడవైన నీవు | దివ్యమ్, పురుషమ్ | = | దివ్యపురుషుడ వనియు |
| పరమ్, బ్రహ్మ | = | పరబ్రహ్మవు | ఆదిదేవమ్ | = | దేవాదిదేవుడవనియు |
| పరమ్, ధామ | = | పరంధాముడవు | అజమ్ | = | జన్మరహితుడవనియు |
| పరమమ్, పవిత్రమ్ | = | పరమపవిత్రుడవు | విభుమ్ | = | సర్వవ్యాపివనియు |
| | | | ఆహుః | = | తెలిపియున్నారు |
| సర్వే, ఋషయః | = | మహర్షులందరును | తథా | = | అట్లే |
| త్వామ్ | = | నిన్ను | దేవర్షిః, నారదః | = | దేవర్షియైన నారదుడును |
| శాశ్వతమ్ | = | సనాతనుడవనియు | | | |

| | | | |
|---|---|---|---|
| అసిత: | = అసితుడును | స్వయమ్, ఏవ | = నీవేస్వయముగా |
| దేవల: | = దేవలుడును | మే | = నాకు (ఆ విధముగనే) |
| వ్యాస:, చ | = వ్యాసమహర్షియును(తెలిపిరి) | బ్రవీషి | = తెలుపుచున్నావు. |

అర్జునుడు పలికెను - నీవు పరబ్రహ్మవు. పరంధాముడవు. పరమపవిత్రుడవు. మహర్షులు నిన్ను సనాతనుడనియు, దివ్యపురుషుడనియు, దేవదేవుడనియు, జన్మరహితుడనియు, సర్వవ్యాపియనియు ప్రస్తుతింతురు. దేవర్షి నారదుడు, అసితుడు, దేవలుడు, వ్యాసమహర్షియు స్తుతింతురు. నీవును నాకు ఆ విధముగనే తెలుపుచున్నావు. (12,13)

**సర్వమేతదృతం మన్యే యన్మాం వదసి కేశవ ।**
**న హి తే భగవన్ వ్యక్తిం విదుర్దేవా న దానవాః ॥ 14 ॥**

సర్వమ్, ఏతత్, ఋతమ్, మన్యే, యత్, మామ్, వదసి, కేశవ,
న, హి, తే, భగవన్, వ్యక్తిమ్, విదుః, దేవాః, న, దానవాః ॥ 14 ॥

| | | | |
|---|---|---|---|
| కేశవ! | = ఓ కేశవా! | తే | = నీయొక్క |
| యత్ | = దేనిని | వ్యక్తిమ్[1] | = లీలామయ స్వరూపమును |
| మామ్ | = నన్ను (నాకు) | | |
| వదసి | = చెప్పుచున్నావో | దానవాః | = దానవులు |
| ఏతత్, సర్వమ్ | = ఇదియంతయును | న, విదుః | = ఎఱుంగరు |
| ఋతమ్, మన్యే | = సత్యమని తలంతును | దేవాః, హి | = దేవతలును |
| భగవన్ | = ఓదేవా! (కృష్ణా!) | న (విదుః) | = ఎఱుంగరు. |

ఓ కేశవా! నీవు చెప్పునది అంతయును సత్యమే. హే భగవన్! నీ లీలామయస్వరూపమును దేవతలుగాని, దానవులుగాని తెలిసికొనజాలరు. (14)

**స్వయమేవాత్మనాత్మానం వేత్థ త్వం పురుషోత్తమ ।**
**భూతభావన భూతేశ దేవదేవ జగత్పతే ॥ 15 ॥**

స్వయమ్, ఏవ, ఆత్మనా, ఆత్మానమ్, వేత్థ, త్వమ్, పురుషోత్తమ,
భూతభావన, భూతేశ, దేవదేవ, జగత్పతే ॥ 15 ॥

1. *గీత. 4వ అధ్యాయమునందలి 6వ శ్లోకమున దీని వివరణమును చూడవలెను.*

భూతభావన! = ఓ జగదుత్పత్తికారకా!
భూతేశ! = ఓ సర్వభూతేశా!
దేవదేవ! = ఓ దేవాదిదేవా!
జగత్పతే = ఓ జగన్నాథా!
పురుషోత్తమ! = ఓ పురుషోత్తమా!

త్వమ్ = నీవు
ఆత్మానమ్ = నిన్ను (స్వస్వరూపమును)
స్వయమ్, ఆత్మనా, ఏవ = స్వయముగా నీచేతనే (నీవే)
వేత్థ = ఎఱుంగుదువు.

ఓ జగదుత్పత్తికారకా! ఓ సర్వభూతేశా! ఓ దేవాదిదేవా! ఓ జగన్నాథా! ఓ పురుషోత్తమా! నీ తత్త్వమును నీవే స్వయముగా ఎఱుంగుదువు. (15)

**వక్తుమర్హస్యశేషేణ దివ్యా హ్యాత్మవిభూతయః ।**
**యాభిర్విభూతిభిర్లోకాన్ ఇమాంస్త్వం వ్యాప్య తిష్ఠసి ॥ 16 ॥**

వక్తుమ్, అర్హసి, అశేషేణ, దివ్యాః, హి, ఆత్మవిభూతయః,
యాభిః, విభూతిభిః, లోకాన్, ఇమాన్, త్వమ్, వ్యాప్య, తిష్ఠసి ॥ 16 ॥

యాభిః = ఎట్టి(ఏ)
విభూతిభిః = (దివ్య)విభూతులద్వారా
ఇమాన్, లోకాన్ = ఈ (సమస్త) లోకములను
వ్యాప్య = వ్యాపించి
తిష్ఠసి = స్థితుడవై ఉన్నావో అటువంటి
దివ్యాః = దివ్యములైన

ఆత్మ విభూతయః = నీవిభూతులను (గూర్చి)
అశేషేణ = సంపూర్ణముగా
వక్తుమ్ = చెప్పుటకు (విశద పఱచుటకు)
త్వం, హి = నీవే
అర్హసి = అర్హుడవు (తగుదువు).

సమస్తలోకములయందును నీ దివ్యవిభూతులద్వారా వ్యాపించి, స్థితుడవై యున్నావు. మహామహితములైన ఆ దివ్యవిభూతులను సంపూర్ణముగా తెల్పుటకు నీవే సమర్థుడవు.(16)

**కథం విద్యామహం యోగిన్ త్వాం సదా పరిచింతయన్ ।**
**కేషు కేషు చ భావేషు చింత్యోఽసి భగవన్ మయా ॥ 17 ॥**

కథమ్, విద్యామ్, అహమ్, యోగిన్, త్వామ్, సదా, పరిచింతయన్,
కేషు, కేషు, చ, భావేషు, చింత్యః, అసి, భగవన్, మయా ॥ 17 ॥

యోగిన్ = ఓ యోగీశ్వరా!
అహమ్ = నేను
కథమ్ = ఎట్లు?

సదా = నిరంతరము
పరిచింతయన్ = బాగుగాచింతన చేయుచు
త్వామ్ = నిన్ను

| | | | |
|---|---|---|---|
| విద్యామ్ = ఎఱుంగుదును | | కేషు, కేషు భావేషు | = ఏయే భావముల ద్వారా |
| చ = మఱియు | | మయా | = నా చేత |
| భగవన్ = ఓదేవా! | | చింత్యః, అసి | = చింతనచేయదగిన వాడవు? |

ఓ యోగీశ్వరా! నిరంతరము చింతనచేయుచూ నిన్ను ఏవిధముగా తెలిసికొనగలను? హే భగవన్! ఏయే భావములతో నాద్వారా చింతన చేయదగినవాడవు? నిన్ను నేను ఎట్లు చింతన చేయవలెను? (17)

**విస్తరేణాత్మనో యోగం విభూతిం చ జనార్దన ।**
**భూయః కథయ తృప్తిర్హి శృణ్వతో నాస్తి మేఽమృతమ్ ॥ 18 ॥**

విస్తరేణ, ఆత్మనః, యోగమ్, విభూతిమ్, చ, జనార్దన,
భూయః, కథయ, తృప్తిః, హి, శృణ్వతః, న, అస్తి, మే, అమృతమ్ ॥ 18 ॥

| | | | |
|---|---|---|---|
| జనార్దన! | = ఓ జనార్దనా! | హి | = ఏలనన |
| ఆత్మనః | = పరమాత్మవైన నీయొక్క | అమృతమ్ | = (నీ) అమృతమయ వచనములను |
| యోగమ్ | = యోగశక్తిని గూర్చియు | | |
| విభూతిమ్, చ | = విభూతుల వైభవములను గూర్చియు | శృణ్వతః | = వినుచున్న |
| | | మే | = నాకు |
| భూయః | = ఇంకను | తృప్తిః | = సంతృప్తి (తనివియే) |
| విస్తరేణ | = విస్తృతముగా | | |
| కథయ | = తెలుపుము | న, అస్తి | = లేదు(తీరదు). |

ఓ జనార్దనా! నీ యోగశక్తిని గూర్చియు, నీ విభూతి వైభవములను గుఱించియు విస్తృతముగా ఇంకను తెలుపుము. ఏలనన, నీ అమృతమయవచనములను ఎంతగా విన్నను తనివియే తీరదు. (18)

**శ్రీభగవాన్ ఉవాచ**

**హంత తే కథయిష్యామి దివ్యా హ్యాత్మవిభూతయః ।**
**ప్రాధాన్యతః కురుశ్రేష్ఠ నాస్త్యంతో విస్తరస్య మే ॥ 19 ॥**

హంత, తే, కథయిష్యామి, దివ్యాః, హి, ఆత్మవిభూతయః,
ప్రాధాన్యతః, కురుశ్రేష్ఠ, న, అస్తి, అంతః, విస్తరస్య, మే ॥ 19 ॥

| | | | |
|---|---|---|---|
| హంత | = లెస్సపలికితివి | దివ్యాః | = ఆదివ్యములైన |
| కురుశ్రేష్ఠ! | = ఓ అర్జునా! | ఆత్మ విభూతయః | = నావిభూతులను |
| మే | = నాయొక్క | ప్రాధాన్యతః | = ముఖ్యమైన కొన్నింటిని మాత్రము |
| విస్తరస్య | = విభూతుల విస్తృతికి | తే | = నీకొఱకై |
| అంతః న, అస్తి | = అంతము లేదు | కథయిష్యామి | = తెలుపుదును. |
| హి | = అందువలన | | |

శ్రీ భగవానుడు పలికెను - ఓ అర్జునా! నీవు లెస్సగా పలికితివి. నా దివ్యవిభూతుల విస్తృతికి (వ్యాప్తికి) అంతమే లేదు. వాటిలో ప్రధానమైనవాటిని కొన్నింటిని మాత్రము నీకు తెలుపుచున్నాను. (19)

**అహమాత్మా గుడాకేశ సర్వభూతాశయస్థితః ।**
**అహమాదిశ్చ మధ్యం చ భూతానామంత ఏవ చ ॥ 20 ॥**

అహమ్, ఆత్మా, గుడాకేశ, సర్వభూతాశయస్థితః,
అహమ్, ఆదిః, చ, మధ్యమ్, చ, భూతానామ్, అంతః, ఏవ, చ ॥ 20 ॥

| | | | |
|---|---|---|---|
| గుడాకేశ! | = ఓ అర్జునా! | ఆదిః | = ఆదియు |
| సర్వభూతాశయ స్థితః | = సమస్తప్రాణుల హృదయముల యందున్న | మధ్యమ్ | = మధ్యస్థితియు |
| | | చ | = ఇంకను |
| | | అంతః, చ | = అంతమునూ (ప్రాణుల సృష్టిస్థితి లయముల కారణము) |
| ఆత్మా | = ఆత్మను | | |
| అహమ్ | = నేను | | |
| చ | = మఱియు | అహమ్, ఏవ (అస్మి) | = నేనే |
| భూతానామ్ | = సకల భూతము (ప్రాణు)లకు | | |

ఓ అర్జునా! సమస్తప్రాణులహృదయములయందున్న ఆత్మను నేనే. సకల భూతముల (ప్రాణుల) ఆదియు, మధ్యస్థితియు అంతము నేనే. (ప్రాణులయొక్క సృష్టిస్థితిలయములకు కారణము నేనే) (20)

**ఆదిత్యానామహం విష్ణుః జ్యోతిషాం రవిరంశుమాన్ ।**
**మరీచిర్మరుతామస్మి నక్షత్రాణామహం శశీ ॥ 21 ॥**

ఆదిత్యానామ్, అహమ్, విష్ణుః, జ్యోతిషామ్, రవిః, అంశుమాన్,
మరీచిః, మరుతామ్, అస్మి, నక్షత్రాణామ్, అహమ్, శశీ ॥ 21 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| ఆదిత్యానామ్ | = | ఆదిత్యులలో | మరుతామ్ | = | 49మంది వాయుదేవతలలో |
| విష్ణుః | = | విష్ణువును | మరీచిః[1] | = | మరీచిని (తేజమును) |
| జ్యోతిషామ్ | = | జ్యోతిర్మయ స్వరూపులలో | నక్షత్రాణామ్ | = | నక్షత్రములకు అధిపతియైన |
| అంశుమాన్, రవిః | = | గొప్పకిరణములు గల సూర్యుడను | శశీ | = | చంద్రుడును |
| అహమ్, అస్మి | = | నేనే | అహమ్, అస్మి | = | నేనే. |

అదితియొక్క ద్వాదశపుత్రులైన ఆదిత్యులలో విష్ణువును నేను. జ్యోతిర్మయ స్వరూపులలో నేను సూర్యుడను. 49 మంది వాయుదేవతలలోని 'తేజము'ను నేను. నక్షత్రాధిపతియైన చంద్రుడను నేను. (21)

**వేదానాం సామవేదోఽస్మి దేవానామస్మి వాసవః ।**
**ఇంద్రియాణాం మనశ్చాస్మి భూతానామస్మి చేతనా ॥ 22 ॥**

వేదానామ్, సామవేదః, అస్మి, దేవానామ్, అస్మి, వాసవః,
ఇంద్రియాణామ్, మనః, చ, అస్మి, భూతానామ్, అస్మి, చేతనా ॥ 22 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| వేదానామ్ | = | వేదములలో | మనః, అస్మి | = | మనస్సును నేను |
| సామవేదః, అస్మి | = | సామవేదమును నేను | చ | = | మఱియు |
| దేవానామ్ | = | దేవతలలో | భూతానామ్ | = | ప్రాణులలో |
| వాసవః, అస్మి | = | ఇంద్రుడనునేను | చేతనా, అస్మి | = | చైతన్యమును నేను. |
| ఇంద్రియాణామ్ | = | ఇంద్రియములలో | | | |

వేదములలో నేను సామవేదమును. దేవతలలో ఇంద్రుడను నేనే. ఇంద్రియములలో నేను మనస్సును. ప్రాణులలో చైతన్యమును (ప్రాణశక్తిని) నేను. (22)

**రుద్రాణాం శంకరశ్చాస్మి విత్తేశో యక్షరక్షసామ్ ।**
**వసూనాం పావకశ్చాస్మి మేరుః శిఖరిణామహమ్ ॥ 23 ॥**

1) 49మంది మరుత్తులలో 'మరీచి' అను పేరు ఎచ్చటను కానరాదు. కనుక 'మరీచి' అను పదమునకు 'మరుత్' అని భావింపక సమస్త మరుద్గణముల తేజస్సులేక కిరణములు అని భావింపవలెను.

రుద్రాణామ్, శంకరః, చ, అస్మి, విత్తేశః, యక్షరక్షసామ్,
వసూనామ్, పావకః, చ, అస్మి, మేరుః, శిఖరిణామ్, అహమ్ ॥ 23 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| రుద్రాణామ్ | = | ఏకాదశరుద్రులలో | పావకః అస్మి | = | నేను అగ్నిని |
| శంకరః, అస్మి | = | నేను శంకరుడను | చ | = | మఱియు |
| చ | = | మఱియు | శిఖరిణామ్ | = | శిఖరములుగల పర్వతములలో |
| యక్ష, రక్షసామ్ | = | యక్ష, రాక్షసులలో | | | |
| అహమ్, విత్తేశః | = | నేను ధనాధిపతియైన కుబేరుడను | మేరుః(అస్మి) | = | నేను సుమేరు పర్వతమును. |
| వసూనామ్ | = | అష్టవసువులలో | | | |

ఏకాదశరుద్రులలో శంకరుడను నేను. యక్షరాక్షసులలో ధనాధిపతియైన కుబేరుడను నేను. అష్టవసువులలో అగ్నిని నేను. పర్వతములలో 'సుమేరు' పర్వతమును నేను. (23)

**పురోధసాం చ ముఖ్యం మాం విద్ధి పార్థ బృహస్పతిమ్ ।**
**సేనానీనామహం స్కందః సరసామస్మి సాగరః ॥ 24 ॥**

పురోధసామ్, చ, ముఖ్యమ్, మామ్, విద్ధి, పార్థ, బృహస్పతిమ్,
సేనానీనామ్, అహమ్, స్కందః, సరసామ్, అస్మి, సాగరః ॥ 24 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| పార్థ! | = | ఓ పార్థా! | సేనానీనామ్ | = | సేనాధిపతులలో |
| పురోధసామ్ | = | పురోహితులలో | స్కందః | = | కుమారస్వామిని |
| ముఖ్యమ్ | = | ముఖ్యుడైన | చ | = | మఱియు |
| బృహస్పతిమ్ | = | బృహస్పతినిగా | | | |
| మామ్ | = | నన్ను | సరసామ్ | = | జలాశయములలో |
| విద్ధి | = | తెలిసికొనుము | సాగరః అస్మి | = | నేను సముద్రుడను. |
| అహమ్ | = | నేను | | | |

ఓ పార్థా! పురోహితులలో ముఖ్యుడైన బృహస్పతిని నేనే. సేనాపతులలో కుమారస్వామిని నేను. జలాశయములలో నేను సాగరుడను. (24)

**మహర్షీణాం భృగురహం గిరామస్మ్యేకమక్షరమ్ ।**
**యజ్ఞానాం జపయజ్ఞోఽస్మి స్థావరాణాం హిమాలయః ॥ 25 ॥**

మహర్షీణామ్, భృగుః, అహమ్, గిరామ్, అస్మి, ఏకమ్, అక్షరమ్,
యజ్ఞానామ్, జపయజ్ఞః, అస్మి, స్థావరాణామ్, హిమాలయః ॥ 25 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| మహర్షీణామ్ | = | మహర్షులలో | యజ్ఞానామ్ | = | యజ్ఞములన్నింటిలో |
| భృగుః, అహమ్ | = | భృగువుననేను | జపయజ్ఞః | = | జపయజ్ఞమును |
| గిరామ్ | = | శబ్దములలో | స్థావరాణామ్ | = | స్థావరములలో |
| ఏకమ్, అక్షరమ్, అస్మి | = | ఏకాక్షరమైన ఓంకారమును నేను | హిమాలయః, అస్మి | = | హిమాలయమును నేనే |

మహర్షులలో భృగువును నేను. శబ్దములలో ఏకాక్షరమును అనగా ఓంకారమును నేను. యజ్ఞములయందు జపయజ్ఞమును నేను. స్థావరములలో హిమాలయమును నేను. (25)

**అశ్వత్థః సర్వవృక్షాణాం దేవర్షీణాం చ నారదః ।**
**గంధర్వాణాం చిత్రరథః సిద్ధానాం కపిలో మునిః ॥ 26 ॥**

అశ్వత్థః, సర్వవృక్షాణామ్, దేవర్షీణామ్, చ, నారదః,
గంధర్వాణామ్, చిత్రరథః, సిద్ధానామ్, కపిలః, మునిః ॥ 26 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| సర్వవృక్షాణామ్ | = | సమస్తవృక్షములలో | చిత్రరథః | = | చిత్రరథుడను |
| అశ్వత్థః | = | రావిచెట్టును నేను | చ | = | మఱియు |
| దేవర్షీణామ్ | = | దేవర్షులలో | సిద్ధానామ్ | = | సిద్ధులలో |
| నారదః | = | నారదమునిని | కపిలః, మునిః, (అస్మి) | = | కపిలమునిని నేనే |
| గంధర్వాణామ్ | = | గంధర్వులలో | | | |

వృక్షములలో నేను అశ్వత్థమును (రావిచెట్టును). దేవర్షులలో నారదుడను నేను. గంధర్వులలో నేను చిత్రరథుడను. సిద్ధులలో నేను కపిలమునిని. (26)

**ఉచ్చైఃశ్రవసమశ్వానాం విద్ధి మామమృతోద్భవమ్ ।**
**ఐరావతం గజేంద్రాణాం నరాణాం చ నరాధిపమ్ ॥ 27 ॥**

ఉచ్చైఃశ్రవసమ్, అశ్వానామ్, విద్ధి, మామ్, అమృతోద్భవమ్,
ఐరావతమ్, గజేంద్రాణామ్, నరాణామ్, చ, నరాధిపమ్ ॥ 27 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| అశ్వానామ్ | = | గుఱ్ఱములలో | ఐరావతం, చ | = | ఐరావతమును |
| అమృతోద్భవమ్ | = | అమృతముతోపాటు ఉత్పన్నమైన | నరాణామ్ | = | మానవులలో |
| | | | నరాధిపమ్ | = | రాజును |
| ఉచ్చైఃశ్రవసమ్ | = | 'ఉచ్చైఃశ్రవము'ను | మామ్ | = | నన్నుగా |
| గజేంద్రాణామ్ | = | భద్రగజములలో | విద్ధి | = | తెలిసికొనుము. |

అశ్వములలో పాలసముద్రమునుండి అమృతముతో పుట్టిన ఉచ్చైఃశ్రవమును నేను. భద్రగజములలో ఐరావతమును నేను. మనుష్యులలో ప్రభువును నేను. (27)

**ఆయుధానామహం వజ్రం ధేనూనామస్మి కామధుక్ ।**
**ప్రజనశ్చాస్మి కందర్పః సర్పాణామస్మి వాసుకిః ॥ 28 ॥**

ఆయుధానామ్, అహమ్, వజ్రమ్, ధేనూనామ్, అస్మి, కామధుక్,
ప్రజనః, చ, అస్మి, కందర్పః, సర్పాణామ్, అస్మి, వాసుకిః ॥ 28 ॥

| | | | |
|---|---|---|---|
| ఆయుధానామ్ | = ఆయుధములలో | కందర్పః, అస్మి | = మన్మథుడను నేను |
| వజ్రమ్, అహమ్ | = వజ్రాయుధమును నేను | చ | = మఱియు |
| ధేనూనామ్ | = పాడియావులలో | సర్పాణామ్ | = సర్పములలో |
| కామధుక్, అస్మి | = కామధేనువును నేను | వాసుకిః, అస్మి | = వాసుకిని నేను. |
| ప్రజనః | = సంతానోత్పత్తికి కారణమైన | | |

ఆయుధములలో వజ్రాయుధమును నేను. పాడిఆవులలో కామధేనువును నేను. శాస్త్రవిహితరీతిలో సంతానోత్పత్తికి కారణమైన మన్మథుడను నేను. సర్పములలో వాసుకిని నేను. (28)

**అనంతశ్చాస్మి నాగానాం వరుణో యాదసామహమ్ ।**
**పితౄణామర్యమా చాస్మి యమః సంయమతామహమ్ ॥ 29 ॥**

అనంతః, చ, అస్మి, నాగానామ్, వరుణః, యాదసామ్, అహమ్,
పితౄణామ్, అర్యమా, చ, అస్మి, యమః, సంయమతామ్, అహమ్ ॥ 29 ॥

| | | | |
|---|---|---|---|
| నాగానామ్[1] | = నాగజాతివారిలో | చ | = మఱియు |
| అనంతః, అహమ్ | = ఆదిశేషుడను నేను | పితౄణామ్ | = పితరులలో |
| చ | = మఱియు | అర్యమా | = అర్యముడను |
| యాదసామ్ | = జలచరములకు అధిపతియైన | సంయమతామ్ | = శాసించువారిలో |
| వరుణః, అహమ్, అస్మి | = వరుణుడను నేను | (అహమ్) యమః, అస్మి | = నేనుయముడను. |

నాగజాతివారిలో ఆదిశేషుడ(అనంతుడ)ను నేను. జలచరములకు అధిపతియైన వరుణుడను నేను. పితరులలో అర్యముడను (పితృగణప్రభువును) నేను. శాసకులలో యమధర్మరాజును నేను. (29)

1) నాగులు, సర్పములు, అను రెండును సర్పజాతులే

**ప్రహ్లాదశ్చాస్మి దైత్యానాం కాలః కలయతామహమ్ ।**
**మృగాణాం చ మృగేంద్రోఽహం వైనతేయశ్చ పక్షిణామ్ ॥ 30 ॥**

ప్రహ్లాదః, చ, అస్మి, దైత్యానామ్, కాలః కలయతామ్, అహమ్,
మృగాణామ్, చ, మృగేంద్రః, అహమ్, వైనతేయః, చ, పక్షిణామ్ ॥ 30 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| దైత్యానామ్ | = | దైత్యులలో | మృగేంద్రః | = | మృగరాజైన సింహమును నేను |
| అహమ్, ప్రహ్లాదః | = | నేను ప్రహ్లాదుడను | చ | = | మఱియు |
| చ | = | మఱియు | పక్షిణామ్ | = | పక్షులలో |
| కలయతామ్ | = | గణకులలో | అహమ్, వైనతేయః (అస్మి) | = | నేను గరుత్మంతుడను. |
| కాలః,(1) అస్మి | = | నేను సమయమును | | | |
| చ | = | మరియు | | | |
| మృగాణామ్ | = | మృగములలో | | | |

దైత్యులలో నేను ప్రహ్లాదుడను. గణించువారిలో (గణకులలో) నేను కాలమును. మృగములలో మృగరాజు ఐన సింహమును నేను. పక్షులలో పక్షిరాజైన గరుత్మంతుడను నేనే. (30)

**పవనః పవతామస్మి రామః శస్త్రభృతామహమ్ ।**
**ఝషాణాం మకరశ్చాస్మి స్రోతసామస్మి జాహ్నవీ ॥ 31 ॥**

పవనః, పవతామ్, అస్మి, రామః, శస్త్రభృతామ్, అహమ్,
ఝషాణామ్, మకరః, చ, అస్మి, స్రోతసామ్, అస్మి, జాహ్నవీ ॥ 31 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| పవతామ్ | = | పవిత్రమొనర్చువానిలో | మకరః, అస్మి | = | మొసలిని నేను |
| పవనః, అహమ్ | = | వాయువును నేను | చ | = | మఱియు |
| శస్త్రభృతామ్ | = | శస్త్రధారులలో | స్రోతసామ్ | = | నదులలో |
| రామః, అస్మి | = | శ్రీరాముడను నేను | జాహ్నవీ, అస్మి | = | గంగానదిని నేను |
| ఝషాణామ్ | = | మత్స్యములలో | | | |

పవిత్రమొనర్చు వానిలో వాయువును నేను. శస్త్రధారులలో శ్రీరామచంద్రుడను నేను. మత్స్యములలో మొసలిని నేను. నదులలో గంగానదిని నేను. (31)

1) క్షణము, గడియ(ఘటిక), దినము, పక్షము, మాసము మొదలగువానిచే తెల్పబడు సమయమును నేను.

**సర్గాణామాదిరంతశ్చ మధ్యం చైవాహమర్జున ।**
**అధ్యాత్మవిద్యా విద్యానాం వాదః ప్రవదతామహమ్ ॥ 32 ॥**

సర్గాణామ్, ఆదిః, అంతః, చ, మధ్యమ్, చ, ఏవ, అహమ్, అర్జున,
అధ్యాత్మవిద్యా, విద్యానామ్, వాదః, ప్రవదతామ్, అహమ్ ॥ 32 ॥

| | | | |
|---|---|---|---|
| అర్జున! | = ఓ అర్జునా! | అధ్యాత్మవిద్యా | = అధ్యాత్మ(బ్రహ్మ) విద్యను నేను |
| సర్గాణామ్ ఆదిః,మధ్యమ్, అంతశ్చ, | = సృష్టిపరంపరకు ఆదిమధ్యాంతములు | ప్రవదతామ్ | = పరస్పర వాద వివాదములలో |
| అహమ్,ఏవ | = నేనే | వాదః,అహమ్ | = తత్త్వ నిర్ణయమునకై చేయువాదమును నేను |
| విద్యానామ్ | = విద్యలలో | | |

ఓ అర్జునా! సృష్టికి ఆదిమధ్యాంతములు నేను. (సృష్టి స్థితి లయ కారకుడను నేనే) విద్యలలో అధ్యాత్మవిద్యను అనగా బ్రహ్మవిద్యను నేను. పరస్పరవాదవివాదములలో తత్త్వనిర్ణయమునకైచేయు 'వాదము'ను నేను. (32)

**అక్షరాణామకారోఽస్మి ద్వంద్వః సామాసికస్య చ ।**
**అహమేవాక్షయః కాలో ధాతాహం విశ్వతోముఖః ॥ 33 ॥**

అక్షరాణామ్, అకారః అస్మి, ద్వంద్వః, సామాసికస్య, చ,
అహమ్, ఏవ, అక్షయః, కాలః, ధాతా, అహమ్, విశ్వతోముఖః ॥ 33 ॥

| | | | |
|---|---|---|---|
| అక్షరాణామ్ | = అక్షరములలో | అక్షయః, కాలః | = మహాకాలమును నేను |
| అకారః, అహమ్ | = 'అ'కారమును నేను | | |
| చ | = మఱియు | విశ్వతోముఖః | = సర్వతోముఖుడనైన విరాట్ పురుషుడనునేను |
| సామాసికస్య | = సమాసములలో | | |
| ద్వంద్వః, అస్మి | = ద్వంద్వ సమాసమును నేను | ధాతా, అహమ్, ఏవ(అస్మి) | = ధరించి, పోషించు వాడను నేనే. |

అక్షరములలో "అ" కారమును నేను. సమాసములలో 'ద్వంద్వ' సమాసమును నేను. అక్షయకాలము అనగా మహాకాలమును నేను. అట్లే విశ్వతోముఖుడైన విరాట్ పురుషుడను నేను. అందరిని ధరించువాడను, పోషించువాడను నేను. (33)

**మృత్యుః సర్వహరశ్చాహమ్ ఉద్భవశ్చ భవిష్యతామ్ ।**
**కీర్తిః శ్రీర్వాక్చ నారీణాం స్మృతిర్మేధా ధృతిః క్షమా ॥ 34 ॥**

మృత్యుః, సర్వహరః, చ, అహమ్, ఉద్భవః, చ, భవిష్యతామ్,
కీర్తిః, శ్రీః, వాక్, చ, నారీణామ్, స్మృతిః, మేధా, ధృతిః, క్షమా ॥ 34 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| సర్వహరః | = | సర్వప్రాణులను హరించునట్టి | కీర్తిః | = | కీర్తిని[1] |
| మృత్యుః, అహమ్ | = | మృత్యువును నేను | శ్రీః | = | లక్ష్మిని |
| భవిష్యతామ్ | = | పుట్టబోవుచున్న సమస్తప్రాణులయొక్క | వాక్ | = | వాక్కును |
| ఉద్భవః | = | ఉత్పత్తి హేతువును నేను | స్మృతిః | = | స్మృతిని |
| చ | = | మఱియు | మేధా | = | మేధను |
| నారీణామ్ | = | స్త్రీలలో | ధృతిః | = | ధృతిని |
| | | | చ | = | మఱియు |
| | | | క్షమా | = | క్షమను |
| | | | (అహమ్) అస్మి | = | నేను. |

అన్నిప్రాణులను హరించు మృత్యువును నేనే. సమస్తప్రాణుల ఉత్పత్తి హేతువును గూడ నేనే. స్త్రీలలో కీర్తి, శ్రీ, వాక్కు, స్మృతి, మేధా, ధృతి, క్షమా అను వారందఱును నేనే. (34)

**బృహత్సామ తథా సామ్నాం గాయత్రీ ఛందసామహమ్ ।**
**మాసానాం మార్గశీర్షోఽహమ్ ఋతూనాం కుసుమాకరః ॥ 35 ॥**

బృహత్సామ, తథా, సామ్నామ్, గాయత్రీ, ఛందసామ్, అహమ్,
మాసానామ్, మార్గశీర్షః, అహమ్, ఋతూనామ్, కుసుమాకరః ॥ 35 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| తథా | = | అట్లే | గాయత్రీ | = | గాయత్రీఛందస్సును |
| సామ్నామ్ | = | గానముచేయుటకు అనువగు శ్రుతులలో | మాసానామ్ | = | మాసములలో |
| | | | మార్గశీర్షః | = | మార్గశీర్షమును |
| అహమ్ | = | నేను | ఋతూనామ్ | = | ఋతువులలో |
| బృహత్సామ | = | బృహత్సామమును | కుసుమాకరః | = | వసంతఋతువును |
| ఛందసామ్ | = | ఛందస్సులలో | అహమ్,(అస్మి) | = | నేను. |

గానముచేయుటకు అనువైన శ్రుతులలో బృహత్సామమును నేను. ఛందస్సులలో 'గాయత్రీఛందస్సు'ను నేను. మాసములలో మార్గశీర్షమును, ఋతువులలో వసంతఋతువును నేనే. (35)

1. కీర్తి మొదలగునవి సప్తదేవతల పేర్లు, మఱియు స్త్రీ వాచక గుణములుగాగూడ ప్రసిద్ధములు-కనుక ఇవి రెండు విధములుగను భగవంతుని విభూతులే.

**ద్యూతం ఛలయతామస్మి తేజస్తేజస్వినామహమ్ ।**
**జయోఽస్మి వ్యవసాయోఽస్మి సత్త్వం సత్త్వవతామహమ్ ॥ 36 ॥**

ద్యూతమ్, ఛలయతామ్, అస్మి, తేజః, తేజస్వినామ్, అహమ్,
జయః, అస్మి, వ్యవసాయః, అస్మి, సత్త్వమ్, సత్త్వవతామ్, అహమ్ ॥ 36 ॥

| | | | |
|---|---|---|---|
| ఛలయతామ్ | = వంచకులలో | (వ్యవసాయినామ్) | = నిశ్చయాత్మకులలో |
| అహమ్, ద్యూతమ్ | = నేను జూదమును | అహమ్, వ్యవసాయః | = నిశ్చయమును నేను |
| తేజస్వినామ్ | = ప్రభావశాలురలో | సత్త్వవతామ్ | = సాత్త్వికపురుషులలో |
| తేజః, అస్మి | = తేజమును నేను | సత్త్వమ్, అస్మి | = సాత్త్వికభావమును నేనే. |
| (జేతౄణామ్) | = విజేతలలో | | |
| జయః, అస్మి | = జయమును నేను | | |

వంచకులలో జూదమును నేనే. ప్రభావశాలురలోని ప్రభావమును నేను. విజేతలలో జయమును నేను. నిశ్చయాత్మకులలో నిశ్చయమును, సాత్త్విక పురుషులలో సాత్త్వికభావమును నేనే. (36)

**వృష్ణీనాం వాసుదేవోఽస్మి పాండవానాం ధనంజయః ।**
**మునీనామప్యహం వ్యాసః కవీనాముశనా కవిః ॥ 37 ॥**

వృష్ణీనామ్, వాసుదేవః, అస్మి, పాండవానామ్, ధనంజయః,
మునీనామ్, అపి, అహమ్, వ్యాసః, కవీనామ్, ఉశనా, కవిః ॥ 37 ॥

| | | | |
|---|---|---|---|
| వృష్ణీనామ్[1] | = వృష్ణివంశజులలో | వ్యాసః | = వేదవ్యాసుడనునేను |
| వాసుదేవః | = వాసుదేవుడనునేను | కవీనామ్ | = కవులలో |
| పాండవానామ్ | = పాండవులలో | ఉశనా, కవిః, అపి, అహమ్, అస్మి | = శుక్రాచార్యుడను గూడ నేనే. |
| ధనంజయః | = అర్జునుడను నేను | | |
| మునీనామ్ | = మునులలో | | |

వృష్ణివంశజులలో వాసుదేవుడను నేను. పాండవులలో ధనంజయుడను నేను. అనగా నీవే నేను. మునులలో వేదవ్యాసుడను నేను. కవులలో శుక్రాచార్యుడను నేనే. (37)

**దండో దమయతామస్మి నీతిరస్మి జిగీషతామ్ ।**
**మౌనం చైవాస్మి గుహ్యానాం జ్ఞానం జ్ఞానవతామహమ్ ॥ 38 ॥**

1. యాదవ వంశములలో 'వృష్ణి వంశము' కూడ ఒకటి.

దండః, దమయతామ్, అస్మి, నీతిః, అస్మి, జిగీషతామ్,
మౌనమ్, చ, ఏవ, అస్మి, గుహ్యానామ్, జ్ఞానమ్, జ్ఞానవతామ్, అహమ్ ॥ 38 ॥

| | | | |
|---|---|---|---|
| దమయతామ్ | = శిక్షించువారిలో | మౌనమ్, అస్మి | = మౌనమును నేను |
| దండః, అస్మి | = దండించుశక్తిని నేను | చ | = మఱియు |
| జిగీషతామ్ | = జయేచ్ఛగలవారిలో | జ్ఞానవతామ్ | = జ్ఞానులయొక్క |
| నీతిః, అస్మి | = నీతిని నేను | జ్ఞానమ్, అహమ్, ఏవ | = తత్త్వజ్ఞానమును నేను. |
| గుహ్యానామ్ | = గోప్యవిషయరక్షణమున | | |

శిక్షించువారిలో దండమును అనగా దమనశక్తిని నేనే. జయేచ్ఛకల వారినీతిని నేనే. గోప్యవిషయరక్షణమున 'మౌనము'ను నేను. జ్ఞానులయొక్క తత్త్వజ్ఞానమును నేనే. (38)

**యచ్చాపి సర్వభూతానాం బీజం తదహమర్జున ।**
**న తదస్తి వినా యత్ స్యాత్ మయా భూతం చరాచరమ్ ॥ 39 ॥**

యత్, చ, అపి, సర్వభూతానామ్, బీజమ్, తత్, అహమ్, అర్జున,
న, తత్, అస్తి, వినా, యత్, స్యాత్, మయా, భూతమ్, చరాచరమ్ ॥ 39 ॥

| | | | |
|---|---|---|---|
| చ | = మఱియు | యత్ చరాచరమ్, భూతమ్ | = ఏ చరాచర ప్రాణికోటి |
| అర్జున! | = ఓ అర్జునా! | మయా, వినా, స్యాత్ | = నేను లేనిదగునో |
| యత్ | = ఏది | తత్ | = అది |
| సర్వభూతానామ్ | = సమస్తచరాచర ప్రాణులయొక్క | న, అస్తి | = ఉండనే ఉండదు. |
| బీజమ్ | = బీజమో | | |
| తత్, అపి, అహమ్ | = ఆ బీజమును గూడ నేనే | | |

ఓ అర్జునా! సర్వప్రాణులఉత్పత్తికి కారణమైన బీజమును నేనే. ఏలనన, నేనులేని చరాచరప్రాణియేదియును లేదు. (39)

**నాంతోఽస్తి మమ దివ్యానాం విభూతీనాం పరంతప ।**
**ఏష తూద్దేశతః ప్రోక్తో విభూతేర్విస్తరో మయా ॥ 40 ॥**

న, అంతః, అస్తి, మమ, దివ్యానామ్, విభూతీనామ్, పరంతప,
ఏషః, తు, ఉద్దేశతః, ప్రోక్తః, విభూతేః, విస్తరః, మయా ॥ 40 ॥

| | | | |
|---|---|---|---|
| పరంతప! | = ఓ అర్జునా! | మయా | = నాచేత |
| మమ | = నా యొక్క | విభూతేః | = విభూతులయొక్క |
| దివ్యానామ్ | = దివ్యములైన | ఏషః | = ఈ |
| విభూతీనామ్ | = విభూతులకు | విస్తరః, తు | = విస్తృతి ఐతే |
| అంతః | = అంతమే | ఉద్దేశతః | = సంక్షిప్తముగా |
| న, అస్తి | = లేదు | ప్రోక్తః | = చెప్పబడినది. |

ఓ పరంతపా! నా దివ్యవిభూతులకు అంతమే లేదు. నా విభూతులవిస్తృతిని గూర్చి నేను నీకు చాలా సంక్షిప్తముగా వివరించితిని. (40)

**యద్యద్విభూతిమత్ సత్త్వం శ్రీమదూర్జితమేవ వా ।**
**తత్తదేవావగచ్ఛ త్వం మమ తేజోఽంశసంభవమ్ ॥ 41 ॥**

యత్, యత్, విభూతిమత్, సత్త్వమ్, శ్రీమత్, ఊర్జితమ్, ఏవ, వా,
తత్, తత్, ఏవ, అవగచ్ఛ, త్వమ్, మమ, తేజోఽంశసంభవమ్ ॥ 41 ॥

| | | | |
|---|---|---|---|
| విభూతిమత్ | = ఐశ్వర్యయుక్తము | తత్, తత్ | = ఆయా వస్తువులు |
| శ్రీమత్ | = కాంతియుతము | మమ తేజోఽంశ-సంభవమ్, ఏవ | = నా తేజము యొక్క అంశమునుండియే కలిగినవిగా |
| వా | = మఱియు | | |
| ఊర్జితమ్ | = శక్తియుక్తము అగు | | |
| యత్, యత్, ఏవ | = ఏయే | త్వమ్ | = నీవు |
| సత్త్వమ్ | = వస్తువులు కలవో | అవగచ్ఛ | = గ్రహింపుము |

విభూతియుక్తము అనగా ఐశ్వర్యయుక్తము, కాంతియుక్తము, శక్తియుక్తము ఐన వస్తువేదైనను, అది నా తేజస్సుయొక్క అంశమునుండియే కలిగినదిగా తెలిసికొనుము. (41)

**అథవా బహునైతేన కిం జ్ఞాతేన తవార్జున ।**
**విష్టభ్యాహమిదం కృత్స్నమ్ ఏకాంశేన స్థితో జగత్ ॥ 42 ॥**

అథవా, బహునా, ఏతేన, కిమ్, జ్ఞాతేన, తవ, అర్జున,
విష్టభ్య, అహమ్, ఇదమ్, కృత్స్నమ్, ఏకాంశేన, స్థితః, జగత్ ॥ 42 ॥

| | | | |
|---|---|---|---|
| అథవా | = అథవా | బహునా, జ్ఞాతేన | = ఎక్కువగా తెలిసికొనుట వలన |
| అర్జున! | = ఓ అర్జునా! | | |
| ఏతేన | = ఈ(ఇట్లు) | తవ, కిమ్ | = నీకు (కలుగు) ప్రయోజనమేమి |

| | | | | | |
|---|---|---|---|---|---|
| ఇదమ్, కృత్స్నమ్, జగత్ | = | ఈ సమస్త జగత్తును | ఏకాంశేన | = | ఒక్క అంశతోడనే |
| అహమ్ | = | నేను (నా యోగశక్తి యొక్క) | విష్టభ్య | = | ధరించి |
| | | | స్థితః | = | స్థితమై యున్నాను |

అథవా! ఓ అర్జునా! ఇంతకంటెను విపులముగా తెలిసికొని ప్రయోజనమేమి? ఈ సంపూర్ణజగత్తును కేవలము నా యోగశక్తియొక్క ఒక్క అంశతోడనే ధరించుచున్నాను. (42)

*ఓం తత్సదితి శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే*
*శ్రీకృష్ణార్జునసంవాదే విభూతియోగో నామ దశమోఽధ్యాయః ॥ ౧౦ ॥*

॥ ఓం శ్రీపరమాత్మనే నమః ॥

# అథ ఏకాదశోఽధ్యాయః - విశ్వరూపదర్శన యోగః

## (పదకొండవ అధ్యాయము-విశ్వరూపదర్శన యోగము)

ముఖ్యాంశములు : [(1 నుండి 4వ శ్లోకమువఱకు) విశ్వరూపమును దర్శింపజేయుమని అర్జునుడు భగవానుని ప్రార్థించుట, (5 నుండి 8 వఱకు) భగవంతుడు తనవిశ్వరూపమును వర్ణించుట, (9 నుండి 14 వఱకు) విశ్వరూపమునుగూర్చి సంజయుడు ధృతరాష్ట్రునకు వర్ణించిచెప్పుట, (15 నుండి 31 వఱకు) అర్జునుడు భగవంతుని విశ్వరూపమును దర్శించుట- స్తుతించుట, (32 నుండి 34 వఱకు) భగవంతుడు తన ప్రభావమును వర్ణించుట, యుద్ధమునకై అర్జునుని ప్రోత్సహించుట, (35 నుండి 46 వఱకు) భయభ్రాంతుడైన అర్జునుడు భగవంతుని స్తుతించుట, చతుర్భుజరూపమును దర్శింపజేయుమని ప్రార్థించుట, (47 నుండి 50 వఱకు) భగవంతుడు తన విశ్వరూపదర్శనమహిమను తెల్పుట- అట్లే చతుర్భుజ, సౌమ్యరూపములను చూపుట, (51 నుండి 55 వఱకు) అనన్య భక్తి లేకుండ చతుర్భుజరూపదర్శనము దుర్లభమని తెల్పుచు ఫలసహిత-అనన్యభక్తిని వర్ణించుట-]

**అర్జున ఉవాచ**

**మదనుగ్రహాయ పరమం గుహ్యమధ్యాత్మసంజ్ఞితమ్ ।**
**యత్త్వయోక్తం వచస్తేన మోహోఽయం విగతో మమ ॥ 1 ॥**

మదనుగ్రహాయ, పరమమ్, గుహ్యమ్, అధ్యాత్మసంజ్ఞితమ్,
యత్, త్వయా, ఉక్తమ్, వచః, తేన, మోహః, అయమ్, విగతః, మమ ॥ 1 ॥

| | | | |
|---|---|---|---|
| మదనుగ్రహాయ | = నన్ను అనుగ్రహించుట కొఱకు | త్వయా | = నీచేత |
| | | ఉక్తమ్ | = చెప్పబడినదో(వో) |
| పరమమ్ | = మిక్కిలి శ్రేష్ఠమైనదియు | తేన | = ఆవచనము(ల)చేత |
| గుహ్యమ్ | = గోప్యమైనదియు | మమ | = నా |
| అధ్యాత్మ-సంజ్ఞితమ్ | = ఆధ్యాత్మ విషయక మైనదియు అగు | అయమ్ | = ఈ |
| | | మోహః | = మోహము |
| యత్, వచః | = ఏ వచనము(లు) | విగతః | = తొలగినది |

అర్జునుడు పలికెను - ఓ కృష్ణా! నన్ను అనుగ్రహింపదలచి పరమగోప్యమైన ఆధ్యాత్మికవిషయములను ఉపదేశించితివి. దానివలన నా అజ్ఞానము (మోహము) తొలగిపోయినది. (1)

**భవాప్యయౌ హి భూతానాం శ్రుతౌ విస్తరశో మయా ।**
**త్వత్తః కమలపత్రాక్ష మాహాత్మ్యమపి చావ్యయమ్ ॥ 2 ॥**

భవాప్యయౌ, హి, భూతానామ్, శ్రుతౌ, విస్తరశః, మయా,
త్వత్తః, కమలపత్రాక్ష, మాహాత్మ్యమ్, అపి, చ, అవ్యయమ్ ॥ 2 ॥

| | | | |
|---|---|---|---|
| హి | = ఏలనన | విస్తరశః | = విశదముగా |
| కమలపత్రాక్ష! | = కమలపత్రములవంటి నేత్రములుగల ఓకృష్ణా! | మయా | = నాచేత |
| | | శ్రుతౌ | = వినబడినవి |
| | | చ | = మఱియు నీయొక్క |
| త్వత్తః | = నీవలన | అవ్యయమ్ | = శాశ్వతమైన |
| భూతానామ్ | = ప్రాణులయొక్క | మాహాత్మ్యమ్, | = మాహాత్మ్యము |
| భవాప్యయౌ | = ఉత్పత్తి ప్రళయములు | అపి(శ్రుతమ్) | గూడ (వినబడినది) |

ఓ కమలాక్షా! ఓ కృష్ణా! సమస్తప్రాణులఉత్పత్తిప్రళయములనుగూర్చి సవిస్తరముగా వింటిని. అట్లే శాశ్వతమైన నీ మహిమలను గూర్చియు వింటిని. (2)

**ఏవమేతద్యథాత్థ త్వమ్ ఆత్మానం పరమేశ్వర ।**
**ద్రష్టుమిచ్ఛామి తే రూపమ్ ఐశ్వరం పురుషోత్తమ ॥ 3 ॥**

ఏవమ్, ఏతత్, యథా, ఆత్థ, త్వమ్, ఆత్మానమ్, పరమేశ్వర,
ద్రష్టుమ్, ఇచ్ఛామి, తే, రూపమ్, ఐశ్వరమ్, పురుషోత్తమ ॥ 3 ॥

| | | | |
|---|---|---|---|
| పరమేశ్వర! | = ఓ పరమేశ్వరా! (కృష్ణా!) | పురుషోత్తమ! | = ఓ పురుషోత్తమా! |
| త్వమ్ | = నీవు | తే | = నీయొక్క |
| ఆత్మానమ్ | = నిన్ను గూర్చి | ఐశ్వరమ్, రూపమ్ | = షడ్గుణైశ్వర్యసంపన్నమైన నీ దివ్య రూపమును |
| యథా | = ఎట్లు (ఏవిధముగా) | | |
| ఆత్థ | = చెప్పియుంటివో | ద్రష్టుమ్ | = ప్రత్యక్షముగా చూచుటకు |
| ఏతత్ | = ఇది | ఇచ్ఛామి | = కుతూహలపడుచున్నాను |
| ఏవమ్ (ఏవ) | = అంతయు సత్యమే | | |

ఓ పరమేశ్వరా! నీవు చెప్పినదంతయు సత్యమే. అందు సందేహమునకు తావులేదు. కాని, ఓ పురుషోత్తమా! జ్ఞాన, ఐశ్వర్య, శక్తి, బల, వీర్య, తేజోమహితమైన నీ షడ్గుణైశ్వర్య సంపన్న రూపమును ప్రత్యక్షముగా చూచుటకు కుతూహలపడుచున్నాను. (3)

**మన్యసే యది తచ్ఛక్యం మయా ద్రష్టుమితి ప్రభో ।**
**యోగేశ్వర తతో మే త్వం దర్శయాత్మానమవ్యయమ్ ॥ 4 ॥**

మన్యసే, యది, తత్, శక్యమ్, మయా, ద్రష్టుమ్, ఇతి, ప్రభో,
యోగేశ్వర, తతః, మే, త్వమ్, దర్శయ, ఆత్మానమ్, అవ్యయమ్ ॥ 4 ॥

| | | | |
|---|---|---|---|
| ప్రభో[1] | = ఓ ప్రభూ! | తతః | = అయితే |
| మయా | = నాచేత | యోగేశ్వర! | = ఓ యోగేశ్వరా! |
| తత్ | = దానిని (నీదివ్య రూపమును) | త్వమ్ | = నీవు |
| | | అవ్యయమ్ | = శాశ్వతమైన |
| ద్రష్టుమ్ | = చూచుటకు | ఆత్మానమ్ | = నిన్ను (నీరూపమును) |
| శక్యమ్, ఇతి | = సాధ్యమేయని | | |
| మన్యసే, యది | = నీవు భావించు చున్నచో | మే | = నాకు |
| | | దర్శయ | = చూపించుము. |

ఓ యోగేశ్వరా! ఓ ప్రభూ! నీ దివ్య రూపమును చూచుటకు నన్ను అర్హునిగా నీవు భావించినచో, శాశ్వతమైన నీ దివ్యస్వరూపమును నాకు చూపింపుము. (4)

**శ్రీభగవాన్ ఉవాచ**

**పశ్య మే పార్థ రూపాణి శతశోఽథ సహస్రశః ।**
**నానావిధాని దివ్యాని నానావర్ణాకృతీని చ ॥ 5 ॥**

పశ్య, మే, పార్థ, రూపాణి, శతశః, అథ, సహస్రశః,
నానావిధాని, దివ్యాని, నానావర్ణాకృతీని, చ ॥ 5 ॥

| | | | |
|---|---|---|---|
| పార్థ! | = ఓ పార్థా! | శతశః, సహస్రశః | = వందలు, వేలకొలదిగల (అసంఖ్యాకములైన) |
| అథ | = ఇప్పుడు | | |
| మే | = నాయొక్క | నానావిధాని | = నానావిధములైన |

1. ఉత్పత్తి, స్థితి, ప్రళయములనేగాక అంతర్యామిగా శాసించువాడగుటవలన భగవంతునకు 'ప్రభువు'అని పేరు.

| | | | | | |
|---|---|---|---|---|---|
| చ | = | మఱియు | దివ్యాని | = | అలౌకికములైన |
| నానావర్ణా-కృతీని | = | నానావర్ణము (వన్నె) లతో, ఆకృతులతో ఉన్న | రూపాణి | = | రూపములను |
| | | | పశ్య | = | చూడుము. |

శ్రీభగవానుడు పలికెను - ఓ అర్జునా! అసంఖ్యాకములైన, బహువిధములైన, పెక్కువర్ణములు, ఆకృతులు గల నా అలౌకికరూపములను చూడుము. (5)

**పశ్యాదిత్యాన్ వసూన్ రుద్రాన్ అశ్వినౌ మరుతస్తథా ।**
**బహూన్యదృష్టపూర్వాణి పశ్యాశ్చర్యాణి భారత ॥ 6 ॥**

పశ్య, ఆదిత్యాన్, వసూన్, రుద్రాన్, అశ్వినౌ, మరుతః, తథా,
బహూని, అదృష్టపూర్వాణి, పశ్య, ఆశ్చర్యాణి, భారత ॥ 6 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| భారత! | = | ఓ అర్జునా! | పశ్య | = | చూడుము |
| ఆదిత్యాన్ | = | అదితియొక్క ద్వాదశ పుత్రులను | తథా | = | అట్లే |
| | | | బహూని | = | అనేకములైన |
| వసూన్ | = | అష్టవసువులను | అదృష్ట-పూర్వాణి | = | మునుపు(లోగడ) ఎన్నడును చూడనట్టి |
| రుద్రాన్ | = | ఏకాదశరుద్రులను | | | |
| అశ్వినౌ | = | అశ్వినీ కుమారులను | ఆశ్చర్యాణి | = | ఆశ్చర్యకరరూపములను |
| మరుతః | = | 49మంది మరుత్తులను | పశ్య | = | చూడుము. |

ఓ అర్జునా! ద్వాదశాదిత్యులను, అష్టవసువులను, ఏకాదశరుద్రులను, అశ్వినీ కుమారులను, మరుద్గణములను నాయందు చూడుము. అంతేగాక ఇంకను మునుపెన్నడును చూచి యెరుగని అపూర్వమైన ఆశ్చర్యకరములైన రూపములను చూడుము. (6)

**ఇహైకస్థం జగత్ కృత్స్నం పశ్యాద్య సచరాచరమ్ ।**
**మమ దేహే గుడాకేశ యచ్చాన్యద్ద్రష్టుమిచ్ఛసి ॥ 7 ॥**

ఇహ, ఏకస్థమ్, జగత్, కృత్స్నమ్, పశ్య, అద్య, సచరాచరమ్,
మమ, దేహే, గుడాకేశ, యత్, చ, అన్యత్, ద్రష్టుమ్, ఇచ్ఛసి ॥ 7 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| గుడాకేశ[1] | = | ఓ అర్జునా! | సచరాచరమ్ | = | చరాచరములతో కూడియున్న |
| అద్య | = | నేడు (ఇప్పుడు) | | | |
| ఇహ, మమ దేహే | = | ఈ నా దేహము నందు | కృత్స్నమ్, జగత్ | = | సంపూర్ణజగత్తును |
| ఏకస్థమ్ | = | ఒకేచోట స్థితమైయున్న | పశ్య | = | చూడుము |

1. నిద్రను జయించినవాడగుటవలన అర్జునునకు *గుడాకేశుడు (గుడాక+ఈశుడు)* అనిపేరు.

| | | | | | |
|---|---|---|---|---|---|
| చ | = | ఇంకను | ద్రష్టుమ్ | = | చూచుటకు |
| అన్యత్ | = | ఇతరమైన | ఇచ్ఛసి | = | కోరుకొనుచున్నావో |
| యత్ | = | దేనిని | | | వాటినన్నింటిని చూడుము. |

ఓ అర్జునా! నా ఈ రూపమునందు ఒకేచోట స్థితమైయున్న సమస్తచరాచర జగత్తును చూడుము. అంతేగాక, ఇంకను నీవు చూడదలచుకొనిన వాటినన్నింటినీ చూడుము. (7)

**న తు మాం శక్యసే ద్రష్టుమ్ అనేనైవ స్వచక్షుషా ।**
**దివ్యం దదామి తే చక్షుః పశ్య మే యోగమైశ్వరమ్ ॥ 8 ॥**

న, తు, మామ్, శక్యసే, ద్రష్టుమ్, అనేన, ఏవ, స్వచక్షుషా,
దివ్యమ్, దదామి, తే, చక్షుః, పశ్య, మే, యోగమ్, ఐశ్వరమ్ ॥ 8 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| తు | = | కాని | (అతః) | = | ఇందువలన |
| మామ్ | = | నన్ను (ఈనా రూపమును) | తే | = | నీకు |
| | | | దివ్యమ్ | = | దివ్యమైన |
| అనేన | = | ఈ | చక్షుః | = | దృష్టిని |
| స్వచక్షుషా | = | (ప్రాకృతములైన) చర్మచక్షువులతో | దదామి | = | ఇచ్చెదను |
| | | | మే, ఐశ్వరమ్, యోగమ్ | = | నా దివ్యయోగ శక్తిని |
| ద్రష్టుమ్ | = | చూచుటకు | | | |
| ఏవ | = | నిస్సందేహముగా | | | |
| న, శక్యసే | = | సమర్థుడవుకావు (అశక్తుడవు) | పశ్య | = | చూడుము |

కాని, ప్రాకృత(చర్మ) చక్షువులతో నా ఈ రూపమును నీవు నిజముగా(నిస్సందేహముగా) చూడజాలవు. కనుక, నీకు దివ్య(అలౌకిక) దృష్టిని ప్రసాదించుచున్నాను. ఈ దివ్యదృష్టితో నా ఈశ్వరీయ(దివ్య) యోగశక్తిని చూడుము. (8)

**సంజయ ఉవాచ**

**ఏవముక్త్వా తతో రాజన్ మహాయోగేశ్వరో హరిః ।**
**దర్శయామాస పార్థాయ పరమం రూపమైశ్వరమ్ ॥ 9 ॥**

ఏవమ్, ఉక్త్వా, తతః, రాజన్, మహాయోగేశ్వరః, హరిః,
దర్శయామాస, పార్థాయ, పరమమ్, రూపమ్, ఐశ్వరమ్ ॥ 9 ॥

| | | |
|---|---|---|
| రాజన్! | = | ఓ రాజా! |
| మహాయోగేశ్వరః | = | మహాయోగేశ్వరుడును |
| హరిః | = | పాపములను హరించు వాడును అగు భగవానుడు |
| ఏవమ్ | = | ఈవిధముగా |
| ఉక్త్వా | = | పలికి |
| తతః | = | అనంతరము |
| పార్థాయ | = | అర్జునునకు |
| ఐశ్వరమ్ | = | షడ్గుణైశ్వర్య సంపన్నమైన |
| పరమమ్, రూపమ్ | = | (తన) పరమదివ్య రూపమును |
| దర్శయామాస | = | చూపెను. |

సంజయుడు పలికెను- ఓ రాజా! మహాయోగేశ్వరుడును, పాపములను హరించువాడును ఐన భగవానుడు ఈ విధముగా పలికి, అనంతరము షడ్గుణైశ్వర్య సంపన్నమైన తన పరమదివ్యస్వరూపమును అర్జునునకు చూపెను. (9)

**అనేకవక్త్రనయనమ్ అనేకాద్భుతదర్శనమ్ ।**
**అనేకదివ్యాభరణం దివ్యానేకోద్యతాయుధమ్ ॥ 10 ॥**
**దివ్యమాల్యాంబరధరం దివ్యగంధానులేపనమ్ ।**
**సర్వాశ్చర్యమయం దేవమ్ అనంతం విశ్వతోముఖమ్ ॥ 11 ॥**

అనేకవక్త్రనయనమ్, అనేకాద్భుతదర్శనమ్,
అనేకదివ్యాభరణమ్, దివ్యానేకోద్యతాయుధమ్ ॥ 10 ॥
దివ్యమాల్యాంబరధరమ్, దివ్యగంధానులేపనమ్,
సర్వాశ్చర్యమయమ్, దేవమ్, అనంతమ్, విశ్వతోముఖమ్ ॥ 11 ॥

| | | |
|---|---|---|
| అనేకవక్త్ర-నయనమ్ | = | అనేకములైన ముఖములతో నేత్రములతో ఒప్పుచున్నదియు |
| అనేకాద్భుత-దర్శనమ్ | = | పెక్కు అద్భుత దృశ్యములను కలిగి యున్నదియు |
| అనేక-దివ్యాభరణమ్ | = | అనేకములగు దివ్యాభరణములను ధరించి యున్నదియు |
| దివ్యా-నేకోద్యతా-యుధమ్ | = | అనేకములైన దివ్యాయుధములను చేపట్టి యున్నదియు |
| దివ్య మాల్యాంబర ధరమ్ | = | దివ్యములైన మాలలను వస్త్రములను ధరించి యున్నదియు |
| దివ్య గంధాను-లేపనమ్ | = | దివ్యములైన చందన పరిమళములను దశ దిశల గుబాళింప జేయుచున్నదియు |

| | | | | |
|---|---|---|---|---|
| సర్వాశ్చర్య-మయమ్ | = | సర్వాశ్చర్యకర మైనదియు | దేవమ్ | = ఆదేవదేవుని విరాడ్రూపమును (అర్జునుడు దర్శించెను). |
| అనంతమ్ | = | అనంతమైనదియు | | |
| విశ్వతో-ముఖమ్ | = | సర్వత్ర ముఖ శోభలను వెరజిమ్ము చున్నదియు అగు | | |

అర్జునుడు చూచిన ఆ పరమేశ్వరుని విరాట్ (విశ్వ) రూపమునందలి ముఖములు అనంతములు. నేత్రములు అసంఖ్యాకములు. అందలి దృశ్యములు అద్భుతములైనవి. ఆ రూపము అనేకదివ్యాభరణశోభితము. ఆ పరమేశ్వరుడు పెక్కు దివ్యాస్త్రములను చేపట్టియుండెను. దివ్యములగు మాలలను, వస్త్రములను ధరించియుండెను. ఆ దివ్యశరీరమునుండి దివ్యచందనపరిమళములు దశదిశల గుబాళించుచుండెను. ఆ రూపము సర్వాశ్చర్యకరము, అనంతము, సర్వతోముఖము. (10,11)

**దివి సూర్యసహస్రస్య భవేద్యుగపదుత్థితా ।**
**యది భా: సదృశీ సా స్యాత్ భాసస్తస్య మహాత్మన: ॥ 12 ॥**

దివి, సూర్యసహస్రస్య, భవేత్, యుగపత్, ఉత్థితా,
యది, భా:, సదృశీ, సా, స్యాత్, భాస:, తస్య, మహాత్మన: ॥ 12 ॥

| | | | | |
|---|---|---|---|---|
| దివి | = ఆకాశమునందు | | తస్య | = ఆ |
| సూర్యసహస్రస్య | = వేలకొలది సూర్యుల యొక్క | | మహాత్మన: | = విరాట్ పురుషుని యొక్క |
| భా: | = కాంతిపుంజము (కాంతులు) | | భాస: | = కాంతులకు |
| | | | సదృశీ | = సమానమైనది |
| యుగపత్ | = ఒక్కుమ్మడిగా | | యది | = బహుశా |
| ఉత్థితా, భవేత్ | = ఉదయించినచో (వెల్లివిరిసినచో) | | స్యాత్ | = అగునేమో? (ఐనను సమానము కాదని భావము). |
| సా | = ఆకాంతిపుంజము | | | |

ఆకాశమున వేలకొలది సూర్యులు ఒక్కుమ్మడిగా ఉదయించినచో, వచ్చు కాంతి పుంజములును ఆ విరాట్ - రూపతేజస్సులకు సాటిరావు. (12)

**తత్రైకస్థం జగత్ కృత్స్నం ప్రవిభక్తమనేకధా ।**
**అపశ్యద్దేవదేవస్య శరీరే పాండవస్తదా ॥ 13 ॥**

తత్ర, ఏకస్థమ్, జగత్, కృత్స్నమ్, ప్రవిభక్తమ్, అనేకధా,
అపశ్యత్, దేవదేవస్య, శరీరే, పాండవః, తదా ॥ 13 ॥

| | | | |
|---|---|---|---|
| తదా | = అప్పుడు | దేవదేవస్య | = దేవదేవుడైన విరాట్ పురుషుని యొక్క |
| అనేకధా | = పెక్కు విధములుగా | తత్ర, శరీరే | = ఆ శరీరమునందు |
| ప్రవిభక్తమ్ | = వేర్వేఱుగా వివిధ బ్రహ్మాండములుగా విభక్తమైయున్న | ఏకస్థమ్ | = కేంద్రీకృతమై యున్నట్లు |
| | | పాండవః | = అర్జునుడు |
| కృత్స్నమ్, జగత్ | = సమస్త జగత్తును | అపశ్యత్ | = చూచెను |

ఆ సమయమున అర్జునుడు ఆ దేవాదిదేవుని శరీరమునందు అసంఖ్యాకములైన వివిధబ్రహ్మాండములు వేర్వేరుగా ఒకేచోట కేంద్రీకృతమైయున్నట్లు చూచెను. (13)

**తతః స విస్మయావిష్టో హృష్టరోమా ధనంజయః ।**
**ప్రణమ్య శిరసా దేవం కృతాంజలిరభాషత ॥ 14 ॥**

తతః, సః, విస్మయావిష్టః, హృష్టరోమా, ధనంజయః,
ప్రణమ్య, శిరసా, దేవమ్, కృతాంజలిః, అభాషత ॥ 14 ॥

| | | | |
|---|---|---|---|
| తతః | = ఆపిమ్మట | శిరసా, ప్రణమ్య | = సాష్టాంగముగా నమస్కరించి |
| సః, ధనంజయః | = ఆ అర్జునుడు | | |
| విస్మయావిష్టః | = ఆశ్చర్యచకితుడై | కృతాంజలిః | = అంజలిఘటించిన వాడై |
| హృష్టరోమా | = పులకితగాత్రుడై | | |
| దేవమ్ | = ఆ విరాట్ పురుషునకు | అభాషత | = భాషించెను. |

అద్భుతమైన ఆ పరమాత్ముని విశ్వరూపమును జూచి, అర్జునుడు ఆశ్చర్యచకితుడై పులకితగాత్రుడయ్యెను. తేజోమయమైన ఈ విశ్వ(విరాట్) రూపమునకు భక్తిశ్రద్ధలతో సాష్టాంగప్రణామములాచరించెను. తదనంతరము చేతులు జోడించి యిట్లు పలికెను. (14)

**అర్జున ఉవాచ**

**పశ్యామి దేవాంస్తవ దేవ దేహే**
**సర్వాంస్తథా భూతవిశేషసంఘాన్ ।**
**బ్రహ్మాణమీశం కమలాసనస్థమ్**
**ఋషీంశ్చ సర్వానురగాంశ్చ దివ్యాన్ ॥ 15 ॥**

పశ్యామి, దేవాన్, తవ, దేవ, దేహే, సర్వాన్, తథా, భూతవిశేషసంఘాన్,
బ్రహ్మాణమ్, ఈశమ్, కమలాసనస్థమ్, ఋషీన్, చ, సర్వాన్, ఉరగాన్, చ, దివ్యాన్ ॥ 15 ॥

| | | | |
|---|---|---|---|
| దేవ! | = ఓ పరమేశ్వరా! | బ్రహ్మాణమ్ | = బ్రహ్మను |
| తవ దేహే | = నీదేహ (విరాట్ స్వరూప)మునందు | ఈశమ్ | = శంకరుని |
| | | చ | = మఱియు |
| సర్వాన్, దేవాన్ | = సకలదేవతలను | సర్వాన్, ఋషీన్ | = సమస్త-ఋషులను |
| తథా | = అట్లే | | |
| భూతవిశేష సంఘాన్ | = వివిధప్రాణి సముదాయములను | చ | = మఱియు |
| | | దివ్యాన్ | = దివ్యములైన |
| కమలాసనస్థమ్ | = కమలమునందు ఆసీనుడైయున్న | ఉరగాన్ | = సర్పములను |
| | | పశ్యామి | = చూచుచున్నాను. |

అర్జునుడు పలికెను - ఓ దేవాదిదేవా! నీ విరాట్-రూపమునందు సకల దేవతలను, నానావిధప్రాణికోటిని, కమలాసనుడైన బ్రహ్మను, మహాదేవుడైన శంకరుని, సమస్త ఋషులను, దివ్యసర్పములను చూచుచున్నాను. (15)

**అనేకబాహూదరవక్త్రనేత్రం**
**పశ్యామి త్వాం సర్వతోఽనంతరూపమ్ ।**
**నాంతం న మధ్యం న పునస్తవాదిం**
**పశ్యామి విశ్వేశ్వర విశ్వరూప ॥ 16 ॥**

అనేకబాహూదరవక్త్రనేత్రమ్, పశ్యామి, త్వామ్, సర్వతః, అనంతరూపమ్,
న, అంతమ్, న, మధ్యమ్, న, పునః, తవ, ఆదిమ్, పశ్యామి, విశ్వేశ్వర, విశ్వరూప ॥ 16 ॥

| | | | |
|---|---|---|---|
| విశ్వేశ్వర! | = ఓ జగన్నాథా! | అనంతరూపమ్ | = అనంతములైన రూపములుగల వాడవును ఐన |
| అనేకబాహూదర వక్త్రనేత్రమ్ | = అనేకములైన బాహువులును, ఉదరములును, ముఖములును, నేత్రములును గల వాడవును | త్వామ్ | = నిన్ను |
| | | పశ్యామి | = చూచుచున్నాను |
| | | విశ్వరూప! | = ఓ విరాడ్రూపా! |
| | | తవ | = నీ యొక్క |
| సర్వతః | = అంతటను | ఆదిమ్ | = ఆదిని |

| | | | | | |
|---|---|---|---|---|---|
| న పశ్యామి | = | చూడ (తెలిసికొన) లేకున్నాను | పునః | = | మఱియు |
| మధ్యమ్ | = | మధ్యమును | అంతమ్ | = | అంతమును |
| న | = | చూడకున్నాను | న | = | చూడకున్నాను. |

ఓ విశ్వేశ్వరా! విశ్వరూపా! నీ బాహువులు, ఉదరములు, ముఖములు, నేత్రములు అసంఖ్యాకములు. నీ అనంతరూపము సర్వతోముఖముగ విలసిల్లుచున్నది. నీవు ఆదిమధ్యాంతరహితుడవు. మహత్త్వపూర్ణమైన నీ దివ్యరూపమునకు ఆది మధ్యాంతములను తెలిసికొనలేకున్నాను. (16)

**కిరీటినం గదినం చక్రిణం చ**
**తేజోరాశిం సర్వతో దీప్తిమంతమ్ ।**
**పశ్యామి త్వాం దుర్నిరీక్ష్యం సమంతాత్**
**దీప్తానలార్క ద్యుతిమప్రమేయమ్ ॥ 17 ॥**

కిరీటినమ్, గదినమ్, చక్రిణం, చ, తేజోరాశిమ్, సర్వతః, దీప్తిమంతమ్, పశ్యామి, త్వామ్, దుర్నిరీక్ష్యమ్, సమంతాత్, దీప్తానలార్కద్యుతిమ్, అప్రమేయమ్ ॥ 17 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| కిరీటినమ్ | = | కిరీటమును ధరించిన వాడవును, | దీప్తానలార్క ద్యుతిమ్ | = | ప్రజ్వలితాగ్నివలెను, జ్యోతిర్మయుడైన సూర్యునివలెను వెలుగొందుచు |
| గదినమ్ | = | గదను చేపట్టిన వాడవును | దుర్నిరీక్ష్యమ్ | = | చూచుటకు శక్యము గాని వాడవును |
| చ | = | మఱియు | సమంతాత్ | = | అంతటను |
| చక్రిణమ్ | = | చక్రము చేబూనిన వాడవును ఐ | అప్రమేయమ్ | = | అప్రమేయ స్వరూపుడవును ఐయున్న |
| సర్వతః | = | అన్ని దిశలయందును | త్వామ్ | = | నిన్ను |
| తేజోరాశిమ్ | = | తేజోరాశియు | పశ్యామి | = | చూచుచున్నాను |
| దీప్తిమంతమ్ | = | ప్రకాశించుచున్న వాడవును | | | |

హే విష్ణో! కిరీటమును, గదను, చక్రమును ధరించి, అంతటను తేజఃపుంజములను విరజిమ్ముచున్న నిన్ను దర్శించుచున్నాను. ప్రజ్వలితాగ్నివలెను, జ్యోతిర్మయుడైన సూర్యునివలెను వెలుగొందుచున్న నీ అప్రమేయరూపము దుర్నిరీక్ష్యమై యున్నది. (17)

**త్వమక్షరం పరమం వేదితవ్యం**
**త్వమస్య విశ్వస్య పరం నిధానమ్ ।**
**త్వమవ్యయః శాశ్వతధర్మగోప్తా**
**సనాతనస్త్వం పురుషో మతో మే ॥ 18 ॥**

త్వమ్, అక్షరమ్, పరమమ్, వేదితవ్యమ్, త్వమ్, అస్య, విశ్వస్య, పరమ్, నిధానమ్,
త్వమ్, అవ్యయః, శాశ్వతధర్మగోప్తా, సనాతనః, త్వమ్, పురుషః, మతః, మే ॥ 18 ॥

| | | | |
|---|---|---|---|
| త్వమ్ | = నీవు | శాశ్వతధర్మ గోప్తా | = సనాతనధర్మమును పరిరక్షించువాడవు |
| వేదితవ్యమ్ | = తెలిసికొనదగిన | త్వమ్(ఏవ) | = నీవే |
| పరమమ్ అక్షరమ్ | = పరమ-అక్షరుడవు(పరబ్రహ్మ పరమాత్మవు) | అవ్యయః | = నాశరహితుడవు |
| త్వమ్ | = నీవే | సనాతనః, పురుషః | = సనాతన పురుషుడవు, అని |
| అస్య, విశ్వస్య | = ఈ విశ్వమునకు | | |
| పరమ్, నిధానమ్ | = పరమాశ్రయుడవు | | |
| త్వమ్, (ఏవ) | = నీవే | మే, మతః | = నా నిశ్చయము. |

పరమ - అక్షరస్వరూపుడవైన పరబ్రహ్మపరమాత్మవు నీవే, కనుక అందరికిని తెలిసికొనదగినవాడవు. ఈజగత్తునకు నీవే పరమాశ్రయుడవు. సనాతన ధర్మరక్షకుడవు. నీవు అవ్యయుడవు. సనాతనపురుషుడవు, అని నావిశ్వాసము (18)

**అనాదిమధ్యాంతమనంతవీర్యమ్**
**అనంతబాహుం శశిసూర్యనేత్రమ్ ।**
**పశ్యామి త్వాం దీప్తహుతాశవక్త్రం**
**స్వతేజసా విశ్వమిదం తపంతమ్ ॥ 19 ॥**

అనాదిమధ్యాంతమ్, అనంతవీర్యమ్, అనంతబాహుమ్, శశిసూర్యనేత్రమ్,
పశ్యామి, త్వామ్, దీప్తహుతాశవక్త్రమ్, స్వతేజసా, విశ్వమ్, ఇదమ్, తపంతమ్ ॥ 19 ॥

| | | | |
|---|---|---|---|
| అనాది మధ్యాంతమ్ | = ఆదిమధ్యాంత రహితుడవును | అనంత బాహుమ్ | = అపరిమితమైన బాహువులుగల వాడవును |
| అనంతవీర్యమ్ | = అనంతమైన సామర్థ్యము గలవాడవును | శశిసూర్య నేత్రమ్ | = సూర్యచంద్రులను నేత్రములుగా గల వాడవును |

| | | | | | |
|---|---|---|---|---|---|
| దీప్తహుతాశ వక్త్రమ్ | = | ప్రజ్వలితాగ్నివలె ప్రకాశించుచున్న ముఖములుగల వాడవును | విశ్వమ్ | = | విశ్వమును |
| | | | తపంతమ్ | = | తపింపజేయుచున్న వాడవును- అగు |
| స్వతేజసా | = | నీ తేజస్సుతో | త్వామ్ | = | నిన్ను |
| ఇదమ్ | = | ఈ | పశ్యామి | = | చూచుచున్నాను. |

నీవు ఆదిమధ్యాంతరహితుడవు. అపరిమితశక్తిశాలివి. అసంఖ్యాకములైన భుజములు గలవాడవు. సూర్యచంద్రులు నీ నేత్రములు. అగ్నివలె నీ ముఖము ప్రజ్వరిల్లుచున్నది. నీ తేజస్సుతో ఈ జగత్తును సంతప్తమొనర్చుచున్నావు. అట్టి నిన్ను నేను చూచుచున్నాను. (19)

**ద్యావాపృథివ్యోరిదమంతరం హి**
**వ్యాప్తం త్వయైకేన దిశశ్చ సర్వాః ।**
**దృష్ట్వాద్భుతం రూపముగ్రం తవేదం**
**లోకత్రయం ప్రవ్యథితం మహాత్మన్ ॥ 20 ॥**

ద్యావాపృథివ్యోః, ఇదమ్, అంతరమ్, హి, వ్యాప్తమ్, త్వయా, ఏకేన, దిశః, చ, సర్వాః, దృష్ట్వా, అద్భుతమ్, రూపమ్, ఉగ్రమ్, తవ, ఇదమ్, లోకత్రయమ్, ప్రవ్యథితమ్, మహాత్మన్ ॥ 20 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| మహాత్మన్! | = | ఓ మహాత్మా! | తవ | = | నీ యొక్క |
| ఇదమ్ | = | ఈ | ఇదమ్ | = | ఈ |
| ద్యావాపృథివ్యోః | = | దివినుండిభువి వఱకు గల | అద్భుతమ్ | = | అద్భుతమైన |
| | | | ఉగ్రమ్ | = | భయంకరమైన |
| అంతరమ్ | = | ఆకాశము | రూపమ్ | = | రూపమును |
| చ | = | మఱియు | దృష్ట్వా | = | చూచి |
| సర్వాః, దిశః | = | అన్ని దిశలును | లోకత్రయమ్ | = | ముల్లోకములును |
| ఏకేన, త్వయా,హి | = | నీ ఒక్కని చేతనే | ప్రవ్యథితమ్ | = | వ్యథితములైనవి (భయకంపితము లైనవి). |
| వ్యాప్తమ్ | = | వ్యాప్తములైనవి | | | |

ఓ మహాత్మా! దివినుండి భువివఱకుగల అంతరిక్షమునందంతటను అన్ని దిశలను నీవే పరిపూర్ణుడవై యున్నావు. అద్భుతమైన నీ భయంకరరూపమును చూచి, ముల్లోకములును గడగడలాడుచున్నవి (20)

**అమీ హి త్వాం సురసంఘా విశంతి**
**కేచిద్భీతాః ప్రాంజలయో గృణంతి ।**
**స్వస్తీత్యుక్త్వా మహర్షిసిద్ధసంఘాః**
**స్తువంతి త్వాం స్తుతిభిః పుష్కలాభిః ॥ 21 ॥**

అమీ, హి, త్వామ్, సురసంఘాః, విశంతి, కేచిత్, భీతాః ప్రాంజలయః, గృణంతి,
స్వస్తి, ఇతి, ఉక్త్వా, మహర్షిసిద్ధసంఘాః, స్తువంతి, త్వామ్, స్తుతిభిః, పుష్కలాభిః ॥ 21 ॥

| | | | |
|---|---|---|---|
| అమీ | = ఇదిగో, ఆ | మహర్షిసిద్ధ సంఘాః | = మహర్షుల, సిద్ధుల సమూహములు |
| సురసంఘాః, హి | = దేవతలందరును | స్వస్తి ఇతి | = స్వస్తివచనములను (జయమగుగాక-అని) |
| త్వామ్ | = నీలో | | |
| విశంతి | = ప్రవేశించుచున్నారు | | |
| కేచిత్ | = కొందఱు | ఉక్త్వా | = పలికి |
| భీతాః | = భీతులై | పుష్కలాభిః | = పుష్కలములైన |
| ప్రాంజలయః | = అంజలిఘటించినవారై | స్తుతిభిః | = ఉత్తమోత్తమ స్తోత్రములతో |
| గృణంతి | = (నీనామగుణములను) కీర్తించుచున్నారు | త్వామ్ | = నిన్ను |
| | | స్తువంతి | = స్తుతించుచున్నారు. |

ఇదిగో, ఆ దేవతలెల్లరును నీలో ప్రవేశించుచున్నారు. కొందఱు భయపడినవారై అంజలి ఘటించి, నీ నామగుణములను కీర్తించుచున్నారు. మహర్షులును, సిద్ధులును స్వస్తివచనములతోడను, ఉత్తమోత్తమస్తోత్రములతోడను నిన్ను ప్రస్తుతించుచున్నారు. (21)

**రుద్రాదిత్యా వసవో యే చ సాధ్యా**
**విశ్వే ఽశ్వినౌ మరుతశ్చోష్మపాశ్చ ।**
**గంధర్వయక్షాసురసిద్ధసంఘా**
**వీక్షంతే త్వాం విస్మితాశ్చైవ సర్వే ॥ 22 ॥**

రుద్రాదిత్యాః, వసవః, యే, చ, సాధ్యాః, విశ్వే, అశ్వినౌ, మరుతః, చ, ఊష్మపాః, చ,
గంధర్వయక్షాసురసిద్ధసంఘాః, వీక్షంతే, త్వామ్, విస్మితాః, చ, ఏవ, సర్వే ॥ 22 ॥

| | | | |
|---|---|---|---|
| రుద్రాదిత్యాః చ | = ఏకాదశరుద్రులును, ద్వాదశాదిత్యులును | సాధ్యాః | = సాధ్యులును |
| | | విశ్వే | = విశ్వేదేవతలును |
| వసవః | = అష్టవసువులును | అశ్వినౌ, చ | = అశ్వినీ కుమారులును |

| | | | | | |
|---|---|---|---|---|---|
| మరుతః, చ | = | మరుద్గణములును | (తే)సర్వే | = | (వారు)అందరును |
| ఊష్మపాః, చ | = | పితరులును | విస్మితాః | = | సంభ్రమాశ్చర్యములకు లోనైనవారై |
| గంధర్వ యక్షాసుర సిద్ధసంఘాః | = | గంధర్వులును, యక్షులును, అసురులును, సిద్ధులును, | త్వామ్, ఏవ | = | నిన్నే |
| యే | = | ఎవరెవరు గలరో | వీక్షంతే | = | చూచుచున్నారు. |

ఏకాదశరుద్రులును, ద్వాదశాదిత్యులును, అష్టవసువులును, సాధ్యులును, విశ్వేదేవతలును, అశ్వినీకుమారులును, మరుద్గణములును, పితరులును అట్లే గంధర్వయక్షాసురసిద్ధసముదాయములును సంభ్రమాశ్చర్యములతో నిన్నే దర్శించుచున్నారు. (22)

**రూపం మహత్తే బహువక్త్రనేత్రం**
**మహాబాహో బహుబాహూరుపాదమ్ ।**
**బహూదరం బహుదంష్ట్రాకరాళం**
**దృష్ట్వా లోకాః ప్రవ్యథితాస్తథాహమ్ ॥ 23 ॥**

రూపమ్, మహత్, తే, బహువక్త్రనేత్రమ్, మహాబాహో, బహుబాహూరుపాదమ్,
బహూదరమ్, బహుదంష్ట్రాకరాళమ్, దృష్ట్వా, లోకాః, ప్రవ్యథితాః, తథా, అహమ్ ॥ 23 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| మహాబాహో! | = | ఓ మహాబాహూ! (కృష్ణా!) | బహుదంష్ట్రా కరాళమ్ | = | పెక్కు కోరలచే భయంకరమైనదియు,అగు |
| బహువక్త్ర నేత్రమ్ | = | అనేకములైన వక్త్రములును, నేత్రములును గలదియు | తే, మహత్, రూపమ్ | = | నీ మహారూపమును |
| | | | దృష్ట్వా | = | చూచి |
| బహుబాహూరు పాదమ్ | = | అసంఖ్యాకములైన బాహువులు, తొడలు, పాదములు గలదియు | లోకాః | = | లోకములన్నియును |
| | | | ప్రవ్యథితాః | = | భయకంపితములు అగుచున్నవి |
| | | | తథా | = | అట్లే |
| బహూదరమ్ | = | పెక్కు ఉదరములు గలదియు | అహమ్, అపి | = | నేనును వణకిపోవుచున్నాను. |

హే మహాబాహో! అసంఖ్యాకములైన వక్త్రములను, నేత్రములను, చేతులను, ఊరువు(తొడ)లను, పాదములను, ఉదరములను, కోరలను కలిగిన మిక్కిలి భయంకరమైన నీ రూపమును చూచి, అందఱును భయకంపితులగుచున్నారు. నేనుకూడ భయముతో వణకిపోవుచున్నాను. (23)

**నభఃస్పృశం దీప్తమనేకవర్ణం**
**వ్యాత్తాననం దీప్తవిశాలనేత్రమ్ ।**
**దృష్ట్వా హి త్వాం ప్రవ్యథితాంతరాత్మా**
**ధృతిం న విందామి శమం చ విష్ణో ॥ 24 ॥**

నభఃస్పృశమ్, దీప్తమ్, అనేకవర్ణమ్, వ్యాత్తాననమ్, దీప్తవిశాలనేత్రమ్, దృష్ట్వా, హి, త్వామ్, ప్రవ్యథితాంతరాత్మా, ధృతిమ్, న, విందామి, శమమ్, చ, విష్ణో ॥ 24 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| హి | = | ఏలనన | దీప్తవిశాల నేత్రమ్ | = | కాంతులను విరజిమ్ము విశాలనేత్రములుగల |
| విష్ణో! | = | ఓ మహావిష్ణూ! | త్వామ్ | = | నిన్ను (నీరూపమును) |
| నభఃస్పృశమ్ | = | ఆకాశమును స్పృశించుచున్న | దృష్ట్వా | = | చూచి |
| దీప్తమ్ | = | మిక్కిలి ప్రకాశించుచున్న | ప్రవ్యథితాంతరాత్మా (అహమ్) | = | మిక్కిలి తత్తర పడుచున్న నేను |
| అనేకవర్ణమ్ | = | రంగురంగుల వన్నెలనుగల్గియున్న | ధృతిమ్, చ | = | ధైర్యమును |
| వ్యాత్తాననమ్ | = | విస్తరించిన ముఖము లతో ఒప్పుచున్న | శమమ్, చ | = | శాంతిని |
| | | | న, విందామి | = | పొందలేకున్నాను. |

ఏలనన, హే విష్ణో! నీ రూపము అంతరిక్షమును తాకుచున్నది. అది అనేకవర్ణములతో దేదీప్యమానమై వెలుగుచున్నది. కాంతులను విరజిమ్ముచున్న విశాలనేత్రములతో, విస్తరించినముఖములతో అద్భుతముగా ఒప్పుచున్నది. అట్టి నీ రూపమును చూచిన నా మనస్సు తత్తరపడుచున్నది. అందువలన, నా ధైర్యము సడలినది. శాంతి దూరమైనది. (24)

**దంష్ట్రాకరాలాని చ తే ముఖాని**
**దృష్ట్వైవ కాలానలసన్నిభాని ।**
**దిశో న జానే న లభే చ శర్మ**
**ప్రసీద దేవేశ జగన్నివాస ॥ 25 ॥**

దంష్ట్రాకరాళాని, చ, తే, ముఖాని, దృష్ట్వా, ఏవ, కాలానలసన్నిభాని,
దిశః, న, జానే, న, లభే, చ, శర్మ, ప్రసీద, దేవేశ, జగన్నివాస ॥ 25 ॥

| | | | |
|---|---|---|---|
| జగన్నివాస! | = ఓ జగన్నివాసా! | దృష్ట్వా | = చూచి |
| దంష్ట్రా కరాళాని | = భయంకరములైన కోరలుగలవియు | దిశః, న జానే | = దిక్కులను తెలిసికొనలేకున్నాను |
| చ | = మఱియు | చ | = మఱియు |
| కాలానల సన్నిభాని | = ప్రళయాగ్నిజ్వాలల వలె భీతి గొల్పునవియు అగు | శర్మ, ఏవ న, లభే | = నెమ్మదిని (శాంతిని) పొందలేకున్నాను |
| | | దేవేశ! | = ఓ దేవాధిదేవా! |
| తే, ముఖాని | = నీ ముఖములను | ప్రసీద | = అనుగ్రహింపుము. |

ఓ జగన్నివాసా! కరాళదంష్ట్రలతో (భయంకరములైన కోరలతో) ఒప్పుచున్న నీ ముఖములు ప్రళయాగ్నిజ్వాలలవలె భీతిగొల్పుచున్నవి. వాటిని చూచిన నాకు దిక్కుతోచకున్నది. నెమ్మది(శాంతి) శూన్యమైనది. ఓ దేవేశా! ప్రసన్నుడవు కమ్ము. (25)

**అమీ చ త్వాం ధృతరాష్ట్రస్య పుత్రాః**
**సర్వే సహైవావనిపాలసంఘైః ।**
**భీష్మో ద్రోణః సూతపుత్రస్తథాసౌ**
**సహాస్మదీయైరపి యోధముఖ్యైః ॥ 26 ॥**
**వక్త్రాణి తే త్వరమాణా విశంతి**
**దంష్ట్రాకరాళాని భయానకాని ।**
**కేచిద్విలగ్నా దశనాంతరేషు**
**సందృశ్యంతే చూర్ణితైరుత్తమాంగైః ॥ 27 ॥**

అమీ, చ, త్వామ్, ధృతరాష్ట్రస్య, పుత్రాః, సర్వే, సహ, ఏవ, అవనిపాలసంఘైః,
భీష్మః, ద్రోణః, సూతపుత్రః, తథా, అసౌ, సహ, అస్మదీయైః, అపి, యోధముఖ్యైః ॥ 26 ॥
వక్త్రాణి, తే, త్వరమాణాః, విశంతి, దంష్ట్రాకరాళాని, భయానకాని,
కేచిత్, విలగ్నాః, దశనాంతరేషు, సందృశ్యంతే, చూర్ణితైః, ఉత్తమాంగైః ॥ 27 ॥

| | | | |
|---|---|---|---|
| అమీ | = ఇదిగో | పుత్రాః | = కుమారులు |
| ధృతరాష్ట్రస్య | = ధృతరాష్ట్రుని | సర్వే, ఏవ | = అందఱును |

అవనిపాల సంఘైః, సహ = రాజసముదాయములతో గూడినవారై
త్వామ్ = నీలో
(ప్రవిశంతి) = ప్రవేశించుచున్నారు
చ = మఱియు
భీష్మః = భీష్ముడును
ద్రోణః = ద్రోణుడును
తథా = అట్లే
అసౌ = ఈ
సూతపుత్రః = సూతపుత్రుడైన కర్ణుడును
అపి = మఱియును
అస్మదీయైః = మనపక్షమునకు చెందిన
యోధముఖ్యైః, సహ = ముఖ్యయోధులతో గూడ
తే = నీయొక్క
దంష్ట్రాకరాళాని = భయంకరములైన కోరలతో గూడి
భయానకాని = భీతిని గొల్పు
వక్త్రాణి = నోళ్ళలో
త్వరమాణాః = త్వరపడుచున్నవారై
విశంతి = ప్రవేశించుచున్నారు
కేచిత్ = కొందఱు
చూర్ణితైః = నుగ్గునుగ్గు కావింపబడిన
ఉత్తమాంగైః = శిరస్సులతో
దశనాంతరేషు = దంతములమధ్య
విలగ్నాః = చిక్కుకొని వ్రేలాడుచున్నవారై
సందృశ్యంతే = కనబడుచున్నారు.

ఇదిగో! (ఇచ్చట చేరియున్న) ఈ ధృతరాష్ట్రపుత్రులు(దుర్యోధనాదులు) ఇతర రాజన్యులతో సహా నీలో ప్రవేశించుచున్నారు. భీష్మపితామహుడు, ద్రోణుడు, కర్ణుడు, అట్లే మన పక్షమునందలి ప్రధానయోధులు అందఱును భయంకరములైన కోరలతోగూడిన నీ ముఖములయందు అతివేగముగా పరుగులుదీయుచు ప్రవేశించుచున్నారు. కొందఱి తలలు కోరల మధ్యబడి నుగ్గునుగ్గైపోవుచుండగా వారు దంతములలో చిక్కుకొని వ్రేలాడుచున్నారు. (26,27)

**యథా నదీనాం బహవోఽమ్బువేగాః**
**సముద్రమేవాభిముఖా ద్రవంతి ।**
**తథా తవామీ నరలోకవీరా**
**విశంతి వక్త్రాణ్యభివిజ్వలంతి ॥ 28 ॥**

యథా, నదీనామ్, బహవః, అంబువేగాః, సముద్రమ్, ఏవ, అభిముఖాః, ద్రవంతి, తథా, తవ, అమీ, నరలోకవీరాః, విశంతి, వక్త్రాణి, అభివిజ్వలంతి ॥ 28 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| యథా | = | ఏవిధముగా | తథా | = | అట్లే |
| నదీనామ్ | = | నదీనదములయొక్క | అమీ | = | ఈ |
| బహవః | = | అనేకములైన | నరలోకవీరాః | = | శ్రేష్ఠులైన సమర యోధులు(నరలోకవీరులు) |
| అంబువేగాః | = | వేగముగా ప్రవహించుచున్న జలము లన్నియును | తవ | = | నీయొక్క |
| సముద్రమ్ | = | సముద్రమునకు | అభివిజ్వలంతి | = | మిక్కిలి జ్వలించుచున్న |
| అభిముఖాః, ఏవ | = | అభిముఖముగానే | వక్త్రాణి | = | ముఖములను (ముఖములయందు) |
| ద్రవంతి | = | పరుగులుదీయుచు అందుప్రవేశించునో | విశంతి | = | ప్రవేశించుచున్నారు. |

అనేకములైన నదీనదములప్రవాహములన్నియును సహజముగా సముద్రమునకు అభిముఖముగా ప్రవహించుచు అందు ప్రవేశించుచున్నట్లు, ఈ శ్రేష్ఠులైన సమరయోధులు (నరలోకవీరులు) కూడ జ్వలించుచున్న నీ ముఖములయందు ప్రవేశించుచున్నారు. (28)

**యథా ప్రదీప్తం జ్వలనం పతంగా**
**విశంతి నాశాయ సమృద్ధవేగాః ।**
**తథైవ నాశాయ విశంతి లోకాః**
**తవాపి వక్త్రాణి సమృద్ధవేగాః ॥ 29 ॥**

యథా, ప్రదీప్తమ్, జ్వలనమ్, పతంగాః, విశంతి, నాశాయ, సమృద్ధవేగాః,
తథా, ఏవ, నాశాయ, విశంతి, లోకాః, తవ, అపి, వక్త్రాణి, సమృద్ధవేగాః ॥ 29 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| యథా | = | ఏవిధముగా | లోకాః, అపి | = | లోకములన్నియును |
| పతంగాః | = | మిడుతలు | నాశాయ | = | తమ నాశమునకై |
| నాశాయ | = | మోహవశమున తమ నాశము కొఱకు | తవ | = | నీయొక్క |
| ప్రదీప్తమ్ | = | ప్రజ్వలించుచున్న | వక్త్రాణి | = | ముఖములను (ముఖములయందు) |
| జ్వలనమ్ | = | అగ్నిని (అగ్నిలో) | సమృద్ధవేగాః | = | మిక్కిలి వేగము గలవై (వేగముగా) |
| సమృద్ధవేగాః | = | మిక్కిలి వేగముగా | | | |
| విశంతి | = | ప్రవేశించునో | | | |
| తథా, ఏవ | = | ఆవిధముగానే | విశంతి | = | ప్రవేశించుచున్నవి. |

మిడుతలన్నియును మోహవశమున బాగుగా మండుచున్న అగ్నివైపు అతివేగముగా పరుగెత్తి, తమ నాశనముకొఱకు అందు ప్రవేశించి, నశించునట్లు ఈ వీరులందఱును తమనాశమునకై అతివేగముగా పరుగెత్తి, నీ వక్త్రములయందు ప్రవేశించుచున్నారు. (29)

**లేలిహ్యసే గ్రసమానః సమంతాత్**
**లోకాన్ సమగ్రాన్ వదనైర్జ్వలద్భిః ।**
**తేజోఽభిరాపూర్య జగత్ సమగ్రం**
**భాసస్తవోగ్రాః ప్రతపంతి విష్ణో ॥ 30 ॥**

లేలిహ్యసే, గ్రసమానః, సమంతాత్, లోకాన్, సమగ్రాన్, వదనైః, జ్వలద్భిః,
తేజోభిః ఆపూర్య, జగత్, సమగ్రమ్, భాసః, తవ, ఉగ్రాః ప్రతపంతి, విష్ణో ॥ 30 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| విష్ణో | = | ఓ మహావిష్ణూ! | తవ | = | నీయొక్క |
| సమగ్రాన్ | = | సమగ్రములైన | ఉగ్రాః | = | భయంకరములైన |
| లోకాన్ | = | లోకములను | భాసః | = | కాంతులు |
| జ్వలద్భిః | = | ప్రజ్వలించుచున్న | సమగ్రమ్,- జగత్ | = | సమస్తజగత్తును |
| వదనైః | = | ముఖములతో | | | |
| గ్రసమానః | = | కబళించుచున్న వాడవై | తేజోభిః | = | తేజస్సులతో |
| | | | ఆపూర్య | = | నింపి |
| సమంతాత్ | = | అన్నివైపుల నుండి | ప్రతపంతి | = | తపింపజేయు చున్నవి |
| లేలిహ్యసే | = | మాటిమాటికిని చప్పరించుచున్నావు | | | |

హే విష్ణో! ప్రజ్వలించుచున్న నీ ముఖములతో సమస్త లోకములను అన్నివైపులనుండి కబళించుచు మాటిమాటికిని చప్పరించుచున్నావు. నీ ఉగ్రతేజస్సులు అంతటను నిండి జగత్తును తపింపజేయుచున్నవి. (30)

**ఆఖ్యాహి మే కో భవానుగ్రరూపో**
**నమోఽస్తు తే దేవవర ప్రసీద ।**
**విజ్ఞాతుమిచ్ఛామి భవంతమాద్యం**
**న హి ప్రజానామి తవ ప్రవృత్తిమ్ ॥ 31 ॥**

ఆఖ్యాహి, మే, కః, భవాన్, ఉగ్రరూపః, నమః, అస్తు, తే, దేవవర, ప్రసీద,
విజ్ఞాతుమ్, ఇచ్ఛామి, భవంతమ్, ఆద్యమ్, న, హి, ప్రజానామి, తవ, ప్రవృత్తిమ్ ॥ 31 ॥

| | | | |
|---|---|---|---|
| దేవవర! | = ఓ పరమాత్మా! | హి | = ఏలనన |
| తే | = నీకు | తవ, ప్రవృత్తిమ్ | = నీ ప్రవృత్తిని |
| నమః, అస్తు | = నమస్కారము | న, ప్రజానామి | = ఎఱుంగకున్నాను. (కనుక) |
| ప్రసీద | = ప్రసన్నుడవు కమ్ము | | |
| ఆద్యమ్ | = ఆదిపురుషుడవైన | ఉగ్రరూపః భవాన్ | = ఉగ్రరూపుడవైన నీవు |
| భవంతమ్ | = నిన్ను | | |
| విజ్ఞాతుమ్ | = విశదముగా తెలిసికొనుటకు | కః | = ఎవరవో? |
| | | మే | = నాకు |
| ఇచ్ఛామి | = కోరుచున్నాను | ఆఖ్యాహి | = తెలుపుము. |

ఓ పరమాత్మా! నీకు నా నమస్కారములు - ప్రసన్నుడవు కమ్ము. ఉగ్రరూపుడవైన నీవు ఎవరో దయతో నాకు తెలుపుము. ఆదిపురుషుడవైన నిన్ను విశదముగా తెలిసికొనగోరుచున్నాను. ఏలనన, నీ ప్రవృత్తిని ఎఱుంగలేకున్నాను. (31)

### శ్రీభగవాన్ ఉవాచ

**కాలోఽస్మి లోకక్షయకృత్ ప్రవృద్ధో**
**లోకాన్ సమాహర్తుమిహ ప్రవృత్తః ।**
**ఋతేఽపి త్వాం న భవిష్యంతి సర్వే**
**యేఽవస్థితాః ప్రత్యనీకేషు యోధాః ॥ 32 ॥**

కాలః, అస్మి, లోకక్షయకృత్, ప్రవృద్ధః, లోకాన్, సమాహర్తుమ్, ఇహ, ప్రవృత్తః,
ఋతే, అపి, త్వామ్, న, భవిష్యంతి, సర్వే, యే, అవస్థితాః, ప్రత్యనీకేషు, యోధాః ॥ 32 ॥

| | | | |
|---|---|---|---|
| లోకక్షయకృత్ | = సర్వలోకములను తుదముట్టించునట్టి | సమాహర్తుమ్ | = రూపుమాపుటకై |
| | | ప్రవృత్తః | = పూనుకొనియున్న వాడను |
| ప్రవృద్ధః | = విజృంభించిన | | |
| కాలః, అస్మి | = మహాకాలుడను | ప్రత్యనీకేషు | = శత్రుపక్షముల యందు |
| ఇహ | = ఇప్పుడు | | |
| లోకాన్ | = (ఈ) లోకములను | యే, యోధాః | = ఏ వీరులు |

| | | | |
|---|---|---|---|
| అవస్థితాః | = కలరో | త్వామ్, ఋతే, అపి | = నీవు యుద్ధము చేయకున్నను |
| (తే) | = (వారు) | న, భవిష్యంతి | = మిగిలియుండరు. |
| సర్వే | = అందఱును | | |

శ్రీ భగవానుడు పలికెను - నేను లోకములనన్నింటిని తుదముట్టించుటకై విజృంభించిన మహాకాలుడను. ఇప్పుడు ఈ లోకములను రూపుమాపుటకై పూనుకొనియున్నాను. కనుక, నీవు యుద్ధముచేయకున్ననూ ప్రతిపక్షమునమన్న ఈ వీరులెవ్వరును మిగులరు.(మిగిలియుండరు) (32)

**తస్మాత్ త్వముత్తిష్ఠ యశో లభస్వ**
**జిత్వా శత్రూన్ భుంక్ష్వ రాజ్యం సమృద్ధమ్ ।**
**మయైవైతే నిహతాః పూర్వమేవ**
**నిమిత్తమాత్రం భవ సవ్యసాచిన్ ॥ 33 ॥**

తస్మాత్, త్వమ్, ఉత్తిష్ఠ, యశః, లభస్వ, జిత్వా, శత్రూన్, భుంక్ష్వ, రాజ్యమ్, సమృద్ధమ్,
మయా, ఏవ, ఏతే, నిహతాః, పూర్వమ్, ఏవ, నిమిత్తమాత్రమ్, భవ, సవ్యసాచిన్ ॥ 33 ॥

| | | | |
|---|---|---|---|
| తస్మాత్ | = అందువలన | రాజ్యమ్ | = రాజ్యమును |
| త్వమ్ | = నీవు | భుంక్ష్వ | = అనుభవింపుము |
| ఉత్తిష్ఠ | = (యుద్ధము చేయుటకై) లెమ్ము | ఏతే | = వీరందరును |
| యశః | = కీర్తిని | పూర్వమ్, ఏవ | = ఇంతకు ముందే |
| లభస్వ | = పొందుము | మయా ఏవ | = నాచేతనే |
| శత్రూన్ | = శత్రువులను | నిహతాః | = చంపబడిరి |
| జిత్వా | = జయించి | సవ్యసాచిన్[1] | = ఓ సవ్యసాచీ! అర్జునా! |
| సమృద్ధమ్ | = సర్వసంపదలతో తులతూగుచున్న | నిమిత్త మాత్రమ్, భవ | = నీవు నిమిత్త మాత్రుడవుకమ్ము |

కనుక, ఓ సవ్యసాచీ! లెమ్ము, కీర్తి గాంచుము. శత్రువులను జయించి సర్వసంపదలతో తులతూగు రాజ్యమును అనుభవింపుము. వీరందఱును నాచేత మునుపే హతులైనవారు. నీవు నిమిత్తమాత్రుడవు కమ్ము (33)

1. ఎడమచేతితోగూడ బాణములను ప్రయోగింపగల్గుటచే అర్జునునకు 'సవ్యసాచి' అని పేరు

**ద్రోణం చ భీష్మం చ జయద్రథం చ**
**కర్ణం తథాన్యానపి యోధవీరాన్ ।**
**మయా హతాంస్త్వం జహి మా వ్యథిష్ఠా**
**యుధ్యస్వ జేతాసి రణే సపత్నాన్ ॥ 34 ॥**

ద్రోణమ్, చ, భీష్మమ్, చ, జయద్రథమ్, చ, కర్ణమ్, తథా, అన్యాన్, అపి, యోధవీరాన్, మయా, హతాన్, త్వమ్, జహి, మా, వ్యథిష్ఠాః, యుధ్యస్వ, జేతాసి, రణే, సపత్నాన్ ॥ 34 ॥

| | | | |
|---|---|---|---|
| మయా | = నాచేత | త్వమ్ | = నీవు |
| హతాన్ | = చంపబడిన | జహి | = వధింపుము |
| ద్రోణమ్, చ | = ద్రోణుని | మా, వ్యథిష్ఠాః | = భయపడవలదు |
| భీష్మమ్, చ | = భీష్ముని | రణే | = యుద్ధమునందు |
| జయద్రథమ్, చ | = సైంధవుని | సపత్నాన్ | = శత్రువీరులను |
| కర్ణమ్, చ | = కర్ణుని | జేతాసి | = తప్పక జయింపగలవు |
| తథా | = అట్లే | | |
| అన్యాన్ | = తదితరులైన | యుధ్యస్వ | = (కనుక) యుద్ధము చేయుము. |
| యుద్ధవీరాన్, అపి | = యుద్ధవీరులను గూడ | | |

ఇదివరకే నాచే చంపబడిన భీష్మ, ద్రోణ, జయద్రథ(సైంధవ) కర్ణాది యుద్ధవీరులందఱిని నీవు సంహరింపుము. భయపడకుము. రణరంగమున శత్రువులను తప్పక జయింపగలవు. కనుక, యుద్ధము చేయుము. (34)

### సంజయ ఉవాచ

**ఏతచ్ఛ్రుత్వా వచనం కేశవస్య కృతాంజలిర్వేపమానః కిరీటీ ।**
**నమస్కృత్వా భూయ ఏవాహ కృష్ణం సగద్గదం భీతభీతః ప్రణమ్య ॥ 35 ॥**

ఏతత్, శ్రుత్వా, వచనమ్, కేశవస్య, కృతాంజలిః, వేపమానః, కిరీటీ, నమస్కృత్వా, భూయః, ఏవ, ఆహ, కృష్ణమ్, సగద్గదమ్, భీతభీతః, ప్రణమ్య ॥ 35 ॥

| | | | |
|---|---|---|---|
| కేశవస్య | = శ్రీకృష్ణునియొక్క | కిరీటీ | = అర్జునుడు |
| ఏతత్ | = ఈ | కృతాంజలిః | = అంజలి ఘటించినవాడై |
| వచనమ్ | = మాటలను | వేపమానః | = వణకిపోవుచున్నవాడై |
| శ్రుత్వా | = విని | నమస్కృత్వా | = నమస్కరించి |

| | | | | | |
|---|---|---|---|---|---|
| భూయః, ఏవ | = | మఱల | కృష్ణమ్ | = | కృష్ణునితో |
| భీతభీతః | = | మిక్కిలి భయగ్రస్తుడై | సగద్గదమ్ | = | గద్గదస్వరముతో |
| ప్రణమ్య | = | నమస్కరించి | ఆహ | = | పలికెను |

సంజయుడు పలికెను - ఓ రాజా! శ్రీకృష్ణపరమాత్మయొక్క ఈ మాటలను విని, అర్జునుడు వణకుచు, చేతులు జోడించి నమస్కరించెను, మఱల మిక్కిలి భయముతో ప్రణమిల్లి, గద్గదస్వరముతో తడబడుచు శ్రీకృష్ణుని స్తుతింపసాగెను. (35)

**అర్జున ఉవాచ**

**స్థానే హృషీకేశ తవ ప్రకీర్త్యా జగత్ప్రహృష్యత్యనురజ్యతే చ ।**
**రక్షాంసి భీతాని దిశో ద్రవంతి సర్వే నమస్యంతి చ సిద్ధసంఘాః ॥ 36 ॥**

స్థానే, హృషీకేశ, తవ, ప్రకీర్త్యా, జగత్, ప్రహృష్యతి, అనురజ్యతే, చ,
రక్షాంసి, భీతాని, దిశః, ద్రవంతి, సర్వే, నమస్యంతి, చ, సిద్ధసంఘాః ॥ 36 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| హృషీకేశ! | = | ఓ అంతర్యామీ! | రక్షాంసి | = | రాక్షసులు |
| తవ | = | నీ నామగుణ ప్రభావములను | దిశః | = | నలుదిక్కులకును |
| | | | ద్రవంతి | = | పాఱిపోవు చున్నారు |
| ప్రకీర్త్యా | = | బాగుగా కీర్తించుటచే (కీర్తించుచు) | చ | = | మఱియు |
| | | | సర్వే | = | సమస్తమైన |
| జగత్ | = | విశ్వమంతయును | సిద్ధసంఘాః | = | సిద్ధ సముదాయముల వారును |
| ప్రహృష్యతి | = | మిక్కిలి హర్షించుచున్నది | | | |
| చ | = | మఱియు | | | |
| అనురజ్యతే | = | అనురాగముతో పొంగిపోవుచున్నది | నమస్యంతి | = | ప్రణమిల్లు చున్నారు. |
| భీతాని | = | భయగ్రస్తులైన | స్థానే | = | ఇది సముచితము |

అర్జునుడు పలికెను - ఓ అంతర్యామీ! కేశవా! నీనామగుణ ప్రభావములను కీర్తించుచు జగత్తు హర్షాతిరేకముతో, అనురాగముతో ఉప్పొంగిపోవుచున్నది. ఇది సముచితము. భయగ్రస్తులైన రాక్షసులు నలుదిక్కులకును పారిపోవుచున్నారు. సిద్ధగణములవారెల్లరును ప్రణమిల్లుచున్నారు. (36)

**కస్మాచ్చ తే న నమేరన్ మహాత్మన్**
**గరీయసే బ్రహ్మణోఽప్యాదికర్త్రే ।**
**అనంత దేవేశ జగన్నివాస**
**త్వమక్షరం సదసత్ తత్పరం యత్ ॥ 37 ॥**

కస్మాత్, చ, తే, న, నమేరన్, మహాత్మన్, గరీయసే, బ్రహ్మణః, అపి, ఆదికర్త్రే, అనంత, దేవేశ, జగన్నివాస, త్వమ్, అక్షరమ్, సత్, అసత్, తత్పరమ్, యత్ ॥ 37 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| మహాత్మన్ | = | ఓ పరమాత్మా! | జగన్నివాస! | = | ఓ జగన్నివాసా! |
| బ్రహ్మణః, అపి | = | సృష్టికర్తయైన బ్రహ్మకును | యత్ | = | ఏది |
| ఆదికర్త్రే | = | (నీవు) మూల కారకుడవు | సత్ | = | 'సత్' అయి యున్నదో |
| చ | = | మఱియు | అసత్ | = | 'అసత్' అయి యున్నదో |
| గరీయసే, తే | = | సర్వ శ్రేష్ఠుడవునైన నీకు (సిద్ధాదు లందరును) | తత్పరమ్ | = | వాటికంటెనుపరమైన (శ్రేష్ఠమైన) |
| కస్మాత్, న, నమేరన్ | = | నమస్కరింపక ఎట్లుండ గలరు? (తప్పక నమస్కరింతురు) | అక్షరమ్ | = | శాశ్వతమైన సచ్చిదా నంద పరమాత్మ తత్త్వముగలదో |
| అనంత! దేవేశ! | = | ఓ అనంతా! దేవాధిదేవా! | (తత్) త్వమ్ (ఏవ, అపి) | = | (అది) నీవే |

ఓ మహాత్మా! నీవు సర్వశ్రేష్ఠుడవు. సృష్టికర్తయైన బ్రహ్మకే మూలకారకుడవు. కనుక, వారు (సిద్ధాదులందఱును) నీకు నమస్కరింపక ఎట్లుండగలరు? ఓ అనంతా! ఓ దేవేశా! ఓ జగన్నివాసా! సత్అసత్‌లు నీవే. వాటికంటెను పరమైన అక్షరస్వరూపుడవు అనగా సచ్చిదానందఘనపరబ్రహ్మవు నీవే. (37)

**త్వమాదిదేవః పురుషః పురాణః**
**త్వమస్య విశ్వస్య పరం నిధానమ్ ।**
**వేత్తాసి వేద్యం చ పరం చ ధామ**
**త్వయా తతం విశ్వమనంతరూప ॥ 38 ॥**

త్వమ్, ఆదిదేవః, పురుషః, పురాణః, త్వమ్, అస్య, విశ్వస్య, పరమ్, నిధానమ్,
వేత్తా, అసి, వేద్యమ్, చ, పరమ్, చ, ధామ, త్వయా, తతమ్, విశ్వమ్, అనంతరూప ॥ 38 ॥

| | | | |
|---|---|---|---|
| అనంతరూప! | = ఓ అనంతరూపా! | వేత్తా, చ | = సర్వజ్ఞుడవు |
| త్వమ్ | = నీవు | వేద్యమ్, చ | = సర్వవేద్యుడవు |
| ఆదిదేవః | = ఆదిదేవుడవు | పరమ్, ధామ, అసి | = పరంధాముడవు |
| పురాణః, పురుషః | = సనాతనపురుషుడవు | | |
| త్వమ్ | = నీవు | త్వయా | = నీ చేత |
| అస్య | = ఈ | విశ్వమ్ | = జగత్తు |
| విశ్వస్య | = జగత్తునకు | తతమ్ | = పరిపూర్ణమై యున్నది |
| పరమ్, నిధానమ్ | = పరమాశ్రయుడవు | | |

ఓ అనంతరూపా! నీవు ఆదిదేవుడవు, సనాతనపురుషుడవు, ఈ జగత్తునకు పరమాశ్రయుడవు. సర్వజ్ఞుడవు, సర్వవేద్యుడవు, పరంధాముడవు. ఈ జగత్తు అంతయును నీచే పరిపూర్ణమైయున్నది. (38)

**వాయుర్యమోఽగ్నిర్వరుణ శ్శశాంకః**
**ప్రజాపతిస్త్వం ప్రపితామహశ్చ ।**
**నమో నమస్తేఽస్తు సహస్రకృత్వః**
**పునశ్చ భూయోఽపి నమో నమస్తే ॥ 39 ॥**

వాయుః, యమః, అగ్నిః, వరుణః, శశాంకః, ప్రజాపతిః, త్వమ్, ప్రపితామహః, చ,
నమః, నమః, తే, అస్తు, సహస్రకృత్వః, పునః, చ, భూయః, అపి, నమః, నమః, తే ॥ 39 ॥

| | | | |
|---|---|---|---|
| త్వమ్ | = నీవు | తే | = నీకు |
| వాయుః | = వాయుదేవుడవు | సహస్రకృత్వః, నమః, నమః | = వేలకొలది నమస్కార పరంపరలు |
| యమః | = యముడవు | | |
| అగ్నిః | = అగ్నివి | అస్తు | = అగుగాక |
| వరుణః | = వరుణుడవు | తే | = నీకు |
| శశాంకః | = చంద్రుడవు | | |
| ప్రజాపతిః | = ప్రజాపతియైన బ్రహ్మవు | భూయః, అపి | = మఱల గూడ |
| ప్రపితామహః, చ | = బ్రహ్మకును జనకుడవు | పునః, చ | = ఇంకను |
| | | నమః, నమః | = నమస్కారములు |

నీవే వాయుదేవుడవు, యముడవు, అగ్నివి, వరుణుడవు, చంద్రుడవు, ప్రజాపతియైన బ్రహ్మవు, బ్రహ్మకును జనకుడవు. నీకు వేలకొలది నమస్కారములు. మఱల మఱల నమస్కారములు. ఇంకను నమస్కారములు. (39)

**నమః పురస్తాదథ పృష్ఠతస్తే**
**నమో௨స్తు తే సర్వత ఏవ సర్వ ।**
**అనంతవీర్యామితవిక్రమస్త్వం**
**సర్వం సమాప్నోషి తతో௨సి సర్వః ॥ 40 ॥**

నమః, పురస్తాత్, అథ, పృష్ఠతః, తే, నమః, అస్తు, తే, సర్వతః, ఏవ, సర్వ,
అనంతవీర్య, అమితవిక్రమః, త్వమ్, సర్వమ్, సమాప్నోషి, తతః, అసి, సర్వః ॥ 40 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| అనంతవీర్య! | = | అనంతమైన సామర్థ్యము గలవాడా! | నమః అస్తు | = | నమస్కారము(లు) |
| తే | = | నీకు | అమితవిక్రమః | = | అపరిమితమైన పరాక్రమము గలవాడవైన |
| పురస్తాత్ | = | ముందుగా ఉండియు | | | |
| అథ | = | మఱియు | త్వమ్ | = | నీవు |
| పృష్ఠతః | = | వెనుక నుండియు | సర్వమ్, సమాప్నోషి | = | జగత్తునందంతటను వ్యాపించియున్న వాడవు |
| నమః | = | నమస్కారములు | | | |
| సర్వ! | = | సర్వాత్మా! | | | |
| తే | = | నీకు | తతః | = | ఈ విధముగా నీవే |
| సర్వతః, ఏవ | = | అన్నివైపులనుండియు | సర్వః, అసి | = | సర్వరూపుడవు |

అనంతసామర్థ్యముగలవాడా! నీకు ఎదురుగా ఉండియు, వెనుకనుండియు నమస్కరించుచున్నాను. ఓ సర్వాత్మా! నీకు అన్నివైపులనుండియు నమస్కారములు. ఏలనన, అనంతపరాక్రమశాలివై నీవు జగత్తంతటను వ్యాపించియున్నవాడవు. అన్ని రూపములును నీవియే. (40)

**సఖేతి మత్వా ప్రసభం యదుక్తం**
**హే కృష్ణ హే యాదవ! హే సఖేతి ।**
**అజానతా మహిమానం తవేదం**
**మయా ప్రమాదాత్ ప్రణయేన వాపి ॥ 41 ॥**

**యచ్చావహాసార్థమసత్కృతోఽసి**
**విహారశయ్యాసనభోజనేషు ।**
**ఏకోఽథవాప్యచ్యుత తత్సమక్షం**
**తత్ క్షామయే త్వామహమప్రమేయమ్ ॥ 42 ॥**

సఖా, ఇతి, మత్వా, ప్రసభమ్, యత్, ఉక్తమ్, హే కృష్ణ, హే యాదవ, హే సఖే, ఇతి, అజానతా, మహిమానమ్, తవ, ఇదమ్, మయా, ప్రమాదాత్, ప్రణయేన, వా, అపి ॥ 41 ॥

యత్, చ, అవహాసార్థమ్, అసత్కృతః, అసి, విహారశయ్యాసనభోజనేషు, ఏకః, అథవా, అపి, అచ్యుత, తత్సమక్షమ్, తత్, క్షామయే, త్వామ్, అహమ్, అప్రమేయమ్ ॥ 42 ॥

| | | |
|---|---|---|
| తవ | = | నీయొక్క |
| ఇదమ్ | = | ఈ |
| మహిమానమ్ | = | మహిమను |
| అజానతా | = | ఎఱుగనివాడనైన |
| మయా | = | నాచేత (నేను) |
| సఖా, ఇతి | = | మిత్రుడవని |
| మత్వా | = | తలంచి |
| ప్రణయేన, వా | = | చనువుచేగాని |
| ప్రమాదాత్, అపి | = | పొరపాటువలనగాని |
| హే కృష్ణ! | = | ఓ కృష్ణా! |
| హే యాదవ! | = | ఓ యాదవా! |
| హేసఖే, ఇతి | = | ఓ మిత్రమా! అనిగాని |
| యత్ | = | ఏది |
| ప్రసభమ్ | = | తొందరపాటుగా |
| ఉక్తం, చ | = | పలుకుట జరిగి యుండవచ్చును |
| అచ్యుత! | = | ఓ కృష్ణా! |
| యత్ | = | ఏది (నాద్వారా) |
| అవహాసార్థమ్ | = | పరిహాసమునకుగాని, |
| విహార, శయ్యా+ఆసన, భోజనేషు | = | ఆహార విహారముల యందుగాని, శయ్యాసనములపై ఉన్నప్పుడుగాని |
| ఏకః | = | ఏకాంతమునగాని |
| అథవా, తత్సమక్షమ్, అపి, అసత్కృతః, | = | లేక మిత్రుల మధ్యగాని నీవు కించపఱచబడి |
| అసి | = | యుండవచ్చును |
| తత్ | = | ఆ అపరాధములు అన్నింటికిని |
| అప్రమేయమ్ త్వామ్ | = | అప్రమేయ స్వరూపుడవైన నిన్ను |
| అహమ్ | = | నేను |
| క్షామయే | = | క్షమింపుమని వేడుకొనుచున్నాను |

నీ మహిమను ఎఱుగక నిన్ను నా సఖునిగా భావించి, చనువుచేగాని, పొరపాటువలనగాని, ఓ కృష్ణా! ఓయాదవా! ఓ మిత్రా! అనుచు తొందరపాటుతో ఆలోచింపక, నేను

నిన్ను సంబోధించి ఉంటిని. ఓ అచ్యుతా! విహారశయ్యాసనభోజనాది సమయములయందు ఏకాంతమునగాని, అన్యసఖుల సమక్షమునగాని సరసమునకై పరిహాసములాడి, నేను నిన్ను కించపఱచి యుండవచ్చును. ఓ అప్రమేయస్వరూపా! నా అపరాధములనన్నింటిని క్షమింపుమని వేడుకొనుచున్నాను. (41,42)

**పితాఽసి లోకస్య చరాచరస్య**
**త్వమస్య పూజ్యశ్చ గురుర్గరీయాన్ ।**
**న త్వత్సమోఽస్త్యభ్యధికః కుతోఽన్యో**
**లోకత్రయేఽప్యప్రతిమప్రభావ ॥ 43 ॥**

పితా, అసి, లోకస్య, చరాచరస్య, త్వమ్, అస్య, పూజ్యః, చ, గురుః, గరీయాన్,
న, త్వత్సమః, అస్తి, అభ్యధికః, కుతః, అన్యః, లోకత్రయే, అపి, అప్రతిమప్రభావ ॥ 43 ॥

| | | | |
|---|---|---|---|
| అప్రతిమప్రభావ! | = పాటిలేని ప్రభావముగలవాడా! | గురుః | = గురుడవు |
| త్వమ్ | = నీవు | పూజ్యః, అసి | = పూజ్యుడవు |
| అస్య, చరాచరస్య | = ఈ చరాచరప్రాణులతో గూడిన | లోకత్రయే, అపి | = ముల్లోకముల యందును |
| లోకస్య | = జగత్తునకు | త్వత్సమః | = నీతోసమానుడు |
| పితా | = తండ్రివి | అన్యః | = మఱియొకడు |
| చ | = మఱియు | న, అస్తి | = లేడు |
| గరీయాన్ | = సర్వశ్రేష్ఠుడవు | అభ్యధికః | = అధికుడు |
| | | కుతః | = ఎట్లుండును? |

ఓ అనుపమప్రభావా! ఈ సమస్త చరాచరజగత్తునకు నీవే తండ్రివి. నీవు పూజ్యుడవు. గురుడవు. సర్వశ్రేష్ఠుడవు. ఈ ముల్లోకములయందును నీతో సమానుడెవ్వడును లేడు. ఇంక, నీకంటె అధికుడెట్లుండును? (43)

**తస్మాత్ ప్రణమ్య ప్రణిధాయ కాయం**
**ప్రసాదయే త్వామహమీశమీడ్యమ్ ।**
**పితేవ పుత్రస్య సఖేవ సఖ్యుః**
**ప్రియః ప్రియాయార్హసి దేవ సోఢుమ్ ॥ 44 ॥**

తస్మాత్, ప్రణమ్య, ప్రణిధాయ, కాయమ్, ప్రసాదయే, త్వామ్, అహమ్, ఈశమ్, ఈడ్యమ్,
పితా, ఇవ, పుత్రస్య, సఖా, ఇవ, సఖ్యుః, ప్రియః, ప్రియాయాః, అర్హసి, దేవ, సోఢుమ్ ॥ 44 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| దేవ! | = | ఓ దేవాదిదేవా! | పితా, ఇవ | = | తండ్రివలెను |
| తస్మాత్ | = | అందువలన | సఖ్యుః | = | సఖుని (దోషమును) |
| అహమ్ | = | నేను | సఖా, ఇవ | = | సఖునివలెను |
| కాయమ్ | = | శరీరమును | ప్రియాయాః | = | భార్య (అపరాధము)ను |
| ప్రణిధాయ | = | నీ పాదములకడ ఉంచి | | | |
| ప్రణమ్య | = | నమస్కరించి | ప్రియః, ఇవ | = | భర్తవలెను |
| ఈడ్యమ్ | = | స్తవనీయుడవు | | | |
| ఈశమ్ | = | పరమేశ్వరుడవును ఐన | త్వమ్ | = | నీవు |
| త్వామ్ | = | నిన్ను | సోఢుమ్ | = | (నా అపరాధములను అన్నింటిని) సహించు (క్షమించు)టకు |
| ప్రసాదయే | = | (నన్ను అనుగ్రహించుటకై) ప్రార్థించుచున్నాను | | | |
| పుత్రస్య | = | పుత్రుని (తప్పును) | అర్హసి | = | తగినవాడవు |

కనుక, ఓ ప్రభూ! నాశరీరమును నీపాదములకడనిడి, సాష్టాంగముగా ప్రణమిల్లుచున్నాను. స్తవనీయుడవు, సర్వేశ్వరుడవు ఐన నీవు నాయందు ప్రసన్నుడవగుటకై నిన్ను ప్రార్థించుచున్నాను. దేవా! కుమారుని తండ్రి క్షమించినట్లును, మిత్రుని మిత్రుడు క్షమించినట్లును, భార్యను భర్త క్షమించినట్లును, నా అపరాధములను నీవు క్షమింపుము (44)

**అదృష్టపూర్వం హృషితోఽస్మి దృష్ట్వా**
**భయేన చ ప్రవ్యథితం మనో మే ।**
**తదేవ మే దర్శయ దేవరూపం**
**ప్రసీద దేవేశ జగన్నివాస ॥ 45 ॥**

అదృష్టపూర్వమ్, హృషితః, అస్మి, దృష్ట్వా, భయేన, చ, ప్రవ్యథితమ్, మనః, మే,
తత్, ఏవ, మే, దర్శయ, దేవరూపమ్, ప్రసీద, దేవేశ, జగన్నివాస ॥ 45 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| అదృష్టపూర్వమ్ | = | ఇంతకుముందెన్నడును చూడనట్టి విశ్వరూపమును | దృష్ట్వా | = | చూచి |
| | | | హృషితః, అస్మి | = | సంతుష్టుడనైతిని |
| | | | చ | = | మఱియు |

| | | | |
|---|---|---|---|
| మే, మనః | = నామనస్సు | మే | = నాకు |
| భయేన | = భయముతో | దర్శయ | = చూపుము |
| ప్రవ్యథితమ్ | = కలతచెందినది | దేవేశ! | = ఓ దేవాధిదేవా! |
| తత్ | = ఆ | జగన్నివాస! | = ఓ జగన్నివాసా! |
| దేవరూపమ్, ఏవ | = చతుర్భుజ శోభితమైన విష్ణురూపమునే | ప్రసీద | = ప్రసన్నుడవుకమ్ము |

మునుపు ఎన్నడునుచూడని ఆశ్చర్యకరమైన ఈ రూపమును గాంచి, మిక్కిలి సంతసించితిని. కాని, భయముచే నామనస్సు కలవరపాటు పొందినది. కనుక, చతుర్భుజయుక్తుడవై విష్ణురూపముతోడనే నాకు దర్శనమిమ్ము. ఓ దేవేశా! జగన్నివాసా! ప్రసన్నుడవు కమ్ము. (45)

**కిరీటినం గదినం చక్రహస్తమ్**
**ఇచ్ఛామి త్వాం ద్రష్టుమహం తథైవ ।**
**తేనైవ రూపేణ చతుర్భుజేన**
**సహస్రబాహో! భవ విశ్వమూర్తే! ॥ 46 ॥**

కిరీటినమ్, గదినమ్, చక్రహస్తమ్, ఇచ్ఛామి, త్వామ్, ద్రష్టుమ్, అహమ్, తథా, ఏవ,
తేన, ఏవ, రూపేణ, చతుర్భుజేన, సహస్రబాహో, భవ, విశ్వమూర్తే ॥ 46 ॥

| | | | |
|---|---|---|---|
| విశ్వమూర్తే! | = ఓ విశ్వరూపా! | ద్రష్టుమ్ | = చూచుటకై |
| అహమ్ | = నేను | ఇచ్ఛామి | = కోరుకొనుచున్నాను |
| కిరీటినమ్ | = కిరీటముగల వాడవును | (అతః) | = (అందువలన) |
| గదినమ్ | = గదను ధరించిన వాడవును | సహస్రబాహో! | = ఓ పరమాత్మా! |
| చక్రహస్తమ్ | = చక్రపాణివియును అగు | తేన చతుర్భుజరూపేణ ఏవ | = ఆ చతుర్భుజరూపము గలవాడవు |
| త్వామ్ | = నిన్ను | | |
| తథా, ఏవ | = అట్లే | భవ | = కమ్ము |

కిరీటమును, గదను, శంఖచక్రములను ధరించిన నీ రూపమును చూడగోరుచున్నాను. ఓ సహస్రబాహూ! విరాడ్రూపా! నీ చతుర్భుజరూపమును నాకు చూపుము. (46)

శ్రీ భగవాన్ ఉవాచ

**మయా ప్రసన్నేన తవార్జునేదం**
**రూపం పరం దర్శితమాత్మయోగాత్ ।**
**తేజోమయం విశ్వమనంతమాద్యం**
**యన్మే త్వదన్యేన న దృష్టపూర్వమ్ ॥ 47 ॥**

మయా, ప్రసన్నేన, తవ, అర్జున, ఇదమ్, రూపమ్, పరమ్, దర్శితమ్, ఆత్మయోగాత్, తేజోమయమ్, విశ్వమ్, అనంతమ్, ఆద్యమ్, యత్, మే, త్వదన్యేన, న, దృష్టపూర్వమ్ ॥ 47 ॥

| | | | |
|---|---|---|---|
| అర్జున! | = ఓ అర్జునా! | యత్ | = ఏదైతే |
| ప్రసన్నేన | = నీయెడ ప్రసన్నుడనైన | త్వదన్యేన | = నీవుదప్ప మఱి ఎవ్వరిచేతను |
| మయా | = నాచేత | | |
| ఆత్మయోగాత్ | = నాయోగశక్తి ప్రభావమున | న, దృష్టపూర్వమ్ | = ఇంతకుముందు చూడబడలేదో అట్టి |
| ఇదమ్ | = ఈ | | |
| పరమ్ | = శ్రేష్ఠమైన | మే | = నాయొక్క |
| తేజోమయమ్ | = తేజోమయమైన | విశ్వమ్, రూపమ్ | = విశ్వరూపము |
| ఆద్యమ్ | = అన్నింటికిని ఆదియైన | తవ | = నీకు |
| అనంతమ్ | = అపరిమితమైన | దర్శితమ్ | = చూపబడినది |

శ్రీ భగవానుడు పలికెను- ఓ అర్జునా! నీపైగల అనుగ్రహమున నా యోగశక్తి ప్రభావముతో నీకు నా విరాట్-రూపమును ప్రదర్శించితిని. అది మిక్కిలి తేజోమయమైనది. అనంతమైనది, ఆద్యమైనది. దీనిని నీవు తప్ప ఇంతకుముందు మఱి యెవ్వరును చూచియుండలేదు. (47)

**న వేదయజ్ఞాధ్యయనైర్న దానైః**
**న, చ క్రియాభిర్న తపోభిరుగ్రైః ।**
**ఏవంరూపః శక్య అహం నృలోకే**
**ద్రష్టుం త్వదన్యేన కురుప్రవీర ॥ 48 ॥**

న, వేదయజ్ఞాధ్యయనైః, న, దానైః, న, చ, క్రియాభిః, న, తపోభిః, ఉగ్రైః, ఏవం, రూపః, శక్యః, అహమ్, నృలోకే, ద్రష్టుమ్, త్వదన్యేన, కురుప్రవీర ॥ 48 ॥

| | | | |
|---|---|---|---|
| కురుప్రవీర! | = | కురువీరులలో శ్రేష్ఠుడవైన ఓ అర్జునా! |
| నృలోకే | = | మానవలోకమున |
| ఏవం, రూపః | = | ఇట్టివిశ్వరూపుడనైన |
| అహమ్ | = | నేను |
| త్వదన్యేన | = | నీవుదప్పమఱియెవ్వరి చేతను |
| వేద, యజ్ఞ+ అధ్యయనైః | = | వేదపఠనముల ద్వారాను, యజ్ఞాచరణముల ద్వారాను |
| ద్రష్టుమ్ | = | చూచుటకు |
| న, శక్యః | = | శక్యముగాను |
| దానైః | = | దానములద్వారా |
| న(శక్యః) | = | శక్యముకాను |
| క్రియాభిః, చ | = | ఇతరక్రియల ద్వారాను |
| న(శక్యః) | = | శక్యముగాను |
| ఉగ్రైః,తపోభిః, చ | = | తీవ్రతపశ్చర్యల ద్వారా కూడ |
| న(శక్యః) | = | శక్యము గాను |

ఓ అర్జునా! వేదాధ్యయనములచేగాని, యజ్ఞాచరణములచేగాని, దానములచేగాని, తీవ్రతపశ్చర్యలచేగాని, తదితరపుణ్యకర్మలచేగాని ఈ మానవలోకమున నా ఈ విశ్వరూపమును నీకుదప్ప మఱియెవ్వరికిని చూడశక్యము గాదు. (48)

**మా తే వ్యథా మా చ విమూఢభావో**
**దృష్ట్వా రూపం ఘోరమీదృఙ్మమేదమ్ ।**
**వ్యపేతభీః ప్రీతమనాః పునస్త్వం**
**తదేవ మే రూపమిదం ప్రపశ్య ॥ 49 ॥**

మా, తే, వ్యథా, మా, చ, విమూఢభావః, దృష్ట్వా, రూపమ్, ఘోరమ్, ఈదృక్, మమ, ఇదమ్, వ్యపేతభీః, ప్రీతమనాః, పునః, త్వమ్, తత్, ఏవ, మే, రూపమ్, ఇదమ్, ప్రపశ్య ॥ 49 ॥

| | | |
|---|---|---|
| మమ | = | నాయొక్క |
| ఈదృక్ | = | ఈ విధమైన |
| ఇదమ్, ఘోరమ్, రూపమ్ | = | ఈ భయంకర రూపమును |
| దృష్ట్వా | = | చూచి |
| తే | = | నీకు |
| వ్యథా | = | వ్యాకులపాటు |
| మా | = | వలదు |
| చ | = | మఱియు |
| విమూఢభావః | = | మోహముగూడ |
| మా | = | వలదు |
| త్వమ్ | = | నీవు |
| వ్యపేతభీః | = | భయరహితుడవై |
| ప్రీతమనాః | = | ప్రసన్నచిత్తుడవై |
| తత్ | = | ఆ |
| మే | = | నాయొక్క |
| ఇదమ్, రూపమ్, ఏవ | = | ఈ చతుర్భుజ రూపమునే |
| పునః | = | మఱల |
| ప్రపశ్య | = | దర్శింపుము |

ఈ విధమైన నా ఈ భయంకరరూపమును చూచి, నీవు ఎట్టి వ్యథకును, మోహమునకును గురికావలదు. భయమును వీడి ప్రసన్నచిత్తుడవై శంఖచక్ర గదాపద్మములతో విలసిల్లుచున్న నా చతుర్భుజరూపమునే మరల చూడుము. (49)

**సంజయ ఉవాచ**

**ఇత్యర్జునం వాసుదేవస్తథోక్త్వా**
**స్వకం రూపం దర్శయామాస భూయః ।**
**ఆశ్వాసయామాస చ భీతమేనం**
**భూత్వా పునః సౌమ్యవపుర్మహాత్మా ॥ 50 ॥**

ఇతి, అర్జునమ్, వాసుదేవః, తథా, ఉక్త్వా, స్వకమ్, రూపమ్, దర్శయామాస, భూయః,
ఆశ్వాసయామాస, చ, భీతమ్, ఏనమ్, భూత్వా, పునః, సౌమ్యవపుః, మహాత్మా ॥ 50 ॥

| | | | |
|---|---|---|---|
| వాసుదేవః | = వాసుదేవుడు (శ్రీకృష్ణుడు) | చ | = మఱియు |
| అర్జునమ్ | = అర్జునుని గూర్చి (అర్జునునితో) | పునః | = తర్వాత |
| ఇతి, ఉక్త్వా | = ఈ విధముగా పలికి | మహాత్మా | = మహాత్ముడైన శ్రీకృష్ణుడు |
| భూయః | = అనంతరము | సౌమ్యవపుః, భూత్వా | = సౌమ్యస్వరూపుడై (ప్రసన్నమైన తన కృష్ణరూపమును దాల్చి) |
| తథా | = అదేవిధముగా | | |
| స్వకమ్, రూపమ్ | = తన చతుర్భుజ రూపమును | భీతమ్, ఏనమ్, | = భయపడుచున్న ఈ అర్జునుని |
| దర్శయామాస | = దర్శింపజేసెను | ఆశ్వాసయామాస | = ఓదార్చెను |

సంజయుడు పలికెను - వాసుదేవుడు ఈ విధముగా పలికి, అర్జునునకు తన చతుర్భుజరూపమున దర్శనమిచ్చెను. అనంతరము శ్రీకృష్ణపరమాత్మ సౌమ్యమూర్తియైన తన కృష్ణరూపమును స్వీకరించి, భయపడుచున్న అర్జునునకు ధైర్యము చెప్పెను. (50)

**అర్జున ఉవాచ**

**దృష్ట్వేదం మానుషం రూపం తవ సౌమ్యం జనార్దన ।**
**ఇదానీమస్మి సంవృత్తః సచేతాః ప్రకృతిం గతః ॥ 51 ॥**

దృష్ట్వా, ఇదమ్, మానుషమ్, రూపమ్, తవ, సౌమ్యమ్, జనార్దన,
ఇదానీమ్, అస్మి, సంవృత్తః సచేతాః, ప్రకృతిమ్, గతః ॥ 51 ॥

| | | | |
|---|---|---|---|
| జనార్దన! | = ఓ కృష్ణా! | ఇదానీమ్ | = ఇప్పుడు (నేను) |
| తవ | = నీయొక్క | సచేతాః, సంవృత్తః, అస్మి | = కుదుటబడిన మనస్సు గలవాడనైతిని (మఱియు) |
| ఇదమ్, సౌమ్యమ్ | = ఇట్టి సౌమ్యమైన | ప్రకృతిమ్, గతః | = నా సహజస్థితిని పొందితిని. |
| మానుషమ్, రూపమ్ | = మానవాకృతిని | | |
| దృష్ట్వా | = చూచి | | |

అర్జునుడు పలికెను - ఓ జనార్దనా! మీ అతిసౌమ్యమైన మానవాకృతిని (శ్యామసుందరరూపమును) చూచి, ఇప్పుడు నా మనస్సు కుదుటబడినది. నేను నా స్వాభావిక (సహజ) స్థితిని పొందితిని. (51)

**శ్రీ భగవాన్ ఉవాచ**

**సుదుర్దర్శమిదం రూపం దృష్టవానసి యన్మమ ।**
**దేవా అప్యస్య రూపస్య నిత్యం దర్శనకాంక్షిణః ॥ 52 ॥**

సుదుర్దర్శమ్, ఇదమ్, రూపమ్, దృష్టవాన్, అసి, యత్, మమ,
దేవాః, అపి, అస్య, రూపస్య, నిత్యమ్, దర్శనకాంక్షిణః ॥ 52 ॥

| | | | |
|---|---|---|---|
| మమ | = నాయొక్క | దేవాః, అపి | = దేవతలు గూడ |
| యత్, రూపమ్ | = ఏ చతుర్భుజ రూపమును | నిత్యమ్ | = సదా, |
| దృష్టవాన్, అసి | = నీవు చూచియుంటివో | అస్య, రూపస్య | = ఈ రూపము యొక్క |
| ఇదమ్ | = ఈ రూపము | దర్శనకాంక్షిణః | = దర్శనకాంక్షతో నిరీక్షించు చుండువారే |
| సుదుర్దర్శమ్ | = దర్శించుటకు దుర్లభమైనది | | |

శ్రీ భగవానుడు పలికెను- నీవు చూచిన నా ఈ చతుర్భుజరూపము యొక్క దర్శనభాగ్యము అన్యులకు అత్యంతదుర్లభము. దేవతలుసైతము ఈ రూపమును దర్శించుటకై సదా ఉవ్విళ్ళూరుచుందురు. (52)

**నాహం వేదైర్న తపసా న దానేన న చేజ్యయా ।**
**శక్య ఏవంవిధో ద్రష్టుం దృష్టవానసి మాం యథా ॥ 53 ॥**

న, అహమ్, వేదైః, న, తపసా, న, దానేన, న, చ, ఇజ్యయా,
శక్యః, ఏవంవిధః, ద్రష్టుమ్, దృష్టవాన్, అసి, మామ్, యథా ॥ 53 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| యథా | = | ఏవిధముగా | న, శక్యః | = | శక్యముగాను |
| మామ్ | = | నన్ను (నా చతుర్భుజ రూపమును) | తపసా | = | తపస్సుచే |
| | | | న(శక్యః) | = | శక్యముగాను |
| దృష్టవాన్, అసి | = | చూచి యుంటివో | దానేన | = | దానముచేతను |
| ఏవంవిధః | = | ఈ విధమైన రూపముగల వాడనగు | న(శక్యః) | = | శక్యముగాను |
| అహమ్ | = | నేను | ఇజ్యయా, చ | = | యజ్ఞాచరణము ద్వారాగూడ |
| వేదైః | = | వేదములద్వారా | | | |
| ద్రష్టుమ్ | = | చూచుటకు | న(శక్యః) | = | శక్యముగాను |

నీవు గాంచిన నా చతుర్భుజరూపమును దర్శించుటకు వేదపఠనములచేగాని, తపశ్చర్యలచేగాని, దానములచేగాని, యజ్ఞకర్మలచేగాని, శక్యము కాదు. (53)

**భక్త్యా త్వనన్యయా శక్య అహమేవంవిధోఽర్జున ।**
**జ్ఞాతుం ద్రష్టుం చ తత్త్వేన ప్రవేష్టుం చ పరంతప ॥ 54 ॥**

భక్త్యా, తు, అనన్యయా, శక్యః, అహమ్, ఏవంవిధః, అర్జున,
జ్ఞాతుమ్, ద్రష్టుమ్, చ, తత్త్వేన, ప్రవేష్టుమ్, చ, పరంతప ॥ 54 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| తు | = | అయితే | ద్రష్టుమ్ | = | చూచుటకును |
| పరంతప! | = | ఓపరంతపా! | తత్త్వేన, జ్ఞాతుమ్ | = | తత్త్వజ్ఞానముద్వారా ఎఱుంగుటకును |
| అర్జున | = | అర్జునా! | చ | = | అట్లే |
| అనన్యయా, భక్త్యా | = | అనన్యభక్తి ద్వారా[1] | ప్రవేష్టుమ్, చ | = | అందు ఏకీభావ స్థితిని పొందుటకును |
| ఏవంవిధః | = | ఇట్టి చతుర్భుజరూపుడనైన | | | |
| అహమ్ | = | నేను | శక్యః | = | సాధ్యుడనగుదును |

కాని ఓ పరంతపా! అర్జునా! ఇట్టి నా చతుర్భుజరూపమును ప్రత్యక్షముగా చూచుటకును, తత్త్వజ్ఞానమును పొందుటకును, అందు ఏకీభావస్థితినందుటకును కేవలము అనన్యభక్తిద్వారా మాత్రమే సాధ్యమగును. (54)

1. అనన్యభక్తియొక్క భావము రాబోవు శ్లోకములో తెల్పబడినది.

**మత్కర్మకృన్మత్పరమో మద్భక్తస్సంగవర్జితః ।**
**నిర్వైరస్సర్వభూతేషు యస్స మామేతి పాండవ ॥ 55 ॥**

మత్కర్మకృత్, మత్పరమః, మద్భక్తః, సంగవర్జితః,
నిర్వైరః, సర్వభూతేషు, యః, సః, మామ్, ఏతి, పాండవ ॥ 55 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| పాండవ! | = | ఓ పాండవా! | సంగవర్జితః | = | ప్రాపంచిక విషయముల యందు ఆసక్తి రహితుడగునో |
| యః | = | ఎవడైతే | సర్వభూతేషు | = | సమస్త ప్రాణులయందును |
| మత్కర్మకృత్ | = | నాకొఱకై కర్తవ్య కర్మలను ఆచరించునో | నిర్వైరః[1] | = | వైరభావములేని వాడగునో |
| మత్పరమః | = | మత్పరాయణు డగునో | సః | = | అట్టి అనన్యభక్తి యుక్తుడు |
| మద్భక్తః | = | నాయందు భక్తి శ్రద్ధలు కల వాడగునో | మామ్ | = | నన్ను |
| | | | ఏతి | = | పొందును. |

అర్జునా! కర్తవ్యకర్మలను అన్నింటిని నాకే అర్పించువాడును, మత్పరాయణుడును, నాయందు భక్తిశ్రద్ధలుగలవాడును, ప్రాపంచిక విషయములయందు ఆసక్తిలేనివాడును, ఏ ప్రాణియందును ఏమాత్రము వైరభావము లేనివాడును ఐన అనన్య (పరమ) భక్తుడు మాత్రమే నన్ను పొందగలడు. (55)

ఓం తత్సదితి శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే విశ్వరూపదర్శనయోగో నామ ఏకాదశోఽధ్యాయః ॥ ౧౧ ॥

1. సర్వత్ర భగవద్భావము ఉండుటవలన అతనికి మహాపరాధులవిషయమునగూడ 'వైరభావము' ఉండదు. ఇక ఇతరులవిషయమున చెప్పవలసిన పనిలేదు.

॥ ఓం శ్రీపరమాత్మనే నమః ॥

# అథ ద్వాదశోఽధ్యాయః - భక్తియోగః

## (పన్నెండవ అధ్యాయము-భక్తియోగము)

ముఖ్యాంశములు : [(1 నుండి 12వ శ్లోకమువఱకు) సాకారనిరాకార - ఉపాసకుల శ్రేష్ఠత్వనిరూపణము, మఱియు భగవత్ప్రాప్తికి ఉపాయములు. (13 నుండి 20 వఱకు) భగవత్ప్రాప్తినందిన పురుషులలక్షణములు.]

**అర్జున ఉవాచ**

**ఏవం సతతయుక్తా యే భక్తాస్త్వాం పర్యుపాసతే ।**
**యే చాప్యక్షరమవ్యక్తం తేషాం కే యోగవిత్తమాః ॥ 1 ॥**

ఏవమ్, సతతయుక్తాః, యే, భక్తాః, త్వామ్, పర్యుపాసతే,
యే, చ, అపి, అక్షరమ్, అవ్యక్తమ్, తేషామ్, కే, యోగవిత్తమాః ॥ 1 ॥

| | | | |
|---|---|---|---|
| ఏవమ్ | = పూర్వోక్తరీతిగా | అక్షరమ్ | = నాశరహితుడవైన |
| త్వామ్ | = సగుణరూప పరమేశ్వరుడవైన నిన్ను | అవ్యక్తమ్, అపి | = నిరాకారసచ్చిదానంద పరబ్రహ్మవగు నిన్ను |
| సతతయుక్తాః | = నిరంతరము భజన ధ్యానాదులతో ఉపాసించునట్టి | పర్యుపాసతే | = మిక్కిలి ఏకాగ్రచిత్తులై భజింతురో |
| యే, భక్తాః | = ఏ అనన్యభక్తులు గలరో | తేషామ్ | = ఆ రెండువిధములైన ఉపాసకులలో |
| చ | = మఱియు | యోగవిత్తమాః | = అత్యుత్తమ యోగవిదులు |
| యే | = ఎవరయితే | కే | = ఎవరు? |

అర్జునుడు పలికెను - ఓ కృష్ణా! అనన్యభక్తితో పూర్వోక్తరీతిగా నిరంతరము నిన్నే భజించుచు, ధ్యానించుచు, పరమేశ్వరుడవైన నీ సగుణరూపమును ఆరాధించువారును, కేవలము అక్షరుడవగు సచ్చిదానంద ఘననిరాకార పరబ్రహ్మవైన నిన్ను అత్యంత భక్తిభావముతో సేవించువారును కలరు. ఈ రెండువిధములైన ఉపాసకులలో అత్యుత్తమ యోగవిదులెవరు? (1)

### శ్రీభగవాన్ ఉవాచ

**మయ్యావేశ్య మనో యే మాం నిత్యయుక్తా ఉపాసతే ।**
**శ్రద్ధయా పరయోపేతాః తే మే యుక్తతమా మతాః ॥ 2 ॥**

మయి, అవేశ్య, మనః, యే, మామ్, నిత్యయుక్తాః, ఉపాసతే ।
శ్రద్ధయా, పరయా, ఉపేతాః, తే, మే, యుక్తతమాః, మతాః ॥ 2 ॥

| | | | | |
|---|---|---|---|---|
| మయి | = నాయందు | | ఉపేతాః | = కూడినవారై |
| మనః, ఆవేశ్య | = మనస్సును ఏకాగ్రమొనర్చి | | మామ్ | = సగుణరూప పరమేశ్వరుడనైన నన్ను |
| నిత్యయుక్తాః[1] | = నిరంతరము నా భజనధ్యానాదుల యందు నిమగ్నులై | | ఉపాసతే | = ఉపాసింతురో |
| | | | తే | = వారు |
| | | | మే | = నాకు |
| ఏ | = ఏ భక్తులు | | యుక్తతమాః | = యోగులలో అత్యుత్తములని |
| పరయా, శ్రద్ధయా | = అత్యంత భక్తిశ్రద్ధలతో | | మతాః | = భావింపబడుదురు. |

శ్రీ భగవానుడు ఇట్లనెను - పరమేశ్వరుడనైన నాయందే ఏకాగ్రచిత్తులై, నిరంతరము నా భజనధ్యానాదులయందే నిమగ్నులై, అత్యంతశ్రద్ధాభక్తులతో సగుణరూపమున నన్ను ఆరాధించు భక్తులే యోగులలో మిక్కిలి శ్రేష్ఠులు - అని నా అభిప్రాయము. (2)

**యే త్వక్షరమనిర్దేశ్యమ్ అవ్యక్తం పర్యుపాసతే ।**
**సర్వత్రగమచింత్యం చ కూటస్థమచలం ధ్రువమ్ ॥ 3 ॥**
**సంనియమ్యేంద్రియగ్రామం సర్వత్ర సమబుద్ధయః ।**
**తే ప్రాప్నువంతి మామేవ సర్వభూతహితే రతాః ॥ 4 ॥**

యే, తు, అక్షరమ్, అనిర్దేశ్యమ్, అవ్యక్తమ్, పర్యుపాసతే,
సర్వత్రగమ్, అచింత్యమ్, చ, కూటస్థమ్, అచలమ్, ధ్రువమ్ ॥ 3 ॥
సంనియమ్య, ఇంద్రియగ్రామమ్, సర్వత్ర, సమబుద్ధయః,
తే, ప్రాప్నువంతి, మామ్, ఏవ, సర్వభూతహితే, రతాః ॥ 4 ॥

1) గీత-11వ అధ్యాయమునందలి 55వ శ్లోకమున చెప్పబడినట్లు నిరంతరము నాయందే మనస్సులను లగ్నమొనర్చినవారు.

| | | | | | |
|---|---|---|---|---|---|
| తు | = | కాని | అచలమ్ | = | నిశ్చలుడును |
| యే | = | ఏపురుషులు | అవ్యక్తమ్ | = | నిరాకారుడును, ఐన |
| ఇంద్రియగ్రామమ్ | = | ఇంద్రియ సముదాయమును | అక్షరమ్ | = | శాశ్వతుడైన సచ్చిదానందఘనబ్రహ్మను |
| సంనియమ్య | = | పూర్తిగా వశపఱచుకొని | పర్యుపాసతే | = | ఏకీభావముతో ఉపాసింతురో |
| అచింత్యమ్ | = | మనస్సుకు బుద్ధికి గోచరము గానివాడును | సర్వభూత హితేరతాః | = | సకల ప్రాణులకు హితముచేయ గోరువారు |
| సర్వత్రగమ్ | = | సర్వవ్యాపియైనవాడును | | | |
| అనిర్దేశ్యమ్ | = | అనిర్వచనీయమైన స్వరూపముగలవాడును | సర్వత్ర సమబుద్ధయః | = | అన్నింటియందును సమభావముగలవారును, ఐన |
| చ | = | మఱియు | | | |
| కూటస్థమ్ | = | సర్వదా ఒకే స్థితిలో ఉండువాడును | తే | = | వారు (యోగులు) |
| | | | మామ్, ఏవ | = | నన్నే |
| ధ్రువమ్ | = | నిత్యుడును | ప్రాప్నువంతి | = | పొందుదురు. |

కాని, ఇంద్రియసముదాయమును చక్కగా వశపఱచుకొనినవారును, సకల భూతములకును హితమునే కోరుచుండువారును, సర్వప్రాణులను సమభావముతో చూచువారును యోగులు అనబడుదురు. అట్టివారు మనోబుద్ధులకు అతీతుడును, సర్వవ్యాపియు, అనిర్వచనీయమైన స్వరూపముగలవాడును, కూటస్థుడును, నిత్యుడును, నిశ్చలుడును, నిరాకారుడును, నాశరహితుడును ఐన సచ్చిదానంద ఘనపరబ్రహ్మయందే నిరంతరము ఏకీభావస్థితులై, ధ్యానము చేయుచు, భక్తితో భజించుచు, ఆ పరబ్రహ్మమునే పొందుదురు. (3,4)

**క్లేశోఽధికతరస్తేషామ్ అవ్యక్తాసక్తచేతసామ్ ।**
**అవ్యక్తా హి గతిర్దుఃఖం దేహవద్భిరవాప్యతే ॥ 5 ॥**

క్లేశః, అధికతరః, తేషామ్, అవ్యక్తాసక్తచేతసామ్,
అవ్యక్తా, హి, గతిః, దుఃఖమ్, దేహవద్భిః, అవాప్యతే ॥ 5 ॥

| | | | |
|---|---|---|---|
| తేషామ్ | = ఆ | హి | = ఏలనన |
| అవ్యక్తాసక్త చేతసామ్ | = సచ్చిదానంద ఘన నిరాకారబ్రహ్మము నందు ఆసక్తచిత్తులైన వారికి | దేహవద్భిః | = దేహాభిమానముగల వారిచేత |
| | | అవ్యక్తా, గతిః | = అవ్యక్తపరబ్రహ్మ ప్రాప్తి |
| క్లేశః | = సాధనయందలి శ్రమ | దుఃఖమ్, అవాప్యతే | = కష్టసాధ్యమే |
| అధికతరః | = మిక్కిలి అధికము | | |

కాని, సచ్చిదానందఘననిరాకార పరబ్రహ్మమునందు ఆసక్తచిత్తులైనవారు తత్ప్రాప్తికై చేయు సాధన మిక్కిలి శ్రమతో గూడినది. ఏలనన, దేహాభిమానులకు అవ్యక్తపరబ్రహ్మ ప్రాప్తి కష్టసాధ్యమే. (5)

**యే తు సర్వాణి కర్మాణి మయి సన్న్యస్య మత్పరాః ।**
**అనన్యేనైవ యోగేన మాం ధ్యాయంత ఉపాసతే ॥ 6 ॥**

యే, తు, సర్వాణి, కర్మాణి, మయి, సన్న్యస్య, మత్పరాః,
అనన్యేన, ఏవ, యోగేన, మామ్, ధ్యాయంతః, ఉపాసతే ॥ 6 ॥

| | | | |
|---|---|---|---|
| యే, తు | = ఎవరయితే | అనన్యేన, యోగేన | = అనన్యభక్తి యోగముద్వారా |
| మత్పరాః | = మత్పరాయణులై | | |
| సర్వాణి కర్మాణి | = సమస్తకర్మలను | | |
| మయి, సన్న్యస్య | = నాకు సమర్పించి | ధ్యాయంతః | = నిరంతరము చింతన చేయుచు |
| మామ్, ఏవ | = సగుణరూప పరమేశ్వరుడనైన నన్నే | ఉపాసతే[1] | = ఉపాసింతురో |

కాని మత్పరాయణులైన ఏ భక్తులు కర్మలన్నింటిని నాయందే అర్పించి, నా సగుణపరమేశ్వరరూపమునే అనన్యభక్తియోగముతో సంతతము చింతన చేయుచు భజించుచుందురో.... (6)

**తేషామహం సముద్ధర్తా మృత్యుసంసారసాగరాత్ ।**
**భవామి నచిరాత్ పార్థ మయ్యావేశితచేతసామ్ ॥ 7 ॥**

1. ఈ శ్లోకముయొక్క భావమును విశేషముగా తెలిసికొనుటకు 11వ అధ్యాయమునందలి 55వ శ్లోకమును చూడవలెను.

తేషామ్, అహమ్, సముద్ధర్తా, మృత్యుసంసారసాగరాత్,
భవామి, నచిరాత్, పార్థ, మయి, ఆవేశితచేతసామ్ ॥ 7 ॥

| | | | |
|---|---|---|---|
| పార్థ! | = ఓ అర్జునా! | నచిరాత్ | = శీఘ్రముగా |
| తేషామ్ | = అట్టి | మృత్యుసంసార సాగరాత్ | = మృత్యురూపసంసార సాగరమునుండి |
| మయి, ఆవేశిత చేతసామ్ | = నా యందే లగ్నమైన చిత్తము గలవారికి | సముద్ధర్తా | = ఉద్ధరించువాడను |
| అహమ్ | = నేను | భవామి | = అగుదును. |

ఓ అర్జునా! నాయందే లగ్నమనస్కులైన అట్టి పరమభక్తులను నేను శీఘ్రముగనే మృత్యురూపసంసారసాగరము నుండి ఉద్ధరించెదను. (7)

**మయ్యేవ మన ఆధత్స్వ మయి బుద్ధిం నివేశయ ।**
**నివసిష్యసి మయ్యేవ అత ఊర్ధ్వం న సంశయః ॥ 8 ॥**

మయి, ఏవ, మనః, ఆధత్స్వ, మయి, బుద్ధిమ్, నివేశయ,
నివసిష్యసి, మయి, ఏవ, అతః, ఊర్ధ్వమ్, న, సంశయః ॥ 8 ॥

| | | | |
|---|---|---|---|
| మయి | = (కనుక) నాయందే | అతః, ఊర్ధ్వమ్ | = ఆ పిమ్మట |
| మనః, ఆధత్స్వ | = మనస్సును లగ్నము చేయుము | మయి, ఏవ | = నాయందే |
| మయి, ఏవ | = నాయందే | నివసిష్యసి | = నివసించెదవు |
| బుద్ధిమ్ | = బుద్ధిని | సంశయః, న | = ఇందేమాత్రము సంశయములేదు. |
| నివేశయ | = నిమగ్నమొనర్చుము | | |

నాయందే మనస్సును నిలుపుము. నాయందే బుద్ధిని లగ్నముచేయుము. పిమ్మట నాయందే స్థిరముగానుందువు. ఇందు ఏ మాత్రమూ సందేహమునకు తావులేదు. (8)

**అథ చిత్తం సమాధాతుం న శక్నోషి మయి స్థిరమ్ ।**
**అభ్యాసయోగేన తతో మామిచ్ఛాప్తుం ధనంజయ ॥ 9 ॥**

అథ, చిత్తమ్, సమాధాతుమ్, న, శక్నోషి, మయి, స్థిరమ్,
అభ్యాసయోగేన, తతః, మామ్, ఇచ్ఛ, ఆప్తుమ్, ధనంజయ ॥ 9 ॥

| | | | |
|---|---|---|---|
| అథ | = ఒకవేళ | మయి | = నాయందు |
| చిత్తమ్ | = చిత్తమును | స్థిరమ్ | = స్థిరముగా |

| | | | |
|---|---|---|---|
| సమాధాతుమ్ = నిల్పుటకు | | అభ్యాస యోగేన[1] | = అభ్యాసయోగము ద్వారా |
| న, శక్నోషి = సమర్థుడవు కానిచో | | మామ్, ఆప్తుమ్ | = నన్ను పొందుటకు |
| తత: = అట్టి స్థితిలో | | ఇచ్ఛ | = కోరుము (యత్నింపుము) |
| ధనంజయ! = ఓ అర్జునా! | | | |

మనస్సును సుస్థిరముగా నాయందే నిల్పుటకు సమర్థుడవు కానిచో అర్జునా! అభ్యాసయోగము ద్వారా నన్ను పొందుటకు ప్రయత్నింపుము. (9)

**అభ్యాసేఽప్యసమర్థోఽసి మత్కర్మపరమో భవ ।**
**మదర్థమపి కర్మాణి కుర్వన్ సిద్ధిమవాప్స్యసి ॥ 10 ॥**

అభ్యాసే, అపి, అసమర్థః, అసి, మత్కర్మపరమః, భవ,
మదర్థమ్, అపి, కర్మాణి, కుర్వన్, సిద్ధిమ్, అవాప్స్యసి ॥ 10 ॥

| | | | |
|---|---|---|---|
| అభ్యాసే, అపి | = అభ్యాసమునందును | కర్మాణి | = కర్మలను |
| అసమర్థః, అసి | = అసమర్థుడవైనచో | కుర్వన్, అపి | = చేయుచును |
| మత్కర్మపరమః భవ[2] | = మత్పరాయణుడవై కర్మల నాచరింపుము | సిద్ధిమ్ | = నా ప్రాప్తిరూప సిద్ధిని |
| మదర్థమ్ | = నాకొఱకై | అవాప్స్యసి | = పొందెదవు |

అభ్యాసముచేయుటకును అశక్తుడవైనచో మత్పరాయణుడవై కర్మలను ఆచరింపుము. ఈ విధముగా నా నిమిత్తమై కర్మలను ఆచరించుటద్వారాకూడ నన్నే పొందెదవు. (10)

**అథైతదప్యశక్తోఽసి కర్తుం మద్యోగమాశ్రితః ।**
**సర్వకర్మఫలత్యాగం తతః కురు యతాత్మవాన్ ॥ 11 ॥**

అథ, ఏతత్, అపి, అశక్తః, అసి, కర్తుమ్, మద్యోగమ్, ఆశ్రితః,
సర్వకర్మఫలత్యాగమ్, తతః, కురు, యతాత్మవాన్ ॥ 11 ॥

---

1. భగవంతుని నామగుణముల శ్రవణ, కీర్తన, మననములు, అట్లే శ్వాసద్వారా జపము, భగవత్ప్రాప్తికి సంబంధించిన శాస్త్రముల పఠన, పాఠనములు మొదలగు క్రియలను భగవత్ప్రాప్తికై మాటిమాటికి చేయుటనే 'అభ్యాసము' అందురు.
2. స్వార్థమును త్యజించి, పరమేశ్వరుడే పరమాశ్రయుడు, పరమగతి అని భావించి, నిష్కామ భక్తిభావముతో, పతివ్రతాశిరోమణివలె మనోవాక్కాయముల ద్వారా యజ్ఞదానతపశ్చర్యాది కర్తవ్య కర్మలను అన్నింటిని చేయుటయే 'భగవదర్థ కర్మపరాయణుడగుట' అగును.

| | | | |
|---|---|---|---|
| అథ | = ఒకవేళ | తతః | = అట్టిస్థితియందు |
| మద్యోగమ్ | = నా ప్రాప్తిరూపయోగమును | యతాత్మవాన్ | = మనోబుద్ధ్యాదులను వశపఱచుకొన్నవాడవై |
| ఆశ్రితః | = ఆశ్రయించినవాడవై | | |
| ఏతత్ | = ఈ ఉపర్యుక్తసాధనను | సర్వకర్మఫల త్యాగమ్[1] | = సకలకర్మలఫల త్యాగమును |
| కర్తుమ్, అపి | = చేయుటకును | | |
| అశక్తః, అపి | = అసమర్థుడవైనచో | కురు | = చేయుము. |

మత్ప్రాప్తికై వలయు యోగమునాశ్రయించి సాధన చేయుటకును నీవు అశక్తుడవైనచో మనోబుద్ధీంద్రియాదులను వశమునందు ఉంచుకొని, సకల కర్మఫలములను త్యజింపుము. (11)

**శ్రేయో హి జ్ఞానమభ్యాసాత్ జ్ఞానాద్ధ్యానం విశిష్యతే ।**
**ధ్యానాత్ కర్మఫలత్యాగః త్యాగాచ్ఛాంతిరనంతరమ్ ॥ 12 ॥**

శ్రేయః, హి, జ్ఞానమ్, అభ్యాసాత్, జ్ఞానాత్, ధ్యానమ్, విశిష్యతే,
ధ్యానాత్, కర్మఫలత్యాగః, త్యాగాత్, శాంతిః, అనంతరమ్ ॥ 12 ॥

| | | | |
|---|---|---|---|
| అభ్యాసాత్ | = తత్త్వము తెలియంగకచేయు అభ్యాసముకంటెను | విశిష్యతే | = శ్రేష్ఠమైనది |
| | | ధ్యానాత్ | = ధ్యానముకంటెను |
| జ్ఞానమ్[2] | = జ్ఞానము (శాస్త్రజ్ఞానము) | కర్మఫలత్యాగః[3] | = సకలకర్మల ఫల త్యాగము (శ్రేష్ఠము) |
| శ్రేయః | = శ్రేష్ఠమైనది | హి | = ఏలనన |
| జ్ఞానాత్ | = అనుభవరహితశాస్త్ర జ్ఞానముకంటెను | త్యాగాత్ | = త్యాగమువలన |
| | | అనంతరమ్ | = వెంటనే |
| ధ్యానమ్ | = పరమేశ్వర స్వరూప ధ్యానము | శాంతిః | = పరమశాంతి |
| | | (లభ్యతే) | లభించును. |

1. గీత-9వ అధ్యాయమునందలి 27వ శ్లోకమున దీని వివరణము గలదు.
2. వినుట ద్వారా, శాస్త్రపఠనముద్వారా కలుగు పరమేశ్వర స్వరూపము యొక్క అనుమాన ప్రమాణ జ్ఞానమునే ఇచట 'జ్ఞానము' అని యెఱుంగవలెను.
3. కేవలము భగవదర్థకర్మలు చేయువానికి భగవంతునియందు భక్తిశ్రద్ధలు, భగవచ్చింతన స్థిరముగా ఉండును. కావున ధ్యానముకంటెను కర్మఫలత్యాగము 'శ్రేష్ఠము' అని చెప్పబడినది.

తత్త్వము నెఱుంగకయే చేయు అభ్యాసముకంటెను జ్ఞానము శ్రేష్ఠము. కేవలము పరోక్షజ్ఞానముకంటెను అనగా, అనుభవరహితమైన జ్ఞానముకంటెను (శాస్త్ర పాండిత్యముకంటెను) పరమేశ్వరస్వరూపధ్యానము శ్రేష్ఠము. ధ్యానముకంటెను కర్మ ఫలత్యాగము మిక్కిలి శ్రేష్ఠమైనది. ఏలనన, త్యాగమువలన వెంటనే పరమశాంతి లభించును.(12)

**అద్వేష్టా సర్వభూతానాం మైత్రః కరుణ ఏవ చ ।**
**నిర్మమో నిరహంకారః సమదుఃఖసుఖః క్షమీ ॥ 13 ॥**
**సంతుష్టస్సతతం యోగీ యతాత్మా దృఢనిశ్చయః ।**
**మయ్యర్పితమనోబుద్ధిః యో మద్భక్తస్స మే ప్రియః ॥ 14 ॥**

అద్వేష్టా, సర్వభూతానామ్, మైత్రః, కరుణః, ఏవ, చ,
నిర్మమః, నిరహంకారః, సమదుఃఖసుఖః, క్షమీ ॥ 13 ॥
సంతుష్టః, సతతమ్, యోగీ, యతాత్మా, దృఢనిశ్చయః,
మయి, అర్పితమనోబుద్ధిః, యః, మద్భక్తః, సః, మే, ప్రియః ॥ 14 ॥

| | | | |
|---|---|---|---|
| యః | = ఏపురుషుడు | క్షమీ | = క్షమాగుణముగలవాడో |
| సర్వభూతానామ్ | = సకలప్రాణుల యందును | యోగీ | = యోగియై |
| అద్వేష్టా | = ద్వేషభావమును కలిగియుండడో | సతతమ్, సంతుష్టః | = సర్వదా సంతుష్టుడై యుండువాడో |
| మైత్రః, చ | = స్వార్థరహితమైన ప్రేమను కలిగియుండునో | యతాత్మా | = శరీరేంద్రియ మనస్సులను వశపఱచుకొన్నవాడో |
| కరుణః | = హేతురహిత దయాళువో | దృఢనిశ్చయః | = నాయందే నిశ్చయ బుద్ధిగలవాడో |
| ఏవ[1] | = అట్లే | | |
| నిర్మమః | = మమతారహితుడో | మయి | = నాయందే |
| నిరహంకారః | = అహంకారము లేనివాడో | అర్పితమనోబుద్ధిః | = మనోబుద్ధులను అర్పించిన వాడో |
| సమదుఃఖసుఖః | = సుఖదుఃఖముల ప్రాప్తి యందు సమభావము కలిగి యున్నవాడో | సః | = అట్టి |
| | | మద్భక్తః | = నా భక్తుడు |
| | | మే, ప్రియః | = నాకు ఇష్టుడు. |

1. 'ఏవ'అను అవ్యయము ఇచట సర్వగుణముల సముచ్చయము-అని ఎఱుంగవలయును

ఏ ప్రాణియందును ద్వేషభావము లేనివాడును, పైగా సర్వప్రాణులయందును అవ్యాజమైనప్రేమ, కరుణ కలవాడును, మమతాహంకారములు లేనివాడును, సుఖము ప్రాప్తించినను, దుఃఖము ప్రాప్తించినను, సమభావము కలిగియుండు వాడును, క్షమాగుణము కలవాడును (అపరాధికిని అభయమును ఇచ్చువాడును), సర్వకాల సర్వావస్థలయందును సంతుష్టుడైయుండు యోగియు, శరీరేంద్రియ మనస్సులను వశమునందుంచుకొనినవాడును, నాయందు దృఢమైన నిశ్చయము గలవాడును, అయి నాయందే మనోబుద్ధులను అర్పణ చేసిన నా భక్తుడు నాకు ప్రియుడు. (13,14)

**యస్మాన్నోద్విజతే లోకో లోకాన్నోద్విజతే చ యః ।**
**హర్షామర్షభయోద్వేగైః ముక్తోయస్స చ మే ప్రియః ॥ 15 ॥**

యస్మాత్, న, ఉద్విజతే, లోకః, లోకాత్, న, ఉద్విజతే, చ, యః,
హర్షామర్షభయోద్వేగైః, ముక్తః, యః, సః, చ, మే, ప్రియః ॥ 15 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| యస్మాత్ | = | ఎవని వలన | యః | = | ఎవడు |
| లోకః | = | ఏ ప్రాణియు | హర్షామర్ష భయోద్వేగైః[1] | = | హర్షము, ఈర్ష్య, భయము, ఉద్వేగము మొదలగు వాటినుండి |
| న, ఉద్విజతే | = | ఉద్వేగమునకు గురికాడో | | | |
| చ | = | మఱియు | | | |
| యః | = | ఎవడు (స్వయముగా) | | | |
| లోకాత్ | = | ఏ ప్రాణివలనను | ముక్తః | = | ముక్తుడో |
| న, ఉద్విజతే | = | ఉద్వేగమును పొందడో | సః | = | అట్టిభక్తుడు |
| | | | మే | = | నాకు |
| చ | = | అట్లే | ప్రియః | = | ఇష్టుడు. |

లోకమున ఎవరికిని ఉద్వేగము (క్షోభ) కలిగింపనివాడును, ఎవరివలనను తాను ఉద్వేజితుడు కానివాడును (ఉద్వేగమునకు గురికానివాడును), హర్షము, ఈర్ష్య, భయము, ఉద్వేగము మున్నగు వికారములు లేనివాడును అగు భక్తుడు నాకు ప్రియుడు. (15)

**అనపేక్షః శుచిర్దక్షః ఉదాసీనో గతవ్యథః ।**
**సర్వారంభపరిత్యాగీ యో మద్భక్తస్స మే ప్రియః ॥ 16 ॥**

అనపేక్షః, శుచిః, దక్షః, ఉదాసీనః, గతవ్యథః,
సర్వారంభపరిత్యాగీ, యః, మద్భక్తః, సః, మే, ప్రియః ॥ 16 ॥

1. ఇతరుల ఉన్నతిని జూచి, సంతాపమునొందుటను 'అమర్షము' అని యందురు.

| | | | |
|---|---|---|---|
| యః | = ఏ పురుషుడు | సః | = అట్టి |
| అనపేక్షః | = అపేక్షలేనివాడో | సర్వారంభ పరిత్యాగీ[2] | = సమస్తకర్మల యందును కర్తృత్వ అభిమానము లేనివాడైన |
| శుచిః[1] | = బాహ్యాభ్యంతరముల యందు శుచియైనవాడో | | |
| దక్షః | = నిపుణుడో | | |
| ఉదాసీనః | = పక్షపాతరహితుడో | మద్భక్తః | = నా భక్తుడు |
| గతవ్యథః | = దుఃఖములనుండి ముక్తుడో | మే | = నాకు |
| | | ప్రియః | = ఇష్టుడు |

ఏమాత్రమూ కాంక్షలేనివాడును, శరీరేంద్రియమనస్సులయందు శుచియైయున్నవాడును, దక్షుడును, పక్షపాతరహితుడును, ఎట్టి దుఃఖములకును చలింపనివాడును, సమస్తకర్మలయందును కర్తృత్వాభిమానములు లేనివాడును అగు భక్తుడు నాకు ప్రియుడు.(16)

**యో న హృష్యతి న ద్వేష్టి న శోచతి న కాంక్షతి ।**
**శుభాశుభపరిత్యాగీ భక్తిమాన్ యస్స మే ప్రియః ॥ 17 ॥**

యః, న, హృష్యతి, న, ద్వేష్టి, న, శోచతి, న, కాంక్షతి, శుభాశుభపరిత్యాగీ, భక్తిమాన్, యః, సః, మే, ప్రియః ॥ 17 ॥

| | | | |
|---|---|---|---|
| యః | = ఎవడు | శుభాశుభ పరిత్యాగీ | = శుభాశుభకర్మలను పరిత్యజించినవాడో |
| న, హృష్యతి | = ఇష్టప్రాప్తికి పొంగిపోడో | | |
| న, ద్వేష్టి | = దేనినిగూడ ద్వేషింపడో | సః | = అట్టి |
| న, శోచతి | = దేనికినీ విచారపడడో | భక్తిమాన్ | = భక్తుడు |
| న, కాంక్షతి | = దేనినీ కోరడో, అట్లే | మే | = నాకు |
| యః | = ఎవడైతే | ప్రియః | = ఇష్టుడు |

ఇష్టవస్తుప్రాప్తికి పొంగిపోనివాడును, దేనియందును ద్వేషభావము లేనివాడును, దేనికినీ శోకింపనివాడును, దేనినీ ఆశింపనివాడును, శుభాశుభకర్మలను త్యజించినవాడును, ఐన భక్తుడు నాకు ప్రియుడు. (17)

1. *గీత-13వ అధ్యాయమునందలి 7వ శ్లోక 'టిప్పణి'లో దీని వివరణము గలదు.*
2. *ప్రారబ్ధవశమున మనోవాక్కాయముల ద్వారా జరుగు సమస్త స్వాభావిక కర్మలయందు కర్తృత్వాభిమానమును త్యజించువాడు 'త్యాగి'.*

**సమశ్శత్రౌ చ మిత్రే చ తథా మానాపమానయోః ।**
**శీతోష్ణసుఖదుఃఖేషు సమస్సంగవివర్జితః ॥ 18 ॥**

సమః, శత్రౌ, చ, మిత్రే, చ, తథా, మానాపమానయోః,
శీతోష్ణసుఖదుఃఖేషు, సమః, సంగవివర్జితః ॥ 18 ॥

| | | | |
|---|---|---|---|
| శత్రౌ, మిత్రే, చ | = శత్రువులయందును, మిత్రుల యందును | శీతోష్ణసుఖ దుఃఖేషు | = శీతోష్ణములయందును, సుఖదుఃఖములు మొదలగు ద్వంద్వముల యందును |
| మాన-అపమానయోః | = మానాపమానముల యందును | సమః | = సమభావము కలిగి యుండువాడును |
| సమః | = సమభావముగల వాడును | చ | = మఱియు |
| తథా | = అట్లే | సంగవివర్జితః | = ఆసక్తిరహితుడును... |

శత్రువులయెడను, మిత్రులయెడను సమభావముతో మెలగువాడును, మానాపమానములు, శీతోష్ణములు, సుఖదుఃఖములు మొదలగు ద్వంద్వములను సమానముగా స్వీకరించువాడును, మఱియు ఆసక్తిరహితుడును...... (18)

**తుల్యనిందాస్తుతిర్మౌనీ సంతుష్టో యేన కేనచిత్ ।**
**అనికేతః స్థిరమతిః భక్తిమాన్ మే ప్రియో నరః ॥ 19 ॥**

తుల్యనిందాస్తుతిః, మౌనీ, సంతుష్టః, యేన, కేనచిత్,
అనికేతః, స్థిరమతిః, భక్తిమాన్, మే, ప్రియః, నరః ॥ 19 ॥

| | | | |
|---|---|---|---|
| తుల్యనిందాస్తుతిః | = నిందాస్తుతులను సమానముగా భావించు వాడును | అనికేతః | = గృహాదులయందు ఎట్టి ఆసక్తియు లేని వాడును |
| మౌనీ[1] | = మననశీలుడును | స్థిరమతిః | = స్థిరబుద్ధిగలవాడును |
| యేన కేనచిత్ | = శరీరనిర్వహణకై ప్రాప్తించిన దానితోడనే | భక్తిమాన్, నరః | = (ఐన) భక్తుడైనవాడు |
| | | మే | = నాకు |
| సంతుష్టః | = తృప్తిపడువాడును | ప్రియః | = ఇష్టుడు |

1. ఈశ్వరస్వరూపమును నిరంతరము మననమును చేయువాడు 'మౌని'.

నిందాస్తుతులకు చలింపనివాడును, మననశీలుడును, శరీరనిర్వహణకై లభించిన దానితోడనే తృప్తిపడువాడును, నివాసస్థానములయందు మమతాసక్తులు లేనివాడును, స్థితప్రజ్ఞుడును అగు భక్తుడు నాకు ఇష్టుడు. (19)

**యే తు ధర్మ్యామృతమిదం యథోక్తం పర్యుపాసతే ।**
**శ్రద్ధధానా మత్పరమా భక్తాస్తేఽతీవ మే ప్రియాః ॥ 20 ॥**

యే, తు, ధర్మ్యామృతమ్, ఇదమ్, యథా, ఉక్తమ్, పర్యుపాసతే,
శ్రద్దధానాః, మత్పరమాః, భక్తాః, తే, అతీవ, మే, ప్రియాః ॥ 20 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| యే, తు | = | ఎవరైతే | పర్యుపాసతే | = | నిష్కామభక్తి భావముతో సేవింతురో |
| శ్రద్దధానాః[1] | = | శ్రద్ధాయుక్తులై | తే, భక్తాః | = | ఆ భక్తులు |
| మత్పరమాః[2] | = | మత్పరాయణులై | మే | = | నాకు |
| యథా, ఉక్తమ్ | = | పైనతెల్పబడినట్టి | అతీవ, ప్రియాః | = | మిక్కిలి ఇష్టులు |
| ఇదమ్ | = | ఈ | | | |
| ధర్మ్య-అమృతమ్ | = | ధర్మ్యామృతమును | | | |

ఉపర్యుక్తధర్మ్యామృతమును సేవించుచు (పైనపేర్కొనబడిన ఉత్తమ గుణములను కలిగియుండి), నిష్కామభక్తిశ్రద్ధలతో మత్పరాయణులైన భక్తులు నా కత్యంత ప్రియులు. (20)

ఓం తత్సదితి శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే
శ్రీకృష్ణార్జునసంవాదే భక్తియోగో నామ ద్వాదశోఽధ్యాయః ॥ ౧౨ ॥

---

1. వేదశాస్త్రములయందును, మహాత్ముల, గురుజనుల వచనములయందును, పరమేశ్వరు వాణియందును ప్రత్యక్ష విశ్వాసము కలిగియుండుటనే 'శ్రద్ధ' యందురు.
2. నన్నే 'పరమాశ్రయుడు' అనియు, 'పరమగతి' అనియు, అట్లే అందఱికిని 'ఆత్మ స్వరూపుడు' అనియు, సర్వశ్రేష్ఠుడనియు, పరమపూజ్యుడు అనియు భావించి, నిర్మల ప్రేమతో నాప్రాప్తికై మత్పరాయణుడగువాడు.

# అథ త్రయోదశోఽధ్యాయః - క్షేత్ర-క్షేత్రజ్ఞ విభాగయోగః

## (పదుమూడవ అధ్యాయము-క్షేత్ర-క్షేత్రజ్ఞవిభాగయోగము)

ముఖ్యాంశములు : [(1 నుండి 18వ శ్లోకమువఱకు) జ్ఞానసహిత క్షేత్ర-క్షేత్రజ్ఞుల వర్ణనము. (19 నుండి 34 వఱకు) జ్ఞానసహిత ప్రకృతి పురుషుల వర్ణనము.]

**శ్రీభగవాన్ ఉవాచ**

**ఇదం శరీరం కౌంతేయ క్షేత్రమిత్యభిధీయతే ।**
**ఏతద్యో వేత్తి తం ప్రాహుః క్షేత్రజ్ఞ ఇతి తద్విదః ॥ 1 ॥**

ఇదమ్, శరీరమ్, కౌంతేయ, క్షేత్రమ్, ఇతి, అభిధీయతే,
ఏతత్, యః, వేత్తి, తమ్, ప్రాహుః, క్షేత్రజ్ఞః, ఇతి, తద్విదః ॥ 1 ॥

| | | | |
|---|---|---|---|
| **కౌంతేయ!** | = ఓ అర్జునా! | **యః, వేత్తి** | = ఎవరు తెలిసికొందురో |
| **ఇదమ్, శరీరమ్** | = ఈ శరీరము | **తమ్** | = అతనిని |
| **క్షేత్రమ్,[1] ఇతి** | = 'క్షేత్రము' అని | **క్షేత్రజ్ఞః, ఇతి** | = 'క్షేత్రజ్ఞుడు' అని |
| **అభిధీయతే** | = పిలువబడును | **తద్విదః** | = తత్త్వజ్ఞానులైన వారు |
| **ఏతత్** | = దీనిని గూర్చి | **ప్రాహుః** | = పేర్కొందురు. |

శ్రీ భగవానుడు పలికెను - ఓ కౌంతేయా! ఈ శరీరమును 'క్షేత్రము' అని పేర్కొందురు. ఈ క్షేత్రమును గూర్చి ఎఱింగిన వానిని 'క్షేత్రజ్ఞుడు' అని తత్త్వము తెలిసిన జ్ఞానులు తెలుపుదురు. (1)

**క్షేత్రజ్ఞం చాపి మాం విద్ధి సర్వక్షేత్రేషు భారత ।**
**క్షేత్రక్షేత్రజ్ఞయోః జ్ఞానం యత్తద్ జ్ఞానం మతం మమ ॥ 2 ॥**

క్షేత్రజ్ఞమ్, చ, అపి, మామ్, విద్ధి, సర్వక్షేత్రేషు, భారత,
క్షేత్రక్షేత్రజ్ఞయోః, జ్ఞానమ్, యత్, తత్, జ్ఞానమ్, మతమ్, మమ ॥ 2 ॥

| | | | |
|---|---|---|---|
| **భారత!** | = ఓ అర్జునా! | **క్షేత్రజ్ఞమ్** | } = క్షేత్రజ్ఞుని |
| **సర్వక్షేత్రేషు** | = క్షేత్రములన్నింటిలో ఉన్న | **అపి** | (జీవాత్మను) గూడ |

1. పొలములో నాటబడిన విత్తనములకు అనురూపమగు ఫలము తగిన సమయమున ప్రకటితమగును. అట్లే దీనియందు (శరీరమునందు) నాటబడిన కర్మల సంస్కారరూపబీజముల ఫలము తగు సమయమున లభించును. కావున దీనిని 'క్షేత్రము' అని యందురు.

| | | | |
|---|---|---|---|
| మామ్ | = నన్నుగా (నేనేయని) | యత్, జ్ఞానమ్ | = ఏతత్త్వజ్ఞానము గలదో |
| విద్ధి[1] | = ఎఱుంగుము | తత్ | = అది |
| చ | = మఱియు | జ్ఞానమ్[2] | = జ్ఞానము అని |
| క్షేత్ర-క్షేత్రజ్ఞయోః | = క్షేత్ర, క్షేత్రజ్ఞులయొక్క (ప్రకృతి పురుషుల యొక్క) | మమ, మతమ్ | = నా అభిప్రాయము |

ఓ అర్జునా! అన్ని క్షేత్రములయందున్న క్షేత్రజ్ఞుడను అనగా జీవాత్మను నేనే అని తెలిసికొనుము. క్షేత్రక్షేత్రజ్ఞులకు సంబంధించిన జ్ఞానము అనగా వికారసహిత (త్రిగుణాత్మకమైన) ప్రకృతి మరియు నిర్వికారపురుషుల తత్త్వములనుగూర్చి తెలిసికొనుటయే 'జ్ఞానము' అని నా అభిప్రాయము. (2)

**తత్క్షేత్రం యచ్చ యాదృక్చ యద్వికారి యతశ్చ యత్ ।**
**స చ యో యత్ప్రభావశ్చ తత్సమాసేన మే శృణు ॥ 3 ॥**

తత్, క్షేత్రమ్,యత్, చ, యాదృక్, చ, యద్వికారి, యతః, చ, యత్,
సః, చ, యః, యత్ప్రభావః, చ, తత్, సమాసేన, మే, శృణు ॥ 3 ॥

| | | | |
|---|---|---|---|
| తత్, క్షేత్రమ్ | = ఆ క్షేత్రము | యః | = ఎవరో |
| యత్, చ | = ఏదియో, | యత్ప్రభావశ్చ | = ఎట్టి ప్రభావము గలవాడో |
| యాదృక్, చ | = ఎటువంటిదో | తత్ | = దానిని (ఆ విషయములన్నింటిని) |
| యద్వికారి | = ఎట్టి వికారములు కలదియో | సమాసేన | = సంక్షిప్తముగా |
| యతః, చ, | = దేని నుండి | మే | = నా నుండి |
| యత్ సః, చ | = ఉత్పన్నమైనదో (అట్లే) ఆ క్షేత్రజ్ఞుడను | శృణు | = వినుము |

క్షేత్రమనగానేమి? అది యెట్లుండును? దాని వికారములు(భావములు) ఏవి? ఆ వికారములు దేనినుండి ఏర్పడినవి? అట్లే క్షేత్రజ్ఞుడు అనగా ఎవరు? అతని ప్రభావమేమి? ఆ వివరములను అన్నింటిని సంక్షిప్తముగా తెలిపెదను వినుము. (3)

1. *గీత, 15వ అధ్యాయమునందలి 7వ శ్లోకమును, దాని టిప్పణిని చూడవలెను.*
2. *గీత, 13వ అధ్యాయమునందలి 23వ శ్లోకమును, దాని టిప్పణిని చూడవలెను.*

**ఋషిభిర్బహుధా గీతం ఛందోభిర్వివిధైః పృథక్ ।**
**బ్రహ్మసూత్రపదైశ్చైవ హేతుమద్భిర్వినిశ్చితైః ॥ 4 ॥**

ఋషిభిః, బహుధా, గీతమ్, ఛందోభిః, వివిధైః పృథక్,
బ్రహ్మసూత్రపదైః, చ, ఏవ, హేతుమద్భిః, వినిశ్చితైః ॥ 4 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| ఋషిభిః | = | (ఈ క్షేత్ర క్షేత్రజ్ఞుల తత్త్వము) ఋషులచేత | పృథక్ | = | వేర్వేఱుగా |
| | | | (గీతమ్) | = | (తెలుపబడినది) |
| | | | చ | = | అట్లే |
| | | | వినిశ్చితైః | = | నిశ్చయాత్మకములైన |
| బహుధా | = | అనేకవిధములుగా | హేతుమద్భిః | = | సహేతుకములైన |
| గీతమ్ | = | వివరింపబడినది | బ్రహ్మసూత్రపదైః, ఏవ | = | బ్రహ్మసూత్రపదముల ద్వారాకూడ |
| వివిధైః ఛందోభిః | = | వివిధములైన వేదమంత్రములద్వారా | (గీతమ్) | = | చెప్పబడినది. |

క్షేత్ర, క్షేత్రజ్ఞులతత్త్వములనుగూర్చి ఋషులెల్లరును బహువిధములుగా వివరించిరి. వివిధవేదమంత్రములును వేర్వేరుగా తెల్పినవి. అట్లే బ్రహ్మసూత్ర పదములుగూడ నిశ్చయాత్మకముగ సహేతుకముగ తేటతెల్లము గావించినవి. (4)

**మహాభూతాన్యహంకారో బుద్ధిరవ్యక్తమేవ చ ।**
**ఇంద్రియాణి దశైకం చ పంచ చేంద్రియగోచరాః ॥ 5 ॥**

మహాభూతాని, అహంకారః, బుద్ధిః, అవ్యక్తమ్, ఏవ, చ,
ఇంద్రియాణి, దశ, ఏకమ్, చ, పంచ, చ, ఇంద్రియగోచరాః ॥ 5 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| మహాభూతాని[1] | = | పంచమహాభూతములు(పృథివ్యాపస్తేజోవాయురాకాశములు) | దశ, ఇంద్రియాణి[2] | = | ఐదు జ్ఞానేంద్రియములు, ఐదు కర్మేంద్రియములు |
| | | | ఏకమ్ | = | మనస్సు |
| అహంకారః | = | అహంకారము | చ | = | మఱియు |
| బుద్ధిః | = | బుద్ధి | పంచ | = | ఐదు |
| చ | = | మఱియు | ఇంద్రియ-గోచరాః | = | ఇంద్రియ విషయములు (శబ్దస్పర్శరూపరస గంధములు) |
| అవ్యక్తమ్, ఏవ | = | మూలప్రకృతియు | | | |
| చ | = | అట్లే | | | |

1. ఆకాశము, వాయువు, అగ్ని, జలము, పృథ్వీ-అను వాటిసూక్ష్మభావములు
2. త్వక్చక్షుశ్శ్రోత్ర జిహ్వాఘ్రాణములు, వాక్పాణిపాద పాయూపస్థలు-అను దశేంద్రియములు.

పంచమహాభూతములు, అహంకారము, బుద్ధి, మూలప్రకృతియు, అట్లే దశేంద్రియములు, మనస్సు, పంచేంద్రియగ్రాహ్యవిషయములు (శబ్ద, స్పర్శ, రూప, రస గంధములు) (5)

**ఇచ్ఛా ద్వేషః సుఖం దుఃఖం సంఘాతశ్చేతనా ధృతిః ।**
**ఏతత్ క్షేత్రం సమాసేన సవికారముదాహృతమ్ ॥ 6 ॥**

ఇచ్ఛా, ద్వేషః, సుఖమ్, దుఃఖమ్, సంఘాతః, చేతనా, ధృతిః,
ఏతత్, క్షేత్రమ్, సమాసేన, సవికారమ్, ఉదాహృతమ్ ॥ 6 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| ఇచ్ఛా | = కోరిక | | సవికారమ్[3] | = | ఉపర్యుక్త వికారములతో గూడినట్టి |
| ద్వేషః | = ద్వేషము | | ఏతత్ | = | ఇదియే |
| సుఖమ్ | = సుఖము | | క్షేత్రమ్ | = | క్షేత్రస్వరూపమని |
| దుఃఖమ్ | = దుఃఖము | | సమాసేన | = | సంగ్రహముగా |
| సంఘాతః | = స్థూలశరీరము | | ఉదాహృతమ్ | = | చెప్పబడినది. |
| చేతనా[1] | = చైతన్యము | | | | |
| ధృతిః[2] | = ధృతి | | | | |

ఇచ్ఛ, ద్వేషము, సుఖము, దుఃఖము, స్థూలశరీరము, చైతన్యము, ధృతి అను వికారములతో గూడిన 'క్షేత్రస్వరూపము' సంక్షిప్తముగా పేర్కొనబడినది. (6)

**అమానిత్వమదంభిత్వమ్ అహింసా క్షాంతిరార్జవమ్ ।**
**ఆచార్యోపాసనం శౌచం స్థైర్యమాత్మవినిగ్రహః ॥ 7 ॥**

అమానిత్వమ్, అదంభిత్వమ్, అహింసా, క్షాంతిః, ఆర్జవమ్,
ఆచార్యోపాసనమ్, శౌచమ్, స్థైర్యమ్, ఆత్మవినిగ్రహః ॥ 7 ॥

| | | | |
|---|---|---|---|
| అమానిత్వమ్ | = తానే శ్రేష్ఠుడనను భావము లేకుండుట | క్షాంతిః | = క్షమాగుణము |
| అదంభిత్వమ్ | = డాంబికములేకుండుట | ఆర్జవమ్ | = మనోవాక్కులయందు సరళత్వము |
| అహింసా | = ఏ ప్రాణినీ ఏ విధముగను హింసింపకుండుట | ఆచార్యోపాసనమ్ | = భక్తిశ్రద్ధలతో గురుజనుల సేవ |

1. శరీరాంతఃకరణములయొక్క (ఒక విధమగు) చేతనాశక్తి
2. గీత, 18వ అధ్యాయమునందలి 33,34, 35 శ్లోకములయందు చూడవలెను.
3. గీత-ఈ అధ్యాయము నందలి 5వ శ్లోకమున పేర్కొనబడిన వాటిని క్షేత్రస్వరూపముగా ఎఱుంగవలెను. ఈ శ్లోకమున క్షేత్ర వికారములకు ఇచ్ఛాదులు అని యెఱుంగవలెను.

శౌచమ్[1] = బాహ్యాభ్యంతరశుద్ధి
స్థైర్యమ్ = అంతఃకరణ స్థిరత్వము
ఆత్మ-వినిగ్రహః = మనస్సు, శరీరేంద్రియముల నిగ్రహము

తానే శ్రేష్ఠుడనను భావము లేకుండుట, డాంబికము లేకుండుట, అహింస, క్షమించుగుణము, మనోవాక్కులయందు సరళత్వము, శ్రద్ధాభక్తులతో గురుజనులను సేవించుట, బాహ్యాభ్యంతరశుద్ధి, అంతఃకరణస్థిరత్వము, మనశ్శరీరేంద్రియముల నిగ్రహము. (7)

**ఇంద్రియార్థేషు వైరాగ్యమ్ అనహంకార ఏవ చ ।**
**జన్మమృత్యుజరావ్యాధిదుఃఖదోషానుదర్శనమ్ ॥ 8 ॥**

ఇంద్రియార్థేషు, వైరాగ్యమ్, అనహంకారః, ఏవ, చ,
జన్మమృత్యుజరావ్యాధిదుఃఖదోషానుదర్శనమ్ ॥ 8 ॥

ఇంద్రియార్థేషు = ఇహపరలోక భోగముల యందును
వైరాగ్యమ్ = ఆసక్తిలేకుండుట
చ = మఱియు
అనహంకారః, ఏవ = అహంకార రాహిత్యము
జన్మమృత్యు-జరావ్యాధి-దుఃఖదోషాను-దర్శనమ్ = జన్మ,మృత్యు, జరా, రోగాదులయందు దుఃఖదోషములను గూర్చి పదే పదే తలంచుట.

ఇంద్రియార్థములయందు వైరాగ్యము (ఇహపరలోక భోగములన్నింటియందును ఆసక్తి లేకుండుట), అహంకార రాహిత్యము, జన్మ, మృత్యు, జరా (ముసలితనము) రోగాదులయందు దుఃఖదోషములను పదేపదే దర్శించుట. (8)

**అసక్తిరనభిష్వంగః పుత్రదారగృహాదిషు ।**
**నిత్యం చ సమచిత్తత్వమ్ ఇష్టానిష్టోపపత్తిషు ॥ 9 ॥**

---

1. నిజమైన స్వచ్ఛమైన వ్యవహారముద్వారా ద్రవ్యశుద్ధి, అట్టిద్రవ్యముద్వారా సమకూరిన అన్నముతో ఆహారశుద్ధి, యథాయోగ్యజీవనవిధానమువలన ఆచరణశుద్ధి, జల మృత్తికాదులచే శరీరశుద్ధి-ఇవి యన్నియును 'బాహ్యశుద్ధి'లోని భాగములు-రాగద్వేషములు, కపటము మొదలగు వికారములు నశించి, అంతఃకరణము స్వచ్ఛమగుటను 'అంతఃశుద్ధి' అందురు.

అసక్తిః, అనభిష్వంగః, పుత్రదారగృహాదిషు,
నిత్యమ్, చ, సమచిత్తత్వమ్, ఇష్టానిష్టోపపత్తిషు ॥ 9 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| పుత్రదార-గృహాదిషు | = | భార్య, పిల్లలు, ఇల్లు మొదలగు వానియందు | ఇష్టానిష్టోపపత్తిషు | = | ఇష్టానిష్టవస్తు ప్రాప్తియందు |
| అసక్తిః | = | ఆసక్తిలేకుండుట | నిత్యమ్ | = | నిరంతరము |
| అనభిష్వంగః | = | మమతారాహిత్యము | సమచిత్తత్వమ్ | = | సమభావముతో ఉండుట |
| చ | = | మరియు | | | |

భార్య, పుత్రులు, ఇల్లు, సంపదలు మున్నగువానియందు మమతాసక్తులు లేకుండుట, ఇష్టానిష్ట వస్తుప్రాప్తివలన ఎట్టి మనోవికారములకును లోనుగాకుండుట, ఎల్లప్పుడును సమభావముతో నుండుట. (9)

**మయి చానన్యయోగేన భక్తిరవ్యభిచారిణీ ।**
**వివిక్తదేశసేవిత్వమ్ అరతిర్జనసంసది ॥ 10 ॥**

మయి, చ, అనన్యయోగేన, భక్తిః, అవ్యభిచారిణీ,
వివిక్తదేశసేవిత్వమ్, అరతిః, జనసంసది ॥ 10 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| మయి | = | పరమాత్మనైన నాయందు | చ | = | మఱియు |
| అనన్యయోగేన | = | అనన్యయోగము (భగవంతుడే సర్వస్వమని భావించుట) ద్వారా | వివిక్తదేశ-సేవిత్వమ్ | = | ఏకాంతమైన పవిత్ర ప్రదేశమునందు నివసించుట |
| అవ్యభిచారిణీ, భక్తిః[1] | = | దృఢమైన నిశ్చలభక్తి | జనసంసది, అరతిః | = | విషయాసక్తులైన మనుష్య సముదాయమునందు ఆసక్తిలేకుండుట |

పరమేశ్వరుడనైన నాయందు అనన్యయోగముద్వారా అవ్యభిచారిణీభక్తి కలిగియుండుట, ఏకాంతపవిత్రప్రదేశమున వసించు ప్రవృత్తి కలిగియుండుట, విషయాసక్తులైన జనులయెడ ఆసక్తిలేకుండుట. (10)

1. సర్వశక్తిమంతుడైన పరమేశ్వరుడే కేవలము తనస్వామియని భావించి, స్వార్థమును, అభిమానమును త్యజించి, పరమశ్రద్ధాభక్తులతో భగవంతుని నిరంతరముచింతన చేయుటనే 'అవ్యభిచారిణీభక్తి' అని యందురు.

**అధ్యాత్మజ్ఞాననిత్యత్వం తత్త్వజ్ఞానార్థదర్శనమ్ ।**
**ఏతద్‌జ్ఞానమితి ప్రోక్తమ్ అజ్ఞానం యదతోఽన్యథా ॥ 11 ॥**

అధ్యాత్మజ్ఞాననిత్యత్వమ్, తత్త్వజ్ఞానార్థదర్శనమ్,
ఏతత్, జ్ఞానమ్, ఇతి, ప్రోక్తమ్, అజ్ఞానమ్, యత్, అతః, అన్యథా ॥ 11 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| అధ్యాత్మ-జ్ఞాననిత్యత్వమ్(1) | = | ఆధ్యాత్మికజ్ఞానమునందు నిత్యస్థితుడై యుండుట | జ్ఞానమ్ | = | జ్ఞానము (జ్ఞాన ప్రాప్తికి సాధనములు) |
| తత్త్వజ్ఞానార్థ దర్శనమ్ | = | తత్త్వజ్ఞానమునకు ప్రతిపాద్యుడు భగవంతుడే యనియెఱుంగుట | అతః | = | దీనికంటెను |
| | | | అన్యథా | = | వేఱుగా |
| | | | యత్ | = | ఏదిగలదో |
| ఏతత్ | = | ఇదియంతయును (అమానిత్వము మొదలుకొని తత్త్వజ్ఞానార్థ దర్శనము వరకు గలదంతయును) | (తత్) అజ్ఞానమ్(2) ఇతి | = | (అది) అజ్ఞానము అని |
| | | | ప్రోక్తమ్ | = | చెప్పబడినది |

ఆధ్యాత్మికజ్ఞానమునందు నిత్యస్థితుడై యుండుట, తత్త్వజ్ఞానమునకు ప్రతిపాద్యుడు భగవంతుడేయని యెఱుంగుట - ఇవియన్నియును (అమానిత్వము మొదలుకొని తత్త్వజ్ఞానార్థదర్శనమువఱకుగల ఇవియన్నియును) జ్ఞానప్రాప్తికి సాధనములు. దీనికి విపరీతమైనది అజ్ఞానము. . (11)

**జ్ఞేయం యత్తత్ ప్రవక్ష్యామి యద్ జ్ఞాత్వామృతమశ్నుతే ।**
**అనాదిమత్పరం బ్రహ్మ న సత్తన్నాసదుచ్యతే ॥ 12 ॥**

జ్ఞేయమ్, యత్, తత్, ప్రవక్ష్యామి, యత్, జ్ఞాత్వా, అమృతమ్, అశ్నుతే,
అనాదిమత్, పరమ్, బ్రహ్మ, న, సత్, తత్, న, అసత్, ఉచ్యతే ॥ 12 ॥

1. ఆత్మవస్తువును, అనాత్మవస్తువులను ఎఱుంగుటకు తోడ్పడు జ్ఞానమే 'అధ్యాత్మజ్ఞానము' అనబడును.
2. పైన తెల్పబడిన, జ్ఞానసాధనలకు విపరీతమైన అభిమానము, దంభము, హింస మొదలగునవి అజ్ఞానవృద్ధికి హేతువులు అగుటవలన వాటిని 'అజ్ఞానమ్' అని పేర్కొనబడినది.

| | | | | | |
|---|---|---|---|---|---|
| యత్ | = | ఏదైతే | అనాదిమత్ | = | సనాతనుడైన వాడును |
| జ్ఞేయమ్ | = | తెలిసికొనదగినదో | పరమ్, బ్రహ్మ | = | పరబ్రహ్మము |
| యత్ | = | దేనిని | న, సత్ | = | సత్తు కాదు |
| జ్ఞాత్వా | = | తెలిసికొని (మనుష్యుడు) | న, అసత్ | = | అసత్తు కూడ కాదు (సదసత్తులకు అతీతుడు) |
| అమృతమ్, అశ్నుతే | = | పరమానందమును పొందునో | (ఇతి) ఉచ్యతే | = | అని చెప్పబడును |
| తత్ | = | దానిని | | | |
| ప్రవక్ష్యామి | = | చక్కగా తెల్పెదను | | | |
| తత్ | = | అది (అతడు) | | | |

అనాదియైన (సనాతనుడైన) పరబ్రహ్మయే తెలిసికొనదగినవాడు. అతనిని తెలిసికొనుట వలన మానవుడు పరమానందమును పొందును. అతడు సదసత్తులకు(సత్+అసత్ లకు)అతీతుడు. ఆ పరమాత్మనుగూర్చి సమగ్రముగా నీకు తెల్పుచున్నాను. (12)

**సర్వతః పాణిపాదం తత్ సర్వతోఽక్షిశిరోముఖమ్ ।**
**సర్వతః శ్రుతిమల్లోకే సర్వమావృత్య తిష్ఠతి ॥ 13 ॥**

సర్వతః, పాణిపాదమ్, తత్, సర్వతః, అక్షిశిరోముఖమ్,
సర్వతః, శ్రుతిమత్, లోకే, సర్వమ్, ఆవృత్య, తిష్ఠతి ॥ 13 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| తత్ | = | ఆపరమాత్మ | శ్రుతిమత్ | = | చెవులుగలవాడు |
| సర్వతః పాణి పాదమ్ | = | అంతట చేతులును, పాదములును కల్గియున్నవాడు | యతః | = | ఎందువలననగా (అతడు) |
| సర్వతోఽక్షి శిరోముఖమ్ | = | అంతటను నేత్రములు, శిరస్సులు, ముఖములు గలవాడు | లోకే | = | లోకమునందు |
| సర్వతః, | = | అంతటను | సర్వమ్ ఆవృత్య | = | అంతటను వ్యాపించి |
| | | | తిష్ఠతి[1] | = | స్థితమైయున్నాడు |

1. వాయువు, అగ్ని, జలము, పృథ్వి అనువాటికి ఆకాశము కారణము అగుటవలన వాటియందు అది వ్యాప్తమై, స్థితమైయున్నది. అట్లే పరమాత్మ సంపూర్ణ చరాచర జగత్తునకు కారణమై యుండుట వలన అతడు అందు వ్యాప్తుడై స్థితుడైయున్నాడు.

ఆ పరమాత్ముని చేతులు, పాదములు, నేత్రములు, చెవులు, శిరస్సులు, ముఖములు సర్వత్ర స్థితములై యున్నవి. అతడు సర్వమును ఆవరించి యున్నాడు. (13)

**సర్వేంద్రియగుణాభాసం సర్వేంద్రియవివర్జితమ్ ।**
**అసక్తం సర్వభృచ్చైవ నిర్గుణం గుణభోక్తృ చ ॥ 14 ॥**

సర్వేంద్రియగుణాభాసమ్, సర్వేంద్రియవివర్జితమ్,
అసక్తం, సర్వభృత్, చ, ఏవ, నిర్గుణమ్, గుణభోక్తృ, చ ॥ 14 ॥

| | | | |
|---|---|---|---|
| సర్వేంద్రియ గుణాభాసమ్ | = ఇంద్రియగ్రాహ్య విషయములనన్నింటిని ఎఱిగినవాడు | సర్వభృత్ | = సర్వజగత్తును ధరించి, పోషించువాడు |
| సర్వేంద్రియ వివర్జితమ్ | = (కాని) వాస్తవముగా ఇంద్రియ రహితుడు | చ | = అట్లే |
| | | నిర్గుణమ్ | = గుణరహితుడైనను |
| చ | = మఱియు | గుణభోక్తృ, చ | = గుణములను అనుభవించువాడు |
| అసక్తమ్, ఏవ | = ఆసక్తిరహితుడైనను | | |

అతడు ఇంద్రియగ్రాహ్యవిషయములను అన్నింటిని ఎఱిగినవాడు. కాని, వాస్తవముగా ఇంద్రియాదులకు అతీతుడు. ఆసక్తిరహితుడైనను సమస్తజగత్తును భరించి పోషించువాడు. అతడు నిర్గుణుడయ్యును(గుణాతీతుడయ్యును) ప్రకృతి సంబంధమువలన గుణానుభవములను కలిగియుండువాడు. (14)

**బహిరంతశ్చ భూతానామ్ అచరం చరమేవ చ ।**
**సూక్ష్మత్వాత్ తదవిజ్ఞేయం దూరస్థం చాంతికే చ తత్ ॥ 15 ॥**

బహిః, అంతః, చ, భూతానామ్, అచరమ్, చరమ్, ఏవ, చ,
సూక్ష్మత్వాత్, తత్, అవిజ్ఞేయమ్, దూరస్థం, చ, అంతికే, చ, తత్ ॥ 15 ॥

| | | | |
|---|---|---|---|
| భూతానామ్ | = చరాచరప్రాణు లన్నింటికిని | చరమ్, అచరమ్, ఏవ | = చరాచర రూపుడును అతడే |
| బహిః, అంతః, చ | = బయట, లోపల, పరిపూర్ణుడై యుండువాడు | చ | = మఱియు |
| | | తత్ | = అతడు |
| | | సూక్ష్మత్వాత్ | = అతిసూక్ష్మ రూపుడగుటవలన |

| | | | |
|---|---|---|---|
| అవిజ్ఞేయమ్[1] = | తెలిసికొన శక్యముగానివాడు | దూరస్థమ్[3], తత్, చ = | దూరమునందును (ఉండువాడు) అతడే |
| చ = | అట్లే | | |
| అంతికే, చ[2] = | అతి సమీపమునందును | | |

చరాచరభూతములన్నింటికిని బాహ్యాభ్యంతరములయందు పరిపూర్ణముగా ఉండువాడును, చరాచరరూపుడును అతడే. అతిసూక్ష్మ(పరమాణు) రూపుడైనందున తెలిసికొనశక్యముకానివాడు, అతిదూరముగను, అతిసమీపముగను స్థితుడై ఉండువాడును అతడే. (15)

**అవిభక్తం చ భూతేషు విభక్తమివ చ స్థితమ్ ।**
**భూతభర్తృ చ తద్ జ్ఞేయం గ్రసిష్ణు ప్రభవిష్ణు చ ॥ 16 ॥**

అవిభక్తమ్, చ, భూతేషు, విభక్తమ్, ఇవ, చ, స్థితమ్,
భూతభర్తృ, చ, తత్, జ్ఞేయమ్, గ్రసిష్ణు, ప్రభవిష్ణు, చ ॥ 16 ॥

| | | | |
|---|---|---|---|
| అవిభక్తమ్, చ = | విభాగరహితుడై ఆకాశమువలె పరిపూర్ణరూపుడై యున్నను | ప్రభవిష్ణు, చ = | బ్రహ్మరూపములో సృష్టి చేయువాడును |
| భూతేషు = | చరాచరప్రాణుల రూపములలో | భూతభర్తృ, చ = | విష్ణురూపములో ప్రాణులను ధరించి, పోషించువాడును |
| విభక్తమ్, = | వేర్వేఱుగా | | |
| ఇవ, స్థితమ్[4] = | ఉన్నట్లుగోచరించు వాడును | గ్రసిష్ణు, చ = | రుద్రరూపములో లయమొనర్చువాడును అయియున్నాడు |
| తత్, జ్ఞేయమ్ = | తెలిసికొనదగిన ఆ పరమాత్మ | | |

1. సూర్యకిరణములయందుండెడి జలము సూక్ష్మమగుటవలన దానిని సామాన్యమానవులు ఎఱుంగలేనట్లు, సర్వవ్యాపియైన పరమాత్మయు సూక్ష్మరూపుడగుటవలన సాధారణ మానవులు ఆయనను ఎఱుంగజాలరు.
2. పరమాత్మ సర్వత్ర పరిపూర్ణుడై సర్వప్రాణులకును ఆత్మస్వరూపుడు అగుటవలన అతి సమీపస్థుడు.
3. శ్రద్ధారహితులైన అజ్ఞానులు అతనిని ఎఱుంగక పోవుటవలన వారికి అతడు దూరస్థుడు.
4. మహాకాశము విభాగరహితమైనను కుండలలో (ఘటములలో) వేర్వేఱుగా గోచరించినట్లు పరమాత్మ సకల భూతములలో ఏకరూపుడుగా స్థితుడైయున్నను వేర్వేఱుగా ప్రతీతుడగును.

పరమాత్మ ఆకాశమువలె విభజించుటకు వీలులేని ఒకేరూపమున పరిపూర్ణుడై యున్నను, సమస్త చరాచర ప్రాణులరూపములలో వేర్వేరుగా గోచరించుచుండును. ఆ పరమాత్మయే సృష్టికర్తయైన బ్రహ్మగా, పోషకుడైన విష్ణువుగా, లయకారకుడైన రుద్రునిగా తెలిసికొనదగినవాడు. (16)

**జ్యోతిషామపి తజ్జ్యోతి: తమస: పరముచ్యతే ।**
**జ్ఞానం జ్ఞేయం జ్ఞానగమ్యం హృది సర్వస్య విష్ఠితమ్ ॥ 17 ॥**

జ్యోతిషామ్, అపి, తత్, జ్యోతి:, తమస:, పరమ్, ఉచ్యతే,
జ్ఞానమ్, జ్ఞేయమ్, జ్ఞానగమ్యమ్, హృది, సర్వస్య, విష్ఠితమ్ ॥ 17 ॥

| | | | |
|---|---|---|---|
| తత్ | = ఆ పరబ్రహ్మ | జ్ఞేయమ్ | = తెలిసికొనదగినవాడును |
| జ్యోతిషామ్, అపి | = జ్యోతి స్వరూపములన్నింటికిని | జ్ఞానగమ్యమ్ | = తత్త్వజ్ఞానము ద్వారా ప్రాప్యుడును మఱియు |
| జ్యోతి:[1] | = పరంజ్యోతి | సర్వస్య, హృది | = సకల ప్రాణుల హృదయములయందును |
| తమస:, పరమ్ | = మాయాతీతుడు-అని | విష్ఠితమ్ | = విశేషముగా స్థితమైయుండువాడు |
| ఉచ్యతే | = చెప్పబడును | | |
| జ్ఞానమ్ | = (ఆపరమాత్మ) జ్ఞానస్వరూపుడును | | |

ఆ పరబ్రహ్మ అన్నిజ్యోతులకును జ్యోతి (పరంజ్యోతి), మాయాతీతుడును, జ్ఞానస్వరూపుడును, తెలిసికొనదగినవాడును, తత్త్వజ్ఞానముద్వారా ప్రాప్యుడును అతడే. సర్వప్రాణుల హృదయములయందు విశేషముగా ఉండువాడును అతడే. (17)

**ఇతి క్షేత్రం తథా జ్ఞానం జ్ఞేయం చోక్తం సమాసత: ।**
**మద్భక్త ఏతద్విజ్ఞాయ మద్భావాయోపపద్యతే ॥ 18 ॥**

ఇతి, క్షేత్రమ్, తథా, జ్ఞానమ్, జ్ఞేయమ్, చ, ఉక్తమ్, సమాసత:,
మద్భక్త:, ఏతత్, విజ్ఞాయ, మద్భావాయ, ఉపపద్యతే ॥ 18 ॥

| | | | |
|---|---|---|---|
| ఇతి | = ఈ విధముగా | తథా | = అట్లే |
| క్షేత్రమ్[2] | = క్షేత్రమును గూర్చియు | జ్ఞానమ్[3] | = జ్ఞానమును గూర్చియు |

1. *గీత-18వ అధ్యాయమునందలి 12 వ శ్లోకమును చూడవలెను.*
2. *ఈ అధ్యాయమునందలి 5,6 శ్లోకములలో వికారసహిత 'క్షేత్ర' స్వరూపము వివరింపబడినది.*
3. *ఈ అధ్యాయమునందలి 7 నుండి 11వ శ్లోకమువఱకు 'జ్ఞానము' అనగా జ్ఞానసాధనరీతి తెల్పబడినది.*

| | | | | | |
|---|---|---|---|---|---|
| చ | = | మరియు | మద్భక్తః | = | నా భక్తుడు |
| జ్ఞేయమ్[1] | = | తెలిసికొనదగిన పరమాత్మ స్వరూపమును గూర్చియు | ఏతత్, విజ్ఞాయ | = | దీనిని సమగ్రముగా తెలిసికొని |
| సమాసతః | = | సంక్షిప్తముగా | మద్భావాయ | = | నా స్వరూపమునే |
| ఉక్తమ్ | = | చెప్పబడినది | ఉపపద్యతే | = | పొందును |

ఇంతవఱకును క్షేత్రమును గూర్చియు, జ్ఞానమును గూర్చియు, జ్ఞేయమును (తెలిసికొనదగిన పరమాత్మ స్వరూపమును) గుఱించియు సంక్షిప్తముగా వివరించితిని. ఈ తత్త్వమును సమగ్రముగా తెలిసికొనిన నా భక్తుడు నా స్వరూపమునే పొందును. (18)

**ప్రకృతిం పురుషం చైవ విద్ధ్యనాదీ ఉభావపి ।**
**వికారాంశ్చ గుణాంశ్చైవ విద్ధి ప్రకృతిసంభవాన్ ॥ 19 ॥**

ప్రకృతిమ్, పురుషమ్, చ, ఏవ, విద్ధి, అనాదీ, ఉభౌ, అపి,
వికారాన్, చ, గుణాన్, చ, ఏవ, విద్ధి, ప్రకృతిసంభవాన్ ॥ 19 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| ప్రకృతిమ్ | = | ప్రకృతిని | వికారాన్, చ | = | రాగద్వేషాది వికారములను |
| చ | = | మఱియు | గుణాన్, అపి | = | సత్త్వరజస్తమో గుణములనూ |
| పురుషమ్ | = | పురుషుని | ప్రకృతి సంభవాన్, ఏవ | = | ప్రకృతినుండియే ఉత్పన్నములైన వానినిగా |
| ఉభౌ, ఏవ అనాదీ | = | ఈ రెండును ఆదిలేనివని | విద్ధి | = | ఎఱుంగుము |
| విద్ధి | = | ఎఱుంగుము | | | |
| చ | = | మఱియు | | | |

ప్రకృతి, పురుషుడు - అను ఈ రెండును అనాదియైన(సనాతనమైన) వనియు, రాగద్వేషాదివికారములును, త్రిగుణాత్మకములైన పదార్థములన్నియును ప్రకృతినుండియే ఉత్పన్నములైనవనియు ఎఱుంగుము. (19)

**కార్యకరణకర్తృత్వే హేతుః ప్రకృతిరుచ్యతే ।**
**పురుషః సుఖదుఃఖానాం భోక్తృత్వే హేతురుచ్యతే ॥ 20 ॥**

1. *ఈ అధ్యాయమునందలి 12 నుండి 17 వ శ్లోకము వఱకు 'జ్ఞేయ' స్వరూపము తెల్పబడినది.*

కార్యకరణకర్తృత్వే, హేతుః, ప్రకృతిః, ఉచ్యతే,
పురుషః, సుఖదుఃఖానామ్, భోక్తృత్వే హేతుః, ఉచ్యతే ॥ 20 ॥

| | | | |
|---|---|---|---|
| కార్యకరణ<br>కర్తృత్వే[1] | = కార్యములను, కరణములను ఉత్పన్నము చేయుటలో | సుఖదుఃఖానామ్,<br>భోక్తృత్వే | = సుఖదుఃఖములను అనుభవించుటలో |
| | | పురుషః | = జీవాత్మయే |
| ప్రకృతిః,<br>హేతుః, ఉచ్యతే | = ప్రకృతియే హేతువుగా చెప్పబడును | హేతుః,<br>ఉచ్యతే | = హేతువుగా చెప్పబడుచున్నది |

కార్యకరణములను ఉత్పన్నము చేయుటలో ప్రకృతియే హేతువనియు, సుఖదుఃఖములను అనుభవించుటలో జీవాత్మయే హేతువనియు చెప్పబడుచున్నది. (20)

**పురుషః ప్రకృతిస్థో హి భుంక్తే ప్రకృతిజాన్ గుణాన్ ।**
**కారణం గుణసంగోఽస్య సదసద్యోనిజన్మసు ॥ 21 ॥**

పురుషః, ప్రకృతిస్థః, హి, భుంక్తే, ప్రకృతిజాన్, గుణాన్,
కారణమ్, గుణసంగః, అస్య, సదసద్యోనిజన్మసు ॥ 21 ॥

| | | | |
|---|---|---|---|
| ప్రకృతిస్థః[2] | = ప్రకృతియందు స్థితుడైన | భుంక్తే | = అనుభవించును |
| | | గుణసంగః | = గుణముల సాంగత్యమే |
| పురుషః, హి | = పురుషుడే | అస్య | = ఈ జీవాత్మయొక్క |
| ప్రకృతిజాన్ | = ప్రకృతినుండి ఉత్పన్నములైన | సదసద్యోని<br>జన్మసు | = ఉత్తమాధమ జన్మలకు |
| గుణాన్ | = త్రిగుణాత్మకములైన పదార్థములను | కారణమ్[3] | = కారణము |

1. పృథివ్యప్తేజోవాయురాకాశములు, శబ్దస్పర్శరూపరసగంధములు అను పదియు కార్యములు, మనోబుద్ధ్యహంకారములు, త్వక్చక్షుశ్శ్రోత్ర, జిహ్వాఘ్రాణములు, వాక్పాణి పాదపాయూపస్థలు అను పదమూడును కరణములు.
2. ప్రకృతి అనుపదమునకు అర్థము *గీత-7వ* అధ్యాయమునందలి *14* శ్లోకమున చెప్పబడినట్లు భగవంతుని త్రిగుణమయీ మాయా, అని భావింపవలెను.
3. సత్త్వగుణసాంగత్యమున దేవయోనియందును, రజోగుణసాంగత్యమున మానవయోని యందును, తమోగుణసాంగత్యమున పశుపక్ష్యాది నీచ యోనులయందును జన్మ లభించును.

పురుషుడు ప్రకృతిస్థుడై ప్రకృతినుండి ఉత్పన్నములైన త్రిగుణాత్మక పదార్థములను అనుభవించును. ఈ గుణసాంగత్యమే జీవాత్మయొక్క ఉత్తమాధమ జన్మలకు కారణమగును. (21)

**ఉపద్రష్టానుమంతా చ భర్తా భోక్తా మహేశ్వరః ।**
**పరమాత్మేతి చాప్యుక్తో దేహేఽస్మిన్ పురుషః పరః ॥ 22 ॥**

ఉపద్రష్టా, అనుమంతా, చ, భర్తా, భోక్తా, మహేశ్వరః,
పరమాత్మా, ఇతి, చ, అపి, ఉక్తః, దేహే, అస్మిన్, పురుషః, పరః ॥ 22 ॥

| | | | |
|---|---|---|---|
| అస్మిన్, దేహే, (స్థితః) అపి | = ఈ దేహమునందు స్థితుడైయున్నను | భర్తా | = అన్నింటిని ధరించి, పోషించువాడగుటవలన 'భర్త' అనియు |
| పురుషః | = ఆత్మ | | |
| పరః, ఏవ[1] | = వాస్తవముగా పరమాత్మయే | భోక్తా | = జీవరూపములో 'భోక్త' యనియు |
| ఉపద్రష్టా, చ | = (అతడే) సాక్షియగుటచే 'ఉపద్రష్ట' అనియు, | మహేశ్వరః,చ | = బ్రహ్మాదులకును ప్రభువగుటవలన 'మహేశ్వరుడు' అనియు, |
| అనుమంతా | = యథార్థముగా సమ్మతిని ఇచ్చువాడు అగుటవలన 'అనుమంత' అనియు | పరమాత్మా, ఇతి | = శుద్ధసచ్చిదానంద ఘనుడగుటవలన 'పరమాత్మ' అనియు, |
| | | ఉక్తః | = పేర్కొనబడెను. |

ఈ దేహమునందున్న ఆత్మ వాస్తవముగా పరమాత్మయే. అతడు సాక్షిభూతుడగుట వలన 'ఉపద్రష్ట' యనియు, యథార్థసమ్మతినిచ్చువాడగుట వలన 'అనుమంత' అనియు, అన్నింటిని ధరించి, పోషించువాడు అగుటవలన 'భర్త' అనియు, జీవరూపములో 'భోక్త' అనియు, బ్రహ్మాదులకును స్వామి యగుటవలన 'మహేశ్వరుడు' అనియు, శుద్ధసచ్చిదానందఘనస్వరూపుడగుటవలన 'పరమాత్మ' అనియు పిలువబడుచున్నాడు. (22)

**య ఏవం వేత్తి పురుషం ప్రకృతిం చ గుణైస్సహ ।**
**సర్వథా వర్తమానోఽపి న స భూయోఽభిజాయతే ॥ 23 ॥**

యః, ఏవమ్, వేత్తి, పురుషమ్, ప్రకృతిమ్, చ, గుణైః, సహ,
సర్వథా, వర్తమానః, అపి, న, సః, భూయః, అభిజాయతే ॥ 23 ॥

1. త్రిగుణమయమైన మాయకు సర్వథా అతీతుడైనవాడు

ఏవమ్ = ఈ విధముగా
పురుషమ్ = పురుషుని
చ = మఱియు
గుణైః, సహ = త్రిగుణసహితముగా
ప్రకృతిమ్ = ప్రకృతిని
యః = ఏమనుష్యుడు
వేత్తి[1] = యథార్థముగా తెలిసికొనునో
సః = అతడు
సర్వథా = అన్నివిధములుగా
వర్తమానః, అపి = కర్తవ్య కర్మలను చేయుచున్నను
భూయః = మఱల
న, అభిజాయతే = జన్మింపడు

ఈ విధముగా పురుషునితత్త్వమును, గుణసహితమైన ప్రకృతితత్త్వమును తెలిసికొనినవాడు అన్ని విధములగు కర్తవ్యకర్మలను ఆచరించుచున్నప్పటికిని పునర్జన్మను పొందడు. (23)

**ధ్యానేనాత్మని పశ్యంతి కేచిదాత్మానమాత్మనా ।**
**అన్యే సాంఖ్యేన యోగేన కర్మయోగేన చాపరే ॥ 24 ॥**

ధ్యానేన, ఆత్మని, పశ్యంతి, కేచిత్, ఆత్మానమ్, ఆత్మనా,
అన్యే, సాంఖ్యేన, యోగేన, కర్మయోగేన, చ, అపరే ॥ 24 ॥

ఆత్మానమ్ = పరమాత్మను
కేచిత్ = కొందఱు పురుషులు
ఆత్మనా = శుద్ధమైన సూక్ష్మబుద్ధితో
ధ్యానేన[2] = ధ్యానయోగముద్వారా
ఆత్మని = హృదయమునందు (హృదయముల యందు)
పశ్యంతి = చూచెదరు
అన్యే = మఱికొందరు
సాంఖ్యేన, యోగేన, చ[3] = జ్ఞాన (సాంఖ్య) యోగముద్వారాను
అపరే = మఱికొందరు
కర్మయోగేన[4] = కర్మయోగముద్వారాను
పశ్యంతి = చూచెదరు (పొందెదరు)

1. దృశ్యమానమైన జగత్తంతయును మాయాకార్యమగుటవలన క్షణభంగురము, నశ్వరము, జడము, అనిత్యము. జీవాత్మనిత్యుడు, చేతనుడు, నిర్వికారుడు, శాశ్వతుడు, మఱియు శుద్ధ బోధస్వరూపుడైన సచ్చిదానందఘనపరమాత్మయొక్క సనాతనాంశ. ఈ విధముగా తెలిసికొని సమస్తమాయామయ పదార్థములసంగమును సర్వథా త్యజించి, పరమపురుషుడైన పరమాత్మయందే ఏకీభావముతో నిత్యస్థితుడైయుండుటనే అతనిని తాత్త్వికముగా తెలిసికొనుట యగును.
2. గీత-6వ అధ్యాయమునందలి 11 నుండి 32 వ శ్లోకము వఱకు ఇది విస్తృతముగా వర్ణింపబడినది.
3. దీనివర్ణన గీత 2 వ అధ్యాయమునందలి 11 నుండి 30వ శ్లోకము వఱకు విస్తృతముగా చేయబడినది.
4. గీత 2 వ అధ్యాయమునందలి 40వ శ్లోకమునుండి చివరి వఱకు దీని వివరణము గలదు.

కొందరు ఈ పరమాత్మను శుద్ధమైన సూక్ష్మబుద్ధితో ధ్యానయోగముద్వారా తమహృదయములయందు చూతురు. మఱికొందరు (జ్ఞాన) యోగముద్వారాను, మఱికొందఱు కర్మయోగముద్వారాను ఆ పరమాత్మను దర్శింతురు. (24)

**అన్యే త్వేవమజానంతః శ్రుత్వాన్యేభ్య ఉపాసతే ।**
**తేఽపి చాతితరంత్యేవ మృత్యుం శ్రుతిపరాయణాః ॥ 25 ॥**

అన్యే తు, ఏవమ్, అజానంతః, శ్రుత్వా, అన్యేభ్యః, ఉపాసతే,
తే, అపి, చ, అతితరంతి, ఏవ, మృత్యుమ్, శ్రుతిపరాయణాః ॥ 25 ॥

| | | | |
|---|---|---|---|
| తు | = కాని | ఉపాసతే[1] | = తదనుసారముగా ఉపాసింతురు |
| అన్యే | = వీరికంటెను వేఱైన మందబుద్ధులు | చ | = మఱియు |
| ఏవమ్ | = ఈ విధముగా | శ్రుతిపరాయణాః | = శ్రవణపరాయణులైన |
| అజానంతః | = తెలిసికొననివారై | తే, అపి | = వారును |
| అన్యేభ్యః | = ఇతరులనుండి (తత్త్వజ్ఞులైన వారినుండి) | మృత్యుమ్ | = మృత్యురూప సంసారమును |
| శ్రుత్వా | = విని | అతితరంతి, ఏవ | = నిస్సందేహముగా దాటుదురు. |

కాని, ఈ సాధనమార్గములనుగూర్చి ఎఱుగని మందబుద్ధులు తత్త్వజ్ఞానముగల ఇతరులనుండి విని, తదనుసారముగ ఉపాసనలు చేయుదురు. ఆ శ్రవణపరాయణులును మృత్యురూపసంసారసాగరమునుండి నిస్సందేహముగా బయటపడుదురు. (25)

**యావత్సంజాయతే కించిత్ సత్త్వం స్థావరజంగమమ్ ।**
**క్షేత్రక్షేత్రజ్ఞసంయోగాత్ తద్విద్ధి భరతర్షభ ॥ 26 ॥**

యావత్, సంజాయతే, కించిత్, సత్త్వమ్, స్థావరజంగమమ్,
క్షేత్రక్షేత్రజ్ఞసంయోగాత్, తత్, విద్ధి, భరతర్షభ ॥ 26 ॥

| | | | |
|---|---|---|---|
| భరతర్షభ | = ఓ అర్జునా! | సత్త్వమ్ | = ప్రాణి |
| స్థావరజంగమమ్ | = చరాచరాత్మకమైన | యావత్, కించిత్ | = ఏదేది |

1. తత్త్వజ్ఞానుల ఉపదేశానుసారము శ్రద్ధాతత్పరులై సాధన చేయుదురు.

| | | | | | |
|---|---|---|---|---|---|
| సంజాయతే | = | పుట్టుచున్నదో | క్షేత్ర, క్షేత్రజ్ఞ సంయోగాత్ | = | క్షేత్రక్షేత్రజ్ఞ సంయోగమువలననే |
| తత్ | = | అది (ఆప్రాణి సముదాయము) | విద్ధి | = | (కలుగునని) ఎఱుంగుము |

ఓ అర్జునా! ఆ స్థావరజంగమప్రాణులన్నియును క్షేత్ర-క్షేత్రజ్ఞ సంయోగము వలననే ఉత్పన్నమగునని ఎఱుంగుము. (26)

**సమం సర్వేషు భూతేషు తిష్ఠంతం పరమేశ్వరమ్ ।**
**వినశ్యత్స్వవినశ్యంతం యః పశ్యతి స పశ్యతి ॥ 27 ॥**

సమమ్, సర్వేషు, భూతేషు, తిష్ఠంతమ్, పరమేశ్వరమ్,
వినశ్యత్సు, అవినశ్యంతమ్, యః, పశ్యతి, సః, పశ్యతి ॥ 27 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| యః | = | ఎవడు | సమమ్, తిష్ఠంతమ్ | = | సమభావముతో ఉన్నవానినిగా |
| వినశ్యత్సు | = | నశించుచున్నట్టి | పశ్యతి | = | చూచునో |
| సర్వేషు, భూతేషు | = | సమస్త చరాచర భూతములయందు | సః | = | అతడే |
| అవినశ్యంతమ్ | = | నాశరహితుడైన | పశ్యతి | = | (నిజముగా) చూచువాడు |
| పరమేశ్వరమ్ | = | పరమేశ్వరుని | | | |

నశ్వరములైన చరాచరభూతముల(ప్రాణుల) యందు సమముగా స్థితుడైయున్న పరమేశ్వరుడు నాశరహితుడు. అట్టి పరమేశ్వరుని చూచువాడే నిజమైన ద్రష్ట. (27)

**సమం పశ్యన్ హి సర్వత్ర సమవస్థితమీశ్వరమ్ ।**
**న హినస్త్యాత్మనాత్మానం తతో యాతి పరాం గతిమ్ ॥ 28 ॥**

సమమ్, పశ్యన్, హి, సర్వత్ర, సమవస్థితమ్, ఈశ్వరమ్,
న, హినస్తి, ఆత్మనా, ఆత్మానమ్, తతః, యాతి, పరామ్, గతిమ్ ॥ 28 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| హి | = | ఏలననగా | ఆత్మనా | = | తనద్వారా |
| సర్వత్ర | = | (అతడు) అన్నింటియందును | ఆత్మానమ్ | = | తనను |
| | | | న, హినస్తి[1] | = | నాశమొందించుకొనడు |
| సమవస్థితమ్ | = | సమభావముతోస్థితుడైన | తతః | = | అందువలన (అతడు) |
| ఈశ్వరమ్ | = | పరమేశ్వరుని | పరామ్, గతిమ్ | = | పరమగతిని |
| సమమ్, పశ్యన్ | = | సమానముగా చూచుచు | యాతి | = | పొందును |

1. శరీరము నశించినను తన ఆత్మ నశింపదని భావించును.

సమస్తప్రాణులయందును సమభావముతోనుండు పరమేశ్వరుని సమత్వభావముతో చూచువాడు ఆత్మహంతకుడుకాడు - అనగా తనను తాను నాశము చేసికొనువాడు కాడు. అందువలన అతడు పరమగతిని పొందును. (28)

**ప్రకృత్యైవ చ కర్మాణి క్రియమాణాని సర్వశః ।**
**యః పశ్యతి తథాత్మానమ్ అకర్తారం స పశ్యతి ॥ 29 ॥**

ప్రకృత్యా, ఏవ, చ, కర్మాణి, క్రియమాణాని, సర్వశః,
యః, పశ్యతి, తథా, ఆత్మానమ్, అకర్తారమ్, సః, పశ్యతి ॥ 29 ॥

| | | | |
|---|---|---|---|
| చ | = మఱియు | తథా | = అట్లే |
| యః | = ఏ పురుషుడు | ఆత్మానమ్ | = ఆత్మను |
| కర్మాణి | = సర్వకర్మలు | అకర్తారమ్ | = అకర్తనుగా (కర్తకానివానినిగా) |
| సర్వశః | = అన్నివిధముల | | |
| ప్రకృత్యా, ఏవ | = ప్రకృతిచేతనే | పశ్యతి | = భావించునో |
| క్రియమాణాని | = చేయబడుచున్నట్లు | సః | = అతడు |
| పశ్యతి[1] | = చూచునో | (పశ్యతి) | = (నిజముగా) చూచువాడు |

సకలకర్మలు అన్నివిధములుగ ప్రకృతిద్వారానే జరుగుచున్నవనియు, ఆత్మ అకర్త అనియు ఎఱింగినవాడు వాస్తవముగ చూచువాడు. (29)

**యదా భూతపృథగ్భావమ్ ఏకస్థమనుపశ్యతి ।**
**తత ఏవ చ విస్తారం బ్రహ్మ సంపద్యతే తదా ॥ 30 ॥**

యదా, భూతపృథగ్భావమ్, ఏకస్థమ్, అనుపశ్యతి,
తతః, ఏవ, చ, విస్తారమ్, బ్రహ్మ, సంపద్యతే, తదా ॥ 30 ॥

| | | | |
|---|---|---|---|
| యదా భూత-పృథగ్భావమ్ | = ఎప్పుడైతే (ఏక్షణమున) వేర్వేఱుగా గోచరించుచున్న ప్రాణులనన్నియును | చ | = మఱియు |
| | | తతః, ఏవ | = ఆ పరమాత్మ నుండియే |
| | | విస్తారమ్ | = విస్తరించుచున్న వానినిగా |
| ఏకస్థమ్ | = ఒకేపరమాత్మయందు స్థితమైన వానినిగా | అనుపశ్యతి | = (ఈ పురుషుడు) చూచునో |

1. ప్రకృతినుండి ఉత్పన్నములైన సంపూర్ణగుణములే గుణములయందు వర్తించుచున్న విషయమును తాత్త్వికముగా తెలిసికొనును.

| | | | |
|---|---|---|---|
| తదా | = ఆక్షణమునందే (అతడు) | బ్రహ్మ | = సచ్చిదానంద ఘనబ్రహ్మను |
| | | సంపద్యతే | = పొందును. |

వేర్వేరుగా గోచరించుచున్న ప్రాణులన్నియును ఒకే పరమాత్మయందు స్థితమై యున్నవనియు, అట్లే, అవి యన్నియును ఆ పరమాత్మనుండియే విస్తరించు చున్నవనియు, ఎఱింగిన పురుషుడు ఆ క్షణముననే సచ్చిదానందఘనపరబ్రహ్మను చేరును. (30)

**అనాదిత్వాన్నిర్గుణత్వాత్ పరమాత్మాయమవ్యయః ।**
**శరీరస్థోఽపి కౌంతేయ న కరోతి న లిప్యతే ॥ 31 ॥**

అనాదిత్వాత్, నిర్గుణత్వాత్, పరమాత్మా, అయమ్, అవ్యయః,
శరీరస్థః, అపి, కౌంతేయ, న, కరోతి, న, లిప్యతే ॥ 31 ॥

| | | | |
|---|---|---|---|
| కౌంతేయ! | = అర్జునా! | శరీరస్థః, అపి | = శరీరము నందున్నప్పటికిని |
| అనాదిత్వాత్ | = అనాదియగుటవలనను | న, కరోతి | = వాస్తవముగా ఏమియును చేయడు |
| నిర్గుణత్వాత్ | = నిర్గుణుడగుటవలనను | న, లిప్యతే | = లిప్తుడును కాడు |
| అవ్యయః | = నాశరహితుడైన | | |
| అయమ్, పరమాత్మా | = ఈ పరమాత్మ | | |

ఓ అర్జునా! నాశరహితుడైన పరమాత్ముడు ప్రాణుల శరీరములందున్నప్పటికిని అనాది(సనాతనుడు) అగుటవలనను, నిర్గుణుడు అగుటవలనను ఎట్టి కర్మలకును కర్తకాడు. కనుక కర్మలతనిని ఏమాత్రమును అంటవు. (31)

**యథా సర్వగతం సౌక్ష్మ్యాత్ ఆకాశం నోపలిప్యతే ।**
**సర్వత్రావస్థితో దేహే తథాత్మా నోపలిప్యతే ॥ 32 ॥**

యథా, సర్వగతమ్, సౌక్ష్మ్యాత్, ఆకాశమ్, న, ఉపలిప్యతే,
సర్వత్ర, అవస్థితః, దేహే, తథా, ఆత్మా, న, ఉపలిప్యతే ॥ 32 ॥

| | | | |
|---|---|---|---|
| యథా | = ఏవిధముగా | సౌక్ష్మ్యాత్ | = సూక్ష్మమగుటవలన |
| సర్వగతమ్ | = సర్వత్రవ్యాపించిన | న, ఉపలిప్యతే | = గుణదోషములచే లిప్తముకాదో |
| ఆకాశమ్ | = ఆకాశము | | |

తథా = అట్లే
దేహే = దేహమునందు
సర్వత్ర, అవస్థితః = అంతటను వ్యాపించి యున్నను
ఆత్మా = ఆత్మ (నిర్గుణమగుటచే)
న, ఉపలిప్యతే = దేహముయొక్క గుణములతో లిప్తముకాదు

సర్వత్ర (ఇతరమహాభూతములయందు) వ్యాపించియున్న ఆకాశము సూక్ష్మమగుట వలన వాటి గుణదోషములు దానికి అంటవు. అట్లే, సకల ప్రాణుల దేహముల యందు స్థితమైయున్నను ఆత్మ నిర్గుణమగుటవలన వాటి గుణదోషములును దానికంటవు. (32)

**యథా ప్రకాశయత్యేకః కృత్స్నం లోకమిమం రవిః ।**
**క్షేత్రం క్షేత్రీ తథా కృత్స్నం ప్రకాశయతి భారత ॥ 33 ॥**

యథా, ప్రకాశయతి, ఏకః, కృత్స్నమ్, లోకమ్, ఇమమ్, రవిః,
క్షేత్రమ్, క్షేత్రీ, తథా, కృత్స్నమ్, ప్రకాశయతి, భారత ॥ 33 ॥

భారత! = ఓ అర్జునా!
యథా = ఏవిధముగా
ఏకః, రవిః = ఒకే సూర్యుడు
ఇమమ్, కృత్స్నమ్, లోకమ్ = ఈ సమస్త బ్రహ్మాండమును
ప్రకాశయతి = ప్రకాశింపజేయునో
తథా = అట్లే
క్షేత్రీ = ఒకే ఆత్మ
కృత్స్నమ్, క్షేత్రమ్ ప్రకాశయతి = సర్వప్రాణులలో స్థితమైయుండి వాటిని ప్రకాశింప జేయును.

అర్జునా! ఒక్క సూర్యుడే ఈ సమస్త జగత్తును ప్రకాశితమొనర్చుచున్నట్లు, ఒకే ఆత్మ సర్వప్రాణులయందును స్థితమై, వాటినన్నింటిని ప్రకాశింప (చైతన్య వంతములుగా) జేయుచున్నది. (33)

**క్షేత్రక్షేత్రజ్ఞయోరేవమ్ అంతరం జ్ఞానచక్షుషా ।**
**భూతప్రకృతిమోక్షం చ యే విదుర్యాంతి తే పరమ్ ॥ 34 ॥**

క్షేత్రక్షేత్రజ్ఞయోః, ఏవమ్, అంతరమ్, జ్ఞానచక్షుషా,
భూతప్రకృతిమోక్షమ్, చ, యే, విదుః, యాంతి, తే, పరమ్ ॥ 34 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| ఏవమ్ | = | ఈ విధముగా | యే | = | ఏ పురుషులయితే |
| క్షేత్ర, క్షేత్రజ్ఞయోః | = | క్షేత్రక్షేత్రజ్ఞుల మధ్యగల | జ్ఞానచక్షుషా | = | జ్ఞాననేత్రముల ద్వారా |
| అంతరమ్[1] | = | భేదమును | విదుః | = | తెలిసికొందురో |
| చ | = | మఱియు | తే | = | అట్టిమహాత్ములు |
| భూతప్రకృతి మోక్షమ్ | = | కార్యసహిత ప్రకృతి నుండి ముక్తులగు ఉపాయములను | పరమ్ | = | పరబ్రహ్మ పరమాత్మను |
| | | | యాంతి | = | పొందుదురు |

ఈ విధముగా క్షేత్ర-క్షేత్రజ్ఞులమధ్యగలఅంతరమును, కార్యసహిత ప్రకృతినుండి విముక్తులగుటకు ఉపాయములను, జ్ఞాననేత్రముల ద్వారా ఎఱింగిన మహాత్ములు పరమగతిని పొందుదురు. (34)

*ఓం తత్సదితి శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే క్షేత్రక్షేత్రజ్ఞవిభాగయోగో నామ త్రయోదశోఽధ్యాయః ॥ ౧౩ ॥*

---

1. క్షేత్రము జడము, వికారసహితము, క్షణికము, నశ్వరము అనియు, క్షేత్రజ్ఞుడు నిత్యుడు, చేతనుడు, వికారరహితుడు, శాశ్వతుడు అనియు తెలిసికొనుటయే వాటి తారతమ్యములను తెలిసికొనుటయగును.

॥ ఓం శ్రీపరమాత్మనే నమః ॥

# అథ చతుర్దశోఽధ్యాయః - గుణత్రయ విభాగయోగః

## (పదునాల్గవ అధ్యాయము-గుణత్రయవిభాగయోగము)

ముఖ్యాంశములు : [(1 నుండి 4వ శ్లోకము వఱకు) జ్ఞానమహిమ, ప్రకృతి పురుషులనుండి జగదుత్పత్తివివరణము, (5 నుండి 18 వఱకు) సత్త్వరజస్తమోగుణములప్రస్తావన, (19 నుండి 27 వఱకు) భగవత్ప్రాప్తికి ఉపాయము, గుణాతీత పురుషుని లక్షణములు.]

**శ్రీభగవాన్ ఉవాచ**

**పరం భూయః ప్రవక్ష్యామి జ్ఞానానాం జ్ఞానముత్తమమ్ ।**
**యద్ జ్ఞాత్వా మునయస్సర్వే పరాం సిద్ధిమితో గతాః ॥ 1 ॥**

పరమ్, భూయః, ప్రవక్ష్యామి, జ్ఞానానామ్, జ్ఞానమ్, ఉత్తమమ్,
యత్, జ్ఞాత్వా, మునయః, సర్వే, పరామ్, సిద్ధిమ్, ఇతః, గతాః ॥ 1 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| యత్, జ్ఞాత్వా | = | దేనిని తెలిసికొని నందువలన | జ్ఞానానామ్ | = | జ్ఞానము లన్నింటిలోను |
| సర్వే, మునయః | = | మునులందఱును | ఉత్తమమ్ | = | అత్యుత్తమమైనట్టి |
| ఇతః | = | ఈ సంసారము నుండి (ముక్తులై) | పరమ్, జ్ఞానమ్ | = | పరమ జ్ఞానమును గూర్చి |
| పరామ్, సిద్ధిమ్ | = | పరమసిద్ధిని | భూయః | = | మఱల |
| గతాః | = | పొందిరో అట్టి | ప్రవక్ష్యామి | = | (నేను) చెప్పెదను |

శ్రీ భగవానుడు పలికెను - జ్ఞానములలో అత్యుత్తమమైన పరమజ్ఞానమును నీకు మరల తెల్పబోవుచున్నాను. ఆ పరమజ్ఞానమును తెలిసికొనిన మునులు సంసార బంధములనుండి విముక్తులై పరమసిద్ధిని పొందిరి. (1)

**ఇదం జ్ఞానముపాశ్రిత్య మమ సాధర్మ్యమాగతాః ।**
**సర్గేఽపి నోపజాయంతే ప్రలయే న వ్యథంతి చ ॥ 2 ॥**

ఇదమ్, జ్ఞానమ్, ఉపాశ్రిత్య, మమ, సాధర్మ్యమ్, ఆగతాః,
సర్గే, అపి, న, ఉపజాయంతే, ప్రలయే, న, వ్యథంతి, చ ॥ 2 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| ఇదమ్, జ్ఞానమ్ | = | ఈ జ్ఞానమును | మమ, సాధర్మ్యమ్ | = | నా స్వరూపమునే |
| ఉపాశ్రిత్య | = | ఆశ్రయించి | | | |

| | | | |
|---|---|---|---|
| ఆగతాః | = పొందినవారు | చ | = మఱియు |
| సర్గే | = సృష్ట్యాదియందు | ప్రలయే, అపి | = ప్రళయకాలము నందును |
| న, ఉపజాయంతే | = మఱల ఉత్పన్నులు కారు | న, వ్యథంతి | = వ్యాకులతనొందరు |

ఈ జ్ఞానమును ఆశ్రయించినవారు నా స్వరూపమునే పొందుదురు. అట్టి పురుషులు సృష్ట్యాదియందు మఱల జన్మింపరు, ప్రళయకాలమున వ్యథనొందరు. (2)

**మమ యోనిర్మహద్బ్రహ్మ తస్మిన్ గర్భం దధామ్యహమ్ ।**
**సంభవః సర్వభూతానాం తతో భవతి భారత ॥ 3 ॥**

మమ, యోనిః, మహత్, బ్రహ్మ, తస్మిన్, గర్భమ్, దధామి, అహమ్,
సంభవః, సర్వభూతానామ్, తతః, భవతి, భారత ॥ 3 ॥

| | | | |
|---|---|---|---|
| భారత! | = అర్జునా! | గర్భమ్ | = చేతనసముదాయ రూప గర్భమును (బీజమును) |
| మమ, మహత్, బ్రహ్మ | = మహద్బ్రహ్మరూపమైన నా మూల ప్రకృతి | | |
| యోనిః | = సకల భూతములకును యోని, అనగా జన్మస్థానము | దధామి | = ఉంచెదను |
| | | తతః, | = ఆ జడచేతన సంయోగమువలన |
| అహమ్ | = నేను | సర్వభూతానామ్ | = సకలప్రాణులయొక్క |
| తస్మిన్ | = దానియందు | సంభవః, భవతి | = ఉత్పత్తి జరుగును |

ఓ అర్జునా! నా మహద్బ్రహ్మరూపమైన మూలప్రకృతి సర్వప్రాణులకు జన్మస్థానము. దానియందు చేతనసముదాయరూపమైన బీజమును ఉంచెదను (స్థాపన చేసెదను). ఆ జడచేతనసంయోగమువలననే సర్వభూతముల ఉత్పత్తి జరుగును. (3)

**సర్వయోనిషు కౌంతేయ మూర్తయః సంభవంతి యాః ।**
**తాసాం బ్రహ్మ మహద్యోనిః అహం బీజప్రదః పితా ॥ 4 ॥**

సర్వయోనిషు, కౌంతేయ, మూర్తయః, సంభవంతి, యాః,
తాసామ్, బ్రహ్మ, మహత్, యోనిః, అహమ్, బీజప్రదః, పితా ॥ 4 ॥

| | | | |
|---|---|---|---|
| కౌంతేయ! | = ఓ అర్జునా! | సంభవంతి | = పుట్టుచున్నవో, |
| సర్వయోనిషు | = నానాయోనులయందు | తాసామ్ | = వాటన్నింటికిని |
| యాః, మూర్తయః | = ఏ ప్రాణులు | మహద్బ్రహ్మ | = మూలప్రకృతియే |

| | | | |
|---|---|---|---|
| యోనిః | = జన్మను ఇచ్చెడి తల్లి | బీజప్రదః | = బీజమునుంచునట్టి |
| అహమ్ | = నేను | పితా | = తండ్రిని. |

ఓ అర్జునా! నానాయోనులయందు జన్మించు ప్రాణులను తనగర్భమున ధరించు మూలప్రకృతియే ఆ ప్రాణులకు తల్లి. బీజస్థాపనచేయు నేను వాటికి తండ్రిని. అనగా సర్వప్రాణులకును ప్రకృతియే తల్లి. నేనే జనకుడను. (4)

**సత్త్వం రజస్తమ ఇతి గుణాః ప్రకృతిసంభవాః ।**
**నిబధ్నంతి మహాబాహో దేహే దేహినమవ్యయమ్ ॥ 5 ॥**

సత్త్వమ్, రజః, తమః, ఇతి, గుణాః ప్రకృతిసంభవాః,
నిబధ్నంతి, మహాబాహో, దేహే, దేహినమ్, అవ్యయమ్ ॥ 5 ॥

| | | | |
|---|---|---|---|
| మహాబాహో! | = ఓ అర్జునా! | గుణాః | = మూడుగుణములు |
| సత్త్వమ్ | = సత్త్వగుణము | అవ్యయమ్ | = వినాశరహితుడైన |
| రజః | = రజోగుణము | దేహినమ్ | = జీవాత్మను |
| తమః, ఇతి | = తమోగుణము, అను | దేహే | = శరీరమునందు |
| ప్రకృతిసంభవాః | = ప్రకృతినుండి ఉత్పన్నములైన | నిబధ్నంతి | = బంధించుచున్నవి |

ఓ అర్జునా! ప్రకృతినుండి ఉత్పన్నములైన సత్త్వరజస్తమోగుణములు నాశములేని జీవాత్మను శరీరమున బంధించును. (5)

**తత్ర సత్త్వం నిర్మలత్వాత్ ప్రకాశకమనామయమ్ ।**
**సుఖసంగేన బధ్నాతి జ్ఞానసంగేన చానఘ ॥ 6 ॥**

తత్ర, సత్త్వమ్, నిర్మలత్వాత్, ప్రకాశకమ్, అనామయమ్,
సుఖసంగేన, బధ్నాతి, జ్ఞానసంగేన, చ, అనఘ ॥ 6 ॥

| | | | |
|---|---|---|---|
| అనఘ! | = ఓ పాపరహితుడా! | అనామయమ్ | = మఱియు వికార రహితమైనది (కాని అది) |
| తత్ర | = ఈ మూడు గుణములయందు | సుఖసంగేన | = సుఖసాంగత్యముతో |
| సత్త్వమ్ | = సత్త్వగుణము | చ | = మఱియు |
| నిర్మలత్వాత్ | = నిర్మలమగుటవలన | జ్ఞానసంగేన | = జ్ఞానాభిమానముతో |
| ప్రకాశకమ్ | = ప్రకాశమును (జ్ఞానమును) ఇచ్చునది | బధ్నాతి | = జీవుని బంధించును |

ఓ పాపరహితుడా! ఈ మూడింటిలో సత్త్వగుణము నిర్మలమైనది. కనుక, ప్రకాశకమైనది. వికారరహితమైనది. కాని, అది సుఖసాంగత్యము వలన జ్ఞానాభిమానము వలన మనుజుని బంధించును. (6)

**రజో రాగాత్మకం విద్ధి తృష్ణాసంగసముద్భవమ్ ।**
**తన్నిబధ్నాతి కౌంతేయ కర్మసంగేన దేహినమ్ ॥ 7 ॥**

రజః, రాగాత్మకమ్, విద్ధి, తృష్ణాసంగసముద్భవమ్,
తత్, నిబధ్నాతి, కౌంతేయ, కర్మసంగేన, దేహినమ్ ॥ 7 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| కౌంతేయ! | = | ఓ అర్జునా! | విద్ధి | = | ఎఱుంగుము |
| రాగాత్మకమ్ | = | రాగాత్మకమైన | తత్ | = | అది (ఆ రజోగుణము) |
| రజః | = | రజోగుణము | దేహినమ్ | = | జీవాత్మను |
| తృష్ణాసంగ-సముద్భవమ్ | = | కామము, ఆసక్తుల నుండి ఉత్పన్న మైనదని | కర్మసంగేన | = | కర్మలు, వాటి ఫలముల సాంగత్యముతో |
| | | | నిబధ్నాతి | = | బంధించును |

ఓ అర్జునా! రజోగుణము రాగాత్మకము. అది కామము, ఆసక్తులనుండి ఉత్పన్నమగునని యెఱుంగుము. అది జీవాత్మను కర్మలయొక్కయు, కర్మఫలముల యొక్కయు సాంగత్యముతో బంధించును. (7)

**తమస్త్వజ్ఞానజం విద్ధి మోహనం సర్వదేహినామ్ ।**
**ప్రమాదాలస్యనిద్రాభిః తన్నిబధ్నాతి భారత ॥ 8 ॥**

తమః, తు, అజ్ఞానజమ్, విద్ధి, మోహనమ్, సర్వదేహినామ్,
ప్రమాదాలస్యనిద్రాభిః, తత్, నిబధ్నాతి, భారత ॥ 8 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| భారత! | = | ఓ అర్జునా! | విద్ధి | = | తెలిసికొనుము |
| సర్వదేహినామ్ | = | దేహాభిమానముగల వారినందఱిని | తత్ | = | అది(ఆ తమోగుణము) |
| | | | (దేహినమ్) | = | (జీవాత్మను) |
| మోహనమ్ | = | మోహింపజేయు | ప్రమాద[1] ఆలస్య[2] నిద్రాభిః | = | ప్రమాదాలస్య నిద్రాదులతో |
| తమః, తు | = | తమోగుణమయితే | | | |
| అజ్ఞానజమ్ | = | అజ్ఞానమునుండి ఉత్పన్నమైనదానినిగా | నిబధ్నాతి | = | బంధించును |

1. ఇంద్రియాంతఃకరణముల వ్యర్థచేష్టలను 'ప్రమాదము' అని అందురు.
2. కర్తవ్య కర్మలయందు ప్రవృత్తుడు కాకుండ,ప్రయత్నింపకయుండుటను 'ఆలస్యము' అని యందురు.

అర్జునా! తమోగుణము సకలదేహాభిమానులను మోహితులనుగా చేయును. అజ్ఞానమువలన జనించును. అది జీవాత్మను ప్రమాదాలస్యనిద్రాదులతో బంధించును. (8)

**సత్త్వం సుఖే సంజయతి రజః కర్మణి భారత ।**
**జ్ఞానమావృత్య తు తమః ప్రమాదే సంజయత్యుత ॥ 9 ॥**

సత్త్వమ్, సుఖే, సంజయతి, రజః, కర్మణి, భారత,
జ్ఞానమ్, ఆవృత్య, తు, తమః, ప్రమాదే, సంజయతి, ఉత ॥ 9 ॥

| | | | |
|---|---|---|---|
| భారత! | = ఓ అర్జునా! | (సంజయతి) | = నిమగ్నమొనర్చును |
| సత్త్వమ్ | = సత్త్వగుణము (జీవుని) | తమః, తు | = (అట్లే) తమోగుణమయితే |
| సుఖే | = సుఖమునందు | జ్ఞానమ్ | = జ్ఞానమును |
| సంజయతి | = నిమగ్నముచేయును | ఆవృత్య | = కప్పివేసి |
| రజః | = రజోగుణము | ప్రమాదే, ఉత | = ప్రమాదాదులలోను |
| కర్మణి | = కర్మ యందు | సంజయతి | = ముంచివేయును |

ఓ అర్జునా! సత్త్వగుణము జీవుని సుఖములలో నిమగ్నము చేయును. రజోగుణము కర్మలయందు నిమగ్నునిగా చేయును. తమోగుణము జ్ఞానమును కప్పివేసి ప్రమాదాదులలో ముంచివేయును. (9)

**రజస్తమశ్చాభిభూయ సత్త్వం భవతి భారత ।**
**రజఃసత్త్వం తమశ్చైవ తమః సత్త్వం రజస్తథా ॥ 10 ॥**

రజః, తమః, చ, అభిభూయ, సత్త్వమ్, భవతి, భారత,
రజః, సత్త్వమ్, తమః, చ, ఏవ, తమః, సత్త్వమ్, రజః, తథా ॥ 10 ॥

| | | | |
|---|---|---|---|
| భారత! | = ఓ అర్జునా! | రజః | = రజోగుణము (వృద్ధి చెందును) |
| రజః | = రజోగుణమును (మఱియు) | తథా, ఏవ | = అట్లే |
| తమశ్చ | = తమోగుణమును | సత్త్వమ్ | = సత్త్వగుణమును |
| అభిభూయ | = అణచివేసి | | |
| సత్త్వమ్ | = సత్త్వగుణము (వృద్ధిచెందును) | రజశ్చ | = మఱియు రజోగుణమును (అణచివేసి) |
| సత్త్వమ్ | = సత్త్వగుణమును | | |
| చ | = మఱియు | | |
| తమః | = తమోగుణమును (అణచి వేసి) | తమః, భవతి | = తమోగుణము వృద్ధిచెందును |

ఓ అర్జునా! రజస్తమోగుణములనణచి సత్త్వగుణము వృద్ధిచెందును. సత్త్వతమోగుణములనణచి రజోగుణము వృద్ధిచెందును. అట్లే సత్త్వరజో గుణములనణచి తమోగుణము వృద్ధియగును. (10)

**సర్వద్వారేషు దేహేఽస్మిన్ ప్రకాశ ఉపజాయతే ।**
**జ్ఞానం యదా తదా విద్యాత్ వివృద్ధం సత్త్వమిత్యుత ॥ 11 ॥**

సర్వద్వారేషు, దేహే, అస్మిన్, ప్రకాశః, ఉపజాయతే,
జ్ఞానమ్, యదా, తదా, విద్యాత్, వివృద్ధమ్, సత్త్వమ్, ఇతి, ఉత ॥ 11 ॥

| | | | |
|---|---|---|---|
| యదా | = ఏ సమయమునందు | ఉపజాయతే | = ఏర్పడునో |
| అస్మిన్, దేహే | = ఈ దేహమునందు | తదా | = అప్పుడు |
| సర్వద్వారేషు | = అంతఃకరణేంద్రియముల యందును | సత్త్వమ్, ఉత | = సత్త్వగుణము |
| ప్రకాశః | = చైతన్యము (మఱియు) | వివృద్ధమ్, ఇతి | = వృద్ధి చెందినదని |
| జ్ఞానమ్ | = వివేకశక్తి | విద్యాత్ | = తెలిసికొనవలెను |

శరీరేంద్రియములయందును, అంతఃకరణమునందును చైతన్యము, వివేకశక్తి ఉత్పన్నములైనప్పుడు, అతనిలో సత్త్వగుణము వృద్ధిచెందినదని తలంపవలెను. (11)

**లోభః ప్రవృత్తిరారంభః కర్మణామశమః స్పృహా ।**
**రజస్యేతాని జాయంతే వివృద్ధే భరతర్షభ ॥ 12 ॥**

లోభః, ప్రవృత్తిః, ఆరంభః, కర్మణామ్, అశమః, స్పృహా,
రజసి, ఏతాని, జాయంతే, వివృద్ధే, భరతర్షభ ॥ 12 ॥

| | | | |
|---|---|---|---|
| భరతర్షభ | = ఓ అర్జునా! | అశమః | = అశాంతి (మఱియు) |
| రజసి | = రజోగుణము | | |
| వివృద్ధే | = వృద్ధియైనప్పుడు | స్పృహా | = విషయభోగలాలస |
| లోభః, ప్రవృత్తిః | = లోభము, మరియు ప్రాపంచిక కర్మలయందుప్రవృత్తి | ఏతాని | = ఈ మొదలగునవి అన్నియును |
| కర్మణామ్, ఆరంభః | = స్వార్థబుద్ధితో కర్మలయొక్క ఆరంభము | జాయంతే | = కలుగును |

ఓ అర్జునా! రజోగుణము వృద్ధియైనప్పుడు లోభము, ప్రవృత్తి(ప్రాపంచిక విషయములయందు ఆసక్తి) స్వార్థబుద్ధితో సకామభావముతో కర్మాచరణము, అశాంతి, విషయభోగములయందు లాలస అనునవి ఉత్పన్నములగుచుండును. (12)

**అప్రకాశోఽప్రవృత్తిశ్చ ప్రమాదో మోహ ఏవ చ ।**
**తమస్యేతాని జాయంతే వివృద్ధే కురునందన ॥ 13 ॥**

అప్రకాశః, అప్రవృత్తిః, చ, ప్రమాదః, మోహః, ఏవ, చ,
తమసి, ఏతాని, జాయంతే, వివృద్ధే, కురునందన ॥ 13 ॥

| | | | |
|---|---|---|---|
| కురునందన! | = ఓ అర్జునా! | చ | = అట్లే |
| తమసి | = తమోగుణము | ప్రమాదః | = వ్యర్థచేష్టలు |
| వివృద్ధే | = వృద్ధియగుచున్నప్పుడు | చ | = మఱియు |
| అప్రకాశః | = (అంతఃకరణేంద్రియముల యందు) అప్రకాశము | మోహః | = నిద్రాది మోహవృత్తులు |
| అప్రవృత్తిః | = కర్తవ్య కర్మలయందు విముఖత | ఏతాని, ఏవ | = ఈ మొదలగునవి |
| | | జాయంతే | = కలుగును |

ఓ అర్జునా! తమోగుణము అధికమైనప్పుడు అంతఃకరణమునందును, ఇంద్రియములయందును వివేకశక్తి నష్టమగును. కర్తవ్యకర్మలయందు విముఖత, ప్రమాదము అనగా అంతఃకరణమును మోహింపజేయు వ్యర్థచేష్టలు, నిద్రాదివృత్తులు మొదలగునవి ఉత్పన్నములగుచుండును. (13)

**యదా సత్త్వే ప్రవృద్ధే తు ప్రలయం యాతి దేహభృత్ ।**
**తదోత్తమవిదాం లోకాన్ అమలాన్ ప్రతిపద్యతే ॥ 14 ॥**

యదా, సత్త్వే, ప్రవృద్ధే, తు, ప్రలయమ్, యాతి, దేహభృత్,
తదా, ఉత్తమవిదామ్, లోకాన్, అమలాన్, ప్రతిపద్యతే ॥ 14 ॥

| | | | |
|---|---|---|---|
| యదా | = ఎప్పుడు | తదా, తు | = అప్పుడైతే |
| దేహభృత్ | = మనుష్యుడు | ఉత్తమవిదామ్ | = ఉత్తమ కర్మల నాచరించువారు వెళ్ళునట్టి |
| సత్త్వే, ప్రవృద్ధే | = సత్త్వగుణము వృద్ధి చెందుచున్నప్పుడు | అమలాన్ | = నిర్మలములైన |
| ప్రలయమ్, యాతి | = మృతి చెందునో | లోకాన్ | = స్వర్గాది దివ్యలోకములను |
| | | ప్రతిపద్యతే | = పొందును |

సత్త్వగుణము వృద్ధిచెందినపుడు మనుజుడు మరణించినచో, అతడు ఉత్తమ కర్మలను ఆచరించువారుచేరెడి నిర్మలములైన స్వర్గాది దివ్యలోకములను పొందును. (14)

**రజసి ప్రలయం గత్వా కర్మసంగిషు జాయతే ।**
**తథా ప్రలీనస్తమసి మూఢయోనిషు జాయతే ॥ 15 ॥**

రజసి, ప్రలయమ్, గత్వా, కర్మసంగిషు, జాయతే,
తథా, ప్రలీనః, తమసి, మూఢయోనిషు, జాయతే ॥ 15 ॥

| | | | |
|---|---|---|---|
| రజసి[1] | = రజోగుణము వృద్ధి చెందుచున్నప్పుడు | తమసి | = తమోగుణము వృద్ధి చెందునప్పుడు |
| ప్రలయమ్, గత్వా | = మృతిచెందినవాడు | ప్రలీనః | = మరణించినవాడు |
| కర్మసంగిషు | = కర్మాసక్తులైన మనుష్యులయందు | మూఢయోనిషు | = పశుపక్షికీటకాది మూఢయోనుల యందు |
| జాయతే | = పుట్టును | | |
| తథా | = అట్లే | జాయతే | = జన్మించును. |

రజోగుణము వృద్ధిచెందినపుడు మృత్యువు ప్రాప్తించినచో, అతడు కర్మాసక్తులైన మానవులలో జన్మించును. అట్లే తమోగుణము వృద్ధిచెందినప్పుడు మృతిచెందిన మానవుడు పశుపక్షికీటకాది నీచయోనులలో జన్మించుచుండును. (15)

**కర్మణః సుకృతస్యాహుః సాత్త్వికం నిర్మలం ఫలమ్ ।**
**రజసస్తు ఫలం దుఃఖమ్ అజ్ఞానం తమసః ఫలమ్ ॥ 16 ॥**

కర్మణః, సుకృతస్య, ఆహుః, సాత్త్వికమ్, నిర్మలమ్, ఫలమ్,
రజసః, తు, ఫలమ్, దుఃఖమ్, అజ్ఞానమ్, తమసః, ఫలమ్ ॥ 16 ॥

| | | | |
|---|---|---|---|
| సుకృతస్య, కర్మణః | = శ్రేష్ఠమైన కర్మకు | రజసః | = రాజసకర్మకు |
| సాత్త్వికమ్ | = సుఖ, జ్ఞాన, వైరాగ్యాది సాత్త్వికమైన | ఫలమ్ | = ఫలము |
| | | దుఃఖమ్ | = దుఃఖము అనియు |
| నిర్మలమ్, ఫలమ్ | = నిర్మలమైన ఫలము లభించునని | తమసః | = తామసకర్మకు |
| | | ఫలమ్ | = ఫలము |
| ఆహుః | = అందురు | అజ్ఞానమ్ | = అజ్ఞానము అనియు |
| తు | = కాని | (ఆహుః) | = అందురు |

1. రజోగుణము వృద్ధి చెందుకాలము

శ్రేష్ఠములైన కర్మలను ఆచరించుటవలన సాత్త్వికఫలము అనగా సుఖము, జ్ఞానము, వైరాగ్యము మొదలగు నిర్మలఫలములు కలుగును. రాజసకర్మలకు ఫలము దుఃఖము. తామసకర్మలకు ఫలము అజ్ఞానము. (16)

**సత్త్వాత్ సంజాయతే జ్ఞానం రజసో లోభ ఏవ చ ।**
**ప్రమాదమోహౌ తమసో భవతోఽజ్ఞానమేవ చ ॥ 17 ॥**

సత్త్వాత్, సంజాయతే, జ్ఞానమ్, రజసః, లోభః, ఏవ, చ,
ప్రమాదమోహౌ, తమసః, భవతః, అజ్ఞానమ్, ఏవ, చ ॥ 17 ॥

| | | | |
|---|---|---|---|
| సత్త్వాత్ | = సత్త్వగుణమునుండి | చ | = అట్లే |
| జ్ఞానమ్ | = జ్ఞానము | తమసః | = తమోగుణమునుండి |
| సంజాయతే | = కలుగును | ప్రమాదమోహౌ | = ప్రమాద మోహములు |
| చ | = మఱియు | భవతః | = కలుగును, మఱియు |
| రజసః | = రజోగుణమునుండి | అజ్ఞానమ్, ఏవ | = అజ్ఞానము, కూడ |
| లోభః, ఏవ | = నిస్సందేహముగా లోభము | (భవతి) | = కలుగును |

సత్త్వగుణమువలన జ్ఞానమూ, రజోగుణమువలన లోభమూ, తమోగుణమువలన ప్రమాదమోహాదులూ, అజ్ఞానమూ, తప్పక ఉత్పన్నములగుచుండును. (17)

**ఊర్ధ్వం గచ్ఛంతి సత్త్వస్థా మధ్యే తిష్ఠంతి రాజసాః ।**
**జఘన్యగుణవృత్తిస్థా అధో గచ్ఛంతి తామసాః ॥ 18 ॥**

ఊర్ధ్వమ్, గచ్ఛంతి, సత్త్వస్థాః, మధ్యే, తిష్ఠంతి, రాజసాః,
జఘన్యగుణవృత్తిస్థాః, అధః, గచ్ఛంతి, తామసాః ॥ 18 ॥

| | | | |
|---|---|---|---|
| సత్త్వస్థాః | = సత్త్వగుణ ప్రధానులు | జఘన్యగుణ వృత్తిస్థాః | = తమోగుణ కార్యములైన నిద్రా ప్రమాదాలస్యములందు స్థితమైనట్టి |
| ఊర్ధ్వమ్, గచ్ఛంతి | = స్వర్గాది-ఊర్ధ్వ లోకములను పొందుదురు | | |
| రాజసాః | = రాజసపురుషులు | తామసాః | = తామస పురుషులు |
| మధ్యే | = మధ్య (మానవ) లోకమున | అధః | = అధోగతులను (అనగా పశుకీటకాది జన్మలను (నరకములను) |
| తిష్ఠంతి | = ఉందురు (జన్మింతురు) | గచ్ఛంతి | = పొందుదురు. |

సత్త్వగుణస్థితులు స్వర్గాది - ఊర్ధ్వలోకములకు పోవుదురు. రజోగుణస్థితులైన (రాజస) పురుషులు మధ్య (మానవ) లోకమునందే ఉందురు. తమోగుణ కార్యరూపములైన నిద్రాప్రమాదాలస్యాదులయందు స్థితులైనవారు అధోగతిని అనగా కీట, పశుపక్ష్యాది యోనులను, నరకములను పొందుదురు. (18)

**నాన్యం గుణేభ్యః కర్తారం యదా ద్రష్టానుపశ్యతి ।**
**గుణేభ్యశ్చ పరం వేత్తి మద్భావం సోఽధిగచ్ఛతి ॥ 19 ॥**

న, అన్యమ్, గుణేభ్యః, కర్తారమ్, యదా, ద్రష్టా, అనుపశ్యతి,
గుణేభ్యః, చ, పరమ్, వేత్తి, మద్భావమ్, సః, అధిగచ్ఛతి ॥ 19 ॥

| | | | |
|---|---|---|---|
| యదా | = ఎప్పుడైతే | పరమ్ | = అతీతుడైన సచ్చిదానంద ఘన పరమాత్మను |
| ద్రష్టా[1] | = ద్రష్టయైనవాడు | వేత్తి | = యథార్థముగా తెలిసికొనునో (అప్పుడు) |
| గుణేభ్యః | = మూడు గుణములను తప్ప | సః | = అతడు |
| అన్యమ్, కర్తారమ్ | = మఱియొక దానిని కర్తగా | మద్భావమ్ | = నా స్వరూపమునే |
| న, అనుపశ్యతి | = చూడడో | అధిగచ్ఛతి | = పొందును |
| చ | = మఱియు | | |
| గుణేభ్యః | = మూడు గుణముల కంటెను | | |

ద్రష్టయైనవాడు గుణములే గుణములయందు వర్తించుచున్నవనియూ, త్రిగుణములుతప్ప వేఱుగా కర్తలు లేరనియూ తెలిసికొని, త్రిగుణములకు అతీతముగానున్న సచ్చిదానంద ఘనపరమాత్మస్వరూపుడవైన నా తత్త్వమును తెలిసికొనును. అప్పుడతడు నా స్వరూపమునే పొందును. (19)

**గుణానేతానతీత్య త్రీన్ దేహీ దేహసముద్భవాన్ ।**
**జన్మమృత్యుజరాదుఃఖైః విముక్తోఽమృతమశ్నుతే ॥ 20 ॥**

గుణాన్, ఏతాన్, అతీత్య, త్రీన్, దేహీ, దేహసముద్భవాన్,
జన్మమృత్యుజరాదుఃఖైః, విముక్తః, అమృతమ్, అశ్నుతే ॥ 20 ॥

1. సమష్టి చేతనయందు ఏకీభావముతో స్థితుడైన సాక్షిభూతుడైన పురుషుడు.

| | | | |
|---|---|---|---|
| దేహీ | = పురుషుడు | జన్మమృత్యు జరాదుఃఖైః | = జన్మ, మృత్యు, వార్ధక్యములవలన కలుగు వివిధ దుఃఖముల నుండి |
| దేహ సముద్భవాన్[1] | = శరీరము యొక్క ఉత్పత్తికి కారణములైన | విముక్తః | = విముక్తుడై |
| ఏతాన్, త్రీన్, గుణాన్ | = ఈ మూడు గుణములను | అమృతమ్ | = పరమానందమును (మోక్షమును) |
| అతీత్య | = అధిగమించినచో | అశ్నుతే | = పొందును. |

దేహోత్పత్తికి కారణరూపములైన ఈ మూడు గుణములను అధిగమించిన పురుషుడు జన్మ, మృత్యు, జరా(వార్ధక్య), దుఃఖములనుండి విముక్తుడై, పరమానందమును పొందును. (20)

**అర్జున ఉవాచ**

**కైర్లింగైః త్రీన్ గుణానేతాన్ అతీతో భవతి ప్రభో ।**
**కిమాచారః కథం చైతాన్ త్రీన్ గుణానతివర్తతే ॥ 21 ॥**

కైః, లింగైః, త్రీన్, గుణాన్, ఏతాన్, అతీతః, భవతి, ప్రభో, కిమాచారః, కథమ్, చ, ఏతాన్, త్రీన్, గుణాన్, అతివర్తతే ॥ 21 ॥

| | | | |
|---|---|---|---|
| ప్రభో! | = ఓ ప్రభూ! | చ | = మఱియు |
| ఏతాన్ | = ఈ | కిమాచారః (భవతి) | = ఎట్టి ఆచరణములను కలిగియుండును? |
| త్రీన్, గుణాన్ | = మూడు గుణములను | ఏతాన్, త్రీన్ గుణాన్ | = (మనుష్యుడు) ఈ మూడు గుణములను |
| అతీతః | = అధిగమించిన పురుషుడు | కథమ్ | = ఎట్లు |
| కైః, లింగైః | = ఏయే లక్షణములతో (కూడి) | అతివర్తతే | = అధిగమించును? |
| భవతి | = ఉండును | | |

అర్జునుడు పలికెను - ఓ ప్రభూ! ఈ మూడు గుణములకును అతీతుడైనవాని లక్షణములెవ్వి? అతని లోకవ్యవహారరీతి యెట్లుండును? మనుష్యుడు త్రిగుణాతీతుడగుటకు ఉపాయమేమి? (21)

1. మనోబుద్ధ్యహంకారములు, పంచజ్ఞానేంద్రియములు, పంచకర్మేంద్రియములు, పంచమహాభూతములు, ఐదు ఇంద్రియవిషయములు అను 23 తత్త్వములు, పిండరూపమైన శరీరము ప్రకృతిగుణముల కార్యము. కనుక ఈ మూడు గుణములు ఉత్పత్తికి కారణములు

**శ్రీభగవాన్ ఉవాచ**

**ప్రకాశం చ ప్రవృత్తిం చ మోహమేవ చ పాండవ ।**
**న ద్వేష్టి సంప్రవృత్తాని న నివృత్తాని కాంక్షతి ॥ 22 ॥**

ప్రకాశమ్, చ, ప్రవృత్తిమ్, చ, మోహమ్, ఏవ, చ, పాండవ,
న, ద్వేష్టి, సంప్రవృత్తాని, న, నివృత్తాని, కాంక్షతి ॥ 22 ॥

| | | | |
|---|---|---|---|
| పాండవ! | = ఓ అర్జునా! (ఏ పురుషుడైతే) | సంప్రవృత్తాని | = ఏర్పడినప్పుడు |
| ప్రకాశమ్[1] చ | = సత్త్వగుణకార్య రూపమైన ప్రకాశమూ | న, ద్వేష్టి | = వాటిని ద్వేషింపడో |
| ప్రవృత్తిమ్, చ | = రజోగుణకార్యరూపమైన ప్రవృత్తియు | చ | = మఱియు |
| మోహమ్[2], ఏవ | = తమోగుణకార్య రూపమైన మోహమూ | నివృత్తాని | = అవి తొలగి పోయినప్పుడు |
| | | న, కాంక్షతి[3] | = వాటికై ఆరాటపడడో.. |

శ్రీ భగవానుడు పలికెను - ఓ పాండవా! సత్త్వగుణకార్యరూపమైన ప్రకాశము, రజోగుణకార్యరూపమైన ప్రవృత్తి, తమోగుణ కార్యరూపమైన మోహము, తమంతట తామే ఏర్పడినప్పుడు త్రిగుణాతీతుడు ద్వేషింపడు - అనగా వాటిని గూర్చి విచారపడడు. అట్లే అవి తొలగిపోయినప్పుడు వాటికై కాంక్షపడడు - అనగా ఎల్లప్పుడును ఒకే స్థితిలోనుండును. (22)

**ఉదాసీనవదాసీనో గుణైర్యో న విచాల్యతే ।**
**గుణా వర్తంత ఇత్యేవ యోఽవతిష్ఠతి నేంగతే ॥ 23 ॥**

1. అంతఃకరణేంద్రియములయందు అలసభావము (సోమరితనము) లేకుండ ఒక విధమైన చేతనత్వమును 'ప్రకాశము' అని యందురు.
2. నిద్ర, ఆలస్యాదులబాహుళ్యముచే అంతఃకరణేంద్రియములయందలి చేతనశక్తి లయమగుటనే ఇచట 'మోహము'గా గ్రహింపవలెను.
3. సచ్చిదానందఘనపరమాత్మయందు నిత్యము ఏకీభావస్థితుడైయున్న పురుషుడు ఈ త్రిగుణమయ మాయారూపమైన జగత్తునకు సర్వథా అతీతుడై యుండును. అట్టి గుణాతీతుడైన పురుషుని అభిమానరహితమైన అంతఃకరణమునందు త్రిగుణముల కార్యరూపములైన ప్రకాశప్రవృత్తిమోహాదులవృత్తులు ప్రకటితములైనను కాకున్నను ఏకాలమునందైనను ఇచ్ఛాద్వేషాదివికారములు కలుగవు. త్రిగుణాతీతుడైనవాని ప్రధానలక్షణములు ఇవియే.

ఉదాసీనవత్, ఆసీనః, గుణైః, యః, న, విచాల్యతే,
గుణాః, వర్తంతే, ఇతి, ఏవ, యః, అవతిష్ఠతి, న, ఇంగతే ॥ 23 ॥

| | | | |
|---|---|---|---|
| యః | = ఎవడైతే | ఇతి | = అని భావించి |
| ఉదాసీనవత్ | = ఉదాసీనుని (సాక్షి)వలె | యః | = ఎవడు (సచ్చిదానంద ఘనపరమాత్మ యందు ఏకీ భావముతో) |
| ఆసీనః | = స్థితుడై యుండునో | | |
| గుణైః | = త్రిగుణములచే | | |
| న, విచాల్యతే | = చలింపజేయబడడో (మఱియు) | అవతిష్ఠతి | = స్థితుడైయుండునో మఱియు |
| గుణాః, ఏవ | = గుణములే | | |
| వర్తంతే[1] | = (గుణములయందు) ప్రవర్తించుచున్నవి | న, ఇంగతే | = ఆ స్థితినుండి ఎన్నడును చలింపడో |

త్రిగుణములకును, వాటి కార్యరూపములైన శరీరేంద్రియాంతఃకరణ వ్యాపారములకును ఏమాత్రము చలింపక, త్రిగుణాతీతుడు, ఉదాసీనుని వలె(సాక్షివలె) ఉండును. గుణములే గుణములయందు ప్రవర్తించుచున్నవని తలంచును. అతడు సచ్చిదానందఘనపరమాత్మయందు ఏకీభావస్థితుడై యుండును. ఈ స్థితినుండి ఎన్నడును చలింపడు. (23)

**సమదుఃఖసుఖః స్వస్థః సమలోష్టాశ్మకాంచనః ।**
**తుల్యప్రియాప్రియో ధీరః తుల్యనిందాత్మసంస్తుతిః ॥ 24 ॥**

సమదుఃఖసుఖః, స్వస్థః, సమలోష్టాశ్మకాంచనః,
తుల్యప్రియాప్రియః, ధీరః, తుల్యనిందాత్మసంస్తుతిః ॥ 24 ॥

| | | | |
|---|---|---|---|
| స్వస్థః | = ఎవడు నిరంతరము ఆత్మభావమునందే స్థితుడై | సమలోష్టాశ్మ కాంచనః | = మట్టి, ఱాయి, బంగారములను సమానముగా భావించు నట్టి |
| సమదుఃఖసుఖః | = సుఖదుఃఖములను సమానముగా భావించినవాడై | ధీరః | = జ్ఞాని |

1. త్రిగుణమయమాయనుండి ఉత్పన్నములైన అంతఃకరణము, ఇంద్రియములు, తమతమ విషయములయందు చరించుటయే గుణములు గుణములయందు వర్తించుట యగును.

| | | | |
|---|---|---|---|
| తుల్యప్రియా ప్రియః | = ప్రియాప్రియము లను సమానముగా చూచువాడును | తుల్యనిందాత్మ సంస్తుతిః | = నిందాస్తుతుల యందును సమానభావము గల్గి యుండువాడును |

త్రిగుణాతీతుడు స్వస్వరూపమునందే నిరంతరము స్థితుడై యుండును. సుఖదుఃఖములను సమానముగా భావించును. మట్టి, రాయి, బంగారములయందు సమభావమునే కలిగియుండును. అనగా ఆ మూడింటియందును గ్రాహ్యత్యాజ్య భావములను కలిగియుండడు. అతడే ధీరుడైన జ్ఞాని. ప్రియాప్రియములకుగాని, నిందాస్తుతులకు గాని తొణకడు. అనగా రెండింటియందును సమస్థితిలోనే యుండును. (24)

**మానావమానయోస్తుల్యః తుల్యో మిత్రారిపక్షయోః ।**
**సర్వారంభపరిత్యాగీ గుణాతీతః స ఉచ్యతే ॥ 25 ॥**

మానావమానయోః, తుల్యః, తుల్యః, మిత్రారిపక్షయోః,
సర్వారంభపరిత్యాగీ, గుణాతీతః, సః, ఉచ్యతే ॥ 25 ॥

| | | | |
|---|---|---|---|
| మానావ మానయోః, తుల్యః | = మానావమానములను సమానముగా తలంచువాడును అగు | సర్వారంభ పరిత్యాగీ | = కర్మాచరణముల యందు కర్తృత్వాభి మానము లేనివాడును |
| మిత్రారిపక్షయోః, తుల్యః | = మిత్రులయెడను, శత్రువులయెడను సమానముగా ఉండువాడును | సః | = అట్టి పురుషుడు |
| | | గుణాతీతః | = త్రిగుణములకు అతీతుడని |
| | | ఉచ్యతే | = పేర్కొనబడును |

మానావమానములయందును, మిత్రులయందును, శత్రువులయందును సమభావముతో ప్రవర్తించువాడును, విధ్యుక్తకర్మలను ఆచరించుచు కర్తృత్వాభిమానము లేనివాడును త్రిగుణాతీతుడనబడును. (25)

**మాం చ యోఽవ్యభిచారేణ భక్తియోగేన సేవతే ।**
**స గుణాన్ సమతీత్యైతాన్ బ్రహ్మభూయాయ కల్పతే ॥ 26 ॥**

మామ్, చ, యః, అవ్యభిచారేణ, భక్తియోగేన, సేవతే,
సః, గుణాన్, సమతీత్య, ఏతాన్, బ్రహ్మభూయాయ, కల్పతే ॥ 26 ॥

| | | | |
|---|---|---|---|
| చ | = మఱియు | సః | = అతడుగూడ |
| యః | = ఏ పురుషుడు | ఏతాన్, గుణాన్ | = ఈ మూడు గుణములను |
| అవ్యభిచారేణ, భక్తియోగేన[1] | = అనన్య భక్తియోగముద్వారా | సమతీత్య | = పూర్తిగా అధిగమించి |
| మామ్, సేవతే | = నన్ను, నిరంతరము భజించునో | బ్రహ్మ భూయాయ | = సచ్చిదానంద ఘన ప్రాప్తికై |
| | | కల్పతే | = అర్హుడగును |

అనన్య (నిర్మలమైన) భక్తియోగముద్వారా నన్నే నిరంతరము భజించువాడును, ఈ మూడు గుణములకును పూర్తిగా అతీతుడైనవాడును అగు పురుషుడు సచ్చిదానంద ఘనపరబ్రహ్మ ప్రాప్తికి అర్హుడగును. (26)

**బ్రహ్మణో హి ప్రతిష్ఠాహమ్ అమృతస్యావ్యయస్య చ ।**
**శాశ్వతస్య చ ధర్మస్య సుఖస్యైకాంతికస్య చ ॥ 27 ॥**

బ్రహ్మణః, హి, ప్రతిష్ఠా, అహమ్, అమృతస్య అవ్యయస్య, చ,
శాశ్వతస్య, చ, ధర్మస్య, సుఖస్య, ఐకాంతికస్య, చ ॥ 27 ॥

| | | | |
|---|---|---|---|
| హి | = ఏలనన | శాశ్వతస్య, ధర్మస్య, చ | = సనాతనమైన ధర్మమునకును |
| అవ్యయస్య | = నాశరహితుడైనట్టి | ఐకాంతికస్య, సుఖస్య | = అఖండానందమునకును |
| బ్రహ్మణః, చ | = పరబ్రహ్మకును | | |
| అమృతస్య, చ | = అమృతత్వమునకును | అహమ్, ప్రతిష్ఠా | = నేనే ఆధారమును |

ఏలనన, అట్టి శాశ్వతపరబ్రహ్మకును, అమృతత్వమునకును, సనాతన ధర్మమునకును, అఖండానందమునకును నేనే ఆధారము. (27)

*ఓం తత్సదితి శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం*
*యోగశాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే గుణత్రయవిభాగయోగో*
*నామ చతుర్దశోఽధ్యాయః ॥ ౧౪ ॥*

1. సర్వశక్తిమంతుడును, పరమేశ్వరుడును ఐన వాసుదేవుడొక్కడే తన స్వామియని భావించి, స్వార్థమును, అభిమానమును త్యజించి, అత్యంతశ్రద్ధాభక్తులతో నిరంతరము అతనిని చింతన చేయుటయే "అనన్యభక్తియోగము" అనబడును.

॥ ఓం శ్రీపరమాత్మనే నమః ॥

# అథ పంచదశోఽధ్యాయః - పురుషోత్తమయోగః

## (పదునైదవ అధ్యాయము-పురుషోత్తమ యోగము)

ముఖ్యాంశములు : [(1 నుండి 6వ శ్లోకము వఱకు) సంసార వృక్ష కథనము, మఱియు భగవత్ప్రాప్తికి ఉపాయములు, (7 నుండి 11 వఱకు) జీవాత్మవిషయము, (12 నుండి 15 వఱకు) పరమేశ్వరుని ప్రభావస్వరూపవిషయ వర్ణనము (16 నుండి 20 వఱకు) క్షర-అక్షర, పురుషోత్తముల ప్రస్తావన.]

### శ్రీభగవాన్ ఉవాచ

**ఊర్ధ్వమూలమధశ్శాఖమ్ అశ్వత్థం ప్రాహురవ్యయమ్ ।**
**ఛందాంసి యస్య పర్ణాని యస్తం వేద స వేదవిత్ ॥ 1 ॥**

ఊర్ధ్వమూలమ్, అధః శ్శాఖమ్, అశ్వత్థమ్, ప్రాహుః, అవ్యయమ్,
ఛందాంసి, యస్య, పర్ణాని, యః, తమ్, వేద, సః, వేదవిత్ ॥ 1 ॥

| | | | |
|---|---|---|---|
| ఊర్ధ్వమూలమ్(1) = | ఆదిపురుషుడైన పరమేశ్వరుడే మూలముగాను | అశ్వత్థమ్ = | సంసారరూపమైన అశ్వత్థవృక్షము (రావిచెట్టు)ను |
| అధశ్శాఖమ్(2) = | బ్రహ్మయే ముఖ్యశాఖగాను కలిగిన | అవ్యయమ్(3) = | శాశ్వతమైనదానినిగా |
| | | ప్రాహుః = | పేర్కొందురు |
| | | ఛందాంసి(4) = | వేదములు |

1. ఆదిపురుషుడైన నారాయణుడే వాసుదేవుడు. అతడు నిత్యుడు, అనంతుడు, అందఱికిని ఆధారమైనవాడు, ఉన్నతోన్నతమైన నిత్య(వైకుంఠ) ధామమున సగుణరూపమున నివసించుచుండువాడు. ఆ మాయాపతి సర్వశక్తిమంతుడైన పరమేశ్వరుడు. అతడే ఈ సంసారవృక్షమునకు కారణమగుటవలన ఆయన 'ఊర్ధ్వమూలము'గా పేర్కొనబడెను.
2. ఆ పరమేశ్వరునినుండి ఉత్పన్నమై, అతనినిత్యధామమునకు అధోభాగమున బ్రహ్మలోకమునందు హిరణ్యగర్భుడైన బ్రహ్మ నివసించుచుండును. అతడే ఈ జగత్తును విస్తృతపఱచు ముఖ్యశాఖ. కనుక అతడు ఈ సంసార వృక్షమునకు 'అధశ్శాఖ'గా పేర్కొనబడెను.
3. ఈ వృక్షమునకుమూలకారణమైన పరమాత్మ అవ్యయుడు మఱియు ఇది అనాది కాలమునుండియు అవిచ్ఛిన్నముగా వచ్చుచున్నది. కనుక ఈ సంసారవృక్షమును, 'అవ్యయమ్', అని పేర్కొనుట జరిగెను.
4. ఈ వృక్షమునకు శాఖారూపమైన బ్రహ్మవలన ప్రకటితమైనవి వేదములు. అవి యజ్ఞాదికర్మలద్వారా ఈ వృక్షమును రక్షించి వృద్ధిచేయును. మఱియు దాని శోభను పెంచును. కనుక వేదములను 'పర్ణములు'ని పేర్కొనుట జరిగినది.

| | | | | | |
|---|---|---|---|---|---|
| యస్య, పర్ణాని | = | దేనియొక్క ఆకులో | వేద | = | (సమగ్రముగా) తెలిసికొనునో |
| తమ్ | = | అట్టి సంసారరూప వృక్ష తత్త్వమును | సః | = | అతడు |
| యః | = | ఏ పురుషుడు | వేదవిత్[1] | = | వేదార్థములను బాగుగా ఎఱిగినవాడు |

శ్రీ భగవానుడు పలికెను- ఆదిపురుషుడైన పరమేశ్వరుడే మూలముగా, బ్రహ్మయే ముఖ్యశాఖగా (కాండముగా), వేదములే పర్ణములు(ఆకులు)గా గల ఈ సంసారరూప-అశ్వత్థవృక్షము నాశరహితమైనది (శాశ్వతమైనది). ఈ సంసారవృక్షతత్త్వమును మూలసహితముగా తెలిసినవాడు నిజముగా వేదార్థములను ఎఱిగిన వాడు. (1)

**అధశ్చోర్ధ్వం ప్రసృతాస్తస్య శాఖా**
**గుణప్రవృద్ధా విషయప్రవాలాః ।**
**అధశ్చమూలాన్యనుసంతతాని**
**కర్మానుబంధీని మనుష్యలోకే ॥ 2 ॥**

అధః, చ, ఊర్ధ్వమ్, ప్రసృతాః, తస్య, శాఖాః, గుణప్రవృద్ధాః, విషయప్రవాలాః,
అధః, చ, మూలాని, అనుసంతతాని, కర్మానుబంధీని, మనుష్యలోకే ॥ 2 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| తస్య | = | ఆ సంసార వృక్షమునకు | శాఖాః[3] | = | దేవమనుష్య తిర్యగ్యోనులలో జన్మించెడి ప్రాణులే |
| గుణప్రవృద్ధాః | = | త్రిగుణములనెడి జలములచే వృద్ధిపొందునట్టి | | | |
| విషయప్రవాలాః[2] | = | శబ్దాది భోగములనెడి చిగుళ్ళుగల | అధః, చ | = | క్రిందివైపునకును |
| | | | ఊర్ధ్వమ్ | = | పైవైపునకును |

1. భగవంతునియోగమాయవలన ఉత్పన్నమైన సంసారము క్షణభంగురము, నశ్వరము, దుఃఖరూపము. దీని చింతనమాని కేవలము పరమేశ్వరుని నిత్యము నిరంతరము అనన్య భక్తితో చింతనచేయుటయే 'వేదసారమును ఎఱుంగుట' యగును.

2. శబ్దస్పర్శరూపరసగంధములనెడి ఐదును, స్థూలదేహము, మఱియు ఇంద్రియములకంటెను సూక్ష్మమగుటవలన వాటిని ఈ శాఖలయొక్క 'చిగురుటాకులు (ప్రవాళములు)' అని పేర్కొనుట జరిగినది.

3. ముఖ్యశాఖయైన బ్రహ్మనుండియే సమస్తలోకములు, దేవమనుష్య,తిర్యగ్యోనులు ఉత్పన్నములై విస్తరించినవి. కావున ఇవి ఇచట 'శాఖలుగా' పేర్కొనబడినవి.

ప్రసృతాః = సర్వత్ర వ్యాపించి యుండును
మనుష్యలోకే[1] = మానవలోకము నందు
కర్మానుబంధీని = (మనుజులను) కర్మాను సారముగా బంధించు

మూలాని (అపి) = అహంకార, మమకార వాసనలు అనెడి వేర్లు, ఊడలు గూడ
అధః, చ = క్రిందను
(ఊర్ధ్వం, చ) = (పైనను)
అనుసంతతాని = అన్ని లోకములలో వ్యాపించి యున్నవి

ఈ సంసారవృక్షమును త్రిగుణములనెడి జలములు తడుపుచుండును. ఆ జలములచే వృద్ధిపొందు శాఖలే దేవమనుష్యతిర్యగ్యోనులలో జన్మించుప్రాణులు. చిగుళ్లే విషయభోగములు. ఈ శాఖలు, చిగుళ్ళు సర్వత్ర వ్యాపించియున్నవి. మనుజులను కర్మానుసారముగా బంధించు అహంకార మమకార వాసనలనెడి వేర్లు, ఊడలు అన్నిలోకములలోను క్రింద, పైన వ్యాపించి ఉన్నవి. (2)

**న రూపమస్యేహ తథోపలభ్యతే**
**నాంతో న చాదిర్న చ సంప్రతిష్ఠా ।**
**అశ్వత్థమేనం సువిరూఢమూలమ్**
**అసంగశస్త్రేణ దృఢేన ఛిత్త్వా ॥ 3 ॥**

న, రూపమ్, అస్య, ఇహ, తథా, ఉపలభ్యతే, న, అంతః, న, చ, ఆది, న, చ, సంప్రతిష్ఠా,
అశ్వత్థమ్, ఏనమ్, సువిరూఢమూలమ్, అసంగశస్త్రేణ, దృఢేన, ఛిత్త్వా ॥ 3 ॥

అస్య = ఈ సంసారవృక్షముయొక్క
రూపమ్ = స్వరూపము (ఎట్లు వర్ణింపబడినదో)
తథా = అట్లు

ఇహ = ఈ లోకమునందు (బాగుగా పరిశీలించినచో)
న, ఉపలభ్యతే[2] = తెలియుబడకున్నది
(యతః) = ఏలనన

---

1. అహంకారమమకారవాసనారూపములైన మూలములు కేవలము మనుష్యులను వారి కర్మానుసారము బంధించును. ఇతరప్రాణులు కేవలము పూర్వకృతకర్మలఫలములను అనుభవించును. మనుష్యులు మాత్రమే నూతనకర్మలను ఆచరించుటకు అధికారులు.
2. నిద్రనుండి మేల్కొనిన పిదప స్వప్నప్రపంచము గోచరముకానట్లే తత్త్వజ్ఞానము కలిగిన పిదప ఈ సంసారస్వరూపము శాస్త్రములలో వర్ణింపబడినరీతిగా, కనబడిన విధముగా, వినబడిన ప్రకారము గోచరింపదు.

| | | |
|---|---|---|
| న, ఆదిః[1] | = | (దీనికి) ఆదియు లేదు |
| చ | = | మఱియు |
| న, అంతః[2] | = | అంతమూ లేదు |
| చ | = | అట్లే |
| న, సంప్రతిష్ఠా[3] | = | సరియైనస్థితియులేదు |
| (అతః) | = | ఇందువలన |
| ఏనమ్ | = | ఇట్టి |
| సువిరూఢమూలమ్ | = | అహంకార, మమకారవాసనలనెడి దృఢమైన మూలములుగల |
| అశ్వత్థమ్ | = | సంసారరూపమైన అశ్వత్థవృక్షమును |
| దృఢేన | = | నిశితమైన |
| అసంగశస్త్రేణ[4] | = | వైరాగ్యమనెడి శస్త్రముచే |
| ఛిత్త్వా[5] | = | ఛేదించి |

ఈ సంసారవృక్షమును బాగుగా పరిశీలించి చూచినచో ఇందు వర్ణింపబడిన రీతిగా లభ్యము గాదు. ఏలనన ఇది ఆదియు, అంతము, సరియైన స్థితియు లేనిది. కనుక అహంకారమమకారవాసనారూపములైన దృఢమైన వేర్లు, ఊడలు గల ఈ సంసారరూప - అశ్వత్థవృక్షమును నిశితమైన వైరాగ్యమనెడి శస్త్రముతో ఖండించి.... (3)

**తతః పదం తత్పరిమార్గితవ్యం**
**యస్మిన్ గతా న నివర్తంతి భూయః ।**
**తమేవ చాద్యం పురుషం ప్రపద్యే**
**యతః ప్రవృత్తిః ప్రసృతా పురాణీ ॥ 4 ॥**

---

1. దీనిపరంపర ఎప్పటినుండి కొనసాగుచున్నదో ఎవ్వరికిని తెలియదు. కావున దీనిని 'ఆది' లేనిదని-పేర్కొనుట జరిగినది.
2. దీని పరంపర ఎంతవఱకు కొనసాగుచుండునదియు ఎవ్వరును ఎఱుంగరు. కనుక ఇది 'అంతము' లేనిదని పేర్కొనబడినది.
3. వాస్తవముగా ఈ సంసారవృక్షము క్షణభంగురము, నశ్వరము. కనుక దీనికి 'సరియైన స్థితిలేదని' తెల్పబడినది.
4. బ్రహ్మలోకభోగములుగూడ క్షణికములు, నశ్వరములు - అని భావించి, ఈ సంసారమునందలి సమస్తవిషయభోగములయందు అస్తిత్వము, సుఖము, ప్రీతి, రమణీయత, మున్నగునవి లేవని భావించుటయే 'దృఢవైరాగ్యరూపశస్త్రము'.
5. స్థావరజంగమరూపమైన సంసారచింతనము, అనాదికాలమునుండియు అజ్ఞానముద్వారా దృఢమైన అహంకారమమకారవాసనారూపములైన మూలములను త్యజించుటయే ఈ సంసారవృక్షమును సమూలముగా 'ఛేదించుట'యగును.

తతః, పదమ్, తత్, పరిమార్గితవ్యమ్, యస్మిన్, గతాః, న, నివర్తంతి, భూయః,
తమ్, ఏవ, చ, ఆద్యమ్, పురుషమ్, ప్రపద్యే, యతః, ప్రవృత్తిః, ప్రసృతా, పురాణీ ॥ 4 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| తతః | = | అనంతరము | ప్రవృత్తిః | = | సంసారవృక్షపరంపర |
| యస్మిన్ | = | ఏపరమపదమును | ప్రసృతా | = | వ్యాపించియున్నదో |
| గతాః | = | పొందినవారు | తమ్, ఆద్యమ్, పురుషమ్, ఏవ | = | ఆ ఆదిపురుషుడగు నారాయణునే |
| భూయః | = | మఱల | | | |
| న, నివర్తంతి | = | తిరిగిరారో | ప్రపద్యే | = | శరణుపొందుదును |
| చ | = | మఱియు | (ఇతి | = | అను భావముతో) |
| యతః | = | ఏ పరమేశ్వరునినుండి | తత్, పదమ్ | = | ఆ పరమపదమును |
| పురాణీ | = | పురాతనమైన | పరిమార్గితవ్యమ్ | = | అన్వేషింపవలెను. |

అనంతరము ఆ పరమపదరూపుడైన పరమేశ్వరుని సర్వతోముఖముగ అన్వేషింపవలెను. ఆ పరమపదమును చేరిన పురుషులు ఈ జగత్తునకు తిరిగిరారు. అట్టి పరమేశ్వరునినుండియే ఈ పురాతనసంసారవృక్షపరంపర విస్తరించియున్నది. అట్టి ఆదిపురుషుడైన నారాయణునే శరణుపొంది, దృఢనిశ్చయముతో ఆ పరమేశ్వరుని మనన, నిదిధ్యాసాదులు చేయవలెను. (4)

**నిర్మానమోహా జితసంగదోషా**
**అధ్యాత్మనిత్యా వినివృత్తకామాః ।**
**ద్వంద్వైర్విముక్తాః సుఖదుఃఖసంజ్ఞైః**
**గచ్ఛంత్యమూఢాః పదమవ్యయం తత్ ॥ 5 ॥**

నిర్మానమోహాః, జితసంగదోషాః, అధ్యాత్మనిత్యాః, వినివృత్తకామాః,
ద్వంద్వైః, విముక్తాః, సుఖదుఃఖసంజ్ఞైః, గచ్ఛంతి, అమూఢాః, పదమ్, అవ్యయమ్, తత్ ॥ 5 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| నిర్మానమోహాః | = | దురభిమానమును, మోహమును త్యజించినవారును | వినివృత్త కామాః | = | ప్రాపంచిక వాంఛల నుండి పూర్తిగా మఱలినవారును |
| జితసంగదోషాః | = | ఆసక్తియనెడి దోషమును జయించినవారును | సుఖదుఃఖ సంజ్ఞైః | = | సుఖదుఃఖములను పేరుగల |
| అధ్యాత్మ నిత్యాః | = | పరమాత్మస్వరూపము నందే నిత్య స్థితులైన వారును | ద్వంద్వైః | = | ద్వంద్వముల నుండి |
| | | | విముక్తాః | = | విముక్తులైన వారును అగు |
| | | | అమూఢాః | = | జ్ఞానులు |

| | | | | |
|---|---|---|---|---|
| తత్, అవ్యయమ్, పదమ్ | = శాశ్వతమైన ఆ పరమపదమును | | గచ్ఛంతి | = చేరుదురు |

దురభిమానమును, మోహమును త్యజించినవారును, ఆసక్తియను దోషమును జయించినవారును, ప్రాపంచికవాంఛలనుండి పూర్తిగా మఱలినవారును, పరమాత్మ స్వరూపమునందు నిత్యస్థితులైనవారును, సుఖదుఃఖాదిద్వంద్వములనుండి విముక్తులైన వారును అగు జ్ఞానులు శాశ్వతమైన ఆ పరమపదమును పొందుదురు. (5)

**న తద్భాసయతే సూర్యో న శశాంకో న పావకః ।**
**యద్గత్వా న నివర్తంతే తద్ధామ పరమం మమ ॥ 6 ॥**

న, తత్, భాసయతే, సూర్యః, న, శశాంకః, న, పావకః,
యత్, గత్వా, న, నివర్తంతే, తత్, ధామ, పరమమ్, మమ ॥ 6 ॥

| | | | |
|---|---|---|---|
| యత్ | = ఏపరమపదమును | న భాసయతే | = ప్రకాశింప జేయజాలడు |
| గత్వా | = పొంది | శశాంకః | = చంద్రుడు |
| న, నివర్తంతే | = (మనుష్యులు) ఈ లోకమునకు తిరిగిరారో | న,(భాసయతే) | = ప్రకాశింప జేయజాలడు |
| | | పావకః | = అగ్నియును |
| | | న, భాసయతే | = ప్రకాశింప చేయజాలడు |
| తత్ | = అట్టి స్వయం ప్రకాశస్వరూపమైన పరమపదమును | తత్ | = అదియే |
| | | మమ, పరమమ్, ధామ[1] | = నా పరంధామము |
| సూర్యః | = సూర్యుడు | | |

స్వయంప్రకాశస్వరూపమైన నా పరంధామమును సూర్యుడుగాని, చంద్రుడుగాని, అగ్నిగాని ప్రకాశింపజేయజాలరు. అట్టి పరంధామమును చేరిన పుణ్యాత్ములు మఱల ఈ జగత్తున ప్రవేశింపరు. అనగా జన్మింపరు. (6)

**మమైవాంశో జీవలోకే జీవభూతః సనాతనః ।**
**మనఃషష్ఠానీంద్రియాణి ప్రకృతిస్థాని కర్షతి ॥ 7 ॥**

మమ, ఏవ, అంశః, జీవలోకే, జీవభూతః, సనాతనః,
మనఃషష్ఠాని, ఇంద్రియాణి, ప్రకృతిస్థాని, కర్షతి ॥ 7 ॥

1. పరంధామముయొక్క అర్థము గీత-8వ అధ్యాయమునందలి 21వ శ్లోకమునందు చూడనగును.

| | | | | | |
|---|---|---|---|---|---|
| జీవలోకే | = | సర్వప్రాణుల దేహములలో ఉన్న | ప్రకృతిస్థాని | = | ప్రకృతియందు స్థితములైన |
| సనాతనః | = | సనాతనమైన | మనఃషష్ఠాని, ఇంద్రియాణి | = | మనస్సును, ఐదు ఇంద్రియములను |
| జీవభూతః | = | జీవాత్మ | కర్షతి | = | (శబ్దాదివిషయముల ద్వారా తనవైపునకు) ఆకర్షించును |
| మమ, ఏవ, అంశః[1] | = | నా అంశయే (అదియే) | | | |

ప్రాణి లోకమున ఈ దేహమునందున్న సనాతనమైన జీవాత్మ నా అంశయే. అది ప్రకృతియందు స్థితములైన మనస్సును ఇంద్రియములను శబ్దాదివిషయముల ద్వారా తనవైపు ఆకర్షించును. (7)

**శరీరం యదవాప్నోతి యచ్చాప్యుత్క్రామతీశ్వరః ।**
**గృహీత్వైతాని సంయాతి వాయుర్గన్ధానివాశయాత్ ॥ 8 ॥**

శరీరమ్, యత్, అవాప్నోతి, యత్, చ, అపి, ఉత్క్రామతి, ఈశ్వరః,
గృహీత్వా, ఏతాని, సంయాతి, వాయుః, గంధాన్, ఇవ, ఆశయాత్ ॥ 8 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| వాయుః | = | వాయువు | (తస్మాత్) | = | దానినుండి |
| ఆశయాత్ | = | గంధస్థానమునుండి | ఏతాని | = | ఈ మనస్సును, ఇంద్రియములను |
| గంధాన్ ఇవ | = | గంధములను (వాసనలను) గ్రహించి, తీసికొని పోయినట్లుగా | గృహీత్వా | = | గ్రహించి |
| | | | చ | = | మఱియు |
| | | | యత్, శరీరమ్ | = | ఏ శరీరమును |
| ఈశ్వరః, అపి | = | ప్రాణుల దేహముల యందున్న జీవాత్మయు | అవాప్నోతి | = | పొందునో |
| | | | (తస్మిన్) | = | దానియందు (ఆ శరీరమునందు) |
| యత్ | = | ఏ శరీరమును | | | |
| ఉత్క్రామతి | = | త్యజించునో | సంయాతి | = | చేరును |

*1. విభాగరహితమైనను మహాకాశము వివిధములగు (ఘటములలో) కుండలలో వేర్వేఱుగా గోచరించును. అట్లే సర్వభూతములయందును ఏకరూపములో స్థితుడైనప్పటికిని పరమాత్మ వేర్వేఱుగా ప్రతీతమగును. కావున దేహస్థితుడైన జీవాత్మను భగవానుడు తన సనాతన-*

వాయువు వాసనలను ఒకచోటినుండి మఱియొకచోటికి తీసికొని పోయినట్లుగా దేహాదులకు స్వామియైన జీవాత్మ ఒక శరీరమును త్యజించునపుడు, మనస్సు ఇంద్రియములను గ్రహించి, వాటిలో గూడ మఱొక శరీరమును పొందును. అనగా దానిలో ప్రవేశించును. (8)

**శ్రోత్రం చక్షుః స్పర్శనం చ రసనం ఘ్రాణమేవ చ ।**
**అధిష్ఠాయ మనశ్చాయం విషయానుపసేవతే ॥ 9 ॥**

శ్రోత్రమ్, చక్షుః, స్పర్శనమ్, చ, రసనమ్, ఘ్రాణమ్, ఏవ, చ,
అధిష్ఠాయ, మనః, చ, అయమ్, విషయాన్, ఉపసేవతే ॥ 9 ॥

| | | | |
|---|---|---|---|
| అయమ్ | = ఈజీవాత్మ | ఘ్రాణమ్ | = నాసికను |
| శ్రోత్రమ్ | = చెవిని | చ | = మఱియు |
| చక్షుః | = కంటిని | మనః | = మనస్సును |
| చ | = మఱియు | అధిష్ఠాయ | = అధిష్ఠించి |
| స్పర్శనమ్ | = చర్మమును | ఏవ | = వీటిద్వారా |
| చ | = అట్లే | విషయాన్ | = శబ్దాది విషయములను |
| రసనమ్ | = నాలుకను | ఉపసేవతే | = అనుభవించును |

ఈ జీవాత్మ త్వక్చక్షుశ్శ్రోత్రజిహ్వాఘ్రాణములు అనెడి పంచేంద్రియములను, మనస్సును ఆశ్రయించి, శబ్దాదివిషయములను అనుభవించును. (9)

**ఉత్క్రామంతం స్థితం వాపి భుంజానం వా గుణాన్వితమ్ ।**
**విమూఢా నానుపశ్యంతి పశ్యంతి జ్ఞానచక్షుషః ॥ 10 ॥**

ఉత్క్రామంతమ్, స్థితమ్, వా, అపి, భుంజానమ్, వా, గుణాన్వితమ్,
విమూఢాః,న, అనుపశ్యంతి, పశ్యంతి, జ్ఞానచక్షుషః ॥ 10 ॥

| | | | |
|---|---|---|---|
| ఉత్క్రామంతమ్ | = జీవుడు శరీరమును వదలుచున్నప్పుడును | గుణాన్వితమ్, అపి | = అట్లే త్రిగుణములతో కూడియున్నప్పుడును |
| వా | = లేక | విమూఢాః | = అజ్ఞానులు |
| స్థితమ్ | = శరీరమునందు స్థితుడైయున్నప్పుడును | న, అనుపశ్యంతి | = తెలిసికొనలేరు |
| | | జ్ఞానచక్షుషః | = కేవలము జ్ఞానులే తమ జ్ఞాన నేత్రములద్వారా |
| వా | = లేక | | |
| భుంజానమ్ | = భోగములను అనుభవించు చున్నప్పుడును | పశ్యంతి | = స్వస్వరూపమును తెలిసికొందురు |

జీవాత్మ శరీరమును త్యజించునప్పుడును, శరీరమునందు స్థితుడై యున్నప్పుడును, విషయభోగములను అనుభవించుచున్నప్పుడును, అటులే త్రిగుణములతో కూడియున్నప్పుడును అజ్ఞానులు తెలిసికొనలేరు. కేవలము వివేకశీలురైన జ్ఞానులే తమజ్ఞాననేత్రములవలన స్వస్వరూపమును తెలిసికొనగల్గుదురు (10)

**యతంతో యోగినశ్చైనం పశ్యంత్యాత్మన్యవస్థితమ్ ।**
**యతంతోఽప్యకృతాత్మానో నైనం పశ్యంత్యచేతసః ॥ 11 ॥**

యతంతః, యోగినః, చ, ఏనమ్, పశ్యంతి, ఆత్మని, అవస్థితమ్,
యతంతః, అపి, అకృతాత్మానః, న, ఏనమ్, పశ్యంతి, అచేతసః ॥ 11 ॥

| | | | |
|---|---|---|---|
| యోగినః | = యోగులు | అకృతాత్మానః | = అంతఃకరణశుద్ధి లేనివారైన |
| ఆత్మని | = తమహృదయముల యందు | అచేతసః | = అజ్ఞానులు |
| అవస్థితమ్ | = స్థితమైయున్న | యతంతః, అపి | = గట్టిగా ప్రయత్నించినను |
| ఏనమ్ | = ఈ ఆత్మతత్త్వమును | ఏనమ్ | = ఈ ఆత్మను |
| యతంతః | = ప్రయత్నశీలురై | న పశ్యంతి | = తెలిసికొనజాలరు |
| పశ్యంతి | = ఎఱుంగుదురు | | |
| చ | = కాని | | |

అంతఃకరణశుద్ధిగలయోగులు తమహృదయములయందున్న ఈ ఆత్మతత్త్వమును ప్రయత్నశీలురై తెలిసికొనగలరు. కాని అంతఃకరణశుద్ధిలేని అజ్ఞానులు ఎంతగా ప్రయత్నించియు, ఈ ఆత్మను తెలిసికొనజాలరు. (11)

**యదాదిత్యగతం తేజో జగద్భాసయతేఽఖిలమ్ ।**
**యచ్చంద్రమసి యచ్చాగ్నౌ తత్తేజో విద్ధి మామకమ్ ॥ 12 ॥**

యత్, ఆదిత్యగతమ్, తేజః, జగత్, భాసయతే, అఖిలమ్,
యత్, చంద్రమసి, యత్, చ, అగ్నౌ, తత్, తేజః, విద్ధి, మామకమ్ ॥ 12 ॥

| | | | |
|---|---|---|---|
| ఆదిత్యగతమ్ | = సూర్యమండలము నందున్న | చంద్రమసి | = చంద్రుని యందును |
| యత్, తేజః | = ఏ తేజస్సు | యత్ | = ఏది |
| అఖిలమ్, జగత్ | = సమస్తజగత్తును | అగ్నౌ | = అగ్నియందును గలదో |
| భాసయతే | = ప్రకాశింపజేయునో | తత్, తేజః | = ఆ తేజస్సు |
| చ | = మఱియు | మామకమ్ | = నాదేయని |
| యత్ | = ఏ తేజస్సు | విద్ధి | = ఎఱుంగుము |

సమస్తజగత్తును ప్రకాశింపజేయు సూర్యునితేజస్సును, అటులనే చంద్రుని తేజస్సును, అగ్నితేజస్సును నాతేజస్సేయని యెఱుంగుము. (12)

**గామావిశ్య చ భూతాని ధారయామ్యహమోజసా ।**
**పుష్ణామి చౌషధీః సర్వాః సోమో భూత్వా రసాత్మకః ॥ 13 ॥**

గామ్, ఆవిశ్య, చ, భూతాని, ధారయామి, అహమ్, ఓజసా,
పుష్ణామి, చ, ఓషధీః, సర్వాః, సోమః, భూత్వా, రసాత్మకః ॥ 13 ॥

| | | | |
|---|---|---|---|
| చ | = మఱియు | రసాత్మకః | = రసస్వరూపుడగు (అమృతమయుడగు) |
| అహమ్ | = నేనే | | |
| గామ్, ఆవిశ్య | = భూమిని ప్రవేశించి | సోమః, భూత్వా | = చంద్రుడనై |
| ఓజసా | = (నా)శక్తిద్వారా | | |
| భూతాని | = సకల భూతములను | సర్వాః, ఓషధీః | = ఓషధులకు (వనస్పతులకు) అన్నింటికిని |
| ధారయామి | = ధరించి, పోషించుచున్నాను | | |
| చ | = మఱియు | పుష్ణామి | = పుష్టిని చేకూర్తును |

పృథ్వియందు ప్రవేశించి, నేను నా శక్తిద్వారా సకలభూతములను ధరించి, పోషించుచున్నాను. రసస్వరూపుడనై - అనగా అమృతమయుడైన చంద్రుడనై ఓషధులకు అనగా- వనస్పతులన్నింటికిని పుష్టిని చేకూర్చుచున్నాను. (13)

**అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహమాశ్రితః ।**
**ప్రాణాపానసమాయుక్తః పచామ్యన్నం చతుర్విధమ్ ॥ 14 ॥**

అహమ్, వైశ్వానరః, భూత్వా, ప్రాణినామ్, దేహమ్, ఆశ్రితః,
ప్రాణాపానసమాయుక్తః, పచామి, అన్నమ్, చతుర్విధమ్ ॥ 14 ॥

| | | | |
|---|---|---|---|
| అహమ్ | = నేనే | ప్రాణాపాన సమాయుక్తః | = ప్రాణాపానములతో గూడిన |
| ప్రాణినామ్ | = సకలప్రాణులయొక్క | | |
| దేహమ్, ఆశ్రితః | = దేహములయందు ఉన్నవాడనై | వైశ్వానరః భూత్వా | = వైశ్వానరాగ్నినై |
| | | చతుర్విధమ్[1] | = నాలుగు విధములైన |

1. ఆహారము భక్ష్యభోజ్యచోష్యలేహ్యములుగా నాలుగు విధములు. నమలబడునవి భక్ష్యములు. (రొట్టె మొదలగునవి) మ్రింగబడునవి భోజ్యములు. (పాలు మొదలగునవి) పీల్చబడునవి చోష్యములు. (ఆస్వాదింపబడునవి. చెఱకు మొదలగునవి.) నాకుచు తినదగినవి లేహ్యములు (తేనె మొదలగునవి)

| | | | |
|---|---|---|---|
| అన్నమ్ | = ఆహారమును | పచామి | = జీర్ణింపజేయుదును |

నేనే ప్రాణాపానసంయుక్తమైన వైశ్వానరాగ్నిరూపములో సర్వప్రాణుల శరీరముల యందుండి నాలుగువిధములైన ఆహారములను జీర్ణము చేయుచుందును (14)

**సర్వస్య చాహం హృది సన్నివిష్టో**
**మత్తః స్మృతిర్ జ్ఞానమపోహనం చ ।**
**వేదైశ్చ సర్వైరహమేవ వేద్యో**
**వేదాంతకృద్వేదవిదేవ చాహమ్ ॥ 15 ॥**

సర్వస్య, చ, అహమ్, హృది, సన్నివిష్టః, మత్తః, స్మృతిః, జ్ఞానమ్, అపోహనమ్, చ,
వేదైః, చ, సర్వైః, అహమ్, ఏవ, వేద్యః, వేదాంతకృత్, వేదవిత్, ఏవ, చ, అహమ్ ॥ 15 ॥

| | | | |
|---|---|---|---|
| అహమ్ | = నేనే | అపోహనమ్[1] | = అపోహనము (సంశయనివారణము) |
| సర్వస్య, హృది | = ప్రతిప్రాణియొక్క హృదయము నందును | (భవతి) | = (కలుగును) |
| | | చ | = మఱియు |
| సన్నివిష్టః | = అంతర్యామిగా ఉన్నవాడను | సర్వైః, వేదైః | = వేదములన్నింటి ద్వారా |
| | | అహమ్, ఏవ | = నేనే |
| చ | = మఱియు | వేద్యః[2] | = తెలిసికొనదగిన వాడను |
| మత్తః | = నానుండియే | వేదాంతకృత్ | = వేదాంతకర్తను |
| స్మృతిః | = స్మృతి | వేదవిత్, చ | = వేదములను ఎఱింగిన వాడనుగూడ |
| జ్ఞానమ్ | = జ్ఞానము | | |
| చ | = మఱియు | అహమ్, ఏవ | = నేనే |

సమస్తప్రాణుల హృదయములలో అంతర్యామిగా ఉన్న వాడను నేనే. నానుండియే స్మృతి, జ్ఞానము, అపోహనము (సందేహమును తొలగించుట) కలుగుచున్నవి. వేదముల ద్వారా తెలిసికొనదగిన వాడను నేనే. వేదాంతకర్తను, వేదజ్ఞుడను గూడ నేనే. (15)

1. బుద్ధియందుండు సంశయ, విపర్యయాది దోషములను వివేచనద్వారా తొలగించుటను 'అపోహనము' - అని యందురు.
2. సర్వవేదములసారము పరమేశ్వరుని గూర్చి ఎఱుంగుటయే. కావున సకలవేదములద్వారా తెలిసికొనదగినవాడు పరమేశ్వరుడే-అని పేర్కొనబడెను.

**ద్వావిమౌ పురుషౌ లోకే క్షరశ్చాక్షర ఏవ చ ।**
**క్షరః సర్వాణి భూతాని కూటస్థోఽక్షర ఉచ్యతే ॥ 16 ॥**

ద్వౌ, ఇమౌ, పురుషౌ, లోకే, క్షరః, చ, అక్షరః, ఏవ, చ,
క్షరః, సర్వాణి, భూతాని, కూటస్థః అక్షరః, ఉచ్యతే ॥ 16 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| లోకే | = | ఈ జగత్తునందు | సర్వాణి, భూతాని | = | సకలప్రాణుల శరీరములును |
| క్షరః, చ | = | క్షరుడు (నశ్వరుడు) అనియు | క్షరః | = | నశ్వరములు |
| అక్షరః | = | అక్షరుడు (నాశరహితుడు) అనియు | చ | = | మరియు |
| | | | కూటస్థః | = | జీవాత్మ |
| ఇమౌ, ద్వౌ పురుషౌ, ఏవ[1] | = | ఈ రెండువిధములగు పురుషులే గలరు | అక్షరః | = | నాశరహితుడు అని |
| | | | ఉచ్యతే | = | పేర్కొనబడుచున్నది |

ఈ జగత్తునందు క్షరుడు(నశ్వరుడు), అక్షరుడు(వినాశరహితుడు) అని పురుషులు రెండు విధములుగా గలరు. సకలప్రాణులశరీరములు నశ్వరములు. జీవాత్మ నాశరహితుడు. (16)

**ఉత్తమః పురుషస్త్వన్యః పరమాత్మేత్యుదాహృతః ।**
**యో లోకత్రయమావిశ్య బిభర్త్యవ్యయ ఈశ్వరః ॥ 17 ॥**

ఉత్తమః, పురుషః, తు, అన్యః, పరమాత్మా, ఇతి, ఉదాహృతః,
యః, లోకత్రయమ్, ఆవిశ్య, బిభర్తి, అవ్యయః, ఈశ్వరః ॥ 17 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| ఉత్తమః, పురుషః | = | (పై ఇద్దరికంటెను) ఉత్తమపురుషుడే | అవ్యయః | = | నాశరహితుడు (శాశ్వతుడు) |
| తు, అన్యః | = | వేరైనవాడు, | | | |
| యః | = | ఎవడైతే | ఈశ్వరః | = | పరమేశ్వరుడు |
| లోకత్రయమ్, ఆవిశ్య | = | ముల్లోకములలో ప్రవేశించి | పరమాత్మా, ఇతి | = | పరమాత్మ, అని |
| బిభర్తి | = | అందరిని భరించి, పోషించుచున్నాడో అతడే | ఉదాహృతః | = | పేర్కొన బడుచున్నాడు |

1. గీత-7వ అధ్యాయమునందలి 4,5 శ్లోకములలో 'అపరా' 'పరా' ప్రకృతులు-అని తెల్పబడినవియు, 13వ అధ్యాయమున మొదటి శ్లోకమునందు క్షేత్ర-క్షేత్రజ్ఞులని పేర్కొనబడినవియు-ఇచట క్షర-అక్షర పురుషులు అని తెలుపబడినవి.

పై ఇద్దరికంటెను ఉత్తముడైన పురుషుడు వేరైనవాడొకడు కలడు. అతడే నాశరహితుడైన పరమేశ్వరుడు, పరమాత్మ. అతడు ముల్లోకములయందును ప్రవేశించి, అందఱిని భరించి పోషించుచున్నాడు. (17)

**యస్మాత్ క్షరమతీతోఽహమ్ అక్షరాదపి చోత్తమః ।**
**అతోఽస్మి లోకే వేదే చ ప్రథితః పురుషోత్తమః ॥ 18 ॥**

యస్మాత్, క్షరమ్, అతీతః, అహమ్, అక్షరాత్, అపి, చ, ఉత్తమః,
అతః, అస్మి, లోకే, వేదే, చ, ప్రథితః, పురుషోత్తమః ॥ 18 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| **యస్మాత్** | = | ఏలనన | **ఉత్తమః** | = | ఉత్తముడను |
| **అహమ్** | = | నేను | **అతః** | = | ఇందువలన |
| **క్షరమ్** | = | నశ్వరమైన జడవర్గక్షేత్రము కంటెను | **లోకే, చ** | = | లోకము నందును |
| | | | **వేదే(చ)** | = | వేదము నందును |
| **అతీతః** | = | పూర్తిగా అతీతుడను | | | |
| **చ** | = | మఱియు | **పురుషోత్తమః** | = | పురుషోత్తముడనని |
| **అక్షరాత్, అపి** | = | నాశరహితుడైన జీవాత్మకంటెను | **ప్రథితః, అస్మి** | = | ప్రసిద్ధుడనైతిని |

ఏలనన, నశ్వరమగు జడవర్గము (క్షేత్రము) కంటెను నేను సర్వథా అతీతుడను. నాశరహితమైన జీవాత్మ కంటెను ఉత్తముడను. కనుక, ఈజగత్తునందును, వేదముల యందును పురుషోత్తముడనని ప్రసిద్ధికెక్కితిని. (18)

**యో మామేవమసమ్మూఢో జానాతి పురుషోత్తమమ్ ।**
**స సర్వవిద్భజతి మాం సర్వభావేన భారత ॥ 19 ॥**

యః, మామ్, ఏవమ్, అసమ్మూఢః, జానాతి, పురుషోత్తమమ్,
సః, సర్వవిత్, భజతి, మామ్, సర్వభావేన, భారత ॥ 19 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| **భారత!** | = | ఓ అర్జునా! | **మామ్** | = | నన్ను |
| **యః, అసమ్మూఢః** | = | ఎవ్వడైనను జ్ఞానియైనవాడు | **ఏవమ్** | = | ఈ విధముగా |
| | | | **పురుషోత్తమమ్** | = | పురుషోత్తమునిగా |

జానాతి = తెలిసికొనునో
సః = ఆ జ్ఞాని
సర్వవిత్ = సర్వజ్ఞుడు
సర్వభావేన = అన్నివిధముల
మామ్ = నన్నే నిరంతరము పరమేశ్వరునిగా
భజతి = భజించును

ఓ అర్జునా! జ్ఞానియైనవాడు ఈ విధముగా నన్ను తత్త్వతః పురుషోత్తమునిగా ఎఱుంగును. సర్వజ్ఞుడైన అతడు వాసుదేవుడనైన నన్నే నిరంతరము పరమేశ్వరునిగా భజించును. (19)

**ఇతి గుహ్యతమం శాస్త్రమ్ ఇదముక్తం మయానఘ ।**
**ఏతద్ బుద్ధ్వా బుద్ధిమాన్ స్యాత్ కృతకృత్యశ్చ భారత ॥ 20 ॥**

ఇతి, గుహ్యతమమ్, శాస్త్రమ్, ఇదమ్, ఉక్తమ్, మయా, అనఘ,
ఏతత్, బుద్ధ్వా, బుద్ధిమాన్, స్యాత్, కృతకృత్యః, చ, భారత ॥ 20 ॥

అనఘ! = ఓ పుణ్యపురుషా!
భారత! = ఓ అర్జునా!
ఇతి = ఈ విధముగా
గుహ్యతమమ్ = మిక్కిలి గోప్యమైన
ఇదమ్, శాస్త్రమ్ = ఈ శాస్త్రము
మయా = నాచేత
ఉక్తమ్ = చెప్పబడినది
ఏతత్ = దీనిని (ఈ తత్త్వమును)
బుద్ధ్వా = తెలిసికొని (మనుష్యుడు)
బుద్ధిమాన్ = జ్ఞానియు
కృతకృత్యః, చ = కృతార్థుడును
స్యాత్ = అగును

ఓ పుణ్యపురుషా! ఓ అర్జునా! అత్యంతము గోప్యమైన ఈ శాస్త్రమును ఈ విధముగా నీకు తెలిపితిని. దీని తత్త్వమును తెలిసికొనిన మనుష్యుడు జ్ఞానియై కృతార్థుడు కాగలడు. (20)

ఓం తత్సదితి శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే పురుషోత్తమయోగో నామ పంచదశోఽధ్యాయః ॥ ౧౫ ॥

॥ ఓం శ్రీపరమాత్మనే నమః ॥

# అథ షోడశోఽధ్యాయః - దైవాసురసంపద్విభాగయోగః

## (పదునాఱవ అధ్యాయము-దైవాసురసంపద్విభాగయోగము)

ముఖ్యాంశములు : [(1 నుండి 5వ శ్లోకమువఱకు) ఫలసహితముగా దైవీ-ఆసురీ సంపదల కథనము, (6 నుండి 20 వఱకు) ఆసురీ సంపదలుగలవారి లక్షణములు-వారికి అధోగతి తప్పదని తెల్పుట, (21 నుండి 24 వఱకు) శాస్త్రవిరుద్ధాచరణములను త్యజించుటకును-శాస్త్రోక్త విధులను ఆచరించుటకును ప్రేరణము.]

**శ్రీ భగవాన్ ఉవాచ**

**అభయం సత్త్వసంశుద్ధిః జ్ఞానయోగవ్యవస్థితిః ।**
**దానం దమశ్చ యజ్ఞశ్చ స్వాధ్యాయస్తప ఆర్జవమ్ ॥ 1 ॥**

అభయమ్, సత్త్వసంశుద్ధిః, జ్ఞానయోగవ్యవస్థితిః,
దానమ్, దమః, చ, యజ్ఞః, చ, స్వాధ్యాయః, తపః, ఆర్జవమ్ ॥ 4 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| అభయమ్ | = | నిర్భయత్వము | స్వాధ్యాయః | = | వేదశాస్త్రముల పఠన, పాఠనములు, భగవన్నామ గుణకీర్తనలు |
| సత్త్వసంశుద్ధిః | = | అంతఃకరణశుద్ధి | తపః | = | స్వధర్మాచరణమునందలి కష్టములను ఓర్చుకొనుట |
| జ్ఞానయోగ వ్యవస్థితిః[1] | = | తత్త్వజ్ఞానప్రాప్తికై ధ్యానయోగమునందు నిరంతర దృఢస్థితి | చ | = | మఱియు |
| చ | = | మఱియు | ఆర్జవమ్ | = | శరీరేంద్రియ-అంతఃకరణముల సరళత్వము |
| దానమ్[2] | = | సాత్త్వికదానము | | | |
| దమః | = | ఇంద్రియనిగ్రహము | | | |
| యజ్ఞః | = | భగవంతుని, గురువులను, అట్లే దేవతలను పూజించుట, మఱియు అగ్నిహోత్రాది-ఉత్తమ కర్మాచరణము | | | |

1. *పరమాత్మస్వరూపతత్త్వమును తెలిసికొనుటకై సచ్చిదానందఘనపరమాత్మ స్వరూపమును నిరంతరము ధ్యానించుచు ఏకీభావస్థితిలో ఉండుటనే 'జ్ఞానయోగవ్యవస్థితిః' అని యందురు.*
2. *గీత-17వ అధ్యాయము 20 వ శ్లోకమున దీని వివరణము గలదు.*

శ్రీ భగవానుడు పలికెను - నిర్భయత్వము, అంతఃకరణశుద్ధి, తత్త్వజ్ఞానప్రాప్తికై ధ్యానయోగమునందు నిరంతర దృఢస్థితి, సాత్త్వికదానము, ఇంద్రియనిగ్రహము, భగవంతుని, దేవతలను, గురుజనులను పూజించుట, అట్లే అగ్నిహోత్రాది ఉత్తమ కర్మాచరణము, వేదశాస్త్రములపఠన, పాఠనములు మఱియు భగవంతుని నామగుణకీర్తనములు, స్వధర్మాచరణమునందలి కష్టములను ఓర్చుకొనుట, శరీరేంద్రియాంతఃకరణముల సరళత్వము (ఆర్జవము) (1)

**అహింసా సత్యమక్రోధః త్యాగః శాంతిరపైశునమ్ ।**
**దయా భూతేష్వలోలుప్త్వం మార్దవం హ్రీరచాపలమ్ ॥ 2 ॥**

అహింసా, సత్యమ్, అక్రోధః, త్యాగః, శాంతిః, అపైశునమ్,
దయా, భూతేషు, అలోలుప్త్వమ్, మార్దవమ్, హ్రీః, అచాపలమ్ ॥ 2 ॥

అహింసా = మనోవాక్కాయముల ద్వారా ఎవ్వరికిని ఏవిధముగను కష్టమును కల్గింపకుండుట
సత్యమ్[1] = యథార్థమైన ప్రియమైన భాషణము
అక్రోధః = తనకు అపకారము చేయువారిపైగూడ క్రోధము లేకుండుట
త్యాగః = కర్మాచరణమునందు కర్తృత్వాభిమానమును త్యజించుట
శాంతిః = చిత్తచాంచల్యము లేకుండుట
అపైశునమ్ = ఎవరినీ నిందింపకుండుట
భూతేషు, దయా = సకలప్రాణులయెడను నిర్హేతుక కృప
అలోలుప్త్వమ్ = ఇంద్రియ విషయ సంయోగమున్నను వాటిపై ఆసక్తి లేకుండుట
మార్దవమ్ = కోమలత్వము
హ్రీః = లోక, శాస్త్రవిరుద్ధ కార్యాచరణమునకు వెనుకాడుట (సిగ్గుపడుట)
అచాపలమ్ = వ్యర్థ చేష్టలు చేయకుండుట

---

1. అంతఃకరణేంద్రియములద్వారా చేయబడిన నిశ్చయమును, అదేవిధముగ ప్రియమైన వచనములను పల్కుటనే 'సత్యభాషణము' అని యందురు.

అహింస (మనోవాక్కాయముల ద్వారా ఎవ్వరికిని ఏ విధముగను కష్టమును కల్గింపకుండుట), సత్యము (యథార్థమైన, ప్రియమైన భాషణము), అక్రోధము (తనకు అపకారము చేయువారిపైనకూడ కోపములేకుండుట), త్యాగము(కర్మాచరణమునందు కర్తృత్వాభిమానమును త్యజించుట), శాంతి (చిత్తచాంచల్యము లేకుండుట), అపైశునము (ఎవరినీ నిందింపకుండుట), దయ (అన్నిప్రాణులయెడ నిర్హేతుక కృప), అలోలుప్త్వము (ఇంద్రియవిషయసంయోగము ఉన్నను వాటిపై ఆసక్తి లేకుండుట), మార్దవము (కోమలత్వము), శాస్త్రవిరుద్ధ కార్యాచరణమునకు వెనుకాడుట (సిగ్గుపడుట), అచాపలము(వ్యర్థచేష్టలు చేయకుండుట)..... (2)

**తేజః క్షమా ధృతిః శౌచమ్ అద్రోహో నాతిమానితా ।**
**భవంతి సంపదం దైవీమ్ అభిజాతస్య భారత ॥ 3 ॥**

తేజః, క్షమా, ధృతిః, శౌచమ్, అద్రోహః, న, అతిమానితా,
భవంతి, సంపదమ్, దైవీమ్, అభిజాతస్య, భారత ॥ 3 ॥

| | | | |
|---|---|---|---|
| **తేజః**[1] | = తేజస్సు | **భారత!** | = ఓ అర్జునా! |
| **క్షమా** | = క్షమ | | (పైన తెల్పబడిన |
| **ధృతిః** | = ధైర్యము | | గుణములన్నియును) |
| **శౌచమ్**[2] | = బాహ్యశుద్ధి | **దైవీమ్, సంపదమ్** | = దైవీ సంపదతో |
| **అద్రోహః** | = ఎవ్వరిపైనను శత్రుభావము లేకుండుట | **అభిజాతస్య** | = పుట్టినవాని యొక్క (లక్షణములు) |
| **న, అతిమానితా** | = తానుపూజ్యుడనను అభిమానము లేకుండుట | **భవంతి** | = అగును |

ఓ అర్జునా! తేజస్సు, క్షమ, ధైర్యము, శౌచము(బాహ్యశుద్ధి) అద్రోహము (ఎవ్వరిపైనను శత్రుభావము లేకుండుట) అమానిత్వము (తాను పూజ్యుడనను అభిమానము లేకుండుట) మొదలగునవి యన్నియును దైవీసంపదగలవాని లక్షణములు. (3)

1. శ్రేష్ఠపురుషులశక్తిని 'తేజస్సు' అని యందురు. దానిప్రభావముచే విషయాసక్తులైన నీచ ప్రకృతిగల వారుకూడ వారియెదుట ఇతరములైన(పాప) ఆచరణములను మాని, వారు చెప్పిన రీతిగా ఉత్తమకర్మలయందే ప్రవృత్తులగుదురు.
2. గీత 13 వ అధ్యాయము 7వ శ్లోకముయొక్క టిప్పణిని చూడుడు.

**దంభో దర్పోఽభిమానశ్చ క్రోధః పారుష్యమేవ చ ।**
**అజ్ఞానం చాభిజాతస్య పార్థ సంపదమాసురీమ్ ॥ 4 ॥**

దంభః, దర్పః, అభిమానః, చ, క్రోధః, పారుష్యమ్, ఏవ, చ,
అజ్ఞానమ్, చ, అభిజాతస్య, పార్థ, సంపదమ్, ఆసురీమ్ ॥ 4 ॥

| | | | |
|---|---|---|---|
| పార్థ! | = ఓ పార్థా! | అజ్ఞానమ్, ఏవ | = అజ్ఞానము మొదలగునవి అన్నియును |
| దంభః | = డాంబికము (కపటము) | ఆసురీమ్, సంపదమ్ | = ఆసురీ సంపదతో |
| దర్పః, చ | = మొండితనము | అభిజాతస్య | = పుట్టినవాని (లక్షణములు) |
| అభిమానః | = దురభిమానము | (భవంతి) | = (అగును) |
| చ | = మఱియు | | |
| క్రోధః | = క్రోధము | | |
| పారుష్యమ్, చ | = మాటలయందును, చేష్టలయందును కాఠిన్యము | | |

ఓ పార్థా! దంభము(కపటము),దర్పము(మొండితనము), అభిమానము, క్రోధము, పారుష్యము, (మాటలయందును, చేష్టలయందును కఠినత్వము), అజ్ఞానము మొదలగునవి ఆసురీస్వభావముగలవాని లక్షణములు. (4)

**దైవీ సంపద్విమోక్షాయ నిబంధాయాసురీ మతా ।**
**మా శుచః సంపదం దైవీమ్ అభిజాతోఽసి పాండవ ॥ 5 ॥**

దైవీ, సంపత్, విమోక్షాయ, నిబంధాయ, ఆసురీ, మతా,
మా, శుచః, సంపదమ్, దైవీమ్, అభిజాతః, అసి, పాండవ ॥ 5 ॥

| | | | |
|---|---|---|---|
| పాండవ! | = ఓ అర్జునా! | మతా | = భావింపబడును |
| దైవీ సంపత్ | = దైవీ సంపద | (అతః) | = కనుక |
| విమోక్షాయ | = ముక్తికొఱకు (ముక్తిదాయకము) | మా శుచః | = శోకింపకుము |
| ఆసురీ | = ఆసురీసంపద | (యతః) | = ఎందువలన అనగా (నీవు) |
| నిబంధాయ | = బంధము కొఱకు (బంధహేతువు) అని | దైవీమ్, సంపదమ్ | = దైవీసంపదతో |
| | | అభిజాతః, అసి | = పుట్టినవాడవు |

ఓ అర్జునా! దైవీసంపద ముక్తిదాయకము. ఆసురీసంపద బంధహేతువు. నీవు దైవీసంపదతో పుట్టినవాడవు. కనుక శోకింపకుము (5)

**ద్వౌ భూతసర్గౌ లోకేఽస్మిన్ దైవ ఆసుర ఏవ చ ।**
**దైవో విస్తరశః ప్రోక్తః ఆసురం పార్థ మే శృణు ॥ 6 ॥**

ద్వౌ, భూతసర్గౌ, లోకే, అస్మిన్, దైవః, ఆసురః, ఏవ, చ,
దైవః, విస్తరశః, ప్రోక్తః, ఆసురమ్, పార్థ, మే, శృణు ॥ 6 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| పార్థ! | = | ఓ అర్జునా! | (స్తః) | = | (కలవు) |
| అస్మిన్, లోకే | = | ఈలోకమునందు | దైవః | = | దైవలక్షణములుగల వారిని గూర్చి |
| దైవః | = | దైవలక్షణములుగల మానవ సముదాయము | విస్తరశః | = | విస్తృతముగా |
| ఆసురః, చ | = | అసురలక్షణములు గల మానవ సముదాయము (అని) | ప్రోక్తః | = | చెప్పబడినది |
| | | | ఆసురమ్ | = | అసురసృష్టిని (వారిని గూర్చి) |
| ద్వౌ, ఏవ | = | రెండు విధములగు | మే | = | నా వలన |
| భూతసర్గౌ | = | ప్రాణుల (మానవ) సృష్టులు | శృణు | = | వినుము |

ఓ అర్జునా! ఈ లోకమునన్న మానవులు రెండువిధములుగా ఉందురు. దైవలక్షణములు గలవారు కొందఱు. అసురలక్షణములు గలవారు మఱికొందఱు. దైవ లక్షణములు విస్తృతముగా తెల్పబడినవి. ఇప్పుడు అసురలక్షణములుగలవారిని గూర్చి వివరముగా తెల్పెదను వినుము. (6)

**ప్రవృత్తిం చ నివృత్తిం చ జనా న విదురాసురాః ।**
**న శౌచం నాపి చాచారో న సత్యం తేషు విద్యతే ॥ 7 ॥**

ప్రవృత్తిమ్, చ, నివృత్తిమ్, చ, జనాః, న, విదుః, ఆసురాః,
న, శౌచమ్, న, అపి, చ, ఆచారః, న, సత్యమ్, తేషు, విద్యతే ॥ 7 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| ఆసురాః | = | అసురస్వభావముగల | శౌచమ్ | = | బాహ్యాభ్యంతరశుద్ధి |
| జనాః | = | మనుష్యులు | న, విద్యతే | = | ఉండదు |
| ప్రవృత్తిమ్, చ | = | (ధర్మ) ప్రవృత్తినిగాని | ఆచారః, చ | = | సత్కర్మాచరణమూ |
| నివృత్తిమ్,చ | = | (అధర్మ) నివృత్తినిగాని | న | = | ఉండదు |
| న, విదుః | = | ఎఱుంగరు | సత్యమ్, అపి | = | సత్యభాషణముకూడ, |
| తేషు | = | వారిలో | న | = | ఉండదు |

ఆసురస్వభావముగలవారు ప్రవృత్తినివృత్తులను (కర్తవ్యాకర్తవ్యములను) ఎఱుగరు. కనుక, వారిలో బాహ్యాభ్యంతరశుచిత్వముగాని, శ్రేష్ఠమైన ప్రవర్తనగాని, సత్యభాషణముగాని ఉండనే ఉండవు (7)

**అసత్యమప్రతిష్ఠం తే జగదాహురనీశ్వరమ్ ।**
**అపరస్పరసంభూతం కిమన్యత్ కామహైతుకమ్ ॥ 8 ॥**

అసత్యమ్, అప్రతిష్ఠమ్, తే, జగత్, ఆహుః, అనీశ్వరమ్,
అపరస్పరసంభూతమ్, కిమ్, అన్యత్, కామహైతుకమ్ ॥ 8 ॥

| | | | |
|---|---|---|---|
| తే | = వారు (ఆసురీ ప్రకృతి గల మనుష్యులు) | అపరస్పర సంభూతమ్ | = కేవలము స్త్రీపురుష సంయోగమువలననే ఉత్పన్నమైనదనియు |
| జగత్ | = జగత్తు | | |
| అప్రతిష్ఠమ్ | = ఆశ్రయ రహితమనియు | కామ హైతుకమ్ | = కామమే దీనికి కారణమనియు |
| అసత్యమ్ | = సర్వథా అసత్యమనియు | అన్యత్, కిమ్ | = ఇది తప్ప మఱేమియు లేదనియు |
| అనీశ్వరమ్ | = ఈశ్వరుడే లేనిదనియు | ఆహుః | = పలికెదరు |

ఈ జగత్తునకు ఆధారమైనది ఏదియును లేదనియు, ఇది అసత్యమనియు, భగవంతుడనెడివాడు లేనేలేడనియు, కామప్రేరితులైన స్త్రీపురుషులసంయోగ కారణముగ జీవులు సహజముగనే పుట్టుచున్నారనియు, కావున సృష్టికి కామము తప్ప మఱొక కారణమే లేదనియు ఆసురలక్షణములు గలవారు భావింతురు (8)

**ఏతాం దృష్టిమవష్టభ్య నష్టాత్మానోఽల్పబుద్ధయః ।**
**ప్రభవంత్యుగ్రకర్మాణః క్షయాయ జగతోఽహితాః ॥ 9 ॥**

ఏతామ్, దృష్టిమ్, అవష్టభ్య, నష్టాత్మానః, అల్పబుద్ధయః,
ప్రభవంతి, ఉగ్రకర్మాణః, క్షయాయ, జగతః అహితాః ॥ 9 ॥

| | | | |
|---|---|---|---|
| ఏతామ్, దృష్టిమ్ | = ఈ మిథ్యావాదమును (నాస్తిక దృష్టిని) | అవష్టభ్య | = అవలంబించి |

| | | | |
|---|---|---|---|
| నష్టాత్మాన: | = తమస్వభావమును కోల్పోయిన వారైన (ఆత్మయొక్క అస్తిత్వమును విశ్వసింపనివారై) | | అపకారము చేయునట్టి |
| అల్పబుద్ధయ: | = మందబుద్ధులు | ఉగ్రకర్మాణ: | = క్రూరకర్మలను ఆచరించువారై |
| అహితా: | = అందరికిని | జగత:, క్షయాయ | = జగత్తుయొక్క వినాశము కొఱకే |
| | | ప్రభవంతి | = సమర్థులగుచున్నారు |

అసంబద్ధమైన ఇట్టి మిథ్యావాదముచేయు భౌతికవాదులు ఆత్మనుగూర్చి తలంపరు. (ఆత్మయొక్క అస్తిత్వమును విశ్వసింపరు) వారు మందబుద్ధులు. వారు అందరికిని అపకారముచేయుక్రూరులు. వారిశక్తిసామర్థ్యములు ప్రపంచ వినాశమునకే వినియోగపడుచుండును. (9)

**కామమాశ్రిత్య దుష్పూరం దంభమానమదాన్వితా: ।**
**మోహాద్గృహీత్వాసద్గ్రాహాన్ ప్రవర్తంతేఽశుచివ్రతా: ॥ 10 ॥**

కామమ్, ఆశ్రిత్య, దుష్పూరమ్, దంభమానమదాన్వితా:,
మోహాత్, గృహీత్వా, అసద్గ్రాహాన్, ప్రవర్తంతే, అశుచివ్రతా: ॥ 10 ॥

| | | | |
|---|---|---|---|
| దంభమాన మదాన్వితా: | = దంభము, దురభిమానము, మదము మున్నగువానితో గూడిన వీరు | అసద్గ్రాహాన్ | = మిథ్యా సిద్ధాంతములను |
| | | గృహీత్వా | = అవలంబించి |
| దుష్పూరమ్ | = నింపశక్యముగాని (తనివితీరని) | అశుచివ్రతా: | = శాస్త్రవిరుద్ధములైన భ్రష్టాచారములను ఆచరించుచు |
| కామమ్, ఆశ్రిత్య | = కోరికలను ఆశ్రయించి | | |
| మోహాత్ | = అజ్ఞానకారణముగ | ప్రవర్తంతే | = ప్రవర్తించెదరు |

దంభము, దురభిమానము, మదములతోగూడిన ఈ ఆసురలక్షణములు గలవారు యుక్తాయుక్తములను మరచి, తమవాంఛలను ఏదోవిధముగ తీర్చుకొనుటకు సిద్ధపడుదురు. అజ్ఞానకారణముగ మిథ్యాసిద్ధాంతములను ఆశ్రయింతురు. శాస్త్రవిరుద్ధముగా భ్రష్టాచారులై ప్రవర్తింతురు. (10)

**చింతామపరిమేయాం చ ప్రలయాంతాముపాశ్రితా: ।**
**కామోపభోగపరమా: ఏతావదితి నిశ్చితా: ॥ 11 ॥**

చింతామ్, అపరిమేయామ్, చ, ప్రలయాంతామ్, ఉపాశ్రితాః,
కామోపభోగపరమాః, ఏతావత్, ఇతి, నిశ్చితాః ॥ 11 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| ప్రలయాంతామ్ | = | మరణించువఱకును ఉండెడి | కామోపభోగ పరమాః | = | విషయభోగానుభవములయందే మునిగియున్నవారై |
| అపరిమేయామ్ | = | అంతులేని | చ | = | మఱియు |
| చింతామ్ | = | చింతా పరంపరను | ఏతావత్, ఇతి | = | ఇదియే నిజమైన సుఖమని |
| ఉపాశ్రితాః | = | ఆశ్రయించినవారై | నిశ్చితాః | = | భావింతురు |

మరణించువఱకును వారు అంతులేనిచింతలలోనే మునిగిపోవుచుందురు. విషయభోగానుభవములయందే తత్పరులై అదియే నిజమైన సుఖమని భావింతురు. (11)

**ఆశాపాశశతైర్బద్ధాః కామక్రోధపరాయణాః ।**
**ఈహంతే కామభోగార్థమ్ అన్యాయేనార్థసంచయాన్ ॥ 12 ॥**

ఆశాపాశశతైః, బద్ధాః, కామక్రోధపరాయణాః,
ఈహంతే, కామభోగార్థమ్, అన్యాయేన, అర్థసంచయాన్ ॥ 12 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| ఆశాపాశశతైః, బద్ధాః | = | ఆశాపాశపరంపరలచే బంధింపబడినవారు | అన్యాయేన | = | అక్రమ మార్గముల ద్వారా |
| కామక్రోధ పరాయణాః | = | కామక్రోధములకు లోనైనవారై | అర్థసంచయాన్ | = | ధనసమూహములను ప్రోగుచేయుటకొఱకు |
| కామభోగార్థమ్ | = | విషయభోగముల నిమిత్తమై | ఈహంతే | = | ఆరాటపడుచుందురు |

వారు ఆశాపాశపరంపరలచే ఎల్లప్పుడును బంధింపబడుచుందురు. కామక్రోధపరాయణులై ప్రవర్తింతురు. విషయభోగముల నిమిత్తమై, అన్యాయ మార్గములద్వారా ధనార్జనకు పాల్పడుచుందురు. (12)

**ఇదమద్య మయా లబ్ధమ్ ఇమం ప్రాప్స్యే మనోరథమ్ ।**
**ఇదమస్తీదమపి మే భవిష్యతి పునర్ధనమ్ ॥ 13 ॥**

ఇదమ్, అద్య, మయా, లబ్ధమ్, ఇమమ్, ప్రాప్స్యే, మనోరథమ్ ।
ఇదమ్, అస్తి, ఇదమ్, అపి, మే, భవిష్యతి, పునః, ధనమ్ ॥ 13 ॥

| | | | | |
|---|---|---|---|---|
| మయా | = నాచేత | మే | = | నాయొద్ద |
| అద్య | = ఈనాటికే (ఇప్పటికే) | ఇదమ్, ధనమ్ | = | ఈపాటిధనము |
| ఇదమ్ | = ఇట్టి అభీష్టవస్తువు(లు) | | | |
| లబ్ధమ్ | = పొందబడినది(వి) | అస్తి | = | కలదు |
| ఇమమ్, మనోరథమ్ | = ఇంకను ఇట్టి అభీష్టమునుగూడ | పునః, అపి | = | ఇంకను |
| ప్రాప్స్యే | = పొందగలను | ఇదమ్, భవిష్యతి | = | ఈ సంపద ఎంతో పెఱుగును |

"నేను మిక్కిలి పురుషార్థిని గనుక ఈ అభీష్టవస్తువును పొందితిని. ఇంకను నా మనోరథములన్నింటిని సాధించుకొనగలను. ఇప్పటికే నాకడ ఎంతో ధనము ఉన్నది. మున్ముందు ఇంకను ఎంతోధనమును సంపాదింపగలను" అని వారు తలంచుచుందురు. (13)

**అసౌ మయా హతః శత్రుః హనిష్యే చాపరానపి ।**
**ఈశ్వరోఽహమహం భోగీ సిద్ధోఽహం బలవాన్ సుఖీ ॥ 14 ॥**

అసౌ, మయా, హతః, శత్రుః, హనిష్యే, చ, అపరాన్, అపి,
ఈశ్వరః, అహమ్, అహమ్, భోగీ, సిద్ధః, అహమ్, బలవాన్, సుఖీ ॥ 14 ॥

| | | | | |
|---|---|---|---|---|
| అసౌ, శత్రుః | = ఈ శత్రువు | భోగీ | = | సమస్త భోగములను అనుభవించువాడను |
| మయా | = నాచేత | | | |
| హతః | = చంపబడెను | అహమ్, సిద్ధః | = | నేను సర్వసిద్ధులు గలవాడను |
| చ | = మఱియు | | | |
| అపరాన్, అపి | = ఇతరశత్రువులనుగూడ | బలవాన్ | = | నేను మిక్కిలి బలవంతుడను |
| అహమ్, హనిష్యే | = నేను వధింపగలను | | | |
| అహమ్, ఈశ్వరః | = నేనే సర్వాధిపతిని | సుఖీ | = | సుఖిని |

"నేను ఈ శత్రువును వధించితిని. ఇతర శత్రువులనుగూడ వధింపగలను. నేనే సర్వాధిపతిని. సమస్త సుఖభోగములను అనుభవింపగలవాడను నేనే. సిద్ధులన్నియు నా గుప్పిటనే యున్నవి. నేనే గొప్ప బలవంతుడను, సుఖిని. (14)

**ఆఢ్యోఽభిజనవానస్మి కోఽన్యోఽస్తి సదృశో మయా ।**
**యక్ష్యే దాస్యామి మోదిష్య ఇత్యజ్ఞానవిమోహితాః ॥ 15 ॥**
**అనేకచిత్తవిభ్రాంతాః మోహజాలసమావృతాః ।**
**ప్రసక్తాః కామభోగేషు పతంతి నరకేఽశుచౌ ॥ 16 ॥**

ఆఢ్యః, అభిజనవాన్, అస్మి, కః, అన్యః, అస్తి, సదృశః, మయా,
యక్ష్యే, దాస్యామి, మోదిష్యే, ఇతి, అజ్ఞానవిమోహితాః ॥ 15 ॥
అనేకచిత్తవిభ్రాంతాః, మోహజాలసమావృతాః,
ప్రసక్తాః, కామభోగేషు, పతంతి, నరకే, అశుచౌ ॥ 16 ॥

| | | |
|---|---|---|
| ఆఢ్యః, (అహమ్) | = | నేను గొప్ప ధనవంతుడను |
| అభిజనవాన్, అస్మి | = | గొప్ప పరివారము గలవాడను |
| మయా, సదృశః | = | నాతో సమానుడైనవాడు |
| అన్యః | = | మఱియొకడు |
| కః, అస్తి | = | ఎవడు కలడు? |
| యక్ష్యే | = | యజ్ఞములను చేయగలను |
| దాస్యామి | = | దానములను ఈయగలను |
| మోదిష్యే | = | యథేచ్ఛగా వినోదింపగలను |
| ఇతి | = | ఇట్లు అనేకవిధములుగా |
| అజ్ఞాన విమోహితాః | = | అజ్ఞాన విమోహితులై |
| అనేక చిత్తవిభ్రాంతాః | = | పెక్కురీతుల చిత్త భ్రమణములకులోనై |
| మోహజాల సమావృతాః | = | మోహజాలమున చిక్కుకొన్నవారై |
| కామభోగేషు | = | విషయభోగములయందు |
| ప్రసక్తాః | = | మిక్కిలి ఆసక్తులై (ఈ ఆసురీసంపద గలవారు) |
| అశుచౌ, నరకే | = | ఘోరనరకముల యందు |
| పతంతి | = | పడుచుందురు |

"నేనే గొప్ప ధనవంతుడను, మిక్కిలి పరివారము గలవాడను. నాతో సమానుడు మరియొకడులేడు. నేను యజ్ఞములను చేయగలను. దానములు ఇయ్యగలను. యథేచ్ఛముగా వినోదింపగలను." – అనుచు అనేక విధములుగా అజ్ఞానమోహితులై చిత్తభ్రమణమునకు లోనై మోహజాలమునందు చిక్కుకొని, ఆసురలక్షణములు గలవారు విషయభోగములయందే మిక్కిలి ఆసక్తులై ఘోరనరకములయందు పడిపోవుచుందురు (15,16)

**ఆత్మసంభావితాః స్తబ్ధా ధనమానమదాన్వితాః ।**
**యజంతే నామయజ్ఞైస్తే దంభేనావిధిపూర్వకమ్ ॥ 17 ॥**

ఆత్మసంభావితాః, స్తబ్ధాః, ధనమానమదాన్వితాః,
యజంతే, నామయజ్ఞైః, తే, దంభేన, అవిధిపూర్వకమ్ ॥ 17 ॥

| | | | |
|---|---|---|---|
| తే | = వారు ( ఆ అసుర లక్షణములు గలవారు) | ధనమాన మదాన్వితాః | = సంపదలచే, దురభిమానముచే మదోన్మత్తులై విఱ్ఱవీగువారు |
| ఆత్మ సంభావితాః | = తమకు తామే గొప్పవారమని తలంచుకొను చుందురు | అవిధిపూర్వకమ్ | = శాస్త్రవిరుద్ధముగా |
| | | నామయజ్ఞైః | = పేరుకు మాత్రమే |
| | | దంభేన | = ఆడంబరముతో |
| స్తబ్ధాః | = స్తబ్ధులై (గర్వోన్మత్తులై) | యజంతే | = యజ్ఞములను ఆచరింతురు |

వారు తమకు తామే గొప్పవారమని భావించుకొనుచు, గర్వోన్మత్తులై ధనదురహంకారములతో కన్నుమిన్నుగానక ప్రమత్తులై, శాస్త్రవిరుద్ధముగా ఆడంబరప్రధానముగా పేరుకు మాత్రమే యజ్ఞముల నాచరించుదురు. (17)

**అహంకారం బలం దర్పం కామం క్రోధం చ సంశ్రితాః ।**
**మామాత్మపరదేహేషు ప్రద్విషంతోఽభ్యసూయకాః ॥ 18 ॥**

అహంకారమ్, బలమ్, దర్పమ్, కామమ్, క్రోధమ్, చ, సంశ్రితాః,
మామ్, ఆత్మపరదేహేషు, ప్రద్విషంతః, అభ్యసూయకాః ॥ 18 ॥

| | | | |
|---|---|---|---|
| అహంకారమ్ | = అహంకారము | అభ్యసూయకాః | = అసూయతో ఇతరులను నిందించువారై |
| బలమ్ | = బలము | | |
| దర్పమ్ | = దర్పము (మొండితనము) | ఆత్మ పరదేహేషు | = తమ శరీరముల యందును, ఇతరుల శరీరములయందును |
| కామమ్ | = కామము | | |
| క్రోధమ్ | = క్రోధము (మొదలగువాటిని) | మామ్ | = అంతర్యామిగానున్న నన్ను |
| సంశ్రితాః, చ | = ఆశ్రయించినవారై | ప్రద్విషంతః | = ద్వేషించుచుందురు |

అహంకారము, బలము, దర్పము, కామము, క్రోధములకు వశులై, ఇతరులను నిందించుచు తమశరీరములయందును, ఇతరులశరీరములయందును, అంతర్యామిగానున్న నన్ను ద్వేషించుచుందురు. (18)

**తానహం ద్విషతః క్రూరాన్ సంసారేషు నరాధమాన్ ।**
**క్షిపామ్యజస్రమశుభాన్ ఆసురీష్వేవ యోనిషు ॥ 19 ॥**

తాన్, అహమ్, ద్విషతః, క్రూరాన్, సంసారేషు, నరాధమాన్,
క్షిపామి, అజస్రమ్, అశుభాన్, ఆసురీషు, ఏవ, యోనిషు ॥ 19 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| తాన్, ద్విషతః | = | అట్లు ద్వేషించువారైన | అజస్రమ్ | = | ఎల్లప్పుడును, మాటి మాటికిని |
| అశుభాన్ | = | పాపాత్ములను | | | |
| క్రూరాన్, | = | క్రూరులైన | ఆసురీషు, | | ఆసురీ |
| నరాధమాన్ | = | నరాధములను | యోనిషు, | = | యోనుల |
| అహమ్ | = | నేను | ఏవ | | యందే |
| సంసారేషు | = | ఈ సంసారముల యందు | క్షిపామి | | పడవేయుదును |

అట్లు ఇతరులను ద్వేషించు పాపాత్ములను, క్రూరులైన నరాధములను మాటిమాటికిని ఈ సంసారమునందు ఆసురీయోనులలోనే నేను పడవేయుచుందును. (19)

**ఆసురీం యోనిమాపన్నా మూఢా జన్మని జన్మని ।**
**మామప్రాప్యైవ కౌంతేయ తతో యాంత్యధమాం గతిమ్ ॥ 20 ॥**

ఆసురీమ్, యోనిమ్, ఆపన్నాః, మూఢాః, జన్మని, జన్మని,
మామ్, అప్రాప్య, ఏవ, కౌంతేయ, తతః, యాంతి, అధమామ్, గతిమ్ ॥ 20 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| కౌంతేయ! | = | ఓ అర్జునా! | ఆపన్నాః | = | పొందినవారై |
| మూఢాః | = | ఈ మూఢులు | తతః | = | దానికంటెను |
| మామ్, అప్రాప్య, ఏవ[1] | = | నన్ను పొందకయే | అధమామ్, గతిమ్ | = | అతిహీనమైన గతిని (నరకమును) |
| జన్మని, జన్మని | = | ప్రతిజన్మయందును | | | |
| ఆసురీమ్, యోనిమ్ | = | ఆసురీయోనిని | యాంతి | = | పొందుదురు |

1. ప్రాణులు భగవత్ప్రాప్తిని పొందుటకు మానవజన్మలభించుట ఒక సువర్ణావకాశము. అజ్ఞానులైనవారు భగవదనుగ్రహమువలన లభించిన ఈ అవకాశమును జారవిడుచుకొని, ఘోరనరకముల పాలయ్యెదరని భగవానుడు వారికై తపనపడుచు 'ఏవ' అను అవ్యయమును ప్రయోగించెను.

ఓ అర్జునా! ఈ ఆసురీప్రకృతిగల మూఢులు, నన్ను పొందకయే, ప్రతిజన్మయందును ఆసురీయోనులనే పొందుచు చివరకు అంతకంటెను హీనమైనగతిని పొందుదురు. అనగా ఘోరమైన నరకములయందు పడెదరు. (20)

**త్రివిధం నరకస్యేదం ద్వారం నాశనమాత్మనః ।**
**కామః క్రోధస్తథా లోభః తస్మాదేతత్త్రయం త్యజేత్ ॥ 21 ॥**

త్రివిధమ్, నరకస్య, ఇదమ్, ద్వారమ్, నాశనమ్, ఆత్మనః,
కామః, క్రోధః, తథా, లోభః, తస్మాత్, ఏతత్, త్రయమ్, త్యజేత్ ॥ 21 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| కామః | = | కామము | నరకస్య, ద్వారమ్[1] | = | నరకద్వారములును |
| క్రోధః | = | క్రోధము | ఆత్మనః, నాశనమ్ | = | ఆత్మనాశమునకు కారణమైనవి |
| తథా | = | అట్లే | తస్మాత్ | = | అందువలన |
| లోభః | = | లోభము | ఏతత్, త్రయమ్ | = | ఈ మూడింటిని |
| ఇదమ్, త్రివిధమ్ | = | ఈమూడు విధములైన | త్యజేత్ | = | త్యజింపవలెను |

కామ క్రోధ లోభములు అను ఈ మూడును నరకద్వారములు. అవి ఆత్మ నాశమునకు కారణములు. అనగా మనుజుని అధోగతిపాలుచేయునవి. కనుక, ఈ మూడింటిని త్యజింపవలెను. (21)

**ఏతైర్విముక్తః కౌంతేయ తమోద్వారైః త్రిభిర్నరః ।**
**ఆచరత్యాత్మనః శ్రేయః తతో యాతి పరాం గతిమ్ ॥ 22 ॥**

ఏతైః, విముక్తః, కౌంతేయ, తమోద్వారైః, త్రిభిః, నరః,
ఆచరతి, ఆత్మనః, శ్రేయః, తతః, యాతి, పరామ్, గతిమ్ ॥ 22 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| కౌంతేయ! | = | ఓ అర్జునా! | ఆత్మనః, శ్రేయః | = | తనకు శ్రేయస్కరమైన (శుభకర్మలనే) |
| ఏతైః, త్రిభిః, తమోద్వారైః | = | ఈమూడు నరక ద్వారములనుండి | ఆచరతి[3] | = | ఆచరించును |
| విముక్తః[2] నరః | = | బయటపడినవాడు | తతః | = | దానివలన (అతడు) |

1. సర్వానర్థములకు మూలములూ, నరకప్రాప్తికి కారణములూ అగుటవలన కామక్రోధ లోభములు నరక ద్వారములని పేర్కొనబడినవి. 2. కామక్రోధ లోభాదివికారములనుండి ముక్తుడగుట- అని దీని అర్థము 3. మానవులు ఆత్మోద్ధరణమునకై భగవదాజ్ఞానుసారము ప్రవర్తింపుచుండుటయే వారు తమ శ్రేయస్సునకై పాటుపడుట యగును.

| | | | | | |
|---|---|---|---|---|---|
| పరామ్, గతిమ్ | = | పరమగతిని | యాతి | = | పొందును. అనగా నన్నే పొందును |

ఓ అర్జునా! ఈ మూడునరకద్వారములనుండి బయటపడినవాడు శుభకర్మలనే ఆచరించును. అందువలన పరమగతిని పొందును. అనగా నన్నే పొందును. (22)

**యః శాస్త్రవిధిముత్సృజ్య వర్తతే కామకారతః ।**
**న స సిద్ధిమవాప్నోతి న సుఖం న పరాం గతిమ్ ॥ 23 ॥**

యః, శాస్త్రవిధిమ్, ఉత్సృజ్య, వర్తతే, కామకారతః,
న, సః, సిద్ధిమ్, అవాప్నోతి, న, సుఖమ్, న, పరామ్, గతిమ్ ॥ 23 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| యః | = | ఏ మనుష్యుడు | సః | = | అతడు |
| శాస్త్రవిధిమ్ | = | శాస్త్రోక్తవిధులను | సిద్ధిమ్ | = | సిద్ధిని |
| ఉత్సృజ్య | = | త్యజించి | న, అవాప్నోతి | = | పొందజాలడు |
| కామకారతః | = | తనయిష్టము వచ్చినట్లు (విశృంఖలముగా) | పరామ్, గతిమ్ | = | పరమగతిని |
| | | | న | = | పొందజాలడు |
| | | | సుఖమ్ | = | సుఖమును సైతము |
| వర్తతే | = | ప్రవర్తించునో | న | = | పొందజాలడు |

శాస్త్రవిధిని త్యజించి, యథేచ్ఛగా (విశృంఖలముగా) ప్రవర్తించువాడు సిద్ధిని పొందజాలడు. వానికి ఇహపరలోకసుఖములు లభింపవు. పరమగతియు ప్రాప్తింపదు. (23)

**తస్మాచ్ఛాస్త్రం ప్రమాణం తే కార్యాకార్యవ్యవస్థితౌ ।**
**జ్ఞాత్వా శాస్త్రవిధానోక్తం కర్మ కర్తుమిహార్హసి ॥ 24 ॥**

తస్మాత్, శాస్త్రమ్, ప్రమాణమ్, తే, కార్యాకార్యవ్యవస్థితౌ,
జ్ఞాత్వా, శాస్త్రవిధానోక్తమ్, కర్మ, కర్తుమ్, ఇహ, అర్హసి ॥ 24 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| తస్మాత్ | = | అందువలన | కార్యాకార్య వ్యవస్థితౌ | = | కార్యాకార్య వ్యవస్థితి యందు |
| తే | = | నీకు | | | |
| ఇహ | = | ఈ | | | |

| | | | |
|---|---|---|---|
| శాస్త్రమ్, ప్రమాణమ్ | = శాస్త్రమే ప్రమాణము | కర్మ | = కర్మలనే |
| | | కర్తుమ్ | = చేయుటకు |
| ఏవమ్, జ్ఞాత్వా | = ఈ విషయమును ఎఱింగి | | |
| శాస్త్ర విధానోక్తమ్ | = శాస్త్ర మర్యాదను అనుసరించి చెప్పబడిన | అర్హసి | = తగియున్నావు (ఆచరింపుము) |

కర్తవ్యాకర్తవ్యములను నిర్ణయించుటకు శాస్త్రమే ప్రమాణము. కనుక శాస్త్రోక్తకర్మలను గూర్చి బాగుగా తెలిసికొని, అట్టి కర్మలను ఆచరింపుము. (24)

*ఓం తత్సదితి శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం*
*యోగశాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే దైవాసురసంపద్విభాగయోగో నామ*
*షోడశోఽధ్యాయః ॥ ౧౬ ॥*

॥ ఓం శ్రీపరమాత్మనే నమః ॥

# అథ సప్తదశోఽధ్యాయః - శ్రద్ధాత్రయవిభాగయోగః

## (పదునేడవ అధ్యాయము-శ్రద్ధాత్రయవిభాగయోగము)

ముఖ్యాంశములు : [(1 నుండి 6వ శ్లోకము వఱకు) శ్రద్ధ విషయము, మరియు శాస్త్ర విరుద్ధముగా ఘోరతపస్సులను చేయువారి విషయము. (7 నుండి 22 వఱకు) ఆహారము, యజ్ఞము, తపస్సు, దానముల వేర్వేఱు భేదములు (23 నుండి 28 వఱకు). ఓం, తత్, సత్ ల ప్రయోగములనుగూర్చిన వ్యాఖ్య.]

**అర్జున ఉవాచ**

**యే శాస్త్రవిధిముత్సృజ్య యజంతే శ్రద్ధయాన్వితాః ।**
**తేషాం నిష్ఠా తు కా కృష్ణ సత్త్వమాహో రజస్తమః ॥ 1 ॥**

యే, శాస్త్రవిధిమ్, ఉత్సృజ్య, యజంతే, శ్రద్ధయా, అన్వితాః,
తేషామ్, నిష్ఠా, తు, కా, కృష్ణ, సత్త్వమ్, ఆహో, రజః, తమః ॥ 1 ॥

| | | | |
|---|---|---|---|
| కృష్ణ! | = కృష్ణా! | తేషామ్ | = వారియొక్క |
| యే | = ఎవరైతే | నిష్ఠా, తు, | = నిష్ఠ అయితే |
| శాస్త్రవిధిమ్ | = శాస్త్రవిధానమును | కా | = ఎట్టిది? (అది) |
| ఉత్సృజ్య | = త్యజించి | సత్త్వమ్ | = సాత్త్వికమా |
| శ్రద్ధయా, అన్వితాః | = భక్తిశ్రద్ధలు గలవారై | ఆహో | = అథవా (లేక) |
| యజంతే | = దేవపూజాదికములను ఆచరింతురో | రజః | = రాజసమా (లేక) |
| | | తమః | = తామసమా? |

అర్జునుడు పలికెను - ఓ కృష్ణా! శాస్త్రవిధిని త్యజించి, భక్తిశ్రద్ధలతో యజ్ఞములను గాని, దైవపూజలనుగాని కొందఱు చేయుచుందురు. వారినిష్ఠ (వారి విధానము) సాత్త్వికమా? రాజసమా? తామసమా? (1)

**శ్రీభగవాన్ ఉవాచ**

**త్రివిధా భవతి శ్రద్ధా దేహినాం సా స్వభావజా ।**
**సాత్త్వికీ రాజసీ చైవ తామసీ చేతి తాం శృణు ॥ 2 ॥**

త్రివిధా, భవతి, శ్రద్ధా, దేహినామ్, సా, స్వభావజా,
సాత్త్వికీ, రాజసీ, చ, ఏవ, తామసీ, చ, ఇతి, తామ్, శృణు ॥ 2 ॥

| | | | |
|---|---|---|---|
| దేహినామ్ | = మనుష్యులయొక్క | తామసీ, ఇతి | = తామసమనియు |
| స్వభావజా[1] | = స్వభావమును అనుసరించి ఏర్పడు | త్రివిధా, ఏవ | = మూడు విధములుగనే |
| | | భవతి | = ఉండును |
| సా, శ్రద్ధా | = శాస్త్రవిధిని పాటింపని, అట్టి శ్రద్ధ | తామ్ | = అట్టి శ్రద్ధను గూర్చి |
| సాత్త్వికీ, చ | = సాత్త్వికమనియు | (మత్తః) | = నానుండి |
| రాజసీ, చ | = రాజసమనియు | శృణు | = వినుము |

శ్రీభగవానుడు పలికెను- శాస్త్రోక్తముగానుండక కేవలము స్వభావమును అనుసరించి ఏర్పడుచుండు మానవులశ్రద్ధ సాత్త్వికము, రాజసము, తామసము అని మూడు విధములుగా ఉండును. వాటిని గూర్చి వివరించెదను. వినుము. (2)

**సత్త్వానురూపా సర్వస్య శ్రద్ధా భవతి భారత ।**
**శ్రద్ధామయోఽయం పురుషో యో యచ్ఛ్రద్ధః స ఏవ సః ॥ 3 ॥**

సత్త్వానురూపా, సర్వస్య, శ్రద్ధా, భవతి, భారత,
శ్రద్ధామయః, అయమ్, పురుషః, యః యచ్ఛ్రద్ధః, సః, ఏవ, సః ॥ 3 ॥

| | | | |
|---|---|---|---|
| భారత! | = ఓ అర్జునా! | శ్రద్ధామయః | = ఏదియేని ఒక శ్రద్ధనుకలిగియే యుండును |
| సర్వస్య, శ్రద్ధా | = ప్రతివ్యక్తియొక్క శ్రద్ధయు | (అతః) | = ఇందువలన |
| సత్త్వానురూపా | = వారి అంతఃకరణ రీతికి తగినట్లు | యః | = ఏ పురుషుడు |
| | | యచ్ఛ్రద్ధః | = ఎట్టి శ్రద్ధగలవాడో |
| భవతి | = ఉండును | సః | = అతడు |
| అయమ్, పురుషః | = ఈపురుషుడు | సః, ఏవ | = తద్రూపముగలవాడే యగును |

ఓ అర్జునా! మనుష్యులందఱిశ్రద్ధయు వారిఅంతఃకరణరీతులకు తగినట్లు ఉండును. ప్రతివ్యక్తికిని ఏదో ఒక శ్రద్ధఉండనే ఉండును. అతని జీవన విధానమంతయును అతని శ్రద్ధకు అనుగుణముగా కొనసాగుచుండును. దానినిబట్టి అతడెట్టి శ్రద్ధ కలిగియున్నదియు తెలిసికొనవచ్చును. (3)

1. అనేకజన్మలలో చేసికొనిన కర్మలయొక్కసంచితసంస్కారములనుండి ఉత్పన్నమైన శ్రద్ధను స్వభావజమైన 'శ్రద్ధ' అని యందురు.

**యజంతే సాత్త్వికా దేవాన్ యక్షరక్షాంసి రాజసాః ।**
**ప్రేతాన్ భూతగణాంశ్చాన్యే యజంతే తామసా జనాః ॥ 4 ॥**

యజంతే, సాత్త్వికాః, దేవాన్, యక్షరక్షాంసి, రాజసాః,
ప్రేతాన్, భూతగణాన్, చ, అన్యే, యజంతే, తామసాః, జనాః ॥ 4 ॥

| | | | |
|---|---|---|---|
| సాత్త్వికాః | = సాత్త్విక పురుషులు | అన్యే, తామసాః, జనాః | = ఇతరులైన తామస లక్షణములు గలవారు |
| దేవాన్ | = దేవతలను | ప్రేతాన్ | = ప్రేతములను |
| యజంతే | = పూజింతురు | భూతగణాన్, చ | = భూతగణములను |
| రాజసాః | = రాజసపురుషులు | యజంతే | = పూజింతురు |
| యక్షరక్షాంసి | = యక్షులను, రాక్షసులను | | |

వారిలో సాత్త్వికులు దేవతలను, రాజసులు యక్షరాక్షసులను, తామసులు ప్రేతభూతగణములను పూజించెదరు. (4)

**అశాస్త్రవిహితం ఘోరం తప్యంతే యే తపో జనాః ।**
**దంభాహంకారసంయుక్తాః కామరాగబలాన్వితాః ॥ 5 ॥**

అశాస్త్రవిహితమ్, ఘోరమ్, తప్యంతే, యే, తపః, జనాః,
దంభాహంకారసంయుక్తాః, కామరాగబలాన్వితాః ॥ 5 ॥

| | | | |
|---|---|---|---|
| దంభాహంకార సంయుక్తాః | = దంభము, అహంకారములతో కూడియుండు వారు, మఱియు | అశాస్త్రవిహితమ్ | = శాస్త్రవిరుద్ధమైన (కేవలము మనస్సునకు తోచిన రీతిగా) |
| కామ, రాగ బలాన్వితాః | = కోరికలు, ఆసక్తి కలిగియుండి బలగర్వితులైనవారు | ఘోరమ్, తపః | = ఘోరమైన తపస్సును |
| యే, జనాః | = ఏమనుష్యులు | తప్యంతే | = ఆచరింతురో |

దంభము, అహంకారము గలవారు, కోరికలు, ఆసక్తి కలిగియుండువారు, బలగర్వితులు ఐనవారు, శాస్త్రవిరుద్ధముగా మనఃకల్పితమైన ఘోరతపస్సులను ఆచరించుచు... (5)

**కర్శయంతః శరీరస్థం భూతగ్రామమచేతసః ।**
**మాం చైవాంతఃశరీరస్థం తాన్ విద్ధ్యాసురనిశ్చయాన్ ॥ 6 ॥**

కర్శయంతః, శరీరస్థమ్, భూతగ్రామమ్, అచేతసః,
మామ్, చ, ఏవ, అంతఃశరీరస్థమ్, తాన్, విద్ధి, ఆసురనిశ్చయాన్ ॥ 6 ॥

| | | | |
|---|---|---|---|
| శరీరస్థమ్ | = శరీరములయందున్న | కర్శయంతః[2] | = కృశింపజేయుచుందురు |
| భూతగ్రామమ్[1] | = భూతసముదాయమును | తాన్, అచేతసః | = అట్టి అజ్ఞానులను |
| చ | = మఱియు | ఆసుర నిశ్చయాన్ | = ఆసురస్వభావములు గలవారని |
| అంతశ్శరీరస్థమ్ | = అంతర్యామిగానున్న | విద్ధి | = ఎఱుంగుము. |
| మామ్, ఏవ | = పరమాత్ముడనైన నన్నే | | |

శరీరములయందున్న జీవులను, మరియు అంతర్యామిగా అనగా పరమాత్ముడనైన నన్ను కృశింపజేయువారు అజ్ఞానులైన ఆసురస్వభావము గలవారని యెఱుంగుము. (6)

**ఆహారస్త్వపి సర్వస్య త్రివిధో భవతి ప్రియః ।**
**యజ్ఞస్తపస్తథా దానం తేషాం భేదమిమం శృణు ॥ 7 ॥**

ఆహారః, తు, అపి, సర్వస్య, త్రివిధః, భవతి, ప్రియః,
యజ్ఞః, తపః, తథా, దానమ్, తేషామ్, భేదమ్, ఇమమ్, శృణు ॥ 7 ॥

| | | | |
|---|---|---|---|
| సర్వస్య | = ప్రతివ్యక్తికిని | యజ్ఞః | = యజ్ఞము |
| ఆహారః, అపి | = (వాని వాని స్వభావమును అనుసరించి) ఆహారము గూడ | తపః | = తపస్సు |
| త్రివిధః | = మూడువిధములుగా | దానమ్ | = దానము (అనునవిగూడ మూడు విధములు) |
| ప్రియః, భవతి | = ప్రియముగా ఉండును | తేషామ్ | = వాటియొక్క |
| తు | = మఱియు | ఇమమ్, భేదమ్ | = ఈభేదమును వేర్వేఱుగా |
| తథా | = అట్లే | శృణు | = వినుము |

1. శరీరేంద్రియమనస్సులరూపములలో పరిణతిచెందిన ఆకాశాది పంచ మహాభూతములు.
2. శాస్త్రవిరుద్ధమైన ఉపవాసాదిఘోరములైన ఆచరణములద్వారా శరీరమును కృశింపజేయుట, భగవదంశయైన జీవాత్మను కష్టపెట్టుట, భూతసముదాయమును, అంతర్యామియైన పరమాత్మను క్లేశములపాలు చేయుటయగును.

మనుష్యుల స్వభావములను అనుసరించి, వారికి ఇష్టములైన ఆహారములు గూడ మూడు విధములుగా ఉండును. అట్లే ఆయా మనుష్యులు ఆచరించు యజ్ఞములు, తపస్సులు, దానములుగూడా మూడేసివిధములుగానే ఉండును. వాటినిగూర్చి వేర్వేఱుగా విశదపరచెదను వినుము. (7)

**ఆయుఃసత్త్వబలారోగ్యసుఖప్రీతివివర్ధనాః ।**
**రస్యాః స్నిగ్ధాః స్థిరా హృద్యా ఆహారాః సాత్త్వికప్రియాః ॥ 8 ॥**

ఆయుఃసత్త్వబలారోగ్యసుఖప్రీతివివర్ధనాః,
రస్యాః, స్నిగ్ధాః, స్థిరాః, హృద్యాః, ఆహారాః, సాత్త్వికప్రియాః ॥ 8 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| ఆయుస్సత్త్వ బలారోగ్యసుఖ ప్రీతివివర్ధనాః | = | ఆయువు, బుద్ధి, బలము, ఆరోగ్యము, సుఖము, ప్రీతి, మున్నగు వాటిని అభివృద్ధి పఱచునవి | హృద్యాః | = | సహజముగ మనః ప్రీతికరములైన |
| | | | ఆహారాః | = | ఆహార పదార్థములు |
| | | | సాత్త్విక ప్రియాః | = | సాత్త్విక లక్షణములు గలవారికి ప్రియమైనవి |
| రస్యాః | = | రసయుక్తములైనవి | | | |
| స్నిగ్ధాః | = | స్నిగ్ధములైనవి | | | |
| స్థిరాః[1] | = | స్థిరముగా ఉండునవి | | | |

ఆయువు, బుద్ధి, బలము, ఆరోగ్యము,సుఖము,ప్రీతి మున్నగువానిని అభివృద్ధిపఱచునవియు , పాలు, చక్కెర మొదలగు రసపదార్థములును, వెన్న, నెయ్యి మొదలగు స్నిగ్ధపదార్థములును, ఓజస్సును అభివృద్ధి పఱచు స్థిరపదార్థములును, సాత్త్విక స్వభావమును పెంచు హృద్య పదార్థములును సాత్త్వికులకు ఇష్టమైనవి. (8)

**కట్వమ్లలవణాత్యుష్ణతీక్ష్ణరూక్షవిదాహినః ।**
**ఆహారా రాజసస్యేష్టా దుఃఖశోకామయప్రదాః ॥ 9 ॥**

కట్వమ్లలవణాత్యుష్ణతీక్ష్ణరూక్షవిదాహినః .
ఆహారాః, రాజసస్య, ఇష్టాః, దుఃఖశోకామయప్రదాః ॥ 9 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| కటు | = | చేదు | తీక్ష్ణ | = | కారము |
| అమ్ల | = | పులుపు | రూక్ష | = | మాడిన |
| లవణ | = | ఉప్పు | విదాహినః | = | దాహకములైన పదార్థములును |
| అత్యుష్ణ | = | మిక్కిలి వేడి | | | |

1. శరీరమునందు చాలాకాలము స్థిరముగానుండు సారముగల భోజనపదార్థాలను 'స్థిరాః' అని యందురు.

| | | | |
|---|---|---|---|
| దుఃఖశోక-ఆమయప్రదాః | = దుఃఖమును, చింతలను రోగములను కలిగించు నట్టివియుఅగు | ఆహారాః | = ఆహారపదార్థములు |
| | | రాజసస్య | = రాజసపురుషునకు |
| | | ఇష్టాః | = ప్రియములైనవి |

చేదు, పులుపు, ఉప్పు, కారము, రుచులకు సంబంధించినవి, మిక్కిలి వేడి వస్తువులు, మాడిన పదార్థములు, దాహము కల్గించునవి, అట్లే దుఃఖము, చింత, రోగములను ఉత్పన్నము చేయు ఆహారపదార్థములు రాజసస్వభావము గలవారికి ఇష్టములగును. (9)

**యాతయామం గతరసం పూతి పర్యుషితం చ యత్ ।**
**ఉచ్ఛిష్టమపి చామేధ్యం భోజనం తామసప్రియమ్ ॥ 10 ॥**

యాతయామమ్, గతరసమ్, పూతి, పర్యుషితమ్, చ, యత్,
ఉచ్ఛిష్టమ్, అపి, చ, అమేధ్యమ్, భోజనమ్, తామసప్రియమ్ ॥ 10 ॥

| | | | |
|---|---|---|---|
| యత్, భోజనమ్ | = ఏభోజనమైతే | పర్యుషితమ్, చ | = పాసిపోయినట్టిదియును |
| యాతయామమ్ | = అర్థపక్వమైనది అనగా బాగుగా ఉడకనిదియు పండనిదియు | ఉచ్ఛిష్టం, చ | = ఎంగిలియైనదియు |
| | | అమేధ్యమ్, అపి | = అపవిత్రమైనదియు అగునో |
| గతరసమ్ | = రసహీనమైనదియు | తత్ | = అట్టి భోజనము |
| పూతి | = దుర్గంధయుక్తమైనదియు | తామసప్రియమ్ | = తామసలక్షణములు గలవారికి ప్రియమైనది |

అర్ధపక్వములైన పదార్థములు(సరిగా ఉడకనివి,పండనివి) రసహీనములు, దుర్గంధయుక్తములు(చెడువాసన గలవి) పాసిపోయిన పదార్థములు, ఎంగిలి వస్తువులు, అపవిత్రపదార్థములు మొదలగునవి తామసస్వభావము గలవారికి ఇష్టమైనవి. (10)

**అఫలాకాంక్షిభిర్యజ్ఞో విధిదృష్టో య ఇజ్యతే ।**
**యష్టవ్యమేవేతి మనః సమాధాయ స సాత్త్వికః ॥ 11 ॥**

అఫలాకాంక్షిభిః, యజ్ఞః, విధిదృష్టః, యః, ఇజ్యతే,
యష్టవ్యమ్, ఏవ, ఇతి, మనః, సమాధాయ, సః, సాత్త్వికః ॥ 11 ॥

యః, యజ్ఞః = ఏ యజ్ఞము
విధిదృష్టః = శాస్త్రోక్తమైనదో
యష్టవ్యమ్, ఏవ, ఇతి, మనః, సమాధాయ = ఇది నాకు కర్తవ్యమే అని, మనస్సున దృఢముగా నిశ్చయించుకొని
అఫలాకాంక్షిభిః = ప్రతిఫలాపేక్ష లేని వారిచే
ఇజ్యతే = చేయబడునో
సః = ఆ యజ్ఞము
సాత్త్వికః = సాత్త్వికము

శాస్త్రోక్తమైనదియు, ఈ యజ్ఞము నాకు కర్తవ్యము అని మనస్సున దృఢముగా నిశ్చయించుకొనబడినదియు, ప్రతిఫలాపేక్ష లేకుండ చేయబడునదియు ఐన యజ్ఞము సాత్త్వికయజ్ఞము అనబడును. (11)

**అభిసంధాయ తు ఫలం దంభార్థమపి చైవ యత్ ।**
**ఇజ్యతే భరతశ్రేష్ఠ తం యజ్ఞం విద్ధి రాజసమ్ ॥ 12 ॥**

అభిసంధాయ, తు, ఫలమ్, దంభార్థమ్, అపి, చ, ఏవ, యత్,
ఇజ్యతే, భరతశ్రేష్ఠ, తమ్, యజ్ఞమ్, విద్ధి, రాజసమ్ ॥ 12 ॥

తు = కాని
భరతశ్రేష్ఠ = ఓ అర్జునా!
యత్ = ఏది
దంభార్థమ్, ఏవ = (సరియైన నిష్ఠ లేకుండ) ఆడంబరము కొఱకు ఆచరింపబడునో
చ = మఱియు
ఫలమ్, అపి = ఫలమును గూడ
అభిసంధాయ = దృష్టిలోనుంచుకొని
ఇజ్యతే = చేయబడునో
తమ్, యజ్ఞమ్ = అట్టి యజ్ఞమును
రాజసమ్ = రాజసమైనదిగా
విద్ధి = ఎఱుంగుము.

కాని, ఓ అర్జునా! సరియైన నిష్ఠలేకుండ ఆడంబరముకొఱకు ఆచరింపబడునదియు, ప్రతిఫలాపేక్షతో చేయబడునదియు అగు యజ్ఞము రాజసయజ్ఞము అని ఎఱుంగుము. (12)

**విధిహీనమసృష్టాన్నం మంత్రహీనమదక్షిణమ్ ।**
**శ్రద్ధావిరహితం యజ్ఞం తామసం పరిచక్షతే ॥ 13 ॥**

విధిహీనమ్, అసృష్టాన్నమ్, మంత్రహీనమ్, అదక్షిణమ్,
శ్రద్ధావిరహితమ్, యజ్ఞమ్, తామసమ్, పరిచక్షతే ॥ 13 ॥

| | | | |
|---|---|---|---|
| విధిహీనమ్ | = శాస్త్రవిధులను పాటింపనిదియును | శ్రద్ధావిరహితమ్ | = శ్రద్ధలేకుండ చేయబడునదియు అగు |
| అసృష్టాన్నమ్ | = అన్నదాన రహితమైనదియు | యజ్ఞమ్ | = యజ్ఞమును |
| మంత్రహీనమ్ | = మంత్రహీనమైనదియు | తామసమ్ | = తామసమైనదిగా |
| అదక్షిణమ్ | = దక్షిణలు లేనిదియు | పరిచక్షతే | = చెప్పుదురు |

శాస్త్రవిధిననుసరింపనిదియు, అన్నదానరహితమైనదియు, మంత్రహీనమైనదియు, దక్షిణలు లేనిదియు, శ్రద్ధారహితమైనదియు అగు యజ్ఞము 'తామసయజ్ఞము' అనబడును. (13)

**దేవద్విజగురుప్రాజ్ఞపూజనం శౌచమార్జవమ్ ।**
**బ్రహ్మచర్యమహింసా చ శారీరం తప ఉచ్యతే ॥ 14 ॥**

దేవద్విజగురుప్రాజ్ఞపూజనమ్, శౌచమ్, ఆర్జవమ్,
బ్రహ్మచర్యమ్, అహింసా, చ, శారీరమ్, తపః, ఉచ్యతే ॥ 14 ॥

| | | | |
|---|---|---|---|
| దేవ, ద్విజ, గురు[1], ప్రాజ్ఞ పూజనమ్ | = దేవతలను, బ్రాహ్మణులను, గురుజనులను, జ్ఞానులను పూజించుట | బ్రహ్మచర్యమ్, చ | = బ్రహ్మచర్యవ్రతమును పాటించుట |
| | | అహింసా | = అహింసయు |
| శౌచమ్ | = పవిత్రత | | |
| ఆర్జవమ్ | = ఋజుత్వము, (మనోవాక్కాయములయందు సరళత్వము కలిగి యుండుట) | శారీరమ్, తపః | = శారీరికమైన తపస్సు అని |
| | | ఉచ్యతే | = చెప్పబడును |

దేవతలను, బ్రాహ్మణులను, గురుజనులను,జ్ఞానులను సేవించుట, పవిత్రత(శౌచము) నిరాడంబరత్వము, బ్రహ్మచర్యము, అహింస అనునవి శారీరక తపస్సులు. (14)

**అనుద్వేగకరం వాక్యం సత్యం ప్రియహితం చ యత్ ।**
**స్వాధ్యాయాభ్యసనం చైవ వాఙ్మయమ్ తప ఉచ్యతే ॥ 15 ॥**

1. ఇచట 'గురు'అను శబ్దమునకు మాతాపితరులు, ఆచార్యులు, వృద్ధులు, మఱియు అన్నివిధముల తమకంటెను పెద్దవారు- అను అర్థమును గ్రహింపవలెను.

అనుద్వేగకరమ్, వాక్యమ్, సత్యమ్, ప్రియహితమ్, చ, యత్,
స్వాధ్యాయాభ్యసనమ్, చ, ఏవ, వాఙ్మయమ్, తపః, ఉచ్యతే ॥ 15 ॥

| | | | | |
|---|---|---|---|---|
| యత్ | = ఏదయితే | | స్వాధ్యాయాభ్యసనమ్ | = వేదశాస్త్రపఠనములతో పరమేశ్వరనామ జపము యొక్క అభ్యాసములతో కూడి యున్నదో |
| అనుద్వేగకరమ్ | = ఉద్వేగమును కల్గింపనిదియు | | (తత్) ఏవ | = అదియే |
| ప్రియహితమ్, చ | = ప్రియమైనదియు, హితకరమైనదియు | | వాఙ్మయమ్, తపః | = వాక్కులకు సంబంధించిన తపస్సు- అని |
| సత్యమ్ | = యథార్థమైనదియు అగు | | ఉచ్యతే | = పేర్కొనబడును |
| వాక్యమ్[1] | = భాషణమో | | | |
| చ | = అవిధముగానే | | | |

ఉద్వేగమును కలిగింపనిదియు, ప్రియమైనదియు, హితమును గూర్చునదియు, యథార్థమైనదియు అగు భాషణము, అట్లే వేదశాస్త్రపఠనము, పరమేశ్వరుని నామజప సాధన మొదలగునవి యన్నియును వాక్కునకు సంబంధించిన తపస్సులు. (15)

**మనఃప్రసాదః సౌమ్యత్వం మౌనమాత్మవినిగ్రహః ।**
**భావసంశుద్ధిరిత్యేతత్ తపో మానసముచ్యతే ॥ 16 ॥**

మనఃప్రసాదః, సౌమ్యత్వమ్, మౌనమ్, ఆత్మవినిగ్రహః,
భావసంశుద్ధిః, ఇతి, ఏతత్, తపః, మానసమ్, ఉచ్యతే ॥ 16 ॥

| | | | | |
|---|---|---|---|---|
| మనఃప్రసాదః | = మనఃప్రసన్నత | | భావసంశుద్ధిః | = అంతఃకరణమునందలి భావముల పవిత్రత |
| సౌమ్యత్వమ్ | = శాంత స్వభావము | | ఇతి, ఏతత్, తపః | = అనెడి, ఈ విధమైన తపస్సు |
| మౌనమ్ | = భగవచ్చింతనము | | మానసమ్ | = మానసికమైనదిగా |
| ఆత్మవినిగ్రహః | = మనోనిగ్రహము మఱియు | | ఉచ్యతే | = చెప్పబడును |

1. మనస్సు, ఇంద్రియములద్వారా అనుభవించిన దానిని అదే విధముగా మాటలద్వారా ప్రకటించుటను 'యథార్థభాషణమ్' అని యందురు

మనఃప్రసన్నత, శాంతస్వభావము, భగవచ్చింతన, మనోనిగ్రహము, అంతఃకరణశుద్ధి మొదలగునవి యన్నియును మానసికతపస్సులు. (16)

**శ్రద్ధయా పరయా తప్తం తపస్తత్ త్రివిధం నరైః ।**
**అఫలాకాంక్షిభిర్యుక్తైః సాత్త్వికం పరిచక్షతే ॥ 17 ॥**

శ్రద్ధయా, పరయా, తప్తమ్, తపః, తత్, త్రివిధమ్, నరైః,
అఫలాకాంక్షిభిః, యుక్తైః, సాత్త్వికమ్, పరిచక్షతే ॥ 17 ॥

| | | | |
|---|---|---|---|
| **అఫలాకాంక్షిభిః** | = ఫలాపేక్షలేని వారగు | **తత్, త్రివిధమ్, తపః** | = అట్టి మూడు విధము లైన (శారీరక, వాచిక, మానసిక) తపస్సును |
| **యుక్తైః, నరైః** | = యోగులచేత | | |
| **పరయా, శ్రద్ధయా తప్తమ్** | = అత్యంత శ్రద్ధతో చేయబడిన | **సాత్త్వికమ్** | = సాత్త్వికమని |
| | | **పరిచక్షతే** | = పేర్కొందురు |

పూర్వోక్తములైన (శారీరిక,వాచిక, మానసిక) తపస్సులను ఫలాకాంక్షలేని యోగులు మిక్కిలి శ్రద్ధతో ఆచరించినప్పుడు వాటిని 'సాత్త్విక తపస్సులు' అని యందురు. (17)

**సత్కారమానపూజార్థం తపో దంభేన చైవ యత్ ।**
**క్రియతే తదిహ ప్రోక్తం రాజసం చలమధ్రువమ్ ॥ 18 ॥**

సత్కారమానపూజార్థమ్, తపః, దంభేన, చ, ఏవ, యత్,
క్రియతే, తత్, ఇహ, ప్రోక్తమ్, రాజసమ్, చలమ్, అధ్రువమ్ ॥ 18 ॥

| | | | |
|---|---|---|---|
| **యత్, తపః** | = ఏ తపస్సు | **దంభేన** | = దంభముతో |
| **సత్కారమాన పూజార్థమ్** | = ఇతరులనుండి సత్కారములను, గౌరవములను, పూజలను అందుకొనుటకును | **క్రియతే** | = చేయబడునో |
| | | **అధ్రువమ్**[1] | = అనిశ్చితమైనదియు |
| | | **చలమ్** | = క్షణికఫలమును ఇచ్చునదియు అగు |
| **చ, ఏవ** | = ఇతరస్వార్థ ప్రయోజనముల కొఱకును | **తత్** | = ఆ తపస్సు |
| | | **ఇహ** | = ఇచ్చట |
| | | **రాజసమ్** | = రాజసమని |
| **వా** | = లేక | **ప్రోక్తమ్** | = చెప్పబడినది |

1. కార్యసాఫల్యవిషయమున అనిశ్చితస్థితి (ఫలము లభించునో లేదో అను స్థితి) గల కార్యమును 'అధ్రువమ్' అని యందురు.

ఇతరులనుండి సత్కారములను, గౌరవములను, పూజలను అందుకొనుటకును, అట్లే తదితర స్వార్థప్రయోజనములకొఱకును, స్వాభావికముగాగాని, కల్పితముగా గాని చేయబడునవియు, అనిశ్చితఫలములనుగాని, క్షణికఫలములనుగాని ఇచ్చునవియు ఐన తపస్సులను 'రాజసతపస్సులు' అని యందురు. (18)

**మూఢగ్రాహేణాత్మనో యత్ పీడయా క్రియతే తపః ।**
**పరస్యోత్సాదనార్థం వా తత్తామసముదాహృతమ్ ॥ 19 ॥**

మూఢగ్రాహేణ, ఆత్మనః, యత్, పీడయా, క్రియతే, తపః,
పరస్య, ఉత్సాదనార్థమ్, వా, తత్, తామసమ్, ఉదాహృతమ్ ॥ 19 ॥

| | | | |
|---|---|---|---|
| యత్, తపః | = ఏ తపస్సు | పరస్య, ఉత్సాదనార్థమ్ | = ఇతరులకు కీడు కల్గించుటకును |
| మూఢగ్రాహేణ | = మొండిపట్టుదలతో గూడినదియు | క్రియతే | = ఆచరింపబడునో |
| ఆత్మనః, పీడయా | = తనమనోవాక్కాయములకు బాధ కల్గించునదియు | తత్ | = అట్టి తపస్సు |
| | | తామసమ్ | = తామసమైనదిగా |
| వా | = లేక | ఉదాహృతమ్ | = పేర్కొనబడినది |

మొండిపట్టుదలతో మనోవాక్కాయములకు బాధకలిగించునవియు, ఇతరులకు కీడు కల్గించుటకై చేయబడునవియు, ఐన తపస్సులను 'తామసతపస్సులు' అనియందురు. (19)

**దాతవ్యమితి యద్దానం దీయతేఽనుపకారిణే ।**
**దేశే కాలే చ పాత్రే చ తద్దానం సాత్త్వికం స్మృతమ్ ॥ 20 ॥**

దాతవ్యమ్, ఇతి, యత్, దానమ్, దీయతే, అనుపకారిణే,
దేశే, కాలే, చ, పాత్రే, చ, తత్, దానమ్, సాత్త్వికమ్, స్మృతమ్ ॥ 20 ॥

| | | | |
|---|---|---|---|
| దాతవ్యమ్ | = దానముచేయుటయే కర్తవ్యము | దేశే[1], చ | = తగిన ప్రదేశముల యందును |
| ఇతి | = అని (అను భావముతో) | కాలే, చ | = దుర్భిక్షాది యుక్త కాలములయందును |
| యత్, దానమ్ | = ఏ దానము | | |

1. దేశకాలపరిస్థితులను అనుసరించి, అవసరమగు వస్తువులను సమకూర్చుటద్వారా ప్రాణి సేవ చేయుటయే యుక్తమని భావింపవలెను.

| | | | |
|---|---|---|---|
| పాత్రే[1], చ = పాత్రులైన వారికిని | | తత్, దానమ్ = ఆ దానము | |
| అనుపకారిణే = ప్రత్యుపకారము ఆశింపక | | సాత్త్వికమ్ = సాత్త్వికమని | |
| దీయతే = నిష్కామభావముతో ఇయ్యబడునో | | స్మృతమ్ = భావింపబడును. | |

'దానము చేయుటయే కర్తవ్యము' అను భావముతో తగిన ప్రదేశముల యందును, దుర్భిక్షాదికాలముల యందును, ఆకలిదప్పులతో బాధపడువారు, అంగవైకల్యముగలవారు, రోగులు మొదలగువారికిని, బ్రాహ్మణులు, పండితులు, బ్రహ్మచారులు, వానప్రస్థులు మొదలగు పాత్రులైన వారికిని ప్రత్యుపకారమును ఆశింపక నిస్వార్థభావముతో చేయబడు దానము 'సాత్త్వికదానము' అనబడును. (20)

**యత్తు ప్రత్యుపకారార్థం ఫలముద్దిశ్య వా పునః ।**
**దీయతే చ పరిక్లిష్టం తద్దానం రాజసం స్మృతమ్ ॥ 21 ॥**

యత్, తు, ప్రత్యుపకారార్థమ్, ఫలమ్, ఉద్దిశ్య, వా, పునః,
దీయతే, చ, పరిక్లిష్టమ్, తత్, దానమ్, రాజసమ్, స్మృతమ్ ॥ 21 ॥

| | |
|---|---|
| యత్, తు = ఏదానమైతే | ఫలమ్, ఉద్దిశ్య[4] = ఫలములను ఆశించి |
| పరిక్లిష్టమ్[2], చ = మనఃక్లేశము తోడను | వా, పునః, దీయతే = ఐనను గాని ఇయ్యబడునో |
| ప్రత్యుపకారార్థమ్[3] = ప్రత్యుపకారము పొందుటకును | తత్, దానమ్ = ఆదానము |
| | రాజసమ్ = రాజసమని |
| | స్మృతమ్ = తలంపబడును |

1. ఆకలిగొన్నవారు, అనాథలు, దుఃఖితులు, రోగులు, బలహీనులు, భిక్షువులు మొదలగు వారు అన్నవస్త్రములు, ఔషధములు మున్నగువానిసహాయము పొందుటకు పాత్రులు. శ్రేష్ఠాచరణముగల విద్వాంసులు, బ్రాహ్మణులు, ధనము మొదలగు వస్తురూపసహాయమును పొందుటకును, ఇతర సేవలను స్వీకరించుటకును పాత్రులు
2. బలవంతమువలన గాని, ఇతరులు భయపెట్టుటవలనగాని ఇయ్యబడుదానము
3. ఇచ్చినదానమునకు బదులుగా ఏదైనా లౌకిక కార్యలాభము కలుగునను ఆశతో చేయబడు దానము.
4. గౌరవ ప్రతిష్ఠలను, స్వర్గాదులను పొందుటకుగాని, రోగాదుల నివృత్తికి గాని ఇయ్యబడు దానము.

కాని, ప్రత్యుపకారమును ఆశించిగాని, ప్రతిఫలాపేక్షతోగాని, వివిధములగు ఒత్తిడులకు లోనైగాని, బాధపడుచు విధిలేక ఇచ్చు దానమును 'రాజసదానము' అనియందురు. (21)

**అదేశకాలే యద్దానమ్ అపాత్రేభ్యశ్చ దీయతే ।**
**అసత్కృతమవజ్ఞాతం తత్తామసముదాహృతమ్ ॥ 22 ॥**

అదేశకాలే, యత్, దానమ్, అపాత్రేభ్యః, చ, దీయతే,
అసత్కృతమ్, అవజ్ఞాతమ్, తత్, తామసమ్, ఉదాహృతమ్ ॥ 22 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| యత్, దానమ్ | = | ఏదానము | అదేశకాలే, చ | = | దేశ, కాలోచితము కానిదియు |
| అసత్కృతమ్ | = | సద్భావములేకుండ (దానము పుచ్చుకొను వారియెడ గౌరవ భావము లేకుండ) | అపాత్రేభ్యః[1] | = | పాత్రులు (యోగ్యులు) కానివారికి |
| | | | దీయతే | = | ఇయ్యబడునో |
| (వా) | = | (లేక) | తత్ | = | ఆదానము |
| అవజ్ఞాతమ్ | = | తృణీకారభావముతో చేయబడునదియు | తామసమ్ | = | తామసమని |
| | | | ఉదాహృతమ్ | = | పేర్కొనబడును |

సద్భావములేకుండా, దానము పుచ్చుకొనువారియెడల గౌరవాదరములను చూపక, తృణీకారభావములతో ఛీకొట్టుచు, అయోగ్యులకును, అపాత్రులకును చేయబడు దానమూ, దేశకాలోచితముకాని దానమూ, 'తామసదానము' అని యనబడును. (22)

**ఓం తత్సదితి నిర్దేశో బ్రహ్మణస్త్రివిధః స్మృతః ।**
**బ్రాహ్మణాస్తేన వేదాశ్చ యజ్ఞాశ్చ విహితాః పురా ॥ 23 ॥**

ఓమ్, తత్, సత్, ఇతి, నిర్దేశః, బ్రహ్మణః, త్రివిధః, స్మృతః,
బ్రాహ్మణాః తేన, వేదాః, చ, యజ్ఞాః, చ, విహితాః, పురా ॥ 23 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| ఓమ్, తత్, సత్ | = | ఓమ్, తత్, సత్ | బ్రహ్మణః | = | సచ్చిదానందఘన బ్రహ్మకు |
| ఇతి | = | అని | త్రివిధః | = | మూడువిధములగు |

1. మద్యమాంసాది అభక్ష్యవస్తువులను సేవించువారు, చోరులు, జారులు మొదలగు నీచకర్మలను చేయువారు అపాత్రులు.

| | | | | | |
|---|---|---|---|---|---|
| నిర్దేశః | = | నామనిర్దేశము | బ్రాహ్మణాః, చ | = | బ్రాహ్మణాది సమస్త ప్రాణులును |
| స్మృతః | = | చేయబడినది | వేదాః, చ | = | వేదములును |
| తేన | = | ఆ పరమాత్మ చేతనే | యజ్ఞాః | = | యజ్ఞాదులును |
| పురా | = | సృష్ట్యాదియందు | విహితాః | = | రచింపబడినవి |

ఓమ్, తత్, సత్ అని మూడువిధములగు పేర్లు సచ్చిదానందఘనపరబ్రహ్మకు నిర్దేశించబడినవి. ఆ పరమాత్మనుండియే సృష్ట్యాదియందు బ్రాహ్మణులు, వేదములు, యజ్ఞములు ఏర్పడుట జరిగినది. (23)

**తస్మాదోమిత్యుదాహృత్య యజ్ఞదానతపఃక్రియాః ।**
**ప్రవర్తంతే విధానోక్తాః సతతం బ్రహ్మవాదినామ్ ॥ 24 ॥**

తస్మాత్, ఓమ్, ఇతి, ఉదాహృత్య, యజ్ఞదానతపఃక్రియాః,
ప్రవర్తంతే, విధానోక్తాః, సతతమ్, బ్రహ్మవాదినామ్ ॥ 24 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| తస్మాత్ | = | అందువలన | సతతమ్ | = | ఎల్లప్పుడును |
| బ్రహ్మవాదినామ్ | = | వేదమంత్రములను ఉచ్చరించువారి యొక్క | | | |
| విధానోక్తాః | = | శాస్త్రముల యందు చెప్పబడిన | 'ఓమ్' ఇతి | = | 'ఓమ్' అని (ఈ పరమాత్మ నామమును) |
| యజ్ఞదానతపః క్రియాః | = | యజ్ఞములు, దానములు, తపస్సులు, మొదలగు క్రియలు | ఉదాహృత్య | = | ఉచ్చరింపబడుచునే |
| | | | ప్రవర్తంతే | = | ఆరంభమగుచున్నవి. |

కనుక, వేదమంత్రములను పఠించువారు శాస్త్రవిహితములైన యజ్ఞదాన తపశ్చర్యలను సర్వదా 'ఓమ్' అను పరమాత్మనామమును ఉచ్చరించుచునే ప్రారంభింతురు. (24)

**తదిత్యనభిసంధాయ ఫలం యజ్ఞతపఃక్రియాః ।**
**దానక్రియాశ్చ వివిధాః క్రియంతే మోక్షకాంక్షిభిః ॥ 25 ॥**

తత్, ఇతి, అనభిసంధాయ, ఫలమ్, యజ్ఞతపఃక్రియాః,
దానక్రియాః, చ, వివిధాః, క్రియంతే, మోక్షకాంక్షిభిః ॥ 25 ॥

| | | | |
|---|---|---|---|
| మోక్షకాంక్షిభిః | = మోక్షకాంక్షగలవారిచే | చ | = మఱియు |
| ఫలమ్, అనభిసంధాయ | = ఫలము ఏమాత్రము కోరబడకయే (లోక హితార్థమే) | దానక్రియాః | = దానములును |
| వివిధాః | = వివిధములగు | తత్, ఇతి | = 'తత్' అనగా ఇది యంతయును పరమాత్మదే అను భావముతో |
| యజ్ఞ తపః క్రియాః | = యజ్ఞములు, తపశ్చర్యలు | క్రియంతే | = చేయబడును. |

మోక్షకాంక్షగలవారు స్వలాభాపేక్ష లేశమాత్రమైనను లేకుండ లోకహితార్థమై యజ్ఞదానతపశ్చర్యలను 'ఇదియంతయును పరమాత్మదే' అను భావముతో 'తత్' అను నామమును ఉచ్చరించుచు చేయుదురు. (25)

**సద్భావే సాధుభావే చ సదిత్యేతత్ప్రయుజ్యతే ।**
**ప్రశస్తే కర్మణి తథా సచ్ఛబ్దః పార్థ యుజ్యతే ॥ 26 ॥**

సద్భావే, సాధుభావే, చ, సత్, ఇతి, ఏతత్, ప్రయుజ్యతే,
ప్రశస్తే, కర్మణి, తథా, సత్, శబ్దః, పార్థ, యుజ్యతే ॥ 26 ॥

| | | | |
|---|---|---|---|
| పార్థ! | = ఓ పార్థా! | ప్రయుజ్యతే | = ప్రయోగింపబడుచున్నది |
| సద్భావే | = సత్యభావమునందును | తథా | = అట్లే |
| సాధుభావే, చ | = శ్రేష్ఠభావము నందును (మంచిది అనుభావము నందును) | ప్రశస్తే, కర్మణి | = ఉత్తమమైన కర్మయందును |
| సత్, ఇతి, ఏతత్ | = 'సత్' అను ఈ పరమాత్మనామము | 'సత్' శబ్దః | = 'సత్' అనుశబ్దము |
| | | యుజ్యతే | = ప్రయుక్తమగు చుండును. |

ఓ పార్థా! 'సత్' అను పరమాత్మనామము సత్యభావమునందును, శ్రేష్ఠభావమునందును అనగా పరమాత్ముడు నిత్యుడు, శ్రేష్ఠుడు అను భావము నందును ప్రయోగింపబడుచుండును. ఉత్తమకర్మాచరణమునందును 'సత్' అను శబ్దము ప్రయుక్తమగుచుండును. (26)

**యజ్ఞే తపసి దానే చ స్థితిః సదితి చోచ్యతే ।**
**కర్మ చైవ తదర్థీయం సదిత్యేవాభిధీయతే ॥ 27 ॥**

యజ్ఞే, తపసి, దానే, చ, స్థితిః, సత్, ఇతి, చ, ఉచ్యతే,
కర్మ, చ, ఏవ, తదర్థీయమ్, సత్, ఇతి, ఏవ, అభిధీయతే ॥ 27 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| యజ్ఞే, చ | = | యజ్ఞమునందును | ఉచ్యతే | = | పేర్కొనబడుచున్నది |
| తపసి, చ | = | తపస్సునందును | చ | = | మఱియు |
| దానే, చ | = | దానమునందును (గల) | తదర్థీయమ్, కర్మ | = | భగవత్ప్రీత్యర్థమైన కర్మయును |
| (యా), స్థితిః | = | ఏ నిష్ఠ కలదో | ఏవ | = | నిశ్చయముగా |
| (సా) స్థితిః, ఏవ | = | ఆ స్థితియును | 'సత్', 'ఇతి' | = | 'సత్' అని |
| 'సత్', ఇతి | = | 'సత్' అని | అభిధీయతే | = | చెప్పబడును. |

యజ్ఞదానతపఃక్రియలయందలి నిష్ఠ, ఆస్తిక భావమును 'సత్' అనియందురు. పరమాత్మను ఉద్దేశించి, చేయబడు నిశ్చయాత్మకకర్మలనుగూడ 'సత్' అని యందురు. (27)

**అశ్రద్ధయా హుతం దత్తం తపస్తప్తం కృతం చ యత్ ।**
**అసదిత్యుచ్యతే పార్థ న చ తత్ప్రేత్య నో ఇహ ॥ 28 ॥**

అశ్రద్ధయా, హుతమ్, దత్తమ్, తపః, తప్తమ్, కృతమ్, చ, యత్,
అసత్, ఇతి, ఉచ్యతే, పార్థ, న, చ, తత్, ప్రేత్య, నో, ఇహ ॥ 28 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| పార్థ! | = | ఓ పార్థా! | (తత్) | = | (అది) |
| అశ్రద్ధయా | = | అశ్రద్ధతో చేయబడిన | 'అసత్', 'ఇతి' | = | 'అసత్' అని |
| హుతమ్ | = | హోమము | ఉచ్యతే | = | చెప్పబడును |
| దత్తమ్ | = | ఇయ్యబడిన దానము | తత్ | = | ఆ హోమాదికకర్మ |
| తప్తమ్, తపః, చ | = | ఆచరింపబడిన తపస్సు | నో, ఇహ | = | ఈ లోకమునందు ఫలప్రదముగాదు |
| యత్, కృతమ్ | = | చేయబడిన ఏ శుభ కర్మయును కలదో | చ | = | మఱియు |
| | | | ప్రేత్య, న | = | మరణానంతరము గూడ ఫలప్రదముగాదు. |

ఓ అర్జునా! శ్రద్ధ(విశ్వాసము) లేకుండ చేయబడు హోమము, ఇయ్యబడు దానము, ఆచరింపబడు తపస్సు, ఇంకను జరుపబడు ఇతర శుభకర్మ లన్నియును, 'అసత్' అని చెప్పబడును. దానివలన జీవించియుండగా గాని మరణించిన పిదపగాని ఎట్టి ప్రయోజనమూ కలుగదు. (28)

ఓం తత్సదితి శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే శ్రద్ధాత్రయవిభాగయోగోనామ సప్తదశోఽధ్యాయః ॥ ౧౭ ॥

॥ ఓం శ్రీపరమాత్మనే నమః ॥

# అథ అష్టాదశోఽధ్యాయః - మోక్షసన్న్యాసయోగః

## (పదునెనిమిదవ అధ్యాయము-మోక్షసన్న్యాసయోగము)

ముఖ్యాంశములు : [(1 నుండి 12వ శ్లోకమువఱకు) త్యాగవిషయము, (13 నుండి 18 వఱకు) కర్మలనుగూర్చి సాంఖ్యసిద్ధాంతకథనము, (19 నుండి 40వఱకు), త్రిగుణములప్రకారము జ్ఞాన, కర్మ, కర్త, బుద్ధి, ధృతి, సుఖముల వేర్వేఱు భేదములు, (41 నుండి 48 వఱకు) ఫలసహిత వర్ణ ధర్మముల విషయము, (49 నుండి 55 వఱకు) జ్ఞాననిష్ఠ విషయము (56 నుండి 66 వఱకు) భక్తిసహిత నిష్కామ కర్మయోగవిషయము, (67 నుండి 78 వఱకు) శ్రీగీతామాహాత్మ్యము.]

**అర్జున ఉవాచ**

**సన్న్యాసస్య మహాబాహో తత్త్వమిచ్ఛామి వేదితుమ్ ।**
**త్యాగస్య చ హృషీకేశ పృథక్ కేశినిషూదన ॥ 1 ॥**

సన్న్యాసస్య, మహాబాహో, తత్త్వమ్, ఇచ్ఛామి, వేదితుమ్,
త్యాగస్య, చ, హృషీకేశ, పృథక్, కేశినిషూదన ॥ 1 ॥

| | | | |
|---|---|---|---|
| **మహాబాహో!** | = ఓ మహాబాహూ! | **త్యాగస్య (తత్త్వమ్), చ** | = త్యాగ తత్త్వమును |
| **హృషీకేశ!** | = ఓ అంతర్యామీ! | **పృథక్** | = వేర్వేఱుగా |
| **కేశినిషూదన!** | = ఓ వాసుదేవా! | **వేదితుమ్, ఇచ్ఛామి** | = (నేను) తెలిసికొన గోరుచున్నాను |
| **సన్న్యాసస్య, తత్త్వమ్** | = సన్న్యాసతత్త్వమును | | |

అర్జునుడు పలికెను- ఓ మహాబాహూ! అంతర్యామీ! వాసుదేవా! సన్న్యాస తత్త్వమును, త్యాగతత్త్వమును వేర్వేఱుగా తెలిసికొనగోరెదను. (1)

**శ్రీభగవాన్ ఉవాచ**

**కామ్యానాం కర్మణాం న్యాసం సన్న్యాసం కవయో విదుః ।**
**సర్వకర్మఫలత్యాగం ప్రాహుస్త్యాగం విచక్షణాః ॥ 2 ॥**

కామ్యానామ్, కర్మణామ్, న్యాసమ్, సన్న్యాసమ్, కవయః, విదుః,
సర్వకర్మఫలత్యాగమ్, ప్రాహుః, త్యాగమ్, విచక్షణాః ॥ 2 ॥

| | | |
|---|---|---|
| కవయః | = | (కొందరు) పండితులు |
| కామ్యానామ్[1] కర్మణామ్ | = | కామ్యకర్మల యొక్క |
| న్యాసమ్ (ఏవ) | = | త్యాగమునే |
| సన్న్యాసమ్ | = | సన్న్యాసమని |
| విదుః | = | భావింతురు |
| విచక్షణాః | = | విచక్షణాశీలురైన మఱికొందఱు మాత్రము |
| సర్వకర్మఫల త్యాగమ్[2] | = | సమస్తకర్మల ఫలములను త్యజించుటనే |
| త్యాగమ్ | = | త్యాగమని |
| ప్రాహుః | = | పేర్కొందురు. |

శ్రీ భగవానుడు పలికెను - కామ్యకర్మల త్యాగమునే సన్న్యాసమని కొందఱు పండితులు తలంతురు. కాని విచక్షణాశీలురైన మఱికొందరు మాత్రము సర్వకర్మఫలములను త్యజించుటను త్యాగమని పేర్కొందురు. (2)

**త్యాజ్యం దోషవదిత్యేకే కర్మ ప్రాహుర్మనీషిణః ।**
**యజ్ఞదానతపఃకర్మ న త్యాజ్యమితి చాపరే ॥ 3 ॥**

త్యాజ్యమ్, దోషవత్, ఇతి, ఏకే, కర్మ, ప్రాహుః, మనీషిణః,
యజ్ఞదానతపఃకర్మ, న, త్యాజ్యమ్, ఇతి, చ, అపరే ॥ 3 ॥

| | | |
|---|---|---|
| ఏకే | = | కొందఱు |
| మనీషిణః | = | విద్వాంసులు |
| కర్మ | = | ప్రతికర్మయు |
| దోషవత్ | = | దోషయుక్తమే (కనుక అది) |
| త్యాజ్యమ్ | = | త్యజింప దగినదే |
| ఇతి | = | అని |
| ప్రాహుః | = | పలికెదరు |
| అపరే, చ | = | మఱికొందరు |
| యజ్ఞ, దాన, తపః కర్మ | = | యజ్ఞ, దాన తపస్సులను ఆచరించుట |
| న, త్యాజ్యమ్ | = | త్యజింపరానిది |
| ఇతి, (ఆహుః) | = | అని పేర్కొందురు |

కొందరు విద్వాంసులు కర్మలన్నియును దోషయుక్తములే, గావున వాటిని త్యజింపవలెనని యందురు. కాని, యజ్ఞదాన తపశ్చర్యాది కర్మలు త్యాజ్యములు కావని మరికొందరందురు.(3)

1. స్త్రీ పుత్ర ధనాది ప్రియవస్తు ప్రాప్తికిని, సంకటములు, రోగములు, మున్నగువాని నివృత్తికిని చేయబడు యజ్ఞదానతపఃక్రియలు, ఉపాసనలు మొదలగు వానిని 'కామ్యకర్మలు' అందురు.
2. భగవద్భక్తి, దైవసేవలు, తల్లిదండ్రులను, గురుజనులను సేవించుట, యజ్ఞదాన తపశ్చర్యలు, వర్ణాశ్రమధర్మాచరణములు, శరీరనిర్వహణమునకై ఆచరింపబడు కర్తవ్య కర్మలు మొదలగు వాటివలన లభించునట్టి ఇహపరలోకసుఖాసక్తులను త్యజించుటను 'సర్వకర్మఫలత్యాగమ్' అని యందురు.

**నిశ్చయం శృణు మే తత్ర త్యాగే భరతసత్తమ ।**
**త్యాగో హి పురుషవ్యాఘ్ర త్రివిధః సంప్రకీర్తితః ॥ 4 ॥**

నిశ్చయమ్, శృణు, మే, తత్ర, త్యాగే, భరతసత్తమ,
త్యాగః, హి, పురుషవ్యాఘ్ర, త్రివిధః సంప్రకీర్తితః ॥ 4 ॥

పురుషవ్యాఘ్ర! = ఓ పురుషశ్రేష్ఠా!
భరతసత్తమ! = ఓ అర్జునా!
తత్ర = సన్న్యాసము, త్యాగము అను రెండు విషయములలో (మొదట)
త్యాగే = త్యాగవిషయమున
మే = నాయొక్క
నిశ్చయమ్ = నిశ్చితాభిప్రాయమును గూర్చి
శృణు = వినుము
హి = ఏలనన
త్యాగః = త్యాగము
త్రివిధః = మూడువిధములుగా
సంప్రకీర్తితః = పేర్కొనబడినది.

ఓ పురుషశ్రేష్ఠా! అర్జునా! సన్న్యాసము, త్యాగము అను రెండు విషయములలో మొదట త్యాగమునుగూర్చి నా నిశ్చయమును వినుము. త్యాగము సాత్త్వికము, రాజసము, తామసము అని మూడువిధములుగా చెప్పబడినది. (4)

**యజ్ఞదానతపఃకర్మ న త్యాజ్యం కార్యమేవ తత్ ।**
**యజ్ఞో దానం తపశ్చైవ పావనాని మనీషిణామ్ ॥ 5 ॥**

యజ్ఞదానతపఃకర్మ, న, త్యాజ్యమ్, కార్యమ్, ఏవ, తత్,
యజ్ఞః, దానమ్, తపః, చ, ఏవ, పావనాని, మనీషిణామ్ ॥ 5 ॥

యజ్ఞదానతపః కర్మ = యజ్ఞ, దాన, తపస్సులను ఆచరించుట
న, త్యాజ్యమ్ = త్యజింపరానిది
తత్ = ఆ మూడును
కార్యమ్, ఏవ = అవశ్యము ఆచరింపవలసినవే-ఏలననగా
యజ్ఞః = యజ్ఞము
దానమ్ = దానము
చ = మఱియు
తపః = తపస్సు
ఏవ = అను మూడు కర్మలే
మనీషిణామ్[1] = బుద్ధిమంతులను
పావనాని = పవిత్రమొనర్చునవి

యజ్ఞదానతపశ్చర్యాది కర్మలు త్యజింపదగవు, అవి అవశ్యము అనుష్ఠింపదగినవి. ఏలనన, యజ్ఞదానతపస్సులు అను ఈ మూడు కర్మలే బుద్ధిమంతులైన వారిని పవిత్రమొనర్చును. (5)

1. ఫలాసక్తులను త్యజించి, కేవలము భగవదర్థకర్మలను ఆచరించు బుద్ధిమంతులు.

**ఏతాన్యపి తు కర్మాణి సంగం త్యక్త్వా ఫలాని చ ।**
**కర్తవ్యానీతి మే పార్థ నిశ్చితం మతముత్తమమ్ ॥ 6 ॥**

ఏతాని, అపి, తు, కర్మాణి, సంగమ్, త్యక్త్వా, ఫలాని, చ,
కర్తవ్యాని, ఇతి, మే, పార్థ, నిశ్చితమ్, మతమ్, ఉత్తమమ్ ॥ 6 ॥

| | | | |
|---|---|---|---|
| పార్థ! | = ఓ పార్థా! | ఫలాని | = ఫలములను |
| ఏతాని | = ఈయజ్ఞ, దాన, తపః కర్మలును | త్యక్త్వా | = త్యజించి |
| | | కర్తవ్యాని | = తప్పక చేయదగినవి |
| తు | = అట్లే | ఇతి | = అని |
| (అన్యాని), అపి, కర్మాణి | = ఇతరములగు కర్తవ్య కర్మలును (అన్నియు) | మే | = నాయొక్క |
| సంగమ్ | = ఆసక్తిని | ఉత్తమమ్, నిశ్చితమ్, మతమ్ | = ఉత్తమమైన నిశ్చితమైన అభిప్రాయము |
| చ | = మఱియు | | |

కావున, ఓ పార్థా! "ఈ యజ్ఞదాన తపోరూపకర్మలను మరియు కర్తవ్యకర్మలను అన్నింటిని ఫలాసక్తులను త్యజించి, అవశ్యమాచరింపవలెను" అనునది ఉత్తమమైన నా నిశ్చితాభిప్రాయము. (6)

**నియతస్య తు సన్న్యాసః కర్మణో నోపపద్యతే ।**
**మోహాత్తస్య పరిత్యాగః తామసః పరికీర్తితః ॥ 7 ॥**

నియతస్య, తు, సన్న్యాసః, కర్మణః, న, ఉపపద్యతే,
మోహాత్, తస్య, పరిత్యాగః, తామసః, పరికీర్తితః ॥ 7 ॥

| | | | |
|---|---|---|---|
| తు | = కాని | మోహాత్ | = (కావున) మోహవశమున |
| నియతస్య[1] | = శాస్త్రవిహితమైన | | |
| కర్మణః, సన్న్యాసః | = కర్మాచరణమును త్యజించుట | తస్య, పరిత్యాగః | = దానిని పరిత్యజించుట |
| న, ఉపపద్యతే | = ఉచితము కాదు | తామసః, పరికీర్తితః | = 'తామసత్యాగము' అని చెప్పబడును. |

(నిషిద్ధ కర్మల, కామ్యకర్మల ఆచరణను త్యాగముచేయుట సముచితమే.) కాని, శాస్త్రవిహితకర్మాచరణమును త్యజించుట ఉచితముగాదు. కావున, మోహవశమున దానిని త్యజించుట 'తామస త్యాగము' అనబడును. (7)

1. ఈ అధ్యాయమునందలి 48వ శ్లోకముయొక్క టిప్పణీలో దీని అర్థము చూడనగును.

**దుఃఖమిత్యేవ యత్కర్మ కాయక్లేశభయాత్ త్యజేత్ ।**
**స కృత్వా రాజసం త్యాగం నైవ త్యాగఫలం లభేత్ ॥ 8 ॥**

దుఃఖమ్, ఇతి, ఏవ, యత్, కర్మ, కాయక్లేశభయాత్, త్యజేత్,
సః, కృత్వా, రాజసమ్, త్యాగమ్, న, ఏవ, త్యాగఫలమ్, లభేత్ ॥ 8 ॥

(యః = ఎవడు)
యత్, కర్మ = ఏ విధ్యుక్తకర్మా చరణమును
దుఃఖమ్, ఏవ, ఇతి = దుఃఖకారకమేయని తలంచి
కాయక్లేశ భయాత్ = శారీరిక క్లేశములకు భయపడి
త్యజేత్ = త్యజించునో
సః = అతడు
రాజసమ్, త్యాగమ్ = 'రాజస త్యాగము'ను
కృత్వా = చేసి
త్యాగఫలమ్ = త్యాగఫలమును
న, ఏవ, లభేత్ = ఏవిధముగను పొందడు.

కర్మలన్నియును దుఃఖకారకములే యని భావించి, శారీరికక్లేశమునకు భయపడి కర్తవ్యకర్మలను త్యజించుటను 'రాజసత్యాగము' అని యందురు. అట్టి త్యాగమువలన ఎట్టి ఫలమూ లభింపదు. (8)

**కార్యమిత్యేవ యత్కర్మ నియతం క్రియతేఽర్జున ।**
**సంగం త్యక్త్వా ఫలం చైవ స త్యాగః సాత్త్వికో మతః ॥ 9 ॥**

కార్యమ్, ఇతి, ఏవ, యత్, కర్మ, నియతమ్, క్రియతే, అర్జున,
సంగమ్, త్యక్త్వా, ఫలమ్, చ, ఏవ, సః, త్యాగః, సాత్త్వికః, మతః ॥ 9 ॥

అర్జునా! = ఓ అర్జునా!
నియతమ్ = శాస్త్రవిహితమైన
యత్, కర్మ కార్యమ్, ఏవ = ఏ కర్మయైనను చేయదగినదే
ఇతి = అనెడిభావముతో
సంగమ్ = ఆసక్తిని
చ = మఱియు
ఫలమ్ = ఫలమును
త్యక్త్వా = త్యజించి
క్రియతే = చేయబడునో
సః, ఏవ = అదియే
సాత్త్వికః, త్యాగః = సాత్త్విక త్యాగము
మతః = (అని) భావింపబడును

ఓ అర్జునా! శాస్త్రవిహిత కర్మలను కర్తవ్యములుగా భావించి, వాటియందలి ఫలాసక్తులను త్యజించి, చేయుటయే 'సాత్త్వికత్యాగము' అని భావింపబడును. (9)

**న ద్వేష్ట్యకుశలం కర్మ కుశలే నానుషజ్జతే ।**
**త్యాగీ సత్త్వసమావిష్టో మేధావీ ఛిన్నసంశయః ॥ 10 ॥**

న, ద్వేష్టి, అకుశలమ్, కర్మ, కుశలే, న, అనుషజ్జతే,
త్యాగీ, సత్త్వసమావిష్టః, మేధావీ, ఛిన్నసంశయః ॥ 10 ॥

| | | | |
|---|---|---|---|
| (యః) | = ఎవడు | సత్త్వసమావిష్టః | = శుద్ధసత్త్వగుణ యుక్తుడు |
| అకుశలమ్, కర్మ | = అకుశల కర్మ(ల)ను | ఛిన్నసంశయః | = సంశయ రహితుడు |
| న, ద్వేష్టి | = ద్వేషింపడో | మేధావీ | = బుద్ధిమంతుడు |
| కుశలే | = కుశలకర్మలయందు | త్యాగీ | = నిజమైన త్యాగి |
| న, అనుషజ్జతే | = ఆసక్తిని కలిగి యుండడో | | |
| సః | = అతడే | | |

అకుశలకర్మలను ద్వేషింపనివాడు, కుశలకర్మలయందు ఆసక్తి కలిగియుండనివాడు, శుద్ధసత్త్వగుణయుక్తుడు, సంశయరహితుడు, బుద్ధిమంతుడు ఐనవాడు నిజమైన 'త్యాగి.'(10)

**న హి దేహభృతా శక్యం త్యక్తుం కర్మాణ్యశేషతః ।**
**యస్తు కర్మఫలత్యాగీ స త్యాగీత్యభిధీయతే ॥ 11 ॥**

న, హి, దేహభృతా, శక్యమ్, త్యక్తుమ్, కర్మాణి, అశేషతః,
యః, తు, కర్మఫలత్యాగీ, సః, త్యాగీ, ఇతి, అభిధీయతే ॥ 11 ॥

| | | | |
|---|---|---|---|
| హి | = ఏలనన | (తస్మాత్) | = అందువలన |
| కర్మాణి | = కర్మలనన్నింటిని | యః | = ఏ పురుషుడు |
| అశేషతః | = సంపూర్ణముగా | కర్మఫలత్యాగీ | = కర్మఫలములను త్యజించువాడో |
| త్యక్తుమ్ | = త్యజించుటకు | సః, తు | = అతడే |
| దేహభృతా | = దేహధారియైన ఏ మనుష్యునకును | త్యాగీ, ఇతి | = నిజమైన 'త్యాగి' యని |
| న, శక్యమ్ | = సాధ్యముగాదు | అభిధీయతే | = పేర్కొనబడును |

ప్రతి శరీరధారికిని కర్మలను సంపూర్ణముగ త్యజించుట అశక్యము. కావున, కర్మలను గాక, కర్మఫలములను త్యజించినవాడే నిజమైన 'త్యాగి' అని గ్రహింపవలెను. (11)

**అనిష్టమిష్టం మిశ్రం చ త్రివిధం కర్మణః ఫలమ్ ।**
**భవత్యత్యాగినాం ప్రేత్య న తు సన్న్యాసినాం క్వచిత్ ॥ 12 ॥**

అనిష్టమ్, ఇష్టమ్, మిశ్రమ్, చ, త్రివిధమ్, కర్మణః, ఫలమ్,
భవతి, అత్యాగినామ్, ప్రేత్య, న, తు, సన్న్యాసినామ్, క్వచిత్ ॥ 12 ॥

అత్యాగినామ్ = కర్మఫలత్యాగము చేయని వారియొక్క
కర్మణః = కర్మ(ల)కు
ఇష్టమ్ = మంచి
అనిష్టమ్ = చెడు
చ = మఱియు
మిశ్రమ్ = మిశ్రము (మంచి, చెడులతో కలిసి యుండునది)
(ఇతి) = అని
త్రివిధమ్, ఫలమ్ = మూడువిధములైన ఫలములను
ప్రేత్య = మరణానంతరము (అవశ్యముగా)
భవతి = అగును (అనుభవింప వలసియుండును)
తు = అయితే
సన్న్యాసినామ్ = కర్మఫలములను పూర్తిగా త్యాగము చేసిన వారికి (కర్మ ఫలానుభవము)
క్వచిత్ = ఏకాలమునందును
న (భవతి) = ఉండదు

కర్మఫలత్యాగము చేయని మనుష్యుల కర్మలకైతే మంచి, చెడు, మిశ్రము అని మూడు విధములగు ఫలములుండును. మరణానంతరము వారు వాటిని తప్పక అనుభవించియే తీరవలయును. కాని, కర్మఫలత్యాగమొనర్చిన కర్మయోగులు తమ కర్మలఫలములను ఏ కాలమునందైనను, ఏ విధముగను అనుభవింపవలసిన పనియుండదు. (12)

**పంచైతాని మహాబాహో కారణాని నిబోధ మే ।**
**సాంఖ్యే కృతాంతే ప్రోక్తాని సిద్ధయే సర్వకర్మణామ్ ॥ 13 ॥**

పంచ, ఏతాని, మహాబాహో, కారణాని, నిబోధ, మే,
సాంఖ్యే, కృతాంతే, ప్రోక్తాని, సిద్ధయే, సర్వకర్మణామ్ ॥ 13 ॥

మహాబాహో! = ఓ మహాబాహూ!
సర్వకర్మణామ్ = సమస్తకర్మల యొక్క
సిద్ధయే[1] = సిద్ధికి
ఏతాని, పంచ = ఈ ఐదును
కారణాని = హేతువులు (అని)
కృతాంతే = కర్మలను అంతము చేయు ఉపాయములను తెలుపునట్టి
సాంఖ్యే = సాంఖ్యశాస్త్రము నందు
ప్రోక్తాని = చెప్పబడినవి
(తాని) = (వాటిని)
మే = నానుండి
నిబోధ = ఎఱుంగుము.

1. సకల కర్మలసిద్ధికై

ఓ మహాబాహూ! సర్వకర్మలసిద్ధికి ఐదు హేతువులు గలవని కర్మలను అంతముచేయు ఉపాయములను తెలుపు సాంఖ్యశాస్త్రమునందు పేర్కొనుట జరిగినది. వాటిని నానుండి నీవు స్పష్టముగా తెలిసికొనుము. (13)

**అధిష్ఠానం తథా కర్తా కరణం చ పృథగ్విధమ్ ।**
**వివిధాశ్చ పృథక్ చేష్టా దైవం చైవాత్ర పంచమమ్ ॥ 14 ॥**

అధిష్ఠానమ్, తథా, కర్తా, కరణమ్, చ, పృథగ్విధమ్,
వివిధాః, చ, పృథక్, చేష్టాః, దైవమ్, చ, ఏవ, అత్ర, పంచమమ్ ॥ 14 ॥

| | | | |
|---|---|---|---|
| అత్ర | = ఈవిషయమున (కర్మసంసిద్ధియందు) | చ | = మఱియు |
| | | వివిధాః | = వివిధములైన |
| అధిష్ఠానమ్[1] | = అధిష్ఠానము | పృథక్, చేష్టాః | = వేర్వేఱు చేష్టలు |
| చ | = మఱియు | తథా, ఏవ | = ఆ విధముగనే |
| కర్తా, చ | = కర్తయును | పంచమమ్ | = ఐదవదియగు |
| పృథగ్విధమ్ | = వివిధములైన | దైవమ్[3] | = దైవము (అను ఐదును హేతువులు) |
| కరణమ్[2] | = సాధనములును | | |

కర్మల సిద్ధియందు అధిష్ఠానము, కర్త, వివిధములైన కరణములు(సాధనములు) నానావిధ చేష్టలు, దైవము అను ఐదును హేతువులు. (14)

**శరీరవాఙ్మనోభిర్యత్ కర్మ ప్రారభతే నరః ।**
**న్యాయ్యం వా విపరీతం వా పంచైతే తస్య హేతవః ॥ 15 ॥**

శరీరవాఙ్మనోభిః, యత్, కర్మ, ప్రారభతే, నరః,
న్యాయ్యమ్, వా, విపరీతమ్, వా, పంచ, ఏతే, తస్య, హేతవః ॥ 15 ॥

| | | | |
|---|---|---|---|
| నరః | = మానవుడు | యత్, కర్మ | = ఏకర్మను |
| శరీరవాఙ్మనోభిః | = మనస్సు, వాక్కు, శరీరములతో | ప్రారభతే | = ఆచరించునో |
| | | తస్య | = ఆకర్మకు |
| న్యాయ్యమ్, వా | = శాస్త్రోక్తవిధానమునగాని | ఏతే, పంచ | = ఈ ఐదును |
| విపరీతమ్, వా | = తద్విపరీతముగాగాని | హేతవః | = హేతువులు |

1. కర్మలకు ఆశ్రయమైనదానిని 'అధిష్ఠానమ్' అని యందురు- అనగా శరీరము
2. కర్మలను ఆచరించుటకు ఉపయుక్తములగు సాధనములను 'కరణములు' అని యందురు. ఈ అధ్యాయమునందలి 18వ శ్లోకమున ప్రయుక్తమైన 'కరణము'అను పదమునకుగూడ ఈయర్థమునే భావింపవలెను.
3. పురాకృత శుభాశుభకర్మల సంస్కారములనే 'దైవమ్' అందురు.

మానవుడు మనస్సు, వాక్కు, శరీరములతో ఆచరించు శాస్త్రానుకూలమైన లేక విపరీతమైన యేకర్మలైనను ఈ యైదు హేతువులతో ఒప్పుచుండును. (15)

**తత్రైవం సతి కర్తారమ్ ఆత్మానం కేవలం తు యః ।**
**పశ్యత్యకృతబుద్ధిత్వాత్ న స పశ్యతి దుర్మతిః ॥ 16 ॥**

తత్ర, ఏవమ్, సతి, కర్తారమ్, ఆత్మానమ్, కేవలమ్, తు, యః,
పశ్యతి, అకృతబుద్ధిత్వాత్, న, సః, పశ్యతి, దుర్మతిః ॥ 16 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| తు | = | కాని | ఆత్మానమ్ | = | ఆత్మను |
| ఏవమ్, సతి | = | ఇట్లైనప్పటికిని | కర్తారమ్ | = | సమస్త కర్మలకు కర్తగా |
| యః | = | ఏపురుషుడు | పశ్యతి | = | చూచునో (తలంచునో) |
| అకృతబుద్ధిత్వాత్[1] | = | విపరీతబుద్ధి కారణమున | సః, దుర్మతిః | = | అట్టి మలిన బుద్ధి గల అజ్ఞాని |
| తత్ర | = | అకర్మవిషయముల యందు | న, పశ్యతి | = | యథార్థమును గ్రహింపజాలడు. |
| కేవలమ్ | = | కేవలుడు (శుద్ధ స్వరూపుడు ఐన) | | | |

అట్లైనప్పటికిని (సర్వ కర్మలకును ఐదు హేతువులే మూలమైనప్పటికిని) విపరీత బుద్ధికారణమున ఏ మనుష్యుడు కేవలుడు(నిరంజనుడు), శుద్ధస్వరూపుడైన ఆత్మను సమస్తకర్మలకు కర్తగా భావించునో, అట్టి మలినబుద్ధిగల అజ్ఞాని యథార్థమును గ్రహింపలేడు. (16)

**యస్య నాహంకృతో భావో బుద్ధిర్యస్య న లిప్యతే ।**
**హత్వాపి స ఇమాన్ లోకాన్ న హంతి న నిబధ్యతే ॥ 17 ॥**

యస్య, న, అహంకృతః, భావః, బుద్ధిః, యస్య, న, లిప్యతే,
హత్వా, అపి, సః, ఇమాన్, లోకాన్, న, హంతి, న, నిబధ్యతే ॥ 17 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| యస్య | = | ఏ పురుషునకు (అంతఃకరణమునందు) | భావః | = | భావము |
| | | | న | = | ఉండదో |
| అహంకృతః | = | "నేనే కర్తను"-అను | యస్య | = | ఏపురుషుని యొక్క |

1. సత్సాంగత్యము, శాస్త్రాధ్యయనము, భగవదర్థకర్మలు, ఉపాసనలు మొదలగు వానిద్వారా మనుష్యులబుద్ధులు పవిత్రమగును. కనుక పైన పేర్కొనబడిన సాధనలను చేయనివాని బుద్ధిని 'అకృతబుద్ధి' అని యందురు.

| | | | |
|---|---|---|---|
| బుద్ధిః | = బుద్ధి | హత్వా, అపి | = హతమార్చినను |
| న, లిప్యతే | = (ప్రాపంచిక పదార్థముల యందును, కర్మల యందును) అంటుకొనదో | న, హంతి | = (యథార్థముగా) చంపినవాడు కాడు |
| సః | = అట్టి పురుషుడు | న, నిబధ్యతే[1] | = (ఎట్టి పాపము చేతను) బంధింపబడడు |
| ఇమాన్, లోకాన్ | = ఈలోకములన్నింటిని | | |

అంతఃకరణమునందు కర్తృత్వభావము లేనివానిబుద్ధి ప్రాపంచికపదార్థముల యందును, కర్మలయందును అంటుకొనదు. అట్టి పురుషుడు ఈ లోకములను అన్నింటిని హతమార్చినను వాస్తవముగా చంపినవాడు కాడు. అతనిని ఎట్టి పాపములును అంటవు. (17)

**జ్ఞానం జ్ఞేయం పరిజ్ఞాతా త్రివిధా కర్మచోదనా ।**
**కరణం కర్మ కర్తేతి త్రివిధః కర్మసంగ్రహః ॥ 18 ॥**

జ్ఞానమ్, జ్ఞేయమ్, పరిజ్ఞాతా, త్రివిధా, కర్మచోదనా,
కరణమ్, కర్మ, కర్తా, ఇతి, త్రివిధః, కర్మసంగ్రహః ॥ 18 ॥

| | | | |
|---|---|---|---|
| పరిజ్ఞాతా[2] | = జ్ఞాత, (తెలిసికొను వాడును) | కర్మచోదనా | = కర్మప్రేరణములు |
| | | త్రివిధా | = మూడువిధములు |
| జ్ఞానమ్[3] | = జ్ఞానము | కర్తా[5] | = కర్త |
| జ్ఞేయమ్[4] | = జ్ఞేయము (తెలిసికొన దగిన వస్తువు) అను | కరణమ్ | = కరణము |
| | | కర్మ[6] | = క్రియ |

1. అగ్ని, వాయు, జలములద్వారా ప్రారబ్ధవశమున ఏదైననొక ప్రాణికి హింస జరిగినచో అది హింస యనబడదు. అట్లే దేహాభిమానములేకుండ స్వార్థరహితముగా లోకహితముకొఱకు కర్తవ్యకర్మలను ఆచరించు పురుషునియొక్క శరీరేంద్రియములద్వారా లోకదృష్టిలో ఏదైననొక ప్రాణికి హింస జరిగినచో వాస్తవముగా అది హింసకాదు. ఏలనన, అతని కర్మలయందు ఆసక్తి, స్వార్థము, అహంకారము, కర్తృత్వాభిమానము ఉండవు. అట్టి కర్మలు వాస్తవముగా అకర్మలు. కావున, అట్టి పురుషునకు పాపములు అంటవు.
2. తెలిసికొనువానిని 'జ్ఞాత' అనియందురు.
3. తెలిసికొనురీతిని లేక సాధనమార్గమును 'జ్ఞానము' అని యందురు.
4. తెలియబడువస్తువును 'జ్ఞేయమ్' అని యందురు
5. కర్మలను ఆచరించు వానిని 'కర్త' అని యందురు
6. ఆచరింపబడు దానిని 'కర్మ' అని యందురు.

| | | | | | |
|---|---|---|---|---|---|
| ఇతి | = | అని | త్రివిధః | = | మూడు విధములు |
| కర్మసంగ్రహః | = | కర్మసంగ్రహములు | | | |

జ్ఞాత, జ్ఞానము, జ్ఞేయము అనునవి మూడు విధములైన కర్మప్రేరణములు. కర్త, కరణము, క్రియ అని కర్మసంగ్రహములు మూడువిధములు. (18)

**జ్ఞానం కర్మ చ కర్తా చ త్రిధైవ గుణభేదతః ।**
**ప్రోచ్యతే గుణసంఖ్యానే యథావచ్ఛృణు తాన్యపి ॥ 19 ॥**

జ్ఞానమ్, కర్మ, చ, కర్తా, చ, త్రిధా, ఏవ, గుణభేదతః,
ప్రోచ్యతే, గుణసంఖ్యానే, యథావత్, శృణు, తాని, అపి ॥ 19 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| గుణసంఖ్యానే | = | సాంఖ్యశాస్త్రమునందు | త్రిధా, ఏవ | = | మూడువిధములుగానే |
| జ్ఞానమ్ | = | జ్ఞానము | ప్రోచ్యతే | = | చెప్పబడినవి |
| చ | = | మఱియు | తాని, అపి | = | వానిని |
| కర్మ | = | కర్మ | | | గూర్చియు |
| చ | = | అట్లే | యథావత్ | = | సమగ్రముగా |
| కర్తా | = | కర్త | | | (వివరించెదను) |
| గుణభేదతః | = | గుణభేదములను బట్టి | శృణు | = | వినుము. |

గుణములసంఖ్యను వివరించు సాంఖ్యశాస్త్రమునందు జ్ఞానము , కర్మ, కర్త అనునవి గుణభేదములతో మూడేసి విధములుగా పేర్కొనబడినవి. వానిని గూర్చి విశదపరచెదను, వినుము. (19)

**సర్వభూతేషు యేనైకం భావమవ్యయమీక్షతే ।**
**అవిభక్తం విభక్తేషు తద్జ్ఞానం విద్ధి సాత్త్వికమ్ ॥ 20 ॥**

సర్వభూతేషు, యేన, ఏకమ్, భావమ్, అవ్యయమ్, ఈక్షతే,
అవిభక్తమ్, విభక్తేషు, తత్, జ్ఞానమ్, విద్ధి, సాత్త్వికమ్ ॥ 20 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| యేన | = | (మనుష్యుడు) ఏ | సర్వభూతేషు | = | సమస్త ప్రాణుల |
| | | జ్ఞానముతో | | | యందును |
| విభక్తేషు | = | వేర్వేఱుగా ఉన్న | ఏకమ్ | = | ఒక్కడేయైయున్న |

| | | | | | |
|---|---|---|---|---|---|
| అవ్యయమ్ | = | శాశ్వతుడైన | ఈక్షతే | = | చూచునో |
| అవిభక్తమ్ | = | అఖండముగా సమ భావస్థితుడైయున్న | తత్, జ్ఞానమ్ | = | అట్టి జ్ఞానమును |
| | | | సాత్త్వికమ్ | = | 'సాత్త్వికజ్ఞానము'గా |
| భావమ్ | = | పరమాత్మభావమును | విద్ధి | = | ఎఱుంగుము. |

వేర్వేరుగా కన్పించు సమస్తప్రాణులయందును శాశ్వతుడైన పరమాత్మయే విభాగరహితుడుగా సమభావముతో స్థితుడై యున్నట్లు జ్ఞానియైన వాడు చూచును. అట్టి పురుషుని జ్ఞానమును 'సాత్త్విక జ్ఞానము'గా తెలిసికొనుము. (20)

**పృథక్త్వేన తు యద్జ్ఞానం నానాభావాన్ పృథగ్విధాన్ ।**
**వేత్తి సర్వేషు భూతేషు తద్జ్ఞానం విద్ధి రాజసమ్ ॥ 21 ॥**

పృథక్త్వేన, తు, యత్, జ్ఞానమ్, నానాభావాన్, పృథగ్విధాన్,
వేత్తి, సర్వేషు, భూతేషు, తత్, జ్ఞానమ్, విద్ధి, రాజసమ్ ॥ 21 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| తు | = | కాని | పృథక్త్వేన | = | దేనికది 'వేర్వేఱు' అని |
| యత్, జ్ఞానమ్ | = | (మనుష్యుడు) ఏ జ్ఞానము ద్వారా | వేత్తి | = | ఎఱుంగు (తలంచు)నో |
| సర్వేషు, భూతేషు | = | సమస్త ప్రాణుల యందును | తత్, జ్ఞానమ్ | = | ఆజ్ఞానము |
| పృథగ్విధాన్ | = | వేర్వేఱు విధములుగా నున్న | రాజసమ్ | = | 'రాజస జ్ఞానము'గా |
| నానాభావాన్ | = | వివిధభావములను | విద్ధి | = | ఎఱుంగుము. |

సమస్తప్రాణులయందును నానావిధములైన వివిధభావములను వేర్వేరుగా భావించువారి జ్ఞానమును 'రాజసము' అని యెరుంగుము. (21)

**యత్తు కృత్స్నవదేకస్మిన్ కార్యే సక్తమహైతుకమ్ ।**
**అతత్త్వార్థవదల్పం చ తత్తామసముదాహృతమ్ ॥ 22 ॥**

యత్, తు, కృత్స్నవత్, ఏకస్మిన్, కార్యే, సక్తమ్, అహైతుకమ్,
అతత్త్వార్థవత్, అల్పమ్, చ, తత్, తామసమ్, ఉదాహృతమ్ ॥ 22 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| తు | = | కాని | ఏకస్మిన్, కార్యే | = | ప్రకృతి కార్యరూపమైన శరీరమునందుమాత్రమే |
| యత్ | = | (మనుష్యుడు) ఏ జ్ఞానముద్వారా | కృత్స్నవత్ | = | సర్వస్వమువలె |

| | | | |
|---|---|---|---|
| సక్తమ్[1] | = ఆసక్తిని కల్గించు నట్టిదియు | అల్పమ్ | = తుచ్ఛమైనదియు |
| చ | = మఱియు | తత్ | = అట్టి జ్ఞానము |
| అహైతుకమ్ | = హేతుబద్ధము కానిదియు | తామసమ్ | = 'తామసము' అని |
| అతత్త్వార్థవత్ | = తాత్త్వికముగా అర్థ రహితమైనదియు | ఉదాహృతమ్ | = పేర్కొనబడినది |

ప్రకృతికార్యమైన శరీరమునే(శరీరమునకు సంబంధించిన భౌతికవస్తువులనే) సమస్తముగా భావించి, దానియందే ఆసక్తిని కల్గించునట్టిదియు, తాత్త్వికముగా అర్థరహితమైనదియు, హేతుబద్ధము కానిదియు, తుచ్ఛమైనదియు అగు విపరీత జ్ఞానమును 'తామసము' అనియందురు. (22)

**నియతం సంగరహితమ్ అరాగద్వేషతః కృతమ్ ।**
**అఫలప్రేప్సునా కర్మ యత్తత్ సాత్త్వికముచ్యతే ॥ 23 ॥**

నియతమ్, సంగరహితమ్, అరాగద్వేషతః, కృతమ్,
అఫలప్రేప్సునా, కర్మ, యత్, తత్, సాత్త్వికమ్, ఉచ్యతే ॥ 23 ॥

| | | | |
|---|---|---|---|
| యత్ | = ఏ | అరాగద్వేషతః | = రాగద్వేష రహితముగా |
| కర్మ | = కర్మ | కృతమ్ | = చేయబడినది యగునో |
| నియతమ్ | = శాస్త్రవిహితమైనదియు | తత్ | = అది (ఆ కర్మ) |
| సంగరహితమ్ | = కర్తృత్వాభిమానము లేనిదియు అగునో | సాత్త్వికమ్ | = 'సాత్త్విక కర్మ' అని |
| అఫలప్రేప్సునా | = ఫలాపేక్షలేని పురుషుని చేత | ఉచ్యతే | = చెప్పబడును |

కర్తృత్వాభిమానము గాని, ఫలాపేక్షగాని లేని పురుషునిచేత రాగద్వేషరహితముగా చేయబడు శాస్త్రవిహితమైన కర్మను 'సాత్త్వికకర్మ'యని యందురు. (23)

**యత్తు కామేప్సునా కర్మ సాహంకారేణ వా పునః ।**
**క్రియతే బహులాయాసం తద్రాజసముదాహృతమ్ ॥ 24 ॥**

1. విపరీత జ్ఞానముద్వారా మనుష్యుడు క్షణభంగురమైన, నశ్వరమైన శరీరమునే 'ఆత్మ'యని భావించి, దానినే సర్వస్వముగా తలంచి, దానిపై ఆసక్తుడగును.

యత్, తు, కామేప్సునా, కర్మ, సాహంకారేణ, వా, పునః,
క్రియతే, బహులాయాసమ్, తత్, రాజసమ్, ఉదాహృతమ్ ॥ 24 ॥

| | | | |
|---|---|---|---|
| తు | = కాని | వా | = లేక |
| యత్, కర్మ | = ఏకర్మఅయితే | సాహంకారేణ | = అహంకారిచేతను |
| బహులాయాసమ్ | = మిక్కిలిశ్రమతో గూడినదియో | క్రియతే | = చేయబడునో |
| | | తత్ | = అది (ఆకర్మ) |
| పునః | = అట్లే | | |
| కామేప్సునా | = భోగలాలసుడైన పురుషుని చేతను | రాజసమ్ | = 'రాజసకర్మ'గా |
| | | ఉదాహృతమ్ | = పేర్కొనబడును. |

భోగలాలసుడైన పురుషునిచేతను, అహంకారిచేతను చేయబడు మిక్కిలి శ్రమతో కూడిన కర్మను 'రాజసకర్మ' అని యందురు. (24)

**అనుబంధం క్షయం హింసామ్ అనవేక్ష్య చ పౌరుషమ్ ।**
**మోహాదారభ్యతే కర్మ యత్తత్ తామసముచ్యతే ॥ 25 ॥**

అనుబంధమ్, క్షయమ్, హింసామ్, అనవేక్ష్య, చ, పౌరుషమ్,
మోహాత్, ఆరభ్యతే, కర్మ, యత్, తత్, తామసమ్, ఉచ్యతే ॥ 25 ॥

| | | | |
|---|---|---|---|
| యత్, కర్మ | = ఏకర్మ | మోహాత్ | = కేవలము అజ్ఞానముతో |
| అనుబంధమ్ | = పరిణామమును | | |
| క్షయమ్ | = హానిని | ఆరభ్యతే | = చేయబడునో |
| హింసామ్ | = హింసను | తత్ | = అది (ఆకర్మ) |
| చ | = మఱియు | తామసమ్ | = 'తామసము' అని |
| పౌరుషమ్ | = సామర్థ్యమును | | |
| అనవేక్ష్య | = ఆలోచింపక | ఉచ్యతే | = చెప్పబడును. |

పరిణామము(మంచిచెడ్డలు), హాని, హింస, సామర్థ్యములను చూచుకొనక కేవలము అజ్ఞానముచే ఆరంభింపబడు కర్మలను 'తామస కర్మలు' అనియందురు. (25)

**ముక్తసంగోఽనహంవాదీ ధృత్యుత్సాహసమన్వితః ।**
**సిద్ధ్యసిద్ధ్యోర్నిర్వికారః కర్తా సాత్త్విక ఉచ్యతే ॥ 26 ॥**

ముక్తసంగః, అనహంవాదీ, ధృత్యుత్సాహసమన్వితః,
సిద్ధ్యసిద్ధ్యోః, నిర్వికారః, కర్తా, సాత్త్వికః, ఉచ్యతే ॥ 26 ॥

| | | | |
|---|---|---|---|
| ముక్తసంగః | = ఆసక్తిని త్యజించిన వాడును | నిర్వికారః | = హర్షశోకాది వికారములకు లోనుకానివాడును, ఐనవాడు |
| అనహంవాదీ | = అహంకారరహితముగా భాషించువాడును | | |
| ధృత్యుత్సాహసమన్వితః | = ధైర్యోత్సాహములు గలవాడును | సాత్త్వికః, కర్తా | = 'సాత్త్విక కర్త' అని |
| సిద్ధ్యసిద్ధ్యోః | = సిద్ధి- అసిద్ధులయెడ | ఉచ్యతే | = పేర్కొనబడును. |

ఆసక్తిని త్యజించినవాడు, అహంకారరహితముగా భాషించువాడు, ధైర్యోత్సాహములుగలవాడును, సిద్ధి-అసిద్ధులయెడ హర్షశోకాదివికారములకు లోనుకానివాడును అగు పురుషుడు 'సాత్త్వికకర్త' యనబడును (26)

**రాగీ కర్మఫలప్రేప్సుః లుబ్ధో హింసాత్మకోఽశుచిః ।**
**హర్షశోకాన్వితః కర్తా రాజసః పరికీర్తితః ॥ 27 ॥**

రాగీ, కర్మఫలప్రేప్సుః, లుబ్ధః, హింసాత్మకః, అశుచిః,
హర్షశోకాన్వితః, కర్తా, రాజసః, పరికీర్తితః ॥ 27 ॥

| | | | |
|---|---|---|---|
| రాగీ | = ఆసక్తిగలవాడును | అశుచిః | = అపవిత్ర ప్రవర్తన గలవాడును |
| కర్మఫలప్రేప్సుః | = కర్మఫలములకై ఆరాటపడువాడును | హర్షశోకాన్వితః | = హర్షశోకములకు లోనగువాడును |
| లుబ్ధః | = లోభియు | | |
| హింసాత్మకః | = ఇతరులను కష్టపెట్టు స్వభావము గలవాడును | రాజసః, కర్తా | = 'రాజసకర్త' అని |
| | | పరికీర్తితః | = చెప్పబడును. |

ఆసక్తియుతుడు, కర్మఫలములకై ఆరాటపడువాడు, లోభి, ఇతరులను కష్టపెట్టు స్వభావము గలవాడు, అపవిత్రప్రవర్తన గలవాడు, హర్ష శోకములకు లోనగువాడు 'రాజసకర్త'గా భావింపబడును. (27)

**అయుక్తః ప్రాకృతః స్తబ్ధః శఠో నైష్కృతికోఽలసః ।**
**విషాదీ దీర్ఘసూత్రీ చ కర్తా తామస ఉచ్యతే ॥ 28 ॥**

అయుక్తః, ప్రాకృతః, స్తబ్ధః, శఠః, నైష్కృతికః, అలసః,
విషాదీ, దీర్ఘసూత్రీ, చ, కర్తా, తామసః, ఉచ్యతే ॥ 28 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| అయుక్తః | = | జితేంద్రియుడు కానివాడును | విషాదీ | = | నిరంతరము చింతాగ్రస్తుడును |
| ప్రాకృతః | = | సుశిక్షితుడుగాని వాడును | అలసః | = | సోమరియును |
| | | | చ | = | మఱియు |
| స్తబ్ధః | = | మూర్ఖుడును | దీర్ఘసూత్రీ[1] | = | ఉపేక్షతో కాలము గడుపుచుండు వాడును, అగువాడు |
| శఠః | = | ధూర్తుడును | | | |
| నైష్కృతికః | = | అకారణముగ ఇతరుల వృత్తులకు విఘాతము కల్గించువాడును | తామసః, కర్తా | = | 'తామస కర్త' అని |
| | | | ఉచ్యతే | = | పేర్కొనబడును. |

జితేంద్రియుడు కానివాడు, సుశిక్షితుడు కానివాడు, మూర్ఖుడు(మొండివాడు), ధూర్తుడు, అకారణముగ ఇతరులవృత్తులకు విఘాతము కల్గించువాడు, సదా చింతాగ్రస్తుడు, సోమరి, కార్యాచరణమునందు ఉపేక్షతో కాలము గడుపుచుండువాడు అను (దీర్ఘసూత్రి) - లక్షణములను గలవానిని 'తామసకర్త' అని యందురు (28)

**బుద్ధేర్భేదం ధృతేశ్చైవ గుణతస్త్రివిధం శృణు ।**
**ప్రోచ్యమానమశేషేణ పృథక్త్వేన ధనంజయ ॥ 29 ॥**

బుద్ధేః, భేదమ్, ధృతేః, చ, ఏవ, గుణతః, త్రివిధమ్, శృణు,
ప్రోచ్యమానమ్, అశేషేణ, పృథక్త్వేన, ధనంజయ ॥ 29 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| ధనంజయ! | = | ఓ ధనంజయా! | (మయా) | = | నాచేత |
| బుద్ధేః | = | బుద్ధికి | అశేషేణ | = | సంపూర్ణముగా |
| చ | = | మఱియు | పృథక్త్వేన | = | వేర్వేఱుగా |
| ధృతేః, ఏవ | = | ధృతికిని | ప్రోచ్యమానమ్ | = | చెప్పబడుచున్న (వాటిని) |
| గుణతః | = | గుణములను బట్టి | | | |
| త్రివిధమ్, భేదమ్ | = | మూడువిధములగు భేదములు (గలవు) | శృణు | = | వినుము |

ఓ ధనంజయా! ఇప్పుడు నీవు బుద్ధి, ధృతులను గూడ గుణభేదములననుసరించి మూడు విధములుగా, విభాగ పూర్వకముగా సంపూర్ణముగా నానుండి వినుము. (29)

1. కొలదిసమయములోనే పూర్తికాగల సామాన్యమైన పనివిషయమునను ఉపేక్షవహించి, ఆపనిని ప్రక్కనబెట్టు వానిని 'దీర్ఘసూత్రీ' అని యందురు.

**ప్రవృత్తిం చ నివృత్తిం చ కార్యాకార్యే భయాభయే ।**
**బంధం మోక్షం చ యా వేత్తి బుద్ధిః సా పార్థ సాత్త్వికీ ॥ 30 ॥**

ప్రవృత్తిమ్, చ, నివృత్తిమ్, చ, కార్యాకార్యే, భయాభయే,
బంధమ్, మోక్షమ్, చ, యా, వేత్తి, బుద్ధిః సా, పార్థ, సాత్త్వికీ ॥ 30 ॥

| | | | |
|---|---|---|---|
| పార్థ! | = ఓ పార్థా! | చ | = అట్లే |
| యా | = ఏ బుద్ధి | బంధమ్ | = బంధమును |
| ప్రవృత్తిమ్[1] | = ప్రవృత్తిమార్గమును | చ | = మఱియు |
| చ | = మఱియు | మోక్షమ్ | = మోక్షమును |
| నివృత్తిమ్[2] | = నివృత్తి మార్గమును | వేత్తి | = యథార్థముగా ఎఱుంగునో |
| కార్యాకార్యే | = కర్తవ్యమును, అకర్తవ్యమును | సా, బుద్ధిః | = అట్టి బుద్ధి |
| | | సాత్త్వికీ | = సాత్త్వికబుద్ధి అని చెప్పబడును. |
| భయాభయే | = భయ-అభయములను | | |

ప్రవృత్తిమార్గమును, నివృత్తిమార్గమును, కర్తవ్యమును, అకర్తవ్యమును, భయమును, అభయమును, అట్లే బంధమును, మోక్షమును యథార్థముగా తెలిసికొను బుద్ధిని 'సాత్త్వికమైన బుద్ధి'యందురు. (30)

**యయా ధర్మమధర్మం చ కార్యం చాకార్యమేవ చ ।**
**అయథావత్ ప్రజానాతి బుద్ధిః సా పార్థ రాజసీ ॥ 31 ॥**

యయా, ధర్మమ్, అధర్మమ్, చ, కార్యమ్, చ, అకార్యమ్ ఏవ, చ,
అయథావత్, ప్రజానాతి, బుద్ధిః, సా, పార్థ, రాజసీ ॥ 31 ॥

| | | | |
|---|---|---|---|
| పార్థ! | = ఓ పార్థా! | అయథావత్, ప్రజానాతి | = (మనుష్యుడు) యథార్థముగా తెలిసికొనలేడో |
| యయా | = ఏ బుద్ధిద్వారా | | |
| ధర్మమ్, చ | = ధర్మమునూ | | |
| అధర్మం, చ | = అధర్మమునూ | సా, బుద్ధిః | = ఆ బుద్ధి |
| కార్యమ్, చ | = కర్తవ్యమునూ | రాజసీ, | = 'రాజసబుద్ధి' అని |
| అకార్యమ్, ఏవ | = అకర్తవ్యమునూ | | చెప్పబడును. |

1. గృహస్థాశ్రమముననే ఉండి, ఫలాసక్తులను త్యజించి, భగవదర్పణబుద్ధితో కేవలము లోకహితార్థమై జనకమహారాజువలె ప్రవర్తించుటను 'ప్రవృత్తి' మార్గమని యందురు.
2. దేహాభిమానమును వీడి, కేవలము సచ్చిదానందఘనపరమాత్మయందే ఏకీభావస్థితులై, శుకసనకాది మహర్షులవలె సంసారమునుండి ఉపరతులై చరించు మార్గమును 'నివృత్తి' మార్గమని యందురు.

ఓ పార్థా! ధర్మాధర్మములయొక్కయు, కార్యాకార్యములయొక్కయు(కర్తవ్యా కర్తవ్యముల యొక్కయు), యథార్థతత్త్వములను తెలియజాలని బుద్ధిని 'రాజసబుద్ధి' అనియందురు. (31)

**అధర్మం ధర్మమితి యా మన్యతే తమసావృతా ।**
**సర్వార్థాన్ విపరీతాంశ్చ బుద్ధిః సా పార్థ తామసీ ॥ 32 ॥**

అధర్మమ్, ధర్మమ్, ఇతి, యా, మన్యతే, తమసా, ఆవృతా,
సర్వార్థాన్, విపరీతాన్, చ, బుద్ధిః, సా, పార్థ, తామసీ ॥ 32 ॥

| | | | |
|---|---|---|---|
| పార్థ! | = ఓ పార్థా! | సర్వార్థాన్ | = సమస్తపదార్థములను, (విషయములను) |
| యా | = ఏబుద్ధి | విపరీతాన్, చ | = వాటికి విరుద్ధముగా |
| తమసా, ఆవృతా | = తమోగుణముచే కప్పబడినదై | (మన్యతే) | = భావించునో |
| అధర్మమ్ | = అధర్మమును | సా | = అది |
| ధర్మమ్, ఇతి | = ధర్మమని | తామసీ, బుద్ధిః | = 'తామసబుద్ధి' అని పేర్కొనబడును. |
| మన్యతే | = తలంచునో | | |
| చ | = మఱియు | | |

ఓ అర్జునా! తమోగుణావృతమైనందున అధర్మమును ధర్మముగను, అట్లే ఇతర పదార్థములను(విషయములను) తద్విపరీతముగను భావించు బుద్ధిని "తామస బుద్ధి" అని యందురు. (32)

**ధృత్యా యయా ధారయతే మనఃప్రాణేంద్రియక్రియాః ।**
**యోగేనావ్యభిచారిణ్యా ధృతిః సా పార్థ సాత్త్వికీ ॥ 33 ॥**

ధృత్యా, యయా, ధారయతే, మనఃప్రాణేంద్రియక్రియాః,
యోగేన, అవ్యభిచారిణ్యా, ధృతిః, సా, పార్థ, సాత్త్వికీ ॥ 33 ॥

| | | | |
|---|---|---|---|
| పార్థ! | = ఓ పార్థా! | యోగేన | = ధ్యానయోగముద్వారా |
| యయా | = ఏ | మనఃప్రాణేంద్రియ క్రియాః[2] | = మనఃప్రాణేంద్రియ క్రియలను |
| అవ్యభిచారిణ్యా[1] | = ఇటునటుచలింపని | | |
| ధృత్యా | = ధారణాశక్తిచే(మనుష్యుడు) | | |

1. భగవద్విషయములనుదప్ప ఇతరసాంసారికవిషయములయందు ఆసక్తుడగుటను వ్యభిచార దోషము అందురు. ఇట్టి దోషము లేకుండుటను 'అవ్యభిచారిణీధారణాశక్తి' అని యందురు.
2. మనస్సు, ప్రాణేంద్రియములను భగవత్ప్రాప్తికొఱకై భజన, ధ్యానము, నిష్కామకర్మల యందు లగ్నము చేయుటను 'మనఃప్రాణేంద్రియక్రియాః' అని యందురు.

| | | | |
|---|---|---|---|
| ధారయతే | = ధారణచేయునో | సాత్త్వికీ, ధృతిః | = సాత్త్వికధృతియని చెప్పబడును |
| సా | = అది | | |

ఓ పార్థా! ఇటునటు చలింపని ధారణాశక్తితో మనుష్యుడు ధ్యానయోగముద్వారా మనఃప్రాణేంద్రియక్రియలను ధారణచేయు శక్తిని 'సాత్త్వికధృతి' యందురు. (33)

**యయా తు ధర్మకామార్థాన్ ధృత్యా ధారయతేఽర్జున ।**
**ప్రసంగేన ఫలాకాంక్షీ ధృతిః సా పార్థ రాజసీ ॥ 34 ॥**

యయా, తు, ధర్మకామార్థాన్, ధృత్యా, ధారయతే, అర్జున,
ప్రసంగేన, ఫలాకాంక్షీ, ధృతిః, సా, పార్థ, రాజసీ ॥ 34 ॥

| | | | |
|---|---|---|---|
| తు | = కాని | ధర్మకామార్థాన్ | = ధర్మార్థకామ విషయములను |
| పార్థ! | = ఓ పార్థా! | ధారయతే | = ధారణ చేయునో |
| అర్జున! | = ఓ అర్జునా! | సా | = అది |
| ఫలాకాంక్షీ | = కర్మఫలేచ్ఛగల మనుజుడు | రాజసీ, ధృతిః | = 'రాజసధృతి' అని పేర్కొనబడును |
| యయా, ధృత్యా | = ఏధృతిచేత | | |
| ప్రసంగేన | = మిక్కిలి ఆసక్తితో | | |

కాని, ఓ పార్థా! అర్జునా! కర్మఫలేచ్ఛగల మనుజుడు మిక్కిలి ఆసక్తితో ధర్మార్థకామవిషయములను ధారణచేయు శక్తిని 'రాజసధృతి' అనియందురు. (34)

**యయా స్వప్నం భయం శోకం విషాదం మదమేవ చ ।**
**న విముంచతి దుర్మేధా ధృతిః సా పార్థ తామసీ ॥ 35 ॥**

యయా, స్వప్నమ్, భయమ్, శోకమ్, విషాదమ్, మదమ్, ఏవ, చ,
న, విముంచతి, దుర్మేధాః, ధృతిః, సా, పార్థ, తామసీ ॥ 35 ॥

| | | | |
|---|---|---|---|
| పార్థ! | = ఓ పార్థా! | విషాదమ్ | = దుఃఖమును |
| దుర్మేధాః | = దుర్మతియైన మనుష్యుడు | మదమ్, ఏవ | = ఉన్మత్తతను |
| యయా,(ధృత్యా) | = ఏధారణాశక్తిద్వారా | న, విముంచతి | = విడిచిపెట్టడో అనగా ధారణ చేయుచుండునో |
| స్వప్నమ్ | = నిద్రను | | |
| భయమ్ | = భయమును | సా | = అది |
| శోకమ్ | = చింతను | తామసీ, ధృతిః | = 'తామసధృతి' యని చెప్పబడును. |
| చ | = మఱియు | | |

పార్థా! నిద్ర, భయము,చింతాశోకములు, ఉన్మత్తతలను విడువక, దుర్మతియైన మనుష్యుడు వాటినే సంతతము ధారణ చేయుచుండును. అట్టి ధృతిని, 'తామసధృతి' అనియందురు. (35)

**సుఖం త్విదానీం త్రివిధం శృణు మే భరతర్షభ ।**
**అభ్యాసాద్రమతే యత్ర దుఃఖాంతం చ నిగచ్ఛతి ॥ 36 ॥**
**యత్తదగ్రే విషమివ పరిణామేఽమృతోపమమ్ ।**
**తత్సుఖం సాత్త్వికం ప్రోక్తమ్ ఆత్మబుద్ధిప్రసాదజమ్ ॥ 37 ॥**

సుఖమ్, తు, ఇదానీమ్, త్రివిధమ్, శృణు, మే, భరతర్షభ,
అభ్యాసాత్, రమతే, యత్ర, దుఃఖాంతమ్, చ, నిగచ్ఛతి ॥ 36 ॥
యత్, తత్, అగ్రే, విషమ్, ఇవ, పరిణామే, అమృతోపమమ్,
తత్, సుఖమ్, సాత్త్వికమ్, ప్రోక్తమ్, ఆత్మబుద్ధిప్రసాదజమ్ ॥ 37 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| భరతర్షభ! | = | ఓ అర్జునా! | చ | = | మఱియు |
| ఇదానీమ్ | = | ఇప్పుడు | దుఃఖాంతమ్ | = | దుఃఖాంతమును |
| త్రివిధమ్ | = | మూడు విధములైన | నిగచ్ఛతి | = | పొందునో |
| సుఖమ్, తు | = | సుఖములను గూర్చియు | యత్ | = | ఏ సుఖమైతే |
| మే, (వచః) | = | నామాటలను | అగ్రే | = | ప్రారంభ సమయమున |
| శృణు | = | వినుము | విషమ్, ఇవ[1] | = | విషమువలె అనిపించినను |
| యత్ర | = | ఏ సుఖమునందు సాధకుడు | పరిణామే, తత్ | = | పరిణామమున అది |
| అభ్యాసాత్ | = | భజనధ్యానాదుల అభ్యాసము వలన | అమృతోపమమ్ | = | అమృతతుల్యముగా ఉండునో |
| రమతే | = | ఆనందించునో | (అతః) | = | (అందువలన) |

1. ఆటలయందాసక్తుడైన బాలునకు అజ్ఞాన కారణమున విద్యాభ్యాసము విషమువలె (చేదుగా) తోచును. అట్లే విషయాసక్తులైన వారికి భగవద్భజన, ధ్యానము, సేవాది సాధనల అభ్యాసమహత్త్వము తెలియని కారణమున మొదట అది 'విషతుల్యము'గా కన్పించును.

| | | | |
|---|---|---|---|
| ఆత్మబుద్ధి ప్రసాదజమ్ | = పరమాత్మకు సంబంధించిన విషయములలో నిమగ్నమగుట వలన కలుగునట్టి | తత్, సుఖమ్ | = ఆసుఖము |
| | | సాత్త్వికమ్ | = 'సాత్త్విక సుఖము' అని |
| | | ప్రోక్తమ్ | = చెప్పబడును |

ఓ భరతశ్రేష్ఠా! మూడు విధములగు సుఖములను గూర్చియు నేను చెప్పెదను వినుము. ఏ సుఖమునందు సాధకుడు భజనధ్యానసేవాదుల నొనర్చి ఆనందించునో, దుఃఖములను అతిక్రమించునో, ప్రారంభమునందు విషతుల్యముగా (దుఃఖకరముగా) గోచరించినప్పటికిని పరిణామమున అమృతతుల్యమై పరమాత్మకు సంబంధించిన విషయములలో నిమగ్నమగునో, అట్టి సుఖమును 'సాత్త్విక సుఖము' అనియందురు.(36-37)

**విషయేంద్రియసంయోగాత్ యత్తదగ్రేఽమృతోపమమ్ ।**
**పరిణామే విషమివ తత్సుఖం రాజసం స్మృతమ్ ॥ 38 ॥**

విషయేంద్రియసంయోగాత్, యత్, తత్, అగ్రే, అమృతోపమమ్,
పరిణామే, విషమ్, ఇవ, తత్, సుఖమ్, రాజసమ్, స్మృతమ్ ॥ 38 ॥

| | | | |
|---|---|---|---|
| విషయేంద్రియ సంయోగాత్ | = విషయేంద్రియ సంయోగమువలన | అమృతోపమమ్ | = అమృతతుల్యముగ గోచరించినను |
| యత్, సుఖమ్ | = ఏ సుఖము | పరిణామే | = పరిణామమున |
| (భవతి) | = కలుగునో | విషమ్, ఇవ[1] | = విషప్రాయమగును |
| తత్ | = ఆసుఖము | (అతః | = అందువలన) |
| అగ్రే | = ప్రారంభ సమయమున (భోగానుభవ సమయమునందు) | తత్ | = అది |
| | | రాజసమ్ | = 'రాజస సుఖము'-అని |
| | | స్మృతమ్ | = తలంపబడును. |

విషయేంద్రియసంయోగమువలనకలుగుసుఖము మొదట భోగానుభవ సమయమునందు అమృతతుల్యముగ అనిపించినను పరిణామమున అది విషతుల్యమగును. అట్టి సుఖమును 'రాజససుఖ' మందురు. (38)

1. *బలము, వీర్యము, బుద్ధి, ధనము, ఉత్సాహము, పరలోకలాభములను నాశమొనరించు విషయేంద్రియసంయోగమువలన గలుగు సుఖము పరిణామమున 'విష'తుల్యమగును.*

**యదగ్రే చానుబంధే చ సుఖం మోహనమాత్మనః ।**
**నిద్రాలస్యప్రమాదోత్థం తత్తామసముదాహృతమ్ ॥ 39 ॥**

యత్, అగ్రే, చ, అనుబంధే, చ, సుఖమ్, మోహనమ్, ఆత్మనః,
నిద్రాలస్యప్రమాదోత్థమ్, తత్, తామసమ్, ఉదాహృతమ్ ॥ 39 ॥

| | | | |
|---|---|---|---|
| యత్, సుఖమ్ | = ఏ సుఖము | నిద్రాలస్య ప్రమాదోత్థమ్ | = నిద్ర, సోమరితనము, ప్రమాదము (మోహము)ల వలన ఉత్పన్నమగునో |
| అగ్రే | = అనుభవ సమయమునను | తత్ | = ఆ సుఖము |
| చ | = మఱియు | తామసమ్ | = 'తామససుఖము'-అని |
| అనుబంధే, చ | = పరిణామమునందును | ఉదాహృతమ్ | = పేర్కొనబడును. |
| ఆత్మనః, మోహనమ్ | = ఆత్మను మోహింప జేయునదియగునో | | |

నిద్ర, సోమరితనము, ప్రమాదము (మోహము)ల వలన ఉత్పన్నమగు సుఖమును 'తామససుఖము' అనియందురు. ఇట్టి సుఖము భోగసమయమునందును, పరిణామమునందును ఆత్మను మోహింపజేయుచుండును. (39)

**న తదస్తి పృథివ్యాం వా దివి దేవేషు వా పునః ।**
**సత్త్వం ప్రకృతిజైర్ముక్తం యదేభిః స్యాత్ త్రిభిర్గుణైః ॥ 40 ॥**

న, తత్, అస్తి, పృథివ్యామ్, వా, దివి, దేవేషు, వా, పునః,
సత్త్వమ్, ప్రకృతిజైః, ముక్తమ్, యత్, ఏభిః, స్యాత్, త్రిభిః, గుణైః ॥ 40 ॥

| | | | |
|---|---|---|---|
| ప్రకృతిజైః | = ప్రకృతినుండి ఉత్పన్నములైన | తత్, సత్త్వమ్ | = ఆ ప్రాణి |
| ఏభిః, త్రిభిః, గుణైః | = ఈ మూడు గుణములచేత | పృథివ్యామ్, వా | = భూమియందుగాని |
| ముక్తమ్ | = విడువబడినది | దివి, వా | = ఆకాశమునందుగాని |
| యత్ | = ఏది (ఏ ప్రాణి) | దేవేషు | = దేవతలయందుగాని |
| స్యాత్ | = అగునో | పునః | = మఱి ఏయితర లోకములయందుగాని |
| | | న, అస్తి | = లేదు (ఉండదు) |

పృథివియందు గాని, ఆకాశమునందుగాని, దేవతలయందుగాని, మఱేయితర లోకములయందుగాని, ప్రకృతినుండి ఉత్పన్నములైన ఈ మూడు గుణములు లేకుండ ఏ ప్రాణియు ఉండదు. (40)

**బ్రాహ్మణక్షత్రియవిశాం శూద్రాణాం చ పరంతప ।**
**కర్మాణి ప్రవిభక్తాని స్వభావప్రభవైర్గుణైః ॥ 41 ॥**

బ్రాహ్మణక్షత్రియవిశామ్, శూద్రాణామ్, చ, పరంతప,
కర్మాణి, ప్రవిభక్తాని, స్వభావప్రభవైః, గుణైః ॥ 41 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| పరంతప! | = | ఓ పరంతపా! (అర్జునా) | స్వభావప్రభవైః | = | వారివారి స్వభావములను అనుసరించి ఏర్పడిన |
| బ్రాహ్మణ క్షత్రియవిశామ్ | = | బ్రాహ్మణక్షత్రియ వైశ్యులయొక్క | | | |
| చ | = | అట్లే | | | |
| శూద్రాణామ్ | = | శూద్రులయొక్క | గుణైః | = | గుణములనుబట్టి |
| కర్మాణి | = | కర్మలు | ప్రవిభక్తాని | = | విభజింపబడినవి |

ఓపరంతపా! బ్రాహ్మణ క్షత్రియ వైశ్యుల కర్మలునూ, అట్లే శూద్రుల కర్మలునూ వారివారి స్వాభావికములైన గుణములనుబట్టి విభజింపబడియున్నవి. (41)

**శమో దమస్తపః శౌచం క్షాంతిరార్జవమేవ చ ।**
**జ్ఞానం విజ్ఞానమాస్తిక్యం బ్రహ్మకర్మస్వభావజమ్ ॥ 42 ॥**

శమః, దమః, తపః, శౌచమ్, క్షాంతిః, ఆర్జవమ్, ఏవ, చ,
జ్ఞానమ్, విజ్ఞానమ్, ఆస్తిక్యమ్, బ్రహ్మకర్మస్వభావజమ్ ॥ 42 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| శమః | = | శమము (మనోనిగ్రహము) | ఆస్తిక్యమ్ | = | వేదశాస్త్రముల యందును, ఈశ్వరుని యందును, పరలోకాదులయందును విశ్వాసము కలిగియుండుట |
| దమః | = | దమము (ఇంద్రియ నిగ్రహము) | | | |
| తపః | = | తపస్సు (ధర్మములను పాటించుటలో ఎదురగు కష్టములను సహించుట) | జ్ఞానమ్ | = | వేదశాస్త్రముల అధ్యయనము, అధ్యాపనము |
| శౌచమ్[1] | = | బాహ్యాభ్యంతరముల శుచిత్వము | చ | = | మఱియు |
| క్షాంతిః | = | ఇతరుల అపరాధములను క్షమించుట | విజ్ఞానమ్ ఏవ | = | పరతత్త్వానుభవమూ (ఇవియన్నియును) |
| ఆర్జవమ్ | = | ఋజుమార్గజీవనము | బ్రహ్మకర్మ స్వభావజమ్ | = | బ్రాహ్మణుల స్వాభావిక కర్మలు |

1. *గీత 13వ అధ్యాయము-7వ శ్లోకము యొక్క టిప్పణి చూడనగును.*

అంత:కరణనిగ్రహము (శమము), ఇంద్రియములను వశమునందుంచుకొనుట(దమము), ధర్మములను పాటించుటలో ఎదురగు కష్టములను సహించుట, బాహ్యాభ్యంతరముల శుచిత్వము, ఇతరులఅపరాధములను క్షమించుట, ఋజుమార్గ జీవనము, (మనశ్శరీరేంద్రియముల సరళత్వము) వేదశాస్త్రముల యందును, ఈశ్వరునియందును, పరలోకాదులయందును, విశ్వాసమును కలిగియుండుట, వేదశాస్త్రములఅధ్యయనము, అధ్యాపనము, పరతత్త్వానుభవము - ఇవి యన్నియును బ్రాహ్మణులస్వాభావికకర్మలు. (42)

**శౌర్యం తేజో ధృతిర్దాక్ష్యం యుద్ధే చాప్యపలాయనమ్ ।**
**దానమీశ్వరభావశ్చ క్షాత్రం కర్మ స్వభావజమ్ ॥ 43 ॥**

శౌర్యమ్, తేజః, ధృతిః, దాక్ష్యమ్, యుద్ధే, చ, అపి, అపలాయనమ్,
దానమ్, ఈశ్వరభావః, చ, క్షాత్రమ్, కర్మ, స్వభావజమ్ ॥ 43 ॥

| | | | |
|---|---|---|---|
| శౌర్యమ్ | = శౌర్యము | అపలాయనమ్ | = వెన్ను చూపకుండుట |
| తేజః | = తేజస్సు | దానమ్, చ | = దానము(ల)ను చేయుట మఱియు |
| ధృతిః | = ధైర్యము | ఈశ్వర భావః[1] | = స్వామిభావము మొదలగునవన్నియును |
| దాక్ష్యమ్, చ | = దక్షత మఱియు | క్షాత్రమ్, స్వభావజమ్,కర్మ | = క్షత్రియుల స్వాభావిక కర్మలు |
| యుద్ధే, అపి | = యుద్ధమునందును | | |

శౌర్యము, తేజస్సు, ధైర్యము, దక్షత, యుద్ధమునందు వెన్నుచూపకుండుట, దానములనిచ్చుట, స్వామిభావముతో ప్రజలను ధర్మపరాయణులనుగా చేయుచు పరిపాలించుట మొదలగునవి యన్నియును క్షత్రియులస్వాభావికకర్మలు. (43)

**కృషిగౌరక్ష్యవాణిజ్యం వైశ్యకర్మస్వభావజమ్ ।**
**పరిచర్యాత్మకం కర్మ శూద్రస్యాపి స్వభావజమ్ ॥ 44 ॥**

కృషిగౌరక్ష్యవాణిజ్యమ్, వైశ్యకర్మస్వభావజమ్,
పరిచర్యాత్మకమ్, కర్మ, శూద్రస్య, అపి, స్వభావజమ్ ॥ 44 ॥

1. నిఃస్వార్థభావముతో అందఱిహితముకొఱకై శాస్త్రములను అనుసరించుచు ప్రేమతో ప్రజలను కన్నబిడ్డలవలె పాలించుచు, శాసించు భావమును 'ఈశ్వరభావము' అని యందురు.

| | | | | | |
|---|---|---|---|---|---|
| కృషి గౌరక్ష్య, వాణిజ్యమ్ | = | వ్యవసాయము, గోపాలనము, క్రయవిక్రయముల యందు సత్యవ్యవహారము[1] మొదలగునవి యన్నియును | అపి | = | మఱియు అట్లే |
| | | | పరిచర్యాత్మకమ్ | = | అన్ని వర్ణముల వారిని సేవించుట |
| | | | శూద్రస్య | = | శూద్రులకు |
| వైశ్యకర్మ స్వభావజమ్ | = | వైశ్యులకు స్వాభావికములైన కర్మలు | స్వభావజమ్, కర్మ | = | స్వాభావికములైన కర్మలు |

వ్యవసాయము, గోరక్షణము, క్రయవిక్రయరూపసత్యవ్యవహారము ఇవి యన్నియును వైశ్యులస్వాభావికకర్మలు. అట్లే అన్నివర్ణములవారిని సేవించుట శూద్రులస్వాభావికకర్మ.(44)

**స్వే స్వే కర్మణ్యభిరతః సంసిద్ధిం లభతే నరః ।**
**స్వకర్మనిరతః సిద్ధిం యథా విందతి తచ్ఛృణు ॥ 45 ॥**

స్వే, స్వే, కర్మణి, అభిరతః, సంసిద్ధిమ్, లభతే, నరః,
స్వకర్మనిరతః, సిద్ధిమ్, యథా, విందతి, తత్, శృణు ॥ 45 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| స్వే, స్వే, | = | తమ తమ | యథా | = | ఎట్లు |
| కర్మణి | = | కర్మలయందు | | | |
| అభిరతః | = | తత్పరుడైన | సిద్ధిమ్ | = | పరమసిద్ధిని |
| నరః | = | మానవుడు | | | |
| సంసిద్ధిమ్ | = | భగవత్ప్రాప్తిరూప సిద్ధిని | విందతి | = | పొందునో |
| లభతే | = | పొందును | | | |
| స్వకర్మనిరతః | = | తనస్వాభావిక కర్మయందు నిరతుడైనవాడు | తత్ | = | ఆవిధులను |
| | | | శృణు | = | (తెలుపుచున్నాను) వినుము |

1. వస్తువులను కొనునప్పుడును, అమ్మునప్పుడును కొలతలలోగాని, గణించుటలో గాని, తక్కువ ఇచ్చుట, ఎక్కువ తీసికొనుటయు, వస్తువుల మార్పిడిచేయుటయు, పదార్థములలో కల్తీచేయుటయు, లాభము, రుసుము, దలాలీ పేరుతో ఎక్కువ ధనమును గుంజుటయు, తక్కువ ఇచ్చుటయు, అబద్ధము, కపటము, దొంగతనము, దౌర్జన్యము, మఱియు ఇతర-అన్యాయరీతులద్వారా పరులసొత్తును కాజేయుట మొదలగునవి అన్నియును వాణిజ్యములోని దోషములు - ఈదోషములు లేకుండ నీతినిజాయితీలతో పవిత్రవస్తువులను కొనుట అమ్ముటయే 'సత్యవ్యవహారము' అనబడును.

తమ తమ స్వాభావికకర్మలయందు తత్పరులైనవారు భగవత్ప్రాప్తిరూప పరమసిద్ధిని నిస్సందేహముగా పొందుదురు. స్వకర్మనిరతులైన మానవులు పరమసిద్ధిని పొందుటకు ఆచరింపవలసిన విధులను తెలుపుచున్నాను వినుము. (45)

**యతః ప్రవృత్తిర్భూతానాం యేన సర్వమిదం తతమ్ ।**
**స్వకర్మణా తమభ్యర్చ్య సిద్ధిం విందతి మానవః ॥ 46 ॥**

యతః, ప్రవృత్తిః, భూతానామ్, యేన, సర్వమ్, ఇదమ్, తతమ్,
స్వకర్మణా, తమ్, అభ్యర్చ్య, సిద్ధిమ్, విందతి, మానవః ॥ 46 ॥

| | | |
|---|---|---|
| **యతః** | = | ఏ భగవంతునినుండి |
| **భూతానామ్** | = | సమస్త ప్రాణులయొక్క |
| **ప్రవృత్తిః** | = | ఉత్పత్తి (జరుగుచున్నదో) |
| **యేన** | = | ఏ భగవంతునిచే |
| **ఇదమ్, సర్వమ్** | = | ఈ సమస్తజగత్తు |
| **తతమ్**[1] | = | వ్యాప్తమైయున్నదో |
| **తమ్** | = | ఆ పరమేశ్వరుని |
| **స్వకర్మణా** | = | తన స్వాభావిక కర్మాచరణము ద్వారా |
| **అభ్యర్చ్య**[2] | = | పూజించి |
| **మానవః** | = | మానవుడు |
| **సిద్ధిమ్** | = | పరమసిద్ధిని |
| **విందతి** | = | పొందుచున్నాడు |

సమస్తప్రాణులప్రాదుర్భావము పరమేశ్వరునినుండియే జరిగినది. సమస్త జగత్తునందును అతడు వ్యాపించియున్నాడు. అట్టి పరమేశ్వరుని తన స్వాభావికకర్మలద్వారా పూజించి, మానవుడు పరమసిద్ధిని పొందును. (46)

**శ్రేయాన్ స్వధర్మో విగుణః పరధర్మాత్ స్వనుష్ఠితాత్ ।**
**స్వభావనియతం కర్మ కుర్వన్నాప్నోతి కిల్బిషమ్ ॥ 47 ॥**

శ్రేయాన్, స్వధర్మః, విగుణః, పరధర్మాత్, స్వనుష్ఠితాత్,
స్వభావనియతమ్, కర్మ, కుర్వన్, న, ఆప్నోతి, కిల్బిషమ్ ॥ 47 ॥

1. మంచు నీటితో వ్యాప్తమైనట్లు సమస్తజగత్తు సచ్చిదానందఘనపరమాత్మతో వ్యాప్తమైనది.
2. పతివ్రతయైన స్త్రీ పతియే తనసర్వస్వమని భావించి, అతనినే చింతనచేయును. అతని ఆజ్ఞానుసారమే అతనికొఱకై మనోవాక్కాయములద్వారా కర్మలను ఆచరించును. అట్లే 'పరమేశ్వరుడే తనకు సర్వస్వము' అని భావించుచు ఆయనఆజ్ఞానుసారము మనోవాక్కాయముల ద్వారా పరమేశ్వరుని కొఱకే స్వాభావిక కర్తవ్య కర్మలను ఆచరించుట కర్మల ద్వారా పరమేశ్వరుని పూజించుట యగును.

| | | |
|---|---|---|
| స్వనుష్ఠితాత్ | = | బాగుగా ఆచరింపబడిన |
| పరధర్మాత్ | = | ఇతరుల ధర్మముకంటెను |
| విగుణః (అపి) | = | గుణరహితమేయైనను |
| స్వధర్మః | = | స్వధర్మాచరణమే |
| శ్రేయాన్ | = | శ్రేష్ఠమైనది |
| (యస్మాత్) | = | ఎందువలననగా |
| స్వభావనియతమ్ | = | స్వభావమునకు అనుగుణమైన |
| కర్మ | = | స్వధర్మరూప కర్మ(ల)ను |
| కుర్వన్ | = | చేయుచు (మనుష్యుడు) |
| కిల్బిషమ్ | = | పాపము(ల)ను |
| న, ఆప్నోతి | = | (ఏమాత్రము) పొందడు |

బాగుగా ఆచరింపబడిన పరధర్మముకంటెను, గుణరహితమైనను స్వధర్మాచరణమే శ్రేష్ఠమైనది. స్వభావమును అనుసరించి (స్వధర్మరూప వర్ణాశ్రమ ధర్మములను అనుసరించి) కర్మలను ఆచరించు మనుష్యునకు ఎట్టి పాపములును, ఏమాత్రము అంటనే అంటవు. (47)

**సహజం కర్మ కౌంతేయ సదోషమపి న త్యజేత్ ।**
**సర్వారంభా హి దోషేణ ధూమేనాగ్నిరివావృతాః ॥ 48 ॥**

సహజమ్, కర్మ, కౌంతేయ, సదోషమ్, అపి, న, త్యజేత్,
సర్వారంభాః, హి, దోషేణ, ధూమేన, అగ్నిః, ఇవ, ఆవృతాః ॥ 48 ॥

| | | |
|---|---|---|
| కౌంతేయ! | = | ఓ కుంతీసుతా! |
| సహజమ్[1], కర్మ | = | సహజ(స్వాభావిక)మైన కర్మ |
| సదోషమ్, అపి | = | దోషయుక్తమైనను |
| (తత్ | = | దానిని) |
| న, త్యజేత్ | = | త్యజింపరాదు |
| హి | = | ఏలనన |
| అగ్నిః | = | అగ్ని |
| ధూమేన, ఇవ | = | పొగచే ఆవరింపబడినట్లు |
| సర్వారంభాః | | కర్మలన్నియును |
| దోషేణ ఆవృతాః | = | ఏదేని ఒక దోషముచేత ఆవరింపబడియే ఉండును |

ఓ కౌంతేయా! (అర్జునా!) దోషయుక్తమైనను సహజమైన కర్మను త్యజింపరాదు. ఏలనన, అగ్ని పొగచే ఆవరింపబడినట్లు కర్మలన్నియును ఏదేని ఒక దోషముతో కూడియే యుండును. (48)

1. స్వభావమును అనుసరించి, శాస్త్రవిధిద్వారా, నియతమైన వర్ణాశ్రమధర్మములను మఱియు సామాన్య ధర్మములను ఇచట 'స్వధర్మ', 'సహజకర్మ', 'స్వకర్మ', 'నియతకర్మ', 'స్వభావజకర్మ', 'స్వభావనియతకర్మ' మొదలగు పేర్లతో పేర్కొనుట జరిగినది.

**అసక్తబుద్ధిః సర్వత్ర జితాత్మా విగతస్పృహః ।**
**నైష్కర్మ్యసిద్ధిం పరమాం సన్న్యాసేనాధిగచ్ఛతి ॥ 49 ॥**

అసక్తబుద్ధిః, సర్వత్ర, జితాత్మా, విగతస్పృహః,
నైష్కర్మ్యసిద్ధిమ్, పరమామ్, సన్న్యాసేన, అధిగచ్ఛతి ॥ 49 ॥

| | | | |
|---|---|---|---|
| సర్వత్ర | = ప్రాపంచిక విషయములన్నింటి యందును | జితాత్మా | = అంతఃకరణమును జయించినవాడును, అగు పురుషుడు |
| | | సన్న్యాసేన | = సాంఖ్యయోగము ద్వారా |
| అసక్తబుద్ధిః | = ఆసక్తి లేనివాడును | పరమామ్ | = అత్యంత శ్రేష్ఠమైన |
| | | నైష్కర్మ్యసిద్ధిమ్ | = నైష్కర్మ్యసిద్ధిని |
| విగతస్పృహః | = స్పృహారహితుడును | అధిగచ్ఛతి | = పొందును |

ఓ అర్జునా! ప్రాపంచికవిషయములన్నింటియందు ఆసక్తిలేనివాడును, స్పృహారహితుడును, అంతఃకరణమును జయించినవాడును అగు పురుషుడు సాంఖ్యయోగముద్వారా పరమశ్రేష్ఠమైన నైష్కర్మ్యసిద్ధిని పొందును. (49)

**సిద్ధిం ప్రాప్తో యథా బ్రహ్మ తథాప్నోతి నిబోధ మే ।**
**సమాసేనైవ కౌంతేయ నిష్ఠా జ్ఞానస్య యా పరా ॥ 50 ॥**

సిద్ధిమ్, ప్రాప్తః, యథా, బ్రహ్మ, తథా, ఆప్నోతి, నిబోధ, మే,
సమాసేన, ఏవ, కౌంతేయ, నిష్ఠా, జ్ఞానస్య, యా, పరా ॥ 50 ॥

| | | | |
|---|---|---|---|
| కౌంతేయ | = ఓ అర్జునా! | బ్రహ్మ | = పరబ్రహ్మపరమాత్మను |
| జ్ఞానస్య, యా, పరా, నిష్ఠా, సిద్ధిమ్ | = జ్ఞానయోగముయొక్క పరానిష్ఠయైన నైష్కర్మ్యసిద్ధిని | యథా | = ఎట్లు |
| | | ఆప్నోతి | = పొందునో |
| | | తథా | = ఆ విధానమును |
| యథా | = ఏవిధముగా | సమాసేన, ఏవ | = సంక్షిప్తముగానే |
| ప్రాప్తః | = మనుజుడు పొందునో (తద్ద్వారా) | మే | = నానుండి |
| | | నిబోధ | = ఎఱుంగుము |

ఓ కౌంతేయా! జ్ఞానయోగము యొక్క పరానిష్ఠయైన నైష్కర్మ్యసిద్ధిని పొందు విధమును, తద్ద్వారా మనుష్యుడు బ్రహ్మప్రాప్తినందు రీతిని సంగ్రహముగా తెల్పెదను వినుము. (50)

**బుద్ధ్యా విశుద్ధయా యుక్తో ధృత్యాత్మానం నియమ్య చ ।**
**శబ్దాదీన్ విషయాన్ త్యక్త్వా రాగద్వేషౌ వ్యుదస్య చ ॥ 51 ॥**
**వివిక్తసేవీ లఘ్వాశీ యతవాక్కాయమానసః ।**
**ధ్యానయోగపరో నిత్యం వైరాగ్యం సముపాశ్రితః ॥ 52 ॥**
**అహంకారం బలం దర్పం కామం క్రోధం పరిగ్రహమ్ ।**
**విముచ్య నిర్మమః శాంతో బ్రహ్మభూయాయ కల్పతే ॥ 53 ॥**

బుద్ధ్యా, విశుద్ధయా, యుక్తః, ధృత్యా, ఆత్మానమ్, నియమ్య, చ,
శబ్దాదీన్, విషయాన్, త్యక్త్వా, రాగద్వేషౌ, వ్యుదస్య, చ ॥ 51 ॥
వివిక్తసేవీ, లఘ్వాశీ, యతవాక్కాయమానసః,
ధ్యానయోగపరః, నిత్యమ్, వైరాగ్యమ్, సముపాశ్రితః ॥ 52 ॥
అహంకారమ్, బలమ్, దర్పమ్, కామమ్, క్రోధమ్, పరిగ్రహమ్,
విముచ్య, నిర్మమః, శాంతః, బ్రహ్మభూయాయ, కల్పతే ॥ 53 ॥

విశుద్ధయా = విశుద్ధమైన
బుద్ధ్యా = బుద్ధితో
యుక్తః = కూడినవాడై
లఘ్వాశీ = తేలికయైన సాత్త్వికాహారమును మితముగా భుజించువాడును
శబ్దాదీన్ = శబ్ద, స్పర్శ, రూపాదులైన
విషయాన్ = విషయములను
త్యక్త్వా = త్యజించి
వివిక్తసేవీ = పరిశుభ్రమైన ప్రదేశమున ఏకాంతముగా నివసించువాడును
ధృత్యా[1] = సాత్త్విక ధారణా శక్తిద్వారా
ఆత్మానమ్ = అంతఃకరణమును, ఇంద్రియములను
నియమ్య = సంయమమొనర్చి
యతవాక్కాయ మానసః = మనోవాక్కాయములను అదుపులో ఉంచుకొనిన వాడును
రాగద్వేషౌ = రాగద్వేషములను
వ్యుదస్య = సర్వథా త్యజించి
వైరాగ్యమ్ = దృఢవైరాగ్యమును
సముపాశ్రితః = ఆశ్రయించిన వాడును
చ = మఱియు

1. *గీత, 18వ అధ్యాయము 33వ శ్లోకములో దీని వివరణము గలదు.*

| | | |
|---|---|---|
| అహంకారమ్ | = | అహంకారమును |
| బలమ్ | = | బలమును |
| దర్పమ్ | = | దర్పమును |
| కామమ్ | = | కామమును |
| క్రోధమ్ | = | క్రోధమును |
| చ | = | మఱియు |
| పరిగ్రహమ్ | = | పరిగ్రహమును |
| విముచ్య | = | పరిత్యజించి |
| నిత్యమ్ | = | నిరంతరము |
| ధ్యానయోగ పరః | = | ధ్యానయోగ పరాయణుడైన వాడును |
| నిర్మమః | = | మమతా రహితుడును |
| శాంతః | = | శాంతియుతుడును ఐన పురుషుడు |
| బ్రహ్మభూయాయ | = | సచ్చిదానంద ఘన పరబ్రహ్మము నందు అభిన్న భావముతో స్థితుడగుటకు |
| కల్పతే | = | పాత్రుడగును |

విశుద్ధమైన బుద్ధిగలవాడై, తేలికయైన సాత్త్వికమైన ఆహారమును మితముగా భుజించువాడు, శబ్దాదివిషయములను త్యజించి, పరిశుభ్రమైన ప్రదేశమున ఏకాంతముగా నివసించువాడు, సాత్త్వికధారణాశక్తిద్వారా అంతఃకరణేంద్రియముల సంయమమును కలిగి, మనోవాక్కాయములను అదుపులో ఉంచుకొనినవాడు, రాగద్వేషములను సర్వథా త్యజించి, దృఢమైన వైరాగ్యమును సంపూర్ణముగా ఆశ్రయించినవాడు, అహంకారమును, బలమును, దర్పమును, కామక్రోధములను, పరిగ్రహమును వదలిపెట్టి, నిరంతరము ధ్యానయోగపరాయణుడై యుండువాడు, మమతా రహితుడు, శాంతియుతుడు ఐన పురుషుడు సచ్చిదానంద పరబ్రహ్మమునందు అభిన్నభావముతో స్థితుడగుటకు పాత్రుడగును. (51-53)

**బ్రహ్మభూతః ప్రసన్నాత్మా న శోచతి న కాంక్షతి ।**
**సమః సర్వేషు భూతేషు మద్భక్తిం లభతే పరామ్ ॥ 54 ॥**

బ్రహ్మభూతః, ప్రసన్నాత్మా, న, శోచతి, న, కాంక్షతి,
సమః, సర్వేషు, భూతేషు, మద్భక్తిమ్, లభతే, పరామ్ ॥ 54 ॥

| | | |
|---|---|---|
| బ్రహ్మభూతః | = | సచ్చిదానందఘన బ్రహ్మమునందు ఏకీభావస్థితుడును |
| ప్రసన్నాత్మా | = | ప్రసన్నమైన మనస్సుగలవాడును, ఐనయోగి |

| | | | |
|---|---|---|---|
| న, శోచతి | = (దేనికిని) శోకింపడు | సమః[1] | = సమభావముగల యోగి |
| న, కాంక్షతి | = దేనినీ కాంక్షింపడు | పరామ్, మద్భక్తిమ్[2] | = నా పరాభక్తిని |
| సర్వేషు భూతేషు | = సమస్త భూతముల యందును | లభతే | = పొందును |

సచ్చిదానంద ఘనపరబ్రహ్మయందు ఏకీభావస్థితుడై ప్రసన్నమనస్కుడైన యోగి దేనికిని శోకింపడు, దేనినీ కాంక్షింపడు. సమస్తప్రాణులయందును సమభావము గల అట్టి యోగి నా పరాభక్తిని పొందును. (54)

**భక్త్యా మామభిజానాతి యావాన్యశ్చాస్మి తత్త్వతః ।**
**తతో మాం తత్త్వతో జ్ఞాత్వా విశతే తదనంతరమ్ ॥ 55 ॥**

భక్త్యా, మామ్, అభిజానాతి, యావాన్, యః, చ, అస్మి, తత్త్వతః ।
తతః, మామ్, తత్త్వతః, జ్ఞాత్వా, విశతే, తదనంతరమ్ ॥ 55 ॥

| | | | |
|---|---|---|---|
| భక్త్యా | = ఆ పరాభక్తితో (ఆ బ్రహ్మభూతుడైన యోగి) | తత్త్వతః | = యథాతథముగ నాతత్త్వమును |
| | | అభిజానాతి | = బాగుగా ఎఱుంగును |
| మామ్ | = పరమాత్ముడనైన నన్ను | తతః | = అనంతరము |
| (అహమ్, | = నేను) | మామ్ | = నన్ను |
| యః | = ఎవరినో | తత్త్వతః | = యథార్థముగా |
| చ | = మఱియు | జ్ఞాత్వా | = తెలిసికొని |
| యావాన్, అస్మి | = ఎంతటి శక్తిగలవాడనో | తదనంతరమ్ | = తత్క్షణమే |
| | | విశతే | = నాలో లీనమగును |

బ్రహ్మభూతుడైనయోగి ఈ పరాభక్తిద్వారా నేనెవరినో? ఎంతటివాడనో? యథాతథముగ నా తత్త్వమును తెలిసికొనును. అట్లు భక్తితో నా తత్త్వమును గ్రహించిన వెంటనే అతడు నాలో లీనమగును. (55)

1. గీత, 6వ అధ్యాయమునందలి 29వ శ్లోకము చూడుడు.
2. ఇది తత్త్వజ్ఞానముయొక్క పరాకాష్ఠ. దీనిని పొందిన పిదప ఇక తెలిసికొనవలసినది ఏమియు మిగులదు. దీనినే 'పరాభక్తి', 'జ్ఞానపరానిష్ఠ', 'పరమనైష్కర్మ్యసిద్ధి', 'పరమసిద్ధి'మున్నగు పేర్లతో వ్యవహరించుట జరిగినది.

**సర్వకర్మాణ్యపి సదా కుర్వాణో మద్వ్యపాశ్రయః ।**
**మత్ప్రసాదాదవాప్నోతి శాశ్వతం పదమవ్యయమ్ ॥ 56 ॥**

సర్వకర్మాణి, అపి, సదా, కుర్వాణః, మద్వ్యపాశ్రయః,
మత్ప్రసాదాత్, అవాప్నోతి, శాశ్వతమ్, పదమ్, అవ్యయమ్ ॥ 56 ॥

| | | | |
|---|---|---|---|
| మద్వ్యపాశ్రయః | = మత్పరాయణుడై, నన్ను ఆశ్రయించిన కర్మయోగి | మత్ప్రసాదాత్ | = నా అనుగ్రహమువలన |
| | | శాశ్వతమ్ | = సనాతనమైన |
| | | అవ్యయమ్ | = నాశరహితమైన |
| సర్వకర్మాణి | = సమస్తకర్మలను | | |
| సదా | = నిరంతరము | పదమ్ | = పరమ పదమును |
| కుర్వాణః, అపి | = చేయుచునే | అవాప్నోతి | = పొందును |

సమస్తకర్మలయందును కర్తృత్వభావమును వీడి, ఆయాకర్మలఫలరూపమైన సమస్తభోగములను త్యజించి, నన్నే ఆశ్రయించిన కర్మయోగి కర్మలను అన్నింటిని సర్వదా చేయుచును నాయనుగ్రహముచే సనాతనమైన శాశ్వతమైన పరమపదమును పొందును. (56)

**చేతసా సర్వకర్మాణి మయి సన్న్యస్య మత్పరః ।**
**బుద్ధియోగముపాశ్రిత్య మచ్చిత్తః సతతం భవ ॥ 57 ॥**

చేతసా, సర్వకర్మాణి, మయి, సన్న్యస్య, మత్పరః,
బుద్ధియోగమ్, ఉపాశ్రిత్య, మచ్చిత్తః, సతతమ్, భవ ॥ 57 ॥

| | | | |
|---|---|---|---|
| సర్వకర్మాణి | = సమస్తకర్మలను | ఉపాశ్రిత్య | = అవలంబించి |
| చేతసా | = నిండుమనస్సుతో | మత్పరః | = మత్పరాయణుడవై |
| మయి | = నాయందు(నాకు) | | |
| సన్న్యస్య[1] | = సమర్పించి | సతతమ్ | = సంతతము |
| బుద్ధియోగమ్ | = సమబుద్ధిరూప యోగమును | మచ్చిత్తః, భవ | = నాయందే చిత్తము గలవాడవగుము |

సర్వకర్మలను నిండుమనస్సుతో నాకే అర్పించి, సమబుద్ధిరూపయోగమును అవలంబించి, మత్పరాయణుడవై సంతతము చిత్తమును నాయందే నిల్పుము. (57)

1. గీత, 9వ అధ్యాయము 27వ శ్లోకములో దీని వివరణము గలదు.

**మచ్చిత్తః సర్వదుర్గాణి మత్ప్రసాదాత్ తరిష్యసి ।**
**అథ చేత్ త్వమహంకారాత్ న శ్రోష్యసి వినంక్ష్యసి ॥ 58 ॥**

మచ్చిత్తః, సర్వదుర్గాణి, మత్ప్రసాదాత్, తరిష్యసి,
అథ, చేత్, త్వమ్, అహంకారాత్, న, శ్రోష్యసి, వినంక్ష్యసి ॥ 58 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| మచ్చిత్తః, త్వమ్ | = | నాయందు చిత్తమును నిల్పిన నీవు | అహంకారాత్ | = | అహంకార కారణముగ |
| మత్ప్రసాదాత్ | = | నా యనుగ్రహమువలన | న, శ్రోష్యసి | = | నా వచనములను నీవు పెడచెవిని బెట్టినచో |
| సర్వదుర్గాణి | = | సమస్తసంకటములను | | | |
| తరిష్యసి | = | అనాయాసముగ దాటగలవు | వినంక్ష్యసి | = | నష్టముల పాలగుదువు (పరమార్థపథము నుండి భ్రష్టుడవగుదువు) |
| అథ, చేత్ | = | అట్లుగాక | | | |

పైన తెలుపబడిన విధముగా నాయందు చిత్తమును నిల్పినచో, నా యనుగ్రహము వలన సమస్తసంకటములనుండియు అనాయాసముగా బయట పడగలవు. ఒకవేళ అహంకార కారణమున నా వచనములను పెడచెవిన బెట్టినచో నష్టముల పాలగుదువు. అనగా పరమార్థ పథమునుండి భ్రష్టుడవగుదువు. (58)

**యదహంకారమాశ్రిత్య న యోత్స్య ఇతి మన్యసే ।**
**మిథ్యైష వ్యవసాయస్తే ప్రకృతిస్త్వాం నియోక్ష్యతి ॥ 59 ॥**

యత్, అహంకారమ్, ఆశ్రిత్య, న, యోత్స్యే, ఇతి మన్యసే,
మిథ్యా, ఏషః, వ్యవసాయః, తే, ప్రకృతిః, త్వామ్, నియోక్ష్యతి ॥ 59 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| అహంకారమ్, | = | అహంకారమును | మిథ్యా | = | మిథ్యయే (వృథాయే) |
| ఆశ్రిత్య, | = | ఆశ్రయించి | (యతః) | = | ఏలననగా |
| న, యోత్స్యే, | = | (నేను) యుద్ధము చేయను | ప్రకృతిః | = | (నీ) స్వభావమే |
| | | | త్వామ్ | = | నిన్ను |
| ఇతి | = | అని | | | |
| యత్, మన్యసే | = | ఏదైతే తలంతువో | నియోక్ష్యతి | = | (యుద్ధము చేయుటకు) పురికొల్పును |
| తే | = | నీయొక్క | | | |
| ఏషః, వ్యవసాయః | = | ఈ నిశ్చయము | | | |

అహంకారవశమున "నేను ఈ యుద్ధమును చేయను" అని నీవు నిశ్చయించుకొనుట వృథా. ఏలనన, నీ స్వభావమే యుద్ధముచేయుటకు నిన్ను పురికొల్పును. (59)

**స్వభావజేన కౌంతేయ నిబద్ధః స్వేన కర్మణా ।**
**కర్తుం నేచ్ఛసి యన్మోహాత్ కరిష్యస్యవశోఽపి తత్ ॥ 60 ॥**

స్వభావజేన, కౌంతేయ, నిబద్ధః, స్వేన, కర్మణా,
కర్తుమ్, న, ఇచ్ఛసి, యత్, మోహాత్, కరిష్యసి, అవశః, అపి, తత్ ॥ 60 ॥

| | | | |
|---|---|---|---|
| కౌంతేయ! | = ఓ అర్జునా! | స్వేన, స్వభావజేన | = నీ (క్షత్రియ) స్వభావమునకు తగిన |
| మోహాత్ | = మోహప్రభావమున | | |
| యత్ | = ఏ యుద్ధకర్మను | కర్మణా | = కర్మ (సంస్కారముల)చే |
| కర్తుమ్ | = చేయుటకు | నిబద్ధః | = బంధింపబడినవాడవై |
| న, ఇచ్ఛసి | = నీవు ఇష్టపడకున్నావో | అవశః, | = అవశుడవై |
| తత్, అపి | = ఆయుద్ధమును గూడ | కరిష్యసి | చేయుదువు |

ఓ కౌంతేయా! మోహప్రభావమున నీవు చేయుటకు ఇష్టపడని కర్మను గూడ నీ పురాకృత స్వాభావిక కర్మలచే(సంస్కారములచే)బంధింపబడి, తత్ప్రభావమున నీవు అవశుడవై చేయుదువు. (60)

**ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశేఽర్జున తిష్ఠతి ।**
**భ్రామయన్ సర్వభూతాని యంత్రారూఢాని మాయయా ॥ 61 ॥**

ఈశ్వరః, సర్వభూతానామ్, హృద్దేశే, అర్జున, తిష్ఠతి,
భ్రామయన్, సర్వభూతాని, యంత్రారూఢాని, మాయయా ॥ 61 ॥

| | | | |
|---|---|---|---|
| అర్జున! | = ఓ అర్జునా! | భ్రామయన్ | = (వారివారి కర్మలను అనుసరించి, వారిని) భ్రమింపజేయుచు |
| యంత్రా రూఢాని | = శరీరరూప యంత్రములను అధిరోహించిన | సర్వ భూతానామ్ | = సకలభూతముల యొక్క |
| సర్వభూతాని | = సమస్తప్రాణులను | హృద్దేశే | = హృదయములయందు |
| ఈశ్వరః | = అంతర్యామియైన పరమేశ్వరుడు | తిష్ఠతి | = స్థితుడై యుండును |
| మాయయా | = తన మాయచే | | |

అర్జునా! శరీరరూపయంత్రములను అధిరోహించిన సర్వప్రాణుల హృదయములయందు అంతర్యామిగానున్న పరమేశ్వరుడు తన మాయచేత వారి వారి కర్మలను అనుసరించి, వారిని భ్రమింపజేయుచున్నాడు. (61)

**తమేవ శరణం గచ్ఛ సర్వభావేన భారత ।**
**తత్ప్రసాదాత్ పరాం శాంతిం స్థానం ప్రాప్స్యసి శాశ్వతమ్ ॥ 62 ॥**

తమ్, ఏవ, శరణమ్, గచ్ఛ, సర్వభావేన, భారత,
తత్ప్రసాదాత్, పరామ్, శాంతిమ్, స్థానమ్, ప్రాప్స్యసి, శాశ్వతమ్ ॥ 62 ॥

| | | | |
|---|---|---|---|
| భారత! | = ఓ అర్జునా! | పరామ్, శాంతిమ్ | = పరమ శాంతిని |
| సర్వభావేన | = అన్నివిధములుగా | | |
| తమ్, ఏవ | = ఆ పరమేశ్వరునే | | |
| శరణమ్, గచ్ఛ | = శరణుజొచ్చుము | శాశ్వతమ్, స్థానమ్ | = శాశ్వతమైన పరమ పదమును |
| తత్ప్రసాదాత్ | = ఆయన యనుగ్రహము వలన | ప్రాప్స్యసి | = పొందగలవు |

ఓ భారతా! (అర్జునా!) అన్ని విధములుగా ఆ పరమేశ్వరునే శరణుజొచ్చుము[1]. అతని కృపచేతనే పరమశాంతిని, శాశ్వతమైన పరమపదమును పొందగలవు. (62)

**ఇతి తే జ్ఞానమాఖ్యాతం గుహ్యాద్గుహ్యతరం మయా ।**
**విమృశ్యైతదశేషేణ యథేచ్ఛసి తథా కురు ॥ 63 ॥**

ఇతి, తే, జ్ఞానమ్, ఆఖ్యాతమ్, గుహ్యాత్, గుహ్యతరమ్, మయా,
విమృశ్య, ఏతత్, అశేషేణ, యథా, ఇచ్ఛసి, తథా, కురు ॥ 63 ॥

1. *లజ్జ, భయము, దురభిమానము, గౌరవము, ఆసక్తి మొదలగువానిని త్యజించి, శరీరము నందు, లౌకిక విషయములయందు అహంకార మమకారములను వదలి, కేవలము పరమాత్ముడు ఒక్కడే పరమాశ్రయుడు, పరమగతి, సర్వస్వము అని భావించుట, అనన్య భావముతో మిక్కిలి భక్తి శ్రద్ధలతో నిరంతరము భగవంతుని నామగుణప్రభావస్వరూపములను చింతనచేయుట, భగవంతుని భజన స్మరణలు చేయుచు, తదాజ్ఞానుసారము కర్తవ్య కర్మలను నిఃస్వార్థభావముతో కేవలము పరమాత్మునికొఱకే ఆచరించుట - ఇవి యన్నియును సర్వవిధముల పరమాత్ముని శరణు పొందుట యగును.*

| | | | | | |
|---|---|---|---|---|---|
| ఇతి | = | ఈ విధముగా | ఏతత్ | = | ఈ గోప్యజ్ఞానమును |
| గుహ్యాత్, గుహ్యతరమ్ | = | పరమ గోప్యమైన | అశేషేణ | = | సమగ్రముగా(పూర్తిగా) |
| | | | విమృశ్య | = | పరిశీలించి |
| జ్ఞానమ్ | = | జ్ఞానము | యథా | = | ఏవిధముగా |
| మయా | = | నాచేత | ఇచ్ఛసి | = | నీవు కోరుకొనుచున్నావో |
| తే | = | నీకు | తథా | = | ఆప్రకారము |
| ఆఖ్యాతమ్ | = | చెప్పబడినది | కురు | = | చేయుము |

ఈ విధముగా అత్యంతరహస్యమైన జ్ఞానమును నేను నీకు అందించితిని. ఇప్పుడు నీవు ఈ పరమగోప్యమైన జ్ఞానమును పూర్తిగా గ్రహించి, నీకిష్టమైన రీతిగా ఆచరింపుము.(63)

**సర్వగుహ్యతమం భూయః శృణు మే పరమం వచః ।**
**ఇష్టోఽసి మే దృఢమితి తతో వక్ష్యామి తే హితమ్ ॥ 64 ॥**

సర్వగుహ్యతమమ్, భూయః, శృణు, మే, పరమమ్, వచః,
ఇష్టః, అసి, మే, దృఢమ్, ఇతి, తతః, వక్ష్యామి, తే, హితమ్ ॥ 64 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| సర్వ గుహ్యతమమ్ | = | సమస్త గోప్య విషయములయందును పరమగోప్యమైన | దృఢమ్ | = | అత్యంతము |
| | | | ఇష్టః, అసి | = | ఇష్టమైనవాడవు |
| | | | తతః | = | అందువలన |
| మే, పరమమ్, వచః | = | సర్వశ్రేష్ఠమైన నా వచనములను | ఇతి, హితమ్ | = | హితకరములైన, ఈ, నా వచనములను |
| భూయః | = | ఇంకనూ | | | |
| శృణు | = | వినుము | తే | = | నీకు |
| మే | = | నాకు | వక్ష్యామి | = | చెప్పెదను |

సమస్తగోప్యవిషయములయందును పరమగోప్యమైన నావచనములను మఱొక్కసారి వినుము. నీవు నాకు అత్యంతప్రియుడవు, అగుటవలన నీకు మిక్కిలి హితమునుగూర్చి వచనములను మఱల చెప్పుచున్నాను. (64)

**మన్మనా భవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు ।**
**మామేవైష్యసి సత్యం తే ప్రతిజానే ప్రియోఽసి మే ॥ 65 ॥**

మన్మనాః, భవ, మద్భక్తః, మద్యాజీ, మామ్, నమస్కురు,
మామ్, ఏవ, ఏష్యసి, సత్యమ్, తే, ప్రతిజానే, ప్రియః, అసి, మే ॥ 65 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| మన్మనాః | = | నాయందే మనస్సు నిల్పినవాడవు | మామ్, ఏవ | = | నన్నే |
| మద్భక్తః | = | నాయందు భక్తి గలవాడవు | ఏష్యసి | = | పొందెదవు |
| మద్యాజీ | = | నన్ను పూజించువాడవు | తే | = | నీకు (నీకొఱకై) |
| భవ | = | కమ్ము | సత్యమ్, ప్రతిజానే | = | సత్యప్రతిజ్ఞ చేయుచున్నాను |
| మామ్ | = | నన్ను (నాకు) | (యతః) | = | ఏలనన |
| నమస్కురు | = | నమస్కరింపుము | మే | = | నాకు |
| (ఏవమ్) | = | ఇట్లు చేయుటవలన | ప్రియః, అసి | = | నీవు మిక్కిలి ఇష్టమైనవాడవు |

ఓ అర్జునా! నీవు నాయందే మనస్సును నిలుపుము. నా భక్తుడవు కమ్ము. నన్నే సేవింపుము. నాకు ప్రణమిల్లుము. ఇట్లు చేయుటవలన నన్నే పొందగలవు. ఇది ప్రతిజ్ఞా పూర్వకముగా నేను చెప్పుచున్నమాట. ఏలనన, నీవు నాకత్యంత ప్రియుడవు. (65)

**సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ ।**
**అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః ॥ 66 ॥**

సర్వధర్మాన్, పరిత్యజ్య, మామ్, ఏకమ్, శరణమ్, వ్రజ,
అహమ్, త్వా, సర్వపాపేభ్యః, మోక్షయిష్యామి, మా, శుచః ॥ 66 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| సర్వధర్మాన్ | = | సమస్తధర్మములను (సర్వకర్తవ్యకర్మలను) | శరణమ్[1], వ్రజ | = | శరణుజొచ్చుము |
| పరిత్యజ్య | = | నాకు సమర్పించి | అహమ్, త్వా | = | నేను నిన్ను |
| ఏకమ్ | = | సర్వశక్తిమంతుడను, సర్వాధారుడను, పరమేశ్వరుడను ఐన | సర్వపాపేభ్యః | = | సమస్త పాపములనుండియు |
| | | | మోక్షయిష్యామి | = | విముక్తుని గావించెదను |
| మామ్, (ఏవ) | = | నన్నే | మా, శుచః | = | నీవు శోకింపకుము |

సర్వధర్మములను అనగా సమస్తకర్తవ్యకర్మలను నాకు సమర్పింపుము. సర్వశక్తిమంతుడను, సర్వాధారుడను, పరమేశ్వరుడను ఐన నన్నే శరణుజొచ్చుము. అన్ని పాపములనుండియు నిన్ను నేను విముక్తుని గావించెదను. నీవు శోకింపకుము. (66)

1. ఈ అధ్యాయమునందలి 62వ శ్లోకము యొక్క టిప్పణి చూడనగును.

**ఇదం తే నాతపస్కాయ నాభక్తాయ కదాచన ।**
**న చాశుశ్రూషవే వాచ్యం న చ మాం యోఽభ్యసూయతి ॥ 67 ॥**

ఇదమ్, తే, న, అతపస్కాయ, న, అభక్తాయ, కదాచన,
న, చ, అశుశ్రూషవే, వాచ్యమ్, న, చ, మామ్, యః, అభ్యసూయతి ॥ 67 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| తే | = | (త్వయా)నీచే | అశుశ్రూషవే | = | వినుటకు ఇచ్ఛలేని వానికి |
| ఇదమ్ | = | రహస్యమయమైన ఈగీతోపదేశము | న, (వాచ్యమ్) | = | చెప్పదగదు |
| కదాచన | = | ఎప్పుడైనను (ఏస్థితియందైనను) | చ | = | మఱియు |
| | | | యః | = | ఎవడు |
| అతపస్కాయ | = | తపస్సంపన్నుడు కాని వానికి | మామ్ | = | నన్ను |
| | | | అభ్యసూయతి | = | దోషదృష్టితో చూచునో |
| న, వాచ్యమ్ | = | చెప్పదగదు | (తస్మై) | = | వానికి (ఎన్నడును) |
| అభక్తాయ[1] చ | = | భక్తిరహితునకును | న | = | (ఈ ఉపదేశమును గూర్చి) తెలుపరాదు |
| న, (వాచ్యమ్) | = | చెప్పదగదు | | | |

తపస్సంపన్నుడు కానివానికిని, భక్తిరహితునకును, వినవలెనను కుతూహలము లేనివానికిని నీవు ఈ గీతారూపరహస్యోపదేశమును ఎన్నడునూ తెల్పరాదు. అట్లే నాయందు దోషదృష్టి గలవానికి ఎన్నడునూ ఈ ఉపదేశమును తెలుపరాదు. (67)

**య ఇమం పరమం గుహ్యం మద్భక్తేష్వభిధాస్యతి ।**
**భక్తిం మయి పరాం కృత్వా మామేవైష్యత్యసంశయః ॥ 68 ॥**

యః, ఇమమ్, పరమమ్, గుహ్యమ్, మద్భక్తేషు, అభిధాస్యతి,
భక్తిమ్, మయి, పరామ్, కృత్వా, మామ్, ఏవ, ఏష్యతి, అసంశయః ॥ 68 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| యః | = | ఎవడయితే | ఇమమ్ | = | ఈ |
| మయి | = | నాయందు | పరమమ్, గుహ్యమ్ | = | మిక్కిలి గోప్యమైన గీతోపదేశమును |
| పరామ్, భక్తిమ్, కృత్వా | = | పరమభక్తిని గలిగి | మద్భక్తేషు | = | నాభక్తులయందు |

1. వేదశాస్త్రములయందును, పరమేశ్వరునియందును, మహాత్ములయందును, గురుజనుల యందును, భక్తి శ్రద్ధలను, పూజ్యభావమును కలిగియుండుటనే 'భక్తి' యందురు.

| | | | | | |
|---|---|---|---|---|---|
| అభిధాస్యతి[1] | = | పదిలపఱచునో | ఏష్యతి | = | పొందును |
| సః | = | అతడు | అసంశయః | = | ఇందు సంశయమునకు తావేలేదు |
| మామ్, ఏవ | = | నన్నే | | | |

నా యందు పరమభక్తి గలిగి, ఈ పరమగోప్యమైన గీతోపదేశమును అనగా గీతాశాస్త్రమును నా భక్తుల హృదయములలో పదిలపఱచువాడు నన్నే పొందును. ఇందేమాత్రమూ సందేహము లేదు. (68)

**న చ తస్మాన్ మనుష్యేషు కశ్చిన్మే ప్రియకృత్తమః ।**
**భవితా న చ మే తస్మాత్ అన్యః ప్రియతరో భువి ॥ 69 ॥**

న, చ, తస్మాత్, మనుష్యేషు, కశ్చిత్, మే, ప్రియకృత్తమః,
భవితా, న, చ, మే, తస్మాత్, అన్యః, ప్రియతరః, భువి ॥ 69 ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| మనుష్యేషు | = | మనుష్యులలో | చ | = | అట్లే |
| మే | = | నాకు | భువి | = | ఈ భూమండలమున |
| తస్మాత్ | = | వానికంటెను | తస్మాత్ | = | వానికంటెను |
| ప్రియకృత్తమః | = | మిక్కిలి ప్రియమును గూర్చువాడు | మే | = | నాకు |
| | | | ప్రియతరః | = | మిక్కిలి ప్రియమైనవాడు |
| కశ్చిత్, చ | = | ఎవ్వడును | అన్యః | = | మఱియొకడు |
| న | = | లేడు | న, భవితా | = | ఉండబోడు |

నాకు ప్రీతిని గూర్చునట్టి కర్మల నాచరించు మనుష్యులలో అతనిని మించిన భక్తుడెవ్వడును లేడు. అంతేగాక, అతనివలె గాని, అతనిని మించిగాని నాకు ప్రియమైన వాడు భూమండలమున మరియొకడెవ్వడును భవిష్యత్తులోను ఉండబోడు. (69)

**అధ్యేష్యతే చ య ఇమం ధర్మ్యం సంవాదమావయోః ।**
**జ్ఞానయజ్ఞేన తేనాహమ్ ఇష్టః స్యామితి మే మతిః ॥ 70 ॥**

అధ్యేష్యతే, చ, యః ఇమమ్, ధర్మ్యమ్, సంవాదమ్, ఆవయోః,
జ్ఞానయజ్ఞేన, తేన, అహమ్, ఇష్టః, స్యామ్, ఇతి, మే, మతిః ॥ 70 ॥

1. నిష్కామభావముతో ప్రేమపూర్వకముగా నా భక్తులకు చదివి వినిపించును. మఱియు దీని అర్థమును వ్యాఖ్యానము ద్వారా ప్రచారము చేయును.

| | | | |
|---|---|---|---|
| యః | = ఎవడయితే | తేన, చ | = వానిచేతను |
| ఇమమ్ | = ఈ | అహమ్ | = నేను |
| ధర్మ్యమ్ | = ధర్మయుక్తమైన | జ్ఞానయజ్ఞేన[1] | = జ్ఞానయజ్ఞము ద్వారా |
| ఆవయోః | = మన ఇరువురియొక్క | ఇష్టః, స్యామ్ | = పూజితుడను అగుదును |
| సంవాదమ్ | = సంవాదరూపమైన గీతాశాస్త్రమును | ఇతి | = అని |
| అధ్యేష్యతే | = పఠించునో | మే, మతిః | = నా అభిప్రాయము |

ధర్మయుక్తమైన మనసంవాదరూపమైన ఈ గీతాశాస్త్రమును పఠించువాడు జ్ఞానయజ్ఞముద్వారా నన్ను పూజించువాడని నా అభిప్రాయము. (70)

**శ్రద్ధావాననసూయశ్చ శృణుయాదపి యో నరః ।**
**సోఽపి ముక్తః శుభాన్ లోకాన్ ప్రాప్నుయాత్ పుణ్యకర్మణామ్ ॥ 71 ॥**

శ్రద్ధావాన్, అనసూయః, చ, శృణుయాత్, అపి, యః, నరః,
సః, అపి, ముక్తః, శుభాన్, లోకాన్, ప్రాప్నుయాత్, పుణ్యకర్మణామ్ ॥ 71 ॥

| | | | |
|---|---|---|---|
| యః, నరః | = ఏ నరుడయితే | సః అపి | = అతడును |
| శ్రద్ధావాన్ | = శ్రద్ధగలవాడై | ముక్తః | = పాపవిముక్తుడై |
| అనసూయః, చ | = దోషదృష్టిలేని వాడై | పుణ్యకర్మణామ్ | = పుణ్యకర్మలను ఆచరించువారియొక్క |
| శృణుయాత్, అపి | = (ఈ గీతాశాస్త్రమును) వినునో | శుభాన్, లోకాన్ | = ఉత్తమలోకములను |
| | | ప్రాప్నుయాత్ | = తప్పక పొందును |

శ్రద్ధాదరములుగలవాడును, దోషదృష్టి(దోషములెన్ను స్వభావము) లేనివాడును ఐన మనుష్యుడు గీతాశాస్త్రమును వినుటవలనగూడ పాపవిముక్తుడై, పుణ్యకర్మలను ఆచరించువారుపొందు ఉత్తమలోకములను పొందును. (71)

**కచ్చిదేతచ్ఛ్రుతం పార్థ త్వయైకాగ్రేణ చేతసా ।**
**కచ్చిదజ్ఞానసమ్మోహః ప్రణష్టస్తే ధనంజయ ॥ 72 ॥**

కచ్చిత్, ఏతత్, శ్రుతమ్, పార్థ, త్వయా, ఏకాగ్రేణ, చేతసా,
కచ్చిత్, అజ్ఞానసమ్మోహః, ప్రణష్టః, తే, ధనంజయ ॥ 72 ॥

1. గీత -4వ అధ్యాయము-33వ శ్లోకార్థమును చూడనగును.

| | | | |
|---|---|---|---|
| పార్థ! | = ఓ పార్థా! | ధనంజయ! | = ఓ ధనంజయా! |
| ఏతత్ | = ఈ గీతాశాస్త్రము | తే | = నీ యొక్క |
| త్వయా | = నీ చేత | అజ్ఞాన సమ్మోహః | = అజ్ఞానజనితమైన మోహము |
| ఏకాగ్రేణ, చేతసా | = ఏకాగ్రచిత్తముతో | | |
| శ్రుతమ్, కచ్చిత్ | = వినుట జరిగినదా? | కచ్చిత్, ప్రణష్టః | = పూర్తిగా తొలగిపోయినదా? |

ఓ పార్థా! ఈ గీతాశాస్త్రమును నీవు ఏకాగ్రచిత్తముతోవింటివా? ఓ ధనంజయా! అజ్ఞానజనితమైన నీ మోహము పూర్తిగా నశించినదా? (72)

**అర్జున ఉవాచ**

**నష్టో మోహః స్మృతిర్లబ్ధా త్వత్ప్రసాదాన్మయాచ్యుత ।**
**స్థితోఽస్మి గతసందేహః కరిష్యే వచనం తవ ॥ 73 ॥**

నష్టః, మోహః, స్మృతిః, లబ్ధా, త్వత్ప్రసాదాత్, మయా, అచ్యుత,
స్థితః, అస్మి, గతసందేహః, కరిష్యే, వచనమ్, తవ ॥ 73 ॥

| | | | |
|---|---|---|---|
| అచ్యుత! | = ఓ అచ్యుతా! | గతసందేహః, స్థితః, అస్మి | = సందేహములు తొలగిన వాడనైతిని |
| త్వత్ప్రసాదాత్ | = నీ అనుగ్రహము వలన | | |
| (మమ) మోహః | = నా మోహము | | |
| నష్టః | = (పూర్తిగా) తొలగినది | (అతః) | = కనుక |
| మయా | = నాచేత | తవ, వచనమ్ కరిష్యే | = నీ ఆజ్ఞను తలదాల్చెదను |
| స్మృతిః | = స్మృతి | | |
| లబ్ధా | = పొందబడినది | | |

అర్జునుడు పలికెను - ఓ అచ్యుతా! నీ కృపచే నా మోహము పూర్తిగా తొలగినది. స్మృతిని పొందితిని. ఇప్పుడు సంశయరహితుడనైతిని. కనుక, నీ ఆజ్ఞను తలదాల్చెదను. (73)

**సంజయ ఉవాచ**

**ఇత్యహం వాసుదేవస్య పార్థస్య చ మహాత్మనః ।**
**సంవాదమిమమశ్రౌషమ్ అద్భుతం రోమహర్షణమ్ ॥ 74 ॥**

ఇతి, అహమ్, వాసుదేవస్య, పార్థస్య, చ, మహాత్మనః,
సంవాదమ్, ఇమమ్, అశ్రౌషమ్, అద్భుతమ్, రోమహర్షణమ్ ॥ 74 ॥

| | | | |
|---|---|---|---|
| ఇతి | = ఈ ప్రకారముగా | అద్భుతమ్ | = అద్భుతమైన |
| అహమ్ | = నేను | రోమహర్షణమ్ | = తనువును పులకింప జేయునట్టి |
| వాసుదేవస్య | = శ్రీ కృష్ణునియొక్క | | |
| మహాత్మనః | = మహాత్ముడైన | | |
| పార్థస్య, చ | = అర్జునుని యొక్క | సంవాదమ్ | = సంవాదమును |
| ఇమమ్ | = ఈ | అశ్రౌషమ్ | = వింటిని |

సంజయుడు పలికెను - ఈ విధముగా శ్రీ వాసుదేవునకును మహాత్ముడైన అర్జునకును మధ్య జరిగిన సంవాదమును వింటిని. అది అద్భుతమైనది. తనువును పులకింపజేయునది. (74)

**వ్యాసప్రసాదాచ్ఛ్రుతవాన్ ఏతద్గుహ్యమహం పరమ్ ।**
**యోగం యోగేశ్వరాత్ కృష్ణాత్ సాక్షాత్ కథయతః స్వయమ్ ॥ 75 ॥**

వ్యాసప్రసాదాత్, శ్రుతవాన్, ఏతత్, గుహ్యమ్, అహమ్, పరమ్,
యోగమ్, యోగేశ్వరాత్, కృష్ణాత్, సాక్షాత్, కథయతః, స్వయమ్ ॥ 75 ॥

| | | | |
|---|---|---|---|
| వ్యాసప్రసాదాత్ | = వ్యాసభగవానుని కృపవలన (దివ్యదృష్టిని పొందిన వాడనై) | స్వయమ్ | = స్వయముగా |
| | | కథయతః | = చెప్పుచున్న (ఉపదేశించుచున్న) |
| అహమ్ | = నేను | | |
| ఏతత్ | = ఈ | యోగేశ్వరాత్ | = యోగేశ్వరుడైన |
| పరమ్, గుహ్యమ్ | = పరమగోప్యమైన | కృష్ణాత్ | = శ్రీకృష్ణభగవానుని నుండి |
| యోగమ్ | = యోగమును (గీతను) (అర్జునునకు) | సాక్షాత్ | = ప్రత్యక్షముగా |
| | | శ్రుతవాన్ | = వింటిని |

వేదవ్యాసునికృపవలన దివ్యదృష్టిని పొందినవాడనై, పరమగోప్యమైన ఈ యోగమును (గీతను), యోగేశ్వరుడైన శ్రీకృష్ణభగవానుడు స్వయముగ అర్జునునకు చెప్పుచుండగా నేను ప్రత్యక్షముగా వింటిని. (75)

**రాజన్ సంస్మృత్య సంస్మృత్య సంవాదమ్ ఇమమద్భుతమ్ ।**
**కేశవార్జునయోః పుణ్యం హృష్యామి చ ముహుర్ముహుః ॥ 76 ॥**

రాజన్, సంస్మృత్య, సంస్మృత్య, సంవాదమ్, ఇమమ్, అద్భుతమ్,
కేశవార్జునయోః, పుణ్యమ్, హృష్యామి, చ, ముహుర్ముహుః ॥ 76 ॥

| | | | |
|---|---|---|---|
| రాజన్! | = ఓ ధృతరాష్ట్ర మహారాజా! | సంవాదమ్ | = సంవాదమును (గీతను) |
| కేశవార్జునయోః | = శ్రీకృష్ణభగవానునకును, అర్జునునకును మధ్య జరిగిన | సంస్మృత్య, సంస్మృత్య | = పదేపదే స్మరించుచు |
| ఇమమ్ | = ఈ (పరమగోప్యమైన) | ముహుర్ముహుః | = మాటిమాటికిని (నిరంతరము) |
| పుణ్యమ్ | = పవిత్రమైన | హృష్యామి | = ఆనందించుచున్నాను |
| అద్భుతమ్, చ | = అద్భుతమైనదియగు | | |

ఓ రాజా! (ధృతరాష్ట్రా!) శ్రీ కృష్ణభగవానునకును, అర్జునునకును మధ్య జరిగిన గోప్యమైన ఈ సంవాదము పుణ్యప్రదమైనది. అత్యద్భుతమైన ఈ సంవాదమును అనుక్షణము పదేపదే స్మరించుచు, నేను నిరంతరము ఆనందమున ఓలలాడుచున్నాను.(76)

**తచ్చ సంస్మృత్య సంస్మృత్య రూపమత్యద్భుతం హరేః ।**
**విస్మయో మే మహాన్ రాజన్ హృష్యామి చ పునఃపునః ॥ 77 ॥**

తత్, చ, సంస్మృత్య, సంస్మృత్య, రూపమ్, అతి, అద్భుతమ్, హరేః,
విస్మయః, మే, మహాన్, రాజన్, హృష్యామి, చ, పునః, పునః ॥ 77 ॥

| | | | |
|---|---|---|---|
| రాజన్! | = ఓ రాజా! | మే | = నాకు |
| హరేః[1] | = శ్రీకృష్ణుని యొక్క | మహాన్, విస్మయః | = అంతులేని ఆశ్చర్యము కలుగుచున్నది |
| తత్, అతి, అద్భుతమ్ | = అట్టి అత్యద్భుతమైన | (అహమ్) | = నేను |
| రూపమ్, చ | = దివ్యరూపమునే | పునః, పునః | = మాటిమాటికిని |
| సంస్మృత్య, సంస్మృత్య | = పదేపదే స్మరించుట వలన | హృష్యామి | = ఆనందమున పొంగిపోవుచున్నాను. |

1. తనను స్మరించిన వారి పాపములను హరించు వాడు 'హరి'.

ఓ రాజా! అత్యంత విలక్షణము, పరమాద్భుతము, అపూర్వము ఐన ఆ శ్రీహరి రూపమును పదేపదే స్మరించుచు, నేను పొందుచున్న సంభ్రమాశ్చర్యములకు అవధియే లేదు. తత్ప్రభావమున మఱలమఱల హర్షోల్లాసములతో పులకితగాత్రుడనగుచున్నాను. (77)

**యత్ర యోగేశ్వరః కృష్ణో యత్ర పార్థో ధనుర్ధరః ।**
**తత్ర శ్రీర్విజయో భూతిః ధ్రువా నీతిర్మతిర్మమ ॥ 78 ॥**

యత్ర, యోగేశ్వరః, కృష్ణః, యత్ర, పార్థః, ధనుర్ధరః,
తత్ర, శ్రీః, విజయః, భూతిః, ధ్రువా, నీతిః, మతిః, మమ ॥ 78 ॥

| | | | |
|---|---|---|---|
| యత్ర | = ఎచ్చటనయితే | తత్ర, శ్రీః | = అచ్చట సిరి సంపదలును |
| యోగేశ్వరః, కృష్ణః | = యోగేశ్వరుడైన శ్రీకృష్ణ భగవానుడు (ఉండునో) | విజయః | = సర్వవిజయములును |
| | | భూతిః | = సకలైశ్వర్యములును |
| యత్ర | = ఎచ్చటనయితే | ధ్రువా, నీతిః | = దృఢమైన నీతియు |
| ధనుర్ధరః, పార్థః | = గాండీవధనుస్సును చేతబట్టిన అర్జునుడు (ఉండునో) | (ఇతి) | ఉండును అని |
| | | మమ, మతిః | = నా నిశ్చితాభిప్రాయము |

ఓ రాజా! యోగేశ్వరుడైన శ్రీకృష్ణభగవానుడును, గాండీవధనుర్ధారియైన అర్జునుడును ఉండుచోట సంపదలును, సర్వవిజయములును, సకలైశ్వర్యములును, సుస్థిరమైన నీతియు ఉండును - అని నా నిశ్చితాభిప్రాయము. (78)

ఓం తత్సదితి శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే మోక్షసన్న్యాసయోగోనామ అష్టాదశోఽధ్యాయః ॥ ౧౮ ॥

# గీతా హారతి

జయ భగవద్గీతే, జయ భగవద్గీతే
హరి-హియ-కమల-విహారిణి, సుందర సుపునీతే ॥ జయ ॥

కర్మ-సుమర్మ-ప్రకాశిని కామాసక్తిహరా
తత్త్వజ్ఞాన-వికాశిని విద్యాబ్రహ్మపరా ॥ జయ ॥

నిశ్చల-భక్తి-విధాయిని నిర్మల మలహారీ
శరణ-రహస్య-ప్రదాయిని సబ విధి సుఖకారీ ॥ జయ ॥

రాగ-ద్వేష-విదారిణి కారిణి మోద సదా
భవ-భయ-హారిణి తారిణి పరమానందప్రదా ॥ జయ ॥

ఆసుర భావ-వినాశిని నాశిని తమ-రజనీ
దైవీ సద్గుణదాయిని హరి-రసికా సజనీ ॥ జయ ॥

సమతా, త్యాగ సిఖావని, హరి-ముఖకీ బానీ
సకల శాస్త్రకీ స్వామిని శ్రుతియోంకీ రానీ ॥ జయ ॥

దయా-సుధా బరసావని మాతు! కృపా కీజై
హరి-పద-ప్రేమ దాన కర అపనో కర లీజై ॥ జయ ॥

# అచ్యుతాష్టకమ్

అచ్యుతం కేశవం రామనారాయణం
కృష్ణదామోదరం వాసుదేవం హరిమ్ ।
శ్రీధరం మాధవం గోపికావల్లభం
జానకీనాయకం రామచంద్రం భజే ॥ 1 ॥

అచ్యుతం కేశవం సత్యభామాధవం
మాధవం శ్రీధరం రాధికారాధితమ్ ।
ఇందిరామందిరం చేతసా సుందరం
దేవకీనందనం నందజం సందధే ॥ 2 ॥

విష్ణవే జిష్ణవే శంఖినే చక్రిణే
రుక్మిణీరాగిణే జానకీజానయే ।
వల్లవీవల్లభాయార్చితాయాత్మనే
కంసవిధ్వంసినే వంశినే తే నమః ॥ 3 ॥

కృష్ణ గోవింద! హేరామ! నారాయణ!
శ్రీపతే! వాసుదేవాజిత! శ్రీనిధే! ।
అచ్యుతానంత! హే మాధవాధోక్షజ!
ద్వారకానాయక! ద్రౌపదీరక్షక! ॥ 4 ॥

రాక్షసక్షోభితః సీతయా శోభితో
దండకారణ్యభూపుణ్యతాకారణః ।

లక్ష్మణేనాన్వితో వానరైః సేవితో
అగస్త్య సంపూజితో రాఘవః పాతుమామ్ ॥ 5 ॥

ధేనుకారిష్ట కానిష్టకృద్ద్వేషిహా
కేశిహా కంసహృద్వంశికావాదకః ।
పూతనాకోపకః సూరజాఖేలనో
బాలగోపాలకః పాతు మాం సర్వదా ॥ 6 ॥

విద్యుదుద్ద్యోతవత్ప్రస్ఫురద్వాససం
ప్రావృడంభోదవత్ప్రోల్లసద్విగ్రహమ్ ।
వన్యయా మాలయా శోభితోరఃస్థలం
లోహితాంఘ్రిద్వయం వారిజాక్షం భజే ॥ 7 ॥

కుంచితైః కుంతలైః భ్రాజమానాననం
రత్నమౌళిం లసత్కుండలంగండయోః ।
హారకేయూరకం కంకణప్రోజ్జ్వలం
కింకిణీమంజులం శ్యామలం తం భజే ॥ 8 ॥

అచ్యుతస్యాష్టకం యః పఠేదిష్టదం
ప్రేమతః ప్రత్యహంపూరుషస్సస్పృహమ్ ।
వృత్తతః సుందరం కర్తృవిశ్వంభర
స్తస్యవశ్యో హరిర్జాయతే సత్వరమ్ ॥

॥ ఇతి శ్రీమచ్ఛంకరాచార్యకృతమచ్యుతాష్టకం సంపూర్ణమ్. ॥

❖ ❖ ❖